# సింహావలోకనం

స్వాతంత్ర్య సాయుధ పోరాట (ప్రామాణిక గాథ)

మూడవ భాగం

Centre for Regional Studies
(TELUGU)

మూలం :

యశ్‌పాల్

అనువాదం :

ఆలూరి భుజంగరావు

ప్రచురణ :

హాల్ సాహిత్య సదనం
గుడివాడ కృష్ణాజిల్లా.

ప్రచురణ నెం. 3.

తెలుగులో ఈ గ్రంథ ప్రచురణకు సంబంధించిన సమస్త హక్కులు అనువాదకునివి.

CHECKED
1992

వెల రూ. 1[illegible]-00

UNIVERSITY OF HYDERABAD
Acc. No. 7479
Date 20 MAR [illegible]
LIBRARY

ప్రతులకు :

ఆలూరి [illegible],
హిందీ పండిట్ టౌన్‌హైస్కూల్,
గుడివాడ P. O. కృష్ణాజిల్లా.

వ్యవస్థాపకులు :

A. L. పరమేశ్వరి

ముద్రణ :

శ్రీ నాగేంద్ర ప్రింటింగ్ వర్క్సు, గుడివాడ.

"ఇంగ్లీషువాళ్ళు శాసకులుగా ఈ దేశంలో వున్నన్నాళ్ళూ, వాళ్ళకూ మనకూ మధ్య ఎప్పుడూ తుపాకులు పేల్తూనే వుంటాయి. ఒప్పందం, రాజీ-ఇవన్నీ అర్థంలేని మాటలు! వాళ్ళకూ మనకూ ఒకటే ఒప్పందం జరగాలి! దాని ప్రకారం వాళ్ళు మూటా ముల్లే సర్దుకుని తక్షణం ఇక్కణ్ణుండి వెళ్ళిపోవాలి!"

చంద్రశేఖర్ ఆజాద్.

# సమర్పణ

ఈ దేశ ప్రజలకు స్వయం నిర్ణయాధికారాన్ని, సభ్యమానవుల్లా బ్రతకడానికి అవసరమైన రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సమకూర్చడంకోసం - జీవితాన్ని బలిపెట్టుకోవడానికి సంసిద్ధుణ్ణయిన నాకు సహకారాన్నిచ్చి, నాలో విశ్వాసాన్నినింపి, జీవన్మరణ పోరాటంలో నాకు చేదోడు వాదోడుగా వున్న ఆనాటి మిత్రులందరికీ—

మరియు

ఆనాటి చేదు అనుభవాల్ని, అవజయాల్ని - గురించి తెల్సుకుని కూడా, దేశంకోసం తమ స్వార్థాన్ని, చివరకు ప్రాణాల్నోసహా బలిపెట్టుకోడానికి సంసిద్ధులవుతూన్న ఈనాటి మిత్రులకూ—

ఈ నా అనుభవాలను సమర్పిస్తూన్నాను.

1951 యశ్‌పాల్.

# కృతజ్ఞతలు

తెలుగు 'సింహావలోకనం' మూడు భాగాలనూ ప్రకటించే సందర్భంలో, ఈ క్రిందివారికి నిండుమనస్సుతో కృతజ్ఞతలు అర్పిస్తున్నాను.

ప్రతిఫలాపేక్షలేకండా ఈ అనువాదాన్ని ప్రచురించుకోడానికి అనుమతినిచ్చిన ప్రకాశవతిగారికి,

డబ్బు అనే మాధ్యమం ఉన్నప్పటికీ, మానవశ్రమకు గల విలువ అత్యున్నతమైంది. అందుకనే, శ్రీ నాగేంద్ర ప్రింటింగ్ వర్క్సు వర్కర్లకూ,

తమ జాబుల్ద్వారా నాకు నూతనోత్సాహాన్నిఇచ్చి, నన్ను కార్యోన్ముఖుణ్ణిచేసిన పాఠకులకూ ఇతర మిత్రులకూ,

ఈ గ్రంథం మూడు భాగాల్నూ ప్రకటించే సందర్భంలో, ఎలాంటి హామీలనూ కోరకుండా అప్పుగా, ఆర్థిక సహకారాన్ని అందించిన మిత్రులకూ, అలాగే ఆర్థిక సహకారాన్ని అందించడానికి తమ సంసిద్ధతను వ్యక్తపరచిన మిత్రులకూ,

1, 2, భాగాలను అమ్మడంలో సహకరించిన మిత్రులకూ, 3 వ భాగం అమ్మకాల్లో తమపాలు కర్తవ్యాన్ని నిర్వహించడానికి సంసిద్ధతను వ్యక్తపరచిన సహృదయులకూ,

గుడివాడ
18-3-83

ఆలూరి భుజంగరావు.

# ముందుమాట

మొదటి భాగాన్ని చదివి కొందరు మిత్రులు కొన్ని సలహాల్ని ఇవ్వడం జరిగింది. కొంత విమర్శ కూడా జరిగింది. కొందరు మిత్రుల్ని గురించి, కొన్ని సంఘటనలను గురించి - నేను రాయలేదని కొందరు విమర్శించడమూ జరిగింది. అలా వదిలిపెట్టినమాట నిజం; కారణం, ఈ గ్రంధాన్ని నేను చారిత్రక గ్రంధంగా రాయడంలేదు. నా జ్ఞాపకాల సంపుటిగా రాస్తున్నాను ఏ వ్యక్తుల్ని గురించి లేక ఏ సంఘటనల గురించి - నాకు స్పష్టంగా తెలియదో లేక స్పష్టమైన అవగాహనలేదో, అలాంటి వ్యక్తుల్ని గురించి, సంఘటనల్నిగురించి - తెలిసీతెలియని రాతలు రాయడంకంటే మౌనాన్ని వహించడమే ఉచితం అనుకున్నాను. మరి కొందరు మిత్రులు 'నాకు అనుకూలమైన విషయాల్నే వర్ణించాననీ, ప్రతికూలమైన వాటిని రాయలేదనీ విమర్శించారు!' అలాంటి విమర్శకులకు ఒకే ఒక్క సమాధానం ఈయగల్ను, 'గత కాలానికి సంబంధించిన ఆ అనుభవాలనుగురించి రాసే అధికారం అందరికీవుంది. ఆనాటి సంఘటనల తాలూకు యధార్ధతను ఎవరైనా మిత్రులు ఇంకాకూడా వెలుగులోకి తీసుకురాగలిగితే, చాలా సంతోషిస్తాను!'

మొత్తం గ్రంధలో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోగల ప్రవృత్తిని గురించీ, చర్యల్నిగురించీ, అలాగే, ఉద్యమానికి హానికలిగించే స్వభావాన్నిగురించి, సంఘటనల గురించి వివరంగారాశాను. ఆ రోజుల్లో నేనే కాదు, అందరమూ తప్పులుచేశాము. నా తప్పుల్నిగురించి, ఉద్యమానికి హానికలిగించే నా ప్రవర్తనను గురించి రాసేప్పుడు నేనేమాత్రమూ సంకోచించనూలేదు, మినహాయింపుకూ అవకాశంఇవ్వలేదు. నా తప్పుల్ని నేను విమర్శించుకున్నట్లే, ఇతర మిత్రుల తప్పుల్నికూడా స్పష్టంగా విమర్శకుపెట్టాను!

* * * *

ముందుగా చెప్పుకోవల్సింది, ఈ అనుభవాల రంగురూపుల్ని గురించి: ఎక్కువమంది పాఠకులు ఇవి నా వ్యక్తిగత అనుభవాలు అనుకుంటున్నారు. ఐతే, ఇవి పూర్తిగా నా వ్యక్తిగత అనుభవాలుగానీ, కాక ఆనాటి నా మిత్రుల వ్యక్తిగత అనుభవాలుగానీ కావు. అంటే, ఈ అనుభవాలు 'హిందుస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం'లోని మా అనుభవాలు మాత్రమే: 'హిందుస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం' పరిధిలో ఇమడని అనుభవాలు ఇంకాకూడా అనేకం మా జీవితాల్లో వుండవచ్చును. వాటన్నింటినీ ఈ మూడుభాగాల్లో పొందుపరచలేదు నేను: అంతేకాకుండా, 'హి స ప్ర స.'కు సంబంధించిన అనేక సంఘటనల్ని ఈ మూడుభాగాల్లో వర్ణించడం జరిగింది. అవి నా వ్యక్తిగత అనుభవాలు కాకపోయినప్పటికీను: దీన్నిబట్టి 'హి స.ప్ర స.' విప్లవసంఘ పరిధిలోకి వచ్చిన, నా అనుభవాల్ని, నాకు రూఢిగా తెల్సిన, ప్రామాణికమైన నా మిత్రుల అనుభవాలను మాత్రమే ఈ మూడు భాగాల్లోనూ వర్ణించాను. భవిష్యత్తులో, ఎవరైనా భారత స్వాతంత్ర్య సాయుధ పోరాటచరిత్రను, వ్రాయదలచుకుంటే- ఈ అనుభవాలు ఉపయోగపడతాయి.

ఏ సంఘటననైనా వర్ణించేప్పుడు, ఆ సంఘటన ఏ దృష్టికోణంతో జరుపబడిందోచెప్పడం అవసరం అవుతుంది. దృష్టికోణంవిలువ విస్తృతమైందే: ఈ విషయాన్ని స్పష్టంగా అర్థంచేసుకోడానికి ఒక ఉదాహరణ ఇస్తే సరిపోతుందనుకుంటాను.

భారతదేశ ప్రాచీన చరిత్రను, బ్రిటీష్ ప్రభుత్వపు నమ్మినబంటులైన లేఖకులూ రాశారు. తటస్థులుగా వుండి, సత్యశోధన మాత్రమే ఆదర్శంగాగల లేఖకులూ రాశారు. మరి భారతదేశంపట్లా, హిందూమతం పట్లా గుడ్డి అభిమానంగల లేఖకులూ రాశారు. ఈ మూడురకాల రాతల్నీ దగ్గరపెట్టుకు పరిశీలిస్తే, దృష్టికోణానికివుండే ప్రాధాన్యత స్పష్టం అవుతుంది: అలాగే, అహింసాత్మక క్రాంతిని అభిమానించే లేఖకుల దృష్టికి

'హి.స.ప్ర.స.' విప్లవం, దారితప్పిన యువకుల హింసాత్మక చర్యలు గానే కనబడతాయి। హాలిన్స్ తన పుస్తకం 'No Ten Commandments'లో చంద్రశేఖర్ ఆజాద్ పోరాటాన్నిగురించి చెప్తూ 'దుస్సాహసికుడైన హింసాత్మకుడు పోలీసుల్తో తలపడి మరణించాడు।' అన్నాడు. ఇంత అయినప్పటికీ, నేనీ మూడుభాగాల్లోనూ జరిగిన సంఘటనలను యధాతధంగా వర్ణించాను. మా లోపాలనూ, అపరిపక్వతలనూ-ఉన్నవి వున్నట్టుగా వర్ణించాను.

'సింహావలోకనం' 1, 2 భాగాలను చదివి 'హి. స. ప్ర. స.' మిత్రులు (మిగిలివున్నవారు) సంతృప్తిని ప్రకటించారు. నేనూ సంతృప్తి పడ్డాను. ఐతే, అందర్నీ సంతృప్తి పరుస్తానన్న నమ్మకం నాకులేదు. అది సంభవమూకాదు. బుద్ధుడుకూడా 'సర్వజన హితాయ' 'సర్వజన సుఖాయ' అనకుండా 'బహుజన హితాయ' 'బహుజన సుఖాయ' అన్నాడు ఔను మరి, కొందరిసుఖాలూ, స్వార్థమూ బహుజనులహితానికి ఆటంకంగా వుంటాయి. అలాంటి బహుజనపీడకుల్ని సంతృప్తిపరచడం ఎవడివశం? ఆనాటి మిత్రుల వ్యక్తిత్వాలనూ, సంఘటనలనూ వికృతంచేసి రాస్తే కొందరికి స్వార్థసిద్ధి కలుగుతుంది. అలాంటివాళ్ళను నేను సంతృప్తి పరచలేకపోయాను. సాధ్యమైనవరకూ ఈ గ్రంథంలో వర్ణింపబడిన సంఘటనలన్నింటికీ ప్రమాణాల్ని సిద్ధపరచుకున్నాను. కొన్నింటికి లిఖిత పూర్వకమైన ప్రమాణాలు లభించకపోవడమూ జరిగింది. కొన్నింటికి కోర్టు రికార్డులు దొరకలేదు. అయినప్పటికీ, యదార్థతకు తనదంటూ ఓ ప్రత్యేకమైన బలం వుంటుంది. నేను యధార్థతను సరిగా వర్ణించలేదనీ ఒకరిద్దరు అన్నారు. నాకంటే వారికే మరికూడా విషయాలు తెలుసు నన్నారు. అలాంటి వారు తమకుతెల్సిన యధార్థాన్ని పాఠకుల ముందు వుంచడంలో తప్పులేదు. సత్యశోధనే ఆదర్శంగాగల పాఠకులు సత్యాసత్యాల్ని స్వయంగా నిర్ణయించుకోగలరు.

నా ఈ అనుభవాల్ని ప్రకటించమని తొందరపెడుతూన్న కొందరు మిత్రులకూ, ముఖ్యం ప్రకాశవతికి-ఎందుకంటే ఆమె ఈ అనుభవాల్ని క్రమపద్ధతిలో రాసి, పుస్తకరూపంలో ప్రకటించడానికి చాలా కృషి చేసింది_అభినందలు తెల్పుతూన్నాను.

8.2-1955 యశ్‌పాల్.

# విషయక్రమం


1. బోస్ట్రల్ జైలుపై దాడికి విప్లవకారుల యత్నం.
2. బహావల్పూర్ రోడ్డులో బాంబు ప్రేలుడు.
3. [illegible]ల్గాం న్యాయస్థానంలో ప్రభుత్వసాక్షిపై కాల్పులు.
4. ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీ.
5. యశ్‌పాల్‌కు మృత్యుదండన.
6. అగ్నివలయం.
7. యశ్‌పాల్ మృత్యుదండన రద్దు.
8. విప్లవ సంఘం రద్దయింది.
9. పార్టీని కాపాడడానికి ఆజాద్ ప్రయత్నం.
10. మరోమాటు వైర్‌లెస్‌కోసం ప్రయత్నం.
11. కాన్పూర్‌లో మసీయాక్షన్.
12. అమరవీరుడు శాలిగ్రాంశుక్ల!
13. లెమింగ్‌టన్ రోడ్డులో కాల్పులు.
14. వీరభద్రతివారీ కల్పించిన తిరుగుడు.
15. ఇంద్రపాల్.
16. చంద్రశేఖర్ ఆజాద్.
17. భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - ఉరి!
18. తిరిగి ఉద్యమ నిర్మాణానికి ప్రయత్నం.
19. జైలు అనుభవాలు.
20. జైల్లో పెళ్ళి.
21. జైల్లో అధ్యయనం.
22. విడుదలకు ఆటంకాలు.

# 1. బోర్స్టల్ జైలుపై దాడికి విప్లవకారుల యత్నం

మే 31వ తారీకు అనుకుంటాను. భగవతీచరణ్ మృత్యువును గురించి ప్రకాశవతికి ఓ జాబు రాద్దామనుకున్నాను. జాబు రాయడానికి ముందే ఎవరి అడ్రసుకు వ్రాయడమా? అని ఆలోచించాను. ప్రకాశవతి కృష్ణజీ దగ్గర ఉంటున్నది. అయితే ఆయన అడ్రసుకు జాబురాయడం యిష్టంలేదు. ప్రతిదానికి ప్రశ్నలు అడిగే అతడి ప్రవృత్తి నాకు తెలుసు. ఆయన, తను స్వయంగా జాబును చదవకుండా ప్రకాశవతికి యివ్వదేమో అనుకున్నాను. అందువల్ల అతని బావమరది ధ్రువజీ అడ్రసుకు జాబు వ్రాయడానికి నిశ్చయించుకున్నాను. ముందే కవరుమీద అడ్రసువ్రాశాను.

సగపట జాబు వ్రాశాను. ఆ జాబులోని భావం ఇలా ఉంటుంది. "అనుకోకుండా బాంబు ప్రేలి భగవతీచరణ్ చనిపోయాడు. నా తరువాత నీ బాధ్యతను ఎవరిమీద ఉంచుదామనుకున్నానో, అతడు నాకంటే ముందే వెళ్ళిపోయాడు. భగవతీచరణ్ లేకపోవడంవల్ల విప్లవ సంఘానికి ఒక చెయ్యి కొట్టేసినట్లయింది. ఇక భాభీ విషయం నువ్వు ఆలోచించుకోవచ్చు. ఆమె తన సర్వస్వాన్ని విప్లవ సంఘానికి అర్పించింది. ఆమెవంక నేను చూడలేకపోతున్నాను! ఆమెతో ఒక్క మాటకూడా మాట్లాడలేకుండా ఉన్నాను. నా తరువాత భాభీపట్ల కృతజ్ఞత చూపవలసిన బాధ్యత నీకు ఎంతైనా ఉంది: జీవితంలో దుర్గాభాభీకి అన్నివిధాలా సహకరించి సహాయభూతురాలివిగా ఉండటం నీ ప్రథమకర్తవ్యం...." నేను జాబును పూర్తి చెయ్యలేదు. ఇంతలో జైలువైపు ఒకమాటు వెళ్ళిరమ్మని ఆజాద్ కేక వేశాడు.

సగంరాసిన జాబుని, అడ్రసువ్రాసిన కవరును జేబులో పెట్టుకుని బజారుకు వెళ్ళడం మంచిదికాదు. బజారులో ఏ క్షణానైనా పట్టుబడవచ్చు! లేక కాల్పులకు గురికావచ్చు! నాజేబులోఉన్న కవరుమీద ఎవరి అడ్రసువుంటే వాళ్ళవని బాగావడతారు పోలీసులు! అడ్రసు వ్రాసిన కవరునూ, సగం వ్రాసిన జాబునూ చింపేశాను. ఆ ముక్కల్ని ఫైల్ బిహారీకిచ్చానో లేక మదన్‌గోపాల్‌కిచ్చానో జ్ఞాపకం లేదు. మొత్తానికి యిద్దరిలో ఎవరికో ఒకరికిచ్చి తగలబెట్టమని చెప్పాను.

నేనిచ్చిన ఆ కాగితం ముక్కల్ని వాళ్ళు తగలబెట్టలేదు. మధ్య హాలులోనో, వంటగదిలోనో ఒకమూల అశ్రద్ధగా పారేశారు. మేము, అనుకోకుండా బాంబులు ప్రేలడంవల్ల, హడావుడిగా బంగళాను ఖాళీచేసి వెళ్ళిపోయాము. పోలీసులు మా రహస్యాలను తెల్సుకోవడానికి బంగళాలోని అంగుళాంగుల ప్రదేశాన్నీ పరీక్షించారు. చింపివేసిన కాగితపు ముక్కలు పోలీసులకు దొరికాయి. వెంటనే ఢిల్లీలోని ధ్రువజీని అరెస్టు చేశారు. మా రహస్యాలు చెప్పమని ఆయనను పోలీసులు చాలా బాధించారు. నా యీ పొరపాటును గురించి నేను ఈనాటికీ బాధపడుతున్నాను. ధ్రువజీ శారీరకంగా కొద్దిమనిషే అయినా, గొప్ప హృదయంగల వ్యక్తి తను జైలునుంచి విడుదలయ్యాకకూడా, నేను వరారీలోఉండగా, నాకెన్నోమార్లు సహాయంచేశారు. నేనంటే ధ్రువజీకి ఎంతో విశ్వాసం. కనుకనే మా మిత్రత్వం ఈనాటికీ చెక్కుచెదరకుండా ఉంది!

మేము ఎక్కడున్నామో చెప్పమని పోలీసులు ధ్రువజీని చాలా బాధించారు. అయితే, ఆయనకే తెలియదుగదా, మేము ఎక్కడున్నామో? ఎలా చెప్పగలడు? పోలీసులు 'కమల'ను గురించి ప్రశ్నలు వేశారు. ధ్రువజీ యింటినీ, కృష్ణజీ యింటినీ పోలీసులు చుట్టుముట్టి, సోదాచేశారు. అయితే, ప్రకాశవతి పట్టుబడలేదు. పోలీసులు రావడానికి కొద్దిక్షణాల

ముందే, సి.ఐ.డి. యింటిని పోల్చుకోవడానికి ప్రయత్నిస్తుండగా, ఆమె ఎవరికీ చెప్పకుండా ఖయాలీరామ్ గుప్త యింటికి పారిపోయింది.

*　　*　　*

రావీనది ఒడ్డున పల్లెకారి దగ్గరఉంచిన సైకిళ్ళను తెచ్చుకోవాలి. సుఖదేవరాజ్ కాలికి వైద్యం చేయించాలి! అయితే జూన్ 1వ తారీకున ఎలాంటి పరిస్థితిలోనూ 'యాక్షన్' జరగాలి. మేము దుఃఖాన్ని మా హృదయాల్లోనే అణచుకుని తగు ప్రయత్నాల్లో మునిగిపోయాము.

నేనూ, ఆజాద్ - మాటిమాటికీ సెంట్రల్ జైలువైపూ, బోర్స్టల్ జైలువైపూ వెళ్ళవస్తూండే వాళ్ళం. ఆజాద్ తడవతడవకూ అడిగేవాడు. "సోహన్, ఎక్కడ వీలుగా ఉంటుందంటావ్? బోర్స్టల్ దగ్గరా? సెంట్రల్ దగ్గరా?"

నేను ఒకటే సమాధానం చెప్పేవాడిని. "నిర్ణయం జరిగిందికదా? బోర్స్టల్ జైలుదగ్గరే!" అనేవాడ్ని.

జూన్ 1వ తారీకు ఉదయాన్నే ఆజాద్ ఇలా అన్నాడు. "ఇవ్వాళ సాయంత్రం 5 గంటలకు యాక్షన్ జరగాలి. బాబూభాయీ [భగవతీ చరణ్], సుఖదేవరాజ్ - వీరిద్దరిబదులు ఎవరిని తీసుకుందాం? ఛైల్‌బిహారీ, మదన్‌గోపాల్ - వీళ్ళిద్దరిలో ఎవరో ఒకర్ని ఎన్నుకో."

ఛైల్‌బిహారీకీ, మదన్‌గోపాల్‌కూ ఓ గొప్ప 'యాక్షన్'కు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుసుగానీ, ఎప్పుడు, ఎక్కడ, ఏ రకంగా జరుగుతుందో-వాళ్ళకు తెలియదు. పైగా ఎవరెవరు యాక్షన్‌లో పాల్గొంటారో వాళ్ళకు తెలియదు. ఆజాద్ వీళ్ళిద్దరిలో ఎవరో ఒకర్ని ఎన్నుకునే బాధ్యత నాకే యిచ్చాడు. "వీరిద్దరిలో ఎవరు తగిపోతారనుకుంటే, వారితో నీవు విడిగా మాట్లాడు. నిర్ణయించిన మిత్రుణ్ణి సైకిలుమీద తీసుకువెళ్ళి ప్రదేశంచూపించు" అని చెప్పాడు ఆజాద్.

పై మాటలు ఆజాద్ నాతో చెబుతుండగా భాభీ విన్నది. ఆమె "యాక్షన్‌లో వారి (భగవతీచరణ్) స్థానంలో ఉండతగిన అధికారం నాకు ఉన్నది. నాకు అవకాశం యివ్వండి!" అని అడిగింది.

ఆజాద్ నావంక చూశాడు. మేమిద్దరం ఆమెను అనూనయించాము. "ఈమాట మీరు వద్దులెండి!" అని చెప్పాము.

"ఎందువల్ల?" భాభీ పట్టుపట్టింది.

ఆజాద్ కన్నీటిని తుడుచుకున్నాడు. "మీరు పాల్గొనడం, ఆలోచించవలసిన విషయం! పసివాడి జీవితం ఒకటుంది కదా!" అన్నాడు.

"పసివాడు ఇంక మీపిల్లవాడే! వాడి బాధ్యత మీదే!" అన్నదిభాభీ.

"భాభీ! ఈమాటు మామాటవిను!" అన్నాడు ఆజాద్.

భాభీ, మేమూ మాట్లాడుకోవడం విని సుశీలాదీదీ వచ్చింది. ఆమె కూడా దాడిలో పాల్గొంటానని మొండికేసింది. అయితే ఆమెనూ తిరస్కరించాము.

నేను, వైల్‌బిహారీని ఎన్నుకున్నాను. అతడిని ఒక ప్రక్కకు తీసుకువెళ్ళి మాట్లాడాను. "ఇవ్వాళ మనము జైలుమీద దాడిచేసి భగత్సింగునూ, దత్తునూ విడిపించడానికి వెళుతున్నాము. అక్కడ పోరాటంలో 99 పాళ్ళు మనంచనిపోవడమే జరుగుతుంది. కాల్పులు ప్రారంభమయ్యాక వెనక్కు పారిపోవడానికి అవకాశం ఉండదు. అలా పారిపోయే మిత్రుణ్ని నేనుగానీ, ఆజాద్‌గానీ కాల్చి చంపేయడం ఖాయం. కనుక, నువ్వు దాడిలో పాల్గొనగలిగితే మాతోరా! సాహసంలేదా, ముందుగానే చెప్పేసెయ్!" అన్నాను.

వైల్‌బిహారీ సమాధానం యివ్వటానికి ఓ అరగంట వ్యవధి అడిగాడు. అరగంట తరువాత వచ్చి "నావల్లకాదు." అని స్పష్టంగా చెప్పాడు.

ఇకవచ్చుడు మదనగోపాల్‌ని పిలచి విషయం చెప్పాను. పరిస్థితిని వివరించాను. "నువ్వు పాల్గొనగలవా? లేదా? చెప్పు!" అని అడిగాను.

అతడు కొన్ని క్షణాలు అలాగే ఆలోచిస్తూ నిలబడ్డాడు. తరువాత "పాల్గొంటాను" అన్నాడు.

"అయితే తయారుగా ఉండు" అని చెప్పానతడికి.

కొన్ని క్షణాల తరువాత ఆజాద్ నన్ను పిల్చి, మదన్‌గోపాల్ వైపు సంజ్ఞచేసి చూపించాడు. అతడో గదిలో కూర్చుని గీతాపఠనం కావిస్తున్నాడు. ఆజాద్ మదనగోపాల్ పట్ల తన విరక్తిని వ్యక్తపరుస్తూ "గీతా పఠనం ద్వారా తెచ్చుకున్న ఈ సాహసం, సమయానికి దగా చేస్తుంది" అన్నాడు.

గీతాపఠనంచేసే మదన్‌గోపాల్ అరెస్టు కాగానే ప్రభుత్వసాక్షి అయ్యాడు. పోలీసుల్ని సంతోషపెట్టడానికి తలాతోకాలేని విషయాలు ఎన్నో చెప్పాడు. మనిషి ప్రాణంమీది తీపివల్ల ప్రభుత్వసాక్షి అవుతాడు. మనలోని ప్రాణభీతిని పోలీసులు పసికట్టారా, ఇంక మనచేత ఏమైనా చెప్పిస్తారు! మదనగోపాల్ తన శౌర్యాన్ని చాటుకోవడానికి, కోతలు కోశాడు. ఛైల్ బిహారీని ఆజాద్ కాలుస్తానన్నాడని కూడా చెప్పాడు. అది అబద్ధం. ఛైల్ బిహారీ తాను పాల్గొనలేనని స్పష్టంగా చెప్పాడు. అలా చెప్పిన మిత్రుణ్ని కాల్చాలని మేము అనుకోము! అయితే, మదనగోపాల్ ప్రభుత్వసాక్షి అయ్యాడని తెలిశాక, అతణ్ని కాల్చాలని ఆజాద్‌తోసహా మేము అందరం అనుకున్నాం!

మదనగోపాల్‌కు పిస్తోలు కాల్చడం రాదు. ఆజాద్ ఓఖాళీ రివాల్వర్ అతనికి ఇచ్చి గురిపెట్టడం ఎలాగో కాల్చడం ఎలాగో చెప్పాడు. గుండ్లను రివాల్వరులో పెట్టుకునే విధానాన్ని చూపాడు. ఆజాద్ అందరికీ డ్యూటీలను వప్పగించాడు. పోరాటంలో ఎవరు ఏంచాయాలో-చెప్పాడు.

అందరికీ ఆయుధాలనిచ్చాక నాజేబులోనూ తన జేబులోనూఉన్న డబ్బును సుశీలాదీదీకి ఇచ్చాడు. ఒక్క క్షణం ఆలోచించి ఆమె దగ్గరనుండి కొంత డబ్బును తిరిగి తీసుకుని తలా పదిహేనురూపాయల చొప్పునా పంచాడు. మాలో ఎవరైనా గాయపడి, ప్రాణాలతో బైటపడితే, తప్పించుకోడానికి ఆ మాత్రమైనా డబ్బుండాలికదా?

బోర్స్టల్ జైలుముందు వ్యాను తిరగడానికి అవసరమైన మెల్లా లేదు. అందువల్ల వ్యానును పది పదిహేను అడుగులదూరంలో రోడ్డుమీద ఉంచి ఖైదీలను వ్యానుదాకా నడిపించుకొనివెళ్ళి, ఎక్కిస్తారు. ఖైదీలను వ్యాను దగ్గరకు తీసుకువెళ్ళేటప్పుడే మేము దాడిజరపాలని భగత్‌సింగ్ ఉద్దేశ్యం। ఆజాద్ మా అందరికీ డ్యూటీలను వేశాడు; జగదీశ్, బచ్చన్ ఇద్దరూ మధ్యాహ్నం ఒకటి ఒకటిన్నరాదాయల జైలు దగ్గరకు వెళ్ళారు; భగత్‌సింగ్‌నూ, దత్తునూ పోలీసువ్యాను బోర్స్టల్ జైలుకు తీసుకు వెళ్ళిందో లేదో చూసిరావటానికి। వాళ్ళిద్దరూ రెండున్నర గంటలాదాయల తిరిగొచ్చారు. 'రెండుంబావుకు పోలీసు వ్యాను భగత్‌సింగ్‌నూ, దత్తునూ బోర్స్టల్ జైలుకు తీసుకువెళ్ళింది' అని చెప్పారు. వాళ్ళను తిరిగి 5 గంటలకు సెంట్రల్ జైలుకు తెస్తారు. నాలుగు గంటలకు మేమందరము కారులో ఎవరి స్థానాల్లో వాళ్ళం కూర్చున్నాము. ఇంతలో 'ఆగండి।' అన్న సుశీలాదీదీ కేకవినిపించింది. ఆమె లోపలనుండి బైటకు వచ్చింది. ఆమె చెయ్యి కొంచెంగాతెగి రక్తం కారుతున్నది ఆ రక్తంలో బొటన వ్రేలును అద్ది మా అందరికీ వీరతిలకం దిద్దింది. ఛాబీ శిలాప్రతిమలా వరండాలో నిలబడి ఉంది.

మేము బోర్స్టల్ జైలునూ, సెంట్రల్ జైలునూదాటి ముందుకు, కాలువవైపుకు వెళ్ళిపోయాము. బచ్చన్ మాతోపాటు కారులో ఉన్నాడు. జగదీశ్, భగత్‌సింగ్‌నూ, దత్తునూ తిరిగి తీసుకురావడానికి పోలీసువ్యాను

సెంట్రలు జైలునుండి బోర్స్టలు జైలువైపు వెళ్ళగానే, సంజ్ఞద్వారా మాకు ఆ విషయాన్ని తెలియపరుస్తాడు! మా కారు బోర్స్టల్ జైలుకు అభిముఖంగా పెట్టి ఉన్నది. పోలీసు వ్యానుకోసరం నిరీక్షిస్తున్నాము. ఎవరికీ అనుమానం కలగకుండా ఉండడానికి డ్రైవర్ చెడిపోయిన యింజన్‌ను బాగుచేస్తున్నట్టుగా నటిస్తున్నాడు. జగదీశ్ సంజ్ఞ చేశాడు. డ్రైవర్ తీవ్రవేగంతో కారునడుపుకుని బోర్స్టల్‌జైలు ముందుకు తీసుకు వెళ్ళాడు. పోలీస్‌వ్యాను ఇంకా బోర్స్టల్‌జైలు గేటుదగ్గరకు రాలేదు. మాకారు పెద్దబజారునుంచి బోర్స్టల్‌జైలు గేటువైపుకుఉండే చిన్నగొందివైపు తిరిగి నిలబడి ఉంది. పోలీస్‌వ్యాను మెల్లగా జైలు గేటుదగ్గరకు వచ్చింది. కొద్దిసేపు జైలుగేటుకు అభిముఖంగా నిలబడ్డది. కాని జైలుగేటు తెరువబడలేదు. పోలీస్‌వ్యాను ఒక్కక్షణం అలా నిలబడి గేటువైపుకు తిరగడానికి వెనక్కు వచ్చింది. వ్యాను ఇలా ఖైదీలు రాకముందే గేటువైపుకు తిరుగుతున్నదంటే అర్థమేమిటి? ఖైదీలను కారువరకు నడిపించకుండా, ఒక పంజరంలోనుంచి ఇంకొక పంజరంలోకి పక్షుల్ని మార్చినట్టు, జైలు గేటునుండి పోలీస్‌వ్యాన్‌లోకి ఖైదీలను మారుస్తారన్నమాట! పోలీసువ్యాను, వెనక్కు తిరిగివెళ్ళి గేటును ఆనుకున్నది. వారికసలుపది అడుగులు నడిచే అవకాశమే యివ్వనప్పుడు తప్పించుకుని మాలోకి ఎలా రాగలుగుతారు? మా కారు గేటువైపుకు వెళ్ళే గొందికి అభిముఖంగా తిరిగి ఉన్నది. ఇంజను ఆడుతున్నది. - ఆజాద్ జైలుగేటువైపు చూస్తూ “సోహన్! ఇప్పుడేంచేద్దాం?” అన్నాడు.

“వెళ్ళి పడదాం!”

“ఎలా?”

“ఎలాగైనాకానీ!”

ఆజాద్ హూంకరించాడు.

భగత్‌సింగ్, దత్తూ జైలు లోపలనుండి గేటువైపుకువస్తూ కనిపించారు. నేను వెనుక సీటులో ఎడమవైపున కూర్చున్నాను. కుడివైపున బచ్చన్ మధ్యలో మదనగోపాల్!

ఆజాద్ మెల్లగా "సిగ్నల్" అన్నాడు.

బచ్చన్ మెల్లగా ఫ్లూటు వాయించాడు. బచ్చన్ ఫ్లూటు వాయించగానే, భగత్‌సింగ్, దత్తూ మమ్మలనుచూసి, సిద్ధపడతారు. తరువాత భగత్‌సింగ్ మాకు సంజ్ఞచేస్తాడు. అప్పుడు మేము దాడికి సిద్ధమవుతాము. నేను మొదటగా జైలుగేటుకు ఒక ప్రక్కన కూర్చునిఉండే, ఆరుగురు వశస్త్రులైన పోలీసులమీద బాంబు నొకదాన్నివేసి, పిస్టల్‌కాల్చి, వారు ముందుకు అడుగు వెయ్యకుండా చూస్తాను. బచ్చన్ పోలీసు వ్యానుమీద బాంబువేసి, దానిలోని పోలీసుల్ని అదుపులో పెట్టుకుంటాడు. మావైపు పరుగెత్తుకువస్తున్న భగత్‌సింగ్‌కూ, దత్తుకూ చెరొక పిస్తోలు అందిస్తాడు మదనగోపాల్! ఆజాద్ కాళ్ళదగ్గర మౌజర్ పిస్తోలు ఉంది. దాన్ని రైఫిల్‌లా భుజానికి టాకించుకుని కాల్చవచ్చును. మావైపు ఎవరైనా పోలీసులువస్తే వాళ్ళను యమపురికి పంపిస్తాడు ఆజాద్!

భగత్‌సింగ్, దత్తూ బైటకు వచ్చారు. భగత్‌సింగ్ తలగీరుకుంటున్నట్టు సంజ్ఞ చేయులేదు.

ఆజాద్ "ఏం చేద్దాం?" అన్నాడు.

''వెళ్ళిపడదాం'' నేను భగత్‌సింగ్ వంక చూస్తూ ఆజాద్‌కు సమాధానం యిచ్చాను.

డ్రైవరు యింజను స్టార్ట్ చేశాడు. కాని ఆజాద్ డ్రైవరుచేతిమీద తన చేతిని వేసి "ఆగు" అన్నాడు.

భగత్‌సింగ్ మావైపు రాకుండా నేరూగా పోలీసువ్యానులోకి వెళ్ళిపోయాడు.

ఆజాద్ మెల్లగా "వ్యానును రానీ!" అన్నాడు.

ఆజాద్ ఉద్దేశ్యం, ఎటూ వచ్చాము. ఆ విధంగా కాకపోతే, మరో విధంగా దాడి చేద్దామని! అప్పటికి మాకారుమీదఎటూ అనుమానం కలిగి ఉండాలి. తప్పించుకు వెళ్ళిపోదామన్న ఊహ మాకులేదు. భగత్ సింగ్‌నూ, దత్తునూ కూర్చోబెట్టుకుని పోలీసువ్యాను మా ప్రక్కనుంచి వెళ్ళింది. భగత్‌సింగ్ మమ్మల్ని చూశాడు. మేము అతణ్ని చూశాం. ఎలాంటి సంజ్ఞగానీ, సంకేతంగానీ చేయలేదు.

ఆజాద్, కారును యింటికి తీసుకెళ్ళమని డ్రైవరుకు ఆజ్ఞ యిచ్చాడు. కారు తీవ్రవేగంతో యింటిముఖం పట్టింది. రెండు మూడు గొందులు తిరిగి మమ్మల్ని ఎవరూ వెంబడించడంలేదని తెలుసుకున్నాం. ఓ నిర్మానుష్యమైన ప్రదేశంలో కారు నెంబరును మార్చేశాము!

కారు శబ్దంవిని భాబీ, సుశీలాదీదీ వరండాలోకి వచ్చారు. మిగిలిన వాళ్ళపరిస్థితి నేను చెప్పలేను. నేను మాత్రం వాళ్ళనుచూచి తలవంచుకున్నాను! వీర తిలకం దిద్దించుకుని వెళ్ళాం మరి!

ఆజాద్ ఇలా అన్నాడు. "ఏంచేసేట్టు చెప్పు! నువ్వేమో వెళ్ళిపడదాం అంటున్నావ్.... కానీ పరిస్థితిని ఆలోచించావా? ఇవ్వాళ కాకపోతే రేపు దాడి జరుపుతాము".

"నువ్వు తెలివైన పని చేశావ్. నేను ఆవేశంలోపడి కొట్టుకుపోతున్నాను. బాధ్యత నీదికదా!" అన్నాను నేను.

* * *

# 2. బహావల్‌పూర్ రోడ్డులో బాంబు ప్రేలుడు

ఆ రాత్రి నేనూ ఆజాద్ చాలా సేపు మాట్లాడుతూ కూర్చున్నాము. ఆజాద్ ఇలా అన్నాడు. "భగత్‌సింగ్‌నూ, దత్తునూ తప్పకుండా విడి పించాలి. అయితే, ఇలా కాదు. చిటగాంగ్ శస్త్రాగారం మీద దాడి జరిపినట్టు పెద్దఎత్తున జరపాలి! పాతిక ముప్ఫైమంది మిత్రులు బాంబులు తీసుకుని దాడిలో పాల్గొనాలి."

నేను రెండు నెలలనుంచీ అదే చెపుతున్నాను!.

నా మనస్సు శరీరం కూడా శిథిలమయ్యాయి. జ్వరం కాసినవాడిలా అయ్యాను. నేనూ, ఆజాద్ వరండాలో పడుకుని ఉన్నాము. ఆజాద్ అర్ధరాత్రివరకూ మాట్లాడుతూనే ఉన్నాడు. లోపల పడుకుంటేనైనా నిద్ర పడుతుందేమోనని లోపలకు వెళ్ళాను.

డ్రాయింగ్ రూమును ఆనుకుని పెద్దగది ఒకటుంది. ఆ గదిలో కుడి ఎడమవైపులగల గోడలకు ఆనించి ఇనపవి స్ప్రింగ్ మంచాలు వాల్చి ఉన్నాయి. ఒక మంచం మీద భాభీ పడుకుని ఉంది. పైన పంఖా తిరుగుతూంది. నేను రెండవ మంచంమీద ఆపర్న పడుకున్నాను. వెంటనే నిద్ర పట్టింది.

అలికిడికి మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూచాను. భాభీ నిద్రలేచి బైటకువెళుతూన్నది. ఆమె లేవడంవల్ల స్ప్రింగ్ మంచం 'కిర్రు' మన్నది. సూర్యోదయం కావస్తున్నది. నేను మంచంమీదనుంచి లేచి పంఖాను ఆపుజేసి, బయటకు వెళ్ళాను. డ్రాయింగ్ రూముదాటి వరండాలోకి వచ్చానోలేదో బంగళాలో భయంకరమైన శబ్దం అయింది.

బంగళా అంతా కదిలిపోయింది. అజాద్ కేక వేశాడు. 'బాంబు ప్రేలిందా?'

'ఆ' అని నేను నిర్విణ్ణుణ్నై నిలుచుండి పోయాను.

'వెంటనే బంగళా ఖాళీ చేసేయండి!' అజాద్ ఆజ్ఞ యిచ్చాడు. మేము త్వరత్వరగా ఆయుధాలను బ్యాగ్‌ల్లోకి సర్దుకున్నాము. ఇంతలో రెండవ బాంబు ప్రేలింది. రెండు క్షణాల క్రితం, నేనూ ఖాన్ పడుకుని ఉన్న గదిలోనే, బాంబులు ప్రేలినయ్! ఆగది అరమరలో బాంబులు వున్నాయి. నిన్నటిరోజున దాడిలో ఉపయోగించడానికి తీసుకువెళ్ళిన బాంబుల్ని, తిరిగితెచ్చి అరమరలో పెట్టాము. అవి ప్రేలినయ్యి. ఇప్పుడు ప్రేలిన ఈరెండు బాంబులు, నిన్న నాయంత్రం నాచేతిలోనూ, బచ్చన్ చేతిలోనూ ఉన్నాయి. అవి అప్పుడే ప్రేలితే, అజాద్‌తోసహా అందరం ఆహుతి అయిపోయేవాళ్ళం!

రెండు మూడు నిముషాల్లో ఆయుధాలను, అవుసరమైన కాగితాలనూ సర్దేసుకున్నాం. బంగళా దగ్గర కారులేదు. దాన్ని నిన్నరాత్రే పంపించివేశాము. మదన్‌గోపాల్‌కూ, ఛైల్‌బిహారీకి ఒక్కొక్క రివాల్వర్ యిచ్చి, యూనివర్సిటీ గ్రౌండ్సులో మాకోసం ఎదురు చూడండి అని చెప్పి పంపించాము. అజాద్ ఆయుధాలతోనిండిన బ్యాగ్‌ను చేతపుచ్చుకున్నాడు. నేనూ, బచ్చన్, దుర్గాభాభీనీ, సుశీలాదీదీని మా సైకిళ్ళవెనుక కూర్చోబెట్టుకున్నాము. నిర్మానుష్యమైన బజార్లల్లో ఒక రౌండుకొట్టి, మమ్మల్ని ఎవ్వరూ వెంబడించడంలేదని నిర్ధారించుకుని, ఇంద్రపాల్ గదికి వెళ్ళాము.

బంగళాలో బాంబు ప్రేలడం, మేము తప్పించుకు రావడం-తెల్సుకుని ఇంద్రపాల్ విచారగ్రస్తుడయ్యాడు. "అక్కడ నా సామానులు చాలా ఉన్నాయి. వాటిమీద పేర్లూ ఉన్నాయి. అవి పోలీసుల చేతుల్లో పడితే....?" అన్నాడు ఇంద్రపాల్.

ఇంద్రపాల్ అనుమానం సబబైందే! ఈమధ్యనే అతడికి వివాహమైంది. పెళ్ళిలో అత్తవారిచ్చిన సామానులను మేము తీసుకువెళ్ళ వాడుకుంటున్నాము. కొన్నిటిమీద అతడి పేరూ ఉంది.

నేను అతడికి ధైర్యాన్ని యిచ్చాను. 'ఇప్పుడే పోలీసులు వచ్చి వుండరు. నేను వెళ్ళి చూసి వస్తాను. అవకాశముంటే సామానులన్నింటినీ తీసుకు వస్తాను!' అని నేను బయల్దేరాను.

ఆజాద్ హెచ్చరించాడు. 'జాగ్రత్త! .... మరీ కుర్రవాడిలా వ్యవహరించకు!' అన్నాడు.

నేను బహావల్‌పూర్ రోడ్డుకువెళ్ళి బంగళాముందు ఒకమాటు అటూ యిటూ తిరిగి చూశాను. పరిసరమూ బంగళా కూడా నిర్మానుష్యంగా ఉంది. ఒక పరదాను తీసుకుని దానిలో పట్టినంత సామానులను మూటగట్టాను. సైకిల్‌మీద ఇంద్రపాల్ గదికి తెచ్చిపడేశాను. 'ఇంకా అక్కడ చాలా సామాను ఉంది' అని చెప్పాను. భాభీనీ, సుశీలాదీదీనీ-బచ్చన్ వెంట సురక్షిత ప్రదేశానికి పంపించాక, ఆజాద్, నేనూ, ఇంద్రపాల్ - ముగ్గురం సైకిళ్ళు వేసుకుని మళ్ళీ బంగళా దగ్గరకు వెళ్ళాం. జాగ్రత్తగా ఓమాటు లోపలకు తొంగిచూశాం.

ఆజాద్ మళ్ళీ ఓమాటు హెచ్చరించాడు. 'మనం మరీ కుర్రతనంగా వ్యవహరిస్తున్నాం. ప్రక్కన ఇంజనీయర్ వున్నారు. బాధ్యతగల ప్రభుత్వోద్యోగి. అతడు పోలీసులకు ఫోనుచేసి ఉంటేనో?' అన్నాడు. నేను ప్రక్కవాటాలోని ఇంజనీయరుగారి తలుపు కొట్టాను. ఆయన బైటకు వచ్చాడు. నేను ఇంగ్లీషులో మాట్లాడాను. 'బంగళాలో బాంబు ప్రేలింది.' అన్నాను.

ఇంజనీయరు గాభరాపడుతూ 'అవును' అన్నాడు.

'మీరు పోలీసులకు ఫోను చేశారా?'

'ఇంకా చెయ్యలేదు. చెయ్యాలి!'

'ఇప్పుడే చెయ్యకండి.'

'ఏం?'

'మేము విప్లవకారులం. అనుకోకుండా బాంబు పేలింది. మీరు ఒక అరగంట ఆగి పోలీసులకు ఫోను చెయ్యండి. అలా చేయ డంవల్ల ప్రభుత్వంపట్ల మీరు మీ కర్తవ్యాన్ని నిర్వహించినవారూ అవు తారు. ఈలోపు మేము మా సామానులూ సర్దుకుంటాం' అని అన్నాను నేను. ఇంజనీయరుగారు అలాగేచేస్తానని ఒప్పుకున్నారు. అలాగే చేశారు కూడాను! మేము అనవసరమైన వస్తువుల్ని మినహాయించి, మిగిలిన వస్తువులన్నింటినీ పట్టుకెళ్ళిపోయాం.

ఇలా ఆకస్మికంగా బాంబు పేలడంవల్ల ధ్రువటీ పోలీసులచేతుల్లో పడడమే కాకుండా, ఈ ఇంజనీరుగారుకూడా చాలాబాధలకు గురిఅయ్యారు. నేను ఇంజనీయరుగారితో మాట్లాడేటప్పుడు ఇంద్రపాల్ ప్రక్కనేఉన్నాడు. ఇంద్రపాల్ తరువాత ప్రభుత్వసాక్షిగా మారాడు. అతడు పరప్రభుత్వం నుండి క్షమాభిక్ష నాశించి ప్రభుత్వసాక్షిగా మారలేదు. తనకంటేముందు ప్రభుత్వసాక్షులుగా మారి విప్లవసంఘ సభ్యుల్ని ఎందరినో ఉరికంబాలకు ఎక్కించడానికి సిద్ధమైన ద్రోహుల సాక్ష్యాలను తల్లక్రిందులు చేయడానికి ప్రభుత్వసాక్షి అయ్యాడు ఇంద్రపాల్!

ఇంద్రపాల్ ఎందరినో కాపాడినమాట నిజమే! కాని, ఈ ఇంజనీ యరుగారిని మాత్రం ఇరకాటంలో పడేశాడు. వీరు మాకోసం అరగంట ఆగి ఫోన్ చేసిన విషయాన్ని పోలీసులకు చెప్పేశాడు. ప్రభుత్వం ఈ యింజనీయరుగారిని చాలా బాధ పెట్టింది. ప్రతిక్రియగా వారిహోదాను తగ్గించింది!

# 3. జల్‌గాం న్యాయస్థానంలో ప్రభుత్వసాక్షిపై కాల్పులు

1930వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ప్రజల ఉత్సాహాన్ని రెట్టించే మరో సంఘటన జరిగింది. జల్‌గాం న్యాయస్థానంలో, లాహోరు కుట్రకేసులోని ప్రభుత్వసాక్షి జయగోపాల్‌ని, కాల్చడం జరిగింది! కాల్చింది మిత్రుడు భగవాన్‌దాస్!

భగవాన్‌దాస్, సదాశివరావు మల్కాపూర్ - వీరిద్దరూ 1929 అక్టోబరులో అరెస్టయ్యారు. వీరు అరెస్టు అయ్యేప్పుడు ప్రజలు ఎలా వ్యవహరించారో, వీరు న్యాయస్థానములో ప్రభుత్వ సాక్షిని కాల్చిన తరువాత. వీరిపట్ల ప్రజల ప్రవర్తన ఎలావుందో తెల్సుకోవడం ముఖ్యం. విప్లవకారుల సాహసచర్యలు ప్రజల భావాల్లో స్పష్టమైన పరిణామాన్ని తీసుకువస్తాయి!

1929 అక్టోబరులో భగవతీచరణ్ మీద తనకుగల అవిశ్వాసం కారణంగా ఆజాద్ మా సంబంధాన్నీ, సహచర్యాన్ని తిరస్కరించాడని వెనకే చెప్పాను. అప్పుడు ఆజాద్ గ్వాలియర్‌లో ఉంటున్నాడు. ఘోర మైన ఆర్థికబాధల్లో ఉన్నాడు. గ్వాలియర్‌లో కాలు నిలదొక్కుకునే స్థితి ఎంతకీ కనుపించడంలేదు. బాంబులు తయారుచేయడానికి ఉపయోగించే ప్రేలుడు పదార్థాలనూ, ఇతర సామాగ్రినీ తీసుకుని పూనా వెళ్ళమని భగవాన్‌దాస్‌కూ, సదాశివరావుకూ చెప్పాడు ఆజాద్! పూనాలో రాజగురు ఓ కేంద్రాన్ని స్థాపించి కొంత ఉద్యమాన్ని నిర్మించాడు. పూనా వెళ్ళ డానికి, భుసావల్‌లో బండిమారాలి. అక్కడ ఎక్సైజు పోలీసుల హడా వుడి ఎక్కువగా ఉంటుంది. ప్రయాణీకుల పెట్టెల్నీ, మూటల్నికూడా సోదాచేస్తూ వుంటారు!

పోలీసులు భగవాన్‌దాస్, సదాశివరావు - దగ్గరున్న పెట్టెనీ, మూటనీకూడా తనిఖీ చేయాలన్నారు. సదాశివరావు మాటల్తో పోలీసుల్ని మభ్యపెట్టాలని చూశాడు. కానీ, పోలీసులు మూటలు విప్పి చూడందే పోనీయమన్నారు. పెట్టె తెరువక తప్పిందికాదు. పెట్టెలో ద్రావకాల్ని చూసేసరికి పోలీసులకు అనుమానం కలిగింది. భగవాన్‌దాస్. ఆ ద్రావకాలు అమూల్యమైన ఔషధాలని చెప్పి తప్పించుకోచూశాడు. ఇంతలో తూటాల పొట్లాం ఒకటి పోలీసులకు దొరికింది. ఇక తప్పించుకోవడానికి మార్గంలేదు. భగవాన్‌దాస్ గుడ్డలో చుట్టిఉన్న పిస్తోలును పెట్టెలోనుండి మొదటే తెలివిగాతీసి ప్రక్కకు పెట్టుకున్నాడు.

తప్పించుకోవడం సంభవంకాదని నిశ్చయించుకున్నాక, ఇద్దరు విప్లవకారులు తమలో తాము సంజ్ఞ చేసుకున్నారు. పారిపోవడానికి నిశ్చయించుకున్నారు.

సదాశివరావు పిస్తోలు ఒక్కటే తీసుకొని పరుగెత్తితే బాగుండేది. అతడలా చెయ్యకుండా మొత్తం పెట్టెనే తీసుకుని పరుగులంకించుకున్నాడు. ఇద్దరు విప్లవకారులు ప్లాటుఫారం మీదనుంచి రైలు పట్టాల ననుసరించి సిగ్నల్ కాబిన్‌వైపు పరుగెత్తారు. పోలీసులు వారిని వెంబడించారు. ప్రజల సహాయాన్ని అర్థించారు పోలీసులు. "బాంబులు ప్రేల్చేవాళ్ళు పరుగెత్తుతున్నారు, పట్టుకోండి!" అని అరిచారు పోలీసులు. ప్లాటుఫారంమీది ప్రజలు పోలీసులకు సాయమొచ్చారు.

పెట్టె ఎత్తుకుని పరుగెత్తుతున్న సదాశివరావు కాలు సిగ్నల్ తీగల్లో చిక్కుకున్నది అతడు క్రింద పడ్డాడు. పోలీసులు అతణ్ణి సమీపించారు. ఇంతలో భగవాన్‌దాస్ పోలీసుల్నీ, ప్రజల్నీ భయపెట్టడానికి జేబులోనుండి పిస్తోలుతీసి గాలిలోకి కాల్చాడు. అయినా, ప్రజల గుంపు వాళ్ళను వదల్లేదు. వాళ్ళిద్దరూ రైల్వే ఫెన్సింగ్‌నుదాటి ఊళ్ళో పడ్డారు. ఊరుక్రొత్త.

ఎటు పోవాల్నో తెలియదు. నేరుగా పోలీస్ స్టేషన్‌కే వెళ్ళారు! అరెస్టయ్యారు!

అలా నిరుపాయంగా అరెస్టు అయినందుకూ, అమూల్యమైన ప్రేలుడు పదార్థాల్ని వ్యర్థపరచినందుకూ ఇద్దరు మిత్రులూ చాలా బాధ పడుతూండేవారు. వీరిద్దరూ లాహోరు కుట్రకేసుకు సంబంధించినవారని ప్రభుత్వ సాక్షులు మొదటే చెప్పారు. పోలీసులు వీళ్ళని లాహోరు తీసుకొచ్చి, జయగోపాల్, ఫణీంద్రనాథ్ ఘోష్‌చేత గుర్తింప చేశారు కూడాను! వీరు లాహోరు కుట్రకేసుకు సంబంధించినవారే అయినా, వీరిమీద కేసు జల్‌గాంకోర్టులోనే నడిచింది. వీరిని ధూలియా జైలులో బంధించారు.

భగవాన్‌దాస్, సదాశివరావు-వీరిద్దరికీ వకీలు రా.వి. దులేర్. వీరు ఝూంసీ నివాసి. ఈ వకీలుద్వారా ఇద్దరు విప్లవకారులూ ఆజాద్‌కు ఓ సందేశాన్ని పంపించారు. "మాకేసులో రెండవమాటు సాక్ష్యం ఇవ్వడానికి జయగోపాల్, ఫణీంద్రనాథ్ ఘోష్ - ఇద్దరు ప్రభుత్వ సాక్షులు జల్‌గాం కోర్టుకు వస్తున్నారు. మాకొక పిస్తోలు పంపించినట్లయితే, ప్రభుత్వ సాక్షుల్ని కాల్చివేస్తాం!"

1930 జనవరిలో ఆజాద్‌కు ఈ సందేశం అందింది. ఆజాద్ భగవతీచరణ్‌ని ధూలియా పంపించాడు; భగవాన్‌దాస్‌నీ, సదాశివరావునీ జైల్లో కల్సుకుని వారి ప్లానును తెలుసుకుని ఒక నిర్ణయానికి రావడానికి! భగవతీచరణ్ ఝూంసీ నివాసిగా వకీలువేషంలో, జైల్లోకివెళ్ళి ఇద్దరు మిత్రుల్నీ కల్సుకున్నాడు. తిరిగివచ్చి 'పనిజరగడానికి అవకాశం ఉందని' ఆజాద్‌కు చెప్పాడు.

ఫిబ్రవరి 17వ తారీకు సాయంత్రం సదాశివరావు తమ్ముడు శంకర్రావు, ఇద్దరు ముద్దాయిలకు భోజనాన్ని తీసుకుని జైల్లోకి వెళ్ళాడు. వెళుతూ గిన్నెలో గుండ్లతో నింపిన పిస్తోలును పెట్టుకుని తీసుకువెళ్లాడు.

సదాశివరావు, భగవాన్‌దాస్ - ఇద్దరూ జైల్లో చాలా సజ్జనులని పించుకున్నారు. నియమబద్ధంగా వ్యవహరించేవారు. తమ ప్రవర్తనవల్ల పోలీసులమీద బాగా ప్రభావాన్ని వేశారు. అప్పుడప్పుడూ పాటలు పాడి వినిపించి, పోలీసులను మంచి చేసుకున్నారు. జల్‌గాం సెషన్స్ కోర్టులో ఫిబ్రవరి 2వ తారీకున వీళ్ళ కేసు వాయిదా ఉంది. ఆనాడు సాక్ష్యం ఇవ్వడానికి జయగోపాల్, ఫణీంద్రనాథ్ ఘోష్ కూడా జల్‌గాం వస్తారు. జైలు నుండి జల్‌గాం న్యాయస్థానానికి వెళ్ళేటప్పుడు భగవాన్‌దాస్ పిస్తోలును జేబులో పెట్టుకువెళ్ళాడు.

భగవాన్‌దాస్‌కూ, సదాశివరావుకూ మధ్యాహ్న భోజనాన్ని తీసుకుని శంకరరావు కోర్టుకు వెళ్ళాడు. ఇద్దరు ముద్దాయిలకు వరండా ప్రక్కనే రెండు కుర్చీలను వేశారు. శంకర్రావు క్రిందకూర్చుని ముద్దాయిలకు భోజనం పెడుతున్నాడు.

ముద్దాయిలకు వెనుకవైపున కోర్టు ఆవరణలో ఒక డేరాను వేశారు. అందులో ప్రభుత్వసాక్షులిద్దరూ, వాళ్ళ రక్షణకోసం వచ్చిన పోలీసు అధికారులూ, టేబులుముందు కూర్చుని భోజనం చేస్తున్నారు.

భోజనం చెయ్యడానికివీలుగా, సదాశివరావుకూ, భగవాన్‌దాస్‌కూ కుడిచేతి బేడీలను ఊడదీసి ఎడమచేతికి తగిలించారు. వారికి భోజనం పెడుతున్న శంకర్రావు "మీ వెనకవైపున ప్రభుత్వసాక్షులు యిద్దరూ డేరాలో కూర్చుని పోలీసులతోపాటు భోంచేస్తున్నారు!" అని చెప్పాడు.

భగవాన్‌దాస్, సదాశివరావు ఇద్దరూ కూడ బలుక్కున్నారు. ఇంతకంటె చక్కని అవకాశం లభించదు! భగవాన్‌దాస్ జేబులోనుంచి పిస్తోలును తీశాడు. ఆవేశంతో ప్రభుత్వసాక్షులున్న డేరావైపు పరుగెత్తాడు.

డేరా వాకిట్లో సబ్‌యిన్‌స్పెక్టరు నానక్‌షా భగవాన్‌దాస్‌ను అడ్డ

గించాడు. భగవాన్‌దాస్ అతడిని కాల్చేశాడు. గుండు అతడి తొడలో నుండి దూసుకుపోయింది. నానక్‌షా పెట్టెకపెట్టె ప్రాణం రక్షించుకోవడానికి పరుగెత్తాడు.

భగవాన్‌దాస్ దేరాగుడ్డను ఎత్తాడు. ఫణీంద్రనాథ్ ఘోష్, తుపాకీ కాల్పునువిని కుర్చీలోనుంచి తప్పుకుని, టేబుల్ క్రిందకు దూరి మొదటే జాగ్రత్త పడ్డాడు। జయగోపాల్ ధైర్యంచేసి భగవాన్‌దాస్‌ను ఎదిరించాడు. భగవాన్‌దాస్ అతడిపై పిస్తోలు ప్రేల్చాడు. గుండు జయగోపాల్ భుజానికి తగిలింది. అతడు గావుకేకపెట్టి కోర్టుహాల్లోకి పరుగెత్తాడు. ప్రభుత్వసాక్షింతోపాటు భోజనానికి కూర్చున్న పోలీసు ఆఫీసరుకూడా, టేబుల్‌క్రింద దూరాడు. భగవాన్‌దాస్ క్రిందికివంగి టేబుల్‌క్రింద ఉన్న వాళ్ళను కాల్చడానికి ప్రయత్నించాడు. కాని, పిస్తోలు మొండికేసింది।

భగవాన్‌దాస్, దేరాలోనుండి బైటకువచ్చి, కోర్టుహాల్లోకి పరుగెత్తాడు. తనమీద నేరాన్నిమోపుతూ తన దగ్గర దొరికిన పిస్తోలును, పోలీసులు కోర్టుహాల్లో పెట్టారు. దాన్ని చేజిక్కించుకుందామని భగవాన్‌దాస్ ఉద్దేశ్యం. సదాశివరావు అంతకుముందే కోర్టుహాల్లోకి పరుగెత్తడానికి ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకున్నారతణ్ని.

పిస్తోలు దెబ్బతిన్న సబ్‌యినస్పెక్టరు నానక్‌షా కూడ ప్రాణరక్షణార్థం కోర్టుహాల్లోకే పరుగెత్తాడు. తనపైపే పరుగెత్తుకువస్తున్న భగవాన్‌దాస్‌నుచూసి చావుకు తెగించాడు. తప్పించుకోవడానికి వేరు మార్గం లేకపోవడంతో, భగవాన్‌దాస్‌మీద కలబడక తప్పిందికాదు. నానక్‌షా ఒడ్డూ పొడుగూగల భారీ విగ్రహం. భగవాన్‌దాస్‌ని క్రిందపడేసి కదలకుండా పట్టేశాడు. ఇంతలో మరికొందరు పోలీసులువచ్చి భగవాన్‌దాస్‌ను పట్టుకున్నారు. జల్‌గాం ప్రజలు చాలామంది విప్లవకారులకేసు విచారణ విన

డానికి కోర్టుకు వచ్చారు. వాళ్ళు పోలీసులను నిందిస్తూ విప్లవకారులకు జయకారాలను పలికారు 'విప్లవం వర్ధిల్లాలి!' అన్న నినాదంతో పరిసరం ప్రతిధ్వనించింది.

వెంటనే కోర్టు కార్యక్రమాల్ని ఆపివేశారు. ప్రభుత్వసాక్షులిద్దర్నీ పోలీసువ్యానులో కూర్చోబెట్టి సురక్షితమైన ప్రదేశానికి పంపించి వేశారు. ప్రజలు ఆగ్రహావేశులై, ఆవ్యానుమీద రాళ్ళు రువ్వారు. 'దేశద్రోహులు నశించాలి' అన్న నినాదం మిన్నుముట్టుంది. పోలీసులు పది పదిహేను మందిని అరెస్టు చేశారు. జల్‌గాంలో వెంటనే 144వ సెక్షను ప్రకటించారు.

అప్పటికి మిత్రులు భగవాన్‌దాస్, సదాశివరావు అరెస్టయి నాలుగు నెలలు కావస్తున్నది. ఈ నాలుగు నెలల్లోనూ ప్రజల్లో ఎంతమార్పు వచ్చింది! విప్లవకారులపట్ల ఎంత సానుభూతి పెరిగింది! ఈ నాలుగు నెలల్లో విప్లవకారులు అనేక సాహస కార్యాలను చేశారు. వైస్రాయి ట్రైనుక్రింద బాంబు ప్రేల్చడం, చిటగాంగ్ శస్త్రాగారం మీద దాడి, 'బాంబు దర్శనం' కరపత్రాన్ని పంచడం - ఇలాంటి కార్యక్రమాలు జరిగాయి. వీటివల్ల 'విప్లవకారులు ఎవరో! ఎందుకు పోరాడుతున్నారో!' అన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు.

ప్రజల్లోనేకాదు. పోలీసుల్లోనూ చాలా పరివర్తన వచ్చింది. జైల్లోకి పిస్తోలు రావడంవల్ల, కోర్టులోనే కాల్పులు జరగటంవల్ల భారతీయ పోలీసులమీద బ్రిటీషు ప్రభుత్వానికి నమ్మకం తగ్గింది. వెంటనే ఇంగ్లీషు సార్జెంటు వచ్చాడు. కొందరు పోలీసుల్ని మార్చారు. కొందరికి అజాగ్రత్తగా ఉన్న నేరానికి శిక్షలు కూడా పడవచ్చు అనుకుంటున్నారు. పోలీసులు భయపడుతున్నారు. ఆ పోలీసుల్లోని ఒకడు ఇలా అన్నాడు, "ఎందుకిలా భయపడి చస్తారు?.... మహా అయితే ఉద్యోగం పోతుంది!

కాకపోతే, నాలుగు నెలలు జైలుశిక్ష వేస్తారు. అంతేగా? దేశంకోసం, జాతికోసం ప్రాణాలను యిస్తున్న, ఈ భారతమాత బిడ్డల్ని చూడండ్రా!"

వైస్రాయి ట్రైను క్రింద బాంబు ప్రేల్చి రెండు నెలలు అయింది. ఆ కేసును పరిశీలించడానికి ప్రత్యేకం లండన్ నుండి స్కాట్‌లాండ్ యార్డ్ సి.ఐ.డి.లను పిలిపించారు. వాళ్ళు ఏమీ తెల్సుకోలేక పోయారు. ఇప్పుడిక కోర్టులోనే ప్రభుత్వసాక్షుల్ని కాల్చేశారు, విప్లవకారులు! ప్రజల దృష్టి కోణంలో మార్పు వస్తున్నది. ప్రజల సహానుభూతిని పొందగల యోగ్యత విప్లవకారులకూ లభిస్తూన్నది.

నేను కొన్ని వస్తువులు నిరుపయోగమైనవని భావించి బంగళాలోనే వదిలిపెట్టేశాను. అలా వదిలిపెట్టిన వాటిల్లో నేను హిందీలో వ్రాసిన కాగితాలు కొన్ని ఉన్నాయి. ఇంద్రపాల్ గదిలో ఉన్నప్పుడుగానీ, బంగళాలో ఖాళీగా ఉన్నప్పుడుగానీ, ఆస్కార్ వైల్డ్ ప్రసిద్ధనాటకం 'వీరాది విహిలిస్ట్'ను హిందీలోకి అనువాదం చేస్తూ వుండేవాణ్ని. ఆ అనువాదపు కాగితాలను ఎక్కడికి పట్టుకు వెళ్ళగలను? వాటిని అక్కడే వదిలివేశాను. అవి నేనా బంగళాలో ఉన్నాననడానికి సాక్ష్యమయ్యాయి. ప్రతిసారీ పట్టుబడకుండా తప్పించుకుంటున్నందుకు పోలీసులు నామీద ఆగ్రహావేశులవుతున్నారు.

ప్రజల సహానుభూతి కారణంగానే విప్లవకారులు పోలీసులకు పట్టుబడకుండా ప్రభుత్వంతో పోరాడగలరు. ప్రజల సానుభూతికి మమ్మల్ని దూరం చెయ్యడానికి పోలీసులు మా వ్యక్తిత్వానికి సంబంధించిన అపవాదుల్ని ప్రచారం చేస్తుంటారు. ప్రభుత్వసాక్షులచేత మా వ్యక్తిత్వాన్ని కళంకితం చేయడానికి అబద్ధాల్ని చెప్పిస్తూ వుంటారు. అప్రూవర్‌గా మారిన మదనగోపాల్ తన సాక్ష్యంలో ఇలా చెప్పాడు "బహావల్‌పూర్ రోడ్డులోని బంగళాలో బాంబు ప్రేలడంవల్ల భగత్‌సింగ్‌ను విడిపించే

కార్యక్రమం జరగలేదు. బాంబు ప్రేలడానికి కారణం, బాంబులున్న అలమారా దగ్గరనుంచుని యశ్‌పాల్ భాబీతో పరిహాసంగా పెనగులాడు తున్నాడు. ఆ పెనగులాటలో వాళ్ళు అలమారాకు తగలడం దానిలోని బాంబులు కదిలి ప్రేలడం జరిగింది. యశ్‌పాల్, సుశీలాదీదీతోనూ ప్రణయం సాగిస్తూవుంటాడు. అందుకనే ఆజాద్‌కు యశ్‌పాల్ అంటే కోపం" అని చెప్పారు.

పై విధంగా చెప్పేటప్పుడు పోలీసులుగానీ, మదనగోపాల్‌గానీ ఒక్క విషయం ఆలోచించడం మర్చిపోయారు. బాంబులు ప్రేలడంవల్ల అలమారా తలుపులు పూర్తిగా ఎగిరిపోయాయి. బాంబు ముక్కలు ఎదర గోడకు తగిలి, గోడకు కన్నాలు పడ్డాయి. గోడ ప్లాస్టర్ అంతా ఎగిరిపోయింది. అలాంటి స్థితిలో అలమారాదగ్గరున్న యశ్‌పాల్ గతి ఏమౌతుంది? పైగా నేను ప్రణయం సాగించింది ఎలాంటి స్త్రీతోనని చెప్పారు? మూడురోజుల క్రితం బాంబు ప్రేలి భర్త చనిపోయిన స్త్రీతోనా? గాయపడ్డ ఆ భర్తను నేను కండ్లారా చూశానే!

సుశీలాదీదీనీ, భాబీనీ, ధన్వంతరీ సురక్షిత ప్రదేశానికి చేర్చాడు. మదనగోపాల్‌ని, ఒక మిత్రుణ్ణి తోడుయిచ్చి, లాహోరు నుండి పంపించే శాము. ఛైల్‌బిహారీని సిమ్లా పంపించడం జరిగింది.

చిన్నతనంలో బాగా జబ్బుపడడంవల్ల జీర్ణకోశం చెడిపోయింది. అజీర్తివ్యాధి పట్టుకుంది. మాటిమాటికి జీర్ణకోశం చెడిపోతుండేది. భగవతీచరణ్ చనిపోవటం, ఇతర వ్యవహారాలు కూడా నా ఆరోగ్యంమీద కొంత చెడ్డప్రభావాన్ని వేశాయి. నేను రెండు మూడు వారాలు విశ్రాంతి తీసుకుంటానని ఆజాద్‌కు చెప్పాను. అతడంగీకరించాడు. జులై మొదటి వారంలో నేను ఢిల్లీ వెళ్ళిపోవడం నిశ్చయమైంది.

# 4. ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీ

భగత్‌సింగ్‌నూ, దత్తునూ విడిపించడానికి జరిగిన ప్రయత్నాలకూ, ఇంతవరకూ జరిగిన ఇతర విప్లవ కార్యక్రమాలకూ అయిన ఖర్చులన్నింటినీ దాదాపుగా భగవతీచరణే భరించాడు. అతడి అనుమతితో దుర్గాభాభీ 5, 6 వేల రూపాయలదాకా ఖర్చుపెట్టింది. సుశీలాదీదీ కలకత్తాలో ఉద్యోగంచేసి సంపాయించి యిచ్చిన రెండువేల రూపాయలు కూడా విప్లవ సంఘం క్రిందనే ఖర్చయ్యాయి. భగవతీచరణ్ చనిపోయాక విప్లవ సంఘపు ఆర్థికబాధలు మిక్కుటమయ్యాయి. 1930 జులై మొదటివారంలో విధిలేక ఆజాద్ దోపిడీ ఒకదాన్ని చేశాడు. మధ్యాహ్నం, ఢిల్లీ చాందనీ చౌక్‌లోని 'గడోడియా స్టోర్'ని దోచుకోవడం జరిగింది.

ఆజాద్, విద్యాభూషణ్, కాశీరామ్ - పిస్తోళ్ళు తీసుకుని గడోడియా ఉన్న పై అంతస్తులోకి వెళ్ళారు. ఆ స్టోరులోనే ఉద్యోగంచేస్తున్న మిత్రుడు విశ్వంభరదయాళ్. వీళ్ళు వెళ్ళడానికి ముందే, పై అంతస్తులో సిద్ధంగా ఉన్నాడు. దోపిడీకి ఎప్పుడు వెళ్ళడం మంచిదో అతడేచెప్పాడు. ధన్వంతరీ, భవానీసింగ్ - ఇద్దరూ గొందిలో మెట్లదగ్గర పిస్తోళ్ళు తీసుకు సిద్ధంగా ఉన్నారు గలభాజరిగితే, క్రిందివాళ్ళు పైకిపోకుండా జాగ్రత్త తీసుకుంటారు పైన పిస్తోలు కాల్చవలసిన అవసరం కలగలేదు. కేవలం పిస్తోలు చూపించి పనిజరుపుకొని వచ్చారు, మిత్రులు। రెండు మూడు నిముషాల్లో 17200 రూపాయిలు చేజిక్కాయి!

మిత్రులు మెట్లుదిగి క్రిందికి వచ్చాక కొందరు గోలచెయ్యాలని చూశారు. అప్పుడు ఆజాద్ ఒకమాటూ, విద్యాభూషణ్ ఒకమాటూ పిస్తోలు కాల్చారు కొద్ది దూరంలోగల టౌనుహాలు ఆవరణలో లేఖరామ్

కారు పెట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. మిత్రులు కారులో కూర్చోగానే, కారు బయల్దేరి వెళ్ళిపోయింది. మొత్తం డబ్బును హిందూహాస్టల్లో, ప్రొఫెసర్ నిగమ్ దగ్గర ఉంచారు. క్రమంగా అన్ని ప్రాంతాలకూ సర్దారా డబ్బును. ఈ దోపిడీ, నేను ఢిల్లీ చేరకముందే జరిగిపోయింది.

మొత్తం డబ్బులో ఎక్కువభాగాన్ని ఢిల్లీలో ఉన్న కైలాసపతికీ, కాన్పూరులోఉన్న వీరభద్రతివారీకి యివ్వడంజరిగింది. ఢిల్లీలో పెద్ద ఎత్తున ప్రేలుడుపదార్థాన్ని తయారుచేసే ఫ్యాక్టరీనిపెట్టాలనీ, కాన్పూర్‌లో పై డిప్పల్ని తయారుచేసే కార్ఖానాని పెట్టాలనీ ఉద్దేశ్యం. ఇలా పెద్ద ఎత్తున బాంబు ఫ్యాక్టరీకి ధనం కేటాయించడంలోని ఉద్దేశ్యం, అత్యధిక సంఖ్యలో బాంబుల్ని తయారుచేసి, మా ఉద్యమానికి గెరిల్లా పోరాట రూపాన్ని యివ్వాలని! మా ఉద్యమాన్ని దౌర్జన్యవాదంనుంచి, సాయుధ పోరాటం వైపు తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాము. ఒక్కొక్క ప్రాంతానికి సైక్లోస్టైల్ మిషన్ కొనుక్కోవటానికికూడా డబ్బు కేటాయించడం జరిగింది. దానిద్వారా కరపత్రాలను ఎక్కువగా పంచి మా ఆదర్శాలను ప్రజల్లో ఎక్కువగా ప్రచారం చేసుకోవాలని ఉద్దేశ్యం. పంజాబు ప్రాంతానికి ప్రత్యేకం రెండువేల రూపాయలు అధికంగా కేటాయించడం జరిగింది. సరిహద్దు ప్రాంతంలో గుల్‌మహారాజ్ బ్రిటీషు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నాడు. అతడితో స్నేహం కలుపుకుని మా ఆదర్శాన్ని అక్కడ ప్రచారం చేసుకోవాలని అనుకున్నాం.

నేను ఢిల్లీవచ్చి ఆజాద్‌ను కల్సుకున్నాను. తిరిగి లాహోరువెళ్ళి నా బాధ్యతలను స్వీకరించాలనుకుంటున్నాను. కానీ, ఆజాద్ "ముందు ఢిల్లీలో బాంబు ఫ్యాక్టరీని స్థాపించడం జరగనీ, ఆ తరువాత వెళుదువు గాని" అన్నాడు. అప్పట్లో బాంబులు తయారుచేయడం మా విప్లవ సంఘంలో నా ఒక్కడికే తెలుసు. పంజాబులో నా స్థానంలో ధన్వంతరీ బాధ్యతలను నిర్వహిస్తున్నాడు.

'ఝుండావాలా'లో ఒక పెద్దబంగళా బాంబు ఫ్యాక్టరీకోసం అద్దెకు తీసుకున్నాం. బంగళా మా అవుసరానికి తగినట్టుగా ఉంది. చుట్టూ ఖాళీ ప్రదేశం. యిరుగు పొరుగులు వచ్చి చూస్తారన్న భయంలేదు. గాలీ, వెలుగూ ధారాళంగా వచ్చే గదులు. ఈమాటు బాంబు ఫ్యాక్టరీని ఓ స్థిరమైన రూపంలో స్థాపించాలని ఉద్దేశ్యం. అంటే, ఎప్పుడూ బాంబులు తయారవుతూనే ఉండాలని! అలా వుండాలంటే తగినఆవరణ అవుసరం. పిక్రిక్ యాసిడ్ కడగటంవల్ల ద్రావకంతో కలిసిన నీరు నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. చూపరులకు అనుమానం కలగకుండా ఉండటానికి పైకి సబ్బుల ఫ్యాక్టరీగా ఆవరణను కల్పిద్దాం అనుకున్నాం. ఒక సైన్ బోర్డును 'హిమాలయన్ టాయ్‌లెట్స్' అనే పేరుతో తయారుచేయించాం.

సబ్బులకుకానీ, పిక్రిక్ యాసిడ్ తయారుచేయడానికిగానీ, రసాయన శాస్త్రం చదివిన మిత్రుడు బాగా ఉపయోగపడతాడు. లాహోరునుండి హీరానంద సచ్చిదానంద వాత్స్యాయన్‌ను (అజ్ఞేయ) ఢిల్లీ పిలిపించాము. అతడుకాలేజీలో రసాయన శాస్త్రాన్నిచదివాడు. ఈ మధ్యనే కాలేజీమాని విప్లవసంఘ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు.

అవుసరమైన పదార్థాల లిస్టును కైలాసపతికిచ్చాను. పదార్థాలన్నీ వచ్చేశాయి.

బంగళా ముందుగదిని 'షోరూమ్'గా ఏర్పాటుచేశాం. వాత్స్యాయన్ కొన్ని పుస్తకాలను చదివి, ముఖానికి పులుముకునే క్రీమునూ, తలనూనెనూ తయారుచేశాడు. సీసాలకు మా కార్ఖానా లేబిలు నతికించి 'షోరూమ్'లో పెట్టాం. రచనా ప్రవృత్తీ, కళాప్రవృత్తీ కలవాళ్ళము యిద్దరం ఉన్నామక్కడ. నేనూ, అజ్ఞేయ! మా కార్ఖానాలో తయారయ్యే వస్తువులన్నింటికీ కళాత్మకమైన పేర్లనే పెట్టాం! 'ఎనంత పరాగ్ హైర్

ఆయిల్' 'వసంత పరాగ్ క్రీమ్' 'వసంత పరాగ్ సోప్!' సబ్బులనైతే మేము తయారుచెయ్యలేక పోయాం. కానీ, షో రూమ్‌లో సబ్బులు ఉండడం అవసరంకదా? సబ్బులకు అవసరమైన మూస నొకదాన్ని తయారు చేయించి, బజారునుండి కొన్ని సబ్బుబిళ్ళలు కొనుక్కొచ్చి, వాటిని మేము తయారుచేసిన మూసలోపెట్టి మా ఫ్యాక్టరీ ముద్రవేశాం. క్రీమ్‌నూ, మానెనూ వాత్స్యాయనే తయారుచేశాడు. కానీ, పిక్రిక్ యాసిడ్ అతడి వల్లకాలేదు. అతడి కోమలమైన శరీరమూ, స్వభావమూ పిక్రిక్ యాసిడ్ యొక్క ఘాటును భరించలేకపోయాయి! పూర్వానుభవం లేకపోవడమూ, కొంతకారణమైంది. పిక్రిక్ యాసిడ్ పనికూడా వాత్స్యాయనేచూసుకుంటే నేను లాహోరు వెళ్ళిపోవచ్చును అనుకున్నాను.

పిక్రిక్ యాసిడ్ తయారుచేసేటప్పుడు మరికొందరు మిత్రులు కూడా నాతోపాటు పనిచేసేవారు వాత్స్యాయన్, విమలప్రసాద్‌జైన్, గిరివరసింగ్, ప్రకాశవతి-వీరు నాతోపాటు ఉండేవారు. మొదటకొన్నాళ్ళు కైలాసపతికూడా పిక్రిక్ యాసిడ్ తయారుచేయటాన్ని నేర్చుకోవాలన్న ఉత్సాహాన్ని కనపర్చాడు. అయితే దుర్గంధపూరితమైన, ఊపిరాడని పొగకు భయపడిపోయాడు. పిక్రిక్ యాసిడ్ కడిగిన పసుపుపచ్చని నీరు నిరంతరం బయటికి వెళ్ళుతూనే ఉంటుంది. ఆ నీటినిచూసి ఎవరైనా అనుమాన పడవచ్చు. అందువల్ల ఆ నీటిలో 'షోడాపుప్పును కలిపి మరేదైనా రంగును కలిపేవాళ్ళం.

గడచిన 5, 6 నెలలలో కైలాసపతి వేషమూ, ప్రవర్తనకూడా బాగా మారింది. వళ్ళుమాయకుండా గుడ్డమాయకుండా ఉంటున్నాడు. హైర్ ఆయిల్ పూసుకుని తల నున్నగా దువ్వుకుంటున్నాడు. ముఖానికి పూసుకున్న క్రీమ్‌వాసనలు మనిషిదగ్గర గుబాళిస్తున్నాయి. ఇస్త్రీచొక్కా గ్లాస్కోపంచె, క్రొత్త చెప్పులు! నడకలో నాజూకు. బెంగాలీల్లా ధోవతి కొనను చేతబుచ్చుకుని అందరూ తనవైపు చూసేట్లు వయ్యారంగా

నడుస్తూన్నాడు. వెనక అతడిమీద నాకువున్న సానుభూతి పోయింది. మరోరకమైన భావనేదో నాలో గూడుకట్టుకోసాగింది.

కైలాసపతిలో వచ్చిన ఈ మార్పునుగురించి ఒకటి రెండుమార్లు ఆజాద్‌తో ప్రస్తావించానుకూడాను. "ఠండికి నీరు పట్టింది!" అని అన్నాను.

కైలాసపతికి 'ఠండీప్రసాద్' అన్న మరోపేరు విప్లవ సంఘంలో వాడుకలో ఉంది. అతడిలోవచ్చిన ఈ మార్పు ఆజాద్ మనస్సునూ బాధించేది. అయితే నామనస్సును బాధించినంతగా మాత్రంకాదు. కైలాస పతిలో ఇలా మార్పురావడానికి ముఖ్యకారణం ఒకటుంది. విప్లవసంఘపు డబ్బు కొన్నివేల రూపాయలు అతడిచేతులలో ఉంటున్నాయి. విప్లవ సంఘపు అవసరాల కోసరం యాభయ్యో, వందో ఖర్చుపెట్టేప్పుడు తనకు ఓ అర్ధరూపాయిపెట్టి క్రీమ్‌బాటిల్ కొనుక్కోవడం పెద్దతప్పు అనిపించ లేదతడికి! కైలాసపతి ఇలా తన్నుతాను అలంకరించుకుని ఆనందించ డానికి కారణం అతను అరెస్టు అయిన తరువాతగాని తెలియలేదు.

ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీ, రోహతక్‌లోని మట్టిమిద్దెలాంటిది కాదు. విశాలంగాఉండి గాలివెలుగూ ధారాళంగా వచ్చేగదులు. పైగా ద్రావకాల ప్రభావం శరీరంమీద పడకుండా ఉండడానికి, ప్రేలుడు పదార్థాన్ని తయారు చేయడంలో పాల్గొనే మిత్రులందరికీ ప్రత్యేకమైన దుస్తుల్ని కుట్టించాం. అప్పట్లో బుష్‌షర్టు వేసుకునే ఆచారం భారతదేశంలో లేదు. రెండవ ప్రపంచయుద్ధం తరువాత భారతదేశం వచ్చిన అమెరికన్లనుచూసి మనం బుష్‌షర్టు ధరించడం నేర్చాం! కానీ మేము ఢిల్లీ బాంబుఫ్యాక్టరీ లోని మిత్రులకు, పనిలో వీలుగా ఉండగలందులకు, ఆనాడే బుష్‌షర్టులు కుట్టించాం. ప్యాంటు బుష్‌షర్టు వేసుకుని పగలంతా పనిచేస్తుండేవాళ్ళం!

ఢిల్లీలో ఎక్కువ పరిమాణంలో పదార్థాలను తయారు చేశాం. బంగళా విశాలమైందే అయినా, ద్రావకాలపొగ అధికంగా వస్తూఉండేది.

సాయంకాలమయ్యేసరికి మేమందరం పూర్తిగా అలసిపోయ్యేవాళ్ళం. అన్నం వండుకునే ఓపిక కూడా ఉండేదికాదు మాలో! పిక్రిక్ యాసిడ్‌నీ గన్‌కాటన్‌నీ తయారు చేశాక డైనమైట్‌కు అవసరమైన ప్రేలుడు పదార్థాన్ని కూడా కొంత తయారుచేశాం. ఇది అతి భయంకరమైన ప్రేలుడు పదార్థం. ఒకరోజున ద్రావకంసీసాలో, ఒకబొట్టు ద్రావకంఉండగా, ఒక అరబొన్సు 'నైట్రోగ్లిజరీన్'ని వేశాడు వాత్స్యాయన్. సీసా మూత వదులుగా ఉంది గనక సరిపోయింది. మూత ఎగిరివెళ్ళి నడికప్పుకు కొట్టుకుంది. మూతగట్టిగా ఉన్నట్లయితే, సీసా పగిలి ఆ గాజుముక్కలతో మేమందరం గాయపడేవాళ్ళం!

కైలాసపతి గుర్రపుబండిలో ద్రావకాలు తెచ్చేవాడు. మేము అస్తమానం ప్రేలుడు పదార్థాన్ని తయారు చేస్తుండేవాళ్ళం. సాయంత్రానికి తలనొప్పి పట్టుకునేది. మా చేతులకు పిక్రిక్‌యాసిడ్ పసరు తగలడం వల్ల, ఆహారాన్ని తీసుకు తినడమూ కష్టమయ్యేది. మా చేతుల స్పర్శ వల్ల ఆహారం చేదెక్కేది! అలాంటి స్థితిలో, ఏ హోటలుకో వెళ్ళి ఇంత ఆహారాన్ని తిని వస్తూండేవాళ్ళం. తలనొప్పి అధికంగా ఉన్నప్పుడు చల్లగాలికి షికారు వెళుతుండేవాళ్ళం. విమలప్రసాద్ జైన్‌కు ఒక గుర్రపు బండి వాడితో పరిచయం వుంది. అతడి బండిలో నాలుగైదుమైళ్ళు తిరిగి వచ్చేవాళ్ళం. అప్పట్లో నేను ఒక విషయం తెలుసుకోలేకపోయాను. కైలాసపతి ప్రవర్తన నా మనస్సును ఎలా బాధిస్తున్నదో, నా ప్రవర్తన కూడా అతడి మనస్సును అలాగే బాధిస్తున్నది! అతడు ఆజాద్‌తో నా మీద చాడీలు చెప్పేవాడు. విప్లవసంఘపు డబ్బును సొంతానికి ఖర్చు చేస్తున్నానని చెప్పేవాడు. ఫ్యాక్టరీ బాధ్యత నాదే అయినా, నా ఒక్కడి కోసరం అని ఏఖర్చూ పెట్టేవాడినికాదు. ఏదితెప్పించినా, ఏఖర్చుపెట్టినా, ఉమ్మడిగా అందరికోసరమూ ఉద్దేశింపబడి ఉండేది!

* * *

# 5. యశ్‌పాల్‌కు మృత్యుదండన

ఓ నలభై పౌన్లు పిక్రిక్ యాసిడ్, కొంత గన్‌కాటన్, నైట్రోగ్లిజరీన్ కొంత తయారు చేసుకున్నాం. ఈ మాత్రం పదార్థంతో 5,౦ వందల బాంబులు తయారవుతాయి. ప్రేలుడు పదార్థం తయారు చేసిన మిత్రుల ఆరోగ్యం దెబ్బతిన్నది. కొన్నాళ్ళపాటు పనిని ఆపేశాం.

ఒకరోజు మధ్యాహ్నం కైలాసపతి నాతో ఇలా అన్నాడు. "రేపు ఉదయం కాన్పూరులో కేంద్రకమిటీ మీటింగు ఉంది. ఈరాత్రి బండికే నీవు వెళ్ళు. కాన్పూర్ స్టేషన్‌లో మిత్రులు నిన్ను కలుసుకుని మీటింగు జరిగే ప్రదేశానికి తీసుకువెళతారు!"

"నువ్వూ వస్తావుగదా? నీతోపాటే నేనూ బయలుదేరుతాను!" అన్నాను నేను.

"నేనూ వస్తాను. అయితే నాకు ఇక్కడ కొంచెంపనుంది. మొదటి బండికి కాకపోతే రెండవబండికి నేను బయలుదేరి వస్తాను. నువ్వు మాత్రం ఆలస్యంచేయకు. మొదటిబండికే వెళ్ళు. అక్కడ, స్టేషన్‌లో మిత్రులు నీకోసం ఎదురు చూస్తూ వుంటారు." అన్నాడు కైలాసపతి.

ఆ రోజుల్లో కైలాసపతి ప్రతిమాటనూ నేను వ్యతిరేకిస్తూవుండే వాడిని. అతడ్ని ఉడికించటానికి "నువ్వు రెండవ బండికివెళితే, నేను మాత్రం ఆ బండికి ఎందుకు రాకూడదు? నాకాబండిలో చోటుండదా?" అన్నాను.

"నువ్వు ముందువెళితే, ఆజాద్ కొంతవరకూ స్థిమిత పడతాడు. మీటింగుకు ముందు నీతో ఏమో మాట్లాడాలని భైయ్యా ఉద్దేశ్యం అయి వుంటుంది. వీలైతే నేనూ మొదటి బండికే వస్తాను. నాకోసరం నువ్వు ఎదురు చూడవద్దు!" అన్నాడు కైలాసపతి.

సరిగా రైలు బయలుదేరే సమయానికే స్టేషనుకు వెళ్ళడం నా అలవాటు. అలా వెళ్ళడంవల్ల సి.ఐ.డి. పోలీసులకంటపడకుండా తప్పించుకోవచ్చు! ఢిల్లీ స్టేషనులో కైలాసపతి కోసరం వెతక్కుండా నేరుగా రైలుఎక్కి కూర్చున్నాను. కాన్పూరులోనూ, ప్లాటుఫారంమీద ప్రయాణీకుల గుంపుల్లో, నన్ను తీసుకువెళ్ళటానికి వచ్చిన మిత్రుడికోసరం ఒకటి రెండుమార్లు వెతికాను. అతడు నాకు కనిపించలేదు. నన్ను తీసుకువెళ్ళటానికి వచ్చిన మిత్రుణ్ని నేను ఎటూ ఎరిగే వుంటాను. నాకు అతడూ, అతడికి నేను కనపడకపోవడం యాదృచికమే!

మీటింగు ఎక్కడో నాకు తెలియదు. ఆజాద్‌ను కలుసుకోవాలన్నా, ఎక్కడికి వెళ్ళాల్నో, ఎక్కడ వుంటాడో నాకు తెలియదు. నాకు కైలాసపతిమీద విపరీతమైన కోపం వచ్చింది. 'అతడు తల దువ్వుకోవడంలోనో, ధోవతి కుచ్చిళ్ళు మడుచుకోవడంలోనో మునిగిఉంటాడు. కనుకే, నాతోపాటు బయలుదేరలేకపోయాడు' అనుకున్నాను. ఆజాద్ ఎక్కడున్నాడో తెల్సుకోవడానికి వీరభద్రతివారీ యింటికి వెళ్ళాను.

వీరభద్రతివారి అప్పట్లో శ్రద్ధానందపార్కులో కాంగ్రెసు ఆఫీసుకు దగ్గర్లో ఉండేవాడు. నేను మెట్లుఎక్కి పైకి వెళ్ళాను. ఎదురుగా అతడే ఆశనపట్టు వేసుకుని కూర్చుని వున్నాడు. నన్నుచూసి వీరభద్రతివారి విభ్రాంతుడయ్యాడు. కొంచెంగా అదరి పడ్డాడు కూడాను. నేనలా అకస్మాత్తుగా తన యింటికి వస్తానని అతడు అనుకుని ఉండడు. పరారులో ఉన్న నేను, అలా చెప్పాపెట్టకుండా తన యింటికి రావడంవల్ల అతడు ఆశ్చర్యపడడమూ, అదరిపడడమూ సహజమే! పైగా, అతడి యింటి ప్రక్కనే, విప్లవకారుల్ని పట్టుకోవడానికి, ప్రత్యేకం నియమించిన, సి.ఐ.డి. పోలీసు యినస్పెక్టరు రాయ్‌సాహబ్ శంభూనాధ్ నివాసం!

నేఅలా అనుకోకుండా వెళ్ళినందుకు కొంత బాధపడుతూ "నేను కేంద్రకమిటి మీటింగ్‌కు వచ్చాను. కైలాసపతి వస్తానని రాలేదు.

మీటింగ్‌కు తీసుకువెళ్ళడానికి, స్టేషన్‌దగ్గర మిత్రులు ఎదురుచూస్తూ వుంటారని చెప్పాతు. వాళ్ళు నాకు కనిపించలేదు. నేను యిక్కడ ఇంకె వరినీ ఎరుగను. తప్పనిసరియై మీ యింటికి వచ్చాను!" అని అన్నాను.

వీరభద్రరావుగారు పరుపు పరచుకు కూర్చున్నాడు. ఆ పరుపుమీద నన్నూ కూర్చోమని చేత్తో సంజ్ఞ చేశాడు. నేనూ కూర్చున్నాను.

శరత్‌బాబు నవల 'అరక్షణీయ' నా చేతిలో ఉంది. నా చేతిలోని ఆ పుస్తకాన్ని వీరభద్రరావుగారు తీసుకున్నాడు. పుస్తకం పేరులోని మొదటి 'అ'ను తన వ్రేలితోమూసి నాకు చూపించాడు. అతడి ఉద్దేశ్యం ఏమిటో నాకు అర్థంకాలేదు. "దారిలో ప్రొద్దుపోవడానికి చదువుతూన్నాను." అన్నాను.

"అవుననుకో! దీనిపేరు 'అరక్షణీయ' కంటే 'రక్షణీయ' అని ఉంటే బాగుండేది!" అన్నాడు. వీరభద్రరావుగారు చాల గంభీరంగా మాట్లాడుతున్నాడు.

ఇన్ని సంవత్సరాల తరువాత ఆనవల్లోని విషయమేమిటో జ్ఞాపకం లేదు. అప్పుడు పుస్తకాన్ని సాంతం చదువనూలేదు. వీరభద్రరావుగారు నవల పేరును గురించి మాట్లాడుతున్నాడు, అనుకున్నాను. "ఇప్పుడే ఏమీ చెప్పలేను. సాంతం పుస్తకం చదివిగాని అభిప్రాయాన్ని యివ్వలేను" అన్నాను.

'నువ్వు చదవకపోవచ్చు. నేను చదివాను. నాకు అంతాతెలుసు!' అలాగే గంభీరంగా మాట్లాడుతూన్నాడు వీరభద్రరావుగారు.

నేను అప్పటికీ అర్థంచేసుకోలేదు. పుస్తకం పేరును గురించీ, కధను గురించీ మాట్లాడుతున్నాడు, అనుకున్నాను. చిరునవ్వు నవ్వుతూ "నువ్వు చదవొచ్చు! నేనూ సాంతం చదవాలిగదా?" అన్నాను.

'నిన్ను రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కు వచ్చిన మిత్రుడు నిన్ను

చూడకపోవడం, నువ్వు యిక్కడకు రావడం-చాలా మంచిదయింది!' అన్నాడు.

వీరభద్రతివారీ మీటింగుకు ముందు నాతో ఏమో మాట్లాడాలను కుంటున్నాడు, అనుకున్నాను. బహుశా, ఆజాద్‌కూ ఇతడికీ అభిప్రాయ భేదంవచ్చి ఉంటుంది. అందుకే మీటింగుకు ముందుగా నాతోమాట్లాడాలని అనుకుని ఉంటాడని అభిప్రాయపడ్డాను. 'మంచే అయింది. విషయం ఏమిటో చెప్పండి?' అన్నాను.

'చాలా మంచి అయింది' అంటూ వీరభద్రతివారీ నా కండ్లల్లోకి సూటిగా చూశాడు. అతడి ముఖంలో సంతోషచ్ఛాయలు కనిపించాయి.

అతడేంచెప్పతాడో వినాలన్న కుతూహలం నాలో ఎక్కువైంది. అతడిలా అన్నాడు. 'ఇవ్వాళ ప్రొద్దుకుంకేవరకూ బైటకు ఎక్కడికీ వెళ్ళకు. రాత్రికి తిరిగి వెళ్ళిపో!'

"నేను కేంద్రకమిటీ మీటింగులో పాల్గొనడానికి వచ్చానుకదా?"

"మీటింగు అయిపోయింది."

నేను విపరీతమైన ఆశ్చర్యంతో "ఏమిటి, మీరు అనేది?" అన్నాను

"నీకు సురక్షితమైన ప్రదేశం ఏది?" అని అడిగాడు.

"నాకు అన్ని ప్రదేశాలూ ఒకలాంటివే! ఢిల్లీలో నాపని అయి పోయింది. ఇంక పంజాబు వెళ్ళమంటారనుకుంటాను?" అన్నాను.

"పంజాబు నీకు సురక్షితమైన ప్రదేశం కాదు."

నా ఆశ్చర్యం యినుమడించింది. 'పంజాబులో ఈమధ్య అరెస్టులు జరిగాయి గావును! వార్తా పత్రికలద్వారా బైటకు తెలియకుండా ఉండి ఉంటాయి. ఇతడు ప్రత్యేకం తెలుసుకున్నాడు గావును' అనుకున్నాను. పైకి ఇలా అడిగాను. "పంజాబులో ఏం జరిగింది?"

నేనతడి మాటల్ని అర్థం చేసుకోలేదని వీరభద్రతివారీ తెల్సుకున్నాడు. నా రెండుచేతులనూ తన చేతుల్లోకి తీసుకుని నా కండ్లలోకి సూటిగాచూస్తూ "నేను చెప్పినమాటలు మరెవరికీ చెప్పనని ప్రమాణం చెయ్యి!" అన్నాడు.

నేను కొంచెంగా బాధపడాను "విప్లవ సంఘ రహస్యాన్ని మరెవరికైనా చెప్పడం అన్నప్రశ్నే ఉండదు కదా? అందులోనూ నేను మరెక్కడైనా చెపుతానని మీరు ఎలా అనుకున్నారు?" అన్నాను.

"నేను చెప్పబోయేది విప్లవసంఘ రహస్యంకంటేకూడా రహస్యమైంది! దీన్ని పార్టీసభ్యులకుకూడా చెప్పనని మాటయివ్వు. ఆజాద్‌కు కూడా చెప్పటానికి వీల్లేదు" అన్నాడు వీరభద్రతివారీ.

"నేను పార్టీ హితానికి విరుద్ధంగా ఏ విషయాన్నీ బైటపెట్టను" అన్నాను గంభీరంగా.

"నేనూ పార్టీహితాన్నిగురించే మాట్లాడుతున్నాను. నీకూ నాకూ ఎక్కువ మిత్రత్వం లేదు. రెండు మూడు సార్లు మాత్రమే నిన్ను నేను కల్సుకున్నాను. వెనుక నీగురించి నేవిన్నదాన్నిబట్టి యిప్పుడు వింటున్న దాన్నిబట్టి అలాంటిమాట నీ దగ్గర తీసుకోవడం అవసరం అనుకుంటున్నాను" అన్నాడు వీరభద్రతివారీ.

నేను గంభీరుణ్ణయ్యాను. 'పార్టీహితంకోసం నీవు చెపుతున్న రహస్యాన్ని దాయటం అవుసరమైతే, నేనీ రహస్యాన్ని ఇంకెవరికీ చెప్పను.' అని అతడి రెండుచేతులనూ నా చేతుల్లోకి తీసుకుని ప్రమాణం చేశాను.

'కేంద్రకమిటీ మీటింగు అయిపోయింది. నిన్ను ఇక్కడకు పిలిపించి కాల్చేయాలని నిర్ణయం జరిగింది!' అన్నాడు వీరభద్రతివారీ.

నానెత్తిన పిడుగు పడ్డట్లయింది. 'ఎందుకని నన్ను కాలుస్తారు? కారణం ఏమిటి?' అని అడిగాను.

"నీమీద మిత్రులకు విశ్వాసం తగ్గింది. నువ్వు సుఖాన్నీ, భోగాల్నీ మరిగావని అనుకుంటున్నారు. నీలో పిరికితనం గూడుకట్టుకున్నదని భావిస్తున్నారు. నువ్వు విప్లవ సంఘాన్ని నట్టేట్లో ముంచుతావని మిత్రుల అభిప్రాయం.... విశ్వాస ఘాతుకం చేస్తావని అనుకుంటున్నారు!"

ఘోరంగా అవమాన పడిపోయాను. "ఈ అనుమానాలకూ సంశయాలకూ నిదర్శన మేమిటి? నా ప్రవర్తనలో అలాంటి అనుమానం కలిగించిన విషయమేమిటి? ఎవరు వేశారు, ఈ నిందను నామీద?" అని అడిగాను.

"అదంతాపోనీ! నిన్ను కాల్చెయ్యడం పార్టీకి హితాన్ని చేకూరుస్తుందని నేఅనుకోవడం లేదు. కనుకనే నీచేతిలోని పుస్తకంమీద 'అ'ను మూసి 'రక్షణీయ' అని ఉండాలని చెప్పాను. నువ్వు యిక్కడకు వచ్చి ఈ విషయాన్ని తెలుసుకోవడం మంచిదే అయింది. ఇప్పుడు నువ్వు ఈ రహస్యాన్ని బైటపెడితే కేంద్రకమిటీ నిర్ణయాన్ని అమలు పరచడానికి అభ్యంతరం కలిగించిన అపరాధానికి నీతోపాటు నన్నూ కాల్చేస్తారు."

నేను దాదాపు పిచ్చివాడినయ్యాను. 'నా అపరాధమేమిటో నాకు చెప్పి, అపరాధం నిర్ణయమైన తరువాత కాల్చేసినా నాకు అభ్యంతరం ఉండదు!' అన్నాను.

వీరభద్రతివారీ 'అదెలా జరుగుతుంది? ఎవరినైనా కాల్చెయ్యడం జరుగుతుందని తెలిశాక, అతడు పోలీసులకు చెప్పి రక్షణను పొందవచ్చు కదా? మిత్రులందరినీ పట్టించవచ్చునుకదా?' అన్నాడు.

'అంటే నేనిక పోలీసుల రక్షణలోకివెళ్ళి, మిత్రులందరినీ పట్టించేస్తానని, అనుమానిస్తున్నారన్నమాట!' అని అడిగాను.

'నీమీద నాకు అలాంటి అనుమానం ఏమీలేదు. కానీ, ఇతర మిత్రులకు ఉంది. నీమీద నాకు అనుమానంలేదు కాబట్టే నీకు ఈ విష

యాన్ని చెప్పాను. ఒకరకంగా నేను నీకంటే కూడా ప్రమాదంలో యిరుక్కున్నాను. నువ్వు ఏనాడు ఈ రహస్యాన్ని బైటపెట్టినా, నాప్రాణానికి ముప్పు! అయినా నిన్ను కాల్చివేయడం పార్టీ క్షేమానికి విరుద్ధం గనక, నేను ఈ రహస్యాన్ని నీకు చెప్పాను" అని అన్నాడు వీరభద్రతివారీ.

అంతటి ఘోరమైన అపరాధం నామీద వేసేసరికి, నామీద నాకే అసహ్యం వేసింది! చాలాసేపు మౌనంగా కూర్చుండిపోయాను. తరువాత ఇలా అన్నాను. 'నేను ఆజాద్‌ను కలుసుకునే ఏర్పాటుచెయ్యి. నేను వాళ్ళతో మాట్లాడతాను. నా అపరాధమేమిటో చెప్పి రుజువుపర్చమని అడుగుతాను. అపరాధమేమిటో చెప్పకుండా, దాన్ని రుజువుపర్చకుండా శిక్ష విధించటం ఏంన్యాయం?'

వీరభద్రతివారీ ఇలా అన్నాడు. 'నీతోటి ఏమీ మాట్లాడకుండా, నిన్ను కాల్చెయ్యాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. ఇప్పుడీ విషయాన్ని గురించి ఆజాద్‌తో మాట్లాడడానికివెళితే, నీకీ రహస్యం ఎవరు చెప్పారన్న ప్రశ్న వస్తుంది. అంటే నన్ను కాల్చేసేయడం జరుగుతుందన్న మాట!"

నేను ఇంకేమీ మాట్లాడలేక పోయాను. కొంతసేపు ఆలోచించి మళ్ళీ ఇలా అడిగాను. "ఈ స్థితిలో నేనేం చెయ్యాలి?"

వీరభద్రతివారీ "కనీసం నీ ప్రాణాన్నీ, ప్రకాశవతి ప్రాణాన్నీ రక్షించుకోవడం ముఖ్యం! నిన్ను కాల్చేశాక ప్రకాశవతినికూడా కాలుస్తారు. మీరు మిమ్మల్ని రక్షించుకుంటూ, ఏదైనా ఒక 'యాక్షన్'ని చేసి చూపించగలిగితే, పార్టీకి మీమీద ఉన్న అనుమానం పోతుంది. పార్టీ పునరాలోచించుకుని తన నిర్ణయాన్ని మార్చుకుంటుంది. అలాంటప్పుడు మీమీద ఈ నేరాలు వేసినవాళ్ళే అబద్ధీకులని తేలిపోతుంది. మీరిద్దరూ పార్టీ తన నిర్ణయాన్ని మార్చుకునేట్టు వ్యవహరించగలరని నాకువిశ్వాసం ఉంది" అని సలహా యిచ్చారు.

కేంద్ర కమిటీ మీటింగులో ఎవరెవరు పాల్గొన్నారని, పంజాబుకు ప్రతినిధి ఎవరని అడిగాను. వీరభద్రతివారీ ఇంకేమీ చెప్పనన్నాడు.

మానసికంగా చాలా బాధపడుతున్నాను. పగలంతా మౌనంగా పడుకుని ఆలోచించాను. ఇప్పుడు నేనేంచేయ్యాలి? ఇంతవరకూ పోలీసులకే భయపడవలసి వచ్చింది. ప్రతి స్టేషన్‌దగ్గరా, పోస్టాఫీసుదగ్గరా, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ విప్లవకారుల్ని పట్టి యివ్వడానికి పెద్ద పెద్ద ప్రకటనలు అతికించారు. లాహోరు కుట్రకేసులోని ముద్దాయిలనూ, వైస్రాయి ట్రైను క్రింద బాంబు ప్రేల్చినవారిని పట్టియిచ్చిన వారికి పెద్ద పెద్ద బహుమతులు ప్రకటించారు. అన్ని ప్రకటనల్లోనూ నా ఫొటో ఉంటుంది. మిగిలిన అందరి ఫొటోలకంటేకూడా కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. బహుమతుల విషయంలోనూ ఆజాద్‌కూ నాకే అందరికంటే ఎక్కువ బహుమతులు ప్రకటించారు. కనుక, ఇన్నాళ్లూ పోలీసుల కంట పడకుండా తప్పించుకు తిరిగాను. ఇప్పుడు అంతకంటే పెద్ద బాధవచ్చి పడ్డది. నా పార్టీ మిత్రులే నన్ను ఎక్కడచూసినా కాల్చేస్తారు!

నేను తిరిగే పరిసరాలు, ఉండే ప్రదేశాలు నాకథా కమామిషూ పోలీసులకు తెలియదు. పార్టీ సభ్యులకు ఇవన్నీ తెలుసు. ఇంతవరకూ పరప్రభుత్వంనుండి ప్రాణభయం ఉండేది. అది ఒకరకంగా గర్వించదగిన విషయం. ఇప్పుడు మిత్రుల ద్వారా అవమానింపబడి ప్రాణాన్ని రక్షించుకోవడానికి దేవుళ్ళాడుతూ తిరగవలసిన పరిస్థితి! అవమానకరమైన ఈ స్థితిలో ప్రాణరక్షణకంటే ముఖ్యమైంది, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం!

ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి చాలా సులువైన ఆలోచన ఒకటొచ్చింది. నేరుగా డిప్యూటీ కమీషనర్ ఆఫీసుకుగాని, పోలీసు సూపరింటెండెంటు ఆఫీసుకుగాని వెళ్ళడం వీలైతే వాళ్ళిద్దరినిగానీ, లేకపోతే ఒకర్నిగానీ కాల్చేసి, నేనూ పోరాడుతూ చచ్చిపోవడం! అప్పుడే

నలుగురికీ వినపడేట్టు క్రిందవిధంగా అరిచి నా అభిప్రాయాన్ని వ్యక్త పరుద్దామనుకున్నాను. "నామిత్రులు నన్ను సందేహిస్తున్నారు. ప్రాణాల నిచ్చి వారి సందేహాన్ని తొలగిస్తాను! నేను పిరికివాణ్ణిగానీ, విశ్వాస ఘాత కుణ్ణిగానీ కాను."

ఇలాంటివే పిచ్చిపిచ్చి ఊహలేవో వచ్చినాయి.

ఆత్మహత్యా సదృశ్యమైన పని ఏదో ఒకటి చేసేవాణ్ణి. కాని ప్రకాశవతిపట్ల నాకుగల బాధ్యత స్ఫురణకువచ్చి ఆగిపోయాను. మరో రకంగా ఆలోచించసాగాను. నేనొక చిన్న సంఘాన్ని ఏర్పర్చి దాని ద్వారా కొన్ని 'యాక్షన్'లను జరిపితే, సెంట్రల్ కమిటీ తన నిర్ణయాన్ని తప్పకుండా మార్చుకుంటుంది. పంజాబువెళ్ళి కొందరు మిత్రుల్ని కలుసు కుని వారి సహాయంతో కనీసం ముగ్గురు షేర్ దిల్ పోలీసులమీద దాడిచేసి వాళ్ళ ఆయుధాల్ని లాక్కోవాలనుకున్నాను. ఆ ఆయుధాల్ని సెంట్రల్ కమిటీకి వప్పజెప్పినప్పుడు కమిటీ నా గురించి విధిగా పునరాలోచిస్తుంది. పంజాబువెళ్ళి కార్యరంగంలో దిగటమే ప్రస్తుత కర్తవ్యం!

ఆ రాత్రే ఢిల్లీకి తిరుగు ముఖం పట్టాను. స్టేషన్‌లో పోలీసుల కంటపడకుండా, నా స్నేహితులకంట పడకుండా కూడా జాగ్రత్త తీసుకో వాల్సి వచ్చింది! నేను నేరుగా ఢిల్లీలోని బాంబు ఫ్యాక్టరీకి వెళ్ళాను. ప్రకాశవతి అక్కడే ఉన్నది గదామరి? ఆమెను అక్కడనుంచి తీసుకు వెళ్ళటం ముఖ్యం. కేంద్ర కమిటీ నిర్ణయం ఫ్యాక్టరీలో ఉన్న అందరికీ తెలుసునో, తెలియదో, నాకు తెలియదు. ఫ్యాక్టరీలో ఉన్న మిత్రులు, ప్రకాశవతిని తీసుకువెళ్ళడానికి అభ్యంతరం చెపితే, పోరాడడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అలాకాక చర్చలద్వారా నా అపరాధాన్ని, ధ్రువీకరించ డానికి యిష్టపడితే, అందుకూ నేను సిద్ధమే! ఆ సమయములో కైలాస పతి బాంబు ఫ్యాక్టరీలోనే ఉంటాడు.

నేను తలుపు కొట్టాను. గిరివరసింగ్ తలుపు తీశాడు. అతడు నన్నుచూసి చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు సహజంగా ఉంది. ఫ్యాక్టరీలో అనుమానింపదగిన పరిస్థితులు లేవనుకున్నాను. లోపల విమల్, వాత్స్యాయన్-యిద్దరూ కనిపించారు. వాత్స్యాయన్ నన్నుచూసి మౌనంగా ఉండిపోయాడు. అతడు అప్పుడప్పుడూ అలా మౌనంగా ఉండటం మామూలే।

నేరుగా ప్రకాశవతి దగ్గరకు వెళ్ళాను. 'సుద్దాగోచీ' తయారయిన పిక్రిక్ యాసిడ్‌నీ మూటగట్టుకుని వెంటనే బయలుదేరు'. అన్నాను.

నే అలా వెంటనే బయలుదేరమన్నందుకు ప్రకాశవతి ఏమాత్రం ఆశ్చర్యపడలేదు. అప్పటి మా జీవితాల్లో అలాంటి అనుకోని ప్రయాణాలు సహజమే।

ప్రకాశవతికిగానీ, ఇతర మిత్రులకుగానీ అనుమానంకలిగే మాట ఒక్కటీ నేను మాట్లాడలేదు. ప్రవర్తనలోనూ అనుమానానికి ఆస్కారాన్ని యివ్వలేదు.

విమల్ నా దగ్గరకు వచ్చి "ఏమిటీ విషయం? ఎక్కడికి వెళ్ళుతున్నావు?" అని అడిగాడు.

'ఈ యింటిమీద పోలీసుల కన్ను పడ్డట్టుంది. నేను కమలను మరొకచోటుకి తీసుకెళ్ళుతున్నాను. మీరూ సిద్ధంకాండి।' అన్నాను.

ఇంతలో కైలాసపతి వచ్చాడు. అతడి ముఖంలో విస్మయం కొట్టవచ్చినట్టు కనిపించింది. 'కాన్పూరు వస్తానంటివే, ఇదేనన్నమాట రావడం?' అన్నాను కైలాసపతితో.

నేను ప్రాణాలతో తన ఎదుట కనిపించేసరికి కంగారు పడ్డాడు. ఆ కంగారులో నా మాటకు సమాధానం యివ్వలేదు. అతడి సమాధానం కోసం నేనూ ఎదురు చూడలేదు.

తరువాత విమల్ నాతో చెప్పాడు. అతడు కైలాసపతితో 'ఈ యింటిమీద పోలీసుల కన్ను పడ్డదని' నేను అన్నమాటను చెప్పాడట.

"ఇతడు మాట అర్థం వేశాడు. కేంద్రకమిటీ ఇతడ్ని కాల్చెయ్యాలని నిర్ణయించింది. అందుకే కాన్పూరు పిలిపించడం జరిగింది. ఎలాగో తప్పించుకుని పారిపోయి వచ్చాడు. ఇప్పుడు కమలను తీసుకుని పారిపో తున్నాడు!"

అప్పుడు విమల్ ఇలా అన్నాడు. "సెంట్రల్ కమిటీ అలాంటి నిర్ణయాన్ని చేసినట్లయితే, నువ్వు ఇక్కడ ఇన్‌ఛార్జివి కదా ? ఆ నిర్ణయం అమలు జరపటానికి నాకు ఆర్డర్ యివ్వు. నేను అతడ్ని ఇప్పుడే కాలుస్తాను!"

కైలాసపతి సాహసించలేకనో, లేక పరిస్థితి అనుకూలించకనో నన్ను కాల్చడానికి ఆర్డర్ యివ్వలేదు. అయితే, నన్ను వెంబడించి నేను ఎక్కడకుపోతున్నదీ తెలుసుకోమని విమల్‌కు ఆర్డర్ యిచ్చాడు. విమల్ నన్ను వెంబడించడాన్ని నేను గమనించలేదు. ప్రకాశవతిని, జామ్మా మసీదు దగ్గర ఉన్న దేవరాజ భల్లాయింట్లోదిగ పెట్టాను. ఈ దేవరాజ నా బాల్యస్నేహితుడు. సహాధ్యాయి!

అప్పటికీ నేను ప్రకాశవతికి ఏమీ చెప్పలేదు. తనను ఫ్యాక్టరీనుంచి తీసుకొచ్చిన కారణాన్నిగానీ, సెంట్రల్ కమిటీ నిర్ణయాన్నిగానీ ఆమెకు తెలియనివ్వలేదు. ప్రకాశవతికి అనవసరమైన మానసికవ్యధ కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చుకుందామని నా ఉద్దేశ్యం! ఆరోజు సాయం కాలమే నేను లాహోర్ వెళ్ళిపోయాను.

తయారైన పిక్రిక్ యాసిడ్, నైట్రోగ్లిజరిన్ మొదలైన ప్రేలుడు పదార్థాలను జాగ్రత్తగా లాహోరు పట్టుకెళ్ళడానికి వాత్స్యాయన్‌ని సాయం రమ్మన్నాను. అతడు అంగీకరించాడు. సెంట్రల్ కమిటీ నన్ను కాల్చి వేయడానికి చేసిన నిర్ణయం అతడికి ముందే తెలుసు. అతడికి తెలుసునని నాకు తెలియదు. తెలిసికూడా అతడు నాకు సహకరించాడు. అందుకు కారణం నామీద తనకున్న విశ్వాసమూ కావచ్చును లేక నారహస్యాన్ని

తెలుకోవడానిక్కి కావచ్చును! వాత్స్యాయన్‌కి దొరవేషం వేశాను. నేను బంట్రోతు వేషం వేసుకున్నాను. సూట్‌కేసులోకి ప్రేలుడు పదార్థాన్ని సర్దుకొని దాన్ని అతడిదగ్గరే సెకండ్‌క్లాసు పెట్టెలో పెట్టాను. నేను థర్డ్ క్లాసు పెట్టెలో కూర్చున్నాను. లాహోర్ వెళ్ళాక వాత్స్యాయన్ సూట్‌కేసు నాకు యిచ్చేశాడు.

లాహోర్ వెళ్ళాక మిత్రుల్ని కలుసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాను. లాహోర్‌లోని మిత్రులు రెండు ముఠాలుగా చీలిఉన్నారని గమనించాను. ఈ ముఠాలు ఏర్పడ్డం ఏ ప్రత్యేకమైన సిద్ధాంతం కారణంగానూ కాదు! ఆర్థికస్థితి, సాంఘిక పరిస్థితులు చదువు సంధ్యలు - వీటి దృష్ట్యా మిత్రులు ముఠాలుగా చీలిపోయారు. ఉదాహరణకు ఇంద్రపాల్, భాగ్‌రామ్, గులాబ్‌సింగ్, జహంగీరీలాల్-వీరందరూ నిమ్న మధ్య తరగతికి చెందినవారు. వీరు తమ తిండి తాము కష్టపడి సంపాయించుకు తినవలసినవారు. చదువులోనూ వీరు అంతగా అభివృద్ధి చెందలేదు! హిందీ, ఉర్దూ మాత్రం చదువుకున్నారు. వీరందరూ ఒక ముఠాగా కనిపించారు. రెండవ ముఠాలో వాత్స్యాయన్, దేవరాజ్‌సేఠీ, కేవల్‌కృష్ణ, సుఖదేవరాజ్, దుర్గాదాస్‌ఖన్నా ధన్వంతరీ-వీరున్నారు. వీరందరూ యూనివర్శిటీ విద్యనభ్యసించిన విద్యాధికులు. పొట్టకోసం తాము కష్టపడకుండా తమ కుటుంబాలమీద ఆధారపడ్డవారు. ఈ రెండవ ముఠాలోని వారందరికీ ధన్వంతరీ, సుఖదేవరాజ్-నాయకులుగా ఉన్నారు!

నన్ను కాల్చిపెయ్యటానికి నిర్ణయించిన మీటింగులో సుఖదేవరాజ్ గానీ ధన్వంతరీగానీ _ వీరిద్దరిలో ఎవరో ఒకరు ఉండి ఉంటారని ముందే అనుకున్నాను. ఉన్నత మధ్యతరగతి మిత్రుల్లో ధన్వంతరికీ సుఖదేవరాజ్‌కూ పరిచయాలు ఎక్కువగా ఉన్నాయి. నౌజవాన్ భారతసభ కార్యకర్తగా ధన్వంతరికి బాగా పలుకుబడి ఉంది. సుఖదేవరాజ్‌మీద నాకు

ఎప్పుడూ విశ్వాసం లేదు. కాని నేను ఏదైనా కార్యక్రమం ప్రారంభిస్తే ధన్వంతరీ తప్పకుండా సహకరిస్తాడని ఆశించాను.

విద్యార్థుల్లో వాత్స్యాయన్‌కు పరిచయం బాగా ఉంది. అతడప్పటికే హిందీ, ఇంగ్లీషు భాషల్లో కథలూ, కవిత్వాలూ వ్రాస్తూ ఉండేవాడు. ఏదైనా 'యాక్షన్'ని జరపాలంటే డబ్బూ మిత్రులూ కూడ అవసరమౌతారు. గదోడియాస్టోర్ దోపిడీ తరువాత విప్లవసంఘం ఆర్థికంగా మంచి స్థితిలోనే ఉంది. అయితే, నేను వ్యక్తిగతంగా నిర్వహించే కార్యక్రమాలకు విప్లవ సంఘాన్నుండి ఆర్థికసహాయాన్ని ఆశించలేనుకదా? నేను ఉన్నత మధ్యతరగతికి చెందిన మిత్రుల సహాయ సహకారాలతో ఏదో ఒక యాక్షన్‌ని జరపాలని నిశ్చయించుకున్నాను.

నా అభిప్రాయాన్ని వాత్స్యాయన్‌కు చెప్పాను. అతడు నాప్లానును విని మౌనంగా ఉన్నాడు ప్రోత్సహించనూ లేదు. వ్యతిరేకించనూలేదు. ఇతర మిత్రుల్నీ కొందరిని కలుసుకున్నాను. వాళ్ళకూచెప్పాను. వాళ్ళు విని ఊరుకున్నారు. నన్ను కాల్చేయ్యాలన్న నిర్ణయం వాళ్ళందరికీ తెలిసిందని నేను అనుకోలేదు. స్థానికనాయకులు ధన్వంతరీ, సుఖదేవరాజ్‌లు కావడంవల్లా, నేను స్థానిక నాయకుణ్ణి కాకపోవడంవల్లా వీళ్ళునాతో చొరవగా మాట్లాడకోలేక పోతున్నారనుకున్నాను. ఒకమాటు ధన్వంతరీని కల్సుకుని మాట్లాడదామనుకున్నాను. అదీ జరగలేదు.

ఉన్నత మధ్యతరగతి మిత్రులవల్ల ప్రయోజనంలేదని నిర్ణయించుకుని నిమ్న మధ్యతరగతి మిత్రులను కల్సుకోవడానికి ప్రయత్నించాను. ఇంద్రపాల్‌ని కలుసుకున్నాను. షేర్‌దిల్ పోలీసుంమీద దాడిచేసి ఆయుధాల్ని సంపాయించాలన్న నాప్లానును ఇంద్రపాల్‌కు చెప్పాను. ఈ యాక్షన్‌కు సహకరించమని చెప్పడానికి అతణ్ని ధన్వంతరీ దగ్గరకు పంపించాను. పంజాబుకు ఇన్‌ఛార్జీ ధన్వంతరీ అని ఇంద్రపాల్‌కు మొదటే చెప్పాను.

సెంట్రల్ కమిటీ నిర్ణయాన్ని నేను ఇంద్రపాల్‌కు తెలియపర్చ లేదు. అలా తెలియపర్చడంవల్ల మిత్రుల దృష్టిలో నా విలువను నేను చంపుకున్నవాడినీ అవుతాను, విప్లవ సంఘంపట్ల మిత్రుల దృష్టికోణాన్ని మార్చినవాడినీ అవుతాను।

ఇంద్రపాల్, ధన్వంతరీతో మాట్లాడాడు. ధన్వంతరీ తనను ఏకాంత ప్రదేశంలో కల్సుకోమని కబురుపంపాడు నాకు। 'ఏకాంతంలో కల్సు కోవడం దేనికి? నాకూ అతడికీ పరిచయులైన కొందరు మిత్రుల సమక్ష ములో మాట్లాడుకుందాము' అన్నాను నేను. ధన్వంతరీ నా ప్రతిపాదనను తిరస్కరించాడు.

నన్ను ఏకాంతంలో కల్సుకోమనడానికి కారణం ఏమిటో ఊహిం చుకోవడం కష్టంకాదు। నేనా ప్రతిపాదనను తిరస్కరించాను.

ఏకాంతంలో కల్సుకోడానికి నేను తిరస్కరించేసరికి ఇంద్రపాల్‌కు ఆశ్చర్యం వేసింది. నేను తిరస్కరించిన కారణాన్ని అడిగాడు. యధా ర్థం చెప్పాను. "నన్ను ఏకాంత ప్రదేశానికి పిలిపించి, ధన్వంతరీ, సుఖ దేవరాజ్ - కాల్చేయాలని చూస్తున్నారు।" అని చెప్పాను.

ఇంద్రపాల్ చకితుడయ్యాడు. కోపమూ వచ్చిందతడికి. సమస్యను ఆజాద్‌ముందు పెట్టమని సలహా యిచ్చాడు.

అప్పుడు నేను ఇలా అన్నాను ఇంద్రపాల్‌తో "వీళ్ళు నాకు ఆజాద్ ఎక్కడున్నాడో చెప్పడంలేదు. నామీద ఆజాద్‌కు ఏవేవో చాడీలు చెప్పారు. సెంట్రల్ కమిటీలో ఆజాద్ నన్ను కాల్చివేయాలని నిర్ణ యించినట్లు వీళ్ళు ప్రచారం చేస్తున్నారు. నేను ఇలా అంటున్నాను.

"నా తప్పేమిటో నాకు చెప్పండి. సమస్యను ఆజాద్ ముందు ఉంచుదాం. నేను నామీద మోపిన అపరాధాలు నిరాధారాలని రుజువు చేసుకుంటాను. అప్పటికీ ఆజాద్‌కుగానీ, సెంట్రల్ కమిటీలోని మెజార్టీ సభ్యులకుకానీ, నేను అపరాధినేనన్న విశ్వాసం ఉంటే నిరభ్యంతరంగా కాల్చెయ్యవచ్చు! కాని వీళ్ళు తమతప్పు బైటపడుతుందని, నాకా అవకాశాన్ని యివ్వడం లేదు."

ఇంద్రపాల్ మరీ కోపగించుకున్నాడు. అతడు పిస్తోలు నొకదాన్ని తీసుకుని నాతోపాటు ధన్వంతరీని ఏకాంత స్థానంలో కల్సుకోవడానికి వచ్చేస్తానన్నాడు. భాగ్‌రామ్‌నికూడా తోడురమ్మని పిలిచాడు.

ధన్వంతరీ నన్ను డి. ఏ. వీ. కాలేజి బోర్డింగ్‌హౌస్‌లో, సూర్యోదయ సమయమప్పుడు కలుసుకోమని కబురుపెట్టాడు పంజాబులో వేసంగి సెలవులు ఇతర ప్రాంతాలకంటే ఆలస్యంగా యిస్తారు. స్కూళ్ళు, కాలేజీలు తిరిగి తెరవడముకూడా యితర ప్రాంతాలకంటే ఆలస్యంగానే జరుగుతుంది. అవి వేసవి సెలవులు. బోర్డింగ్‌హౌస్‌లో చాలా కొద్ది మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. బోర్డింగ్‌హౌస్, చుట్టూ భవనాలతో కప్పబడి రహస్యాత్మకంగా ఉంటుంది. మేము ఆ బోర్డింగ్‌హౌస్‌కు వెళ్ళాం. అప్పుడు ధన్వంతరీ నడవాలో మంచంవేసుకు కూర్చునిఉన్నాడు. విద్యార్థులు లేకపోవడంవల్ల చుట్టూఉన్న గదులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. అయితే, ఆ గదుల్లో ఒకరిద్దరైనా తలుపుల చాటున దాక్కుని ఉంటారని నేను అనుమానించాను. నేను ఇద్దరు మిత్రులతో రావడం చూసేసరికి ధన్వంతరీ ముఖంలో సహజంగాఉండే చిరునవ్వుమాయమైంది. కోపంతో ముఖం ఎర్రబడ్డది. అతడి కోపానికి కారణం తెలిసినా తెలియనట్టు చిరునవ్వు నవ్వుతూ "నిన్ను కలుసుకోవడానికి ఎంతో ఆత్రుత పడుతున్నాను!" అన్నాను.

"నిన్ను ఒక్కడినే రమ్మన్నానుగదా? వీళ్ళనెందుకు వెంట తీసుకొచ్చావు?" అని అన్నాడు ధన్వంతరీ. అతడి స్వరం హుందాగా దాష్టీకంగా ఉంది.

"మేము ఊరినుంచి కలిసివస్తున్నాము. అవర్నే ఇటువచ్చేశాం. మనం ఒంటరిగా మాట్లాడుకోవలసింది ఏమైనా ఉంటే, అటుపోయి మాట్లాడుకుందాం పద!" అన్నాను.

అందుకతడు ఒప్పుకోలేదు. మరి అతడుకోరినవిధంగా ఏకాంతంలో కల్సుకోవడానికి నేను మాత్రం ఎందుకు ఒప్పుకుంటాను?

ఇప్పటివరకూ ధన్వంతరీ నామాట వింటాడని, నా సమస్యను ఆజాద్‌దగ్గర ఉంచడంలో సహకరిస్తాడని ఎంతో ఆశించాను. కాని ధన్వంతరీ అసలు మాట్లాడటానికే అంగీకరించలేదు. చాలా నిరాశ పడిపోయాను! ఇంతవరకూ నా ఈసమస్యను ఒక్క ఇంద్రపాల్‌కేచెప్పాను. మరెవ్వరికీ చెప్పలేదు. మిత్రులెవ్వరూ నాగురించి సెంట్రల్ కమిటీచేసిన నిర్ణయం నాకు తెలుసునని అనుకోవడంలేదు. కాన్పూర్‌లో స్టేషన్‌దగ్గరకు నన్ను తీసుకువెళ్ళటానికి వచ్చిన మిత్రులు కనపడకపోవటంతో అనుశాసనాన్ని అతిక్రమించి, అటూ యిటూ తిరుగుతున్నానని మాత్రం మిత్రులు అనుకున్నారు. మరి నన్ను ఒంటరిగా కలుసుకోమన్నప్పుడు నేను ఇద్దరి మిత్రుల్ని వెంటబెట్టుకు వెళ్ళడాన్ని ధన్వంతరీ ఎలా అర్థం చేసుకున్నాడో నాకు తెలియదు. నిర్ణయంతెలిసి జాగ్రత్తకోసం మిత్రుల్ని వెంటతెచ్చాననుకున్నాడో, విప్లవ సంఘపు అనుశాసనాన్ని నిర్లక్ష్యంచేసి అకారణంగానే తెచ్చాననుకున్నాడో! పార్టీ నిర్ణయాన్ని అనుసరించి నన్ను కాల్చివెయ్యలేకపోవడంతో ధన్వంతరీ ఒకరకంగా అవమానపడుతున్నాడు. నేను పోలీసుల్ని ఆశ్రయించి విప్లవసంఘానికి చెరుపు చేయకముందే కాల్చెయ్యాలని దృఢచిత్తంతో ఉన్నాడు.

ధన్వంతరీ, వాత్స్యాయన్ - ఇతర మిత్రులమంది సహాయం లభించ లేదు. నాకున్న పరిమితమైన ఆయుధాలతో ఇంద్రపాల్, భాగ్‌రామ్‌ల సహకారంతో ఏదో ఒక యాక్షన్‌ను జరిపేయాలని నిర్ణయించుకున్నాను. నేను ఢిల్లీనుంచి తెచ్చిన పిక్రిక్ యాసిడ్, నైట్రోగ్లిజరిన్ మొదలైన ప్రేలుడు పదార్థాలు ఎటూ ఉండనేఉన్నాయ్. మేము మాల్‌రోడ్డు ప్రక్కనే ఉన్న పోలీసుక్వార్టర్లను బాంబులతో పడగొట్టాలనుకున్నాం. ఆ క్వార్టర్లను పడగొట్టడానికి వాటంతట అవిగా ప్రేలే బాంబుల్ని ఉపయోగించాలను కున్నాం. త్వరగా ఏదో ఒకటిచేసి, ధన్వంతరీ, సుఖదేవరాజ్ - ఇద్దరూ నాకంటె అయోగ్యులని నిరూపించాలని నేను ఆత్రుతపడుతున్నాను.

* * *

# 6. అగ్నివలయం

బహావల్‌పూర్ రోడ్డులోని బంగళాలో బాంబు ప్రేలిన తరువాత జరిగిన విషయం; నేను లాహోరునుండి ఢిల్లీ వెళుతూ ఇంద్రపాల్‌తో ఇలా అన్నాను. "నువ్వు విప్లవసంఘంలో చాలా రోజులు బాధ్యతాయుతంగా పని చేశావు. కొన్నాళ్ళపాటు నేను లాహోర్‌లో ఉండను. నా బదులు నువ్వు పంజాబుకు ఆర్గనైజరుగా వ్యవహరించు!" అని చెప్పాను. అతనికి ఇలా చెప్పేముందు నేనీ విషయమై ఆజాద్‌తో మాటమాత్రమైనా అనలేదు.

ఇంద్రపాల్ తన పరిమితమైన అవకాశాల్ని వినియోగించుకుని స్వంతంగా విప్లవకార్యక్రమాల్ని ప్రారంభించాడు. అతడు తన యీ ఉద్యమానికి 'అగ్నివలయం' అని పేరు పెట్టాడు. అతడీ ఉద్యమంద్వారా 1933 జులై నెలలో ఆరుచోట్ల బాంబుల్ని ప్రేల్చాడు. లాహోర్, అమృతసర్, రావల్పిండి, షేఖ్‌పురా, గుజరావాలా, లాయల్పూరు – ఈ పట్టణాల్లో బాంబులు ప్రేలాయి.

ఈ మొత్తం ప్రయత్నాన్ని ఇంద్రపాల్ స్వంతంగా చేశాడు. జహంగీరీలాల్, కుందన్‌లాల్, భాగ్‌రామ్, జయప్రకాశ్, దయానతరామ్, హంసరాజ్ - ఈ మిత్రులు ఇంద్రపాల్‌తో సహకరించి అతడి కార్యక్రమాలకు తోడ్పడ్డారు. కాలేజీ విద్యనభ్యసించిన మిత్రులతో ఇంద్రపాల్‌కు ఎలాంటి సంబంధమూలేకపోవడం గమనార్హం! ధన్వంతరీ, సుఖదేవరాజు తాము పంజాబుకు ఆర్గనైజర్లమని చెప్పుకుంటున్నారు. దాన్ని ఇంద్రపాల్ సహించలేకపోయాడు. నేనుతప్ప మరొకరు పంజాబుకు ఆర్గనైజర్‌గా ఉండడం ఇంద్రపాల్‌కు గిట్టదు!

ఇంద్రపాల్‌కు పిక్రిక్‌యాసిడ్ లభ్యంకాలేదు. అతడు గులాబ్ సింగ్, హంసరాజ్‌ల సహాయంతో క్రొత్తరకం బాంబుల్ని తయారు చేసు

కున్నాడు. బాణసంచాకు ఉపయోగించే ప్రేలుడు పదార్థాన్ని సిగరెట్ డబ్బాల్లో కూరి, వాటంతట అవి ప్రేలేట్లు ఏర్పాటు చేశాడు. వాటంతటవి ప్రేలేట్లు చేయడం చాలా సహజం. మైనపు వత్తి చివర్న త్వరగానిప్పంటుకునే మందులో తడిపిన తాడును జతచేసి, ఆ త్రాడు రెండవ కొసను బాంబులకు జతచేసేవాడు. మైనపువత్తి వెలిగించి తను వెళ్ళిపోయేవాడు. వత్తిసాంతం వెలిగాక చివర్నవున్న త్రాడు అంటుకుని బాంబులకు నిప్పునందించేది బాంబులు ప్రేలేవి. ఈ బాంబులుకొవ్వత్తిని వెలిగించిన 5,6 గంటల తరువాతగాని ప్రేలవు. ఒకచోట ఇలాంటి బాంబే ప్రేలింది. దాన్ని పరీక్షించడానికి ఇద్దరు కానిస్టేబుళ్ళూ, ఒక సబ్‌యినస్పెక్టరువెళ్ళి పరీక్షిస్తుండగా వాళ్ళుముగ్గురూ, అనుకోకుండా మరికొన్ని బాంబులుప్రేలి చనిపోవడం జరిగింది!

ఇంద్రపాల్ ఇలా బాంబుల్ని ప్రేల్చడం ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి వినోదాన్ని తిలకిద్దామని మాత్రం కాదు. పర ప్రభుత్వంమీద దెబ్బ తీయడానికి ప్రజల సహకారం అవసరమని అతడికి తెలుసు. కష్టపడి పొట్టపోసుకునే మిత్రుల కష్టార్జితం నుండి, కొంత డబ్బును వసూలు చేశాడు. ఉర్దూలో, తమ ఆదర్శాన్ని తెలిపే కరపత్రాన్ని ప్రచురించడానికి ఓచిన్న హాండు ప్రస్సును కూడా ఏర్పాటు చేసుకున్నాడు.

వీళ్ళు తెలతెల వారుతుండగా బాంబుల్ని ప్రేల్చారు. బాంబులు ప్రేల్చడానికి ముందురాత్రి తమ కరపత్రాల్ని పంచారు. ఈ కరపత్రాన్ని రెండవ లాహోరు కుట్రకేసులో పోలీసులు కోర్టులో దాఖలు చేశారు. ఈ కరపత్రపు కోర్టునెం. E.X P.I.A E.! కరపత్రం ఉర్దూలోఉంది. అనువదించి క్రింద ఉదహరిస్తున్నాను.

## 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్'

భారతమాత గౌరవాన్ని కాపాడడానికి దీక్షాకంకణులైన స్వాతంత్రేచ్ఛగల పంజాబు ప్రజలారా!

'పారతంత్ర్య భారాన్ని ఇంక ఎక్కువ రోజులు మోయడం సంభవంకాదు. భారతమాతయొక్క ఈ కళంకాన్ని మీరు మీకవోష్ణరక్తంతో కడిగివేయటానికి కంకణం కట్టుకున్నారు. జీవితాన్ని తర్పణంచేస్తూ కదనరంగానికి కదలివచ్చారు. మీ ఈ ప్రయత్నానికి అడ్డు తగిలిన ప్రతివాడు దేశద్రోహి, జాతికి శత్రువు అవుతాడు. ఈ ప్రకృతిలో ప్రతిజీవి స్వాతంత్ర్యంగా ఉంది. తన్నుతాను పాలించుకుంటున్నది। ఈ ప్రపంచం ఒక మహాసంగ్రామక్షేత్రం. ఈ క్షేత్రంలో, జీవితాన్ని తర్పణచేయడానికి సాహసించి, ముందుకు వచ్చినవారే జీవించి ఉండటానికి అర్హులు.

'చావటం నేర్చుకున్ననాడే బ్రతకగలం'

శత్రువును ఓడించటానికి మనం యుద్ధంచేయక తప్పదు. అయితే ఆయుధబలంతో, పశుబలంతో - వికటాట్టహాసం చేస్తున్న శత్రువుతో పోరాడడానికి సత్యాగ్రహం పేరుతో నిరాయుధులైన ప్రజలను ప్రోత్సహించడం స్వాతంత్ర్య పోరాటం అనిపించుకోదు. అది ఆత్మహత్యాసదృశ్యమైంది. అహింసాత్మకమైన సత్యాగ్రహాన్ని ప్రజలు చవిచూచారు. సత్యాగ్రహోద్యమంలో వేలసంఖ్యలో దేశసోదరులు జైళ్లల్లో మ్రగ్గారు. ఎందరో భారతమాత ముద్దుబిడ్డలు అసువుల్ని బాశారు. అయినా మనం సఫలతను పొందలేకపోయాం. అసఫలతే మనకు మిగిలింది. గడచిన 10, 15 సంవత్సరాలుగా దేశచరిత్ర మనకేమి చెప్తున్నది? పీడితులూ, విరుపాయులూ, నిరస్త్రులూ అయిన ప్రజల రక్తాన్ని ప్రవహింపజేసినమాత్రాన మనకు జరిగే అన్యాయాలూ, అత్యాచారాలు ఆగిపోవు। మన రక్తాన్ని ప్రవహింపజేసుకుని, మనం కష్టాలను అనుభవించినంతమాత్రాన స్వాతంత్ర్యంరాదు. స్వాతంత్ర్యాన్ని పొందటానికి శత్రువునెదిర్చి, దాస్యశృంఖలాను త్రెంచుకోవడం అవసరం. అన్యాయమూ, అత్యాచారాలే పునాదిగాకల ఈ ప్రభుత్వాన్ని సమూలంగా నాశనంచేయాలి।

స్వాతంత్ర్య పోరాటంలో విజయాన్ని సాధించడానికి మనమంద రము శక్తివంతమైన సైన్యంలా సంఘటితమవ్వాలి. మనలో ఐక్యతలేక పోతే, మనం పీడిన విరిసతంలా ఉంచే శత్రువును జయించలేం। మనమే దెబ్బతింటాం. పెషావర్‌లో దాదాపు రెండువందలమంది భారతీయుల్ని బలిపెట్టుకుని మనమేంసాధించాం? చిటగాంగ్ శస్త్రాగారంమీద దాడి జరి పిన హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ మీకోసం నూతనమైన మార్గాన్ని ప్రశస్తంజేసింది. మనం సంఘటితమై సరియైనమార్గాన్న పోరా డితే విజయాన్ని తప్పక పొందగలం।

పర ప్రభుత్వానికి ప్రతినిధి అయిన వైస్రాయి, ఇన్నాళ్ళూ భారత దేశంపట్ల తనకు సానుభూతికలదని చెప్పుకున్నాడు. ఇప్పుడు అతడి అసలు రూపం బైటపడ్డది. ప్రజలు సాహసాన్ని ప్రదర్శించవలసిన సమయం వచ్చింది. ముందుగాచెప్పి శత్రువుమీదకు యుద్ధానికి వెళ్ళడం యుద్ధనీతికే విరుద్ధం. ఎక్కడికక్కడ ప్రజలు అజేయులైన సైనికుల్లా తయారు కావాలి. మీశక్తి సమర్థతలను పెంపొందించి, మీకు ఆయుధాల నివ్వడానికి హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ సిద్ధంగాఉంది.

## 'ఇది తుది సమరం అటో ఇటో తేల్చేస్తుంది!'

ఇంద్రపాల్‌కు ఈ మాత్రం కరపత్రం ప్రకటించడంతో సంతృప్తి కలగలేదు. ప్రజల్ని ప్రభావితంచేసే యాక్షన్ ఏదైనా జరపాలని చూస్తు న్నాడు. ఇంద్రపాల్, హంస్‌రాజ్ దగ్గరకు వెళ్ళాడు. అతడు మళ్ళీ 'మూర్ఛాగ్యాస్' తయారుచేసి యిస్తానని ఇంద్రపాల్‌ను నమ్మించాడు. ఇంద్రపాల్ తన బీద మిత్రులనడిగి 200 రూపాయలు ప్రోగుచేసి హంస రాజ్‌కిచ్చాడు.

అయినా హంసరాజ్ గ్యాసును తయారుచేసి యివ్వలేదు. ఏవేవో వంకలు చెపుతున్నాడు. ఇంద్రపాల్‌కు పెద్దకోపం వచ్చింది. 'హంసరాజ్

తను పోలీసుల చేతుల్లో పడతానేమోననే భయంచేత గ్యాస్ తయారుచేసి యివ్వడంలేదు" అనుకున్నాడు ఇంద్రపాల్. అతడిని ఏదోవిధంగా బలవంతపెట్టి పని జరుపుకోవాలనుకున్నాడు.

ఇంద్రపాల్ ఒక గమ్మత్తు చేశాడు. ఒక సూట్‌కేసులో కొన్ని ప్రేలుడు పదార్థాల్ని పెట్టుకున్నాడు. ఆ పదార్థాలు కొంతసేపటి తరువాత వాటంతటవి ప్రేలేట్టు ఏర్పాటు చేసుకున్నాడు. ఒక కొట్టుదగ్గర 'లస్సీ' త్రాగుతూ పెట్టెను అక్కడేవదిలి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి పెట్టెలోని ప్రేలుడు పదార్థాలు ప్రేలాయి. ఎవరికీ హానిజరగనంత తేలికైన పదార్థాలే అందులో పెట్టాడు. పదార్థాలు ప్రేలాక ఆపెట్టెలోని కొన్ని కాగితాలు విరజిమ్ముకున్నాయి. ఆ కాగితాల్లో ఒకదానిమీద హంసరాజ్ నిజమైన అడ్రసును వ్రాసిపెట్టాడు ఇంద్రపాల్.

పోలీసులువచ్చి ప్రేలుడు సంభవించిన ప్రదేశాన్నీ, పెట్టెనూ, కాగితాలనూ పరీక్షించారు. హంస్‌రాజ్ అడ్రసు కనుపించింది. ఇంద్రపాల్ హంస్‌రాజ్‌కో జాబు వ్రాశాడు. అందులో "నీమీద పోలీసులకు అనుమానం కలిగింది. నీవు మాదగ్గరకువస్తే తగిన రక్షణకు ఏర్పాటు చేయగలము" అని వ్రాశాడు. నాలుగైదు రోజుల తరువాత నిజంగానే పోలీసులు హంసరాజ్ యింటిని సోదాచేశారు. అప్పుడు హంసరాజ్ యింట్లో లేడు. కనుక అరెస్టుకాలేదు. అతడుపరారై లాహోరువచ్చాడు. అయినా మూర్ఛాగ్యాస్ తయారుచేసి యివ్వలేదు. కుంటిసాకుల్ని అడ్డుపెడుతూనే వున్నాడు.

హంసరాజ్ ఎంతకీ తనకు రక్షణ ఏర్పాట్లు చేయించమనీ, తన ఆర్థికబాధల్ని తొలగించమనీ అడిగేవాడేగాని గ్యాస్‌ను మాత్రం తయారు చేసి ఇచ్చేవాడుకాదు.

ఇంద్రపాల్ దగ్గర డబ్బులేదు. తను సంపాయించిన డబ్బునూ, మిత్రులు యిచ్చిన డబ్బునూ బాంబులు చేయడానికీ, ప్రస్సును కొను

క్కోవడానికి, మూర్ఛాగ్యాస్‌కోసమూ వాడేవాడు. అప్పుడే ఇంద్రపాల్‌కూ, మరికొందరు మిత్రులకూ ఉద్యోగాలు ఊడిపోయాయి.

హంసరాజ్ తన వైర్‌లెస్ ప్రయోగంద్వారా పరిచయులదగ్గర కొంతడబ్బును సంపాదించగలిగేవాడు. అయితే, ఆ డబ్బును తానొక్కడే వాడుకునేవాడు. యితర మిత్రుల కోసరం ఖర్చుపెట్టేవాడుకాదు. క్రొత్తగా పరిచయమైన వారిమీద ప్రభావాన్ని వేయటానికి తానే తన వైర్‌లెస్ ప్రయోగం ద్వారా వైస్రాయి ట్రైను క్రింద బాంబు ప్రేల్చానని చెప్పుకునేవాడు. అప్పటికి ఏ కుట్రకేసుద్వారానూ వైస్రాయి ట్రైను క్రింద బాంబు పేల్చిన రహస్యం బైటపడలేదు. కనుక, హంసరాజ్ చెప్పింది నమ్మేవారు।

ఇంద్రపాల్ మిత్రులు కొందరు అజాగ్రత్తగా వ్యవహరించారు. అందువల్ల ఇంద్రపాల్‌ను గురించిన సమాచారం పోలీసులకు అందింది. ఇంద్రపాల్‌ని పోలీసులు అనుమానించారు. అతడు తాను ప్రమాదంలో ఉండికూడా అన్యాయాన్ని వ్యతిరేకించి నా కోసరం పోరాడడానికి సిద్ధమయ్యాడు।

* * * * * *

కొద్దిరోజుల తరువాత దుర్గాదాస్‌ఖన్నా తనను కలుసుకోమని నాకు కబురు పెట్టాడు. లాహోరులో ఉన్న విప్లవసంఘ మిత్రుల్లో ఇతడు తెలివైనవాడు. లోతుగా ఆలోచించగల మనిషి. బహుశా నన్ను కాల్చడానికి ఇతణ్ని ఉపయోగిస్తున్నారేమో అనుకున్నాను. ఎలాపోయి ఎలావస్తుందోనని ముందుగా చెప్పకుండా అతడి ఇంటికే వెళ్ళి కలుసుకున్నాను, ఖన్నాని। అంతక్రితం ఖన్నాకూ నాకూ అంత పరిచయం లేదు. ఒక్కమాటు మాత్రం రాత్రిపూట గోల్‌బాగ్‌లో కలుసుకున్నాము. అప్పుడు ప్రకాశవతిని గురించి ప్రశ్నించాడు.

వెనక కలుసుకున్నప్పుడూ ఖన్నా స్పష్టంగా మాట్లాడాడు. "ప్రకాశవతి పార్టీ పనికి, పనికి వస్తుందంటావా? లేక నీకు ఆమెపట్ల వ్యక్తిగతమైన ఆసక్తి ఉండడంవల్ల పార్టీలోకి తెచ్చావా?" అని అడిగాడు.

నేనూ అప్పుడు స్పష్టంగానే సమాధానం చెప్పాను: "ఇంతక్రితం నేను ప్రకాశవతిని అసలు ఎరుగను. ఇప్పుడామెను బాగా అర్థంచేసుకున్నాను. నేనామెను ప్రేమిస్తున్నాను. గౌరవిస్తున్నాను. ఆమె సాహసం కలది. తెలివితేటలు కలది. పార్టీలో పనిచేయటానికి అవుసరమైన యోగ్యతలన్నీ ఆమెలో ఉన్నాయి!" అన్నాను.

అప్పుడు దుర్గాదాస్ నాకో సలహాను కూడా యిచ్చాడు. "ప్రకాశవతి బంధువులు ఇలా జరిగినందుకు చాలా అవమానపడుతున్నారు. వాళ్ళేకరకంగా పగదీర్చుకోవాలని చూస్తున్నారు. నువ్వు జాగ్రత్తగా ఉండు. సాధ్యమైనవరకు ప్రకాశవతిని లాహోరులో ఉంచకు!" అన్నాడు.

ఈమాటు కలుసుకున్నప్పుడూ ప్రకాశవతి విషయాన్ని ప్రస్తావించాడు ఖన్నా. "నువ్వు ఆమెను గౌరవిస్తున్నానంటివే? ఆమెను గురించి కొన్ని చెడ్డవార్తలను విన్నాను నేను!" అన్నాడు ఖన్నా.

అతడలా అనడంతో నా మనస్సుకు చాలా బాధ కలిగింది. "ఆ చెడ్డవార్తలు చెప్పేవాళ్ళెవరో నాయెదుట చెప్పమనండి!" అన్నాను.

మేము ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నాము. ఖన్నా ఇలా అడిగాడు. "నువ్వు ఆమెను పెండ్లిచేసుకున్నావా?"

నేను అవునని తల వూపాను.

తరువాత ధన్వంతరీ నన్ను కలుసుకోగోరుతున్నట్లు చెప్పాడు.

"నేనూ అతడ్ని కలుసుకోవాలనుకుంటున్నాను. నువ్వు నన్ను అతడి దగ్గరకు తీసుకువెళ్ళు!" అన్నాను.

దుర్గాదాస్ రెండు క్షణాలు ఆలోచించి "నీకో విషయం చెప్పాలను

కుంటున్నాను. నువ్వు ఎవరికోటీ చెప్పనని మాటయివ్వు!" అని అన్నాడు.

నేను మాట యిచ్చాను.

"భయపడవుకదా?"

"నేనేమీ భయపడను!"

"కేంద్రకమిటీ నిన్ను కాల్చెయ్యాలని నిర్ణయించింది. అందుకే యిప్పుడు ధన్వంతరీ నిన్ను పిలిపించాడు!"

"ఈ విషయం నాకు ముందే తెలుసు! కేంద్రకమిటీ నన్ను కాల్చె య్యడానికి నిర్ణయంచేసిందని లాహోరు రాకముందే నేను తెలుసుకున్నాను. నువ్వే నాకు చెప్పాపనీ, నీమీదకు వస్తుందనీ నీవేమీ భయపడనవసరం లేదు! కనుకే, నిన్ను తీసుకెళ్ళమని అడిగాను! నువ్వు ధన్వంతరీతో నేను చెప్పమన్నట్టుగా ఈ మాటలు చెప్పు. "నాకు వాళ్ళ కుతంత్రం ఎన్నడో తెలిసిపోయింది. ఈ ఒక్క విషయాన్నిబట్టి అయినా విప్లవ సంఘ సభ్యులు ఎవరిని అభిమానిస్తున్నారో తెలుసుకోవచ్చును! ఇది ధన్వంతరీ చేస్తున్న మోసం. అసలు సెంట్రల్ కమిటీ నిర్ణయమే చేయ లేదు. ఇతడు వట్టి అబద్ధాలు వాగుతున్నాడు. అయినప్పటికీ, సెంట్రల్ కమిటీ నాతప్పులేమిటోచెప్పి, వాటిని నిర్ణయించి శిక్ష విధించితే, నేను అనుభవించడానికి సిద్ధంగాఉన్నాను! అలాకాక, ధన్వంతరీ వ్యక్తిగతంగా నాతోటి పోట్లాడాలనుకుంటాడా? అందుకూ నేను సిద్ధమే" అన్నాను.

"ఇది చాలా విచారకరమైన విషయం. అసలు ఇలాంటి నిర్ణయం ఎందుకు జరిగింది?" దుర్గాదాసు అన్నాడు.

"నా అపరాధమేమిటో నాకు చెప్పలేదు. వాళ్ళు నామీద వేసిన అపరాధాలకు సమాధానము చెప్పుకునే అవకాశమూ నాకు యివ్వలేదు. ఇది ధన్వంతరీ, సుఖదేవరాజ్-నాయకత్వంకోసం పన్నినకుట్ర! సెంట్రల్

కమిటీ ఇలాంటి నిర్ణయం చేయలేదు. చేయదు. సమ్ముఖంలో సెంట్రల్ కమిటీ మీటింగును ఏర్పాటు చేయమనండి. ఆ మీటింగుకు స్థానిక మిత్రుల్ని కొందర్ని ఆహ్వానించమనండి. నా వ్యతిరేకుల్ని నా అపరాధాలేమిటో చెప్పకోమనండి. నేను చెప్పవలసింది చెప్పుకుంటాను. అప్పుడు కమిటీ ఏదినిర్ణయిస్తే ఆ నిర్ణయానికి నేను బాధ్యుడనై వుంటాను. అంతే గాని, ఇలా కుక్కచావు చావటానికి నేను ఎన్నటికీ ఒప్పుకోను. నాకూ సాయుధులైన ఆరుగురు మిత్రులున్నారు. అలాంటి స్థితివస్తే కంఠంలో ఊపిరున్నవరకూ నేను పిస్తోలుకాలుస్తూనే ఉంటాను. ఎదురుగా ఆజాద్ వచ్చి నిలబడ్డా లెక్కచేయను! నామీద వేసిన అపరాధాలకు తగు సమాధానం యిచ్చే అవకాశం నాకు యివ్వకుండా నన్నుచంపేస్తే, అది విప్లవకారుల జీవితాలకే కళంకమయి కూర్చుంటుంది! సాధ్యమైనవరకు నేను అలాంటిది జరగనివ్వను. వీళ్ళొకవేళ నన్ను దొంగచాటుగా చంపేస్తారూ? అది విప్లవసంఘానికే గొడ్డలిపెట్టు అవుతుంది! అలాంటిదే జరిగితే, నన్ను అభిమానించి, నాకోసం ప్రాణాలనయినా ఇవ్వడానికి సిద్ధంగాఉన్న మిత్రులు వీళ్ళను ఎన్నటికీ క్షమించరు! వీళ్ళ అంతు తేలుస్తారు. నన్ను రక్షించడానికి, ముందుగా నాకీవిషయాన్ని చెప్పిన మిత్రులు కూడా విజాయితీపరులే! వాళ్ళు అవుసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుదీయనివారే! ఆజాద్ ఇలాంటి నిర్ణయాన్నిచేశాడని వాళ్ళెవరూ నమ్మడంలేదు. 'ధన్వంతరీ, సుఖదేవరాజ్ - కేవలం ఆజాద్‌పేరును తమ స్వార్థంకోసం వాడుకుంటున్నారని' మాత్రమే యిక్కడి మిత్రులు అనుకుంటున్నారు లేకపోతే, ఆజాద్‌కు చాడీలుచెప్పి, అతడ్ని మూర్ఖుణిచేసి వీళ్ళు ఆట ఆడుతున్నారని అనుకుంటున్నారు." అని అన్నాను.

మానసికంగా బాధపడుతున్నాను, కోపమూబాగానే ఉంది. వీటితో పాటు కొంత కుతంత్రాన్ని కూడా అనుసరించాను. ఇలా కుతంత్రంగా వ్యవహరించినందుకు నేను ఎన్నడూ బాధపడలేదు. మా విప్లవ సంఘం

లోని విరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ నేను జరిపిన పోరాటంలో కుతంత్రమూ ఒక భాగమనే అనుకున్నాను.

దుర్గాదాస్‌కూడా నాకు ధైర్యాన్ని యిచ్చాడు. "నీమీద మోపిన అపరాధాల గురించి సమాధానం చెప్పుకునే అవకాశం నీకు యివ్వకపోవడం దురన్యాయం! నీమీద మోపిన అపరాధాలు కూడా ఏమంత తీవ్రమైనవికావు. వాటిల్లో ఒక్కటీ స్పష్టమైన అపరాధమని నాకు అనిపించలేదు!" అని అన్నాడు.

అప్పటివరకూ అసలు నామీదవేసిన అపరాధాలేమిటో కూడా నాకు తెలియదు. దుర్గాదాస్‌ని ఇలా అడిగాను. "అసలు నామీద వేసిన అపరాధాలేమిటి? నాకు ఒక్కటీ తెలియదు!"

దుర్గాదాస్ ఇలా చెప్పాడు: "నీమీద చాలా అపరాధాలు వేశారు. ప్రకాశవతిని కేవలం నీ స్వార్థం కోసరమే విప్లవ సంఘంలోకి తీసుకురావడం ఒకటి! ఈ విధంగా విప్లవసంఘానికి తీరని కళంకాన్ని తెచ్చిపెట్టావు. విప్లవసంఘంలో ప్రకాశవతి గౌరవాన్ని పెంచడానికి అజాద్ పంపించిన వెయ్యి రూపాయలు కాజేశాడని ప్రేమనాథ్‌మీద అభాండం వేశావు. నీకు భగవతీచరణ్‌మీద ఈర్ష్య! అందుకనే, అతని చేతిలో ప్రేలేట్టు బాంబును తయారుచేశావ్. తరువాతకూడా నువ్వు తగుజాగ్రత్త తీసుకోకుండా అతడిని కావాలని మృత్యువుపాలు చేశావు. భగత్సింగ్‌ను విడిపించడం నీకు యిష్టంలేదు. ఏ విధానైనా ప్రకాశవతిని తీసుకుని లేచిపోవాలని నీ ఉద్దేశ్యం. బహావల్‌పూర్‌రోడ్ బంగళాలో బాంబులు ప్రేలడానికి కూడా నువ్వే కారణం. భగత్సింగ్‌ను విడిపించే కార్యక్రమం ఆగిపోవడానికి నువ్వే బంగళాలో బాంబులు ప్రేల్చావు. కనుకనే, నువ్వు బంగళాలో ఉన్నంతసేపు ఆ బాంబులు ప్రేలలేదు. నువ్వుబైటకు రాగానే ప్రేలాయి: అలా ఏర్పాటు చేసుకున్నావు. నువ్వు సుఖజీవితాన్ని

కాంక్షిస్తున్నావు. ఏక్షణానైనా పోలీసులకు రహస్యాన్ని చెప్పెయ్య గలవు-ఇవన్నీ నీమీద మోపిన నేరాలు!"

నేరాలన్నింటినీ విని కొన్ని క్షణాలు మౌనంగా ఉండి పోయాను. తరువాత బాధామయ స్వరంలో "ఇవన్నీ నామీది ఈర్ష్యవల్ల కల్పించిననేరాలు. వాళ్ళు చెప్పిన నేరాల్లోని అన్ని సందర్భాల్లోనూ ఎవరో ఒకరు నా దగ్గర ఉండనే ఉన్నారు. అలా ఉన్నవాళ్ళు ఇప్పటికీ ఉన్నారుకదా? మరి ఈ అపరాధాలగురించి వాళ్ళ నేమన్నా అడిగారా? ప్రకాశవతిని ఇంటినుంచి పిలిపించేముందు నేను భగవతీచరణ్‌తోనూ, ఆజాద్‌తోనూ చర్చించాను. * ప్రకాశవతి విప్లవ సంఘంలోకి వచ్చాక నాప్రవర్తన ఏమిటో ఇంద్రపాల్‌ని అడగవచ్చును. నేను పిలిపించడంవల్ల, ప్రకాశవతి విప్లవ సంఘంలోకి వచ్చినట్లయితే,

---

* వెనక ఈ సందర్భంవచ్చింది. అప్పుడు ఒక విషయం వ్రాయ టం మర్చిపోయాను. ప్రకాశవతి ప్రేమనాథ్ ద్వారా డబ్బుపంపించడమూ, చివరకు ప్రకాశవతి విప్లవసంఘంలోకి వచ్చేయడమూ జరిగింది. ఆ మధ్యకాలంలో నేనొకమాటు ఢిల్లీ వెళ్ళాను. ప్రేమనాథ్ ద్వారా డబ్బు పంపడం, ప్రకాశవతి విప్లవసంఘంలోకి వచ్చేయడం గురించి భగవతీ చరణ్ సమ్ముఖంలోనే ఆజాద్‌తో మాట్లాడాను. ఆజాద్ ఇలా అన్నాడు. "ఇల్లు అద్దెకు తీసుకోవడం లాంటి విషయాల్లో ఆడవాళ్ళు కొంత సహ కారంగా వుండేమాట నిజమే! కానీ, ఆడవాళ్ళను సంఘంలోకి తీసుకోవ డం పమస్యతోకూడిన విషయం! అయినా, మీరూ ఆలోచించండి! ఆ అమ్మాయిని నేను చూడనూలేదుకదా! ఏం చెప్పగలను?" అప్పటికి ప్రకాశవతిని నేనూ చూడలేదు. భగవతీచరణ్ కూడా చూడలేదు. ఐతే, సోదరి ప్రేమవతి, ప్రకాశవతిని సంఘంలోకి తీసుకోవల్సిందని మరీ మరీ చెప్పింది. అందువల్ల తీసుకోవడం జరిగింది!

మొదటగా దుర్గాభాబీ దగ్గరకు ఎందుకు పోతుంది? నాదగ్గరకే వచ్చేసేది కదా? ప్రేమనాథ్ 1000 రూపాయలు పోగొట్టి, నా దగ్గరకువచ్చి కన్నీటిపర్యంతమై చెప్పుకున్నప్పుడు ఇంద్రపాల్‌కూడా ప్రక్కనఉన్నాడు. భగవతీచరణ్‌పట్ల నా ప్రవర్తనలో లోపమున్నదంటున్నారు. అతని చేతిలో ప్రేలిన బాంబు నేనుకూరింది కాదుకదా? నా పరోక్షంలో భగవతీ చరణ్, సుఖదేవరాజ్ కూరుకున్నారా బాంబును. వాళ్ళసలు ఆబాంబును పరీక్షించడానికి తీసుకువెళ్ళిన విషయంకూడా నాకు తెలియదు. దీనికి ఆజాద్, ఇంద్రపాల్ సాక్ష్యమున్నారు. భగవతీచరణ్ దెబ్బతిన్న తరువాత, నేనతని దగ్గరకు మొదట వెళ్ళినప్పుడు ఛైల్‌బిహారీ నావెంట వున్నాడు. రెండవమారు వెళ్ళినప్పుడు ఇంద్రపాల్, బచ్చన్ ఉన్నారు. నావల్ల దోషమేమిటో వాళ్ళను విచారించారా? బాంబులు ప్రేలిన గదిలో నేనూ భాబీ ఇద్దరం పడుకునివున్నాం. మేము ఇవతలకువచ్చిన తరువాత ప్రేలడం మా అదృష్టం! ఆ బాంబులు రెండు నిముషాలముందే ప్రేలి వుంటే మేము ఏమైపోయేవారమో! రెండు నిముషాల తరువాత ప్రేలిన బాంబులు రెండు నిముషాలు ముందుకూడా ప్రేలవచ్చునుకదా? సాక్షులుగా ఉన్న మిత్రులను ఎవరినీ విచారించకుండా, కేవలం నన్ను తమ మార్గానికి అడ్డంలేకుండా తొలగించుకోవడానికి ఈ కుట్ర పన్నారు."

నేను దుర్గాదాస్‌తో మరికూడా ఇలా అన్నాను. "ఇదంతా సుఖదేవరాజ్ చేసినకుట్ర. ఇలాగే నామీద భగవతీచరణ్‌కూ చెప్పాడు. కానీ, అప్పటి పరిస్థితి పోట్లాటలకూ, చర్చలకూ తగిలేదు గనుక వీళ్ళ చాడీకోరు ప్రవర్తనను చర్చకు పెట్టలేదు! వీళ్ళు, నేను సుఖాల్ని కాంక్షిస్తున్నానని చెప్పుతున్నారు. ఏ క్షణాన్నైనా పోలీసుల ఆశ్రయంలోకి వెళ్ళిపోతానని చెప్పుతున్నారు. వీళ్ళు నన్ను అన్యాయంగా చంపచూసిన విషయం పదిహేను రోజులముందే నాకు తెలిసింది. నిజంగా నేను విలాసప్రియుణ్ణయితే ఏనాడో పోలీసుల్ని శరణుజొచ్చేవాణ్ణికదా? ఇదంతా

కొందరు స్వార్థపరులుచేసిన విశ్వాస ఘాతుకమని భావిస్తున్నాను. నేనిప్ప టికీ విప్లవసంఘాన్ని గౌరవిస్తున్నాను. నా సమస్యను సెంట్రల్ కమిటీ ముందు ఉంచమని యిప్పటికీ అడుగుతున్నాను. నామీద నేరాలు మోపిన వాళ్ళల్లో నాలాగ విప్లవ సంఘంకోసరం నిష్టతో, సాహసంతో, యదార్థంగా కృషిచేసిన వాళ్ళు ఎందరున్నారు?" అని బాధామయ స్వరంలో అడిగాను.

దుర్గాదాస్‌ఖన్నా స్వరం ఆర్ద్రమైంది. "నువ్వు విశ్వాస పాత్రుడ వనటానికి ఇంతకంటే ప్రమాణం ఏంకావాలి? నువ్వు నాతోపాటు ధన్వం తరీ దగ్గరకురా! నీమీద మోపిన అపరాధాల్ని చర్చకు పెట్టమని అడుగు దాం!" అన్నాడు.

అప్పుడు రాత్రి 8 గంటలయి వుంటుంది. "ఎక్కడకువెళ్ళి కలుసుకుందాం?" అని అడిగాను.

"మింటోపార్కుకు."

మింటోపార్కు రాత్రి 8 గంటలు దాటితే నిర్మానుష్యంగా ఉంటుంది.

"నేను రావటానికి సిద్ధంగా ఉన్నాను. అయితే బాధ్యత నీదే! నాకేమాత్రం అనుమానం తగిలినా నేను ముందుగా కాల్పులు ప్రారంభి స్తాను. అలాకాక, చీకట్లో నన్నెవరైనా కాల్చారంటే, నేను నిన్ను కాల్చిచంపేస్తాను!" అని అన్నాను.

"నన్నువిశ్వసించు! నిన్ను కాల్చాలన్న నిర్ణయాన్ని నేను నిజంగా వ్యతిరేకిస్తున్నాను. అంతేకాక, ప్రకాశవతికీ నాకూ కొంత బంధుత్వం ఉంది. నిన్ను ఇప్పుడు పిలిపించింది కాల్చడానికే! కానీ, నేను ప్రక్క మన్నంతసేపూ వాళ్ళు నీకేమీ అన్యాయం చేయలేరు. నేను నిన్ను వదలి అవతలకు వెళ్ళను. ఈ పోట్లాట ఇంతటితో సమసిపోవాలని నేను అను కుంటున్నాను. దీనివల్ల పార్టీ మొత్తంగా నాశనమయిపోతుంది!" అన్నాడు ఖన్నా.

మేముయిద్దరం సైకిళ్ళు వేసుకుని, మింటోపార్కువైపు వెళ్ళాము. పార్కులోకి వెళ్ళగానే, ఒకచేత్తో సైకిలు హాండిల్ పుచ్చుకుని, రెండవ చేత్తో జేబులోఉన్న పిస్తోలును పుచ్చుకున్నాను. అప్పటికి ఖన్నామీద నాకు పూర్తి విశ్వాసంలేదు. రోడ్డుమీద కిరెంటులైట్ల వెలుగు ఉన్నది. ఐతే, పార్కులో మాత్రం అంధకారం గాఢంగా అలుముకుని వుంది. మేము క్రిందికి దిగి, సైకిళ్ళు నడుపుకుంటూ వెళ్ళుతూన్నాము. ఖన్నా టార్చి లైట్ వేశాడు. నాలుగు అడుగుల దూరంలో, బెంచీమీద కూర్చున్న వ్యక్తిని గుర్తుపట్టాను. అతడు ధన్వంతరి! నేను మరికొంచెం జాగ్రత్త పడ్డాను. ఖన్నాకు దగ్గరగా జరిగాను. పిస్తోలును జేబులోనుంచి బైటకు తీశాను ధన్వంతరి మౌనంగా కూర్చుని ఉన్నాడు.

ఖన్నా ధన్వంతరిని పిలిచాడు. ధన్వంతరి తన చేతిలోని బ్యాటరీ లైటును ఆకాశంలోకి ఫోకస్‌చేసి ఏదో సౌజ్ఞ చేశాడు. వాళ్ళిద్దరూ నా ఎదురుగా నాలుగైదు అడుగుల దూరంలో, మెల్లగా ఏమో మాట్లాడు కున్నారు. తరువాత ఖన్నా నాదగ్గరకు తిరిగి వచ్చాడు. ధన్వంతరి మళ్ళీ టార్చిలైట్ వేసి ఏదో సౌంజ్ఞ చేశాడు.

"వెళదాం పద!" అన్నాడు ఖన్నా.

నేను ముందు జాగ్రత్తకోసం, ధన్వంతరినికూడా రోడ్డువరకూ రమ్మన్నాను. అతడూ మాతోపాటు రోడ్డువరకు వచ్చాడు.

ఖన్నా మధ్యవర్తిగా ఉండి ఒక ఏర్పాటుచేశాడు. నేనూ, ధన్వం తరీ ఢిల్లీ వెళ్ళుతాము. ఆజాద్‌ను కలుసుకుంటాము. నామీద మోపబడ్డ నేరాలగురించి పునరాలోచించమని అడుగుతాము. ఇందుకు ధన్వంతరిని ఒప్పించాడు ఖన్నా!

లాహోరులో ఉన్న ఆ కొద్దిరోజులూ నేను ఇంద్రపాల్ దగ్గరా, జహంగీరీలాల్ దగ్గరా ఉన్నాను. ఇంద్రపాల్ నేను ఢిల్లీ వెళ్ళేటప్పుడు తానూ స్టేషనువరకూ తోడు వచ్చాడు.

లాహోరులో నేను మాసినగుడ్డలతో సాధారణుడైన పంజాబీ యువకుడి వేషంలో ఉండేవాడిని. స్టేషనుకు వెళ్ళేప్పుడు సూటు వేసుకున్నాను. సెకండ్ క్లాసులో ప్రయాణం చేయాలని ఉద్దేశ్యం. అప్పటి సెకండ్‌క్లాసు, ఇప్పటి ఫస్టుక్లాసుకు సమానంగా ఉండేది. అప్పటి ఫస్టు క్లాసు ఇప్పటి ఎయిర్ కండిషన్‌కు సమానంగా ఉండేది. మోసగిస్తారేమో నన్న అనుమానం మనస్సులో అప్పటికీ ఉంది. సెకండ్ క్లాసు పెట్టెలో, తలుపులు వేసేసుకుంటే ఇతరులెవ్వరూ లోపలకు రావడానికి వీలు వుండదు. కనుకనే సెకండ్ క్లాస్‌లో ప్రయాణంచేశాను.

జాగ్రత్తగా ఉండడానికి ప్రయత్నించి అనుకోకుండానే కొంత అజాగ్రత్తగా వ్యవహరించాను. జాగ్రత్త కోసరం అని కోటుజేబులో ఎప్పుడూ గుండ్లతోనిండిన పిస్తోలును ఉంచుకుంటాను. విడిగా కొన్ని తూటాలనూ జేబులో వేస్తుకుంటాను. టికెట్ తీసుకోవడానికి బుక్కింగ్ ఆఫీసు దగ్గరకు వెళ్ళాను. లోపలి జేబులోనుంచి నోట్లు, పై జేబులో నుంచి చిల్లర డబ్బులూ తీసి కిటికీలో పెట్టాను. చిల్లర డబ్బులుతోపాటు పిస్తోలు గుండ్లు రెండింటిని కిటికీలో పెట్టడం జరిగింది.

కనుచివర్ల నుండి పరిసరాన్ని ఒకమాటు కలయచూశాను. బుక్కింగు కిటికీకి కొద్ది దూరంలో పంజాబు సి ఐ.డి. పోలీసు ఒకడు నిలబడి నావైపు చూస్తున్నాడు. ఇకనప్పుడు, పిస్తోలు గుండ్లను దాయటం గానీ, కంగారుపడటంగానీ చేయకూడదు. గుండ్లను జేబులో వేసుకోకుండా చేతిలో ఎగరవేసుకుంటూ. బుక్కింగ్ క్లర్కుమీద విసుక్కుంటూ, కోప గించుకుంటూ, ఫస్టుక్లాస్ టికెట్ యివ్వమని ఇంగ్లీషులో అడిగాను.

"సర్, ఫస్టుక్లాస్‌లో సీటు లేదండీ! రిజర్వు అయిపోయినాయి!" అన్నాడు క్లర్కు.

నేను మండిపడ్డాను. "ఏమిటి నీ వాగుడు? మూడు గంటలకు సీటు రిజర్వుచేయమని ఫోన్ చేయించాను. నువ్వు ఇప్పుడు సీటు ఖాళీ

లేదంటున్నావ్?" అంటూ ఇంద్రపాల్‌వైపు తిరిగి "ఏంపంతులూ! నువ్వు మూడు గంటలకు ఫోన్ చేయలేవా?" అని అడిగాను."

ఇంద్రపాల్ భయాన్ని, వినయాన్ని ప్రదర్శిస్తూ "చేశాను సాబ్!" అన్నాడు.

"మరి ఇంక ఏమిటయ్యా నీవు మాట్లాడేది?" అని దబాయించాను క్లర్కును.

"నేను 6 గంటలకు డ్యూటీకి వచ్చాను సార్! మీరు ఫోన్ చేసిన విషయం నాకు తెలియదు!" అన్నాడు క్లర్కు.

"సరే ఇప్పుడు సెకండ్‌క్లాస్ టికెట్టు యివ్వు. నేను పైకి రిపోర్టు చేస్తాను!" అన్నాను. క్లర్కు టికెట్ వ్రాస్తున్నాడు. నేనుఇంకా గుండ్లను ఎగురవేస్తూనే ఉన్నాను. ఇంద్రపాల్ వంక కోపంగాచూసి "ఏమిటలా నిలబడి ఉన్నావ్? సెకండ్‌క్లాసులో చోటుందట. పోయి సామానుసర్దు!" అన్నాను.

ఇంద్రపాల్ నా బెడ్డింగునూ, సూట్‌కేసునూ తీసుకుని ప్లాట్‌ఫారం మీదకు వెళ్ళాడు. అతడి వెనుక నేనూ వెళ్ళాను. కొంచెం దూరంగా నన్ను అనుసరిస్తూ సి.ఐ.డి. పోలీసు కూడా ప్లాటుఫారంమీదకు వచ్చాడు.

ప్లాట్‌ఫారంమీదకు వెళ్ళాక ఇంద్రపాల్‌ని మరొకమాటు కసిరాను. "ఏమిటలా నిలబడి చూస్తావ్? సీటు ఎక్కడుందో గార్డును అడుగు" అన్నాను.

గార్డు ఎదురుగానే ఉన్నాడు. ఇంద్రపాల్ 'జంట్' సాహబ్‌కు సీటు చూపమని అడిగాడు గార్డును. (నిరక్షరాస్యులైన పంజాబీలు జాయింట్ మెజిస్ట్రేట్‌ను 'జంట్ సాబ్' అంటారు!) గార్డు ప్రక్కపెట్టెలో సీటు చూపాడు. ఇంద్రపాల్ బెడ్డింగ్‌ను పరుస్తున్నాడు. నేను జేబులో వున్న పిస్తోలును ఒకచేత్తో పుచ్చుకుని, మరొకచేత్తో గుండ్లను ఎగరవేస్తూ సి.ఐ.డి. పోలీసు వ్యవహారాన్ని కనిపెడుతున్నాను. 'నాచేతిలో పిస్తోలు

గుండ్లను నువుచూసినమాత్రాన, నేనేమీ భయపడను!' అని సి.ఐ.డి.కి తెలియపరచడమే నా ఉద్దేశం! సి.ఐ.డి. కొంచెం దూరం అయ్యాడు. నా వైపు అంత తీక్షణంగా కూడా చూడడంలేదు ఇప్పుడు! ఐనా, అతడి దృష్టిలో నేమన్నాను. సి. ఐ. డి. కి వినబడేట్టు గార్డును కేక వేశాను. "గార్డు!"

"యస్‌సర్!" అంటూ గార్డు నాదగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు. జేబులోనుండి పది రూపాయీల కాగితాన్ని తీసి అతడికి ఇస్తూ "బ్లాక్ ఎండ్‌వైట్ సిగరెట్ టిన్ను ఒకటి తెచ్చిపెట్టు!" అన్నాను ఇంగ్లీషులో.

గార్డు పది రూపాయీల కాగితాన్ని తీసుకుని, కొద్ది దూరంలో వున్న స్టాల్ దగ్గరకు పరుగెత్తాడు. టిన్నుతెచ్చి నాకు ఇచ్చాడు. నేను టిన్నును తీసుకున్నాను. కానీ, చిల్లర తీసుకోలేదు. ముఖం అటుత్రిప్పుకున్నాను. గార్డు చిల్లర డబ్బుల్ని పెట్టెలో సీటుమీద పెట్టి, బండి కదలడానికి విజిల్‌వేస్తూ వెళ్ళిపోయాడు!

ఇంత నాటకం ఆడినా ఇంకా భయంగానేవుంది. సి.ఐ.డి. ఏం చేస్తాడోనని లోపలభయపడుతునే ఉన్నాను. రైలుకదిలింది. 'హమ్మయ్య' అనుకున్నాను. ఐనా, పూర్తిగా ధైర్యం చిక్కలేదు! ఐదు మైళ్ళల్లో 'మియామీర్' స్టేషన్ వుంది. 'సి.ఐ.డి. అక్కడికి ఫోన్ చేస్తాడేమో? పోలీసులు సోదా చేయడానికి వచ్చిపడ్డా పడవచ్చును!, అనుకున్నాను. 'మియామీర్' స్టేషన్ గడిచిపోయింది. అప్పటికీ మనస్సు పీకుతోంది. అది ఫ్రాంటియర్ మెయిల్! నలభై యాభై మైళ్ళ దూరంలో వున్న 'కసూర్' స్టేషన్‌లోనే ఇక ఆగడం! నేను ప్రాణాలు ఉగ్గపట్టుకు కూచున్నాను. 'కసూర్' స్టేషన్ కూడా నిరాపదంగా గడిచిపోయింది. ఫిరోజ్‌పూర్ స్టేషనూ వెళ్ళిపోయింది!

ఢిల్లీ స్టేషన్‌లో మరి కూడా జాగ్రత్త వహించవల్సి వచ్చింది. అక్కడ అటు పోలీసుల భయమూ పీడించింది. ఇటు మిత్రుల భయమూ

పీడించింది. మానసికంగా విపరీతంగా ఉద్విగ్నం అయ్యానేమో, నోరు చేదు ఎక్కింది. జీర్ణకోశం దెబ్బతిన్నది।

ప్రకాశవతిని జుమ్మా మసీదు దగ్గర గల దేవరాజు భల్లా ఇంట్లో వుంచివెళ్ళాను. ఢిల్లీ:వెళ్ళగానే, ముందు అక్కడికే వెళ్ళాను. ప్రకాశవతి అక్కడ లేదు. నేను కంగారు పడిపోయాను. 'ప్రకాశవతి వారంరోజుల క్రితం మిత్రుల్ని కల్సుకురావడానికి వెళ్ళింది. ఇంతవరకూ రాలేదు।' అని దేవరాజు భల్లా చెప్పారు.

నాకు ఆదుర్దా మరీ ఎక్కువైంది. నేను లాహోరు వెళ్ళేప్పుడు ప్రకాశవతికి ఏమీ చెప్పివెళ్ళలేదు. మిత్రుల్ని కల్సుకోవడానికి గానీ, మరి ఎక్కడికేగాని వెళ్ళవద్దనీ ఆమెకు చెప్పలేదు. అలా చెప్పడంవల్ల అనవసరంగా గాభరా పడుతుందని నా ఉద్దేశం। 'మిత్రుల్ని కల్సుకోవడానికి వెళ్ళి ఇన్నాళ్ళు ఎక్కడవుంది? తన ఇష్టప్రకారమే ఎక్కడయినా ఉన్నట్లయితే, రెండవజత గుడ్డల్ని, ఇతర అవుసరం అయిన వస్తువుల్ని తీసుకువెళ్ళేదికదా? తప్పకుండా ఎక్కడో బందింపబడ్డది।' అని అనుకున్నాను. ఇంక ఒక్కక్షణం అక్కడ వుండలేదు. వెంటనే మేడదిగి బాంబు ఫ్యాక్టరీకి బయల్దేరాను.

అప్పుడే సూర్యోదయం అయింది. ధన్వంతరీ నాకంటే ముందే ఢిల్లీ వచ్చారు; ఆజాద్‌తో సమావేశాన్ని ఏర్పాటుచేయడానికి। సుఖదేవ్ రాజు, ధన్వంతరీ - ఇద్దరూ బాంబు ఫ్యాక్టరీలోనే ఉండవచ్చును। నేను మేడమెట్లను ఎక్కుతూ పైకి చూశాను. ముందుగది వాకిలి తెరిచిఉంది. జేబులోనుండి పిస్తోలును బయటికితీశాను। ఇలాంటిసందర్భాల్లో ఎన్నడూ నేవిలా తొందరపడలేదు। ప్రకాశవతికి ఏ ఆపద సంభవించిందోనన్న ఆందోళన నన్ను ఉద్విగ్నుణ్ణి చేసింది।

ముందు గదిలోనూ, మధ్య గదిలోనూ ఎవరూ కనుపించలేదు. కుడివైపు వరండాలోకి వెళ్ళాను. ధన్వంతరీ మంచంమీద దుప్పటికప్పుకు

పడుకుని వున్నాడు. నేను పైకివచ్చిన సవ్వడికి ధన్వంతరీకి మెళుకువ వచ్చింది. అతడు కండ్లు తెరవడంతోనే, చేతిలో పిస్తోలు పుచ్చుకుని నేను తన మంచందగ్గరనుండి వెనక్కి తిరిగి వెళ్ళిపోవడాన్ని చూశాడు. అయినా, అతడు తన మంచంలో మౌనంగా కూచుని వుండిపోయాడు. గాభరాగానీ, ఉద్విగ్నతగానీ అతడిలో లేశమాత్రమూ కనుపించలేదు! నా ఈ ప్రవర్తనవల్ల ధన్వంతరీ చాలా అవమానపడి వుండవచ్చును. కానీ, ప్రకాశవతి ఏమైందో అన్న ఆందోళన నన్ను పిచ్చివాణ్ణి చేసింది. నేను వెనక్కుతిరిగి మధ్యగదిలోకి వచ్చాను. గిరవరసింగ్ అప్పుడే స్నానం చేసి వచ్చాడు. ఎదురుగా కనిపించాడు.

"ప్రకాశవతి ఎక్కడవుంది?" నేను గిరివరసింగ్‌ను అడిగాను.

నా స్వరం వినిగానే, ప్రకాశవతి ప్రక్క గదిలోనుండి మధ్య గదిలోకి వచ్చింది. ఆమె ముఖంలోకి ఒకమాటు చూశాను. బుగ్గలమీద ఎండిన కన్నీటిధార కనుపించింది. ఆమె బాధను అర్థం చేసుకున్నాను. వెంటనే, నాతోపాటు బయల్దేరమన్నాను. ప్రకాశవతి ముందూ, నేను వెనుకా, మెట్లవరకూ వచ్చాము. ఇంతలో సుశీలాదీదీ మరోగదిలోనుండి బయటకు వచ్చింది. "ఎప్పుడు వచ్చావు? ఎక్కడకీ వెళ్ళడం? ఏమిటి జరిగింది?" అడిగింది. ఆమె స్వరం సహజంగా వుంది.

"తొందరపనిమీద వెళుతూన్నాము. మళ్ళీ వస్తాను!" అని సుశీలా దీదీకి సమాధానంచెప్పి మెట్లుదిగి క్రిందికి వచ్చేశాను.

దేవరాజుభల్లా ఇంటికి వెళ్ళాక ప్రకాశవతి జరిగిన విషయాన్ని ఇలా చెప్పింది "మీరువెళ్ళిన నాలుగైదు రోజులకు మిత్రుల్నిచూసి రావడానికి ఫ్యాక్టరీకి వెళ్ళాను. విమలప్రసాద్ నన్ను తిరిగి రానీయలేదు!" అంటూ అక్కడజరిగిన విషయాన్నంతా చెప్పింది.

తరువాత ఆజాద్, ధన్వంతరీ-వచ్చి నేను ఎక్కడికి వెళ్ళింది చెప్పమని ప్రకాశవతిని బాధించారు. నేనసలు ఎక్కడికివెళ్ళింది ఆమెకు

చెప్పలేదు! ఇంక నేను ఎక్కడికి వెళ్ళానో ఎలా చెప్పగలదు? వాళ్ళు ఎన్నిసార్లు అడిగినా 'నాకు తెలియద'నే చెప్పింది!

ప్రకాశవతికి నేను ఎక్కడికి వెళ్ళింది తెల్సునని ఆజాద్ అభిప్రాయం. ఆమె కావాలని నేనున్న ప్రదేశాన్ని చెప్పడంలేదు అనుకున్నాడు. "నీకంతా తెల్సు. నువ్వు చెప్పితీరాలి! చెప్పకపోతే పరిణామం చాలా చెడుగా వుంటుంది!" అని దబాయించసాగాడు.

ఆజాద్ ప్రకాశవతిని అడిగిన మరో ప్రశ్న "యశ్‌పాల్‌కూ నీకూ సంబంధం ఏంటి?"

ప్రకాశవతికి, ఆజాద్ అలా ప్రవర్తించడం చాలా క్రొత్తగావుంది. ఏమిటీ ప్రశ్నలు? ఏమిటీ దబాయింపులు? పరిస్థితి ఆమెకు బొత్తిగా అర్థంకాలేదు. మానసికంగా చాలా బాధపడుతున్నదేమో ఆజాద్ అడిగిన రెండవ ప్రశ్నకు చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది. "మా సంబంధంతో మీకు సంబంధం? మీరు ఎవరు అడగడానికి?" అన్నది. ఇలా తిరస్కారంగా మాట్లాడడంద్వారా తన ఆత్మగౌరవాన్ని రక్షించుకో చూసింది ప్రకాశవతి.

ఆజాద్‌ను మేమందరమూ గౌరవంగా చూసేవారం. అసలు ఆజాద్, తోటిమిత్రుల మనస్సుల్ని బాధించేట్టు ఎన్నడూ వ్యవహరించేవాడు కాదు. కోపంలోనూ 'మీరు' 'తమరు' అనే అనేవాడు. ఈ మధ్య ధన్వంతరీ, సుఖదేవ్‌రాజ్, కైలాసపతి - ముగ్గురూ ఆజాద్ దగ్గర ముఖప్రీతిగా మాట్లాడడం ప్రారంభించారు. ఆజాద్ స్వభావంలోనూ కొంత మార్పు వచ్చింది.

ప్రకాశవతి అలా తిరస్కారంగా మాట్లాడడంవల్ల ఆజాద్‌కు ఎంత కోపం వచ్చి వుంటుందో చెప్పడం కష్టం! అలాంటిస్థితిలో ప్రకాశవతిని చెంపదెబ్బ వెయ్యకపోవడం అదృష్టం అన్నమాట!

ఇకవప్పుడు ప్రకాశవతికి యదార్థస్థితిని చెప్పేశాను. సెంట్రల్ కమిటీ నిర్ణయాన్ని విని ఆమె చాలా విచారపడ్డది. నేను, ఆజాద్‌నూ ఇతర మిత్రుల్ని కల్సుకోవడానికి వెళుతూన్నాననీ చెప్పాను. తనూ ఓపిస్తోలు తీసుకుని నాతోపాటు రావడానికి సిద్ధం అయింది.

తను రావవసరంలేదని నేను వారించాను. పిస్తోలు అవుసరం వుండదనీ నేను చెప్పాను. నేను ఇంకా ఇలా అన్నాను. "ఇప్పుడు చదరిన స్థితిని సవ్యం చేయడం ముఖ్యం. స్థితి సవ్యం కావడానికి మన యధార్థత తోడ్పడుతుందేగాని, పిస్తోలు తోడ్పడదు! ఒకవేళ నేను పరిస్థితిని చక్కబరచలేకపోతే, అక్కడ చనిపోవడం జరిగితే, యధార్థాన్ని లోకానికి చాటి, నాపై మోపిన అపరాధాలు సత్యదూరమైనవని చెప్పడానికి నీవు బ్రతికివుండడం అవుసరం! కనుక నువ్వు తొందరపడడం గానీ, భయపడడంగానీ తగదు!" అన్నాను.

ఆజాద్‌ను కల్సుకోడానికి వెళ్ళేముందు, ఖయాలీరాంగుప్త దగ్గరకు వెళ్ళాను. పరిస్థితినంతా వివరంగా చెప్పాను. ఖయాలీరాంగుప్త విని చకితుడయ్యాడు. మొదట నేను నామీదమోపిన అపరాధాన్నీ, నాకు విధించిన దండనను మిత్రులకు తెలియకముందే పరిస్థితిని చక్కపరుద్దామనుకున్నాను. కానీ, ఆ ప్రయత్నంలో సఫలుణ్ణి కాలేకపోయాను. ఇప్పుడిక పరిస్థితిని మిత్రులకుచెప్పి, మిత్రుల సానుభూతిద్వారా విప్లవ సంఘంమీద వత్తిడిని తీసుకువచ్చి, పరిస్థితిని చక్కబరచడానికి ప్రయత్నిస్తున్నాను! గుప్తనుకూడా ఆజాద్ దగ్గరకు రమ్మన్నాను. అతడు సిద్ధమయ్యాడు. తరువాత సుశీలాదీదీని కల్సుకున్నాను. పరిస్థితినిచెప్పాను. ఆమె నిర్ఘాంతపోయింది. ఆమె విస్మయాన్ని చూశాక 'ఆమెకూ ఈ విషయం ఇంతవరకూ తెలియద'నుకున్నాను! విషయం ఎక్కువమంది మిత్రులకు తెలియకుండా నన్ను ఖతం జేయాలన్న ప్రయత్నం జరిగింది. సుశీలా దీదీకి నామీద మోపిన అపరాధాల్ని చెప్పాను. విని, ఆమె అసలు మాట్లాడలేకపోయింది!

# 7. యశ్‌పాల్ మృత్యుదండన రద్దు

ఆజాద్ కాన్పూరులో వున్నాడు. కైలాసపతి టెలిగాం యిచ్చి పిలిపించాడు. మధ్యాహ్న సమయం. నేను ఖయాలీరాంగుప్తనూ, సుశీలా దీదీని వెంటబెట్టుకుని ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీకి వెళ్ళాను. ఆజాద్, ధన్వంతరీ కూచుని ఏమిటో మాట్లాడుకుంటున్నారు. మమ్మల్ని చూడగానే ఆజాద్ ముఖము, కండ్లూ ఎఱ్ఱబడ్డాయి. ధన్వంతరి ముఖం జేవురించింది. వాళ్ళిద్దరికీ కోపంవచ్చిందని అర్థం అయింది. వాళ్ళకోపాన్ని లెక్క చేయకుండా ఆజాద్‌తో "నామీద మోపిన అపరాధాల్ని తెల్సుకోవాలనీ, వాటి నిజా నిజాలను తేల్చుకోవాలనీ – కోరుతున్నాను!" అన్నాను.

ఆజాద్ కండ్లు చింతనిప్పులయ్యాయి. కోపంలో పెదవులు వణికాయి "నలుగురిని వెంటబెట్టుకువచ్చి నన్ను దడిపిద్దామనుకుంటున్నావా? అసలు, వీరిని ఇక్కడికి ఎవరి అనుమతితో తీసుకువచ్చావు?" అంటూ ఖయాలీరాంగుప్త వైపు సంజ్ఞచేసి చూపించాడు. "నీకూ ఆరుగురు మిత్రులున్నారనీ, వాళ్ళు నన్ను కాల్చేయడానికి సిద్ధమవుతారని అన్నావుట? తీసుకురా నీ మిత్రుల్ని! ఎవరి తలిపొల బలమెంతో తేల్చుకుందాం?" అన్నాడు ఆజాద్. అలా అంటూనే ఆజాద్ ఒక చేత్తో మీసాన్ని మెలితిప్పాడు.

ధన్వంతరి చెప్పినమాటలకు ఆజాద్ నామీద మండిపడుతూన్నాడని అర్థం అవుతూనేవుంది. నేను శాంతంగా, కానీ కర్కశ స్వరంలో ఇలా అన్నాను "నీ దగ్గర ఏవేవో అబద్ధాలు వాగినట్టున్నారు! అందుకే నామీద నీకిలా కోపంవస్తూన్నది. నేను న్యాయాన్ని విచారించమని అడగడానికి వచ్చాను. మన మిత్రులు కొందరు నాపట్ల జరిగిన నిర్ణయం అనుచితమైందని భావిస్తూన్నారు. అనుచితమైనదని భావించినదాన్ని వాళ్ళువ్యతిరే

కించడంలో తప్పేమిటి? నువ్వు నాతో ఏకాంతంలో మాట్లాడదలుచుకుంటే నేనందుకు సిద్ధంగా వున్నాను!"

ఆజాద్, ధన్వంతరీని, సుశీలాదీదీని, ఖయూలీరాంగుప్తనీ - అవతలికి పంపించాడు. వాళ్ళు వెళ్ళాక అతడువేసిన మొదటిప్రశ్న ఇది "నీకు సెంట్రల్ కమిటీ నిర్ణయాన్ని గురించి చెప్పిందెవరు?"

"నాకీ నిర్ణయం ఢిల్లీలోనే తెల్సింది. ఐతే, నిన్ను కల్సుకోవడానికి కాన్పూరు వెళ్ళాను. స్టేషన్‌దగ్గర నాకెవరూ కనుపించలేదు. నేను నేరుగా వీరభద్ర ఇంటికి వెళ్ళాను. అతడు నాదగ్గర ఎత్తువెయ్యాలని చూశాడు. 'సాయంత్రం వరకూ ఇక్కడవుండు ఆజాద్‌ను వెతికి పట్టుకు వస్తాను. లేకపోతే, రాత్రి ఎనిమిది గంటలకు నరసయ్యాఘట్టం దగ్గరకు రా! అప్పుడు ఆజాద్‌ను అక్కడికి తీసుకువస్తాను!' అని అన్నాడు. 'ఏం, సాయంత్రంలోపు ఆజాద్ ఎక్కడవున్నాడో ఎందుకుతెల్సుకోలేవు? నాలుగు గంటలకు నేను ఇక్కడికి వస్తాను. అప్పటికి నువ్వు ఆజాద్‌ను పిలుచుకురా!' అని నేనతడికి చెప్పి వెళ్ళిపోయాను. సాయంత్రం నాలుగు గంటలకు ఒకమాటు నేను వీరభద్రతివారీ ఇంటికి వెళ్ళాను. నిన్ను పిలిపించాడేమో చూడడానికి! ఐదుగంటలకూ ఒకమాటు వెళ్ళాను. నేను ఆ రాత్రికే బయలుదేరి ఢిల్లీ వచ్చేశాను. తరువాత లాహోరు వెళ్ళాను. షేర్‌దిల్ పోలీసుల 'యాక్షన్'ని జరిపి, తద్వారా నామీద మీకుగల అనుమానాన్ని తీర్చాలని నా ఉద్దేశం! లాహోరు వెళ్ళగానే నాకు ఈ విషయాన్ని ఇద్దరు చెప్పారు. ఇద్దరూ వ్యతిరేకించారుకూడాను. లాహోరులోని మిత్రులు ఇది సుఖదేవ్‌రాజు, ధన్వంతరీయొక్క కుతంత్రం అనుకుంటున్నారు. వీళ్ళిద్దరినీ కాల్చేయాలని అక్కడి మిత్రులు అనుకుంటున్నారు. వాళ్ళను బలవంతాన ఆపాను. వాళ్ళు అసలు ఇది పార్టీనిర్ణయం కాదు అనుకుంటున్నారు. విషయం నీకుచెప్పి, సత్యాసత్యాల్ని తెలుసుకుందామని ఆ మిత్ర... [illegible] ...అన్నా...

ఆజాద్‌కు కోపంవచ్చింది "నేను చెప్తున్నాను. ఇది పార్టీ నిర్ణయమే!" అన్నాడు.

"నిర్ణయం చేసేముందు నా అపరాధాలేమిటో నాకు చెప్పాలికదా? అన్నాను నేను.

"ఏం అపరాధాలు చెప్పాలి నీకు? కమలకు నీకు సంబంధం ఏంటి?" ఆజాద్ దబాయించాడు.

"భార్యా భర్తల సంబంధం!" నేనూ తీవ్రస్వరంలోనే మాట్లాడాను.

"కమల కాదంటున్నది. ఆమె నన్ను ఇవ్వట్లు చేసింది. పిడికెడు మనిషి లేదు 'మీకేమిటి సంబంధం?' అనడిగింది. మీరు పార్టీని అపవిత్రం చేస్తున్నారు!" అన్నాడు ఆజాద్.

నాకూ తీవ్రంగా కోపం వచ్చింది "అపవిత్రం చేయడం ఏంటి? నువ్వు ఇలా మాట్లాడితే నేను సహించలేను. సరీగా మాట్లాడితే సమాధానం చెబుతాను! నువ్వు కమలతో కూడా ఇలాగే మాట్లాడివుంటావు! అందుకే ఆమె అలా సమాధానం చెప్పింది!" అని అన్నాను.

"నువ్వు ఎవరి అనుమతితో పెళ్ళిచేసుకున్నావు! మెంబర్లు పెళ్ళి చేసుకునేముందు పార్టీ అనుమతిని తీసుకోవాలని నీకు తెలియదా? నువ్వు ఒక ప్రాంతానికి ఆర్గనైజరువు! పార్టీ నియమాలు నీకు తెలియవా?"

"నేనీ విషయమై భగవతీచరణ్‌తో మొదటే మాట్లాడాను. అతడు నీతో చెప్పలేదేమో, నాకు తెలియదు! భాబీతోకూడా మాట్లాడాను. కావాలనుకుంటే నువ్వు ఇప్పుడయినా భాబీని అడుగవచ్చును. నేను రహస్యంగా, పార్టీ సభ్యులకు తెలియకుండా ఏమీ చేయలేదు. అసలు మా ఇద్దర్నీ వివాహం చేసుకోమని భాబీ సలహా యిచ్చింది! సుఖదేవరాజు అప్పుడూ నన్ను అవమానపరిచాడు 'విషయం పైకు చెప్పి సమస్యను పరిష్కరించుకుందామని భగవతీచరణ్‌తో అన్నాను కూడా! ఐతే, జైలు 'యాక్షన్' అయ్యాక మాట్లాడవచ్చునన్నాడు భగవతీభాయి! ఆ తరువాత

రెండు రోజులకే భగవతీభాయి చనిపోయాడు....బంగళాలో బాంబు ప్రేలడం, మనం విడిపోవడం జరిగింది. ఇంక నేను తరువాత నిన్ను కలుసుకోలేదు! ఆ తరువాత నేనసలు ఈ విషయానికే ప్రాధాన్యత నివ్వలేదు! నా ప్రవర్తన పార్టీ సభ్యులకు అందరికీ తెలుసుకదా? ఎవరికైనా అభ్యంతరం వుంటే చెప్పవచ్చునుకదా? నాపట్ల ఇలా వ్యవహరించడం న్యాయసమ్మతమని అనుకోవడంలేదు నేను! ప్రకాశవతిని నా కోసం ఇంటినుండి లేపుకు వచ్చానని అంటున్నారు. ఇది సత్యదూరం: ప్రకాశవతి విప్లవసంఘంలోకి వచ్చే విషయంలో సీతోటీ, భగవాన్‌చరణ్‌తోటీ మాట్లాడడం జరిగింది! సుఖదేవరాజు, ధన్వంతరీ చెప్పిన చాడీలను నిజమని నమ్మేశారు. పార్టీని మోసగించడం, పార్టీపట్ల విశ్వాసఘాతుకం చేయడమే నావుద్దేశ్యం ఐతే, ఏనాడో పోలీసుల అండకు చేరేవాణ్ణి! మీరు నన్ను కాల్చేయడానికి నిర్ణయించినట్టు తెల్సికూడా, ప్రాణాల్ని రక్షించుకోవడానికి నేను పోలీసుల్ని ఆశ్రయించ లేదు. దీన్నిబట్టి అయినా నా నిజాయితీని, విప్లవసంఘంపట్ల నాకున్న విశ్వాసాన్ని అర్థంచేసుకోవచ్చును! నన్ను, ప్రకాశవతిని-విప్లవసంఘం కాల్చేయవచ్చును. అయినా, మేము పోలీసుల శరణ్యాన్ని వేడం! నీ యిష్టం కాల్చేసే కాల్చేయ్! ఒకనాడు నీ అంతరాత్మ తప్పక నిన్ను నిందిస్తుంది!" అంటూ జేబులోనుండి పిస్తోలునుతీసి ఆజాద్ ముందువుంచి "అపరాధాన్నిగురించి చెప్పకుండానే, అపరాధాన్ని గురించి చర్చించకుండానే-మిత్రుల్ని హత్య చేయడంతో విప్లవం వర్ధిల్లుతుంది అనుకుంటే అలాగే కానివ్వు!" అన్నాను. కన్నీటిని ఆపుకోలేకపోయాను.

ఆజాద్ కండ్లవెంట కూడా కన్నీరు ధారకట్టింది. కన్నీటిని తుడుచుకోకుండానే "అయిందేదో అయింది. నీకీ రహస్యం ఎవరు చెప్పారో చెప్పాలి, నువ్వు! లేకపోతే, పార్టీనడవడం కష్టం!" అని అన్నాడు ఆజాద్.

"నేను చెప్పను. రహస్యం చెప్పిన మిత్రుడు తనకుతానై ఎన్న డయినా చెప్పుకోవచ్చును. నేను మాత్రం అతడి పేరు చెప్పను. నాకీ రహస్యాన్ని చెప్పిన మిత్రుడికీ నాకూ వ్యక్తిగత మిత్రత్వం ఏమీలేదు. నన్ను కాల్చేయడం విప్లవ సంఘానికి క్షేమం కాదన్నదృష్టితోనే అతడు నాకీ రహస్యాన్ని చెప్పాడు మరెవరికీ చెప్పనని నేనతడికి మాట ఇచ్చాను నేను నీకూ విశ్వాసఘాతుకం చేయను. అతడికీ విశ్వాస ఘాతుకం చేయను! నేను నీకతడి పేరు చెప్పనందుకు కాలుస్తావంటావా? కాల్చు! మాట నిలుపుకోడానికి ప్రాణాల్ని ఇస్తున్నానన్న సంతృప్తి అయినా వుంటుంది నాకు!" అన్నాను నేను.

ఆజాద్ కొన్ని క్షణాలు గుప్పెడలను బిగబట్టి తీవ్రంగా ఆలో చిస్తూ వుండిపోయాడు. తరువాత "ఇక నీ పార్టీ సాగదు!" అంటూ కన్నీటివిడుచుతుని సుశీలాదీదీనీ, ధన్వంతరీనీ, కైలాసపతినీ-పిల్చాడు.

తీవ్రమైనకోపంతో "నాకు పార్టీ గీర్టీ ఏమీ అవుసరం లేదు. మీలో ఎవరిమీదా నాకువిశ్వాసం లేదు మీరందరూ నన్ను మోసగించారు. మీరు ఎం ఎ.; బి.ఎ. చదివిన వాళ్ళు, తెలివికలవాళ్ళు, నన్ను మూర్ఖుణ్ణి చెయ్య డానికి ప్రయత్నించారు. నాతోపాటు సమావేశంలో కూచుని తీర్మానాలు చేసేదీ మీరే, తరువాత ఆ తీర్మానం జరగకుండా కుతంత్రం చేసేదీమీరే! మనం చేసుకున్న నిర్ణయాన్ని సెంట్రల్ కమిటీ సభ్యుడే ఎవడో బయట పెట్టివుంటాడు! అంతటిద్రోహి ఎవడై వుంటాడో నేను వూహించలేకుండా వున్నాను. నాతల తిరిగిపోతోంది! ఇలాంటి కమిటీతో నేను పని చేయు లేను. నేను ఒంటరిగానే చాతనయింది చేస్తాను? నావరకూ నాకు ఒక్క 'మౌజర్' వుంటే చాలు! 'నావల్ల ఇంక ఏమీకాదు!' అనుకున్న క్షణాన నడిబజార్లో పోలీసులతో పోరాడుతూ సమాప్తం ఔతాను! మీరందరూ ఆయుధాలను పంచుకోండి! స్వతంత్రంగా కార్యమాల్ని నిర్మించుకోండి!" అన్నాడు ఆజాద్.

సుశీలాదీదీ పార్టీని రద్దుచేయడాన్ని వ్యతిరేకించింది. ఆజాద్‌తో ఇలా అన్నది "కొందరు మిమ్మల్ని మోసం చేసినమాట నిజమే। కొందరు విజాయితీపరులూ వున్నారు పార్టీలో। (నావైపు చూపి) మృత్యుదండన విధించినప్పటికీ, మిమ్మల్నీ, పార్టీనీ మోసగించని ఇలాంటి మిత్రుడు ఒక్కడు వున్నప్పటికీ పార్టీ సజీవంగా వుంటుంది. పార్టీకి ఇదొక అగ్ని పరీక్ష। నమ్మక ద్రోహం చేసేవారో తెల్సుకుని, పార్టీలోనుంచి తీసెయ్యండి వాళ్ళను।"

ధన్వంతరీ అప్పటికీ తలవంచుకునే వున్నాడు. కన్నీటిని ఆపు కుంటూ ఆర్ద్రస్వరంలో "మీ నాయకత్వానికీ, అధికారానికీ విరుద్ధంగా మిత్రుల్ని రెచ్చగొట్టిన వ్యక్తితోకల్సి నేను పనిచేయలేను. మిమ్మల్ని 'మూర్ఖుడు' అనేవారితోకల్సి పనిచేయడమూ నావల్లకాదు. మిమ్మల్ని అయోగ్యుడనీ, గర్విష్టిఅనీ, 'మందబుద్ధి' అని అన్నవారితో .... " అని అన్నాడు నన్ను ఉద్దేశించే అతడన్నది.

లాహోరులో నామీద ఎన్నో అభాండాల్ని ప్రచారంచేయడం జరి గింది. వాటన్నింటికీ ధన్వంతరీ ఇకనిప్పుడు లాహోరు మిత్రులకు ఏం సమాధానం చెప్పగలడు? పార్టీ నిర్ణయం మార్చుకున్నదని చెప్పాక, ఇంక పంజాబులో అతడి నాయకత్వమూ, గౌరవమూ, సామర్థ్యమూ సమాప్త మౌతాయి-అసలు కారణం అది।

ఆజాద్ మళ్ళీ కోపంగా "నిజమే। నన్ను మూర్ఖుడనేవారితోకల్సి నేను మాత్రం ఎలా పనిచేయగలను?" అన్నాడు.

నేను ఆజాద్‌ని నిందించానని ఒప్పుకున్నాను. "నాకు జరిగిన అన్యాయానికి విరుద్ధంగా పోరాడేప్పుడు భయ్యాని నేను నిందించిన మాట నిజమే। ఆజాద్‌ని నేను 'మందబుద్ధి' అనీ అన్నాను।" అంటూ ఆజాద్ వైపుతిరిగి "నన్ను మవ్వు ఎన్నోమార్లు 'కాకి' అనీ, 'మూర్ఖుడనీ' అన లేదా? నిన్ను 'మందబుద్ధి' అని నేనొక్కడ్నేకాదు అన్నది. అందరూ

అన్నారు. అయితే, అలా అనడం నన్ను నిందించాలనికాదు: నిన్ను మొదట్నుండి తప్పువారి పట్టిస్తున్నారు. నువ్వు అర్థంచేసుకోలేక పోతూ న్నావు." అని అన్నాను.

నేను బహావల్‌పూర్ రోడ్డులోని బంగళాలో జరిగిన ఒక సన్ని వేశాన్ని జ్ఞాపకం చేశాను ఆజాద్‌కు: అప్పుడు భగవతీభాయి, నేను, సుఖదేవరాజు, ధన్వంతరీ, సుశీలాదీదీ, దుర్గాభాబీ-అందరమూ ఆజాద్‌ను గురించి చెప్పుకుని పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుకుంటున్నాము. ఆజాద్‌ను అందరం కల్సి 'మందబుద్ధి' అనేస్తున్నాము.

ఆజాద్‌ను మేము 'మందబుద్ధి' అనేవాళ్ళం: ఐతే, తిరస్కార భావంతో కాదు. అతడిలోని ఆత్మవిశ్వాసాన్ని, మిత్రుల్ని గుడ్డిగా నమ్మ డాన్నిబట్టి 'మందబుద్ధి' అనేవాళ్ళం: నేను ప్రతిదాన్ని సంశయదృష్టితో చూసేవాణ్ణి: మాటిమాటికి పోలీసుల కండ్లల్లో కారం చల్లుతూండేవాణ్ణి: కనుక నన్ను 'కాకి' అనేవారు. కట్టెవిరిచి పొయ్యిలోపెట్టినట్టు మాట్లాడే స్వభావం కావడంవల్ల 'బాంగ్‌డూస్' అని అనేవారు నన్ను. అలంకరణ పట్ల వ్యామోహంకల వాణ్ణి కావడంవల్ల 'ప్రిన్స్' అనీ అనేవాళ్ళు.

నాకూ, ఆజాద్‌కేకాదు. మా సంఘంలోని ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మారు పేరు వుండనేవుంది. అసలు దుర్గాభాబీ ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మారు పేరు పెట్టేస్తుంది: ఇలాంటి మారుపేర్లకు మేము ఎవ్వరమూ కోపం తెచ్చుకునేవాళ్ళంకాదు. కానీ, ఆజాద్‌కు మాత్రం మారుపేర్లంటే మహా కోపం:

ఆజాద్ స్థిమితపడ్డాడు. ధన్వంతరీయొక్క అభిప్రాయాన్ని వ్యతిరే కిస్తూ "కల్సి పనిచేయలేకపోవడం ఎలా? కలిసేపనిచేయాలి: జరిగిందేదో జరిగింది: ఇకదాన్ని మర్చిపోదాం: కొంచెంలో విశ్వాసపాత్రుడూ, విప్లవ సంఘానికి పనికి వచ్చేవాడూ-ఐన మిత్రుణ్ణి శాశ్వతంగా దూరం చేసుకున్న వాళ్ళం; మనలో మనం అనుకున్నవన్నీ మర్చిపోదాం:" అన్నాడు.

ప్రకాశవతి నా భార్యగా పార్టీ వప్పుకుంది. పంజాబుకు ఇన్‌చార్జి ధన్వంతరి అయ్యాడు. నేను ఆజాద్‌తోపాటు వుంటూ అతడికి సహకరి స్తూండాలన్న నిర్ణయం జరిగింది. ధన్వంతరి పంజాబ్ వెళ్ళి, సెంట్రల్ కమిటీ నాపట్ల తన నిర్ణయాన్ని మార్చుకుందని చెప్పాలి నేనూ అతడితో పాటు పంజాబు వెళ్ళి, అతడు పంజాబుకు నాయకుడు కావడంలో నాకెలాంటి అభ్యంతరమూ లేదని మిత్రుల దగ్గర వప్పుకోవాలి; పంజాబులో అతడి నాయకత్వాన్ని సమర్థించాలి; నా దగ్గర వున్న ప్రేలుడు పదార్థాన్నంతటినీ ధన్వంతరికి వప్పచెప్పాలనీ నిర్ణయం జరిగింది.

లాహోరు కుట్ర కేసులో పనిచేస్తున్న పోలీసు ఆఫీసరు ఖాన్‌బహద్దూర్ అబ్దుల్ అజీజ్‌ను కాల్చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో నేను ధన్వంతరికి సహకరించాలన్న నిర్ణయమూ జరిగింది.

తరువాత ఆజాద్ ప్రకాశవతిని బాంబు ఫ్యాక్టరీకి పిలిపించి ఇలా అన్నాడు. "నీపట్ల ఇలా వ్యవహరించినందుకు మేమందరమూ చాలా బాధపడుతూన్నాము. నీమీద నాకేమీ వ్యక్తిగత ద్వేషం లేదు. పార్టీ నిర్ణయాన్ని అనుసరించి మాత్రమే అలా వ్యవహరించవల్సి వచ్చింది. గతాన్ని మర్చిపో!"

# 8. విప్లవ సంఘం రద్దయింది

ఆజాద్, సుశీలాదీదీ - వీరిద్దరి ప్రయత్నాలవల్ల ఢిల్లీలో ఎలాగో మాలో మాకు తలలు ముడిపడ్డాయి. ఐతే, ధన్వంతరీ మాత్రం అసం తృప్తిగానే వున్నాడు. సెంట్రల్ కమిటీ తన నిర్ణయాన్ని మార్చుకున్నాక, ధన్వంతరీకి ఆచరణలో కొన్ని చిక్కులు ఎదురయ్యాయి!

లాహోరు వెళ్ళాక, నా దగ్గరవున్న మొత్తం ప్రేలుడు పదార్థాన్ని ధన్వంతరీకి వప్పచెప్పాను. అతడే పంజాబుకు నాయకుడిగా వుండడంలో నా ఆమోదాన్ని కూడా తెలిపాను. ఐతే, సమస్య అంతటితో తేలిపోలేదు. ధన్వంతరీ పంజాబులో 'యశ్‌పాల్ తన తప్పును అంగీకరించాడు. పార్టీని క్షమాభిక్ష వేడుకున్నాడు. కనుక పార్టీ క్షమించింది' అని చెప్పసాగాడు. అలా చెప్పకపోతే పంజాబులో పార్టీ గౌరవంగానీ, ధన్వంతరీ గౌరవం గానీ - ఏమాత్రం వుండవు.

ఐతే, ధన్వంతరీ అలా చెబితే నేనెందుకు సమర్థిస్తాను? నేనిలా చెప్పసాగాను మిత్రులకు "నావిషయం అసలు సెంట్రల్ కమిటీ ముందు పెట్టనేలేదు. నన్ను కాల్చాలని సెంట్రల్ కమిటీయే నిర్ణయించివుంటే, ఆజాద్ ఒక్కడే ఆ నిర్ణయాన్ని ఎలా మార్చగలడు? నన్ను కాల్చాలన్న నిర్ణయం ఆజాద్ ఒక్కడే చేశాడు. అదీ అతడి స్వబుద్ధి కాదు. వాడీ కోరుల ప్రోత్సాహం! తరువాత తన తప్పును తెల్సుకున్నాడు. వాడీ కోరులు నా మీద మోపిన నేరాలన్నీ అసత్యాలని రుజువైంది. ఆజాద్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు. పార్టీని నేను క్షమాభిక్ష వేడుకున్నమాట అబద్ధం! ఆజాదే నన్ను క్షమాపణ అడిగాడు! నామీద అప త్యాల్ని ఆరోపించినవాళ్ళు క్షమాపణ వేడుకున్నారు!" అని చెప్ప సాగాను.

ఆనాడు ఢిల్లీలో ఆజాద్ ప్రకాశవతిపట్ల నా ప్రవర్తనను గురించి మాత్రమే ప్రశ్నించాడు. నామీద మోపబడిన మిగిలిన అపరాధాల్ని గురించి అతడు ప్రశ్నించనేలేదు. కానీ, నేనే మిగిలిన అపరాధాల్ని గురించి ప్రస్తావించాను. అప్పుడు ఆజాద్ చాలా ఖిన్నవదనుడై "అన్నీ చొల్లు కబుర్లు! వాటినిగురించి మనం ఇక అనుకోవద్దు!" అని అన్నాడు. బహవల్‌పూర్ రోడ్డు బంగళాలో బాంబులు ఎందుకలా ప్రేలాయని మాత్రం అడిగాడు.

నేనూ అవి ఎందుకలా ప్రేలాయో? అవి చాలారోజులపాటు ఆలోచించాను. ఒకమాటు లాహోరులో దేవదత్తశర్మను కల్సుకుని చర్చించానుకూడా! లోపలరాచిన వార్నిష పూర్తిగాఆరకుండా త్వరగా బాంబుల్ని కూరడంవల్ల, అవి అలా ప్రేలివుంటాయనుకున్నాము.

అప్పట్లో ఇంద్రపాల్, అతడి సహచరులూ - ఘోరమైన ఆర్థిక బాధలతో వేగిపోతూన్నారు. ధన్వంతరీగానీ, సుఖదేవ్‌రాజ్‌గానీ-అతడికి ఎలాంటిసాయమూ చేయడంలేదు. లాహోరులో ధన్వంతరీ ఏ మాత్రం కార్యక్రమాన్ని నిర్వహించలేకపోతూన్నాడు. నా కారణంవల్ల ఏర్పడ్డ గంద్రగోళాన్ని సర్దడానికే అతడికి ఇరవై నాలుగు గంటలు చాలడంలేదు. నాపనీ అలాగేవుంది. ఢిల్లీలో కొంత తగాదా సర్దుబాటు అయినప్పటికీ లాహోరులోని మిత్రుల్లో వెనుకటి స్థానం నాకు లభించలేదు. అప్పుడు నేను ఇంద్రపాల్ సాయంతో కార్యక్రమాన్ని కొంతవరకూ ముందుకు తీసుకు వెళ్ళడానికి ప్రయత్నించాను.

ఆగస్టు 26వ తారీకునో లేక 27వ తారీకునో ఇంద్రపాల్ తీసుకున్న గదికి వెళ్ళాను, ఇంటిముందు ఒకవ్యక్తి అకారణంగా కూచుని వుండడాన్ని గమనించాను. గేటుదాటి ప్రాంగణంలోకి వెళ్ళకముందు నేనతణ్ణి చూడలేదు. వెనక్కు తిరిగిరావడం బాగుండదు. నేరుగా వెళ్ళి

ఏమాత్రం జంకూ గొంకూలేకుండా తలుపుకొట్టి, లోపలకు వెళ్ళాను. వెళుతూనే "నీగదిమీద సి. ఐ. డి. కన్నుపడ్డట్టుంది. ఎవడో సి ఐ. డి. బయట కాపలా కాస్తున్నాడు. నీరావచ్చాక వెనక్కి తిరిగిపోతే అతడు అనుమాన పడవచ్చును. నేను ఇప్పుడేవెళుతూన్నాను. నువ్వూ బయటికిరా. ఎక్కడయినా కూచుని మాట్లాడుకోవచ్చును!" అని అన్నాను ఇంద్రపాల్ తో.

నన్ను చూసి ఇంద్రపాల్ ఆశ్చర్యపడ్డాడు. కంగారుపడ్డాడుకూడాను. "నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావ్? మూడు రోజులనుండి ఈ ఇంటి చుట్టూ సి. ఐ. డి లు తిరుగుతూన్నారు. ఇక్కడేకాదు గ్వాల్ మండీలోని ఇంటిని, జహంగీర్ ఇంటినికూడా పోలీసులు కమ్మేశారు!" అని అన్నాడు ఇంద్రపాల్.

నేను నిలబడే "సి.ఐ డి.లకు అనుమానం కలిగిందని తెలిశాక వరారు ఎందుకు కాలేదు?" అని అడిగాను ఇంద్రపాల్ ను.

"మూడు రోజుల నుండి తిండికి కూడా డబ్బుల్లేవు. ఎవరి దగ్గర కైనా వెళ్ళి అడుగుదామంటే, పోలీసులు వెంటాడుతున్నారు! ఇంక ఎలా వరారు కావడం?" అన్నాడు ఇంద్రపాల్.

ఇంద్రపాల్ దగ్గర బాంబుల డిప్పలు కొన్ని వుండాలి. 'అవి ఎక్కడ పెట్టావు?' అని అడిగాను.

"నందలాల్ మాస్టారింట్లో వున్నాయి!" అన్నాడు ఇంద్రపాల్.

"ఇద్దరం బయటకు పెడదాంపద! ఇద్దరం చెరోరోడ్డునా వెడదాం. పోలీసు యిద్దర్లో ఎవర్నో ఒకర్నే వెంటాడుతాడు!" అన్నాను తొందర్లో

ఇంద్రపాల్ "ఔను. ఇద్దరం బయటకు వెడితే, అతడు నన్నే వెంబడిస్తాడు నువ్వు తప్పించుకోవచ్చును!" నీ దగ్గర ఏమైనా డబ్బులు వున్నయ్యా? బీడీలు తెచ్చుకోవడానికి అన్నట్టు నేనూ బయటకు వస్తాను!" అన్నాడు ఇంద్రపాల్.

నాదగ్గరా అప్పుడు రెండుమూడు రూపాయీలకంటే ఎక్కువలేదు. ఆ డబ్బుల్ని ఇంద్రపాల్‌కు ఇచ్చేశాను "రాత్రి ఎనిమిది గంటలాచాయల 'చౌబుర్జీ' దగ్గరకురా! లేకపోతే, రేపు ఉదయం రావీనదికి వెళ్ళే రోడ్డు మీదకురా! పదిపదిహేను రూపాయీలు ఎక్కడయినాచూసి ఇస్తాను. జాగ్రత్త, పోలీసుల్ని వెంటపెట్టుకురాకు!" అన్నాను.

మేము గవర్నమెంట్ కాలేజీ మీదుగా అనార్కలీ బజారుకు వెళ్ళాము. ఇంద్రపాల్ ఒక దుకాణందగ్గర 'లస్సీ' త్రాగడానికి ఆగాడు. నేను రెండడుగులు ముందుకువెళ్ళి, వెనక్కుతిరిగి "సరే, నేను దుకాణా నికి వెడుతూన్నాను. సాయంకాలం వస్తాను. ఎక్కడికీ వెళ్ళకు!" అని ఇంద్రపాల్‌కు చెబుతూ సి.ఐ డి. ఎక్కడ ఉన్నాడోనని చూశాను.

సి ఐ.డి. ఇంద్రపాల్‌కు కొద్ది దూరంలో, నిలబడి వున్నాడు. ఇంద్రపాల్ కనుమరుగు కాకుండా చూసుకుంటున్నాడు. ఐనా, నేను మెడికల్ కాలేజీలోకివెళ్ళి కొంతసేపు ఎవరినో వెతుకుతూన్నట్టు అటూ ఇటూ తిరిగాను. నన్నెవరూ వెంబడించడంలేదని నిశ్చయం అయ్యాక అక్కణ్ణుండి వెళ్ళిపోయాను.

తనమీద పోలీసులకు అనుమానం కలిగిందని తెలిశాక ఇంద్రపాల్ తన దగ్గరవున్న ఆయుధాల్ని, ఇతర వస్తువుల్ని మెల్లగా మిత్రులఇండ్లకు చేరవేశాడు. తనుమాత్రం అక్కణ్ణుండి కదల్లేదు. అతడి ఈప్రవర్తన చాలా అనుచితం అనిపించింది నాకు! ఇంద్రపాల్ అలా పరారు కాక పోవడానికీ కారణంవుంది. మిత్రుల పరస్పర కొట్లాటలూ, ఆర్థికబాధలూ అతణ్ణి చాలా నిరాశపరిచాయి. 'పరారై చేయగలిగింది ఏమీలేదు' అన్న స్థితికి వచ్చాడు 'తనమీద అపరాధాన్ని మోపడానికి ఆధారాలు ఏమీలేవు గనక కొద్దిరోజులు జైల్లోవుంచి వదిలిపెట్టేస్తారు ఆ తరువాత ప్రశాంత మైన జీవితాన్ని గడపవచ్చును!'అని ఇంద్రపాల్ వూహించిఉండవచ్చును. అతడా రాత్రి 'చౌబుర్జీ' దగ్గరకు రాలేదు. మర్నాడు ఉదయం రావీ

వరికి పోయే రోడ్డువద్దకూ రాలేదు. అతడి గదిముందు ఆరోజు సాయం కాలంనుండే పోలీసులు కాపలా అధికంచేశారు. మర్నాడు తెల్లవారు ఝామున ఐదుగంటలకు, అతణ్ణీ, అతడి సహచరుల్ని ఎక్కడివాళ్ళను అక్కడ అరెస్టు చేశారు.

మాలో మాకు ఏర్పడ్డ మనస్పర్ధలన్నింటినీ మరచి, ధన్వంతరీతో కల్సి పనిచేయడానికి మరోమాటు ప్రయత్నించాను. త్వరలో ఏదో ఒక 'యాక్షన్'ని జరిపి చెదరిన నాస్థానాన్ని స్థిరపరచుకోవాలన్న తాపత్రయంలో వున్నాను నేను. 'యాక్షన్'లో నాకు సహకరించడానికి ధన్వంతరి తిర స్కరించాడు. అతడికి నా ప్రస్తావనలో, నాస్థితిని కుదుటపరచుకోవాలన్న స్వార్ధమే కనుపించింది। అప్పట్లో ధన్వంతరి లాహోరులోని అబ్దుల్ అజీజ్‌ని చంపివేయాలన్న ప్లానులో వున్నాడు. ఐతే, ప్లాను నెరవేరడం లేదు. ధన్వంతరీ నాతో మనస్సువిప్పి మాట్లాడడంలేదు అతడికి సలహా దారు-సుఖదేవరాజు। అబ్దుల్ అజీజ్ మీద దాడిచేయడాన్ని గురించి, నాకు తెల్సిన దాన్నిబట్టి, ఇలా నా అభిప్రాయాన్నిచ్చాను. 'ఈ ప్లానులో ఆత్మ రక్షణకే ప్రాముఖ్యతఇవ్వబడ్డది ఆత్మరక్షణకు ఇంత జాగ్రత్త తీసుకున్న ప్లాను ఎన్నటికీ సఫలంకాదు।' నా స్వరం కటువుగా వుండి వుండవచ్చు. అయితే, నేనుచెప్పింది మాత్రం సత్యం। సుఖదేవ్‌రాజ్ ప్లానుప్రకారం ఒకమాటు ఖాన్‌బహద్దూర్ కార్లోపెళుతూండగా, కాల్పడం జరిగింది. ఆ కాల్పులవల్ల అవతలివారు తగు జాగ్రత్తలు తీసుకోవడం మినహా మరొ కటి జరగలేదు. అప్పట్లో ధన్వంతరీకి సుఖదేవ్‌రాజుపట్ల గొప్పవిశ్వాసం వుండేది. అతడి సాహసం, శౌర్యం, తెలివితేటలపట్ల - ప్రగాఢమైన విశ్వాసంవుండేది. తరువాత రెండునెల్లకే ఆవిశ్వాసం పటాపంచలైంది।

రెండురోజుల తరువాత ధన్వంతరీ, "నీతోకల్సి పనిచేయలేనని" స్పష్టంగా చెప్పేశాడు నాకు. ఇక నేను పంజాబులోవుండే పార్టీసజావుగా సాగే అవకాశమూ కనుపించలేదు. మా ఇద్దరిలోనూ, ఒకరిమీద ఒకరికి

అభిప్రాయభేదాలువున్నాయి. మా ఇద్దరి సమస్యల్నీ పోలిట్‌బ్యూరో, సెంట్రల్ కమిటీ ముందు వుంచాలనుకున్నాం. మేమిద్దరం ఢిల్లీవచ్చేశాం. ఆజాద్‌ను పిలిపించాం. కైలాసపతి ప్రభుత్వసాక్షి అయ్యాక అతడు తన వాఙ్మూలంలో ఈ సమావేశాన్నిగురించి చెప్పాడు. ఈ సమావేశం సెప్టెంబరు నాలుగున జరిగింది.

ధన్వంతరి మళ్ళీ నామీద కొన్ని అపరాధాల్ని మోపాడు. "నేను నా గౌరవాన్ని నిలుపుకోడానికి పార్టీని నిందిస్తున్నాననీ, పార్టీతో నిరంతు శత్వం గూడుకట్టుకుందని ప్రచారం చేస్తున్నాననీ, చెప్పాడు. మరికూడా కొన్ని నేరాల్ని ఆరోపించి, నన్ను పార్టీనుండి వెలిగించితేగాని తాను పార్టీలో పనిచేయలేనని చెప్పుకున్నాడు ధన్వంతరి. కైలాసపతి అతణ్ణి సమర్థించాడు.

నామీద నేరాల్నిమోపి, నన్ను సెంట్రల్ కమిటీ కాల్చివేయడానికి నిర్ణయించిందని లాహోరు మిత్రుల్తో చెప్పుకున్న బాధ్యతగల వ్యక్తులు ఒకరకంగా ఇరకాటంలో పడ్డారు. ఆ నిర్ణయం మారిపోవడానికి కారణం ఏమి చెప్పగలరు? 'యశపాల్ తన తప్పును ఒప్పుకుని, క్షమాపణను కోరాడు!' అని చెప్పుకోవాలి. వాళ్ళు అలా క్షమాపణకోరాననీ, తప్పుల్ని అంగీకరిందాననీచెబితే నేనెందుకు ఒప్పుకుంటాను? నేను ఇలా చెప్ప సాగాను "నామీదమోపిన నేరాలు క్షమించదగినవికావు. సెంట్రల్‌కమిటీ ముందు నా అపరాధాల్ని పెట్టండి. విచారణ జరపండి. నేరం రుజూ అయితే దండించండి! అంతేగాని, దయాధర్మానికి నన్నేమీ క్షమించ నవుసరంలేదు!" అంటున్నాను.

ఈ విషయమై ఆజాద్‌తో ఇలా అన్నాను "ఇది నా ఆత్మ గౌర వానికి సంబంధించిన ప్రశ్న! కనుక, ఈ సమస్యను సెంట్రల్ కమిటీలో చర్చకు పెట్టవల్సిందే!" అని పట్టుపట్టాను.

ఆజాద్ చిరాకు పడ్డారు. "సెంట్రల్ కమిటీలేదు; ఏమీలేదు! కమిటీలోజరిగిన నిర్ణయం అమలుజరగకుండాచేసిన, ఆ విశ్వాసఘాతకుడు ఎవరో తెలిసేవరకూ నేనీ సెంట్రల్ కమిటీని అంగీకరించను!" అన్నాడు.

నేను మౌనంగా వుండిపోయాను.

ధన్వంతరీ, కైలాసపతి-వీరిద్దరూ నన్ను పార్టీనుంచి తొలగించవలసిందని పట్టుపట్టడంతో, ఆజాద్ అసలు పార్టీనే రద్దుచేశాడు. ధన్వంతరీ, కైలాసపతి నాతోపాటు కల్సి పనిచేయడంకంటే పార్టీ రద్దుఅవడమే మేలని భావించారు. వారు అందుకే అంగీకరించారు. భయ్యా ఆజాద్ మొత్తం ఆయుధాల్ని ఏడు భాగాలుచేశాడు. బీహార్, యు పి., పంజాబ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర - ఈ ఆరుప్రాంతాలకు ఆరుభాగాలను ఇచ్చేశాడు. ఏడవభాగాన్ని నాకు ఇచ్చేశాడు. నేను ఏప్రాంతానికీ ప్రతినిధిని కాకపోయినప్పటికీ నాకూ సమానభాగాన్ని ఇవ్వడమేకాకుండా ఓ మంచి రివాల్వర్‌ని అదనంగా ఇస్తూ ఆర్ద్రస్వరంలో "సోహన్‌కు [యశపాల్‌కు] ఆయుధాల్ని ఇవ్వడం కొందరికి అనుచితం అనిపించవచ్చును. కానీ, నేనిలా ఇవ్వడం ఉచితమనుకుని ఇస్తున్నాను! ఇతరులు ఈ ఆయుధాల్ని ఉపయోగిస్తారో, లేదో చెప్పలేను. సోహన్ మాత్రం తప్పకుండా వీటిని ఉపయోగిస్తాడు!" అన్నాడు.

నామీద ఎంత ద్వేషం ఉన్నప్పటికీ, నాకు ఆయుధాలివ్వడాన్ని ధన్వంతరీ వ్యతిరేకించలేదు. అతడికి ఆజాద్‌మీద గొప్ప విశ్వాసం. ఆజాద్ చేసేపనిని వ్యతిరేకించలేదు. విప్లవ సంఘం విచ్ఛిన్నం అయింది. దురదృష్టకరమైన ఈస్థితికి కారణం నేనయినందుకు చాలా విచారించాను. కానీ, చేయగలిగింది ఏమీలేదు!

ధన్వంతరీ, కైలాసపతీ వీరికేకాకుండా విప్లవసంఘంలోని ఇతర సభ్యులైన విమల్, బచ్చన్-వీరికి నా ప్రవర్తన నచ్చలేదు. నామీద మోపిన ఇతర అపరాధాల్ని అట్లావుంచినా, ప్రకాశవతీ, నేనూ - భార్యా

భర్తలుగా ఉండడం అన్నది వీరి దృష్టిలో గొప్ప అపరాధం! విప్లవ కార్యక్రమాల్ని సాగించడానికి, అత్యున్నతమైన. నియమబద్ధమైన త్యాగ మయ జీవితం గడపడం అవసరం అన్న అభిప్రాయం కలవారుకావడం వల్ల మా సంబంధం సిగ్గుచేటయిందిగా వారు భావించారు. మా సంఘ సభ్యుడైన ఆప్టే అనే యువకుడు, మూడు నాలుగు ఏళ్ళ క్రితం ఇంత కంటే ఘోరమైన పొరపాటు ఒకటి చేశాడు. విప్లవ సంఘంపట్ల సాను భూతిగల ఒక మిత్రుడి భార్యతో అనుచితసంబంధాన్ని పెట్టుకున్నాడు. తరువాత ఆప్టేని లక్నోలో కాల్చేయడమూ జరిగింది.

స్త్రీ సంబంధమైన విషయాల్లో 'హిన్రప్రస' సభ్యులమైన మాదృష్టి కోణానికీ, మాకంటే ముందున్న విప్లవకారుల దృష్టికోణానికీ చాలా వ్యత్యాసం వుంది! స్త్రీ అంటే కేవలం నరకద్వారమనిగానీ, ఆమె గురించిన ఆలోచనే పాపకృత్యమనిగానీ - మేము అనుకునేవాళ్ళంకాదు. స్త్రీని ద్వేషించేవాళ్ళమూకాదు. సమాజంలో స్త్రీయొక్క దయనీయస్థితిని చూసి, సానుభూతి కనబరచేవాళ్ళం! సమాజానికి ఆమె చేస్తున్న సేవ కారణంగా స్త్రీని గౌరవించేవాళ్ళం! పూజార్హమైందిగా భావించేవాళ్ళం! స్త్రీపట్ల మా సంఘసభ్యుల ప్రవర్తన రోమన్‌కేథలిక్‌శాఖకు చెందిన క్రిష్టియన్ బ్రహ్మచారుల ప్రవర్తనలాటిది! వాళ్ళు స్త్రీని క్రీస్తుతల్లి మరియమ్మగా భావిస్తారు. అంటే కన్యాత్వం చెడకుండా పుత్రుణ్ణికన్న పవిత్రమూర్తిలా భావించి, స్త్రీ సంగమాన్ని క్షమించరాని పాపంగా (ఒరిజినల్‌సిన్) భావిస్తారు! ప్రేమ మానవుల్లోని స్వార్థాన్ని చంపుతుందని వాళ్ళు ఒప్పుకుంటారు. ఐతే, ప్రేమవల్ల నియమనిబంధనలు సళ్ళవడులు తాయన్న భయంవల్ల ప్రేమను అతీంద్రియ విషయంగా బోధిస్తారు! అలాగే జీవితంలో స్త్రీని ప్రేమించడంగానీ, ఆమెపట్ల ఆకర్షణకలిగి వుండ డంగానీ మహాపరాధంగా భావించడం ఆనాటి విప్లవకారులకు సహజం! కానీ, నేనూ, నాలాంటి మరికొందరి దృష్టికోణమూ, ఇందుకు భిన్నంగా

వుండేది. మేము విప్లవకార్యక్రమాల్ని జీవితపర్యంతం అనుసరించవల్సి వుంది. అలాంటప్పుడు మా కార్యక్రమాలకు అభ్యంతరం కానంతవరకూ జీవితంలోని సహజ అవసరాలను తీర్చుకోవడంలో తప్పేముంది? అందుకు భయపడేవాళ్ళమూ కాదు। మా సంఘ సభ్యుల్లోనే స్త్రీపట్ల మాలాంటి సహజ దృష్టికోణంలేని కొందరికి నా ప్రవర్తన విప్లవ సంఘానికి కళంకాన్ని ఆపాదించేదిగా కనుపించింది।

ఇది జరిగిన కొన్నాళ్ళవరకూ నేను చాలా విచారంగా, విషాదంగా జీవితాన్ని గడిపాను. మాటిమాటికీ ఆత్మవిమర్శ చేసుకునేవాణ్ణి। ప్రేమ కారణంగా విప్లవకర్తవ్యాన్ని నేను ఏమాత్రమూ నిర్లక్ష్యం చేయలేదు. ఐతే, నిర్లక్ష్యం చేశానా? చేయలేదా? అనేది ముఖ్యంకాదువాళ్ళకు। నేనొక అనుచితమైన పనిచేశాననేదే ముఖ్యం। ఆనాటి విప్లవకారుల్లో ఎక్కువమంది నాదృష్టికోణాన్ని అంగీకరించలేదు. కొందరు ఆధునికులైన విప్లవకారులు మాత్రం నాదృష్టికోణాన్ని అర్థం చేసుకున్నట్టు కనుపించేవారు. గత పది పదిహేను సంవత్సరాలుగా వ్యక్తిగత స్వార్థాన్ని, తమ కుటుంబాల చింతా-చీకుల్ని పక్కకునెట్టి, సోషలిష్టు పార్టీలోనూ, కమ్యూనిష్టు పార్టీలోనూ పనిచేస్తూన్న మిత్రులు వున్నారు. సాయుధ విప్లవమే తమ లక్ష్యం కావడంవల్ల వీళ్ళనీ విప్లవకారులనే అనాలి। ఈ విప్లవకారులు ఒక విషయాన్ని నిర్ద్వందంగా అంగీకరించారు. విప్లవధ్యేయాన్ని నిరంతరం కలిగి వుండడానికి జీవితాన్ని స్వాభావికంగా గడపాలని అంగీకరించారు. ప్రేమకు ఉచితమైన అవకాశాన్నీయడం కూడా అవసరం అని తెల్సుకున్నారు. విప్లవకార్యకర్తలయిన స్త్రీపురుషులు నైతికపతనం చెందకుండావుండడానికి పరస్పరప్రేమైక వివాహసంబంధాల్ని కలిగివుండడం అవసరమని గమనించారు.

ధన్వంతరి విప్లవకర్తవ్యాన్ని, ఈనాటివరకూ ఎంతో విజాయితీతో నిర్వహిస్తూ వచ్చాడు. 1930 నవంబరు 1వ తారీకున అతడు ఢిల్లీలో

అరెస్టయ్యాడు. ఆ తరువాత జైల్లోనూ పోరాడుతూనే వున్నాడు. ద్వీపాంతరవాసం అనుభవించాడు. అక్కడ ప్రగతిశీల విప్లవకారుల్తో కల్సి మార్క్సిజాన్ని అధ్యయనం చేశాడు. జైలునించీ విడుదల అయ్యాక ఆరోగ్యం బాగాలేనిస్థితిలోనూ అతడెంతో శ్రద్ధగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. విప్లవ కార్యక్రమాల్ని నిర్వహిస్తూనే అతడు 1950లో లక్నో వచ్చాడు. అప్పుడు జాలంధర్‌లో జరుగబోయే తన వివాహానికి నన్ను రమ్మని ఆహ్వానించాడు. పెండ్లికూతురు తన అభిప్రాయాల్ని మార్చుకోవడంవల్ల ఆ వివాహం జరగలేదనుకోండి. ఐతే, ప్రేమను భౌతికంగా అనుభవించే విషయంలో ధన్వంతరీ దృష్టికోణంలో మార్పు వచ్చినట్టు స్పష్టం అవుతుంది.

ఈ విషయంలో కైలాసపతి ప్రవర్తనను సందర్భం వచ్చినప్పుడు వివరిస్తాను.

విప్లవ సంఘం విచ్ఛిన్నమయింది. మేమందరం చాలా విచారపడ్డాము. ఎంత విచారపడ్డా ఘోరమైన ఆ యదార్థాన్ని అంగీకరించక తప్పలేదు ప్రస్తుత స్థితినుండి బయటపడడానికి మరో వుపాయం లేదు. నా పరిస్థితి నాకే దయనీయమందిగా కనుపించింది. నాతో సహకరించే లాహోరులోని నిమ్న మధ్యతరగతి మిత్రులందరూ ఒకేమాటు అరెస్టవడంతో నేను నిస్సహాయుణ్ణయ్యాను.

ఎంతోనిరాశతో గడిపానారోజుల్ని. ఆ నిరాశాంధకారంలో, ఆజాద్ చెప్పిన చివరిమాట ఒక్కటి మాత్రం ఆశాజ్యోతిగా కనబడుతూన్నది. "సోహన్! ఇప్పుడింకేమీ చేయలేము. మనం ఏ కిళ్ళీకొట్టో పెట్టుకుని, పొట్టపోసుకుంటూ జీవితాన్ని గడపడానికి ప్రాధాన్యత నివ్వము నువ్వు ఎప్పుడు ఏం చేయాలనుకున్నా నా సహకారం వుంటుందన్న విషయాన్ని మర్చిపోకు!"

ఆజాద్ ఢిల్లీలో, కాన్పూర్‌లో తనువుండే ప్రదేశాల్ని చెప్పాడు. అక్కడికివెళ్ళి కనుక్కుంటే ఆజాద్‌ను కల్సుకోవడానికి వీలవుతుంది.

# 9, పార్టీని కాపాడడానికి ఆజాద్ ప్రయత్నం

1930 డిసెంబర్ 4వ తారీకు మధ్యాహ్నం, ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీలో, ఆజాద్ కేంద్రకమిటీని రద్దుచేశాడు. కేంద్ర కమిటీని రద్దు చేయడానికి కారణం నన్ను కాల్చివేసేయాలన్న నిర్ణయాన్ని మార్చివేయ వల్సిరావడమే! ఈ నిర్ణయాన్ని మార్చుకోవడంవల్ల రెండు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఒకటి, ధన్వంతరీ, సుఖదేవరాజు - పంజాబు వెళ్ళి నన్ను దండించకుండా వదిలిపెట్టడానికి గల కారణాల్ని ఏమని వివరించ గలరు? యశ్‌పాల్ మీద ఆరోపించిన నేరాలు అబద్ధాలని చెప్తారను కుందాం, అలాచెప్తే ఆ నేరాల్ని ఆరోపించింది వాళ్ళేగనుక, పార్టీ సభ్యుల్లో వాళ్ళమీది విశ్వాసం సన్నగిల్లుతుంది! పోనీ, యశ్‌పాల్ తన అపరాధాలకు క్షమాపణ కోరుకున్నాడని చెప్తారనుకుంటే, శిక్ష విధించక ముందే క్షమించాలి గదా? పైగా, నేను ఆ అవమానాన్ని ఎందుకు సహిస్తాను? క్షమించమని కోరుకోవడమంటే అపరాధాల్ని ఒప్పుకోవడమేగదా? నామీద అపరాధాల్ని మోపినవాళ్ళూ నేనూ ఒకేపార్టీలో కల్సి ఇంక పని చేయడం సంభవం కాదు.

కొరకరాని కొయ్యలా తయారైన రెండవ సమస్య 'నన్ను కాల్చే యాలన్న నిర్ణయం బయటికి ఎలా వెళ్ళింది?' అన్నది! కేంద్ర కమిటీ లోని వ్యక్తే ఈ రహస్యాన్ని బైటపెట్టగలడు! ఈ రహస్యాన్ని బయట పెట్టింది ఎవరో తెలియనంతవరకూ సభ్యులందర్నీ అనుమానించడం జరుగుతుంది. అనుమానాస్పదుడైన వ్యక్తి తమలో ఉన్నాడని తెలిశాక, ఇంక కేంద్రకమిటీ సభ్యులు ఎలా పనిచేయగలరు?

నేను ఏ విధంగానూ, నాకు రహస్యంచెప్పిన వ్యక్తిపేరు చెప్ప డానికి సిద్ధంగాలేను. అంతేకాదు, పరిస్థితిని గజిబిజిచేసి, ఎవరిని అను

మానించాల్నో తోచకుండా చేస్తున్నాను. నా ప్రవర్తనవల్ల కమిటీసభ్యులు, స్పష్టంగా 'ఫలానావారు రహస్యాన్ని బైటపెట్టారని' ఊహించనుకూడా ఊహించలేకుండా వున్నారు పార్టీమీదా, నామీద విశ్వాసంగల మిత్రుల పట్ల, అప్పట్లో నేను నిర్వహించవలసిన కర్తవ్యం అదేననుకున్నాను. అయినప్పటికీ కొన్నివిషయాలు కొంత ఊహకు ఆస్కారాన్ని ఇస్తూ న్నాయి. నేను కాన్పూరునుండి రాగానే ప్రకాశవతిని బాంబు ఫ్యాక్టరీలో నుంచి తీసుకువెళ్ళడం, నాకు రహస్యం కాన్పూరులో తెల్సిందనడానికి నిదర్శనం! అజాద్‌ను మభ్యపెట్టడానికి అతడితో 'నాకు ఢిల్లీలోనే రహస్యం తెల్సింది' అని చెప్పాను. ఢిల్లీలో నాకు రహస్యాన్ని ఎవరు చెప్తారు? చెప్తే కైలాసపతి చెప్పివుండాలి! కానీ, అజాద్‌కు వీరభద్ర తివారీ మీదనే అనుమానం కలిగింది. బహుశ అతడు కమిటీలో మొదట ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి వుండవచ్చు. ఇతర సభ్యులు పట్టుపట్టడం వల్ల అతడు పూరుకుని వుండవచ్చు! అజాద్‌కు వీరభద్రతివారీమీద అనుమానంవున్నా, తగిన ఆధారాలు లేకుండా అతడిమీద చర్యతీసుకోవడం ఎలా? పార్టీ సభ్యులు, నమ్మకస్తుడూ, పార్టీకి ఎంతో ఉపయోగపడగల కార్యకర్త నొకణ్ణి చంపుకోవడంలాంటి ఘోర తప్పిదాన్నుండి తప్పించుకున్నందుకు సంతోషపడ్డారు. ఐతే, కేంద్రకమిటీని పూర్తిగా విశ్వసించడానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడ్డందుకు విచారిస్తూన్నారుకూడాను!

నన్ను కాల్చేయాలన్న కేంద్రకమిటీ నిర్ణయం మారిపోవడంవల్ల ధన్వంతరీ, సుఖదేవరాజు చాలా అసంతృప్తిని చెందారు. నాకూ ఏమంత సంతృప్తి నివ్వలేకపోయింది, ఆ నిర్ణయాన్ని మార్చిన పద్ధతి! నన్ను చాలా అవమానపరిచారు. ఆ అవమానానికి తగిన ప్రతీకారం జరగాలని నా ఉద్దేశం! అంతేకాదు, నన్ను ఏమాత్రం అడక్కుండా, అంటే నా తప్పేమిటో నాకు చెప్పకుండా ఈ నిర్ణయానికి అంగీకరించినందుకు అజాద్‌మీదా నాకు కోపంవచ్చింది. ధన్వంతరీ పంజాబులో, నేను ఝమా

పణ కోరుకోవడంవల్ల ఆజాద్ క్షమించాడని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. నేను అతడి ప్రచారాన్ని ఖండించడమేకాకుండా 'కేంద్రకమిటీ నిర్ణయాన్ని త్రోసిరాజని నన్ను క్షమించడానికి ఆజాద్ ఎవడు?' అని వాదించసాగాను. 'ఒకవ్యక్తి కమిటీసభ్యుల నిర్ణయాన్ని ఎలా మార్చ గలడు?' అని అడగసాగాను. 'నన్ను కాల్చాలన్న నిర్ణయమే జరగలేదు. అంతా అబద్ధం. అనేశాను. నా యీ వాదనలను ఆజాద్‌కు చెప్పారు. అతడు మండిపడ్డాడు. తర్కదృష్టితో నావాదన బాగానేవున్నా, ఆనాటి పరిస్థితుల్లో ఆజాద్‌మీది విశ్వాసమే మమ్మల్నందర్ని ఒక పార్టీగా నిల బెట్టింది. మేమందరం సాయుధులం! ఒకరిమీద ఒకరికి వల్లమాలిన కోపం రగుల్తోంది. అయినప్పటికీ మేము ఒకళ్ళనొకళ్ళం చంపుకోలేదు. వ్యక్తిగత అవమానాలకంటే ఆదర్శానికి ప్రాధాన్యతనిచ్చేవాళ్ళం. పార్టీ నిర్ణయించిన నియమాల్ని పాటించడమే ముఖ్యం అనుకునేవాళ్ళం! మరి ఆనాడు పార్టీయే ఆజాద్, ఆజాదే పార్టీగావుండేది! ఐతే, ఒంటరిగా ఏ ఒక్క నిర్ణయాన్నిగానీ చేయగల శక్తి ఆజాద్‌కులేదు.

ఆజాద్‌కూడా చాలా కఠినపరిస్థితుల్లో చిక్కుకున్నాడు. మరో రకంగా చెప్పాలంటే, అతి దయనీయమైన స్థితిలో పడ్డాడు. పార్టీసభ్యుల్లో ఎవర్ని వదులుకోవడమూ అతడికి ఇష్టంలేదు. మిగిలినవారికోసం పోనీ, నన్ను వదులుకుంటాడా అంటే అదీచేయలేకుండావున్నాడు. కనుక ఈ పరిస్థితులన్నీ సవ్యమవడానికి పార్టీని రద్దుచేయడం ఒకటేమార్గం. అప్ప టికి పార్టీని రద్దుచేస్తే, తరువాత కొత్త సభ్యుల్తో, కొత్త ఆధారాల్తో, కొత్తగా మళ్ళీ పార్టీని స్థాపించవచ్చును. అప్పుడు నేను ఏప్రాంతానికీ ప్రతినిధిని కాకపోయినప్పటికీ, అన్ని ప్రాంతాల ప్రతినిధులకు ఇచ్చి నట్లుగానే నాకూ ఆయుధాల్నిచ్చాడు ఆజాద్! అతడు అందర్నీ తమ తమ ప్రాంతాల్లో స్వతంత్రంగా కార్యక్రమాల్ని నిర్వహించమన్నాడు. ఎవరికి తన అవసరంవచ్చినా తప్పక సహకరిస్తానన్నాడు.

ఆజాద్ నాతో ఇలా అన్నాడు. "ఎవరికి వారిని స్వతంత్రంగా పని చేయనిద్దాం! మనిద్దరం విడిగా చేతనయింది చేద్దాం! అప్పుడుగానీ ఈ పోట్లాటలు సమసిపోవు!" ఈ నిర్ణయం నన్ను సంతృప్తి పరచక పోయినా, అంతకంటే చేయగలిగిందికూడా ఏమీలేదు. అప్పుడే మరో విషయం తెల్సింది. ధన్వంతరీ, సుఖదేవ్‌రాజు అబ్దుల్ అజీజ్‌మీద కాల్పులు జరిపారు. అజీజ్ కాలువ వైపునుంచి కార్లో వస్తూండగా అతడిపై కాల్పులు జరిపారు. ఐతే, అజీజ్‌కు ఏమాత్రం దెబ్బలు తగల లేదు. ఇటు కాల్చిన వాళ్ళూ పట్టుపడలేదు. ఈ దాడిని గురించి లాహోరులో ధన్వంతరీలోగడే నాతో మాట్లాడాడు. నేను అప్పుడే ఇలా అన్నాను "ఈ ప్లానులో దాడిచేసేవారి ప్రాణరక్షణకే ప్రాధాన్యత ఎక్కువ కనిపిస్తోంది! కనుక విజయం లభించడం అనుమానాస్పదం!" ఆజాద్‌తోటీ పైదాడిని గురించి ఇలాగే చెప్పాను. అప్పట్లో బాగా కోపంగా వున్నాను. నేనే ఏదో ఒకటిచేసి చెదరిన గౌరవాన్నికూడ కట్టుకోవాలన్న ఆదుర్దాలోనూ వున్నాను. కనుక, నా స్వరం బాగా కటువుగా మారిపోయింది. నేను చెప్పింది నిజమే అయినప్పటికీ స్వరంలో గర్వం, ఇతర్లపట్ల తిరస్కారం ధ్వనిస్తూన్నాయి. అలాంటప్పుడు ఇతర్లు నా మాటల్ని చెవిని పెట్టకపోవడంలో ఆశ్చర్యం ఏముంది?

ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీలో తయారుచేసిన ప్రేలుడు పదార్థం చాలా వుంది. ఫ్యాక్టరీలో అవకాశం వున్నప్పుడు బాంబులు తయారుచేయడాన్ని గురించి మరికొన్ని గ్రంధాల్ని చదవడం జరిగింది. ఆ పరిజ్ఞానంతో పిక్రిక్ యాసిడ్‌ను ఇసుకలో పూడ్చి, పుటంవేసి ద్రవీకరించవచ్చునని తెల్సుకున్నాను. అలా కొద్ది పరిమాణమూ, అధిక శక్తివంతమూ అయిన బాంబుల్ని తయారు చేయవచ్చును. తయారు చేసుకున్నాముకూడాను. ఆజాద్ కాన్పూర్‌నుంచి డైనమైట్‌ను తెచ్చాడు. ఇలా ఆయుధబలం సమకూడడంతో ఆజాద్ తన అభిప్రాయాన్నిలా వ్యక్తపరిచాడు. "ఒక

మాటు వైస్రాయి స్పెషల్ ట్రైనుమీద దాడి చేశాము. అది విఫలమైందనుకో! మరోమాటు అదే ప్రయత్నాన్ని చేయవచ్చునుగదా?"

నేనిలా అన్నాను. "వైస్రాయి స్పెషల్ ట్రైనుమీద మరోమాటు దాడి చేయవచ్చును. ఐతే, ఈమాటు వెనుకటి పద్ధతినే అనుసరించరాదు. ఆ వెనుకటి పద్ధతినే అనుసరిస్తే ముందే పట్టుబడిపోతాము. పరిహాస పాత్రులమౌతాము. దాడి చెయ్యాలనుకుంటే కొత్తపద్ధతిలో చెయ్యాలి!"

ఆజాద్‌కు హంస్‌రాజ్‌యొక్క వైర్‌లెస్ జ్ఞాపకం వచ్చింది. క్రితంసారి వైస్రాయిమీద దాడి సందర్భంగా హంస్‌రాజ్‌ను ఢిల్లీ పిలిపించడం జరిగింది. శ్రద్ధానందబజారుకు ప్రక్కగొందిలో వున్నామప్పుడు. అప్పుడే హంస్‌రాజ్ తన 'ఒకటిన్నరగజం' 'ఐదుగజాల' ప్రయోగాన్ని చేసి చూపించాడు. ఆ ప్రయోగాన్ని ఆజాద్‌కూడా చూశాడు. ప్రయోగం ఏమిటంటే, హంస్‌రాజ్ చిన్ని బ్యాటరీసెల్‌కు రెండు తలవెంట్రుకల్లాంటి సన్నని కరెంటువైర్లను చుడతాడు. వాటిల్లో ఒకవైరును బ్యాటరీతాలూకు బల్బుకు చుడతాడు. రెండవవైరును కుడా బల్బుకుతాకిస్తే బల్బు వెలుగుతుంది. ఇది అందరూ చేయగలరు. అయితే, హంసరాజ్‌చేసే గమ్మత్తు ఏమిటంటే, రెండవవైరును బల్బుకు తాకించడు. ఒక చిన్న సీసాను బల్బువైపు తీసుకువెడతాడు. ఆసీసా బల్బు దగ్గరకుపోగానే బల్బు వెలుగుతుంది. అంటే రెండవ వైరును అవించకుండానే బల్బు వెలిగించుతాడు. మరోకరకంగా చెప్పాలంటే రెండవ వైరునుబల్బు తనంతటతానే సంలగ్నం చేసుకుంటుంది! ఆ చిన్నిసీసాలో కాసిని నీళ్ళుపోసి ఏవేవో మందులు కలుపుతాడు అతడు!

ఈ ప్రయోగాన్ని గురించి వివరిస్తూ "సీసాలోకల్పిన మందుల ప్రభావంవల్ల, సీసాకు గజన్నర దూరంవరకూ విద్యుత్‌తరంగాలు ప్రవహిస్తూవుంటాయి. అవి సహజంగానే బల్బుకూ కరెంటువైరుకు సంబంధాన్ని కలుపుతాయి!" అని చెప్పాడు హంసరాజు. ఐతే, ఈప్రయోగాన్ని

అందరూచేయడానికి వీల్లేదు. అతడి చేతిమీదుగాజరగాల్సిందే! ఇతరులుచేస్తే మందు ప్రభావం పనిచేయదు. మేమునీసాను దగ్గరకుజరిపితే బల్బువెలగక పోవడానికి కారణాన్ని తెల్పుతూ "నీసాలోంచి కొన్ని ప్రత్యేకమైన దిశ లకు విద్యుత్తు తరంగాలు ప్రవహిస్తూ వుంటాయి. విద్యుత్తు ప్రవహించే దిశను నేను గ్రహించగలను. మీరు గమనించలేరు!" అంటాడు. ఏ శక్తివల్ల తను విద్యుత్తు ప్రసార దిశను కనుక్కోగలుగుతూన్నాడో చెప్పడు. "నాకు తెలుస్తుంది!" అని మాత్రం అంటాడు. వాతావరణంలో విద్యుత్తు ప్రవాహదిశను కనుక్కోడానికి రాడారు యంత్రాలుంటాయి. ప్రపంచంలోని వైజ్ఞానికులందరూ ఈరాడారు యంత్రాలద్వారానే విద్యుత్తు దిశను కనుక్కుంటారు. వైజ్ఞానికులే అవుసరంలేదు. రాడారు యంత్రాన్ని ఉపయోగించడంతెల్సిన ప్రతివారూ ఆ దిశను తెల్సుకోవచ్చును. శరీర స్పర్శతోనో, ఊహతోనో ఎవరూ విద్యుత్తు దిశను తెల్సుకోలేరు. కానీ, హంసరాజ్ తాను తెల్సుకోగలనంటాడు.

ఈ విద్యుత్ ప్రవాహ చమత్కారమే కాకుండా మెస్మరిజాన్నిచేసి చూపిస్తూందేవాడు. అతడు ప్రదర్శించే ప్రతి ప్రయోగంలోనూ హస్త లాఘవం ఎక్కువగా పనిచేసేది. ఐతే, మేమది గమనించలేక అతడి ప్రయోగాన్ని నిజమని నమ్మేసేవాళ్ళం! అప్పటికి రెండు మార్లు అతడు మమ్మల్ని మోసం చేశాడు. అంటే, 1929లో వైస్రాయి స్పెషల్ ట్రైనుకింద బాంబు పేల్చే సందర్భంలోనూ, ఆ తరువాత భగత్‌సింగ్ మొదలైన మిత్రుల్ని లాహోర్ జైల్నుండి విడిపించడానికి ప్రయత్నించే సందర్భంలోనూ - రెండు మాట్లు ముఖం తప్పించాడు. ఐనా, ఆజాద్‌కు అతడిపట్ల ఆశ చావలేదు. ఏదైనా అద్భుతమైన పద్ధతిలో వైస్రాయిమీద దాడి చేయడం జరిగితే, అది గొప్ప ప్రభావాన్ని వేస్తుందని ఆజాద్ అన్నాడు. దీన్నిబట్టి ఆజాద్ తన ప్రాణానికి ప్రమాదంలేని విధంగా, వైస్రాయిమీద దాడిచేయడానికి యోచిస్తూన్నాడనడం సబబుకాదు. అలా

అనుకోవడంవల్ల ఆజాద్‌ను పొరపాటుగా అర్థం చేసుకోవడమే అవుతుంది. అలా అద్భుత ప్రయోగం ద్వారా వైస్రాయిమీద దాడిచేయడంవల్ల. ఎలా దాడిచేశారో తెల్సుకోలేక ప్రభుత్వం కంగు తింటుంది. ప్రభుత్వాన్ని అలా కంగు తినిపించడమే ఆజాద్ ఉద్దేశం।

ఆజాద్ మరొకటీ అన్నాడు. "ఇంతవరకూ హంస్‌రాజ్ ముఖం తప్పిస్తున్నాడు అందుక్కారణం ప్రభుత్వానికి తనమీద అనుమానం కలుగుతుందన్న భయంకావచ్చు। ఇంద్రపాల్ కారణంగా హంసరాజ్ మీద ప్రభుత్వానికి ఎటూ అనుమానం కలిగింది। ఇక ఇప్పుడు కొత్తగా అతని మీద అనుమానం కలిగేదేమీలేదు. కనుక, మనకు ఈమాటు సహకరించ వచ్చును. నువ్వెళ్ళి అతణ్ణి కనుక్కో। మనకు వైర్‌లెస్ సాధనాన్ని గనక ఇచ్చేట్టయితే, అతడి ప్రాణరక్షణకు అవసరం అయిన ఏర్పాట్లను మనం చేస్తామని చెప్పు. అవసరం అనుకుంటే అతడిని విదేశాలకు పంపించే ఏర్పాట్లూచేద్దాం। ఏమైనా కానీ, మరోమాటు అతడి విషయంలో ప్రయత్నించు।"

హంస్‌రాజ్ ఎక్కడున్నాడో తెల్సుకోడానికి లాయల్‌పూర్‌లోని అతడి ఇంటికి వెళ్ళవల్సిందే।

ధన్వంతరీ, సుఖదేవరాజు, కైలాసపతి - వీళ్ళు నామీద దుబారా ఖర్చుచేస్తానన్న నేరాన్ని మోపారు. అందువల్ల మానసికంగా చాలా బాధ పడిన నేను, ఇకమీదట పార్టీ సహాయాన్నిగానీ, పార్టీ ఏర్పాట్లనుగానీ అర్థించరాదని నిశ్చయించుకున్నాను. నా ఖర్చుకూ, ప్రకాశవతి ఖర్చుకూ పార్టీమీద, లేక పార్టీ సభ్యులమీదా ఆధారపడరాదనీ అనుకున్నాను।

ఇప్పుడు ఉ॥ప్రదేశ్ కాంగ్రేసు మంత్రి మండలిలో సభ్యులయిన ఆచార్య జుగల్‌కిశోర్‌గారు అప్పట్లో 'ప్రేమ మహావిద్యాలయాని'కి ప్రిన్సిపాల్‌గా వుండేవారు. ఆచార్యులవారు వెనక లాహోర్‌లోని నేషనల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా వున్నారు కొన్నాళ్ళు। నేను ఒకటి రెండు మార్లు

ప్రేమమహా విద్యాలయానికివెళ్ళి ఆచార్యులవారిని కల్సుకుని వచ్చాను. వారు కొంత సహాయం కూడా చేశారు. వీరికి ఆచార్యకృపలానీగారితో బాగా పరిచయంవుంది. కృపలానీ అప్పుడూ, ఆ తరువాత కూడా చాలా రోజులవరకూ ఇండియన్ నేషనల్ కాంగ్రెసుకు కార్యదర్శిగా వున్నారు. జుగల్‌కిశోర్‌ద్వారా కృపలానీని కల్సుకోవచ్చు! కృపలానీ అంటే గాంధీ గారికి ఎంతో అభిమానం! ఈ విధంగా కాంగ్రెసులోని జాతీయ భావంగల సంపన్నులైన వ్యక్తుల్తో పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిచయాలవల్ల ఆర్థిక ప్రయోజనం ఎటూ వుంటుంది. అవకాశం దొరికితే గాంధీగారితో మా విజాయితీనిగురించి, దేశభక్తిని గురించిచెప్పి 'కనీసం విప్లవకారుల్ని నిందించడం మానుకోండి!' అని చెప్పుదామని ఉద్దేశం.

జుగల్ కిశోర్ ద్వారా ఆచార్యకృపలానీని పరిచయం చేసుకున్నాను. వారికి నామీద సి.ఐ.డి.నేమోనన్న అనుమానం కలగలేదు! బెనారస్ విశ్వ విద్యాలయంలో, పాట్నాలో - కొన్నాళ్ళు ఉపాధ్యాయులుగా పనిచేశారు కృపలానీ! అప్పుడు వారికి విప్లవకారుల్తో పరిచయాలూ వుండేవి. విప్లవ కారులపట్ల వారికి సహానుభూతి వుండేది! మొదటగా కల్సినప్పుడు వారిని ఊరకాపరిచయం మాత్రం చేసుకున్నాను. ఎక్కువగా మాట్లాడలేదు. ఆ రోజుల్లో అంటే, 1929 అక్టోబర్‌లో ఆలిండియా కాంగ్రేస్ వర్కింగ్ కమిటీ మీటింగ్ ఢిల్లీలో జరుగుతోంది. అప్పటి అసెంబ్లీలో కాంగ్రేసు పార్టీ నాయకుడైన విఠల్‌భాయీ పటేల్‌గారి బంగళాలో మీటింగ్ జరుగు తోంది అప్పుడు నేనూ-భగవతీచరణ్ శ్రద్ధానందబజార్ ప్రక్కగొందిలో వుంటున్నాము. ఆల్ ఇండియా కాంగ్రేసు వర్కింగ్ కమిటీ మీటింగ్‌కు వెళ్ళి కృపలానీద్వారా ఇతర నాయకుల్ని పరిచయం చేసుకోవడం ఉప యోగకరం అనుకున్నాం! మీటింగ్ సమయంలో లోపలకు వెళ్ళడానికి ఖయాలీరామ్‌గుప్తనడిగి ఖద్దరులాల్చీ, ధోవతి, టోపీ తీసుకున్నాను. పైన ఖద్దరుదే దుశ్శాలువను కప్పుకున్నాను. చొక్కాలోపల, బొడ్లో పిస్తోల్ని

పెట్టుకున్నాను. కాంగ్రేసు నాయకుల్లాగానే కోలునంచి భుజానికి వ్రేలాడ వేసుకుని, టాంగాలో విఠల్‌భాయీ బంగళాకు వెళ్ళాను. భగవతీచరణ్ "ఈ ఆడంబరం అనవసరం. నువ్వు మామూలుగానే సూటువేసుకుని వెళ్ళు!' అని సలహా ఇచ్చాడు. అతడి సలహా నాకు అంతగా నచ్చలేదు.

మూడు రంగుల బ్యాడ్జీలను ధరించిన కాంగ్రేసు స్వయంసేవకులు నన్ను బంగళా గేటుదగ్గరే ఆపేశారు. 'నన్ను కృపలానీగారు బిహారు నుండి పిలిపించారనీ, అత్యవసరంగా వారితో మాట్లాడాలనీ' చెప్పాను! ఏం చెప్పినా స్వయంసేవకులు వినిపించుకోలేదు. తిరిగి వచ్చాను. ప్రయత్నం విఫలం అయినప్పటికీ, కాంగ్రేసు స్వయంసేవకుల్లో కనిపించిన అనుశాసనానికి సంతోషించాను. తిరిగి వచ్చాక భగవతీచరణ్ ఇలా అన్నాడు. "సూటు వేసుకుని మోటార్ సైకిల్‌మీద వెళ్ళమని మొదటే చెప్పానుకదా?" రెండవమాటు మోటార్ సైకిల్‌మీద వెళ్ళాను. సూటూ-బూటూతో, హాట్‌పెట్టుకుని వెళ్ళాను. ఈమాటు స్వయంసేవకులు నన్ను ప్రశ్నించలేదు సరికదా, దారిలో అజాగ్రత్తగా నిలబడ్డ తమ సహచరుల్ని కోప్పడి నాకు దారి ఇచ్చారు!

మధ్యాహ్న భోజనంకోసం మీటింగును ఆపారు. అప్పుడే నేను వెళ్ళాను. ఇతర నాయకుల్తో పరిచయం చేయిస్తారనే ఉద్దేశంతో కృపలానీని కల్సుకున్నాను. ఎదురుగా వరండాలో నిలబడి వున్నారు, డాక్టర్ గోపీచంద్ భార్గవ్‌గారు! కృపలానీవార్ని పరిచయం చేయబోయారు. 'డాక్టరుగారు నన్ను ఎరుగుదురు!' అని చెప్పాను. డాక్టరుగారు చిరునవ్వునవ్వి, నాతో ఎక్కడ మాట్లాడవల్సివస్తుందోనని లోపలికి వెళ్ళిపోయారు. అక్కడే సుభాష్‌బాబు నిలబడివున్నాడు. వార్ని పరిచయం చేశారు కృపలానీ! సుభాష్‌చంద్రబోసు నన్నుచూసి పరమానందపడ్డారు. రెండు చేతుల్ని పట్టుకుని ఎంతో ఆత్మీయతతో పలకరించారు. 'మరోప్పుడు విశ్రాంతిగా మాట్లాడుకుందాం!' అన్నారు. నేను రెండుమార్లు తిరగడంతో

విశ్రాంతి సమయం కాస్తా అయిపోయింది. మధ్యాహ్న సమావేశానికి గంట మోగుతోన్నది. సమావేశంలో బోసే మాట్లాడవల్సి వుంది. ఆ సాయంకాలమే మేము అత్యవసరం అయిన పనిమీద కలకత్తా వెళ్ళిపోవ డం జరిగింది. రహస్యజీవితాన్ని గడుపుతూన్నరోజుల్లో మరిఇక సుభాష్ బాబును కల్సుకోలేకపోయాను. తరువాత వార్ని నేను మళ్ళీ 1940లో కల్సుకున్నాను. అప్పటికి వారు కాంగ్రేసు అధ్యక్ష పదవికి రాజీనామా ఇచ్చారు. ఫార్వర్డుబ్లాక్‌ను స్థాపించడానికి తిరుగుతూన్నారు. అప్పుడు యువజన పార్టీ ప్రారంభోత్సవంకోసం లాహోరు వెళ్తూన్నారు బోస్‌। నేనూ ప్రస్ వర్కర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి లాహోరు వెళ్తూ న్నాను. సుభాష్‌బాబు నన్నుగుర్తించారు. ఐతే, వారి ఫార్వర్డుబ్లాక్ కార్య క్రమం నాకు నచ్చింది కాదు.

1930 సెప్టెంబరులో మరోమాటు కృపలానీని కల్సుకున్నాము. బృందావనం వెళ్ళి కల్సుకున్నాను. వైస్రాయి స్పెషల్ ట్రైనుక్రింద బాంబు పేల్చిన విషయాన్ని జ్ఞాపకంచేసి "చూడండి, మేమూ ఊరకా కూచోలేదు. మా ఆదర్శం ఏమిటో భగత్‌సింగ్ కోర్టులో ఇచ్చిన వాఙ్మూ లంలో స్పష్టం చేయడం జరిగింది. మా ఆదర్శంలో మాకు అభ్యంతర కరమైంది ఏమీలేదే? గాంధీగారు అనవసరంగా మా కార్యక్రమాల్ని విర సించే తీర్మానాన్ని లాహోరు కాంగ్రేసులో ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం నెగ్గడం ఎంతకష్టమైందో మీకూ తెల్సుగదా? ప్రజల వుద్దేశం ఏమిటో, ఎటువైపువుందో మీకుతెల్సు। మీరు మాకు సాయంచెయ్యాలేగానీ....।" అన్నాను. వారి అలవాటు ప్రకారం "నీ లెక్చర్ ఆపేసి ఏం సాయం కావాలో చెప్పు?" అన్నారు. "మీనుండి మేము కేవలం ఆర్థికసహాయాన్ని మాత్రం కోరుతూన్నాం।" అన్నాను.

కృపలానీ ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఒక చిన్న షరతు పెట్టారు. మా మిత్రులు ఎవరూ ఇకమీదట హింసాత్మక కార్యక్రమాల్లో

పాల్గొనకుండా వుంటే, సాధారణమైన జీవనానికి లోటులేని ఆర్థిక సహాయాన్ని అందరికీ కలుగ చేస్తామన్నారు

కృపలానీగారి షరతు అర్థం లేనిదనిపించింది. నేను ఏ పనులు చేయడానికి ఆర్థికసహాయాన్ని అడిగానో, అవే పనులు మానుకోవల్సిందని వారు షరతు పెడుతూన్నారు. "రహస్యంగా వుండి కేవలం పొట్టపోసుకోవడం పెద్ద సమస్యేమీకాదు. ఏ కిళ్ళీకొట్టు పెట్టుకునో, కార్ఖానాలో పనిచేసో బ్రతగ్గలం। అందుకు మేము మిమ్మల్ని ఆర్థికసహాయం అడగం। మా ఉద్యమాన్ని నడుపుకోడానికే మేము మీసహాయాన్ని అడుగుతూన్నాము।" అన్నాను.

నేనిలా అనడంతో ఆయనకు కోపంవచ్చింది "మీకు పిచ్చి పట్టినట్టుగా వుంది. ప్రాణాలిస్తామంటారు. మీకు నా సహకారం ఏమీ వుండదు।" అన్నాడు.

ఇక అతడితో తర్కించి ప్రయోజనం లేదు. ఇలా అన్నాను "మాది పిచ్చేఅయినా, మీరనుకున్నంత పెద్దపిచ్చి కాదులెండి।"

తరువాత జుగల్‌కిశోర్ ఇలా అన్నారు "కృపలానీగారు, మీ రెప్పుడైనా మీరట్ వెడితే గాంధీ ఆశ్రమంలో తనను కల్సుకోమన్నారు।"

చాలా రోజుల తరువాత మీరట్ వెళ్ళడం జరిగింది. గాంధీ ఆశ్రమానికికూడా వెళ్ళాను. కృపలానీ అప్పుడు అక్కడలేరు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వపు రోడ్డు రవాణాశాఖ మంత్రి విచిత్ర నారాయణ శర్మగారు ఉన్నారక్కడ। నేనెవరో చెప్పాను. కృపలానీ నాకో కవరు ఇవ్వమన్నారని చెప్పి, కవరు తెచ్చి ఇచ్చారు. అవతలకు వెళ్ళి చింపి చూశాను. నూరు రూపాయాలనోట్లు రెండో మూడో వున్నాయి. ఒక చీటీవుంది. ఇలా రాశారు 'For Personal needs' (వ్యక్తిగత అవశ్యకతలకు) అంటే, వారిడబ్బు మా 'హింసాత్మక' కార్యక్రమాలకు వాడ

కూడదని ఉద్దేశం। అది ఎలా సంభవం? మేము బ్రతికివున్నదే ఆ ఉద్యమం కోసంకదా?

అప్పట్లో ఒకమాటు బృందావనంవెళ్ళాను. ప్రకాశవతిని కొన్నాళ్ళపాటయినా సురక్షిత ప్రదేశంలో వుంచాలనుకున్నాను. హంసరాజ్‌కోసం లాయల్‌పూర్ వెళ్ళాలి. అక్కడికి వెళ్ళడానికి ముందే ప్రకాశవతిని సురక్షిత ప్రదేశానికి చేర్చాలని ఉద్దేశం। అప్పటికి ప్రకాశవతి ఇల్లు వదిలివచ్చి ఐదారునెలలే అయింది. అంతవరకూ పార్టీ స్థావరాల్లోనే వుంది. కాకపోతే, ఒకరిద్దరు సానుభూతిపరుల ఇండ్లల్లో గడిపింది. అప్పటికింకా ఆమెకు రహస్య జీవిత అనుభవం తక్కువ. ఆ తరువాత రహస్య జీవితాన్ని గడుపుతూనే పేరుమార్చుకుని టీచరుగాకూడా పని చేసింది. బృందావనంలోని 'ప్రేమ మహా విద్యాలయం' సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనే కాంగ్రేసు కార్యకర్తలకు ప్రధాన స్థావరం। అసలాప్రదేశం ఇంగ్లీషు ప్రభుత్వానికి పాతశత్రువైన రాజా మహేంద్ర ప్రతాప్ జాగీర్‌లోది। విద్యాలయం ట్రస్టీ అధీనంలోవుంది గనకగానీ, లేకపోతే ఏనాడో జప్తు అయ్యేది। ఇప్పటికీ ఆ విద్యాలయంమీద సి.ఐ.డి.లు ఒకకన్నువేసివుంచుతారు. అలాంటి స్థితిలో ప్రకాశవతిని ఎక్కువ రోజులు అక్కడవుంచడం ఉచితంకాదు. ఐతే, అక్కడ అనుకోకుండానే కాలేజీ సహపాఠి మనోహరలాల్ ఖన్నా కలిశాడు. మనోహర్‌కూడా మా పార్టీకోసం జయచంద్రజీ ద్వారా ప్రోత్సహించబడిన విద్యార్థులలో ఒకడు. మనోహర్‌ని, జయచంద్రగారు కొన్నాళ్ళు బొంబాయిలోనూ, కొన్నాళ్ళు శ్రీలంకలోనూ వుంచారు. విదేశాలనుండి ఆయుధాల్ని తెప్పించుకునే విషయంలో అనుభవం సంపాయించాలని వారి ఉద్దేశం। ఐతే, నిరాదర్శంగా శ్రీలంకలో వుండవల్సిరావడంవల్ల త్వరలోనే మనోహర్ విసిగి తిరిగి వచ్చేశాడు. పార్టీ కార్యక్రమాలకు దూరం అయ్యాడు. ఇలా జయచంద్రజీ ద్వారా ప్రోత్సహింపబడి, తరువాత పార్టీకి దూరం

అయిన మిత్రులు చాలామంది వున్నారు. వాళ్ళు మాకు అప్పుడప్పుడూ అనేకరకాలుగా సహాయాలు చేశారు.

మనోహర్‌కు ఫార్మింగ్ అంటే చాలా ఇష్టం. అప్పట్లో అతడు బులంద్ షహర్ జిల్లాలోని ప్రేమ మహావిద్యాలయ పరిసర గ్రామాలకూ, ఫార్మ్‌కూ, మేనేజర్‌గా ఉన్నాడు. ఆఫీసు బరాల్ అనే గ్రామంలో వుంది. మనోహర్ ప్రకాశవతికి తన దగ్గర ఉండడానికి అవకాశాన్ని ఇచ్చాడు. ప్రేమ మహావిద్యాలయంలో ఉండగానే ప్రకాశవతికి రాణీ అన్నపేరు పెట్టటం జరిగింది. ఆ చుట్టుపట్ల ప్రకాశవతిని అందరూ రాణిఅనే పిలిచే వారు. మనోహర్ మొదట్నుండీ మంచి అభిరుచులూ, సంస్కారమూ కలవాడు. ఇప్పుడు ఫార్మ్‌కు మేనేజరయ్యాక దొరల హోదాలో ఉంటు న్నాడు. హేటు బిర్జిస్, మోకాళ్ళవరకు వచ్చే బూటు వేసుకుంటున్నాడు.

చాలా రోజులపాటు ఉద్రిక్తమైన జీవితాన్ని గడిపాము. ఇప్పుడు, మనోహర్‌దగ్గరకొంత ప్రశాంతంగా ఉంటున్నాము. అతడిదగ్గర పిస్తోలు ఉంది. వేటాడటానికి తుపాకి ఉంది. వాటికి లైసెన్సులూ ఉన్నాయి. అతడిదగ్గరున్న ఆకొద్ది రోజులూ చాలా విశ్రాంతగా గడిపాము. హాయిగా తినడం నిద్రపోవడం! నేనుకూడా హేటు, బూటూ, బిర్జెస్ వేసుకుని తుపాకి తీసుకుని అతడితోపాటు వేటకువెళ్ళేవాడివి. వేటఅంటే పులుల్నీ, సింహాల్నీ వేటాడటం కాదు - నోరులేని పక్షుల్ని చంపడం మాత్రమే! చుట్టుపట్ల గ్రామాల్లో చెరువుల ఒడ్డున గద్దల్లాంటి తెల్లని పక్షులుండేవి. వాటినే వేటాడేవాళ్ళం.

మనోహర్‌ద్వారా రామ్‌ధన్‌సింహ్ అనే నాకాలేజీ మిత్రుడు ఒకతని అడ్రసు తెలిసింది. రామ్‌ధన్‌సింహ్‌కూడా మాలాగానే విప్లవం కోసం ప్రోత్సహించబడిన విద్యార్థుల్లో ఒకడు. ఐతే, తరువాత జయచంద్రగారి నిరుత్సాహం కారణంగా అతడు ఏ కార్యక్రమాల్లోనూ పాల్గొనకుండా

పార్టీకి దూరం అయ్యాడు. అతడి అడ్రసు తెలియడం ఎంతో ఉపయోగ కరం అయింది.

రామ్‌ధన్‌సింహ్‌ను కలుసుకున్నాను. వాళ్ళది రైతువారీకుటుంబం. ఐతే, బి. ఎ. అయ్యాక సేద్యం చెయ్యటం అతనికి ఏమీ నచ్చలేదు. గుమాస్తా ఉద్యోగంచేయడమూ అతడికిష్టంలేదు. కాన్పూరులోని తోళ్ళ పరిశ్రమ తాలూకు ట్రైనింగ్‌స్కూల్లో చెప్పులు తయారుచేయడం నేర్చు కోవడానికి చేరేడు. ఈ ఒక్కవిషయాన్నిబట్టి అతడిలోని విప్లవాత్మక ప్రవృత్తిని అర్థంచేసుకోవచ్చు. హర్యానా, గుడ్‌గావ్, బులంద్‌షహర్ మొదలైన ప్రాంతాలలోని జాట్ కులస్థులు తమను తాము క్షత్రియులు గానే భావించుకుంటారు. వాళ్ళ పనిపాటలు, ఆచార వ్యవహారాలూకూడా క్షత్రియోచితంగానే ఉంటాయి. అలాంటి స్థితిలో రామ్‌ధన్‌సింహ్ చెప్పులు కుట్టడం నేర్చుకోవడానికి చేరడం విప్లవాత్మకమైన పరిణామమే!

ఒకరోజున మంచి పరిహాసమే జరిగింది. రామ్‌ధన్‌సింహ్ తండ్రి సైన్యంలో సుబేదారుగా పనిచేసి రిటైర్ అయ్యాడు. పెన్షన్ పుచ్చుకుంటు న్నాడు. నేను రామ్‌ధన్‌సింహ్‌ను చూడ్డానికి వెళ్ళినప్పుడు సాధారణమైన వస్త్రాల్లో ఉన్నాను. రామ్‌ధన్ తండ్రి పెన్షన్ తెచ్చుకోవడానికి ఉదయమే బులంద్‌షహర్ వెళ్ళాడు. అక్కడ ఒక ప్రకటనను చూశాడట. ప్రక టన ఇలావుంది "వైస్రాయి స్పెషల్ ట్రైనుక్రింద బాంబు ప్రేల్చిన వ్యక్తిని పట్టియిచ్చినవారికి 20 వేలరూపాయలు బహుమతిఇవ్వబడును."

ఆ ప్రకటనను గురించి చెబుతూ రామ్‌ధన్‌తండ్రి ఇలా అన్నాడు "బహుమతి ప్రకటించిన మాత్రంచేత అలాంటి వ్యక్తులు దొరుకుతారా? అరె. పోలీసులు కాపలాఉండగానే బాంబుపేల్చేరుగదా? అప్పుడు కనపడ లేదు ఈ నాయాళ్ళకు! ఇంక ఇప్పుడు కనబడతారా? అసలలాంటి వాళ్ళు మాంచి మంత్రగాళ్ళయి ఉంటారు. వాళ్ళదగ్గర నక్కకొమ్ము ఉంటుంది. నక్కకొమ్ము దగ్గరపెట్టుకున్న మనిషి ఎదురుగా ఉన్నా కనపడడు!"

నేను ఆయనకు ఎదురుగానే కూర్చుని ఉన్నాను. రామ్‌ధన్‌సింహ్ చాలా గంభీరంగా తండ్రిని ప్రశ్నించాడు. "ఐతే నక్క కొమ్ము ఎలా దొరుకుతుంది."

తండ్రి ఇలా అన్నాడు "దొరకడం చాలా కష్టం. నూటికి కోటికి ఎక్కడో ఒక నక్కకు కొమ్ముంటుంది. ఐతే, దాన్ని మాయ మంత్రాలు తెలిసిన వాళ్ళు పట్టుకోవలసిందే. మామూలు మనుషులకు తరంకాదు. అదంతా యోగమాయ అనుకో!"

రామ్‌ధన్‌సింహ్ తండ్రి ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రాన్స్, మెసపటోమియా మొదలైన దేశాలకువెళ్ళి ఇంగ్లీషువారి తరపున యుద్ధంలో పాల్గొన్నాడు కూడాను. ఆంగ్ల ప్రభుత్వానికి తన సైనికుల మానసిక సంస్కారాన్ని ఇంతకంటే ఉన్నతస్థితికి తీసుకువెళ్ళడం ఇష్టముండదు!

# 10. మరోమాటు వైర్‌లెస్ కోసం ప్రయత్నం

ప్రకాశవతిని మనోహర్ దగ్గర వుంచి నేను హంస్‌రాజ్ కోసం వెళ్ళిపోయాను. హంస్‌రాజ్‌ను ఎరిగిన మిత్రులందరూ, (ఒక్క సుఖదేవ రాజు మినహా) రెండవ లాహోరు కుట్రకేసులోని నిందితులు. అందరూ అరెస్టయ్యారుకూడాను. కనుక, హంస్‌రాజ్ ఎక్కడున్నాడో తెలుసుకోవడం కష్టం! వాళ్ళ ఇంటికి వెడితేగాని తెలియదు. ఇంటికి వెళ్ళినా, తెలుస్తుందన్న నమ్మకంలేదు. అతడిమీద అరెస్టువారంటున్నట్టు ఇంట్లోనూతెల్సు. వాళ్ళు అతడి అడ్రసు చెప్పరు. చివరకు నేనే లాయల్‌పూర్‌వెళ్ళి, అతడి తల్లిని కలుసుకున్నాను. అతడిని పోలీసుల బారినుండి తప్పించడానికే వచ్చానని చెప్పాను. ఆమెకు నామీద విశ్వాసం కలిగింది. అడ్రసు చెప్పింది. హంసరాజ్, తన అన్న బ్రహ్మదేవ్ దగ్గర వుంటున్నాడు. బ్రహ్మదేవ్ కరాచీలో వోల్కార్ట్ బ్రదర్స్ కంపెనీలో క్లర్కు!

నేను అక్టోబరు మొదటివారంలో కరాచీ వెళ్ళాను. బ్రహ్మదేవ్ 'గాడీఖాతా' పేటలోని మూడంతస్తులమేడలో ఒకగదిలో వుంటూన్నాడు. హంస్‌రాజ్ అక్కడే వున్నాడు. అతడిని కలుసుకుని మాట్లాడాను! "ఇంక చెయ్యక తప్పేదేముంది? చేస్తాను!" అన్నాడతడు. ఇంద్రపాల్ పొరపాటు పడ్డట్టుచెప్పి, విచారాన్ని వ్యక్తపరిచాను. ఎలా అయితేయేం? చివరకతడు 'వైర్‌లెస్'ను మాకోసం వినియోగించడానికి సిద్ధపడ్డాడు. ఐతే, తనకు అవసరం అయిన వస్తువులు కరాచీలో దొరకవన్నాడు. వస్తువులు దొరకడానికి ఒక నెల పడుతుందన్నాడు. నవంబరునెలలో ఒక తారీకును చెప్పి ఆ తరువాత ఎప్పుడైనావచ్చి బల్బును తీసుకువెళ్ళమన్నాడు.

ఆబల్బు ఐదువందల గజాలవరకూ విద్యుత్తరంగాలను ప్రసారం చేస్తుంది. ఆ బల్బుతోపాటు ఒక చిన్న సీసా వుంటుంది. ఆ సీసాను బల్బుకు దూరంగా తీసుకువెళ్ళినకొలది బల్బులోనుండి విద్యుత్తరంగాలు ప్రసారం అవుతూంటాయి. సీసా దగ్గరవుంటే బల్బు పనిచేయదు. అతడు మాట్లా డిన పద్ధతినిబట్టి అనుమానించవల్సిన అవుసరం కనుపించలేదు.

కరాచీనుండి సాయంత్రం ఆరు గంటలకు రైలు బయలుదేరు తుంది. ఆ బండికే తిరుగు ప్రయాణం సాగించాను. రాత్రి ఎనిమిది గంటలాప్రాయల హైద్రాబాద్ (సింధు) స్టేషన్ చేరిందిబండి. ఆ స్టేషన్‌లో తలగుడ్డా, చారలకోటు ధరించిన ఒకవ్యక్తి నన్నుచూపుతూ మరోవ్యక్తితో యేమో చెప్తూన్నాడు గడచిన స్టేషన్‌లో మా పెట్టెలోకి ఒక టికెట్ కలె క్టర్‌వచ్చి అందరి టిక్కెట్లనూ 'చెక్' చేశాడు. నా టిక్కెట్టునూ చూశాడు. చూసివెళ్ళి చారలకోటు వ్యక్తితో ఏమిటో మాట్లాడాడు. అప్పుడు నాకు అనుమానం కలగలేదు. ఐతే, ఇప్పుడు ఆచారలకోటువ్యక్తి మరొకడికి నన్నుచూపుతూ మాట్లాడుతూండేసరికి అనుమానం కలిగింది. 'బ్రహ్మ దేవ్‌దగ్గర హంస్‌రాజ్‌వున్న' విషయం పోలీసులకు తెల్సివుంటుంది అతడి ఇంటి దగ్గర C.I.D. పోలీసులు కాపలా వుండి వుంటారు. నేను గమ నించకపోవడంతో, వెంబడిస్తూన్నారు.' అనుకున్నాను. నాదగ్గర ఎక్కువ సామాన్లు ఏమీలేవు. ఒకచిన్న బెడ్డింగూ, సూట్‌కేసూవున్నాయి. సూట్ కేసులో రెండు మూడు పుస్తకాలూ, అవుసరం అయితే మార్చుకోడానికి ఒకజతబట్టలూ వున్నాయి. రెండోవ్యక్తి నన్ను చూపించిన చారలకోటు వాడు ప్లాట్‌ఫారానికి కుడివైపుకు వెళ్ళాడు. ఈ రెండో వ్యక్తి కుచ్చు టోపీ పెట్టుకున్నాడు. సిగిరెట్టుకాలుస్తూ కనుచివర్లనుండి నన్నుచూస్తూ గార్డు పెట్టెవరకూ ఒక చక్కరుకొట్టి వచ్చాడు. నేనూ అతడిని గమ నిస్తూనేవున్నాను. బండి బయల్దేరబోతోంది. నేను తలుపుదగ్గర నిలబడి తొంగి చూస్తూన్నాను. ఏదైతే అదవుతుంది, బండి బయల్దేరాక దిగిపోవా

లనుకున్నాను. బండి బయల్దేరింది. వేగం పుజుకోకముందే రెండోవైపుకు దూకేశాను. వెనక్కితిరిగి వెళ్ళిపోసాగాను.

బండి వెళ్ళిపోయింది ప్లాట్‌ఫారం చివరనుంచుని వున్నాడు ఆ బారలకోటు మనిషి. కరెంటులైట్ల వెలుగులో అతడూ నన్ను చూశాడు. అతడు 'పట్టుకోండి! పట్టుకోండి!' అని అరుస్తాడేమోననిపించింది. కోటు జేబులోవున్న పిస్తోల్‌మీదకు చెయ్యిపోనిచ్చాను. అతడు అరవలేదు. నన్ను చూడనట్టు నటించాడు. ప్లాట్‌ఫారందాటి అవతలకు వెళ్ళాను. వెలుగు సన్నగిల్లింది. పరిసరం బొత్తిగా తెలియదు. ఐనా, ఎలాగైనా తప్పించు కోవాలిగనుక పడిపోతూన్నాను! ఒక యాభైగజాలువెళ్ళి వెనక్కుతిరిగి చూశాను. అతడు నన్ను వెంబడిస్తూ గబగబా వచ్చేస్తున్నాడు. నేను త్వరత్వరగా వెళ్తూన్నాను. అతడూ అంతేతొందరగా నన్ను వెంబడిస్తూ న్నాడు అపరిచిత ప్రదేశంలో అలా ఎంతదూరమని వెళ్ళగలను? నాకు రెండువైపులా రెండు గూడ్సుబండ్లున్నాయి. మధ్యనున్న ఖాళీలైనుమీద నేను పడిచిపోతూన్నాను. రెండు గూడ్సుపెట్టెల మధ్యకువెళ్ళి తక్కువ ఆగిపోయాను. నన్ను అనుసరిస్తూన్న అతడు నడకవేగంవల్ల నన్నుదాటి ఒక అడుగు ముందుకుపోయాడు. మొదటే పిస్తోల్ని చేతిలోకి తీసుకుని వున్నానేమో, ముందుకుపోయిన అతడిమీదకు లంఘించి, పిస్తోలుతో అతడి చెవులమీదా, చెంపలమీదా విస్సురుగా కొట్టాను. అతడి తలపాగా కింద పడిపోయింది. రెండు చేతులతో తలను పట్టుకుని కిందకూలబడ్డాడు!

ఒక్కొక్కప్పుడు తర్కానికి, విశ్లేషణకు అవకాశంలేనిస్థితి ఏర్పడు తుంది. అలాంటిస్థితిలో మనిషి తన ఊహాపోహలసాయంతో సందర్భోచి తంగా వ్యవహరిస్తాడు. అప్పుడు గనుక నేను అతణ్ణి అలాగే ముందుకు పోనిచ్చి, నేను వెనక్కుతిరిగి స్టేషన్‌కు వచ్చినట్లయితే ఏమయ్యేది? అతడూ స్టేషన్‌కు వచ్చేవాడు. స్టేషన్‌లో నన్నుచూశాక ఇంక అతడు ఏమైనా చేస్తానంటాడు. పోనీ, స్టేషన్‌లోకి వెళ్ళకుండా ఊళ్ళోకి వెళ్దామా

అంటే, అప్పటివరకూ నేనావట్నాన్ని చూడలేదు. అసలతడు మొదటే సాయంకోసం నలుగుర్ని ఎందుకు కేకవేయలేదు? ఏమో, ఎందుకు వేయలేదో? సరే, అతడు తలపట్టుకు కూలపడగానే నేను పిస్తోలును అతడి ముక్కుకు గురిపెట్టి, కటుస్వరంతో అడుతూ "కాల్చిపారేస్తాను. ఎందుకు వెంట పడ్డావ్?" అనడిగాను. అతడు సమాధానం చెప్పలేదు. చేతులు జోడించి దణ్ణం పెట్టాడు. పిస్తోలు పేల్చలేదు. పేలిస్తే ఆ శబ్దానికి నలుగురూ పోగవుతారు. నేనే ఇబ్బందికి లోనవుతాను. మరోమాటు అతణ్ణి దబాయించాను. "వెంట పడ్డావా పేల్చిపారేస్తాను. జాగ్రత్త!" అన్నాను.

ఇంతలో బండికి అటువైపున ఎవరో రాళ్ళమీదనుంచి నడిచి వస్తూన్న శబ్దం అయింది. ఆ వ్యక్తి స్టేషన్‌వైపునుంచీ వస్తూన్నాడు. ఫెన్సింగ్‌నుదాటి బయటకు వెళ్ళడానికి అక్కడో చిన్నమార్గంవుంది. అతడు అటువైపునుండి బయటకు వెళ్ళిపోయాడు. ఆమార్గాన్ననుసరించి నేనూ బయటకు వెళ్ళాను. ఇక ఇప్పుడు బయటి అంధకారంలో, రోడ్డుపైన నిలబడి వున్నాను.

కానీ, ఎక్కడికి వెళ్ళగలను? ఆ పట్నంలో నాకు ఎవరూ పరిచయులులేరు. కప్పుకోనూ, కట్టుకోనూ - ఏ ఒక్కటీ దగ్గరలేదు. నాటికెట్టు ఎక్కడికో నోటుచేసుకుని వుంటారు. నంబరు కూడా నోటుచేసుకుని వుంటారు. లాహోరుకు టికెట్టు తీసుకున్నాను. దాన్ని అక్కడే పారేశాను. నేను తొడుక్కున్న కోటునువిడిచి అక్కడే చీకట్లో పారేశాను. ధోవతిని మడిచి అడ్డకట్టు కట్టుకున్నాను. ఐతే, అలాంటి వేషంలో వన్నెగుండాగా భావించి పట్టుకుంటారేమోననీ భయపడ్డాను. అన్నింటికంటే ప్రధానమైన విషయం నన్ను వెంటాడినవ్యక్తి, తిరిగి నన్ను వెతుక్కుంటూ స్టేషన్‌కు వచ్చాడా, నే నేవిధంగానూ తప్పించుకోలేను! ఐతే, అతడలారాడన్న విశ్వాసం నాకువుంది!

నమ్మానట్టాకుబండి ఎన్ని గంటలకో ఒక కూలీని అడిగి తెలుసుకున్నాను. ఇంకో గంటకు బండి వుంది। నేను మూడవతరగతి ప్రయాణీకుల్లోకివెళ్ళి కూచున్నాను. బండి రావడానికి సూచనగా గంట కొట్టారు. టిక్కెట్టు కొనుక్కుని, బండివచ్చాక మూడవతరగతి పెట్టెలోపైన ధోవతి కప్పుకు పడుకున్నాను. వెంటనే నిద్ర ఏంపడుతూంది? తప్పించుకున్నందుకు సంతోషపడ్డాను।

మొదటి బండి దిగి యీబండిలో ఎక్కేవరకు జరిగిన సంఘటనలను పర్యాలోచించుకోసాగాను. వైస్రాయి స్పెషల్ ట్రయిన్ క్రింద బాంబు పేల్చిన తరువాత, పోలీసులకోసం ఎదురుచూశాను. ఢిల్లీస్టేషన్‌కు వచ్చేప్పుడు పోలీసులు ఎదురయ్యారు. ఆ తరువాత స్టేషనులోనూ కొంత ఇరుకునపడ్డాను. ఐనా, అప్పుడు నేను ఏ మాత్రము చలించలేదు. ఈ గంటంబావు సమయములోనూ మలేరియా రోగిలా చమటతో తడిసి పోయాను. గుండెదడపెట్టింది. ఈకొద్ది సమయములో నేను యుద్ధమూ చేయలేదు, దాడిలోనూ పాల్గొనలేదు. కేవలం ప్రాణరక్షణకోసం పరుగులు తీశాను. ఒకవేళ, ప్రాణరక్షణార్థం పోరాడవలసివచ్చినా అదేమీ గొప్ప వీరత్వం అనిపించుకోబోదు. ఈదృష్టితో చూస్తే ఒక ఉద్యమంలోనో, ఒక ఆదర్శంకోసమో పోరాడేటప్పుడు వుండే ప్రత్యేకత, వ్యక్తిగతంగా ఆత్మరక్షణకోసం పోరాడేటప్పుడు వుండదు।

నమ్మానట్టాలో భయపడవలసిన పరిస్థితి లేదనిపించింది. అక్కడ దిగి భటిండాకు టిక్కెట్టు తీసుకున్నాను. ప్యాసింజరుబండి ఎడారిమధ్యలో నుండి మెల్లగా పాకుతూ వెళుతుందీ మార్గంలో।

హైద్రాబాదులో నన్ను వెంటాడినవ్యక్తి ఆకారం మాటిమాటికి కళ్ళకు కనిపించేది. అతడు మళ్ళీ నాకోసం స్టేషనుకు రాలేదేం? పోలీసువాడు నాతో ఇలా వ్యవహరించడం ఇదే ప్రధమం। మరో ప్రమాదకర

మైన పరిస్థితిలోనూ పోలీసువాడు ఇలాగే ప్రవర్తించడం జరిగింది. ఐతే, అప్పటికి నేను కొంత అనుభవాన్ని పొందాను. పోలీసువాళ్ళు మెత్తగా దెబ్బలుతిని వచ్చినప్పుడు తమ అసమర్థతనూ, పిరికితనాన్నీ అధికారుల దగ్గర బైటపడనియ్యరని తెల్సుకున్నాను.

సమయం గడచినకొద్దీ ప్రశాంతత ఏర్పడసాగింది. శాంతిగా ఆలోచించసాగాను. 'ఇతడు నన్ను బ్రహ్మదేవ్ ఇంటిదగ్గర నుంచేకాదు వెంటాడడం, అంతకు చాలారోజులక్రితం 1928లో, నేను నౌజవాన్ భారతసభలో ఉత్సాహంగా పాల్గొనే రోజులనుండి వెంటాడుతూ వుండ వచ్చు' అనిపించింది. ఒకవేళ హంస్‌రాజ్‌ను అరెష్టుచేస్తే? ఇక నేను మళ్ళీ కరాచీ రావడం అనవసరమే అవుతుందిగదా?

భటిండా మీదుగా ఢిల్లీ చేరుకున్నాను. పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. బట్టలు బాగా మాసిపోయాయి. గడ్డం పెరిగింది. రోహతక్‌లో కిష్టిగాడివేషంలో వుండేప్పుడూ ఇలాంటి మాసినగుడ్డలే వేసుకునేవాడిని, ఇలాగే గడ్డంపెరిగేది. ఐతే, అప్పుడు కావాలని అలావున్నాను. ఇప్పుడో, తప్పనిసరి! ఝండావాలా పేటలోని బాంబుఫ్యాక్టరీకి తీసుకున్న ఇంటిని ఖాళీచేశాము. ఢిల్లీ ఇన్‌చార్జి కైలాసపతినిగానీ, ఆజాద్‌నుగానీ కల్సుకోవడానికి వీల్లేకండా వచ్చింది. ప్రొఫెసర్ నందకిశోర్ నిగం దగ్గరకు వెడితేగాని వాళ్ళు ఎక్కడవున్నదీ తెలియదు. రెండుమార్లు టిక్కెట్టుకొనుక్కుని ఢిల్లీ వచ్చేసరికి నాజేబులో డబ్బులన్నీ ఖర్చు అయ్యాయి. ఆరు పైసలు మాత్రం మిగిలాయి. ప్రొఫెసర్ నిగం యమునానది వొడ్డున హిందూ హాస్టలుదగ్గర ఉంటున్నాడు. అక్కడికి టాంగాలో వెళదామన్నా బాడుగకు డబ్బులు లేవు. కార్తీకమాసపు ఎండ ఫెళ్ళుమంటున్నది. కాలి నడకనే, ఆ ఎండలో, హాస్టలువరకూ వెళ్ళాను. కైలాసపతి హాస్టలు నుండి బయటికివస్తూ అనుకోకుండా కనుపించాడు. బాంబు ఫ్యాక్టరీ ప్రసంగంలో చెప్పినట్టు అతడిప్పుడు వెనుకటి కైలాసపతికాదు. వెనక పుష్క

మాసపు చలిలో స్వెట్టరులేకుండానే వుండేవాడు. మనం ఇచ్చినా దానిని మరో మిత్రుడికి ఇచ్చి తామమాత్రం చలికి బాధపడుతూనే వుండేవాడు. ఇప్పుడు మనిషిలో చాలా మార్పువచ్చింది. బాగా గంజిపెట్టిన ఫెళఫెళ లాడే ఇస్త్రీ బట్టలు వేసుకున్నాడు. స్నో పౌడర్ల సువాసనలు గుబాళిస్తు న్నాయి. చలువ కండ్లజోడు పెట్టుకున్నాడు. అతడి యీ వేషాన్నిచూసే 'తండికి నీరు వంట పడుతున్నది' అని ఆజాద్‌తో అనేవాడిని.

అప్పటి నాస్థితినిబట్టి అతడిఅలంకరణ నాకుమరీ బాధకలిగించింది. నేను అతడితో కటువుగా, యీసడింపుగా మాట్లాడాను. అతడు మాత్రం గంభీరంగా వున్నాడు. "ఇప్పుడిక్కడ ఆజాద్‌గానీ, నిగమ్‌గానీ -ఎవరూ లేరు" అని అన్నాడు. ఆజాద్ కాన్పూరు వెళ్ళాడని తెలిసింది. నా పరి స్థితిని చెప్పి అధికారయుత స్వరంలో డబ్బు ఇమ్మని అడిగాను.

"ఇప్పుడులేవు" అన్నాడు. బహుశా యీసడింపుగా నేను మాట్లా డిన మాటలకు ఇది ప్రతీకారచర్య కావచ్చు.

మళ్ళ కాలినడకన ఢిల్లీ వచ్చాను. ఎక్కడికి వెళ్ళేట్టు? ఖయాలీ రామ్‌గుప్త దగ్గరకు వెడితే, అతడి తల్లి గోలపెట్టేస్తూంది. అజ్ మేరీ దర్వాజా దగ్గరున్న శ్రీకృష్ణగారింటికి వెళ్ళడం సబబుకాదు. వారింటిని పోలీసులు ఒకమాటు సోదాచేశారని వెనకే చెప్పాను.

ఆకలితో అటూ ఇటూ తిరుగుతున్నాను. కైలాసపతి ప్రవర్తన, ఆకలికంటె గూడా అధికంగా బాధపెట్టూన్నది. జేబులో ఆరు పైసలు ఉన్నాయి: ఏ సెనగపప్పో కొనుక్కుతిని ఆరోజు వెళ్ళబుచ్చవచ్చు. కానీ, కాన్పూరు ఎలా వెళ్ళడమా? అన్న సమస్య మనస్సును పీడిస్తూ న్నది. ఆకలి తెలియడం లేదు. అప్పటికింకా పొగ తాగడం అలవాటు కాలేదు నాకు. కానీ, ఏం బుద్ధిపుట్టిందో తెలియదు, జేబులోవున్న ఆరు పైసలుపెట్టి ఒక సిగార్‌కొన్నాను. సాయంత్రపు మసకచీకట్లో పరేడ్ మైదానంలో కూచుని సిగార్ తాగసాగాను. కైలాసపతిమీది కోపాన్ని

అలా తీర్చుకుంటున్నాను. మాలో ఒకరిమీద ఒకరికి ఎంత అయిష్టత వున్నా, ఒకరు ప్రమాదంలో చిక్కుకొన్నప్పుడు నిర్లక్ష్యం చేసేవారం కాదు. సిగార్ తాగడంవల్ల తల తిరుగుతోంది. కక్కు వచ్చేట్టుగావుంది. మసీదుకు సమీపంలోవున్న పంపు దగ్గరకు వెళ్ళి ఒట్టి కడుపునిండా నీళ్ళు పట్టించాను. దాంతో మనిషిని మరీ డీలాపడిపోయాను. పరేడ్ గ్రౌండ్సు లోకి వెళ్ళి పడుకున్నాను. నేను చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తున్నానని పించింది. జేబులో పిస్తోలువుంది. అలా పడుకునివుండగా చూసి ఎవరైనా పోలీసు స్టేషనుకు లాక్కెడితే ఏం కాను?

యాభై సంవత్సరాల సుదీర్ఘ జీవితంలో నేను చాలా చూశాను. అనుభవించాను. కానీ, డబ్బులు లేకపోవడంవల్ల పస్తు పడుకున్నరోజు అదొక్కటే! శ్రీకృష్ణగారింటికి వెళ్ళక తప్పదనిపించింది. అక్కడనుంచి లేచి ఆజ్మేరీ గేటువైపు వెళ్ళాను. చావడీ బజారు, ఫతేహపురి - వీటికి మధ్యనున్న మార్గంగుండా వెడుతూన్నాను. రోషన్ సినిమాదగ్గరకు వచ్చే సరికి రాత్రితొమ్మిదయింది. ఆరోజుల్లో ఆ ప్రదేశాల్లో చౌకబారు జీవితాన్ని గడిపే వేశ్యలు ఉండేవారు. పరిసరం నిర్మానుష్యంగా వుంది. నేను మెల్లగా నడిచి వెడుతున్నాను. నన్ను విటుడిగా భావించారు గావును, రోడ్డుకు రెండు వైపులనుండి "ఇటురా, ఇటురా!" అని వేశ్యలు పిలువ సాగారు. వీళ్ళకు నాలాగానే ఆకలివేస్తూవుండవచ్చు' అని అనుకున్నాను. ఈ అనుభూతి మనస్సులో పీఠం వేసుకుకూచుంది. తరువాత 1938లో ఈ అనుభవం ఆధారంగా 'జోగి-జోగి' అన్న కథనురాశాను.

శ్రీకృష్ణగారింటికి వెళ్ళక తప్పిందిగాదు. ఆయన ఇంట్లోనే వున్నాడు. నేను అలాంటి స్థితిలో, అనుకోకుండా వెళ్ళడంవల్ల నిర్విణ్ణు డయ్యాడు. "నేను ఇక్కడకు రాకూడదు. ఐతే, రాక తప్పిందికాదు!" అంటూ క్షమాపణ చెప్పుకున్నాను. మంచిగుడ్డలు, కొద్దిగాడబ్బు కావాలని చెప్పాను. ఏ విషయాన్నైనా గుచ్చిగుచ్చి అడగటం ఆయన అలవాటు.

ఆరోజున ఎందుకనో నన్నేమీ అడగలేదు. గుడ్డలూ, డబ్బూ ఇచ్చారు. అక్కడే గడ్డంచేసుకుని స్నానంచేసి బట్టలు మార్చుకున్నాను. వారింటికి వెళ్ళినప్పుడు, వదినెగారు భోంచేయకుండా రానివ్వరు.

నేను ఆజాద్ కోసం కాన్పూరు వెళ్ళాను. అక్కడ తనను కలుసుకోవడానికి గుల్జారీలాల్ అడ్రసు చెప్పారు ఆజాద్। సంధ్యా సమయానికి ఆ అడ్రసుకు వెళ్ళాను. గుల్జారీలాల్ సన్నగా పొడుగ్గా వుంటాడు. గోధుమరంగు శరీరం, కోర మీసాలు। నేనతన్ని ఆజాద్‌ను గురించి అడిగాను. అతడు నావైపు మౌనంగాచూస్తూ వుండిపోయ్యాడు ఒకక్షణం. తరువాత "సరే, సరే। కూర్చోండి।" అన్నాడు.

అదొక చిన్నగది. ముందు వరండా వుంది. గుల్జారీలాల్ ఒంటరిగానే వుంటూన్నాడా గదిలో। గదిలో మంచంవేసి దుప్పటిపరచి నన్ను కూచో పెట్టాడు. వరండాలో ఉన్న పొయ్యిని ముట్టించి పనసకాయ తరుగుతూ కూచున్నాడు. నే వచ్చినట్టు ఆజాద్‌కు కబురు పంపమని మరో మాటు జ్ఞాపకం చేశాను. "ముందు మీ భోజనం కానియ్యండి।" అన్నాడు గుల్జారీలాల్. కూరకోసం పనసకాయ తరుగుతూ। ఆకలిలేదనీ। బలవంతం చేయవద్దనీ చెప్పాను. అతడు వినలేదు. పనసకాయ, తరిగి పొయి మీద పెట్టాడు పూరీలు చెయ్యడానికి గోధుమపిండి కలపసాగాడు. అనవసరంగా శ్రమపడవద్దని చెప్పాను. ఆయన వినలేదు. నాకు బాగా జ్ఞాపకం, భగోణీ లేకపోవడంవల్ల లోతుగావున్న పెనంమీదనే ఎక్కువ నెయ్యి పోసి పూరీలు చేశాడు. ఎంతో భక్తితో నాకు భోజనం పెట్టాడు. యు పి.లో వుండడమూ, పనసకాయకూర తినడమూ-రెండింటికీ అదే ప్రథమం। పనసకాయ కూర ఎప్పుడుతిన్నా గుల్జారీలాల్ వంట జ్ఞాపకం వస్తుంది. భోజనమయ్యాక కంచం నన్ను కడుక్కోనివ్వలేదు.

భోజనంపెట్టి. ఆజాద్‌కు నేను వచ్చానని చెప్పడానికి వెళ్ళాడు గుల్జారీలాల్। ఆజాద్ పది గంటలావాయల వచ్చారు. మేమిద్దరం

మాట్లాడుకుంటూంటే గుల్జారీలాల్ దూరంగావెళ్ళి కూచున్నాడు. కాన్పూరు మున్సిపాలిటీలో, రోడ్లమీద నీళ్ళు చల్లే బస్సుడ్రయివరుగా పనిచేస్తున్నాడు గుల్జారీలాల్. ఆ తరువాత ఇంకొక్కమాటు మాత్రమే అతన్ని కల్సుకున్నాను. మొదటికలయికే నామస్తిష్కంమీద గొప్పగా ప్రభావం వేసింది. ఇప్పటికీ అతడి ఆకారాన్నీ, శ్రద్ధాభక్తుల్నీ మర్చిపోలేదు. భయ్యాకు ఇలాంటి విశ్వాసపాత్రులైన వ్యక్తిగత మిత్రులు చాలామంది ఉన్నారు. కథాచీలో హంసరాజు పెట్టిన గడువునూ, దారిలో సంభవించిన ప్రమాదాన్నీ ఆజాద్‌కు చెప్పాను. హంసరాజు అరెస్టయితే పత్రికల్లో వార్త వచ్చేదే ఈపాటికి! అప్పటికీ నాలుగయిదు రోజులపాటు ఉదయాన్నే పత్రిక చూశాము, హంసరాజ్ అరెస్టు అయ్యాడేమోనని!

అక్టోబరు నెల చివరిరోజులు. 30వ తారీకనుకుంటాను. కైలాసపతి అరెస్టయ్యాడన్న వార్త పత్రికల్లోవచ్చింది. అప్పట్లో కైలాసపతి ఢిల్లీలో, పెద్దగా కార్యక్రమాలేమీ నడపడంలేదు. కాకపోతే, అజ్మీరులో మనియాక్షన్ (దోపిడి)కు అవకాశంవుందని ఆజాద్‌కు చెప్పాడు. ఒకటి రెండుమార్లు అజ్మీరుకు వెళ్ళివచ్చాడు. తరువాత పరిస్థితుల్ని అవగాహన చేసుకోవడం కోసం మదనగోపాల్‌ను అక్కడ వుంచడం జరిగింది: ఢిల్లీలో అతడు ఏమంత ఆర్థిక బాధలోనూలేడు. అతడు తన ఇంట్లోనే అరెస్టయ్యాడు. అప్పుడతని దగ్గర పిస్తోలుగూడా వుంది. ఐనా అతడు ఆత్మరక్షణకూ ప్రయత్నం చేయలేదు. పోలీసులమీద దెబ్బతీయడానికీ ప్రయత్నం చేయలేదు. ఇలా మౌనంగా అరెస్టవడాన్ని గురించి విని ఆజాద్ నిరాశగా "ఈనాయాలా జారిపోయాడు!" అన్నాడు.

కైలాసపతి అలా ఏమాత్రం వ్యతిరేకించకుండా అరెస్టవడంవల్ల ఎంతో నిరాశపడ్డాము. అప్పుడే నేను ఆజాద్‌తో ఇలా అన్నాను "ఇతడు ప్రభుత్వసాక్షి ఔతాడని నాకు అనుమానంగా వుంది!" నేను కైలాసపతిని వ్యక్తిగతంగా ద్వేషిస్తూండడంవల్ల అలా అనుమానిస్తున్నానని ఆజాద్

అనుకున్నారు. కానీ, నేను నా అనుమానానికి కారణాల్ని స్పష్టం చేశాను. సంవత్సరం క్రితం అరెస్టయివుంటే నేనతనిని ఇలా అనుమానించేవాడిని కాననీ, ఈమధ్య అతడిలో అనుమానించతగినంతగా విలాస ప్రవృత్తి పెరిగిందనీ చెప్పాను. ఐతే, నా మాటల్ని ఆజాద్ అంతగా పట్టించుకోలేదు. కైలాసపతీ, ఇతర మిత్రులూ నామీదా ఇలాంటి అపరాధాన్నే మోపారు. నేను విలాసాల్లో కొట్టుకుపోతున్నాననీ, దుబారా ఖర్చులు పెడుతున్నాననీ అన్నారు. దీన్ని గురించి లోగడే చెప్పాను. ఏకగ్రీవంగా పది పన్నెండుగంటలపాటు పిక్రిక్ యాసిడ్‌ని తయారు చేస్తుండేవాళ్ళం. ఆ విషవాయువులవల్ల తలనొప్పి పట్టుకునేది. మంచి గాలికోసం ఒకగంట టాంగాలో తిరిగొచ్చేవాళ్ళం. ఏదయినా రెస్టారెంట్‌లో ఐస్‌క్రీం తినేవాళ్ళం ఇదీ అప్పటి మా విలాసప్రవృత్తి! నిజం చెప్పాలంటే విలాసం అనేది వస్తువుల్లో లేదు, దృష్టికోణంలోవుంది.

ఐదోరోజునే ఢిల్లీలో ధన్వంతరి అరెస్టయ్యాడని తెలిసింది. పత్రికల వార్తల ప్రకారం, ధన్వంతరీ మరో మిత్రుడితోకలిసి టాంగాలో చాందినీ చౌక్‌గుండా వెళుతున్నాడు. పోలీసులు అతడిని గుర్తించి వెంబడిస్తున్నారు. అనువైన ప్రదేశాన్నిచూసుకుని పోలీసులు చుట్టుముట్టారు. ధన్వంతరీ వెంటనే రివాల్వర్ బయటకుతీసి పోలీసులపై కాల్పులు జరిపాడు. కొందరు పోలీసులు గాయపడ్డారుకూడాను! అదే అదనని ధన్వంతరీ టాంగాదిగి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఇంతలో పోలీసులు 'పట్టుకోండి! పట్టుకోండి!' అని కేకలు పెట్టారు. అప్పుడు చాందినీ చౌకులో గస్తీ తిరుగుతున్న పోలీసు పారిపోతున్న ధన్వంతరీని తన చేతిలోని లాఠీతో విసురుగా కొట్టాడు ధన్వంతరి కిందపడిపోయాడు. పోలీసులు అతడిని పట్టేశారు. అతడి ప్రక్కనున్న మిత్రుడు సుఖదేవ్ రాజ్. సుఖదేవ్‌రాజు పారిపోయాడు, అలా పారిపోకుండా తనూ పోలీసులపై కాల్పులు జరిపితే? ఇద్దరూకలిసి పోరాడితే ఎలావుండేది? అవ

దలో వున్న మిత్రుడ్నివదలి సుఖదేవరాజ్ అలా పారిపోవడం ఇది రెండవమాటు।

కైలాసపతి అరెస్టయిన వారంలోపలే బాబూరాం, ఖయాలీరామ్ గుప్తా, గిరివరసింహ్, విమల్-మొదలయిన వాళ్ళందరూ అరెస్టయ్యారు. ఢిల్లీలో మావరిస్థితి విషమంగా తయారయింది. ఇతరచోట్ల ఈ అరెస్టులు బాగా ప్రభావాన్ని వేశాయి. ఆజాద్ నన్ను కాన్పూర్‌వచ్చి వుండమని సలహా ఇచ్చాడు. కొత్త మిత్రుల్ని, కొత్త క్షేత్రాన్నీ తయారుచేసుకోమని చెప్పాడు. అప్పటికి కాన్పూరులో నాకెవరూ మిత్రులు లేరు. ఆజాద్ మున్షీరాంశర్మ 'సోమ్' గారిదగ్గర నేనూ ప్రకాశవతి కొన్నాళ్ళుండడానికి ఏర్పాటు చేశాడు. మున్షీరాంగారు అప్పట్లో గంగానది ఒడ్డున పర్మట్ ఘాట్‌లో వుంటున్నారు. డి ఏ.వి కాలేజి అధ్యాపకులు। నాలుగువైపులా అరెస్టులు ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో మేము ఎవరమో, మాకు ఆశ్రయంయిస్తే ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వస్తుందో బాగా తెలిసే వారు మాకు ఆశ్రయాన్నిచ్చారు.

మున్షీరాంగారిల్లు పర్మట్ ఘాట్‌లో రోడ్డుతలన ఉన్నది. కనుక మరోచోట ఎక్కడయినా ఆశ్రయాన్ని చూసుకోవాలను కున్నాము। కాన్పూరు గవర్నమెంటు లెదరువర్కింగ్ స్కూల్లో చౌధరీరామ్‌ధనసింహ్ పనిచేస్తున్నాడు. అడ్రసు తెలుసుకుని అతడిదగ్గరకు వెళ్ళాను. అతడు అప్పుడు బోర్డింగ్‌లో వుంటున్నాడు. మాకు సహాయం చేయడంకోసం, చున్నీగంజ్‌లో, మేడమీద రెండవ అంతస్థులో, పోర్షను నొకదాన్ని అద్దెకు తీసుకున్నాడు. మేము అక్కడికి వెళ్ళిపోయాము.

కైలాసపతి అరెస్టవడంతో అజ్మీరులో చేయాలనుకున్న దోపిడీ జరగలేదు. ఆజాద్ ఆర్థిక సమస్యల్ని పరిష్కరించడంకోసం ఒకదోపిడీకి ఏర్పాటు చేయవలసిందని వీరభద్రకు చెప్పాడు. మాకు ఆర్థికబాధ ఎప్పుడూ వుంటుంది. నేరుగా ప్రజలదగ్గరకు వెళ్ళి అడిగే అవకాశం లేక

పోవడంవల్ల కాంగ్రేసు, కమ్యూనిస్టు పార్టీల్లా ధనోపార్జన చేయగలిగే వాళ్ళుంకాదు. జాతీయ భావనగల వ్యక్తులు ఎందా, రెండువందలు సహాయం చేయగలవారూ కొందరున్నారు. అలాంటి వారిమీద గాంధీగారి మాటల ప్రభావం బాగా పడేది. గాంధీగారు మమ్మల్ని దారి తప్పిన దేశభక్తులనేవారు। స్థిరవరులైన, జాతీయభావంగల వ్యక్తులు మమ్మల్ని దుస్సాహసులైన దేశభక్తులుగా భావించేవారు. మా దర్శనాన్నయితే చేసుకునేవారు. కానీ, ఆర్థిక సహాయం దగ్గరకువచ్చేసరికి వెనకాడేవారు. మాకు ఆర్థికసహాయం చేయడం ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే ఔతుంది. పైగా, గాంధీగారు విప్లవకారులకు సహాయము చేయవద్దని ఒకటేగోల పెడుతున్నారాయె। మా దర్శనాన్నికోరే జాతీయభావంగల వ్యక్తుల దృష్టిలో మా వ్యక్తిగత ఔనరాలే మెదుల్తూవుంటాయి. వారు మా ఉద్యమానికి ప్రాధాన్యత నివ్వరు. ఇలాంటి దృష్టికోణానికి ఉదాహరణగా బాబూ పురుషోత్తమదాసు టండన్‌గారి ప్రవర్తనను చెప్పవచ్చును. ఇప్పుడు చెప్పబోయే విషయం సాండర్స్ వధకు తరువాత 1928 సెప్టెంబరులో జరిగింది.

సాండర్స్ వధ తరువాత మాపార్టీ మిత్రుల్ని లాహోరునుంచి ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్ళవల్సి వచ్చింది. అప్పట్లో పురుషోత్తమదాసు టండన్ పంజాబు నేషనల్ బ్యాంక్, లాహోరు శాఖకు మేనేజరు। జీతం 800 వరకూ వుంటుంది. అప్పటి ధరలకూ, ఇప్పటి ధరలకూ వున్న వ్యత్యాసాన్నిబట్టి, ఆజీతాన్ని ఇప్పుడు 3500కు సమం అనవచ్చును। టాండన్‌గారు, లాలా లజపతిరాయ్‌గారు వుంటున్న ఆవరణలోనే ఒక డాబాలో వుంటున్నారు. ఆ ఆవరణలోనే ద్వారకాదాసు పుస్తకాలయం వుంది. కాన్పూర్‌కుచెందిన ప్రసిద్ధ కార్మిక నాయకులు రాజారాంశాస్త్రిగారు, అప్పట్లో ఆ పుస్తకాలయానికి లైబ్రరియన్‌గా వుంటుండేవారు. ఆజాద్, శాస్త్రిగారు పాతస్నేహితులు. వారు బనారస్‌లో

వుండగా స్నేహితులయ్యారు. శాస్త్రిగారు భగత్‌సింగ్‌నూ, సుఖదేవ్‌నూ, నన్నూ - ఇంకాకూడా మా మిత్రుల్ని కొందర్ని ఎరుగుదురు! ఆజాద్, శాస్త్రిగారి ద్వారా టండన్‌గార్ని కల్సుకోవడానికి సమయాన్ని నిర్ణయించుకున్నాడు. ఆజాద్‌ను కల్సుకోవడానికి టండన్ భయపడనూలేదు. సంకోచించనూ లేదు. చాలా స్నేహంగా ఆజాద్ వీపునిమురుతూ "మీ పద్ధతుల్ని సిద్ధాంతాన్ని మేము ఒప్పుకోము. ఐనా, మీ దేశభక్తినీ, వీరత్వాన్ని కాదనలేము!" అన్నాడు.

ఆజాద్ ఎవరినీ ఏమీ అడగలేదు. అలా అడగడానికి చాలా బాధపడతాడు. ఐనా, ప్రాణాల్ని ఉగ్గపట్టుకుని ఆర్థికసహాయాన్ని అడిగాడు. టండన్‌గారు ఏ మాత్రం సంకోచించకుండా, కూతుర్నిపిల్చి పది రూపాయలు తెచ్చియివ్వమని చెప్పారు. అలాంటి స్థితిలో ఆజాద్‌కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడడం తథ్యం! అప్పుడేకాదు, ఈ విషయాన్ని చెప్పినప్పుడల్లా ఆజాద్ కోపంతో మండిపడేవాడు. ఐతే, టండన్‌గారిమీద ఉన్న గౌరవాన్ని, సభ్యతను దృష్టిలో వుంచుకుని కోపాన్ని దిగమింగడం కాక ఆజాద్ చేయగలిగింది ఏముంది? ఈవిషయాన్ని ఎందుకు చెప్తున్నానంటే టండన్‌గారి జీవితం త్యాగమయమైంది. వారిలో లోభితనం అన్నదిలేదు. అప్పుడు వారు మంచిస్థితిలోనూ వున్నారు. వారి దృష్టిలో ఆజాద్‌కు పది రూపాయిలకు మించిన ఆర్థిక అవసరాలు ఏముంటాయి గనుక? ఇలాంటి అనుభవాల కారణంగా, మేము రాజకీయ దోపిడీలకు పాల్పడక తప్పలేదు!

1930 సం॥ చివరిరోజులు. లండన్‌లో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సు ద్వారా ఇంగ్లీషు ప్రభుత్వంతో రాజీబేరాలు సాగుతున్నాయి కాన్ఫరెన్సులో పాల్గొనడానికి ఇంగ్లీషు ప్రభుత్వం కాంగ్రేసునుకూడా ఆహ్వానించింది. ఈ కాన్ఫరెన్సులో స్వరాజ్యానికి రూపురేఖలు ఏర్పడతాయనీ, తృప్తికరమైన పరిష్కారం జరుగుతుందని అనుకుంటున్నారు. అలాంటిస్థితిలో కాంగ్రేస్‌కు అనుగుణమైన జాతీయ భావనగల వ్యక్తులు విప్లవకారులకు సహాయం చేసి, తద్వారా ఇంగ్లీషు ప్రభుత్వానికి నొప్పి కలిగిస్తారా?

# 11. కాన్పూర్‌లో మనీయాక్షన్

పార్టీ అతి ఘోరమైన ఆర్థికబాధల్లో చిక్కుకుంది. ఆజాద్ మాటి మాటికీ వీరభద్రతో 'మనీయాక్షన్' (దోపిడీ) కు ఏర్పాటు చేయవల్సిందని చెప్తున్నాడు. మేము 'దోపిడి' అన్న శబ్దాన్నివాడే వాళ్ళం కాదు. తప్పని సరై డబ్బుకోసం బలప్రయోగం చేయాల్సివస్తే, దాన్ని 'మనీయాక్షన్' అనిగానీ 'ధనకార్య' అనిగానీ అనేవాళ్ళం। ఈ బాధ్యతను వీరభద్రకే వప్పగించడానికి ఒక కారణం వుంది. అతడు ప్రతి విషయంలోనూ తప్పించుకోవడంకోసమే ప్రయత్నిస్తున్నాడేమోనన్న అనుమానం మాకుంది. నా విషయంలో అతడే రహస్యాన్ని చెప్పివుంటాడన్న అనుమానం ఆజాద్‌కు ఎటూవుంది. పైగా, ఏదైనా బాధ్యతను వప్పగించినప్పుడు అతడు చేస్తానని వప్పుకుంటాడు. కానీ, సమయానికి ఏదో అనివార్యమైన కారణాన్ని చెప్పి తప్పించుకుంటాడు. లేదా, కాంగ్రేసు కార్యక్రమాల కారణంగా అరెస్టయి కొద్దిరోజుల తరువాత విడుదల అయ్యేవాడు. అతడు నిజంగా పార్టీని మోసగిస్తున్నాడని తెలిస్తే దండించాలని ఆజాద్ వుద్దేశం। ఇలాంటి సందేహమే మరో మిత్రుడిమీదా వుండేది ఆజాద్‌కు। ఆ మిత్రుడి పేరు సత్‌గురుదయాల్। నా వ్యవహారం తాలూకు అనుభవాన్ని పురస్కరించుకుని వీరిద్దరికీ తమ చర్యల్ని గురించి వివరించి చెప్పుకునే అవకాశాన్నీయాలనుకున్నాడు భయ్యా। అప్పటికి లాహోరు కుట్రకేసు తీర్పు చెప్పడం అయిపోయింది. భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు - వీరికి ఉరిశిక్ష విధించడం జరిగింది. ఒకరిద్దర్ని వదిలి పెట్టారుకూడాను। అలా వదిలిపెట్టినవారిలో సురేంద్రపాండే ఒకడు. విడుదలై వచ్చాక ఇతడు ఆజాద్‌ను కల్సుకున్నాడు. పార్టీలో పనిచెయ్యాలన్న తన అభిమతాన్ని తెల్పాడు. సురేంద్రపాండే కాన్పూరులో పార్టీశాఖ ప్రారంభం అయినప్ప

టినుంచి పనిచేస్తున్న మిత్రుడు. పైగా, ఈ మధ్య సంవత్సరన్నరకు పైగా జైల్లోవుండి ఇతర మిత్రుల్తో సామూహిక అధ్యయనంగావించిన మిత్రుడు। ఇతడి సహకారం పార్టీకి ఎంతైనా అవసరం।

ఆజాద్, వీరభద్రతివారీకి, సత్‌గురుదయాల్ అవస్థీకి - వీరిద్దరికీ తమ ప్రవర్తన గురించి వివరించవల్సిందని సందేశం పంపించాడు. అప్పుడు సెంట్రల్ కమిటీ ఎటూలేదు. కాగా, ఆజాద్, సురేంద్రపాండే-వీరే పై సందేశాన్ని పంపారు. సత్‌గురుదయాల్ అవస్థీ ఒక జాబురాసి తనమీద మోపిన నేరాలు నిరాధారమైనవని తెలియపరచాడు. వీరభద్ర తివారీ వచ్చాడు. నాకు రహస్యం చెప్పడంగురించి ప్రశ్నించాడు ఆజాద్। తివారీ నిజాయితీగా తన తప్పును వప్పేసుకున్నాడు. కొన్ని సందర్భాల్లో ప్రాణరక్షణ కోసం కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా భవిష్యత్తులో అలా చేయనని మాట ఇచ్చాడు.

వీరభద్ర, కాన్పూరులోని నయాగంజి (దాల్‌మండి) వద్ద గల ఖోజే అనే చర్మపు వ్యాపారికొట్టును దోయడానికి ప్లాను వేశాడు. ఆ వ్యాపారి ఇనప్పెట్టెలో లక్షరూపాయలవరకూ రొఖ్ఖం వుంటుందని చెప్పాడు. దోపిడీ చేయవల్సిన రోజూ, సమయమూ నిశ్చయమయింది. ఆజాద్ ఒకమాటు వీరభద్రను హెచ్చరించాడు. "సమయానికి మొండి కాలు అడ్డం పెట్టడమో, జైల్లోకివెళ్ళి కూచోవడమో చేయకు।" అన్నాడు అనుకున్నంతా ఐంది. ఆ రోజుకు వీరభద్రతివారీ అరెస్టయాడు.

ఈమాటు యాక్షన్ తప్పక జరుగుతుందని ఆజాద్ అనుకున్నాడు. పరిసరాన్ని ఒకమాటు చూసివచ్చాడు. వీరభద్ర లేకపోయినా యాక్షన్ ఆగనవసరము లేకుండా ఏర్పాట్లు చేసుకున్నాము ఈసారి। ఆజాద్ ఇతర మిత్రులతో కలిసి అనుకున్న సమయానికి సైకిళ్ళపై ఖోజే దుకాణం దగ్గరకు వెళ్ళాడు. సైకిళ్ళను మెట్లదగ్గరగా గడపలో పెట్టారు. ఇద్దరు పిస్తోళ్ళు తీసుకుని మేడమీదకు వెళ్ళే మెట్లదగ్గర కాపలా నిలబడ్డారు,

ఇతరులెవ్వరూ పైకి పోకుండా। ఆజాద్, సురేంద్రపాండేను, శాలి గ్రామ్‌ను వెంటబెట్టుకుని పైకి వెళ్ళాడు।

పైన ఖజానాగదిలో లావుపాటి ఖోజా, మరియిద్దరు గుమాస్తాలూ ఉన్నారు. ఆజాద్ పిస్తోలు చూపించి ఇనప్పెట్టె తాళం చెవులు ఇమ్మని అడిగాడు. ఖోజా అరవటానికి నోరుతెరిచాడు. ఆజాద్ ఒక చెంపపెట్టు పెట్టి 'నోర్ముయ్।' అన్నాడు అతని గొంతులోని అరుపు గొంతులోనే గుర్రు పెట్టింది, తెరచిన నోరు తెరచినట్టే వుండిపోయింది.

యమదూతల్లాంటి ముగ్గురు వ్యక్తులు ఎదురుగా : స్తోళ్ళు పట్టుకు నిలబడి వుండడంచూసి గుమస్తాలుకిమ్మనకుండా ఇనప్పెట్టె తాళంచెవులు ఇచ్చేశారు. ఇనప్పెట్టెనుతెరచి ఉన్న డబ్బంతా ఒక సంచిలోకి పోసుకున్నారు మిత్రులు। గుమస్తాలు శాంతంగా కూచున్నారు. వస్తూ వస్తూ టెలిఫోన్ వైర్లను తెంపేశారు. ఇంతసేపూ ఖోజా తెరచిన నోరు తెరచినట్టేవుంది. అతడిక శాశ్వతంగా నోరు తెరిచాడు. స్పృహతప్పి వుంటాడనుకున్నారు మిత్రులు. కానీ, మర్నాటి వార్తలను అనుసరించి అతడు ఈ లోకాన్నే వదిలివేశాడని తెలిసింది। ఆజాద్ ఇతర మిత్రులు తిరిగి వచ్చి సంచిలోని డబ్బును లెక్కపెట్టారు. పన్నెండు వందలు మాత్రమే ఉన్నాయి। ఇలాంటి నిరుపయోగమైన ప్రదేశాన్ని ఎన్నిక చేసినందుకు వీరభద్రమీద ఆజాద్‌కు వల్లమాలిన కోపమొచ్చింది, కానీ పత్రికల వార్తల ప్రకారం, ఖోజా ఆనాటి మధ్యాహ్నమే ఒక లక్షరూపాయలు బ్యాంకికి పంపించాడని తెలిసింది. పత్రికల్లో, 'ఈపని చాలా సాహసంతో కూడిందని, నైపుణ్యంగల వ్యక్తులు ఈపని చేసివుంటారని' రాశారు. ఖోజా దుకాణానికి వెనకవైపున పెద్ద పోలీస్‌స్టేషన్ వుంది. నయాగంజ్‌లో మూడు ఇళ్ళ తరువాత ఓచిన్న పోలీసుస్టేషను వుంది. వెనకా ముందూ రెండు పోలీసుస్టేషనులుండగా, ఇలా చేయగలగటం నిజంగా సాహసంతో కూడినపని। ఏమైనాకానీ, ఇది జరిగాక వీరభద్రపార్టీని మోసగిస్తున్నాడన్న దృఢనిశ్చయానికి వచ్చాడు ఆజాద్।

# 12. అమరవీరుడు శాలిగ్రాంశుక్ల

కైలాసపతి అరెస్టయ్యాకకూడా ఆజాద్ ఢిల్లీని పూర్తిగా వదిలిపెట్టలేదు. అతడు ఢిల్లీ నుండి నందకిశోర్ నిగమ్‌ను సలహాకోసం కాన్పూరు పిలిపించు కున్నాడు. ఇలాంటి సందర్భాల్లో తెలివితేటలుగల మరోవ్యక్తిని పక్కన వుంచుకోవడం ఆజాద్‌కు అలవాటు। అప్పట్లో ఆజాద్ ఎక్కువగా సురేంద్రపాండేతో సలహాపడుతూండేవాడు. సురేంద్రపాండే, పోలీసులకు అనుమానం కలగకుండా వుండడానికి సొంత ఇంట్లో వుండకుండా గంగా నది ఒడ్డున, కోటలో అద్దె ఇంట్లో వుంటున్నాడు. శాలిగ్రాం శుక్ల కూడా అక్కడే వుంటున్నాడు.

శాలిగ్రాం శుక్ల ఇంతకుముందు 'యూత్ గార్డు' సంఘంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. లాహోరులో 'నౌజవాన్ భారత్ సభ' ఎలాంటిదో, ఉత్తరప్రదేశ్‌లో 'యూత్‌గార్డు' సంఘం అలాంటిది. 'యూత్‌గార్డు'సంఘం యువకులు కాకి డ్రస్ వేసుకుని కవాత్ చేసేవారు. జాతీయ ఉద్యమం లోనూ ఉత్సాహంగా పాల్గొనేవారు. ఒక సందర్భంలో శాలిగ్రాం శుక్ల అతడి మిత్రులూ పోలీసుల్ని కొట్టడంకూడా జరిగింది. పోలీసులు శుక్లను అరెస్టు చెయ్యాలని చూస్తున్నారు. శుక్ల మొదట్నుండి పార్టీకార్యక్రమాల పట్ల ఆసక్తిని కనబరుస్తూండేవాడు. ఇప్పుడు పూర్తిగా పార్టీ మనిషి అయ్యాడు సురేంద్రపాండేతోఉంటూ రహస్యజీవితాన్ని గడుపుతూన్నాడు.

నిగమ్‌నూ, పాండేనూ ఉదయం ఆరుగంటలకు కల్సుకోవాలని నిర్ణయించాడు ఆజాద్। స్థలం గ్రీన్ పార్కులోని డి.ఎ.వి. కాలేజీఎదుట। పాండేను అక్కడికి తీసుకువెళ్ళే బాధ్యత శాలిగ్రాం శుక్లకువప్పగించారు. ఇద్దరిదగ్గరా గడియారాలులేవు సమయానికి చేరుకోలేమేమోనన్న భయంతో బాగా తెల్లవారుఝామున బయల్దేరారు ఇద్దరూ। ఆ రోజుల్లో 'గ్వాల్‌టోలీ' స్థితి అధ్వాన్నంగా వుండేది. రోడ్లమీద గోతులూ, గుంటలూ వుండేవి।

పాండే సైకిల్ ముందుచక్రం ఒక పెద్ద గుంటలో పడ్డది. క్రింద పడ్డంత పనయింది. హాండిల్ మీద పెట్టివున్న సైకిల్ పంపు చక్రంలోపడి రెండు మూడుచువ్వలు విరిగిపోయాయి. చక్రం వంకరపోయింది. అక్కడ నుండి గ్రీన్ పార్కు వరకూ నడిచేవచ్చారు.

వీళ్ళు గ్రీన్ పార్కుకు వెళ్ళేసరికి ఇంకా తెల్లారలేదు. అరుగంటలు కావడానికి చాలా సమయం వుందనిపించింది. శాలిగ్రామ్, పాండేతో ఇలా అన్నాడు "ఇంకా ఎక్కడికైనా వెళ్ళవల్సి రావచ్చును డి.ఎ.వి. కాలేజీ బోర్డింగ్ లో ఎరిగిన విద్యార్థులువున్నారు. ఈ సైకిలు అక్కడ పెట్టి మంచి సైకిలు పట్టుకొస్తాను!" శుక్ల, పాండేను గ్రీన్ పార్కు పర్మట్ వైపున వదలి విరిగిన సైకిలు తీసుకుని బోర్డింగ్ వైపు వెళ్ళిపోయాడు. శుక్ల కాలేజీ బిల్డింగ్సునుదాటి బోర్డింగ్ గేటుదగ్గరకు చేరగానే అటువైపు నుండి టార్చిలైటు ఫోకస్ కనుపించింది. "Beware! Beware!" అన్న శుక్ల అరుపులు వినిపించాయి! అప్పుడే పిస్తోలు పేల్చిన శబ్దము వెంటనే రైఫిల్ ధ్వని వినిపించాయి!

ఏం జరిగిందంటే, గ్రీన్ పార్కు చివర్న, బోర్డింగ్ గేటుకు ఎదురుగా అగ్జిలియరీ ఫోర్స్ ఆఫీసువుంది. అక్కడ సాయుధ ఇంగ్లీషు సిపాయీ కావలా వుంటాడెప్పుడు! శుక్ల అక్కడికి వెళ్ళేసరికి సి.ఐ.డి. ఇనస్పెక్టర్ శంభూనాధ్ మరి ఇద్దరు పోలీసులూ అక్కడవున్నారు. వాళ్ళు ఏపనిమీద అప్పుడు అక్కడకు వచ్చారో తెలియదు. ఇనస్పెక్టరు శుక్ల మీద టార్చిలైటు ఫోకస్ చేశాడు. శుక్లను గుర్తుపట్టారు. ఇనస్పెక్టరు ఇతణ్ణి పట్టుకోడానికి ప్రయత్నించాడు. శుక్ల పారిపోవడానికి యత్నించాడు గానీ, సైకిల్ విరిగిపోవడంవల్ల పారిపోలేక పోయాడు. ఒకళ్ళొకళ్ళు కలియబడ్డారు ఇంతలో ఒక కానిస్టేబులు చేతికర్రతో శాలిగ్రామ్ శుక్ల తలమీద కొట్టాడు. అప్పుడే శుక్ల 'Beware! Beware!' అని అరిచాడు. ఎందుకంటే దగ్గర్లోనే పాండే వున్నాడు. అజాద్ రాబోతూన్నాడు. ఇన

స్పెక్టరూ, పోలీసులూ - అతణ్ణి చుట్టుముట్టారు. ఇంక అప్పుడు పిస్తోలు బైటకుతీసి కాల్చాడు శుక్ల! ఒకపోలీసుకు తొడలోకి గుండు దూరి పోయింది. పోలీసులూ, ఇనస్పెక్టరూ - అగ్రిరియరీ ఫోర్స్ ఆఫీసులోకి పరుగెత్తి తల దాచుకున్నారు. శుక్ల సైకిల్‌ని వదిలేసి పారిపోసాగాడు. ఇదిచూసిన ఇంగ్లీషు సిపాయీ శుక్లవీపున రైఫిల్‌తోకాల్చాడు. శాలిగ్రాం శుక్ల రోడ్డుమీద పడిపోయాడు.

అగ్రిలియరీ ఫోర్స్ ఆఫీసులోకి వెళ్ళిన ఇనస్పెక్టరు శంభూనాథ్, ఫోన్‌చేసి మరికొందరు పోలీసుల్ని పిలిపించుకున్న తరువాతగానీ అక్కణ్ణుండి బయటకు రాలేదు. అదనపు పోలీసులు వచ్చేసరికి పదిపదిహేను నిమిషాలు ఎటూ పట్టివుంటాయి. శుక్ల వీపున రైఫిల్ దెబ్బ తగలడం వల్ల అగ్రిలియరీ ఫోర్స్ ఆఫీసుముందు పడివున్నాడు. ఒకవైపున సైకిలూ పడివుంది. అదేసమయంలో ఆజాద్ సైకిల్‌మీద పర్మట్‌వైపున వున్న కొసకు వెళ్ళుతూన్నాడు. ఒకయువకుడు దెబ్బతిని పడివుండడాన్ని, ప్రక్కన విరిగిన సైకిల్నీ-ఆజాద్ చూశాడు. ఐతే, ఆజాద్, ఆపడి వున్నది తమ పార్టీ యువకుడే అనుకోలేదు. గ్రీన్‌పార్కు కొసన ఎవరూ లేకపోవడాన్నిచూసి, పర్మట్ ఘాట్‌లోని పండిత ముంషీరాం ఇంటికి వెళ్ళాడు. సురేంద్ర పాండే శుక్ల అరుపుల్ని విన్నాడు. ఆ తరువాత రైఫిల్ ధ్వనిని విన్నాడు. ఇంక అక్కడ నిలుచోవడం అనవసరమూ, ప్రమాదకరమూ అని అనుకుని తనూ ముంషీరాం ఇంటికి వెళ్ళాడు. పాండేచెప్పగా విషయాన్నంతావిన్న ఆజాద్, అగ్రిలియరీఫోర్స్ ఆఫీసుకు ఎదురుగా పడివున్న యువకుడు శాలిగ్రామ్ శుక్లేనని తెల్సుకున్నాడు. రైఫిల్‌గుండు తగిలి శుక్ల చనిపోయాడని, పాండే-ఆజాద్ ఇద్దరూ అనుకున్నారు! సరే, ఇక చేయగలిగింది ఏముంది?....

ఆజాద్, పాండే మాట్లాడుకుంటూ వుండగానే మళ్ళీ కాల్పుల ధ్వని వినిపించింది గావుకేకలు వినిపించాయి. క్షణంలో అంతా నిశ్శబ్ద

మయింది. ఆజాద్ బోర్డింగ్ గేటుముందునుంచి వస్తున్నప్పుడు శాలిగ్రామ్ శుక్ల గాయపడ్డాడేగాని చనిపోలేదు. అతడు ఆజాద్‌ను చూసివుండవచ్చును. ఐతే సహాయం కోసరం అరవలేదు. ఆజాద్ మీద ఎవరికీ సందేహం కలగకుండా వుండడానికి వూపిరి బిగపట్టుకు వూరుకున్నాడు.

నాలుగయిదు నిమిషాల తరువాత అదనపు సాయుధ పోలీసులు వచ్చారు. శుక్ల చనిపోయాడని భావించి అతడిని వ్యాన్‌లో పడవేయడానికి పోలీసులు దగ్గరకువచ్చారు. వెంటనే శుక్ల మరో నాలుగుమార్లు కాల్పులు జరిపాడు. ముగ్గురు పోలీసుల్ని గాయపరిచాడు. పోలీసులు అదరిపడి గావుకేకలుపెట్టి తప్పుకున్నారు. దూరాన నిలబడి శుక్లపై కాల్పులు జరిపారు. అతడు చనిపోయాకనే పోలీసులు దగ్గరకు రాగలిగారు. తరువాత శవాన్ని వ్యాన్‌లో వేసుకువెళ్ళారు. శాలిగ్రాం శుక్లపేరు ఏ కుట్రకేసులోనూ లేదు. అతడికి ఎవరూ ఎన్నడూ జయకారాలు పలకలేదు. ఐనా, శాలిగ్రామ్ శుక్ల త్యాగం దీటులేనిది. సాహసంలో, శౌర్యంలో శుక్ల మాపార్టీ వీరుల్లో ఎవరికీ తీసిపోడు.

బరాల్‌లో ప్రకాశవతి విశ్రాంతిగా సుఖంగా వుంటూంది. కానీ ఆమెకు తృప్తిలేదు. ఆమె మాతోపాటేవుండి పార్టీపనుల్లో పాల్గొనాలని తహతహలాడుతూన్నది. సురక్షితమైన నివాసానొకదాన్ని ఏర్పరచుకోవాలని ఆలోచిస్తూవున్నాను. కొందరు మిత్రులు అలహాబాదులో వున్నారు. వారితో సంప్రదించడానికి ఆజాద్, నేనూ అలహాబాదు వెళ్ళాము. అక్కడ అనుకోకుండా బల్దేవ్‌చౌబే కలిశారు.

చౌబేగారితో లాహోరులోనే పరిచయమైంది. వారు లాలా లజపతిరాయ్ స్థాపించిన 'సర్వెంట్సు ఆఫ్ పీపుల్సు సొసైటీ'లో సభ్యులు. జీవితమంతా దేశసేవకోసం అర్పించిన త్యాగమూర్తి. పరమ గాంధీవాదులైన పురుషోత్తమదాస్ టండన్ అనుయాయి వీరు.

టండన్‌గారి ఆదేశానుసారం, అలహాబాదులో గంగానదికి అవతల హిందీ విద్యాపీఠాన్ని నడుపుతున్నారు చౌబేగారు. ఈ విద్యాపీఠంలో బీద విద్యార్థులకు జీతం లేకుండా చదువు చెబుతారు. భోజనమూ పెడతారు. విద్యాపీఠం ప్రాచీన దేవాలయం ఒకదాంట్లో జరుగుతూవుండేది. చుట్టుపట్ల మైలు రెండు మైళ్ళవరకూ ఊరుపల్లె ఏమీలేవు. ఘోరమైన నిర్మానుష్యం! చౌబేగారు చాలా ఆత్మీయతను కనబరిచారు. వారినిలా అడిగాను. "ఎప్పుడైనా అవసరమయితే మాకు మీ దగ్గర ఆశ్రయం దొరుకుతుందా?" చౌబేగారు ఇలా అన్నారు. "ఈ ఇంటిని మీదిగానే భావించండి! నేను చేయగలిగిన సహాయము తప్పకుండా చేస్తాను. మీరు దేశంకోసం ప్రాణాలర్పిస్తున్నారు...."

పై విషయాన్ని ఎందుకు చెబుతున్నానంటే, విప్లవకారులమైన మమ్మల్ని గాంధీగారు ఘోరంగా విందిస్తుంటారు. ఐనా, గాంధీవాదుల హృదయాల్లో మా పట్ల ఎప్పుడూ ఆదరభావం ఉంటూనే వుంది. అలహాబాదు, మీరట్, ఢిల్లీ, లాహోరులోని గాంధీ ఆశ్రమాలు, ఖద్దరు భండారాలు మాకు ఆశ్రయస్థానాలుగా పనికి వచ్చేవి. వార్తలను పంపుకోవడానికీ, తెప్పించుకోవడానికీ, ఉపయోగపడుతూండేవి. ఉత్తరప్రదేశ్‌లో బెనర్జీ సోదరులు మాకు సహకరిస్తూ వుండేవారు. ఇక లాహోరులోని ఖద్దరు భండారంలో మా సహాధ్యాయి జస్వంతసింగ్ ఉండేవాడు. అతడికి మేము ఎప్పుడు ఏం చేస్తున్నదీ - వివరాలన్నీ తెలుస్తూండేవి! అతడు మాలో పూర్తిగా కలిసిపోలేదు. అందుకు కారణం అతడి దృష్టిలో మేము ఏమంత తెలివిగలవాళ్ళమూ, నేర్పుగల వాళ్ళమూకాదు! ఐతే, అతడి సహాయ సంపత్తులు మాకు ఎప్పుడూ అందుతూ ఉండేవి!

సరే, నేనూ ప్రకాశవతీ, కొన్నాళ్ళపాటు చౌబేగారి విద్యాపీఠంలో ఉన్నాం! చలికాలంకావడంవల్ల గాలీ వెలుగూ చొరపీలులేని పురాతనమైన ఆ ఇంట్లో ఉండడమూ ఏమంత బాధ అనిపించలేదు. విద్యాపీఠం ఇతరుల

దానంతో, చందాలతో నడుస్తూండడంవల్ల విద్యార్థులకు జొన్నరొట్టె, ఒక కూర మాత్రం పెడుతూండేవారు. చౌబేగారు, వారి పన్నెండేళ్ళ కూతురు మాధవి కూడా జొన్నరొట్టెలే తినేవారు. కానీ మాకోసం మాత్రం పండ్లూ ఫలాలూ పట్టుకొస్తూండేవారు. ఇలా వారు జొన్న రొట్టెలు తిని, మాకు పండ్లు తీసుకురావడం కొంత బాధను కలిగించేది!

అలహాబాదులోని మిత్రుల్ని కల్సుకోవడానికి వెళుతూండేవాడిని. రాత్రిపూట్ల ఎనిమిది తొమ్మిది గంటలకుగాని తిరిగొచ్చేవాడిని కాదు. ఆ సమయంలో యమునా నది దాటడానికి నావలు దొరికేవి కావు. వంతెన మీదుగా తిరిగిరావాలి! మూడు నాలుగుమైళ్ళ దూరం చుట్టుతిరిగితేగాని వంతెన తగలదు! ఐనా, సైకిలు చేతిలోవుందిగనుక, కష్టం అనిపించేది కాదు. ఒకరోజు రాత్రి నేను తిరిగివస్తూన్నాను. ప్రక్కనఉన్న పల్లెలో మంచి అరుపులూ, కేకలూ విన్పిస్తూన్నాయి, దొమ్మీ జరుగుతూన్నట్టు! విద్యాపీఠానికి వచ్చాక చౌబేగారు ఎంతో అశాంతిగా వుండడాన్ని చూశాను. పక్కగ్రామంలో ఒకగేదెకు పిచ్చెక్కింది. అది దారే పచ్చే పోయేవాళ్ళను పొడిచేస్తూన్నది. నేనెక్కడ దానిదాడికి గురికౌతానోనని చౌబేగారు బాధ పడుతూన్నారు. సహజంగానే విద్యాపీఠంలోని వారందరూ భయపడు తూన్నారు. "అలాంటి గేదెను కాల్చిపారెయ్యాలి" అన్నాను నేను.

క్షణం ఆలోచించి చౌబేగారు ఇలా అన్నారు "పిచ్చెక్కిన గేదెను కాల్చడానికి వెళ్ళడమూ ప్రమాదమేకదా?"

"ప్రమాదమే! అపకంగా ఒదిలిపెడితే చాలామందిని చంపేస్తుంది కదా?" అన్నాను. అప్పటికే గేదె రెండు మూడు గుడిసెల్ని పడేసింది. గేదెని కాల్చడానికి వెళ్ళడంవల్ల ఇతరుల దృష్టికి ఎక్కుతామన్న భయం ఎటూవుంది. ఐనా, అప్పటికది కర్తవ్యమనుకున్నాను. చౌబేగారితో ఇలా అన్నాను "నాదగ్గర పిస్తోలుంది. కాని పిస్తోలుతో కాల్చాలంటే,

గేదెకు బాగా దగ్గరకు వెళ్ళాలి. పైగా పిస్తోలు దెబ్బకు గేదె చావదు. గాయపడుతుంది. మరికూడా ప్రమాదకరంగా తయారవుతుంది!"

"తుపాకివుంది. ఐతే, చాలారోజులుగా వాడికలోలేదు!" అన్నారు, చాలాసేపు ఆలోచించి చౌబేగారు.

"ఎక్కడవుంది? తెప్పించండి చూద్దాం! తూటాలు ఉన్నాయా?" అని అడిగాను. చౌబేగారు ఇలా అన్నారు. "బాబూ అదంతా నాకు తెలియదు. తెచ్చిఇస్తాను, నువ్వే చూసుకో!"

చౌబేగారు దీపంతీసుకుని చీకటి కొట్టులోకి వెళ్ళారు. ఎర్రని గుడ్డలో చుట్టివున్న తుపాకిని పట్టుకువచ్చారు. గుడ్డలు విప్పిచూశాను. మందుకూరుకుని కాల్చే నాటు తుపాకి. బహుశా, మహారాష్ట్రుల కాలం నాటిది కావచ్చు! అక్కడ మందూలేదు, తుపాకి గుండ్లులేవు. మనస్సు మహాఖేదపడ్డది. ఇంగ్లీషుప్రభుత్వం ఈదేశప్రజల్ని ఎంత నిరుపాయులను చేసి వదిలింది? తనపైకి ఎదురుతిరుగుతారన్న అనుమానం లేకపోయినప్పటికీ, ఇంగ్లీషు ప్రభుత్వం ఈ దేశప్రజల్ని అతిదారుణంగా నిరాయుధుల్నే విస్సహాయుల్ని చేసేసింది! ఈ విస్సహాయస్థితికే గాంధీగారు 'ఆత్మశక్తి' అన్న ముద్దుపేరు పెడుతూన్నారు. "ఐతే, చౌబేగారూ, అహింసతోటీ, ఆత్మబలంతోటీ ఆగేదెకు హృదయపరివర్తన కావిద్దాం!" అన్నాను. ఆత్మశక్తిపట్ల నాకు విశ్వాసం లేకపోవడాన్నిచూసి చౌబేగారు విట్టూరుస్తూ "బాబూ, ఎవరి నమ్మిక వాళ్ళది!" అన్నారు.

# 13. లెమింగ్టన్ రోడ్డులో కాల్పులు

మొదటి లాహోరు కుట్రకేసును పంజాబ్ గవర్నరు ఆదేశాను సారం ప్రత్యేకమైన న్యాయస్థానానికి ఒప్పచెప్పారు. ఈ న్యాయస్థానానికి సెషన్సు అధికారాలన్నీవున్నై. ఈ న్యాయస్థానం 1930 అక్టోబరులో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు - వీరికి ఉరిశిక్షను విధించింది. మిగిలిన మిత్రులు బటుకేశ్వరదత్తు, శివవర్మ, జయదేవ్‌కపూర్, మహావీరసింహ్ - వీరికి జన్మఖైదును విధించింది. ఈ సందర్భంగా మేము కొంత అసమ్మతిని ప్రకటించాలనుకొన్నాము. ఐతే, రెండవకుట్రకేసు మిత్రులుకూడా అరెస్టుకావడంవల్ల పంజాబులోని పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయాయి. ఉత్తరప్రదేశ్‌లోనూ అలాగేవుంది. పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల్లో పోలీసుల దమనకాండ ఎక్కువగాఉంది గనక దక్షిణాన ఏమయినా చేయవచ్చును అంటాడు ఆజాద్. అలాచేయడంవల్ల ఉద్యమముయొక్క వ్యాప్తికూడా పెరుగుతుందంటాడు.

గదర్ పార్టీ వీరుల్లో ఒకరైన పృథ్వీసింగ్ మద్రాసుజైల్లో జన్మ ఖైదు అనుభవిస్తున్నాడు. అతణ్ణి అమరావతి జైలుకు తీసుకు వెడుతూన్నారు. మధ్యలో రైల్లోనుంచి (చినగంజాందగ్గర) దూకి తప్పించుకు పోయాడు. అతడు కొన్నిసంవత్సరాలుగా వేషం మార్చుకుని స్వామీరావు అన్నపేరుతో గుజరాతులో వుంటున్నాడు. అక్కడ యువకులకు వ్యాయామాన్నీ కసరత్తునీ నేర్పుతున్నాడు. జాతీయభావాల్ని ప్రచారంచేస్తున్నాడు. పోలీసులకు ఏ మాత్రం అనుమానం కలగకుండా వ్యవహరిస్తున్నాడు. పృథ్వీసింగ్ పేరు మార్చుకుని గుజరాతులో వుంటున్నాడని పార్టీకితెలుసు. ధన్వంతరీ ఒకమాటు అతడిని కల్సుకున్నాడు కూడాను. పార్టీ కార్యక్రమాలకు సహకరించవలసిందని అభ్యర్థించాడు. అందుకు స్వామిరావ్ అంగీకరించాడు. ధన్వంతరీ అతడిని అలహాబాదు తీసుకు వచ్చాడు.

ఆజాద్ కూడా స్వామీరావును కల్సుకోవడం జరిగింది. స్వామిరావ్ గుజరాతులోను, మహారాష్ట్రలోను విప్లవ కార్యక్రమాలను నిర్వహించ డానికి అంగీకరించాడు. ఐతే నెలలు గడచినా, ఏకార్యక్రమమూ జరగడం లేదు.

దుర్గాభాబీ కాన్పూరులో వున్నది. పార్టీ కార్యక్రమాలు ఏమాత్రము జరగకపోవడంవల్ల ఆమె బాధపడుతున్నది. తనూకార్యక్రమాల్లో పాల్గొన డానికి తహతహలాడుతున్నది. ఆరోజుల్లో ఉత్తర భారతదేశంలో ఘోషా ఆచారం ఇప్పటికంటె దారుణంగా వుండేది. ఏ స్త్రీయేగానీ, బయటికి వచ్చి పనిచేయడం, నలుగురి నోళ్ళల్లో నానడానికి కారణమయ్యేది. అలాంటి స్త్రీ గురించిన అత్తింటి వివరాల్ని, పుట్టింటి వివరాల్ని సేకరిస్తూ వుండేవారు. కానీ, గుజరాతుకు, మహారాష్ట్రకూ ఉమ్మడి రాజధాని ఐన బొంబాయిలో ఘోషా పద్ధతి అంత విపరీతంగా వుండేదికాదు. కనుక, భాభీ బొంబాయివెళ్ళి, స్వామీరావును, ఇతర మిత్రులను ప్రోత్సహిస్తూ వుండడం మంచిదని, ఆజాద్ అనుకున్నాడు.

దుర్గాభాభీ బొంబే చేరిన వెంటనే ఓపెద్ద కార్యక్రమాన్ని నిర్వహిం చడానికి ప్లాను వేశారు. లాహోరు కుట్రకేసులోని నిందితులకు విధించిన శిక్షలకు అసమ్మతిగా, బొంబాయి గవర్నర్ని కాల్చిచంపేయాలని అను కున్నారు. ఇందుకవసరమైన ప్లానును తయారుచేసే బాధ్యత స్వామిరావు, అతని మిత్రులూ స్వీకరించారు.

దుర్గాభాభీ కాన్పూరు తిరిగివచ్చి ఆ ప్లాను గురించి మాకు వివ రించి చెప్పింది. అది విని మేమెంతో ఆశ్చర్య పడ్డాము. ఆ ప్లాను ప్రకా రం విజయాన్ని ఎలా ఆశించారో మాకు అర్థంకాలేదు. గవర్నమెంటు హౌసులోకివెళ్ళి, గవర్నర్ని, కాల్చాలన్నది వాళ్ళ వుద్దేశ్యము. గవర్న రుగారు ఉదయం ఎనిమిది గంటలాచాయల కాఫీ ఫలహారములు ముగిం చుకుని, పత్రిక చదువుకుంటూ వరండాలో, కూర్చునివుంటారు. ఆ సమ

యంలో దుర్గాభాభీ ఎరువు తెచ్చుకున్న కారులో అక్కడికి వెళుతుంది. తన కార్డును గవర్నరు సాహెబ్‌కు పంపుతుంది. గవర్నరు పిలిచినప్పుడు వెళ్ళి కాల్చివేస్తుంది. ఇదీ ప్లాను.

దుర్గాభాభీతోపాటు వెళ్ళే రెండోవ్యక్తి ఎవరన్న ప్రశ్న వచ్చింది. తనతోపాటు స్వామీరావే వుండాలని భాభీ అన్నది. ఐతే, తాను బంగళా లోకి పోకుండా బైటే వుంటే బాగుంటుందని స్వామీరావు అభిప్రాయం. భాభీ, మరొక మిత్రుడు-బంగళాలోకి వెళ్ళి గవర్నర్ని కాల్చిపారిపోతారు పోలీసులు వారిని వెంబడించినప్పుడు తాను పోలీసులతో పోరాడుతూ భాభీనీ ఇంకర మిత్రుల్నీ రక్షిస్తానంటాడు స్వామీరావ్. కానీ, భాభీ అందుకు ఒప్పుకోలేదు. స్వామీరావ్ వెంటేవుండాలని అన్నది.

ఎవరు వెంటవున్నా, కార్యక్రమం విజయవంతం అవడం సందేహాస్పదం! ప్లానువేసిన మిత్రులకు గవర్నమెంటుహౌసులోకి నేరుగా కారును పోనివ్వరన్న విషయం కూడా తెలియదు. గవర్నరుగారిని కల్సుకోవడానికి ముందుగానే అనుమతి తీసుకోవల్సి వుంటుంది. ఎన్నో ఎంక్వయిరీలయ్యాకగానీ అనుమతి లభించదు. దుర్గాభాభీ, నిర్ణయించిన తారీకువరకు నిశ్చింతగా ఎదురు చూస్తున్నది. తారీకులు మారుతూవుండడంతో అత్యంత రాన్ని చెప్పింది. చివరకు ఒకరోజును నిర్ణయించుకున్నారు. స్వామీరావుకు మిత్రుడైన వైశంపాయన్ ఒక సేటునడిగి కారు పట్టుకువచ్చాడు. అనుభవంగం, సైన్యంలో పనిచేసిన డ్రైవర్ ఆప్టే బండి నడపటానికి కూచున్నాడు. డ్రైవర్‌పక్కనే స్వామిరావ్ కూచున్నాడు. వెనకసీటులో దుర్గాభాభీ, సుఖదేవరాజ్ కూచున్నారు. వాళ్ళదగ్గర గుళ్ళునింపిన పిస్తోళ్ళు చెరొకటీ వున్నాయి. కారు గవర్నమెంటు హౌస్‌వైపు వెళ్ళింది. ఐతే, లోపలకు ఎలా వెళుతుందీ? లోపలికి వెళ్ళడానికి వీలుకాదుగనుక, గేటు ముందునుండి వెళ్ళిపోయింది కారు. స్వామిరావ్ ఆజ్ఞను అనుసరించి గేటుముందే రెండుమూడు సార్లు చక్కర్లు కొట్టింది. ఆ రోజున లీన్‌బత్తి

చౌకలో కార్లనుచకింగ్ చేస్తున్నారు బహుశా, లైసెన్సుకోసం నంబర్లను నోటుచేసుకుంటున్నారుగావును. కారు రెండుమూడు సార్లు ఆ చౌకు గుండానే వెళ్ళింది. స్వామీరావ్ ఆజ్ఞననుసరించి మెరీన్‌డ్రయివ్, ఫోర్టు, కొలబా, బైకులా, దాదర్, మహీం - ఈ ప్రదేశాలన్నీ పగలంతా తిరిగిందికారు. ఆ రోజునే పనిజరిగి పోవాలని దుర్గాభాభీ పట్టుపట్టింది. మరునటిరోజుకు వాయిదా వేయడానికి ఆమె ఒప్పుకోలేదు!

బొంబే రోడ్లమీద అలా సాయంత్రంవరకూ తిరిగారు. చీకటి పడ్డది. కారు లెమింగ్‌టన్ రోడ్డుగుండా వెళుతోంది. గ్రాంట్ రోడ్డును దాటాలి. ట్రాఫిక్ కానిస్టేబులు మొదట గ్రాంట్‌రోడ్డున వెళ్ళేబండ్లను పోనీయడానికి లెమింగ్‌టన్ రోడ్డున వచ్చేపోయే బండ్లను ఆపు చేశాడు. స్వామీరావ్ కోపంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ వైపు చూసి "ఫైర్!" (కాల్చండి) అని ఆజ్ఞాపించాడు. దుర్గాభాభీ, సుఖదేవ్‌రాజు చకితులయ్యారు. స్వామీరావువంక చూసి మౌనంగా వుండిపోయారు.

కొంత సేపటికి ఇటు బండ్లకూ వెళ్ళిపోవడానికి అనుమతి లభించింది. లెమింగ్‌టన్ పోలీసుస్టేషన్‌కు నాలుగడుగులు ముందు, ఇప్పుడు 'నాజ్' సినిమాహాలు వున్నచోట, కారును ఆపమన్నాడు స్వామీరావు. ఆ రోజుల్లో బొంబాయి పోలీసుల్లో చాలామంది తెల్లవాళ్ళు వుండేవారు! ముఖ్యం సార్‌జెంట్లు అందరూ తెల్లవాళ్ళే! పోలీసుస్టేషన్ నుండి ఇద్దరు తెల్లసార్జంట్లు బయటకు వచ్చారు. వాళ్ళవెంట భార్యలో, లేక ప్రేమికలో వున్నారు. రెండు జంటలూ చేతులు పెనవేసుకుని పేవ్‌మెంట్‌మీదగా వస్తున్నారు. ఒక జోడీకారుకు బాగా దగ్గరకు వచ్చేసింది. స్వామీరావు 'షూట్' అని ఆజ్ఞాపించాడు. వెంటనే దుర్గాభాబీ, సుఖదేవ్‌రాజు - ఇద్దరు పిస్తోళ్ళు పేల్చారు. ఒక గుండు ఇంగ్లీషు సార్జంటు తొడకు తగిలింది. మరోగుండు అతడి ప్రేయసి బుజానికి తగిలింది. 'గవర్నర్ దొరకలేదు సరే, ఎవడో ఒకడు ఇంగ్లీషువాడు దొరికాడు!' అని అనుకున్నారు దుర్గా

భాబీ, సుఖదేవ్‌రాజు! స్వామీరావు ఆజ్ఞను అనుసరించి కారు శరవేగంతో దూసుకు వెళ్ళిపోయింది.

దెబ్బతిన్నవాళ్ళకు వెనుకగా వస్తూన్న రెండవ సార్జెంట్, ప్రక్కనున్న కారు నొకదాన్ని వేసుకుని వీళ్ళవెంట పడ్డాడు. ఐతే, పైనిక డ్రైవర్ ఆప్టే చిక్కకుండా కారును నడుపుకుపోయాడు. కారు అక్కడా ఇక్కడా తిరుగుతూ అర్ధరాత్రికి గమ్యాన్ని చేరింది దుర్గాభాబీ కొడుకు నాలుగేళ్ళవాడు శచి అప్పుడు భాబీ దగ్గరే వుంటున్నాడు. కొడుకును తీసుకుని సావర్కార్ 'బాబా' దగ్గరకు వెళ్ళింది భాబీ! "....రెండు రోజుల్లో తిరిగి వస్తాను. ఈ రెండు రోజులూ వీణ్ణి మీదగ్గర వుంచండి!" అని అడిగింది. శచిని అక్కడ వదిలి, వీళ్ళు కళ్యాణ్‌కు వెళ్ళి ఝాంసీ బండి ఎక్కారు.

మర్నాడు పత్రికల్లో క్రితం సాయంత్రం జరిగిన విషయాన్ని వివరంగా వేశారు. సార్జెంట్‌ను కాల్చింది 'స్త్రీ' అని కూడా ప్రకటించారు. సావర్కార్ స్థితిని అర్థం చేసుకున్నాడు. శచిని తన దగ్గర వుంచుకోవడం మంచిది కాదనుకున్నాడు. వైశంపాయన్ దగ్గరకు పంపించాడు. దుర్గాభాబీ కాన్పూర్ వచ్చాక అనవసరంగా వాళ్ళను కాల్చినందుకు చాలా బాధ పడ్డది. అంతటితో స్వామీరావు పేచీ వదిలిపోయింది.

ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు పృథ్వీసింగ్ గాంధీగార్ని కల్సుకుని తన పేరును తెలియపరచాడు. తనను గురించి చెప్పుకున్నాడు. గాంధీగారు పోలీసులకు లొంగిపొమ్మని సలహా ఇచ్చారు పృథ్వీసింగ్‌కు! సాయుధ విప్లవ మార్గాన్ని వదిలి, గాంధీ మార్గానికి సహకరించేట్టయితే, ప్రభుత్వం క్షమించేట్టు చూడగలనని మాటకూడా ఇచ్చారు పృథ్వీసింగ్‌కు. పృథ్వీసింగ్ అలాగే చేశాడు. గాంధీ మార్గాన్ని అనుసరిస్తూ, గాంధీ ఆశ్రమంలోనే వుంటాడన్న నమ్మకంతో ప్రభుత్వం అతణ్ణి క్షమించింది కూడాను!

పృథ్వీసింగ్ చాలా సంవత్సరాలపాటు గాంధీగారి ఆదేశానుసారం నడిచాడు. ఆ తరువాత గాంధీ ఆశ్రమాన్ని వదలి, విడిగా వుండి స్వతంత్రంగా వ్యవహరించసాగాడు.

1954 మార్చిలో బొంబాయిలో పృథ్వీసింగ్‌ను కల్సుకోవడం జరిగింది. అప్పుడో చిత్రమైన విషయం చెప్పాడాయన: గాంధీగారు, తన జీవిత చరిత్ర రాసుకోమని పృథ్వీసింగ్‌ను ప్రోత్సహించారు. ఇతడు గనక ఆత్మకథ రాసుకుంటే దానికి పీఠికను తానురాసి ఎవరిచేతనైనా ఆ గ్రంథాన్ని ప్రచురింపజేస్తానన్నారు గాంధీగారు. గాంధీగారి పీఠికతో వెలువడ్డ పృథ్వీసింగ్ ఆత్మకథ ఒక లక్ష కాపీలవరకూ అమ్ముడు పోవచ్చునని ఊహ: పృథ్వీసింగ్ తన ఆత్మకథను రాశాడు. ఐతే, దానికి పీఠికను రాయడానికి గాంధీగారు తిరస్కరించారు. గాంధీగారి ఉద్దేశం, పృథ్వీసింగ్ తన గ్రంథంలో సాయుధపోరాట మార్గాన్ననుసరించినందుకు పశ్చాత్తాపాన్ని ప్రకటించుతాడని: కాని, అతడలా పశ్చాత్తాపాన్ని ప్రకటించలేదు. ఇన్ని సంవత్సరాల సహవాసానంతరం కూడా పృథ్వీసింగ్ కాంగ్రేసు కార్యక్రమాలకంటే, కమ్యూనిష్టు కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాడు. (పృథ్వీసింగ్ 1955లో ఆంధ్రా అసెంబ్లీకి పై ఎలక్షను జరుగుతున్నప్పుడు కమ్యూనిష్టు పార్టీ ప్రచారకుడుగా ఆంధ్రదేశం వచ్చారు. అప్పుడు అనేక సభల్లో, వారి హిందీ ఉపన్యాసాల్ని, ఈ గ్రంథ అనువాదకుడు తెలుగులోకి అనువదించడం జరిగింది. అప్పుడు పృథ్వీసింగ్ తాను చినగంజాం దగ్గర రైల్లోనుంచి దూకిన అనుభవాన్ని ఈ గ్రంథ అనువాదకునికి స్వయంగా చెప్పారు. ॥అను॥

నవంబరు నెల. హంస్‌రాజ్ పెట్టిన గడువు దగ్గరకొస్తూన్నది. ఆజాద్ "గడువుదాటనివ్వకు, కరాచీవెళ్ళరా!" అన్నాడు. నేను కాన్పూరు నుండి కరాచీకి ప్రయాణమయ్యాను. ఈసాటు భటిండావెళ్ళి, అక్కడ నుండి సమ్మాసట్టాషీదుగా కరాచీ చేరాను. హంసరాజ్ తన అన్న

బ్రహ్మదేవ్ దగ్గరే వున్నాడు. అతడు ఇలా అన్నాడు "తయారుచేశాను. రేపు ఇస్తాను." మర్నాడు అతడు నాకు వెడల్పయిన చిన్నసీసా నొక దాన్ని ఇచ్చాడు. దాన్లో మామిడిచిగురు రంగులో తరళపదార్థం ఉంది. సీసా బిరడాకు మైనంతోసీలువేసివుంది. పైన గుడ్డచుట్టాడు. దాంతోపాటు మరోచిన్న సీసానుకూడా ఇచ్చాడు. 'చిన్నసీసా పెద్దసీసాకు దగ్గరగా వున్నవరకూ, పెద్దసీసాలోని విద్యుత్ శక్తి అణగివుంటుంది. చిన్నసీసాను రెండుగజాలదూరం తీసుకువెడితే పెద్దసీసాలోని విద్యుత్ శక్తి ఐదువందల గజాలవరకూ ప్రవహిస్తుంది' అనిచెప్పాడు హంసరాజ్. నేను అక్కడే పరీక్షించి చూద్దామన్నాను. కానీ, హంసరాజ్ వద్దన్నాడు. "ఢిల్లీలో మనం పరీక్షించి చూసేవాళ్ళంకదా! అలాగే, ఎప్పుడు కావాలన్నా చూసుకో వచ్చును! ఇక్కడ, మా అన్నా పదినెలఎదుట ఇలాంటివి చేయడం బాగుండదు!" అన్నాడు. నేను అతని మాటలను విశ్వసించడం తప్ప ఇంక చేయగలిగిందేముంది?

హంసరాజ్ ఇచ్చిన సీసాల్ని తీసుకుని చాలా ఉత్సాహంగా తిరిగి వచ్చాను. ఈమాటు, కరాచీనుండి సముద్రమార్గాన, బొంబాయివచ్చి, అక్కడినుండి కాన్పూరు రావాలనుకున్నాను. ఎలాంటి ప్రమాదాల్లోనూ చిక్కుకోకుండా ఉండగలందులకు ఇంత దీర్ఘప్రయాణాన్నిచేశాను. ఐతే, ఇది నా అజ్ఞానమేనని తేలిపోయింది. సముద్రములో రెండురోజులు ప్రయాణించవలసి వచ్చింది. మూడవ తరగతి, డెక్కుమీద ప్రయాణం చేశాను. తోటి ప్రయాణీకుల మాటలవల్ల బొంబాయిలో కస్టమ్సు అధికారులు జేబులుకూడా తనిఖీ చేస్తారనితెలిసింది. ఓడ, మధ్యలో ఒకటి రెండుచోట్ల ఆగుతుంది. ప్రయాణీకులు నిషిద్ధ వస్తువుల్ని రహస్యంగా పట్టుకు పెళుతుంటారు. ఇదంతా వినేసరికి ప్రాణాలు కడపట్టాయి. కస్టమ్సు అధికారులకు ఈసీసాల్ని గురించి ఏంచెప్పను? సీసాలకు మూతలుతీస్తే, అవి పనిచేయవని హంసరాజ్ చెప్పాడుకదా? అదికాక,

జేబులో పిస్తోలు వుంది. దాన్నేం చేసేట్టు? ఇప్పుడిక ఓడదిగి వెళ్ళడానికి వీల్లేదుకదా? ఘోరంగా పొరపడ్డాను. ఐతే, ఇంక ఇప్పుడీ పొరపాటు నుండి తప్పుకోవడానికి అవకాశం లేదు. తప్పించుకోవడానికి వీల్లేదు. కస్టమ్సు అధికారులు సోదాచేసే క్షణంకోసం ఎదురుచూస్తూ కూచున్నాను. అనవసరంగా, స్మగ్లర్ అనిపించుకుని చనిపోవాల్సి వచ్చినందుకు బాధపడ్డాను. ఎలుకలబోనులో చిక్కుపడ్డ ఎలికవతు అయింది నాపని! నా అజ్ఞానానికి పశ్చాత్తాపపడ్డాను.

బొంబాయి హార్బర్‌లో తప్పించుకోవడానికి మార్గంలేదు. వున్నా, నాకుతెలియదు. సాహసించి, కస్టమ్సు అధికారులదగ్గర అమాయకుడిగా అభినయించి తప్పించుకోవడం ఒక్కటేమార్గం! అదే చేశాను. ఇతర ప్రయాణీకుల్ని తోసుకుంటూ అధికారుల దగ్గరకువెళ్ళి, సూట్‌కేసు ముందుపెట్టి "బాబూ దీన్నిముందు చూసేయండి! ఈబండికే వెళ్ళిపోవాలి!" అన్నాను. నేనే సూట్‌కేసు తెరిచాను. కస్టమ్సు అధికారి సూట్ కేసులోని మాసినగుడ్డల్ని అటూ-ఇటూ వత్తిగిలించి చూశాడు. అడుగున సీసాలున్నాయి. జేబులోని పిస్తోల్ను పట్టుకునుంచున్నాను. అతడు సీసాల్ని తీయడం, నేనుకాల్చడం - రెండూ ఒకేసారి జరుగుతాయి. క్షణాలు లెక్కపెడుతూన్నాను. కానీ, నా అదుర్దానీ, నాకు నేనై సూట్‌కేస్ తెరచిన పద్ధతినీచూసి అధికారి తృప్తిపడ్డాడు. అతడు సూట్‌కేసుమూసేసి, చాక్‌పీసుతో దానిమీద గుర్తువేశాడు. ప్రాణాలు కుదుటపడ్డాయి.

కాన్పూర్‌వెళ్ళాను ఆజాద్, నేనూ-చాలాఉత్సాహంగా బ్యాటరీని పట్టుకువచ్చి పరీక్షించాము. ఫలితం శూన్యం! మరోబల్బునూ, బ్యాటరీనీ తెచ్చి పరీక్షించాము. ఫలితంలేదు. ఆ సీసాల్ని రెండింటినీ ఆజాద్ గోడకువేసి విసిరికొట్టాడు. ఆ తరువాత వైర్‌లెస్‌కోసం హంసరాజ్‌నూ బాధించలేదు. మేమూ బాధపడలేదు.

అప్పటికి మరికొన్ని అరెస్టులు జరిగాయి. వాటికారణంగా కైలాస పతి ప్రభుత్వసాక్షి అయ్యాడన్న విషయాన్ని మేము నమ్మాము. ఢిల్లీ వెళ్ళాక మరో విషయమూ తెల్సింది. పోలీసులు అతడికి ప్రత్యేకమైన సౌకర్యాల్ని కల్పించారని విన్నాము. ఢిల్లీలోని రామజస్ స్కూలు డ్రిల్లు మాస్టరు రాజబలీసింగ్ భార్య కమల జైల్లోకివెళ్ళి కైలాసపతిని కల్సు కుంటూన్నదనీ తెల్సింది. అరెస్టయ్యేప్పుడు అతడు కమలతోపే వుంటు న్నాడు. కమల ఇంటిముందే అరెస్టయ్యాడు. మామీద సానుభూతిగల, జాతీయ భావంగల జైలు అధికారులద్వారా కమల, జైల్లోవున్న కైలాస పతికి రాసేవుత్తరాల నకళ్ళనూ తెప్పించాము. కమలమీది మోహం కారణంగానే కైలాసపతి ఇలాపిరికితనాన్ని ప్రదర్శించాడని అనుకున్నాము కమల ఏడ్చి మొత్తుకుని అతడిని ప్రభుత్వసాక్షి అయ్యేట్టుచేసింది। దీన్ని బట్టి విప్లవకారులు ఏస్త్రీని ప్రేమించడంగానీ, ఏ స్త్రీతోటీ సంబంధాన్ని పెట్టుకోవడంగానీ కూడదని స్పష్టం అవుతోంది।

కైలాసపతి సాక్ష్యాన్నిబట్టి, అతడు అరెస్టయిన నాలుగవ రోజున క్షమాభిక్ష లభిస్తుందన్న హామీమీద, ప్రభుత్వసాక్షి అయ్యాడని తేలి పోయింది. కమలమీది అతడిప్రేమ అతడి ఈ దుస్థితికి కారణం। కానీ, మరోరకంగాకూడా మనం ఆలోచించవచ్చును. కమల మరోరకమైన స్త్రీ ఐతే ఎలావుండేది? అతడి శౌర్యాన్ని, త్యాగాన్ని అభిమానించే స్త్రీ ఐతే? స్త్రీలూ, పురుషులూ -ఇద్దర్లోనూ, పిరికివాళ్ళువుంటారు. సాహసులూ వుంటారు। కైలాసపతి తన ప్రవృత్తి, ప్రకృతి-కారణంగా విప్లవ చైత న్యంలేని, ప్రతిఘాతుక ప్రవృత్తిగల స్త్రీని ప్రేమించాడు।

# 14. వీరభద్రతివారీ కల్పించిన తిరుగుడు

కైలాసపతిలాంటి ముఖ్యుడు ప్రభుత్వసాక్షి కావడంతో మేమందరమూ చాలా ఖేదపడ్డాము. "పార్టీ, ఇలా ప్రభుత్వసాక్షిగా మారినవాళ్ళకు ఎలాంటిదండనా విధించలేదు. గనుకనే వీళ్ళలా బుడిగి బుడిగిన ప్రభుత్వ సాక్షులయిపోతూన్నారు" అన్నాడు ఆజాద్. దీంతో అప్రూవర్ల పట్ల ఆజాద్ కోపం తారస్థాయినందుకుంది.

ఇంకో కొత్తసమస్య ఒకటి తారసిల్లింది. కైలాసపతికి పరిచయులైన అనేకుల్ని అరెస్టు చేయడంజరిగింది. మరి వీరభద్రతివారీపై ప్రభుత్వం ఎలాంటిచర్యా ఎందుకని తీసుకోలేదు? అతడు ఇప్పటికీ శ్రద్ధానంద పార్కు వద్దగల తన ఇంట్లోనే వుంటూ వున్నాడు. బజార్లలో ఎక్కడ బడితే అక్కడ తిరుగుతూ కనపిస్తూన్నాడు. సి.ఐ.డి. ఇనస్పెక్టర్ పండిత శంభూనాధ్, వీరభద్ర ఇంటిప్రక్క ఇంట్లోనే వుంటూన్నాడు. రెండు కుటుంబాలకూ చాలా ఆత్మీయమైన సంబంధంవుంది। వీరభద్ర తివారీ విశ్వాసఘాతకుడు అన్న సంశయం ఆజాద్‌కు కలిగింది.

దుసీగంజిలో వుండగా ఆజాద్ ఈ విషయాన్ని గురించి చాలా సార్లు నాతో అన్నాడు. "సి.ఐ.డి. ఇనస్పెక్టర్‌తో సంబంధాలుండడం సందేహానికి కారణమే। ఐతే, కైలాసపతి అరెస్టు తరువాతకూడా వీరభద్ర పరారు కావాలనుకోకపోవడం ముఖ్యంగా అనుమానించదగిన విషయం।" అనే వాణ్ణి నేను.

వీరభద్రతివారి తనకేప్రమాదమూ లేనివిధంగా వ్యవహరిస్తున్నాడన్న అనుమానం నాకు మొదట్నుండి వుంది. అతడు తెలివితేటలు కల వ్యక్తి. శరీరమూ ఒడ్డూ పొడుగూ కలిగి వుంటుంది. ఐనా, పిరికివాడవినా ఉద్దేశము. 1930 సం॥ సెంట్రల్‌కమిటీలో వీరభద్రతివారీ, కైలాస

పతి ఒక ప్రస్తావనను చేశారు దాని ప్రకారం ప్రాంతీయ కార్యకర్తలు సాయుధ కార్యక్రమాల్లో పాల్గొనవసరం వుండదు. ఆ ప్రస్తావనను అప్పుడేతోసి పారేశాము. ఆ ప్రస్తావనను గురించి ఆజాద్‌కు జ్ఞాపకం చేశాను. పిరికివాడు ప్రాణరక్షణకోసం ఎలాంటి 'తిరుగుడైనా' తెచ్చిపెడ తాడని నా విశ్వాసం! అప్పుడు కేంద్రకమిటీ అంటూ లేదుగనుక, ఎవరు దగ్గరవుంటే వాంతో సలహాపడుతూండేవాడు, ఆజాద్! డిసెంబరు, జన వరి నెలల్లో సురేంద్రపాండే, భవానీసింగ్-వీరూ అలహాబాద్ వచ్చేశారు. తరచు మాలో మేము సిద్ధాంత చర్చలు జరుపుతూండేవారం!

ఆజాద్ వీరభద్రతివారీని కాల్చేయాలని నిశ్చయించాడు. ఇలా అన్నాడు. "వీరభద్రతివారీ, ధూర్తుడూ - చురుకైనవాడు! కాల్చేసంద ర్భంలో నువ్వూ నావెంట వుండాలి!" నేను సిద్ధపడ్డాను. అతడు నాకు చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో సాయంచేశాడు! అతడికి నేను ఋణ పడి వున్నాను. ఐతే, అతడు పార్టీని మోసగిస్తూన్నాడనడానికి కావల్సి నన్ని నిదర్శనాలున్నాయి. ఆజాద్ అతడికి తన తప్పులనుచెప్పి సరిదిద్దు కోమన్నాడు కూడాను. సరిదిద్దుకోవడానికి అవుసరం అయిన అవకాశాన్ని కూడా ఇచ్చాడు. అయినా వీరభద్ర తన ప్రవర్తనను సరిదిద్దుకోలేదు. ఆజాద్, అతణ్ణి రాత్రిపూట 'మెమోరియల్ వెల్' వెనుక నన్ను నిర్మాను ష్యంగావుండే ప్రదేశానికి పిలిపించే ఏర్పాటు చేశాడు. అక్కడే అతడివి కాల్చేయడం జరుగుతుంది వీరభద్ర రాత్రిపూట ఆ నిర్మానుష్య ప్రదేశా నికి ఎందుకు వస్తాడు? ఎలా వస్తాడు? అని నేను అడగనూలేదు ఆజాద్ చెప్పనూలేదు. రాత్రిపూట్ల రెండు మాట్లు ఆజాద్ నన్ను వెంటపెట్టుకు ఆ ప్రదేశానికి వెళ్ళాడు. గంట గంటన్నరసేపు నిరీక్షించాము. అయినా, పని జరగలేదు. వీరభద్ర అక్కడికి రాలేదు. మూడవమాటు రాత్రి 11 గంటలాచాయల ఆజాద్ నన్ను నిద్రలేపాడు "సోహన్! త్వరగా పద! ఈమాటు పని జరిగిపోవాలి! అతడు వస్తూన్నాడు!" అన్నాడు.

నేను వెంటనే లేచాను. దిండుకిందవున్న పిస్తోల్‌ను జేబులో పెట్టుకున్నాను. సైకిల్‌మీద ఆజాద్‌వెంట వెళ్ళిపోయాను. ఈమాటూ, చలిలో, చీకటిలో దాదాపు నలభై ఐదు నిమిషాలసేపు, ఆ నిర్మానుష్య ప్రదేశంలో చక్కర్లు కొట్టాము. వీరభద్రతివారీ రాలేదు. మేము వెనక్కి తిరిగి రాబోతూన్నాము. ఇంతలో అక్కడికో స్త్రీ వచ్చింది. తెల్లని చీరె, తెల్లనిబ్లౌజు, నల్లని గరం కోటువేసుకుని, సన్నగాపొడుగ్గావుంది. 19-20 ఏళ్ళుంటాయామెకు! ఆజాద్ ఆమె దగ్గరకు వెళ్ళాడు. నాకు ఆమె ఎవరో తెలియదు. ఆజాద్ నన్ను రమ్మనీ అనలేదు. కనుక దూరంగానే వుండిపోయాను. వాళ్ళు మాట్లాడుకునే మాటలు స్పష్టంగా వినపడడంలేదు. కానీ, స్వరం మాత్రం వినబడుతోంది! ఆమె, వీరభద్రతివారీ అక్కడికి రాకపోవడానికి గల కారణాన్ని వివరిస్తూన్నదనుకున్నాను.

ఆజాద్ నా దగ్గరకువచ్చి నిరాశగా "నాయాల ప్రతిసారీ ఏదో ఒక 'తిరుగుడు' చేస్తూనే వుంటాడు!" అన్నాడు.

ఇక నేను అడక్క తప్పిందికాదు. "మీ ప్లాను ఏమిటి? అతడు వస్తాడని ఎలా విశ్వసించావు? ఎందుకిలా అడుగుతూన్నానంటే, ఈపిల్ల అబద్ధం చెబుతోందని అనుమానంగా వుంది!" అన్నాను.

"ఎలా అనుమానిస్తూన్నావు?"

"ఆ గాభరా పడడమూ, ఆ పద్ధతీ చూస్తూంటే ఏదోవంక చెప్పడానికి ప్రయత్నిస్తూన్నదనీ, పంకకుదరడంలేదనీ-అనిపిస్తూన్నది నాకు!"

అప్పుడిలా చెప్పాడు ఆజాద్. "ఈ అమ్మాయి ఈ రాత్రి సరసైయ్యా ఘట్టంలో తాను పూజచేసుకోవడానికి వెళ్తూన్నట్టుచెప్పి, వీరభద్రను తోడుకోసం వెంటతీసుకు వస్తానన్నది. ఇప్పుడేమో తనకేదోవనిపడ్డదని వీరభద్ర కబురు పంపించాడంటున్నది!" అన్నాడు.

నేను ఆజాద్‌తో ఇలా అన్నాను. "ఈమె ప్రవర్తన అనుమానంగావుంది. వీరభద్రకూ, ఈమెకూ అంతటి ఆత్మీయత వుందా? ఈ

రాత్రిపూట అతడిని ఇక్కడికి తీసుకురాగలుగుతుందా? అతడికి ఇంతటి విశ్వాసపాత్రురాలెలా అయింది ఈమె? అతడిని కేవలం మోసగించడానికే ఇంతపరిచయాన్ని ఏర్పరచుకుందా? ఈమె వెంట అతడు అర్ధరాత్రిపూట ఇక్కడకు రావడానికి అవసరం అయిన ఆత్మీయత, నిజంగా అతడికీ ఈమెకూ వుంటే, అతడిని రక్షించడానికి నిన్నే మోసగిస్తున్నదని ఎందుకు అనుకోరాదు? ఇలా వెంట తీసుకువచ్చి కాల్పించినందువల్ల ఈమె ప్రమాదంలో చిక్కుకుంటుంది గదా? పోనీ, దీన్ని తన కర్తవ్యంగా భావిస్తూ న్నదా అంటే, అంతటి చైతన్యమూ ఈమెలో కనబడడంలేదు।" చాలా రోజుల తరువాత ఆమెను గురించి వివరాలు కొన్ని తెలిశాయి. ఆమె బెంగాలీ జాతికి చెందింది. సాధారణంగా ద్వంద్వ ప్రవృత్తిగల వ్యక్తిలా కనుపిస్తుంది. 'భోక్తి' అనే మారుపేరు పెట్టుకుంది. చిట్టిపొట్టి సాహసిక కార్యాలు చేయడం ఆమెకు ఇష్టం। సాయుధ కార్యక్రమాలపట్ల శ్రద్ధ ఎక్కువ। తరువాత ఆమె బెంగాల్ వెళ్ళిపోయింది అక్కడే జైల్లో చని పోయింది।

ఆ రోజుల్లోనే ఒకమాటు నేను మధ్యాహ్న సమయాన మేస్టన్ రోడ్డున నడచి వెళుతూన్నాను. జనసమ్మర్దం ఎక్కువగా వుంది. వీరభద్ర తివారీ అనుకోకుండా ఎదురయ్యాడు. అతడు నన్ను చూశాడు. కానీ, చూడనట్టు వెళ్ళిపోయాడు. నేనూ చూడనట్టే వుండిపోయాను. నా నడుముకు పిస్తోలు వుంది. అతడి దగ్గర వుందో, లేదో తెలియదు. బహుశ వుండకపోవచ్చును. పిస్తోలును దగ్గర వుంచుకోవడమే ప్రమాదానికి కారణం కదా? స్పష్టమైన ప్రయోజనం ఏమీలేకుండా ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడం అతడి స్వభావం కాదు. అప్పుడా జనంలో, ఆ ప్రదేశంలో అతడిని కాల్చాలన్న ఆలోచనే నాకు కలగలేదు. తరువాత ఆలోచిస్తే, అక్కడ అతడిని ఏంచేసినా, అది అతడికే అనుకూలం అవుతూందనిపించింది। అతడిని కాల్చడానికి ఆజాద్ వేసిన కృత్రిమమైన ప్లానూ, మాటి

మాటికీ అతడు తప్పించుకోవడమూ-ఇదంతా చూస్తే అతడికి అనుమానం కలిగిందనిపించిందినాకు। ఎవడైనా ప్రభుత్వసాక్షి అయ్యాడంటే, అతడికి పార్టీలోని కొందరు వ్యక్తులతోకాక, మొత్తం పార్టీతోనే శత్రుత్వం ఏర్పడుతుంది. 'ఆజాద్‌ను పట్టించి, నన్ను పట్టించడు' అనుకోవడానికి కారణం కనుపించదు. కృతఘ్నుడుగా ప్రవర్తించానన్న కోపం అతడికి నామీద అదనంగా వుండడమూ సంభవం। ఆ తరువాత ఇంక అతడిని కాల్చాలన్న ప్రయత్నాలేమీ మేము చేయలేదు. నేనూ, ఆజాద్ - కాన్పూరు నుండి అలహాబాద్ వెళ్ళిపోయాము।

ఆజాద్ ఆజ్ఞానుసారం వీరభద్రతివారీని కాల్చడంలో అప్పట్లో నాకు ఎలాంటి నైతికమైన అభ్యంతరం కూడా కనుపించలేదు ఇన్నాళ్ళు గడిచాక ఇప్పుడా విషయాల్ని గురించి ఆలోచిస్తూవుంటే మరోరకమైన అభిప్రాయానికి వస్తున్నాను. నేను జైల్లో ఉన్నప్పుడూ వీరభద్రతివారీని కాల్చడానికి చేసిన ప్రయత్నాలగురించి ఆలోచిస్తూవుండేవాడిని. 1947లో భారతదేశ పరిపాలనాధికారాన్ని కాంగ్రేసు పార్టీ స్వీకరించిన తరువాత జరిగిన ఒక విషయాన్ని ఉదహరిస్తాను ఒకనాటి సాయంతం భువాలీలో డాక్టర్ ప్రేమ్‌లాల్‌సాహుకు మిత్రుడైన ఒక ఆంగ్లేయుడి ఇంట్లో టీ తాగుతూన్నాము. పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాము. డాక్టర్ సాహు, ప్రసిద్ధ హిందీ రచయితగా నన్ను వాళ్ళకు పరిచయం చేశాడు ఇంగ్లీషు దంపతలకూ, వాళ్ళ అతిధి ఐన మరో ఇంగ్లీషు వనితకూ నా మాటలు వినోదాన్ని కలిగిస్తూన్నాయి. గాంధీ వాదాన్ని గురించి మాట్లాడుకుంటున్నాం. వాళ్ళ అతిధురాలైన ఆంగ్ల వనిత 'గాంధీవాదం ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప కానుక' అన్నది. ఆమె మాటల్ని నేను పరిహాసంగా కొట్టిపారేస్తూన్నాను. ఆమె ఆశ్చర్యపడుతూన్నది. డాక్టర్ సాహు ఇలా అన్నాడు. "గాంధీవాదాన్ని అర్థంచేసుకోవాలంటే వీరితోనే మాట్లాడండి। వీరు 'గాంధీవాదం - శవపరీక్ష' అన్న పుస్తకం రాశారు।"

ఇంగ్లీషు వనిత కళ్ళుపెద్దవిచేసి నావంక చూస్తోంది। గాంధీని విమర్శించే వ్యక్తులు భారతదేశంలో వుంటారని ఆమె ఎన్నడూ అనుకునివుండదు. డాక్టర్ సాహు, ఆమెను మరికొంచం కంగారు పెట్టాలనుకున్నాడు. ఇలా అన్నాడు "వీరు 1929లో వైస్రాయి స్పెషల్ ట్రైను కింద బాంబు పేల్చారు।"

ఇంగ్లీషువాళ్ళు ముగ్గురూ నన్ను రెండుమాట్లు ఆపాదమస్తకం చూశారు; తమ ఎదురుగాకూచున్నది భూతంకాదు మనిషేనని నిర్ధారించుకోడానికా అన్నట్టు। మాసంభాషణ గంభీరమైన విషయంమీదకు మళ్ళింది అతిధి మహిళ ఆర్ద్రస్వరంలో "సరే, గడిచిపోయిందేదో గడిచిపోయింది. ఆ శతృత్వమూ తెగటారింది। నేను ఒకటి అడుగుతాను చెప్పండి। ఆ తరువాత మీరెప్పుడైనా అలాంటిపని చేసినందుకు బాధపడ్డారా?" అని అడిగింది.

పై ప్రశ్నవేసిన ఇంగ్లీషువనిత భర్త రెండవ ప్రపంచయుద్ధంలో సైన్యంలో మేజరుగా పనిచేశాడు. నేను ఎదురుప్రశ్న వేశాను. "మీ భర్తగారు శతృపక్షంలోని చాలామంది సైనికుల్ని చంపివుంటారు. ఒక వేళ స్వయంగా చంపకపోయినా వారి ఆజ్ఞలవల్ల, వారి ఆధీనంలోని సైనికులైనా ఆపని చేసివుంటారు. కనీసం అలాంటి పని చేయడానికి మీ భర్తగారు తప్పకుండా ప్రయత్నించివుంటారు! మరిఅలా శతృపక్షంలోని సైనికుల్ని చంపినందుకు మీ భర్తగారి మనస్సు ఎప్పుడైనా బాధపడ్డదేమో అడిగారా?"

ఆమెకు తన భర్తను అలాంటి ప్రశ్న వేయవలసిన అవుసరమే కనుపించలేదు. కారణం, అతడు ప్రాణాలకుతెగించి తన కర్తవ్యాన్ని నిర్వహించాడు।

నేనిలా అన్నాను "మీ భర్త జీతంతీసుకుని కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడు. నేను జీతాన్ని ఆశించకుండా, అతి ప్రమాదానికి ఓర్చి

నా కర్తవ్యాన్ని నిర్వహించాను. కాకపోతే, వైస్రాయిమీద నాకు శత్రుత్వం వుండవల్సిన పనేముంది? ఇవ్వాళ ఆ వైస్రాయి చలికి వణుకుతూ కనుపిస్తే నాకోటును ఇచ్చేసినా ఇచ్చేస్తాను!" వైస్రాయిని గురించిగానీ, ఇతర సందర్భాల్లో నాచే కాల్చబడి నేలకు ఒరిగిన ఆంగ్లప్రభుత్వ ప్రతినిధుల గురించిగానీ నేనెప్పుడూ పశ్చాత్తాపాన్ని పొందలేదు, పరితాపాన్నీ పొందలేదు. కానీ, వీరభద్రతివారీని కాల్చేయడానికిచేసిన ప్రయత్నాల్ని తలుచుకుంటే మాత్రం అనివార్యంగా పశ్చాత్తాపం కలుగుతూన్నది. అతడిని కాల్చడానికి ప్రయత్నించడం చాలా అన్యాయం అనిపిస్తూన్నది. నన్నడిగితే, అతడుచేసినమోసం, కార్యక్రమాల్ని జరగకుండా చేయడమే! ప్రమాదానికి దూరంగావుండాలనే తలంపుతో అతడు కార్యక్రమాన్ని జరగనిచ్చేవాడుకాదు. అదే అతడుచేసిన మోసం! పార్టీ మిత్రుల్ని ఎవర్నీ అతడు అరెస్టు చేయించలేదు. అతడు స్పష్టంగా తన ఇబ్బందిని చెప్పేస్తే సరిపోయేది. "నేను సాయుధ కార్యక్రమాల్లో పాల్గొనలేను. కేవలం సహాయ సహానుభూతులద్వారా మాత్రమే పార్టీకి సహకరించగలను!" అని స్పష్టంగా చెబితే, ఇంతదెడద వచ్చేదికాదు. చివరిరోజుల్లో సురేంద్ర పాండే అలా స్పష్టంగా చెప్పేశాడు. అతడిని మేమెవ్వరమూ అనుమానించనూలేదు. బలవంతానా సాయుధ కార్యక్రమాల్లోకి లాగాలనీచూడనూ లేదు.

ఆజాద్ చున్నీగంజిలో మేము తీసుకున్న ఇంటికి వస్తూండేవాడు. ఒక్కొక్కమాటు రాత్రిపూటకూడా అక్కడవుండేవాడు. ఎప్పుడైనా 'పప్పు' తినాలనిపిస్తే ప్రకాశవతిని 'పప్పు' వండమనేవాడు. 'పప్పు' ఉడికిందాకా ఎదురుచూస్తూకూచునేవాడు. అలాంటప్పుడు మౌనంగా కూచోవడం అతడివల్లకాదు. పక్కనఎవరైనా వినేవాళ్ళువుంటే, మాట్లాడుతూనే వుంటాడు. ఆజాద్ లావుగా, బలంగా వుండేవాడు. కండలుతిరిగిన శరీరంకలవాడు. అతడికి వ్యాయామం చేయడమూ ఇష్టమే! ఐతే, నియమరహితమైన

రహస్యజీవితంలో నియమంగా వ్యాయామంచేయడానికి ఎలావీలుంటుంది? ఒక వారంరోజులు ఎక్కడైనా నిలకడగా వుండడం జరిగితే మాత్రం తెల్లవారుజామునేలేచి గుంజీలు, బస్కీలు తప్పకుండా తీస్తానంటాడు! ఆజాద్‌కు తను లావుగావున్నాడని ఎవరైనాఅంటే చెడ్డకోపంవచ్చేస్తుంది. అతణ్ణి చాటుగా అందరం 'మోటా' (లావాటివాడు) అంటూందేవాళ్ళం! ప్రకాశవతి అతడిని ఎప్పుడూ 'మోటేభైయ్యా!' అని పిల్చేది.

చున్నీగంజిలోవుండగా ఆజాద్, ప్రకాశవతికి పిస్తోలు పేల్చడం నేర్పుతూందేవాడు. దిండుకు గురిపెట్టి బొమ్మ పిస్తోలుతో కాల్పిస్తూందేవాడు. అతడు ప్రకాశవతిని ఇంగ్లీషు చదవమనీ బలవంతం చేసేవాడు. రహస్య జీవితాన్ని గడుపుతూ చదివిన ఇంగ్లీషు తరువాత జీవితంలో ఆమెకు ఎంతో ఉపయోగపడ్డది. 1934లో ప్రకాశవతి అరెస్టయి విడుదలయింది. తరువాత బెనారస్‌లోని ఒక కాలేజీలో మెట్రిక్ చదవడానికి చేరింది. అప్పటి ఇంగ్లీషు అభ్యాసంవల్లనే ఆమె మెట్రిక్ చదువగల్గింది. చున్నీగంజిలోవుండగా ఒకమాటు ఆజాద్ ఎదుటే ప్రకాశవతి ఇలాఅంది "మోటే భైయ్యా కాసేపు అది చెయ్యమంటాడు. కాసేపు ఇదిచెయ్యమంటాడు!" అనేసింది.

ఆజాద్‌కు భల్లుమాలిన కోపంవచ్చింది "నన్ను 'మోటా' అంటావుటే పిరమ్మా! అందరూ నీలా పీరుకుమల్లే వుండాలనుకుంటున్నావా?" అని అంటూ ప్రకాశవతి వీపుమీద రెండు గుద్దులువేశాడు. అప్పట్లో ప్రకాశవతి చాలా సన్నగావుండేది. మణుగు బరువుకూడా వుండేదికాదు. ప్రకాశవతిని కసరత్తుచేయమని ఆజ్ఞాపించాడు ఆజాద్! తరువాత ఎప్పుడు అక్కడికివచ్చినా "ఏయ్‌పీరూ! కసరత్తు చేస్తున్నావా?" అని అడిగేవాడు.

చౌధరీ రామధనసింహాను ఆజాద్‌కు పరిచయం చేశాము. రామధన్ వెనక పార్టీ ఆదేశాన్ననుసరించి మర్దాన్‌లో కొన్నాళ్ళున్నాడు. పలుకుబడిగల కొందరు ఖానులతోనూ పరిచయాన్ని ఏర్పరచుకున్నాడు. కొంత

వరకూ పస్తోభాషనూ మాట్లాడగలడు. ఇవన్నీ తెలుసుకున్న తరువాత ఆజాద్ చాలా ఉత్సాహపడ్డాడు. రామధన్‌సింహ్ చేత స్కూలుకు కొన్నాళ్ళు సెలవుపెట్టించి మర్దాన్ పంపించాము. అక్కడనుండి దొంగ చాటుగా ఆయుధాల్ని కొనుక్కోవడానికి, ఇక్కడనుండి ఆఫ్ఘనిస్తాన్ మీదుగా రష్యా పోవడానికి - అవకాశం వుంటుందేమో తెల్సుకు రమ్మ న్నాము. సెప్టెంబరులో సెంట్రల్‌కమిటీ రద్దు అయినప్పటినుండి నేను ఒకటి ఆలోచిస్తూన్నాను. "రష్యాగానీ, ఇతర విదేశాలకుగానీ వెళ్ళి ఇంకా అనుభవాన్నిపొంది, సాధ్యమైతే, విదేశాలసాయంతో విస్తృత రూపంలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని దెబ్బతీయడం బాగుంటుంది" అని అను కుంటున్నాను. అలాచేస్తే బాగుంటుందని ఆజాద్‌కూడా అనుకుంటున్నాడు.

చౌధరి మర్దాన్‌లో ఒక వారంరోజులువుండి తిరిగివచ్చాడు. సరి హద్దు ప్రాంతాలనుంచి ఆయుధాలు కొనుక్కునే ఆలోచన ఏమంత ప్రయోజనకరమైంది కాదని చెప్పాడు. అలా ఆయుధాల్ని కొనడంలో రెండు ఇబ్బందులు ఉన్నాయన్నాడు. ఒకటి భారతదేశంలో ఆయుధ నిషేధ చట్టం అమల్లోవుంది గనుక భారతీయులకు ఆయుధాల్ని అమ్మ డానికి అంతులేని ధర వసూలుచేస్తారు. రెండో ఇబ్బంది, సరిహద్దు ప్రాంతాల్లో చిన్నచిన్న ఆయుధ కర్మాగారాలు ప్రతిచోటా వుంటాయి. వాటిల్లో తయారైన నాటు సరుక్కి 'మేడిన్‌జర్మనీ' 'మేడిన్‌ఇంగ్లాండ్' అన్న ముద్రలువేసి విపరీతమైన ధరకు అమ్ముతారు. ఇంగ్లాండు, జర్మనీ ఆయుధాల్లా ఇవి పనిచేయవు. సమయానికి పుట్టిముంచుతాయి. పోతే, కాబుల్‌గుండా విదేశాలకు వెళ్ళడానికి అవకాశంవుంది అని చెప్పాడు రామధన్! రెండు మూడు నెలల్లో నన్ను రష్యాపంపించడం నిశ్చయం అయిపోయింది.

1930 ఆగష్టులో ధన్వంతరీ, రామకృష్ణ అనే మరోమిత్రుణ్ణి సరి హద్దు ప్రాంతాలకు పంపించాడు. రామకృష్ణకూడా నేషనల్ కాలేజీలో

మాతోపాటు చదువుకున్నాడు చాలా తెలివిగలవిద్యార్థి అనిపించుకున్నాడు కాలేజీ చదువు పూర్తయ్యాక అతడు లాహోర్‌లోని మోహన్‌లాల్ రోడ్డులో నేతి దుకాణంపెట్టాడు. అతడు నిండైన వ్యక్తిత్వం కలవాడు. అనవసరంగా మాట్లాడేవాడుకాదు. పార్టీ పిలుపునందుకుని దుకాణాన్ని మూసేసి సరిహద్దు ప్రాంతాలకు వెళ్ళాడు. కొద్దిరోజుల్లోనే పష్తో నేర్చుకున్నాడు. కానీ, అక్కడ జబ్బుపడిపోయాడు. వైద్యసౌకర్యం లేకపోవడం వల్ల చనిపోయాడు. రామకృష్ణచేసిన ప్రయత్నం ప్రత్యేకమైన ఫలితాన్నేమీ ఇవ్వలేదు. కానీ, మా విప్లవ సంఘంయొక్క దృష్టికోణాన్ని తెలియపరుస్తుందా ప్రయత్నం! మా ఉద్దేశ్యం విస్తృతమైన సాయుధ పోరాటమేగానీ, వ్యక్తిగత దౌర్జన్యవాదం మాత్రంకాదు!

1930 డిసెంబర్ నెల. లాహోర్‌లోని యూనివర్సిటీ ఆవరణలో, కాన్వకేషన్ జరుగుతూండగా పంజాబ్ గవర్నర్‌పై కాల్పులు జరిపారన్న వార్తవిని మేము చాలా ఉత్సాహితులమయ్యాము. ఈ సంఘటన కూడా హింస ప్రసక్తు సంబంధించిదేనని చెప్పవచ్చును. అంతర్గతమైన అభిప్రాయ భేదాలవల్లా కొట్లాటవల్లా అసంతృప్తిని పొందిన ఇంద్రపాల్ 'ఆతిశీచక్కర్' (అగ్నివలయం) అన్న ఉపసంఘాన్ని స్థాపించాడు. లాహోరులోని మరికొందరు మిత్రులు ధన్వంతరీ, సుఖదేవ్‌రాజుల్ని అనుసరిస్తూన్నారు వీళ్ళల్లో దేవరాజు, దుర్గాదాసుఖన్నా, రణవీర్, కేవల్ కృష్ణ ముఖ్యులు! ధన్వంతరీ ఢిల్లీలో అరెస్టు అయ్యాడు, సుఖదేవరాజు యు.పి. వెళ్ళిపోయాడు. ఇంక పంజాబులో సాయుధపోరాట భావానికి ప్రాణంపోస్తోన్నది పైచెప్పిన మిత్రులే! లాహోరు కుట్రకేసులో నిందితులకు శిక్షలు చెప్పారు ఆ శిక్షలకు ప్రతీకారచర్యగా పంజాబు గవర్నర్ని కాల్చాలని నిర్ణయించుకున్నారు దుర్గాదాసుఖన్నా, రణవీర్‌లు!

గవర్నర్ని కాల్చడానికి తమలోనుంచి ఎవర్నీఎన్నుకోలేదు వీళ్ళు! మర్దాన్‌నుంచి హరికృష్ణ అనే సాహసికుడైన యువకుణ్ణి ఒకణ్ణి పిలిపిం

చారు ఇందుకోసం! విప్లవ భావాలుగల వ్యక్తి కాకపోయినా, దేశంపట్ల భక్తిశ్రద్ధలున్నాయి ఇతడికి! జాతీయ అవమానానికి ప్రతీకారాన్ని చేయడానికి, దేశ శత్రువైన గవర్నర్ని కాల్చడానికి ప్రాణాలకుతెగించి సిద్ధపడ్డాడు. కాన్వకేషన్ సందర్భంగా యూనివర్శిటీ హాల్లోకి ప్రవేశించడానికి ప్రవేశపత్రం తెచ్చి ఇవ్వడం జరిగిందతడికి! దుర్గాదాసుగానీ, రణవీర్ గానీ - తాము హాల్లోకి వెళ్ళలేదు.

కాన్వకేషన్ యొక్క సాధారణ కార్యక్రమాన్ని పూర్తిచేసుకుని ఊరేగింపుగా హాలు లోపలనుండి వెళ్తూవుండగా, ముందువున్న గవర్నర్ మీద హరికృష్ణ కాల్పులు జరిపాడు. గవర్నరూ, అతడి అంగరక్షకులైన సైనికాధికారులూ పారిపోయారు. వరండాలోకి పారిపోయిన గవర్నర్ని వెంబడించాడు హరికృష్ణ! రెండవమాటు వరండాలో కాలుస్తూండగా చరణ్‌సింగ్ అనే రాజభక్తి పరాయణుడైన సబ్ ఇనస్పెక్టర్ ఒకడు హరికృష్ణను పట్టుకోవడానికి ముందుకువచ్చాడు. చచ్చిపోయాడు. హరికృష్ణా పట్టుబడ్డాడు!

ఈ సందర్భంగా డిసెంబర్ 24న మొదటి అరెస్టు జరిగింది. మర్దాన్‌లోని చమన్‌లాల్‌ను మొదటగా అరెస్టు చేశారు. ఈ చమన్‌లాల్, దుర్గాదాసుఖన్నాకు హరికృష్ణను పరిచయం చేశాడు. 24న చమన్‌లాల్ అరెస్టు కావడాన్నిబట్టి, పోలీసులు 23నే లాహోరునుండి మర్దాన్‌కు బయల్దేరారనుకోవాలి! అంటే హరికృష్ణ ఎంతతొందరగా సాహసించాడో, అంతేతొందరగా రహస్యాల్ని చెప్పేశాడు! ఒక వారం లోపలే దసొందాసింగ్, రణవీర్, దుర్గాదాస్‌ఖన్నా - వీరిందరూ అరెస్టయ్యారు. దసొందాసింగ్ ప్రభుత్వసాక్షి అయ్యాడు. దుర్గాదాసుఖన్నా ఆనాటి తన జ్ఞాపకాల గురించి వ్రాశాడు. అతడు ఈ 'యాక్షన్' జరపడాన్ని గురించి జైల్లో వున్న భగత్‌సింగ్‌కు రహస్యంగా జాబు రాశాడుట! ఆ జాబులో సలహా

కోరాడుట! భగత్‌సింగ్ ఇలా సమాధానం ఇచ్చాడు. "ఈపనికి నైతికంగా నేను అనుమతించను. మీకు 'ధైర్యం' వుంటే చేయండి!"

భగత్‌సింగ్ ఇచ్చిన సమాధానం పరిస్థితికి తగినట్టుగావుంది. అతడు 'ఉచితం' అనుకుంటేచేయండి అని సమాధానం ఇచ్చివుంటే మరోరకంగా వుండేది. 'ధైర్యం' అన్న శబ్దం వాడాడు. ఆ పదం వాడడంలోని అభిప్రాయం 'యాక్షన్' జరిపాక సమర్ధించుకోగలరా? అని! ఎందుకంటే కొత్తగా వచ్చిన వ్యక్తి విప్లవ భావాలకు అనుగుణంగా ప్రవర్తించగలగడం కష్టం!

ఇంగ్లీషు ప్రభుత్వం హరికృష్ణను ఉరికంబానికి ఎక్కించడానికి చాలా ఆదుర్దాపడ్డది. ఆవిధంగా సాయుధ రాజద్రోహానికి ఫలితం ఏమిటో ప్రజలకు చూపించాలనుకుంది. అతడిమీద కుట్రకేసు నడపకుండా హత్యానేరానికి కేసు నడిపారు. వెంటనే ఉరి తీసేశారు. రణవీర్, దుర్గాదాసుఖన్నా - వీరిమీద కుట్రకేసు బనాయించారు. సెషన్సు జడ్జి వీరికి ఉరిశిక్ష వేశాడు. ఐతే, లాహోర్‌లో వీరి కుటుంబాలు చాలా పలుకుపడిగలవి. వకీళ్ళందరూ వీరితరఫున పని చేశారు. హైకోర్టు వీరిని విడుదల చేసింది. దీన్నిబట్టి తెల్సుకోవల్సింది. హి.స.ప్ర.స. ప్రయత్నాలవల్ల సాయుధ విప్లవానికి అవసరం అయిన వాతావరణం వ్యాపించింది. కానీ, గాంధీగారు నిరంతరం నిందిస్తూండడంవల్ల సాయుధపోరాటం ఒక ఉద్యమంగా అభివృద్ధికి రాలేకపోయింది. ప్రజల సహకారం లభించలేదు.

# 15. ఇంద్రపాల్

ఆ రోజుల్లో అరెస్టు అయి ప్రభుత్వసాక్షులుగా మారిపోతూన్న మిత్రుల కారణంగా మా మనస్సులు చాలా బాధపడుతూండేవి. కైలాస పతి గురించి చెప్పాను. ఇంద్రపాల్ కూడా ప్రభుత్వసాక్షి అవడంతో వ్యక్తిగతంగా నేను మనస్సులో చాలా బాధపడ్డాను. ఇది విని ఆజాద్ కూడా చాలా బాధ పడ్డాడు. ఇంద్రపాల్ సాధువుగా వుండడం బహావల్ పూర్ రోడ్డులో జరిగిన సంఘటనలో అతడు చూపిన సాహసం – ఇవన్నీ ఆజాద్‌కు తెల్సు! అతడు ప్రభుత్వసాక్షి అయ్యాడన్న వార్తను మేము ఏ విధంగాను నమ్మలేకపోయాము. ఐతే, అతడు కోర్టులో ప్రభుత్వం తరఫున ఇచ్చిన సాక్ష్యాలు పత్రికల్లో వస్తూన్నాయి. ఇంకా నమ్మకపోవ డం ఎలా? కొన్ని విషయాలు ఇంద్రపాల్‌కు మాత్రమే తెల్సు. మరొక రికి తెలియవు. అలాంటివీ చెప్పేశాడు అతడు. ఇంక నమ్మక పోవడం ఎలా? అప్పట్లో ఆజాద్ విపరీతమైన మానసికబాధలో ఇలా అంటూండే వాడు. "సోహన్, ఇంక మనం ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు. అరెస్టు అవడం తప్పదనుకున్నప్పుడు, పోలీసుల చేతుల్లో చిక్కకుండా తలకు పిస్తో లును పేల్చుకున్నవాడిని మాత్రమే మనం నమ్మవచ్చు! అలాంటివాడే మన మిత్రుడు;"

1931 వ సంవత్సరం, జనవరినెల మొదటి వారంలో వార్తాపత్రి కలు లావాటి అక్షరాల్లో ఇలా ప్రకటించాయి 'రెండవ లాహోరు కుట్ర కేసులోని ప్రభుత్వసాక్షి ఇంద్రపాల్ అడ్డం తిరిగాడు!' పోలీసులు తనను బాధించి, తనచేత తప్పుడు సాక్ష్యం ఇప్పిస్తూన్నారని కోర్టులో స్పష్టంగా చెప్పాడు ఇంద్రపాల్! పోలీసులు రాసిఇచ్చిన కాగితాలనూ జడ్జికి ఇచ్చాడు. మేము సంతోషంతో పొంగిపోయాము. "ఈ సాధూ నాయాల ఎవడూచేయని గమ్మత్తు ఏదో చేస్తాడని అనుకుంటూనే వున్నాను!" అన్నాడు ఆజాద్.

ఇంద్రపాల్ ప్రభుత్వ సాక్షి అయ్యాడు. అద్దంతిరిగాడు అని టూకీగా చెబితే సరిపోదు. నేనూ, ధన్వంతరీ, సుఖదేవ్‌రాజ్ - మేము ముగ్గురం పోట్లాడుకుంటూండడంవల్ల, ఇంద్రపాల్, అతడి మిత్రులు కొందరూ భిన్నులయ్యారు వాళ్ళువిడిగా కొన్ని సాయుధ కార్యక్రమాల్ని నడిపారు పార్టీ అతడికి విడిగా కార్యక్రమాల్ని నడపడానికి అనుమతి నీయలేదు. కనుక తాము ప్రత్యేకం జరిపిన సాయుధ కార్యక్రమాల్ని పార్టీకి అంటగట్టలేరు. అందువల్ల 'ఆతిశీచక్కర్' అన్న ప్రత్యేకమైన విప్లవ సంఘం తరపున కార్యక్రమాల్ని నడిపారు. ఈసంఘం పంజాబులో అనేకచోట్ల బాంబుల్ని పేల్చింది. తత్ఫలితంగా అరెస్టులు ప్రారంభం అయ్యాయి. లాయల్‌పూర్‌లో ఈసంఘానికి సంబంధించినవారనే అను మానంతో ఇద్దరు పోలీసుల్నికూడా అరెస్టుచేశారు. ఒకతని పేరు కుందన్ లాల్, రెండవ అతనిపేరు బన్సీలాల్। వీళ్ళందర్నీ ఒకటి రెండువారాల్లోనే అరెస్టుచేశారు. నాతమ్ముడు ధర్మపాల్‌కూడా వీళ్ళల్లో ఉన్నాడు. అతడు తప్పించుకోవడానికి జాలంధర్ పారిపోయాడు. బోర్డింగ్ స్కూల్లో పదవ తరగతిలో చేరాడు. అతడినీ అరెస్టుచేశారు.

మా సమయంలోనూ మాకంటే ముందూ కొత్తగా విప్లవ సంఘం లోకి వచ్చిన వ్యక్తుల్ని అనేకరకాలుగా పరీక్షించేవారు. కష్టాలను అను భవించేలాచేసేవారు. అలాంటిశిక్షణ వీళ్ళకులేదు ఫలితంగా అందరికంటే ముందు కుందన్‌లాల్, బన్సీలాల్-వీళ్ళు రహస్యాన్ని బైటపెట్టారు. వీళ్ళుచెప్పిన రహస్యాల ఆధారంగా మిగిలినవాళ్ళనూ పట్టుకుకొట్టారు. హింసలకు తట్టుకోలేక చాలామంది రహస్యాలు చెప్పేశారు. చాలామంది వాళ్ళు చేసినవన్నీ ఒప్పేసుకున్నారు. అలా రహస్యాలుచెప్పిన మిత్రుల పేర్లు ఇక్కడ ఉదహరించడం అనవసరం కారణం, వాళ్ళల్లో ఎక్కువ మంది ఇప్పుడు కాంగ్రేసు ప్రభుత్వంలో ఉన్నతమైనపదవులలో వున్నారు. రహస్యాల్ని కక్కేసినా వీళ్ళను పోలీసులు బాగా కొట్టారు.

లాయల్‌పూర్‌కు చెందిన ధర్మవీర్ అనే అతడి చేతుల్ని మంచం కోళ్ళకింద పెట్టి, మంచంపైన చాలామంది పోలీసులు కూచునేవారట! అతడివి దువ్వటిలో చుట్టి ఇష్టమొచ్చినట్టు కొట్టేవారుట! అయినా అతడు రహస్యాలు చెప్పలేదు. అలాగే ధర్మపాల్‌నూ చాలా హింసపెట్టారు. గోడలకువున్న బేడీలకు చేతులనువేసి ఐదురోజులు రాత్రింబగళ్ళు నుంచో బెట్టారు. రోజుమొత్తంలో తిండికి, కాలకృత్యాల్ని తీర్చుకోడానికి ఒక్క గంట మాత్రం వదిలేవారు. ఎంతబాధించినా ధర్మపాల్ పొక్కలేదు. 'నాకు ఏమీ తెలియదు' అని అనేవాడు. అతడి పిక్కలు స్థంభాల్లా వాచి పోయాయి. అప్పుడిక నిరశనవ్రతం ప్రారంభించాడు. స్పృహతప్పి పోయాక పోలీసులు అతడిని పడుకోబెట్టి కాళ్ళతోనూ, వేడినూనెతోనూ అతడివి మర్దించారు. గోడ బేడీలను చేతులకువేసిన మొదటిరోజునే నిర శన వ్రతం ప్రారంభించివున్నయితే, ఆరురోజులు గోడకు నిలబడవల్సి వచ్చేదికాదు. ఇలాంటి బాధలు వీళ్ళందర్ని పెట్టారు. ఇవేకాక, మీసాల వెంట్రుకల్ని పీకడం చీమలతోనిండిన బెల్లపుగడ్డల్ని పైజమాల్లోవేసి చేతుల్ని కట్టేసేవారు. చీమలు క్రిందికిపోకుండా గిలకలదగ్గర పైజమాల్ని కట్టేసేవారు ఇలాంటి బాధలు మమ్మల్నిపెట్టలేదు. మొదటి లాహోరు కుట్రకేసు నిందితులనుగానీ, ఢిల్లీ కుట్రకేసు నిందితుల్నిగానీ, నన్నుగానీ -ఇలాంటి బాధలు పెట్టలేదు. వీళ్ళనే ఎందుకుపెట్టారంటే? వీళ్ళు కొత్త వాళ్ళని, విప్లవానుభవం లేనివాళ్ళనీ పోలీసులు తెల్సుకున్నారు!

ఒకరోజున ఆఫీసులో ప్రశ్నించిన తరువాత ధర్మపాల్‌ను అతడి కొట్టులోకి తీసుకువెళ్ళారు. ఈ నిందితులకు భోజనంపెట్టే డ్యూటీ, హవల్దార్ పండితఫకీర్‌చంద్‌ది! ఫకీర్‌చంద్ ధర్మపాల్‌కు భోజనం పెట్టడానికిరాగానే అప్పటివరకూ డ్యూటీలోవున్న అబ్దుల్‌సత్తార్ బేడీలతో వున్న ధర్మపాల్‌ను ఫకీర్‌చంద్‌కు వప్పగించి అవతలకు వెళ్ళాడు. ఫకీర్‌చంద్ కాంగడా-నివాసి! పల్లెటి భాషలో "పాందా (పండితుడు)

నీతో మాట్లాడాలిట! పిలుస్తున్నాడు!" అన్నాడు. ధర్మపాల్‌కు ఫకీర్‌చంద్ మీద అనుమానం కలిగింది. 'కాంగడా నివాసి ఐతేమాత్రం ఏం? తనను ఇరికించడానికి ఇలా మోసంచేస్తున్నాడేమో!' అనుకున్నాడు కానీ, ఫకీర్‌చంద్ నిజంగానే ధర్మపాల్‌ను తీసుకువెళ్ళి ఇంద్రపాల్ వున్న కొట్టు ముందు నించోబెట్టాడు

అప్పుడు ఇంద్రపాల్ ఇలా అన్నాడు "ఇంతవరకూ మనమిత్రులు ఐదుగురు తమకు తెలిసిందంతా చెప్పేశారు. క్షమాభిక్ష దొరుకుతుందన్న నమ్మకంతో ప్రభుత్వసాక్షులు కావడానికి సిద్ధంగావున్నారు. వీళ్ళు కనీసం పదిహేనుమంది మిత్రుల్ని ఉరికంబానికి ఎక్కిస్తారు! అబ్దుల్ అజీజ్ (ఈకేసు ఇన్‌చార్జ్ పోలీసు సూపరింటెండెంట్) నన్ను ప్రభుత్వసాక్షిగా మారమని అడుగుతూన్నాడు. నేనైతేనే విడివిడి సంఘటనలన్నింటినీ ఒక వరుసలో కూర్చగలను. ఈకేసుకూ, పరారీలోవున్న ఆజాద్, యశ్‌పాల్‌కూగల సంబంధాన్ని నేను మాత్రమే బైటపెట్టగలను. ఢిల్లీ కుట్రకేసుకూ, మొదటి లాహోరు కుట్రకేసుకూ, ఈకేసుకూ సంబంధం వుందని నేనే నిరూపించగలను. ఇంకెవ్వరూ ఈపని చెయలేరు. నా ఉద్దేశం ఏమిటంటే, నేను ప్రభుత్వసాక్షినయి, అన్ని నేరాల్ని నామీద వేసుకుంటాను. మిగిలిన వాళ్ళను రక్షిస్తాను! నీ అభిప్రాయం ఏంటి?"

"ఎలాంటి స్థితిలోనూ ప్రభుత్వ సాక్షికమ్మని నేను చెప్పను. నీ మీద నీకు అంతవిశ్వాసం వుంటే, నీయిష్టం!" అన్నాడు ధర్మపాల్.

"నామీద నీకు విశ్వాసంలేదా?" ఇంద్రపాల్ అడిగాడు.

"ఇప్పటివరకూ విశ్వాసం వుంది. ఇక మీదటకూడా నీమీద విశ్వాసం వుంచగలను. కానీ, చాలా ఇబ్బందికలిగించే విషయం ఇది!"

"సరే, నేను ఆలోచిస్తాను!" అన్నాడు ఇంద్రపాల్.

నాలుగురోజుల తరువాత ఫకీర్ చంద్, ధర్మపాల్‌కు రొట్టెలు పెడుతూ "జాగ్రత్త! రొట్టెల్లో పండితుడు (ఉత్తరభారతదేశంలో బ్రాహ్మ

ఖుల్ని పండితులంటారు; ఆంధ్రదేశంలో షట్టుకతోనే బ్రాహ్మణుడు శాస్త్రి. శర్మ అయినట్టు అక్కడ పండితుడు అవుతాడు ।।అను।।) ఇచ్చిన చీటీవుంది।" అని చెప్పాడు. రొట్టెంకింద బీడీకట్ట కాగితంమీద రాసిన చీటీవుంది అందులో 'నేను ప్రభుత్వ సాక్షినయ్యాను।' అని రాశాడు ఇంద్రపాల్.

రెండు నెల్లవరకూ ఇంద్రపాల్ పోలీసులతో బాగా నేస్తం కట్టాడు. కేసును కోర్టులో దాఖలుచేశారు. అరవై దెభై మంది సాక్షుల్ని విచారించారు. ఇంద్రపాల్ వంతువచ్చింది. ఇంద్రపాల్ ఏడురోజులు సాక్ష్యం ఇచ్చాడు. అతడు కోర్టులో చెప్పినవన్నీ పత్రికల్లో అచ్చు అవుతూండేవి. అక్షరాక్షరం నిజం చెప్పేవాడు. అవిచదివి మేము నెత్తిబాదుకునేవాళ్ళం। 'వీడికి ఏమొచ్చిందిరా। ఇలా చెప్పేస్తున్నాడు।' అనుకునేవాళ్ళం। అతడు తన సాక్ష్యంలో భగవతీభాయి, ఆజాద్, యశ్‌పాల్-చేసిన పనులన్నింటినీ వివరంగా వర్ణించి చెప్పాడు. అలాంటి పనులుచేసిన మాకు ఎంతటి శిక్షవిధించినా చాలదు। భగవతి చనిపోయినా, ఆజాద్, యశ్‌పాల్ ఇంకా బ్రతికేవున్నారుగదా? ఇంద్రపాల్ ఇన్ని వివరాలు ఇస్తూన్నా క్రొత్త అరెస్టులు ఏమీజరగకపోవడం విశేషం। ఇంక ఇంద్రపాల్ సాక్ష్యం మలుపు తిరిగింది. జైళ్ళల్లోవున్న మిత్రులకు సంబంధించిన విషయాల్ని చెప్పవల్సిన సమయం వచ్చింది. అంటే, అరెస్టయిన మిత్రుల గొంతు మీదికి తెచ్చే విషయాల్లోకి వస్తూన్నాడన్నమాట।

కోర్టులోరోజూ ఇంద్రపాల్‌చేత 'నిజమేచెబుతాను అబద్ధం చెప్పను, అని ప్రమాణం చేయించేవారు. ఎనిమిదవ రోజున ఇంద్రపాల్ ప్రమాణం చేయ నిరాకరించాడు. జడ్జి కారణం అడిగాడు. ఇంద్రపాల్ ఇలా అన్నాడు. "సాహబ్। ధర్మం పేరు మీద ప్రమాణంచేసి ఇంక అబద్ధం చెప్పలేను। పోలీసులు ఇహజీవితాన్ని నాశనం చేశారు. ఇప్పుడింక పరజీవితాన్ని

కూడా పాడుచేసుకోవడం నా వల్లకాదు. పోలీసులు నాతోపాటు పరలోకా నికి రారుగదా? అక్కడ వీరి అండ వుంటుందని తృప్తిపడడానికి? ప్రమాణం చేశాక పోలీసులు నాచేత అబద్ధం సాక్ష్యం ఇప్పించారన్న నిజాన్ని మాత్రమే చెబుతాను. ప్రమాణం చేయకుండా చెప్పమంటే, పోలీసులు బట్టీ పట్టించినవన్నీ చెప్పేస్తాను!" అన్నాడు.

ప్రభుత్వవకీలు జ్వాలాప్రసాద్ అభ్యంతరాన్ని చెప్పాడు. "ప్రభుత్వ సాక్షి అడ్డం తిరిగాడు. అబద్ధం ఆడుతూన్నాడు. పోలీసులమీద అప వాదుల్ని వేస్తూన్నాడు" అన్నాడు. పోలీసులు ఇలా బట్టీపట్టించి చెప్పిస్తు న్నారనడానికి ప్రమాణం ఏమిటని అడిగింది కోర్టు ఇంద్రపాల్‌ని! ఇంద్ర పాల్ తన జేబుల్లోంచి పోలీసులు రాసి ఇచ్చిన కాగితాల్ని చూపించాడు. తనతోపాటు ఖైదుకొట్టులోకి వచ్చేట్టయితే పోలీసులు రాసి ఇచ్చిన కాగి తాల్ని ఇంకా కూడా ఇవ్వగలను అన్నాడు. ప్లీడర్ని తన వెంట తీసుకు వెళ్ళి ఇంకా వున్న కాగితాల్ని కోర్టుకు వప్పగించాడు పోలీసులు తనకు పాఠం నేర్పారనడానికి ఉదాహరణగా ఎన్నో ఆధారాల్ని చూపించాడు. తరు వాత ఇంద్రపాల్ కోర్టును ఇలా అడిగాడు. "పోలీసుల ఆధీనంలో వుంచ కుండా, పోలీసులు నామీద ఎలాంటి అత్యాచారము చేయకుండా చూస్తామని కోర్టువారు హామీ ఇచ్చేట్టయితే నిజం చెప్పగలను!" అన్నాడు.

ప్రభుత్వవకీలు ఇంద్రపాల్‌ని అనేక ప్రశ్నలు వేశారు ఎక్కడా అతడు దొరకలేదు. చివరకు జ్వాలాప్రసాద్ వేసిన ఒక ప్రశ్నకు 'నాకు జ్ఞాపకం లేదు!' అని సమాధానం ఇచ్చాడు ఇంద్రపాల్. అప్పుడు జ్వాలా ప్రసాద్ ఇలా అన్నాడు. "చాలా కృతజ్ఞుణ్ణి పండిట్‌జీ! మీనోటిమీదుగా 'జ్ఞాపకంలేదు' అనిపించగలిగాను." ఇంద్రపాల్‌ను చూసి ప్రభుత్వసాక్షి మదనగోపాల్ కూడా అడ్డం తిరిగాడు.

చివరకు కేసును కొట్టివేయవల్సి వచ్చింది. ప్రభుత్వం ఇంద్ర పాల్ మీద పగతీర్చుకోవడానికి 'ప్రభుత్వాన్ని మోసం చేయడం, కోర్టులో అబద్ధం ఆడడం, అతిశీచక్కర్ విప్లవసంఘం ద్వారా హత్యలు జరప డం' మొదలైన నేరాల్ని పురస్కరించుకుని అతడొక్కడిమీదా కేసు పెట్టింది. సెషన్సు జడ్జి అతడికి ఉరిశిక్ష వేశాడు. పోలీసుల అత్యాచారా లకు జడిసి కోర్టులో తమ నేరాల్ని ఒప్పుకున్నవాళ్ళకు మాత్రమే కొద్ది శిక్షలు పడ్డాయి. కుట్రకేసు ఎగిరిపోయింది. సాయుధ రాజద్రోహానికి తలపడ్డారన్నదీ ఎగిరిపోయింది.

ఇంద్రపాల్ని రక్షించడానికి హైకోర్టుకు వెళ్ళాం। ఇంద్రపాల్ తరఫున ముఖ్యవక్తలు రోహతక్నివాసి స్వర్గీయ లాలాశ్యామ్లాల్। వీరు సహాయ నిరాకరణోద్యమంలో కోర్టుల్ని బహిష్కరించారు. తిరిగి రెండవ లాహోర్ కుట్రకేసు అభియుక్తులకు సహాయం చేయడానికి మాత్రమే వకాలత్తును ప్రారంభించారు. వీరికి కోర్టు ఫీజు రూపంలో రోజుకు 64 రూ. ఇస్తుంది ప్రభుత్వం. ఆ డబ్బునూ అభియుక్తులకే ఖర్చుపెట్టేవారు. శ్యామ్ లాల్గారూ, ప్రభుత్వపక్షకైన జ్వాలాప్రసాద్-వీరిద్దరూ ఇంద్రపాల్ సాహ సాన్ని ఎంతోపొగిడేవారు హైకోర్టు. ఉరిశిక్షను జన్మఖైదుగా మార్చింది. నాలుగు వైపులనుండి ప్రశంసల వర్షం కురుస్తూవున్నప్పుడు ఉరికంబాన్ని ఎక్కడం వేరు, ప్రభుత్వసాక్షి అయ్యాడన్న కళంకాన్ని భరిస్తూ ఉరికం బం ఎక్కడానికి సిద్ధపడడం సాధారణ సాహసంతో కూడిన పనికాదు।

పై వ్యవహారంలో ఇంద్రపాల్ మానసికంగా చాలా బాధ పడ్డారు. పోలీసులూ చాలా హింసించారు. ఇవన్నీకల్సి అతడికి పెరాలసిస్ వచ్చింది కొన్నాల్టివరకూ ఈపక్షపాతమూ వేషమే అనుకున్నారు జైలు అధికారులు। అతడి బాధను లెక్కపెట్టలేదు. తరువాత 'నిజంగా పక్ష పాతమే అనుకున్నారు. ఐతే, వైద్యం ఎలా చేయించాలి?' అన్న ఆలో చనలో పడ్డారు.

శ్యామ్‌లాల్‌గారిని, ఇంద్రపాల్ యొక్క నియమబద్ధమైన జీవితమూ, అతడి సాహసమూ గొప్పగా ప్రభావితంచేశాయి. ఇంద్రపాల్ ప్రాణాల్ని రక్షించడానికి వారు గాంధీగార్ని కల్సుకున్నారు గాంధీగారు ఈవిషయమై, అప్పుడు పంజాబుకు ముఖ్యమంత్రిగావున్న సికందర్ హయాత్‌ఖాన్‌కు జాబు రాశారు గొప్పగొప్ప ప్రభుత్వడాక్టర్లు ఇంద్రపాల్‌ను పరీక్షించారు. రోగం అసాధ్యమైనస్థితికి చేరిందనీ, ఇప్పుడు వైద్యం పనిచేయదనీ నిర్ణయించారు! ఏ క్షణంలోనైనా ప్రాణాలు పోవచ్చునన్నారు. ఇక బ్రతకదన్న ఉద్దేశంతో ప్రభుత్వం అతడిని వదిలి పెట్టింది.

విడుదలైనప్పటి ఇంద్రపాల్‌స్థితి అతి దారుణంగా వుంది. లేచి కూచోలేడు. మాట్లాడలేడు. కాళ్ళూచేతులూ వంకరు తిరిగిపోయాయి. జైలుకువెళ్ళడానికి నాలుగయిదు నెల్లక్రితమే అతడికి వివాహం అయింది. అతని భార్య జగదీశ్వరి భర్తకు వైద్యం ప్రారంభించింది. వైద్యులు చెప్పిన తైలాల్ని పట్టుకువచ్చి వంటికి రాస్తూవుండేది మందులు వేస్తూ వుండేది. రాత్రింబవళ్ళు సేవచేసేది. నేను 1938లో విడుదల అయ్యాను. 39లో ప్రస్తవసివారి కాన్ఫరెన్సులో పాల్గొనడానికి లాహోరు వెళ్ళాము. అప్పుడు ఇంద్రపాల్ మంచంలో పడుకునే కొంచెంగా మాట్లాడేస్థితికి వచ్చాడు. ఆ వెనుకటి సాహసంతోకూడిన నిర్లక్ష్యం పోనేలేదు అతడిలో! నన్ను చూడగానే అరిచాడు. "అరె....అరె.... ఉప్పూ, పప్పూ, చింతపండు – అమ్మేవాడి కొడుకువచ్చాడు! ఏయ్, జగదీశ్వరీ! బియ్యంపప్పూ దాచిపెట్టేసెయ్యి! లేకపోతే తిండిపెట్టాల్సి వస్తుంది!" అన్నాడు.

నా బంపంతం ల్లి భార్యా - భర్తలిద్దరూ లక్నో వచ్చారు. చాలా రోజులపాటు కరెంటువైద్యం చేయించాము. కాసేపు కూర్చునేస్థితికి వచ్చాడు. కర్రసాయంతోకుంటుతూ నడుస్తున్నాడు కూడాను. నేను విడుదల అయ్యాక 1938 నవంబర్‌లో 'విప్లవ్' అనే హిందీ మాసపత్రి

కను ప్రారంభించాను. 1939 అక్టోబర్‌లో వుర్దూలోనూ 'విప్లవ్'ను తీసుకురాసాగాము. ఇంద్రపాల్ హిందీని వుర్దూలోకి అనువాదం చేస్తూండే వాడు. కానీ, ప్రభుత్వం రు. 12వేల ధరావత్తు అడగడంవల్ల కొద్దిరోజు ల్లోనే 'విప్లవ్' పత్రిక ఆగిపోయింది ఇంద్రపాల్ లాహోర్ వెళ్ళి పోయాడు. అక్కడ మరికొందరు వ్రాయసగాళ్ళతో కల్సి వుర్దూ వ్రాతపనిని చేస్తూండేవాడు. అతడి ఆరోగ్యం చాలావరకు కుదుటపడ్డది కర్రసా యంతో మైలూ-రెండు మైళ్ళు తిరిగి రాగలుగుతూన్నాడు. ఒక కొడుకూ, ఒక కూతురూ కలిగారు। మాటల సందర్భంలోనే తన ఆదర్శాన్ని ప్రచా రం చేస్తూండేవాడు. రెండు కరపత్రాల్ని కూడా వేశాడు. 1947లో, పంజాబు విభజనతో అతడికి తిరిగి భయంకరమైన మానసిక వేదన కలి గింది. రోగం తిరగబెట్టింది లాహోరునుండి ఢిల్లీ వచ్చాడు హాస్పటల్లో చనిపోయాడు. జగదీశ్వరి ఢిల్లీలోని ఒకస్కూల్లో కుట్టుటీచరుగా పనిచేస్తూ పిల్లల్ని చదివించుకుంటోంది. ఇప్పుడామె చందౌసీలో వుంటోంది।

# 16. చంద్రశేఖర్ ఆజాద్

నేను రష్యా వెళ్ళడాన్ని గురించి ఇతర మిత్రులతో మాట్లాడడమూ అవసరమే। ముఖ్యం సురేంద్రపాండేతో మాట్లాడాలి। నారష్యాయాత్రకు పాండే అంగీకరించడమేకాదు. తనూ వస్తానన్నాడు. ఆ రోజుల్లో అలహాబాద్‌లోని 'కటరా'లో తీసుకున్న ఇంటిలో సిద్ధాంత చర్చల్లో మునిగితేలుతూండేవాళ్ళం। రష్యా వెళ్ళడాన్ని గురించి. రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్సును గురించి కూడా చర్చిస్తూండేవాళ్ళం। ఇంగ్లీషు ప్రభుత్వం కాంగ్రెసును ప్రజలపార్టీగా గుర్తించి చర్చలకు ఆహ్వానించడం ఇదే ప్రథమం। దీంతో కాంగ్రెసువారు ఇంక తమకు బ్రిటీష్ ప్రభుత్వం స్వరాజ్యాన్ని ఇచ్చేయబోతూన్నదనే ఉబలాట పడ్డారు. ఇంగ్లీషు ప్రభుత్వానికి - కాంగ్రెసుకూ ఏదో ఒక విధమైన ఒప్పందం కుదురుతుందని మేమూ అనుకుంటూనే వున్నాము. మరి అప్పుడు మా స్థితి ఏమిటి? అప్పుడూ మేము పోరాడుతూ వుండవల్సే వుంటుందా?

'ఇంగ్లీషు ప్రభుత్వంతో వప్పందం' అన్న భావననే ఆజాద్ భరించలేడు. "ఇంగ్లీషు వాళ్ళు శాసకులుగా ఈ దేశంలో వున్నన్నాళ్ళూ వాళ్ళకూ - మనకూమధ్య ఎప్పుడూ తుపాకులు పేల్తూనే వుంటాయి। వప్పందం, రాజీ-ఇవన్నీ అర్థంలేని మాటలు। వాళ్ళకూ మనకూ ఒకటే ఒప్పందం జరగాలి। దాని ప్రకారం వాళ్ళు మూటా - ముల్లె సర్దుకుని తక్షణం ఇక్కడినుండి వెళ్ళిపోవాలి" అనేవాడు ఆజాద్. ఇదే భావన 1942 నాటి 'క్విట్ ఇండియా' నినాదంలో ధ్వనించింది। సిద్ధాంతరూపంగా ఆజాద్ భావాన్ని నేనూ, సురేంద్రపాండే కూడా ఒప్పుకునేవారం. ఐతే, కాంగ్రెసు నాయకుల్ని శత్రువుల్ని చేసుకోవడం మాకు ఇష్టం లేదు। "బ్రిటీష్ ప్రభుత్వానికీ కాంగ్రెసుకూ జరిగే వప్పందం ఎలాంటిదో, వేచి

చూద్దాం!" అనేవాళ్ళం మేము. ఈ విధంగా సిద్ధాంతాన్ని గురించి, ఆదర్శాన్ని గురించి చర్చించుకునేప్పుడూ వ్యక్తిగత జీవితమూ మా ముందు ప్రశ్నార్థకంగా నిలిచేది! ఇంతా అయ్యాక వ్యక్తిగతంగా మాస్థితి ఏమిటి? మేమేం చెయ్యాలి?

ఒక్కొక్కమాటు పరిహాసంగా ఇలా అనేవాణ్ణి ఆజాద్‌తో. "భయ్యా! భయపడతావెందుకు? కాంగ్రెసూ, ఇంగ్లీషు ప్రభుత్వమూ రాజీ అంటూ పడితే, ఇంక మనం ఇలా రహస్య జీవితాన్ని గడపవల్సిన పనిలేదు! నీ పేరు బాగా ప్రసిద్ధికి వచ్చింది. నువ్వు పోలీసు ఇనస్పెక్టర్ వేషానికి సరి పోతావని కాంగ్రెసువాళ్ళకు తెలుసు! నీకు ఇనస్పెక్టర్ ఉద్యోగం ఇస్తార్లే!"

ఆజాద్‌కు ఇనస్పెక్టర్ ఉద్యోగం అంటే తగనికోపం. తన్ను ఆ వుద్యోగానికే సరిపోయేవాడుగా ఎంచుతూన్నందుకు మండిపడేవాడు 'దొంగ నాయాల! నువ్వు మహా మేధావివి? అరిస్టోటల్ విగదూ? దిగివచ్చావు! ఐతే, మరి నువ్వేమవుతావప్పుడు?' అని అడిగేవాడు.

నేను పరిహాసాన్ని ఇంకొంచెం పొడిగించేవాణ్ణి "నువ్వు ఇనస్పెక్టర్‌వయ్యాక నా గురించి రికమండ్ చెయ్యవా? కనీసం నేను హెడ్ కానిస్టేబుల్ నయినా అవుతానుకదా?" అని పాండేవైపు చూపుతూ. "ఇతడెప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూంటాడు. ఇతణ్ణి మిడిల్‌స్కూలు హెడ్మాస్టర్ని చేయించు!" అనేవాడిని. నేనూ, పాండే ఇంకా బ్రతికి వున్నాం. కాంగ్రెసు ప్రభుత్వ దయవల్ల నేను హెడ్‌కానిస్టేబుల్ నయినా కాలేకపోయాను. పాండే మిడిల్‌స్కూలు హెడ్మాస్టరూ కాలేకపోయాడు!

* * * * * *

1931 సం॥ అలహాబాదులోని 'కటరా'లో వున్నప్పుడు జరిగిన ఒక సంఘటనను మరువలేము. రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సు పరిణామం కోసం ఎదురుచూస్తూ నిరాశలో, నిష్క్రియతలో-రోజుల్ని దొర్లిస్తున్నాము.

ఒకరోజున పాండే చ్యవనప్రాస డబ్బానొకదాన్ని తీసుకువచ్చాడు. రాత్రి పడుకోబోయేముందు ఆ డబ్బాను ఆజాద్ చూశాడు. "ఏమిట్రా ఇది? డబ్లో నల్లనల్లగా వుంది!" అనడిగాడు.

"దగ్గుమందు!" అన్నాడు పాండే.

నేను "చాలా బలవర్ధకమైన మందుకూడాను!" అన్నాను.

ఆజాద్ అనుమానించాడు. "నాయాల, ఇది మలాంలాగావుంది గదరా?" అన్నాడు.

"బాగా రుచిగా వుంటుంది!" అన్నాను నేను.

కొంచెం నాలుకకు రాచుకుని రుచిచూసి "నిజమే! రుచిగావుందే!" అంటూ డబ్బాడూ తినేశాడు.

పాండే గోలపెట్టాడు. "భై య్యా! ఇది మందు. అలా తినకు! తరువాత బాధపెడుతుంది!" అన్నాడు.

ఆజాద్ వినలేదు. "పో!పో!" అన్నాడు.

మర్నాడు ఉదయమే శరీరంలో బాధలు ప్రారంభం అయ్యాయి. మా యిద్దరిమీదా మండిపడ్డాడు. "ఏమిటిది? అర్థం పర్థం లేకుండా, బలవర్ధకం అని తినిపించారు...." అన్నాడు. మేము ఒకటే నవ్వడం అతడు చ్యవనప్రాసను ఒకటే తిట్టడం!

* * * * * *

రౌండుటేబుల్ కాన్ఫరెన్స్ రాజకీయ వాతావరణంమీద బాగా ప్రభావాన్ని వేసింది. ఇంగ్లీషు ప్రభుత్వంతో పోరాటాన్ని ఇక విరమించవల్సి వుంటుందేమోనని మేమూ అనుకోసాగాము! పోరాటాన్ని విరమిస్తే మా భావిజీవితాలు ఎలా వుంటాయి? మేము ఏం చెయ్యాలి? అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి మాలో! అదే రోజుల్లో ఆజాద్ కాన్పూర్‌లోని చన్నీ

గంటలో తీసుకున్న ఇంట్లో, రాత్రిపూట తన జీవితాన్ని గురించి మాకు చెప్తూండేవాడు.

ఆజాద్ చెప్పిందాన్నిబట్టి, అతనికి బాగా దగ్గర సంబంధంగల వ్యక్తి, మిత్రుడు – భగవాన్‌దాస్ మాహోర్ చెప్పిందాన్నిబట్టి, అలాగే పరారీలోవుండగా ఆజాద్‌కు ఆశ్రయాన్ని ఇచ్చి ఆదరించిన మాస్టర్ రుద్రనారాయణ్‌గారు చెప్పినదాన్నిబట్టి — ఆజాద్ మధ్య భారతంలోని ఝూబువా తాలూకాకు చెందిన 'భావరా' గ్రామంలో జన్మించాడనవచ్చును। అప్పట్లో ఆ గ్రామం అలీపూర్ జమీందారీలో వుండేది. ఆజాద్ తండ్రి పేరు సీతారాం తివారీ, తల్లిపేరు జగరానీదేవి। తివారీ స్థితిపరుడు కాకపోవడంవల్ల ఉన్నావ్‌జిల్లాలోని తన బావగార్లయిన శివనందనమిశ్ర, రామప్రసాద్ మిశ్రలదగ్గర వుంటుండేవాడు. తివారీ నిస్వార్థపరుడైన శ్రోత్రియ బ్రాహ్మణుడు। కోపిష్టి, ఎవరిమాట వినేవాడు కాడు. ఏదో చిన్నవిషయానికి బావలమీద కోపగించుకుని ఉన్నావ్ నుంచి అలీరాజపూర్ వెళ్ళిపోయాడు. అక్కడ ఎనిమిది రూపాయిల నెల జీతానికి తోట కాపరిగా వుండిపోయాడు. ఆ జీతానికి తగినట్టుగానే ఆ రోజుల్లో జీవితావసర వస్తువుల ధరలూ చాలా చౌకగా వుండేవి।

చిన్నతనంలో ఆజాద్‌లోనూ బాల్యచాపల్యం వుండేది. తినడం పట్లా, ఆటలపట్లా ఎటూ ఆసక్తి వుండేది. అతడికి బెల్లమంటె చాలా ఇష్టం। ఆటల్లో మందుకూరి కాల్చేబొమ్మల నాటుతుపాకులాట అతడికి మహా ఇష్టమైన ఆట। ఐతే, ఈ ఆట ఆడుకోవడానికి పటాసు కావాలి। పటాసు కొనుక్కోవడానికి డబ్బులు వుండేవి కావు. ఒకరోజు తోట తమ సొంతమే అనుకుని కొన్నిపళ్ళను అమ్మి బెల్లమూ, పటాసు కొనుక్కున్నాడు. తండ్రి దృష్టిలో ఇది క్షమించరాని అపరాధం అయింది. తండ్రి విపరీతంగా కొట్టాడు. తల్లి హృదయం కంపించిపోయింది. స్వాభిమాని అయిన ఆజాద్ ఇంక ఆ యింట్లో వుండలేకపోయాడు.

చదువుకోవాలన్న ఆసక్తివుంది హృదయంలో! తల్లి అతికష్టంమీద కూడ పెట్టిన పదకొండు రూపాయిలూ కొడుక్కి ఇచ్చింది. ఆజాద్ తండ్రికి చెప్పకుండా, విద్యలకు కేంద్రమైన కాశీకి వెళ్ళిపోయాడు. అక్కడ అత డొక సత్రంలోవుండి లఘుకౌముది, అమరకోశం చదువుకుంటున్నాడు. శాసనోల్లంఘన ఉద్యమం తీవ్రస్థాయిలో వున్న రోజులవి. ఆ వుద్యమం ఆజాద్‌ని బాగా ఆకర్షించింది. అప్పుడు ఆజాద్‌కు పదమూడు, పద్నాలుగు ఏళ్ళుంటాయి.

శాసనోల్లంఘనం ఉద్యమంలో పాల్గొన్నాడు. అరెస్టుచేసి మెజి స్ట్రేటు ముందు నిలబెట్టారు. అప్పుడు అతడి చేతులు చాలా చిన్నవి. బేడీల్లోంచి బైటకు వస్తూండేవి. ఆజాద్ తన చేతుల్ని బయటకు తీసి పోలీసువాళ్ళకు చూపించి, వాళ్ళను ఏడిపిస్తూండేవాడు. పోలీసులు ఇది చూసి, అతడి రెండుచేతులకూ కలిపి ఒకే బేడీని వేసేశారు. మెజస్ట్రేటు ఆజాద్‌ను అవమానపరిచాడు "వేలెడులేవు. పెద్ద, వుద్యమాన్ని నడప డానికి వచ్చావా? ఫో అవతలికి!" అన్నాడు. ఆజాద్ మేజస్ట్రేటును తిర స్కారంగా మాట్లాడాడు. బ్రిటీషు చట్టం పద్నాలుగేళ్ళ కుర్రవాడికి జైలు శిక్ష వేయడానికి ఒప్పుకోదు. అందుకని మేజస్ట్రేటు, ఆజాద్‌కు 12 పేము బెత్తపు దెబ్బల శిక్షను విధించాడు. దెబ్బలుకొట్టి వదిలిపెట్టవల్సిం దని పోలీసులకు చెప్పాడు. ఈ మాత్రపు దండనతో కుర్రవెధవకు బుద్ధి వస్తుందనుకున్నాడు మెజస్ట్రేటు!

కోర్టుద్వారా విధింపబడిన 12 పేము బెత్తపు దెబ్బలశిక్షను కొందరు సరిగా అర్థం చేసుకోలేకపోవచ్చును. స్కూల్లో అల్లరిపిల్లలను మాస్టరు గారు కొట్టినట్టే కోర్టుశిక్షను కూడా అమలు పరుస్తారని చాలామంది అనుకో వచ్చును. కానీ, అలావుండదా శిక్ష! శిక్షపడిన వ్యక్తిని జైల్లోకి తీసుకు వెడతారు. నిలువుగావున్న నలుచదరపు చక్కకు రెండుచేతులూ కట్టే స్తారు. వీపుమీదా పిర్రలమీదావున్న గుడ్డల్ని తీసేస్తారు. పిర్రలమీద

మలాంలాంటి మందును పూస్తారు. పేము బెత్తాలను నీళ్ళల్లో నానబెడతారు. పేముబెత్తపు శిక్షను అమలుపరచడంలో అనుభవజ్ఞుడైన పాకీవాడు, తన పూర్తి బలాన్ని ఉపయోగించి, చేతులు చాచిచాచి పిరుదులమీద కొడుతూ వుంటాడు జైలర్ ఒకటీ రెండూ లెక్కపెడుతూ వుంటాడు; పాకీవాడు కొడుతూ వుంటాడు. మొదటిదెబ్బకే పిరల్చుండి, వీపునుండి రక్తం చిందుతుంది! పదమూడు పద్నాలుగు ఏళ్ళ ఆజాద్‌కు-అలాగ 12 పేము బెత్తపుదెబ్బలు కొట్టారు. ఆజాద్ ప్రతిఒక్క దెబ్బకు 'వందేమాతరం' 'మహాత్మాగాంధీకీజై' అంటూ దీర్ఘనినాదాల్నిచ్చాడు.

పేముబెత్తపు దెబ్బలశిక్షను అనుభవించి విడుదలయ్యాక, ఆజాద్ మరికొంచెం ఉత్సాహంతో ఉద్యమంలోకిదూకాడు. కాకోరీ రైలుదోపిడీలో ఆజాద్‌కూడాపాల్గొన్నాడు. అరెస్టులు ప్రారంభంఅవడంతో పరారయ్యాడు. చిన్నతనంలోనూ అతడు బాగా అల్లరిచేసేవాడు, చురుగ్గా వుండేవాడు. తొందరనూ, చురుకుదనాన్నిచూసి మిత్రులు 'క్విక్ సిల్వర్' (పాదరసం) అన్న పేరుపెట్టారు ఆజాద్‌కు! రామ్‌ప్రసాద్ బిస్మిల్‌తోపాటు చాలా రాజకీయ దోపిడీల్లో పాల్గొన్నాడు. అలా దోపిడీకి వెళ్ళినప్పుడు, ఆడవాళ్ళ మీద చెయ్యి వేసేవాడుకాదు. వాళ్ళ వంటిమీది నగలనూ లాక్కునేవాడు కాదు ఒక ఠాకూరు ఇంటికి దోపిడీకి వెళ్ళారు. ఇంటి యజమానురాలు నగలపెట్టెమీద కూచుంది. ఆజాద్ ఆమెతో "అమ్మా! కొంచెం తప్పుకోండి!" అన్నాడు. ఆమె తప్పుకోలేదు. అయినప్పటికీ ఆజాద్ ఆమెను కొట్టనూలేదు. పక్కకు నెట్టనూలేదు. వీళ్ళు తిరిగి వెళ్ళేప్పుడు ఆమె ఆజాద్ ముంజేతిని పట్టుకుంది. ఆజాద్ మర్యాదకోసం ఆమెతో పెనుగులాడకుండా అలాగే నిలబడివున్నాడు. మిత్రులందరూ బయటకువచ్చారు. ఇతడు మాత్రమే బయటకు రాకపోవడంతో బిస్మిల్ లోపలకువెళ్ళి చూశాడు. ఆజాద్ యజమానురాలి చేతిలో బందీవై నిలబడి వున్నాడు. బిస్మిల్ ఆమె ముంజేతిమీద ఒక్క దెబ్బవేసి ఆజాద్‌ను బంధవిముక్తుణ్ణి

చేశాడు బయటకువచ్చాక ఆజాద్‌ను కోప్పడ్డాడు "అలా మొద్దులా విల బడ్డావేం? అందరి ప్రాణాలమీదకూ తెచ్చేవాడివి!" అన్నాడు.

చిన్నతనంలో చదువుకోవాలన్న కోర్కె వుండేది. ఆ ఒక్కకోర్కె మినహాయిస్తే, ఇంక ఆజాద్‌కు వ్యక్తిగతమైన జీవితాదర్శాలు ఏమీ లేవనే చెప్పాలి! చిన్ననాటి చదువు అంటే సంస్కృతం చదవడమే! 'సంస్కృతానికి ఆధునిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ జీవితముతో ఎలాంటి సంబంధమూ లేదు' అని అచిరకాలంలోనే తెల్సుకున్నాడు! రాజకీయ చైతన్యాన్ని పొందాక, స్వాతంత్ర్యంకోసం పరప్రభుత్వంతో పోరాడటంతప్ప అతడికి మరో కోర్కెగానీ, ఆదర్శంగానీ లేకపోయింది. పరప్రభుత్వపు పోలీసులతో పోరాడుతూ చనిపోవడమే తన జీవితానికి పరమావధి అనేవాడు. తన జీవిత పరిణతికూడా అదేనని అతడి దృఢ విశ్వాసం! అరెస్టుకావడం, కోర్టులో నిలబడడం అతనికసలు గిట్టదు. ఎప్పుడూ ఇలా అంటూండేవాడు "అరెస్టయి, కోర్టులో చేతులుకట్టుకు విల బడి, కోతిలాఆడడం నావల్ల కాదు. నా పిస్తోలులో ఎనిమిదిగుళ్ళుంటాయి. ఇంకో ఎనిమిదిగుళ్ళ మేగజీన్ దగ్గరుంటుంది. పదిహేను గుళ్ళతో శత్రు వుల్ని కాలుస్తాను. పదహారోగుండును ఇక్కడ కాల్చుకుంటాను!" అంటూ తనకణతకు పిస్తోలు ముఖాన్ని ఆనించేవాడు.

ఎక్కడ విన్నా ఇంగ్లీషు ప్రభుత్వంతో కాంగ్రేసు రాజీపడుతుందన్న వార్తలే వినిపిస్తున్నాయి ఈ వార్తల ప్రభావం ఆజాద్‌మీదా పనిచేసింది. ఆ రోజు రాత్రి ఇలా అన్నాడు. "కాంగ్రేసు ఒకవేళ ప్రభుత్వంతో రాజీ పడితే, నేను పెషావరుగుండా సరిహద్దునుదాటి వెళ్ళిపోతాను. వజీరీ, అఫరీదీ ప్రజలు ఆంగ్ల ప్రభుత్వంతో ఎప్పుడూ రాజీపడరు. వాళ్ళతోకల్సి బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడుతాను.... సోహన్! అలాంటప్పుడు వంటరి తనం మహాబాధాకరంగా వుంటుంది. నువ్వూ పీరూ (ప్రకాశవతి) మంచి పని చేశారు. జీవితంలోని సర్వావస్థల్లోనూ స్త్రీపురుషులు మాత్రమే సహ

చరులుగా వుండగలరు! నేను సహచరిని ఎన్నుకోవాలనుకున్నా. నాకు తగిన స్త్రీ ఎక్కడుంది? దీదీనే తీసుకుందాం, (సుశీల) శరీరంలో పేరు మాంసం లేదు. ఒట్టి బుర్రను ఏం చేసుకుంటాం? ఖాళీ పరవాలేదు.... అయినా ఆమే పనికిరాదు! నాకు సహచరి కాబోయే స్త్రీ ఎలా వుండాలో తెల్సా? కాంగ్రెసు రాజీపడినప్పటికీ మేమిద్దరం సరిహద్దుదాటి వెళ్ళిపోతాం! ఇద్దరి బుజాల్నారై ఫిళ్ళు వుంటాయి. ఇద్దరి దగ్గరా తూటాలుం టాయి. శత్రువులు ముట్టడించినప్పుడు, ఆమె రైఫిల్ నింపి ఇస్తూం టుంది. నేను ధనాధన్ కాల్చేస్తూంటాను! ఇద్దరం అలాగే పోరాడుతూ ప్రాణాలర్పించేస్తాం!"

స్త్రీని గురించిన ఆజాద్ భావాల్లో చాలా మార్పు వచ్చింది స్త్రీని 'సూదంటురాయి' అనేవాడు. కానీ, క్రమేణా అతడి భావాలు మారాయి! ఒక్కోప్పుడు వీరభద్రతివారీమీది కోపంతో ఇలా అనేవాడు. "నాయాల, భార్యను ఘోషాలో వుంచుతాడు. దొంగవస్తువును దాచినట్టు దాస్తాడు భార్యను!"

ఆజాద్ తన రహస్య జీవితంలోని ఎక్కువ భాగాన్ని ఝాంసీ నివాసి ఐన శిల్పి మాష్టర్ రుద్రనారాయణగారి ఇంట్లో గడిపాడు. ఆ ఇల్లంటే ఆజాద్‌కు ఎంతో విశ్వాసం! అందుకనే, మాస్టర్‌గారి బలవంతం వల్ల అక్కడే ఒకసారి ఫొటో తీయించుకున్నాడు. రుద్రనారాయణగారు ఆజాద్ శిల్పాన్ని చెక్కాలనుకున్నారు. అందుకే ఫొటో అవసరం అయింది. మాస్టర్‌గారు ఆజాద్ శిల్పాన్ని తయారు చేశారు. ఆ శిల్పాన్ని వారు అమూల్యమైన నిధిగా భావిస్తూన్నారు.

ఆజాద్ తరచు మాస్టర్‌గారితో పోట్లాడుతూండేవాడు. వదినెగారిని సార్వజనిక ఉద్యమాల్లో పనిచేయనీయరేమని అడిగేవాడు. ఝాంసీలో పోలీసుల హడావిడి ఎక్కువైంది. ఆజాద్ నుండి వార్తల్ని తీసుకువెళ్ళ డం, తీసుకు రావడం – 'గునియా' అనే ఒక పని మనిషి చేస్తూండేది!

గునియా యవ్వనంలో వుంది. అందంగానూ వుండేది. ఆమెను గురించి నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకునేవారు। ఐతే, ఆమెను గురించిన అలాంటి వార్తల్ని ఆజాద్ చెవిని పెట్టేవాడుకాదు. "....ఎవరు ఏం చెప్పుకున్నా ఆమె మోసకారికాదనీ, విశ్వసించదగిన వ్యక్తి అనీ - నాకు తెలుసు। కనుక, ఆమె సచ్చరిత్రురాలే" అనేవాడు ఆజాద్. 'సచ్చరిత్రత' అన్న శబ్దాన్ని కేవలం లైంగిక విషయాల వరకే పరిమితం చేసేవాడు కాదు. నియమబద్ధత, సాహసం, నిర్లోభం - అతడి దృష్టిలో విలువైనవి।

1931 వ సంవత్సరం ప్రారంభంలోని విషయం. రౌండుటేబుల్ కాన్ఫరెన్సు సందర్భంగా. కాంగ్రేసు రాజీపడితే, రాగల మార్పులగురించి పండిట్ జవహర్‌లాల్‌తో మాట్లాడడానికి ఆనందభవనానికివెళ్ళాడుఆజాద్. కొద్దిరోజులక్రితమే మోతీలాల్ చనిపోయాడు. వెనక ఒకమాటు ఆజాద్ మోతీలాల్‌నూ కలుసుకున్నాడు. అప్పుడు మోతీలాల్‌ని కలుసుకోవడానికి కారణం సిద్ధాంతాన్ని గురించిగానీ, రాజకీయ సమస్యల్ని గురించిగానీ - మాట్లాడవల్సిరావడంకాదు. మోతీలాల్ చాలా ఉత్సాహవంతుడు. సాహసవంతుడూనూ। తాను కాంగ్రేసు పార్టీ వాడయినప్పటికీ, విప్లవకారులకు సహాయం చేస్తూండేవాడు. కాకోరీ కుట్రకేసులోని నిందితులకు కోర్టువ్యవహారాల సంబంధంగా చాలా సహాయం చేశాడు. బహుశ, ఆజాద్‌ను గురించివిని, అతడిని చూడడానికి పిలిపించుకుని వుండవచ్చును. అప్పుడు మోతీలాల్ ఆజాద్‌కు తమఇంట్లో భోజనం కూడా పెట్టించాడు. చక్కగా మాట్లాడాడు. అప్పుడు జవహర్‌లాల్ చెల్లెలు కృష్ణ అక్కడే వుంది. ఆజాద్ ఆమె ఉర్దూ ఉచ్చారణను అనుకరిస్తూ మమ్మల్ని నవ్విస్తూండేవాడు కూడాను.

పండిట్ నెహ్రూ తన ఆత్మకథలో, ఆజాద్ తన్ను కలుసుకున్న సందర్భాన్ని గురించి ఇలా రాశాడు.... అతడు నన్ను కలుసుకోవడానికి

కారణం, మేము జైళ్ళనుండి విడుదల అవడంవల్ల ప్రభుత్వానికీ మాకూ కొంత రాజీ కుదురుతుందన్న ఆశ అందిరిలోను కలగసాగింది. ఒకవేళ కుదిరితే, వాళ్ళ పార్టీ సభ్యులరూ కొంత శాంతి లభిస్తుందా? లేదా? అప్పుడూ వాళ్ళ పార్టీవాళ్ళను రాజద్రోహులుగానే చూస్తారా? ఇలాగే వెంటాడుతూంటారా? వాళ్ళ తలలకోసం ఇలాగే బహుమతులు ప్రకటిస్తూ వుంటారా? ఉరికంబం ఇప్పటిలాగే వాళ్ళకోసం ఎదురుచూస్తూ వుంటుందా? లేక శాంతంగా పనిపాట్లు చేసుకునే అవకాశం లభిస్తుందా? అతడు ఇంకా ఇలా అన్నాడు. 'నేనూ, నా సహచరులూ దౌర్జన్యవాదం నిరుపయోగం అన్న నమ్మకానికి వచ్చాము. దీనివల్ల ప్రయోజనం లేదు. ఐతే, శాంతి మార్గం ద్వారా భారతదేశానికి స్వాతంత్ర్యం లభిస్తుందనీ మేము అనుకోవడం లేదు. భవిష్యత్తులో ఎప్పుడైన సాయుధ పోరాటానికి అవకాశం కలగవచ్చు। ఆనాడు జరిగే పోరాటం దౌర్జన్యవాదం కాదు।'

ఇదే సందర్భంలో మరికూడా ఇలా రాశాడు నెహ్రూ "దౌర్జన్యవాదంపట్ల వారికి వున్న నమ్మకాలు తొలిగిపోయినందుకు, నాకు చాలా సంతోషం కలిగింది. ఐతే, వారి వెనుకటి మిత్రులూ, ఇప్పటి సహచరులూ అహింసాపరులయ్యారనిగానీ, లేక బ్రిటీష్ ప్రభుత్వానికి భక్తులరయ్యారనిగానీ అనుకోరాదు నాకేమనిపించిందంటే, వారిలో చాలా మంది ఫాసిస్టు మనో వృత్తికి దిగజారారనిపించింది." *

నెహ్రూగారి ఆత్మకథలోని ఈ సందర్భాన్ని గురించి చర్చించేప్పుడు మనం ఒక విషయాన్ని మర్చేపోరాదు. నెహ్రూగారు దీన్ని బ్రిటీష్ శాసనకాలంలో రాశారు। అన్ని విషయాలూ స్పష్టంగా రాయడానికి అవకాశం లేదు దీన్ని వారు 1934 లోనో, లేక 36 లోనో రాశారనుకుంటాను. అప్పటికి ఆజాద్ చనిపోయాడు. ఆజాద్ చనిపోవడానికి

* 'మేరీ కహానీ' పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ. హింది ఎనిమిదవ పునర్ముద్రణ. 269 పేజీ.

కొద్దిరోజులు ముందు నేను నెహ్రూను కల్సుకున్నాను. ఆ విషయాన్ని ఆయన రాయకేను జ్ఞాపకం లేక రాయలేదనుకోవడానికి వీల్లేదు. ఎందు కంటే, 1938లో నేను వార్ధా వాలీలో కల్సుకున్నాను. అప్పటికి, వెనుక నేను తనను కల్సుకున్న విషయం జ్ఞప్తిలోనే వుంది ఆయనకు। నేనీ ఆత్మకధను 1937లో నైనీ జైల్లోవుండగా మొదటిసారి చదివాను. మమ్మల్ని ఫాసిష్టులనడాన్ని గురించి అప్పుడే బాధ పడ్డాను.

నెహ్రూను కలుసుకున్న తరువాత ఆజాద్ 'కటరా' లోని ఇంట్లో మాకావిషయాన్ని చెప్పాడు. బాధతో అతడి పెదాలువణకాయి. "నాయాల, మనల్ని ఫాసిస్టులంటున్నాడు।" అన్నాడు. ఆజాద్ ఉద్దేశం నెహ్రూను తిట్టాలనికాదు కొన్ని మాటల్ని అతడు వూతపదాలుగా వాడుతూంటాడు. గంభీరంగా మాట్లాడుకునేప్పుడుగానీ, కోపంలోగానీ ఎవర్నీ తిట్టడు. మామూలుగా మాట్లాడుకునేప్పుడు సాధారణంగా తిట్టుపదాల్ని వాడు తూంటాడు. ఆజాద్ 'నాకూ, నాసహచరులకూ దౌర్జన్యవాదం మీద విశ్వాసం పోయింది. అది నిరుపయోగం అని తెల్సుకున్నాము।' అని వుండడు. 'మేము దౌర్జన్యవాదులం కాదు. సాయుధ పోరాటానికి ప్రయ త్నిస్తున్నాము।' అనిచెప్పి వుంటాడు. నెహ్రూగారు రాసిన తరువాత పంక్తులవల్ల ఈ విషయం స్పష్టమవుతుంది 'శాంతి మార్గములోనే భారత దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని అతడు ఒప్పుకోవడానికి సిద్ధంగాలేడు. భవిష్యత్తులో సాయుధపోరాటానికి అవకాశం లభించవచ్చును అని అన్నా డతడు।' నెహ్రూగారికి ఆజాద్ మాటల్లో ఫాసిజం ఎలా కనుపించిందో అర్ధంకాదు. ప్రభుత్వపు దమననీతిమీద ఆధారపడి వుంటుంది ఫాసిజం। మేము దేశాన్ని పరిపాలించాలన్న పగటికలలు ఎన్నడూ కనలేదు. మేము బ్రిటీష్ ప్రభుత్వపు దమననీతిని లేక ఫాసిజాన్ని ఎదిరిస్తున్నాం। మూల అర్ధంలో 'ఫాసిస్టు' శబ్దం గాంధీ, నెహ్రూలకే ఎక్కువపాళ్ళు చెల్లుబాటు అవుతుంది.

నెహ్రూ తనను ఫాసిస్టు అన్నందుకు చాలా బాధపడుతూండే వాడు. అజాద్ అతడు 'సోహన్, ఒకమాటు నువ్వెళ్ళి పండిట్ నెహ్రూను కల్సుకో' అనేవాడు. ఫిబ్రవరి చివరి వారంలో శివమూర్తి సింహ్ ద్వారా నెహ్రూను కల్సుకోడానికి వీలు కల్పించుకున్నాను. సంధ్యా సమయంలో ఆనంద భవనానికి వెళ్ళాను. నేనూ, నెహ్రూగారు గోడనానుకునివున్న నిమ్మచెట్ల వరుసచాటుగా తిరుగుతూ మాట్లాడుకున్నాము. నెహ్రూ దౌర్జన్యవాదం నిరుపయోగం అయినదని చెప్పారు. నేను "మేము దౌర్జన్యవాదులంతాము. విస్తృతమైన సాయుధవిప్లవానికి ప్రయత్నిస్తూన్న విప్లవకారులం! మేమూ దేశ స్వాతంత్ర్యం కోసమే పోరాడుతూన్నాము. ప్రభుత్వ దమన నీతిని వ్యతిరేకిస్తూ, 'నీ అయుధ శక్తిని చూసి మేము భయపడము' అని బ్రిటీష్ ప్రభుత్వానికి చెప్తూన్నాము. మా ఆదర్శం సామ్యవాదం!" అన్నాను. అప్పుడే నేను రష్యా వెళ్ళబోతూన్నాననీ, ఆర్థిక సహాయం చేయవల్సిందనీ అడిగాను.

తండ్రి చనిపోయాక తమ ఆర్థికస్థితి ఏమంత బాగాలేదనీ, ఖర్చుల్ని తగ్గించడం, తిరిగి వకాలతును ప్రారంభించడంలాంటివి చేయవల్సి వస్తోన్నదనీ చెప్పారు నెహ్రూ!

"ఇలాంటి విషయాల్లో ఏ ఒక్క వ్యక్తిమీదనో ఆధారపడలేముకదా ఇలాంటి జాతీయ కార్యక్రమాలు సామూహిక సహాయంవల్లనే జరగగలవు. మీరు మీ పలుకుబడిని మాకోసం ఉపయోగించవచ్చు!" అన్నాను.

"దౌర్జన్యపూరిత కార్యక్రమాలకు నేనేమీ సాయం చెయ్యను. ఐతే, రష్యా వెళ్ళడాన్ని గురించి ఆలోచిస్తాను!" అన్నారు నెహ్రూ. నన్ను రష్యాగానీ, లేక మరే విదేశమైనాగానీ వెళ్ళవల్సిందని సలహా ఇచ్చారు. రష్యా వెళ్ళడానికి ఎంత అవసరం అవుతుందని అడిగారు. నేను "ఇంచుమించు ఐదారువేలు అవసరం అవుతాయి!" అన్నాను.

"అబ్బో....చాలా అవుతుంది ఇంత సర్దడం కష్టం! సరే, ఎంత వీలైతే అంత! శివమూర్తి సింహ్‌ద్వారా కబురు పెడతా"నన్నారు నెహ్రూ

తిరిగివచ్చి జరిగిందంతా ఆజాద్‌కు చెప్పాను. ఆజాద్ సంతృప్తి పడ్డాడు. నేనూ, సురేంద్రపాండే రష్యా వెళ్ళడం నిశ్చయమయింది. రాజధన్‌సింహ్ సహాయంతో సరిహద్దునుదాటి రష్యా వెళ్ళాలనుకున్నాము. కాంగ్రెసుకూ, ఇంగ్లీషు ప్రభుత్వానికీ రాజీకుదిరి కొన్నాళ్ళపాటు సాయుధ పోరాటాన్ని ఆపవల్సివస్తే, ఆజాద్ కూడా, ప్రకాశవతిని వెంటపెట్టుకుని అదే మార్గాన రష్యా వచ్చేస్తాడు. రష్యా వెళ్ళడాన్ని గురించి ప్రకాశ వతితో ఆజాద్ ముందే మాట్లాడాడు.

మూడవరోజు ననుకుంటాను శివమూర్తిసింహ్ పదిహేనువందలు తెచ్చి యిచ్చాడు. మిగిలిన వాటికోసం నెహ్రూగారు ప్రయత్నిస్తున్నారు అన్నాడు 'కటరా'లోని ఇంట్లోకి వచ్చి ఆ డబ్బును ఆజాద్‌కు ఇవ్వ బోయాను. "నీ దగ్గరే వుంచు!" అన్నాడతడు. ఒక్కరి దగ్గరేవుంటే, ఏ ప్రమాదమైనా సంభవించినప్పుడు మొత్తం డబ్బుకూడాపోయే ఇబ్బంది వుంది. అందుకని ఐదువందల రూపాయలు ఆజాద్ జేబులో బలవంతానా పదేశాను. ఆ రాత్రంతా రష్యా వెళ్ళడం గురించే మాట్లాడుకున్నాం!

క్రొత్త ప్రదేశాలగుండా ప్రయాణం, అనేకమైన అనారోగ్యాలు రావచ్చును. కొన్ని మందులు తీసుకోవడం మంచిదనుకున్నాం! పంజా బులో చలి విపరీతం, రెండు స్వెటర్లు కూడా తీసుకోవాలనుకున్నాం. చౌక్‌కు బయల్దేరాం.

ఆజాద్ "నేను అల్‌ఫ్రేడ్‌పార్కులో ఒక మిత్రుణ్ణి కల్సుకోవాలి. నేనూ అంతవరకూ వస్తాను. మీరు పైకి వెళ్ళిపోదురుగాని!" అన్నాడు.

నేనూ, పాండే, ఆజాద్ - మేము ముగ్గురం సైకిళ్ళమీద అల్ ఫ్రేడ్‌పార్కు ముందునుంచి వెళ్తున్నాం. సుఖదేవరాజు సైకిల్ వేసుకుని

పార్కులోకివెడుతూ కనుపించారు. ఆజాద్, రాజును కల్సుకోడానికి వచ్చారుగావును అనుకున్నాను. మమ్మల్ని విడివిడిగా కల్సుకునేవాడు ఆజాద్ అతడు పార్కులోకి వెళ్ళాడు. నేనూ, పాండే నేరుగా చౌక్‌కు వెళ్ళాం!

చౌక్‌కువెళ్ళి అవుసరం అయిన మందులు తీసుకున్నాం. ఒక దుకాణంలో రెండు స్వెట్లర్లు కొంటున్నాం. ఇంతలో ప్రజల అరుపులు వినిపించాయి. "కంపనీబాగ్ (అల్‌ఫ్రేడ్‌పార్కు) లో కాల్పులు జరుగుతూన్నాయి!"

పాండే గాభరపడ్డాడు. వాళ్ళను అడిగాడు. "ఏమైంది? ఎవరు కాల్చుకుంటున్నారు?"

అల్‌ఫ్రేడ్ పార్కులో కాల్పులన్న మాట విని నేనూ కంపించిపోయాను. కానీ, పాండే చేయిపుచ్చుకుని "ఉద్రేకపడకు!" అని చెప్పాను. పార్కులో కాల్పులనేప్పటికే మాకు అర్థమైంది. పాండేను ఉద్రేకపడవద్దని చెప్పాను, కానీ, నేనే ఆగలేకపోయాను. సైకిల్‌ని వెనక్కి తిప్పి "నేను అక్కడికే వెడుతూన్నాను!" అన్నాను.

"నామాట విను!'' పాండే సైకిల్ హేండిల్ పట్టుకుని చెప్పాడు. "వార్త ఇక్కడికి వచ్చేసరికే అంతా అయిపోయి వుంటుంది. కొంచెం తెలివిగా ప్రవర్తించు. నువ్వెళ్ళి ఏం చేయగలవు?.... నీకు పీపై పోలీసులకు పట్టుపడడం జరుగుతుంది!''

పాండే అన్నమాట నిజమే! నేనువెళితే పోలీసులకు చేచేతులావప్పగించుకోవడం అవుతుంది!

కళ్ళముందు చీకట్లు వ్యాపించినట్టయింది. ఐనా, మేము ఆగలేకపోయాము. కాసేపు అటూ - ఇటూ తిరిగి పార్కు దగ్గరకు వెళ్ళనే వెళ్ళాము. రోడ్లమీద ప్రజలు గుంపులు గుంపులుగా నిలబడి వున్నారు. పోలీసులు ప్రజల్ని పార్కులోకి పోనీయడం లేదు. విప్లవ

కారులూ పోలీసులూ కాల్చుకున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇద్దరు విప్లవకారులను ఓలరకవై మందిదాకా పోలీసులు చుట్టుముట్టారని చెప్పారు. ఇంక సందేహానికి తావెక్కడిది? విప్లవకారులు చెట్టుకిందకూచుని మాట్లాడుకుంటున్నారు. పోలీసులు వాళ్ళను చుట్టుముట్టి లొంగిపోవల్సిందని హెచ్చరించారు ఉభయులూ కాల్చుకున్నారు।

అప్పట్లో యు.పి. పోలీసు ఇనస్పెక్టరు జనరలు హాలిన్స్। అతడు 'Men Only' ఇంగ్లీషు పత్రిక 19 4 అక్టోబరు సంచికలో, భారతదేశంలోని తన ఉద్యోగానుభవాల్ని రాశాడు. అందులో 'ఆజాద్ – పోలీసులు' అన్న శీర్షికతో ఈ పోరాటాన్ని వర్ణించాడు. ఆజాద్ కాల్చిన మొదటి గుండు ఇంగ్లీషు పోలీసు సూపరింటెండెంట్ నాట్‌బావర్ జబ్బకు తగిలింది. పోలీసులు చెట్లగుబుర్ల చాటున దాక్కొని ఆజాద్‌మీద, అతని సహచరునిమీదా కాల్పులు జరుపుతూన్నారు. పోలీసు ఇనస్పెక్టరు విశ్వేశ్వరసింహ్ గురి చూసుకోడానికి ఒక పొదచాటునుండి తొంగిచూశాడు. అప్పటికి ఆజాద్ శరీరానికి రెండు మూడు గుండ్లు తగిలాయి. రక్తం బాగా కారిపోయింది. ఆ స్థితిలోనూ అతడు తొంగిచూస్తూన్న విశ్వేశ్వరసింహ్ దవడకు గురిచూసి కాల్చాడు. విశ్వేశ్వరసింహ్ దవడ ఎగిరిపోయింది. హాలిన్స్ తన లేఖలో ఆజాద్ కాల్చిన ఈ కాల్పును ప్రశంసిస్తూ 'ఇది ఆజాద్ కాల్చిన చిట్టచివరి కాల్పు। ఐతే, బహు ప్రశంసాయోగ్యమైన కాల్పు!' అని రాశాడు.

హాలిన్స్, ఆజాద్ పోలీసుల తుపాకి కాల్పులవల్ల చనిపోయాడని రాశాడు. కానీ, ఆ పోరాటాన్ని కళ్ళారాచూసిన ప్రజలు మరో రకంగా చెప్తూన్నారు. ప్రజాకథనాన్ని అనుసరించి, ఇద్దర్లో ఒకడు గాయపడ్డా పోరాడుతూనే వున్నాడు. రెండవ అతడు పారిపోయాడు. పోరాడుతున్న విప్లవకారుడు చివరి గుండును తనకతడు కాల్చుకున్నాడు. అతడు పడిపోయాక కూడా పోలీసులు అతడిని సమీపించడానికి సాహసించలేక

పోయారు. ఆ తరువాత కూడా అతడి శరీరంమీద చాలా కాల్పులు జరి పారు. చనిపోయాడని పూర్తిగా నిశ్చయం అయ్యాకనే శవాన్ని సమీపిం చారు. పోలీసులు శవాన్ని వ్యానులో వేసుకువెళ్ళారు. అప్పుడు ఆజాద్ జేబులో ఐదువందల రూపాయల నోట్లువున్నాయని ప్రభుత్వం ప్రకటిం చింది. ఆ డబ్బు నెహ్రూగారు పంపించిన పదిహేనువందల్లోది!

అలహాబాదులోని కాంగ్రెసువారు, జాతీయభావంగల ఇతర ప్రజలు ఆజాద్ అంతిమ సంస్కారాన్ని సగౌరవంగా జరపాలనుకున్నారు. నెహ్రూగారి భార్య కమలానెహ్రూ, పురుషోత్తమదాసుటండన్‌గారూ-పోలీ సుల నుంచి శవాన్ని తీసుకోడానికి చాలా ప్రయత్నించారు. శవాన్ని ఇవ్వడానికి పోలీసులు పేచీపెడుతూన్నారు. చివరకు ఒకవ్యక్తిని ఆజాద్‌కు సోదరుడని చెప్పి, అతడిచేత శవాన్ని అడిగించాము. శవాన్ని చూశాము. కుడికణతవ పిస్తోలు దెబ్బవుంది. ఆ దెబ్బకు చుట్టూవున్న వెంట్రుకలు కాలిపోయాయి. గుండు దూరాన్నుండివచ్చితగిల్తే అలా కాలాల్సిన పని వుండదు. పిస్తోల్ని కణతకు ఆనించుకు కాల్చుకున్నప్పుడే అలా వెంట్రు కలు తగలడతాయి. దహన సంస్కారం గంగాతటాన జరిగింది. ఊరే గింపును ప్రభుత్వం నిషేధించినప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు పోగ య్యారు. చితాభస్మాన్ని చిటికెడుకూడా మిగులకుండా శ్రద్ధాళువులైన ప్రజలు తీసుకువెళ్ళారు!

మరుసటి రోజునుంచే జాతీయ వీరుడి స్మృతి చిహ్నమైన అల్ ఫ్రేడ్ పార్కులోని ఆచెట్టును ప్రజలు పూజించసాగారు. మామకు చాలా గుండ్లు తగిలాయి. లోపలికీ గుచ్చుకుపోయాయి. ప్రజలు ఆ చెట్టును పసుపు, కుంకం - పూలతో, ధూపదీపాలతో పూజించసాగారు. బ్రిటీష్ ప్రభుత్వం దీన్ని సహించలేకపోయింది. కొన్నాల్టికి పూజించే ప్రజల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం ఆచెట్టును కొట్టేయించింది. ఐతే, ప్రజలు ఊరుకోలేదు. అల్‌ఫ్రేడ్ పార్కును, ఆజాద్‌పార్కు అని పిలవసాగారు.

ఈ పేరే ఆపార్కుకు స్థిరం అయిపోయింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ పార్కులకూ, చౌకులకూ ఆజాద్ పేరు పెట్టుకున్నారు. ఎన్నో 'ఆజాద్ పార్కులు' 'ఆజాద్ చౌకులు' వెలిశాయి.

పార్కులోనుండి పారిపోయిన మిత్రుడు సుఖదేవ్‌రాజు! నాకూ, ఇతరమిత్రులకుకూడా అతడి ఈపని చాలా గర్హనీయమైందనిపించింది. ఆజాద్ పోరాడుతూండడంవల్ల పోలీసుల దృష్టి అతడిమీద కేంద్రీకరించబడింది. ఇతడు పారిపోవడానికి అవకాశం దొరికింది. పోలీసుల దృష్టి ఎంత ఆజాద్‌మీద కేంద్రీకరింపబడి వున్నప్పటికీ పారిపోతూన్న సుఖదేవరాజును ఎవరూ కాల్చకపోవడం విస్మయాన్నే కలిగిస్తుంది.

1938లో దీన్నిగురించి సుఖదేవరాజుతో మాట్లాడడం జరిగింది. ఆజాదే తనతోటి 'నేను పోరాడుతాను. నువ్వు తప్పించుకోడానికి ప్రయత్నించు!' అన్నాడని చెప్పాడు సుఖదేవరాజు. కనుకనే పారిపోయానన్నాడు. ఆజాద్ అలాఅనడం చాలా సహజం! కానీ, 'మిత్రుడి' కర్తవ్యం అదేనా? ఆ సంవత్సరమే మే నెల్లో ఇతడూ లాహోరులో అరెస్టయ్యాడు. అప్పుడూ ఇలాగే జరిగింది. మిత్రుడు జగదీశ్, సుఖదేవ్‌రాజు శాలీమార్ బాగ్‌లో వుండగా పోలీసులు చుట్టుముట్టారు. జగదీశ్ పోరాడుతూ ప్రాణాలర్పించాడు. ఇతడు పారిపోవడానికి ప్రయత్నించి, అవకాశంలేకపోవడంవల్ల ఆయుధాల్ని కింద పడేసి లొంగిపోయాడు. జైల్లో ఇతడివి రెండవ లాహోరు కుట్రకేసు అభియుక్తులతోపాటు వుంచారు. కానీ, ఇతడు తోటిమిత్రులతో వుండలేక దరఖాస్తుపెట్టుకుని విడిగావుంచే ఏర్పాటు చేయించుకున్నాడు.

ఆ సమయంలో ఆజాద్ అల్‌ఫ్రేడ్ పార్కులోవున్నాడని పోలీసులకు ఎవరు ఉప్పు అందించారు? అనేది పెద్దసమస్య అయింది. సుఖదేవరాజు మరోవిషయం చెప్పాడు. తనూ, ఆజాద్ మాట్లాడుకుంటూ ఉండగా పార్కుకు అవతల మేయోకాలేజీ రోడ్డుగుండా వెళుతున్న ఒక

వ్యక్తిని చూపించి ఆజాద్ ఇలా అన్నాడుట "ఆ వెళుతున్న వ్యక్తి వీర భద్రతివారీలాగా ఉన్నాడు. మనల్ని చూశాడేమో!"

అప్పటివరకూ సుఖదేవరాజు వీరభద్రతివారీని చూడలేదు. కనుక ఆ వెళుతున్నది వీరభద్రతివారీ ఔనో కాదో సుఖదేవరాజు నిర్ణయించలేక పోయాడు. ఇదే విషయాన్ని సుఖదేవరాజు ఇతర మిత్రులకూ చెప్పాడు. ఇతని మాటల ఆధారంగా వీరభద్రతివారీయే ఉప్పు అందించాడు అనుకొన్నారు. ఈ అనుమానంతోనే వీరభద్రతివారీని కాల్చటమూ జరిగింది. ఐతే తప్పించుకొని బతికిపోయాడు.

కొందరు వైశంపాయన్ అందించాడనీ, మరికొందరు నిగమ్ అందించాడనీ, రామరథ్‌సింహ్ అందించాడని ఇంకొందరూ అనుకున్నారు. ఐతే బ్రిటీష్‌వారు దేశాన్నివదిలి వెళ్ళాక కాంగ్రేసు ప్రభుత్వాలు ఏర్పడ్డాక ఈ విషయాన్నిగురించి నిజాన్ని తెలుసుకోవడానికి అనేకరకాలుగా ప్రయత్నించటం జరిగింది. ఆవెనుకటి ఉద్యోగులు ఇప్పుడు రిటైరై పోయారు. వాళ్ళల్లో కొందరికి ఆనాటిదాడితో దగ్గర సంబంధం ఉంది. లభించిన రికార్డుల్నిబట్టి, ఆనాటి ఉద్యోగులిచ్చిన వివరాల్నిబట్టి మనం యిలా చెప్పుకోవచ్చు.

సి. ఐ. డి. విశ్వేశ్వరసింహ్, కోర్టు ఇనస్పెక్టర్ డాల్‌చంద్ - వీరిద్దరూ ఆరోజు ఉదయం వాహ్యాళికి వెళ్ళి తిరిగివస్తున్నారు. పార్కులో నుంచి వస్తూన్న వీరికి ఆజాద్, సుఖదేవరాజ్ చెట్టుకింద కూర్చొని మాట్లాడుకొంటూ కన్పించారు. వీళ్ళను చూసి విశ్వేశ్వరసింహ్ ఇలా అన్నాడు "ఆమనిషి ఆజాద్‌లా ఉన్నాడు?"

1920 నాటికి ఆజాద్ 13, 14 ఏళ్ళ కుర్రవాడు. సహాయ నిరాకరణోద్యమంలో మహోత్సాహంగా పాల్గొన్నాడు. 12 పేముబెత్తపు దెబ్బల శిక్షను అనుభవించాడు. నలుగురి దృష్టికీ ఎక్కాడు. అప్పుడు విశ్వేశ్వరసింహ్ కాశీలోనే పోలీసు ఇనస్పెక్టరుగా పనిచేస్తున్నాడు.

అప్పుడతడు ఆజాద్‌ని చూశాడు. ఐతే గడచిన 11, 12 ఏళ్ళలోనూ మళ్ళీ అతడు ఆజాద్‌నుచూడలేదు. ఐనప్పటికీ బలిష్టమైన ఆజాద్‌రూపం అతని స్మృతిపథంలో ఉంది. పైగా ప్రతిచోటా ప్రభుత్వ ప్రకటనలలో ఆజాద్ చిత్రం ఉండేది. బలిష్టమైన శరీరం, చామనచాయరంగు, స్ఫోటకం మచ్చల ముఖము ఇవన్నీకలిసి విశ్వేశ్వరసింహ్ స్మృతిపథంలో ఆజాద్ ఆకారం మెదులుతూనేఉంది. కనుకనే చెట్టుకింద కూర్చున్న ఆజాద్‌ను కొంతలో కొంత పోల్చుకుని డాల్ చంద్‌తో ఇలా అన్నాడు. "వాళ్ళద్దర్నీ కనిపెట్టిఉండు. నేను ఇప్పుడే వస్తాను."

విశ్వేశ్వరసింహ్ దగ్గరలోనేవున్న సి ఐ డి. పోలీస్ సూపరింటెండెంట్ నాట్ బావర్ బంగళాకువెళ్ళాడు. "పార్కులో ఒకవ్యక్తి కూర్చొని ఉన్నాడు అతడు ఆజాద్‌లా ఉన్నాడు" అని చెప్పాడు నాట్‌వబార్‌తో.

కాల్పులు జరిగిన మరుసటిరోజు ఉదయమే అలహాబాదు నుంచి వెలువడే 'లీడర్' అనే పత్రికకు నాట్‌బావర్ కొంత సమాచారాన్ని ప్రకటన నిమిత్తం ఇచ్చాడు. ఆ ప్రకటనతాలూకు కటింగ్ ఇప్పటికీ నా దగ్గరవుంది. నాట్‌బావర్ చెప్పినదాన్నిబట్టి, అతడికి పార్కులో ఆజాద్ లాంటి వ్యక్తి ఉన్నాడని మాత్రమే తెలిసింది. అప్పటికే ఆజాద్‌లాంటి వ్యక్తుల్ని ఇద్దర్ని అరెస్టుచేయడమూ తరువాత వదలిపెట్టడమూ జరిగింది.

విశ్వేశ్వరసింహ్ సమాచారాన్ని అందించగానే నాట్‌బావర్ పిస్తోలు జేబులోపెట్టుకొని బయలుదేరాడు. అతడివెంట ఇద్దరు బంట్రోతులూ ఉన్నారు. అతడే స్వయంగా కారు నడుపుతున్నాడు. డాల్‌చంద్ చెట్టుక్రింద మాట్లాడుకుంటున్న విప్లవకారుల్ని గమనిస్తూన్నాడు.

నాట్‌బావర్ రోడ్డుమీద కారుఆపాడు. కారుదిగి పిస్తోలుచేతబుచ్చుకొని విప్లవకారులవైపు బయలుదేరాడు. అతడికీ, విప్లవకారులకూ 25, 30 అడుగుల దూరంమాత్రమే ఉంటుంది. ఆజాద్, నాట్‌బావర్‌ని చూడగానే తనూ పిస్తోల్‌ని తీశాడు. దాదాపుగా ఇద్దరూ ఒకేమారు కాల్పులు

ప్రారంభించారు. నాట్‌బావర్ కాల్చిన మూడవగుండు ఆజాద్ తొడకు తగిలింది. సరీగా అదేసమయంలో ఆజాద్ కాల్చిన గుండు నాట్‌బావర్ జబ్బకు తగిలింది. అప్పుడే సుఖదేవరాజ్ పారిపోయివుంటాడు. ఇంక ఆజాద్ చెట్టును చాటుచేసుకున్నాడు. నాట్‌బావర్ పొదల్ని, మొక్కల్ని చాటుచేసుకున్నాడు విశ్వేశ్వరసింహ్ నిరాయుధుడుగా ఉన్నాడు అనుకో కుండా అదేసమయంలో బ్రిటీష్ ప్రభుత్వపు నమ్మినబంటు ఒకడు జోతు గుళ్ళ తుపాకీని పట్టుకుని వెళుతున్నాడు విశ్వేశ్వరసింహ్ అతడిదగ్గర తుపాకీ తీసుకుని ఒకపొదను చాటుచేసుకుని ఆజాద్‌మీద కాల్పులు ప్రారంభించాడు. ఆజాద్ ఇద్దరిమీదా కాల్పులు సాగిస్తున్నాడు. అతడి శరీరానికి మూడు నాలుగు గుళ్ళు తగిలాయి అప్పటికీ మంచి తెలివిగా పోరాడుతున్నాడు. అదే సమయంలో విశ్వేశ్వరసింహ్ గురిచూసు కోవ డంకోసం పొదలమీదుగా తలపైకి పెట్టాడు వెంటనే ఆజాద్ గురిచూసి కాల్చాడు. విశ్వేశ్వరసింహ్ దవడ ఎగిరిపోయింది తరువాత హాలిన్స్ ఆజాద్ కాల్చిన ఈ కాల్పును గొప్పగా ప్రశంసించాడు.

ఆజాద్ తన పిస్తోలులోని చివరి గుండును తాను ఎప్పుడూ చెపు తున్నట్లే కణతకు గురిపెట్టి కాల్చుకున్నాడు.

కాల్పులు ప్రారంభం కాగానే డాల్‌చంద్ పరుగెత్తుకెళ్ళి పోలీసు స్టేషనుకు ఫోన్ చేశాడు. పోలీసులు పెద్దసంఖ్యలో లారీలో వచ్చారు. పార్కులో జనం గుంపులు గూడడంచూసి ఆజాద్ శవాన్ని లారీలో వేసు కొని వెళ్ళారు. అప్పటికీ చనిపోయింది ఎవరో పోలీసులకు స్పష్టంగా తెలియదు. వెంటనే బెనారస్‌కూ ఝాంసీకి ఫోన్ చేశారు. ఆజాద్‌ను గుర్తుపట్టగల వ్యక్తుల్ని పిలిపించారు. వాళ్ళు చనిపోయింది ఆజాదేనని స్పష్టంగా చెప్పారు. ఆ తరువాతనే లీడర్ మొదలైన స్థానిక పత్రికల్లో ప్రకటన వెలువడది. దీన్నిబట్టి పోలీసులకు ముందుగా అతదే ఆజాద్

అని తెలియదు. తెలిసివుంటే మొకాటే తగినంత మంది సాయుధులైన పోలీసుల్ని తీసుకు వెళ్ళేవాడుకదా నాట్‌బావర్?

ఆజాద్ విషయంలో విశ్వాసఘాతుకం జరిగిందనటానికి అవకాశం లేదు

ఆజాద్ చనిపోయాక కొద్దిరోజులవరకూ కొత్తనాయకుడెవరో నిర్ణయించుకోలేని స్థితిలోపడ్డాం। మిత్రులు సురేంద్రపాండేనూ, నన్నూ సలహాలు సంప్రదింపులూ అడిగేవారు కాశీరాం కూడా చాలా రోజులుగా పార్టీలో పనిచేస్తున్నాడు. కైలాసపతి ప్రభుత్వసాక్షి అయ్యాక కాశీరాం మీదా వారెంట్ పట్టింది. ఈ స్థితిలో ఏమిచేయడం? అన్నది మాలో పెద్ద ప్రశ్నగా తయారయింది. ఏం చెయ్యాలన్నా డబ్బుది సమస్య. నేను ప్రమాదాల్ని వరించడంలో వెనుక పడలేదుగానీ దోపిడీ చేయడానికి మాత్రం అంగీకరించడం లేదు. అప్పుడే లెనిన్ జీవితమూ, మరికొన్ని గ్రంథాల్ని చదవడం జరిగింది. సిద్ధాంతరీత్యా మిత్రుల్ని చైతన్యవంతుల్ని చేయుటం అవసరమనీ, పటిష్టం చేయుటం అవసరమనీ నేనూ, సురేంద్ర పాండే అనుకున్నాం. కాన్పూరులోగానీ, అలహాబాదులోగానీ ఉన్నప్పుడు ఆజాద్, మేము ఈ విషయమై మాట్లాడుతూ ఉండేవారం. ఆజాద్‌కుకూడా సిద్ధాంతరీత్యా పటిష్టమవడం ప్రజలతో సంబంధాలను పెంచుకోవడం ఇష్టమే మేము ఒకచిన్న ప్రస్‌నూ పెట్టాలనుకున్నాం. సిద్ధాంత సంబంధమైన కరపత్రాలను, చిన్నచిన్న పుస్తకాలను వేయడానికి। ఆ ప్రస్‌లో పనివాళ్ళందరూ మిత్రులే అయి ఉంటారు. ఐతే, కొందరికి ఇలా ప్రస్ పెట్టాలన్న భావన నచ్చలేదు.

పార్టీని పునర్నిర్మించాలని అందరం అనుకుంటున్నాం. ఐతే, నాయకుడెవరు? ఎవరి ఆజ్ఞానుసారం సంఘటితమవ్వాలి? నిర్ణయించుకోలేక పోతున్నాం. అప్పట్లో కాశీరాం, భవానీసహాయ్ మొదలైన మిత్రులతో

నాకు సంబంధాలు ఎక్కువగా ఉండేవి. నేను మీరట్ వెళ్ళిపోయాను. సురేంద్రపాండే కాన్పూరులోనే ఉంటున్నాడు. భవానీసింహ్ మొదలుగా గల మిత్రులతో అతడి పరిచయం దృఢతరమైంది.

అప్పుడు అలహాబాదులోని 'కటరా'లోని ఇంటిలో ఆజాద్‌తోపాటు నేనూ, సురేంద్రపాండే, భవానీసింహ్ వుంటున్నాము. అలహాబాదులో వున్న మేమే కాకుండా కాన్పూరూ, మీరట్, ఢిల్లీ-మొదలైన పట్నాల్లో ఇంకా కూడా మిత్రులు వున్నారు. వాళ్ళందర్నికాదని నేనూ, సురేంద్ర పాండే మాత్రమే రష్యా వెళ్ళలేము. కనుక, ఒకరకంగా మా రష్యా ప్రయాణం ఆగిపోయింది! నెహ్రూగారు మాకు డబ్బులిస్తానన్నది మా విప్లవ కార్యక్రమాల కోసంకాదు; మేము రష్యా వెళ్ళడంకోసం వారు ఇస్తామన్నారు. మా ప్రయాణమే ఆగిపోయాక వారిని డబ్బు అడిగే పనే ముంటుంది? ఆ తరువాత శివమూర్తిసింహ్‌ను కల్సుకోనేలేదు. నా దగ్గర వున్న వెయ్యి రూపాయలూ మిత్రుల తాత్కాలిక అవసరాలకు ఖర్చయి పోతూన్నాయి. దుర్గాభాభీ కోసంగానీ, సుశీలాదీదీకోసంగానీ మేమేమీ చేయలేదు. అప్పుడు మాకూవాళ్ళకూ బొత్తిగా సంబంధం లేకండావుంది. ఆజాద్ మృత్యువు మాలో ప్రతి ఒక్కర్నీ అత్యంతఆత్మీయుణ్ణి పోగొట్టు కున్నవాళ్ళలా బాధించింది. కాన్పూరువెళ్ళి ఈ విషయం ప్రకాశవతికి చెప్పాలనుకున్నాను. తీరాఅక్కడికి వెళ్ళాక దుఃఖావేశంవల్ల నోటమాటే రాలేదు. ఆజాద్ పోయాడన్న వార్తవిని ప్రకాశవతి పసిపిల్లలా భోరున ఏడిచింది. పార్టీ సభ్యులందరికీ ఆజాద్‌తో వ్యక్తిగత సంబంధాలుండేవి. అతడు పోయాక మిత్రులందర్ని కూడ కట్టుకురావడం పెద్ద సమస్య అయింది! చదువుసంధ్యల్లేని ఆజాద్ వ్యక్తిత్వంలోని గొప్పతనం అతడు పోయాకగానీ మాకు అర్థంకాలేదు!

# 17. భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - ఉరి!

1931 మార్చి 23వ తారీకున భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు- వీర్ని లాహోరు జైల్లో ఉరితీశారు. ఈ సందర్భంగా దేశమంతటా హర్తాళ్ళు జరిగాయి. అప్పటికి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, కాంగ్రేసు-ముస్లిములీగుల మధ్య ద్వేషాగ్నిని బాగా రగల్చగలిగారు. ముస్లిములకు, కాంగ్రేసువారు హిందూ ప్రభుత్వాన్ని స్థాపించనున్నారన్న భావన ఏర్పడింది। ముస్లింలీగ్, సాంప్రదాయక ముస్లిములు - పోటీలో వెనుక పడకుండా వుండగలందులకు ఇంగ్లీషు ప్రభుత్వానికి విశ్వాస పాత్రులవుతూన్నారు. కాన్పూర్‌లో హరతాళ్ చేయించడంలో కాంగ్రేసు ప్రముఖ పాత్ర వహించింది. పోలీసులు రెచ్చగొట్టడంతో, కొందరు ముస్లిములు కాంగ్రేసును ఉడికించడానికి హర్తాల్ చేయము అన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి కృపాపాత్రులవడానికి ఇది మంచి అదును హర్తాళ్‌లో పాల్గొనకపోవడం జాతీయ వీరుల్ని అవమానించడంగా సాధారణ ప్రజలు భావించారు. ప్రజలు అమర వీరుల్ని అవమానపరచడం ఎప్పుడూ సహించరు. ఈ కారణంగా హిందూ ముస్లిము కొట్లాటలు చెలరేగాయి. ఈ కొట్లాటల్లోనే గణేశ్‌శంకర విద్యార్థి మతపిచ్చిలో అంధులైన ముస్లిములచేత హత్య చేయబడ్డాడు।

* * * * * *

1929, 30, 31 సంవత్సరాల్లో 'ఇంకిలాబ్ జిందాబాద్' 'భగత్సింగ్‌కి జై !' అన్న నినాదాలు భారత ప్రజల్లో అత్యధిక ప్రచారంలో వున్నాయి. ఆ రోజుల్లో పై నినాదాలకున్న ప్రచారం 'గాంధీకీజై' అన్న

వినాదానికి కూడా లేదంటే అతిశయోక్తి కాదు। కాంగ్రేసు పార్టీలోని సాధారణ సభ్యులు 'బ్రిటీష్ ప్రభుత్వంతో సంప్రతించేప్పుడు 'భగత్సింగ్కూ, అతడి మిత్రులకూ విధించబోయే ఉరిశిక్షను రద్దుచేయా'లన్న షరతును కూడా చేర్చవల్సిందని గాంధీగారిని అడిగారు కానీ, గాంధీగారు, ఈ సమస్యను ఒకషరతుగా వైస్రాయి ముందుంచడానికి నిరాకరించారు. ఏమైనప్పటికీ ప్రజల వాంఛను ఇంతగా నిర్లక్ష్యం చేస్తారని ఎవరూ అనుకోలేదు. ఉరిశిక్ష రద్దవుతుందనే అందరూ ఆశించారు. ఆంగ్ల ప్రభుత్వం దీన్ని తన గౌరవానికీ, సామర్ధ్యానికీ సంబంధించిన ప్రశ్నగా భావించింది. భగత్సింగునూ, అతడి మిత్రులనూ ఉరితీశాక ప్రజల హృదయాలు ఘోర ఆఘాతానికి గురి అయ్యాయి. ఆ వీరుల సమస్యకు గాంధీగారు తగిన ప్రాధాన్యతను ఇవ్వకపోవడంవలనా ప్రజల హృదయాలు క్షోభపడ్డాయి. గాంధీగారు ఆంగ్లప్రభుత్వంతో రాజీపడడానికి పన్నెండు షర్తులు వైస్రాయి ముందుంచారు వాటిల్లో ఒకటి ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని పెట్టాలనేది. కానీ, భగత్సింగ్, అతని సహచరులను వదలిపెట్టాలన్న షర్తు మాత్రం ఆ పన్నెండింటిలో లేదు. ప్రజలమీద పర ప్రభుత్వశక్తిని ఉపయోగించి మద్యపాన నిషేధాన్ని అమలుపరచడం నైతికంగా సమర్ధనీయచర్యగా భావించారు గాంధీగారు. కానీ, భగత్సింగ్ - మిత్రుల పురిశిక్షలను రద్దుచేయడానికి, ప్రజాశక్తి ఆధారంగా పర ప్రభుత్వంమీద వత్తిడి తేవడం అనైతికమైన విషయంగా భావించారు। కనుకే, 1931 మార్చి చివరి వారంలో కరాచీలో జరిగిన కాంగ్రేసు సభలో గాంధీగారికి నల్లనిపూలు కానుక ఇచ్చారు. నల్లజండాలు చూపించారు। ప్రజల హృదయాలు వివశంగా ఘూర్ణిల్లాయి. పరప్రభుత్వంమీద ద్వేషం పెల్లుబికింది. తమ ప్రియతమ వీరులమీద ఎన్నో అతిశయోక్తితోకూడిన కథలల్లి ప్రచారం చేసుకుని తృప్తిపడ్డారు ప్రజలు।

* * * * * *

భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - వీర్ని ఉరితీసేప్పుడు, రెండవ లాహోరు కుట్రకేసుకు సంబంధించిన నిందితులు సర్దార్‌సింగ్, జహంగీరీ లాల్, జై ప్రకాశ్, ధర్మపాల్ _ వీరూ లాహోరు సెంట్రల్ జైలులోనే వున్నారు. వీళ్ళగదులు ఉరిశిక్షపడ్డ భగత్సింగ్ మొదలైనవారి గదులకు దగ్గర్లోనే వున్నాయి ఎప్పుడైనా ఒకరికి ఒకరు ఎదురు పడడమూ కద్దు. మాట్లాడుకోవడమూ జరుగుతూ వుండేది. తమ గదుల్లోంచీ కూడా కేక వేసి పలకరించుకోవచ్చును. కాపలావాళ్ళూ, వార్డర్లూ వార్తల్ని, తినుబండా రాల్ని ఒకరినుంచీ మరొకరికి చేరవేస్తూ వుండేవారు. ఈ మిత్రుల కథ నం ప్రకారం, భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - చివరి క్షణం వరకు ఆరోగ్యకరమైన మానసిక స్థితిలోనే ఉన్నారని తెలుస్తున్నది. తమ ఆద ర్శంకోసం బలౌతూన్నందుకు వాళ్ళు ఎంతో తృప్తిగా వున్నారు. అప్పట్లో ఒకే ఒక విషయం భగత్‌సింగ్ మనస్సును బాధించింది. అది ఏమిటంటే, అతడి తండ్రి సర్దార్ కిషన్‌సింగ్ పుత్రప్రాణ భిక్షకోసం గవర్నర్‌కు ప్రార్థనాపత్రం పంపుకున్నాడు; గవర్నర్ ఆ ప్రార్థనను ఎటూ అంగీక రించలేదు కాగా, తండ్రి అలా చేసినందుకు భగత్సింగ్ ఎంతో అవ మానాన్ని పొందాడు తండ్రి పెట్టుకున్న ప్రార్థనాపత్రాన్ని గురించి విని ఖిన్నస్వరంలో భగత్సింగ్ ఇలా అన్నాడు. "My father has stabed me in the back." (తండ్రే నన్ను వెన్నులో కత్తితో పొడిచాడు)

1931 సంవత్సరం మార్చి 24వ తారీకు మిత్రుల్ని ఉరితీయ డానికి నిశ్చయింపబడ్డది. ఆ సమయంలో ప్రజలు ప్రదర్శనలు జరప వచ్చు. ప్రజలు శవాల్ని తీసుకుని ఊరేగింపు జరపవచ్చు, ఇవన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకతను తెచ్చిపెట్టే చర్యలవుతాయి కనుక, గవర్నర్ యొక్క ప్రత్యేకానుమతితో, ఉరిశిక్షల్ని అనుకున్న సమయానికి ముందే అమలుజరపడం ఉచితం అనుకున్నారు జైలు అధికారులు.

మార్చి 23వ తారీకున రెండవ లాహోరుకుట్రకేసులోని విందితుల్ని మధ్యాహ్నానంతరం కోర్టునుండి జైలుకు తీసుకువచ్చారు. మూడు నాలుగు గంటలాచాయల జైల్లోని ఖైదీలందర్నీ వారివారి గదుల్లోకి పంపించి తలుపులు వేసేశారు. జైలంతా క్షుభించేస్తున్నారు. భగత్సింగ్‌గది ధర్మపాల్‌గదికి చాలా దగ్గర్లోవుంది. భగత్సింగ్ ధర్మపాల్‌ని కేకవేసి పిలిచి అడిగాడు "ధర్మా! ఇవ్వాళ కోర్టునుంచి మీరింత తొందరగా వచ్చారేం?"

"జైళ్ళ ఇన్‌స్పెక్టరు, కమీషనరు - జైల్ని చూడడానికి వస్తున్నారని అంటున్నారు!" అన్నాడు ధర్మపాల్.

"పిచ్చోడా! చూట్టానికి వాళ్ళురావడంకాదు. మేం వెళుతూన్నాం!" అన్నాడు భగత్సింగ్.

భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు-వీరి ముగ్గురికీ అప్పుడే స్నానానికి నీళ్ళు ఇచ్చారు. మరణశిక్షను పొందేవ్యక్తిని, ఉరితీయడానికి తీసుకువెళ్ళేముందు స్నానంచేయించడం ఆచారం! భగత్‌సింగ్‌కు జైలు అధికార్లలోనే ఎవరో ముందుగా ఈ విషయాన్ని చెప్పారు. జైలువార్డ మొదలైన రెండవ లాహోరు కుట్రకేసు అభియుక్తులు భగత్సింగ్ వస్తువుల్ని జ్ఞాపకార్థం అడిగారు. ఉరితీయడానికి ఒకగంటముందు అతడు తన వస్తువులన్నింటినీ_రేజరు, బ్లేడ్లు, గుండీలు, ఖాళీ అగ్గిపెట్టె - అన్నింటినీ మిత్రులకు పంచేశాడు. పై అధికారులకు అనుమానం కలగకుండా వుండడానికి తనకేమీ తెలియనట్టు మౌనంగా వున్నాడు.

సుఖదేవ్ గదిలోంచీ 'ఇంకిలాబ్ జిందాబాద్' అన్న దీర్ఘనినాదం వినిపించింది. తరువాత అతడిగదిలోంచి ఘర్షణపడుతూన్న సవ్వడి వినిపించింది. సుఖదేవ్ చేతులకు బేడీలు వేయబోతున్నారనీ, అతడు వ్యతిరేకిస్తున్నాడనీ తెల్సింది! ఉరికంబం దగ్గరకు తీసుకువెళ్ళేప్పుడు ఖైదీల చేతుల్ని వెనక్కు విరిచికట్టడం ఆచారం! సుఖదేవ్ అందుకు అంగీకరించడంలేదు. ముసలి జైలువార్డరు చతర్‌సింగ్, భగత్‌సింగ్‌ను ప్రార్థిం

చాడు "మామీద దయచూపండి, బేడీలు వేయమని ఆర్డర్ అయింది. అలావేయడం ఆచారం! వేయించుకోండి!" అన్నాడు. భగత్సింగ్ చెప్పిన మీదట సుఖదేవ్, రాజగురు-బేడీలు వేయించుకున్నారు! తరువాత జైలులోని ఇతర మిత్రుల్ని ఉద్దేశించి "సరే, మిత్రులారా వెళ్తున్నాం!" అన్నాడు భగత్సింగ్.

ఇతర మిత్రులు తమ గదుల్లోంచి 'ఇంకిలాబ్ జిందాబాద్!' అని వినాదాలుచేశారు. వీరిని అనుకరించి జైలులోని ఖైదీలందరూ 'ఇంకిలాబ్ జిందాబాద్!' అని వినాదాలు చేశారు. ఈ నినాదాలు జైలుకు ప్రక్కనేవున్న పండిత కె. సంతానంగారి బంగళాలోకి వినిపిస్తున్నాయి. ఆయనగారు ఈ నినాదాలకు కారణాన్ని ఊహించి, సర్దార్ కిషన్‌సింగ్‌కు ఫోన్‌చేశాడు జైల్లోని ఖైదీలందరూ ఉరికొయ్యవదేశబ్దాన్ని వినడానికి శ్వాస బిగబట్టుకు వింటున్నారు. ధర్మపాల్ గడియారం ప్రకారం 7 గంటల 23 నిమిషాలకు ఉరికొయ్యపడ్డ శబ్దం వినిపించింది. జైలంతా ఒక్కమాటుగా 'ఇంకిలాబ్ జిందాబాద్!' 'భగత్‌సింగ్ జిందాబాద్!' 'సుఖదేవ్ జిందాబాద్!' 'రాజగురు జిందాబాద్!' అన్న వినాదాల్తో ప్రతిధ్వనించిపోయింది. ఈ నినాదాల ప్రతిధ్వని కారణంగా అరగంటవరకు మా మిత్రులు ఎవరూ ఒకరితో ఇంకొకరు మాట్లాడలేకపోయారు. జైలు అధికారులు మా మిత్రులకు చెప్పినవార్తల్నిబట్టి, భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు-ఉరికొయ్య దగ్గరకువెళ్ళాక, సూపరింటెండెంట్‌ను 'మేము తృప్తిగా వినాదాలు ఇచ్చుకోడానికి రెండు క్షణాలు అవకాశం ఇవ్వండి! మా ఈ చిన్నికోర్కెను మీరు అంగీకరిస్తారని ఆశిస్తున్నాము!' అని అడిగారుట సూపరింటెండెంట్ రెండుక్షణాలు మౌనంగా విలబడ్డాడు.

ముగ్గురు మిత్రులూ ఒకేసారి వినాదాల్నిచ్చారు.

Long live Revolution - విప్లవం వర్ధిల్లాలి!

Down with Imperialism - సామ్రాజ్యవాదం నశించాలి!

ఆనాడు జైల్లో ఖైదీలెవరూ అన్నాలు తినలేదు. కొందరు భారతీయులైన జైలు అధికారులుకూడా ఆరోజున అన్నం తినలేదు. జైలు ఇవస్పెక్టర్ మహమ్మద్ అక్బర్ ఖాన్‌సాహబ్, రెండురోజుల తరువాత సర్దార్ కిషన్‌సింగ్‌ను కలుసుకున్నప్పుడు ఇలాఅన్నాడుట 'ఉద్యోగం అనే దాస్యం చేస్తూన్నాం గనుక ప్రభుత్వ ఆజ్ఞల్ని పాటించక తప్పదు. కానీ, మనస్సు చాలా బాధపడ్డది. అన్నంముందు కూచుంటే పురుగుల్ని చూసి నట్టయింది. వెధవపొట్ట, ఈ పొట్టకోసరంకదా, ఇలాంటి దాస్యానికి పాల్పడవల్సివచ్చింది!'

ప్రభుత్వం విప్లవకారుల శవాలకు ఉచితరీతిన దహనసంస్కారాలు జరుపుతుందన్న నమ్మకం ప్రజలకు లేదు. శవాలను అగౌరవపరచవచ్చనీ ప్రజలు భయపడ్డారు. లాహోరునుంచి బయటకువెళ్ళే ప్రతిరోడ్డుమీదా కొందరు మిత్రులు కాపలాకాస్తూకూచున్నారు. ఫిరోజ్‌పూర్ వెళ్ళేరోడ్డున భగత్‌సింగ్ సోదరి అమర్‌కౌర్ కొందరు మిత్రుల్తోకూచుంది. అర్ధరాత్రి తరువాత పోలీసువ్యాను ఒకటి ఫిరోజ్‌పూర్‌వైపు వెళ్ళింది. శవాలను సట్లజ్ తీరానికి తీసుకువెళ్తూన్నారని అనుకున్నారు. సూర్యోదయంతోపాటు లాహోరుకు అరవైమైళ్ళ దూరంలోగల సట్లజ్ నదీతీరానికి ప్రజలు గుంపులు గుంపులుగా పోసాగారు. అక్కడే నదిమీద రైలు వంతెన ఒకటుంది. తెల్లవారాక ఆ పరిసరంలో మూడుచితులు మండుతూ కనుపించాయి. పోలీసులు వెళ్ళిపోయారు. శ్రద్ధాళువులైన ప్రజలు అస్తికలనూ, భస్మాన్నీ తీసుకువెళ్ళారు. 1947 మార్చి వరకూ ప్రతి సంవత్సరం మార్చి 23వ తారీకున అక్కడ పెద్ద తిరునాళ్ళజరిగేది. ఇప్పుడా ప్రదేశం పాకిస్తాన్‌లోకి పోయింది!

* * * * * *

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు-వీళ్ళతోపాటు మరోవ్యక్తికి కూడా ఉరిశిక్ష విధించారు. అతడు క్షేహరిసింగ్! అతడు తన బావనూ,

ఉరిమునసబునూ హత్యచేశాడు. ఆ కేసు నడుస్తూన్నది. పోలీసులకు శవాలు దొరకలేదు. కనుక, హైకోర్టులో విడుదల కావచ్చునను కుంటు న్నారు. అతడు అందరితోటీ ఇలా అనేవాడు "నేను ఇంకొకణ్ణి చంపాలి; వాణ్ణిచంపవచ్చి ఉరికంబం ఎక్కుతాను!" కేహరిసింగ్ విడుదలఅయ్యాడు. అసిస్టెంట్ సబ్ఇనస్పెక్టర్ని చంపి, మళ్ళి జైలుకువచ్చాడు. ఈ మాటు అతడు హైకోర్టుకు అపీల్ చేసుకోలేదు. ఐతే, అతడి పినతల్లి అపీల్ చేస్తుకుంది! ఈమాటూ శవం దొరకలేదు. ఈమాటూ విడుదల అవడానికి అవకాశంవుంది. అతడు జైలు సూపరింటెండెంటుకు "తను కొన్ని హత్యలకు సంబంధించిన వివరాల్ని పోలీసుల కియ్యాలనుకుంటున్నానవి" దరఖాస్తు పెట్టుకున్నాడు. అతడి చేతులకు బేడీలువేసి, గట్టి బందోబస్తుతో జైలునుండి బయటకు తీసుకువెళ్ళారు. తను హత్యచేసిన ముగ్గురి శవా లను చూపించాడు. కోర్టులో నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు మళ్ళి ఉరి శిక్షపడ్డ ఖైదీలనువుంచే ఖైదుకొట్లల్లోకి వచ్చాడు. అతడు సిఫిలిస్, గనేరియాలాంటి భయంకరమైన సుఖవ్యాధుల్తో బాధపడుతూండేవాడు. ఎప్పుడూ బూతుపాటల్ని పెద్దగా పాడుతూండేవాడు. ఎప్పుడు ఉరికంబా న్నెక్కి శాంతిని పొందుదామా అని తహతహలాడుతూన్నట్టు అశాంతిగా వుండేవాడు. ఒకరోజున భగత్‌సింగ్, ఇతర మిత్రులూ అతడితో ఇలా అన్నారు "నువ్వు ఇంతటి వీరుడివికదా, ఇలాంటి బూతుపాటలు పాడడం నీకేం శోభన్కరంగా వుంటుంది?"

కేహరిసింగ్ "ఐతే, ఇంకేం పాడమంటారు? సమయం గడవ డానికి ఏదో ఒకటి పాడుకోవాలిగదా?" అన్నాడు.

మిత్రులిలా అన్నారు "మిత్రమా! నీకు ఇంకేమీదాకపోతే, భగ వంతుణ్ణయినా తలచుకో, ఇలాంటి బూతుపాటలు మాత్రం పాడకు!"

కేహరిసింగ్‌కు వీళ్ళమాటంటే గురి "సరే బాబూ! ఇక మీదట నేనీ పాటను పాడుకుంటాను - 'మౌలా మై కుక్కడ్ ఖావే తేరే తూ

బక్షదే బౌగున్ మేరే!' (ఓ యజమానీ! నేను నీకోళ్ళను తిన్నాను. నీవు నా అపరాధాల్ని క్షమించు!." అని అన్నాడు.

ఉరికంబంపైపు వెళ్ళేప్పుడు కూడా అతడు ఇదేపాట పాడుకుంటూ వెళ్ళాడు.

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు - ఈ ముగ్గురు అమరవీరుల్లో ఎవరుగొప్ప? ఎవరుకొద్ది? అన్న వివక్షణ తగదనే అనుకుంటున్నాను. కానీ, నిజం చెప్పుకోవాలంటే సుఖదేవ్‌కు చాలా అన్యాయం జరిగింది. అతడిభావనను ఎవరూ అర్థంచేసుకోలేదు. అతడి దృష్టికోణానికీ, ఇతర మిత్రుల దృష్టికోణానికి వ్యత్యాసం వుండడంవల్ల అతడి ప్రవర్తన ఇతరులకు విచిత్రం అనిపించింది! మొట్టమొదట అరెస్టుకాగానే తనుచేసిన కొన్నిపనులను ఒప్పేసుకున్నాడు. అప్పుడే ఇతరమిత్రుల ప్రవర్తనకూ, అతడి ప్రవర్తనకూ వ్యత్యాసం కనుపించింది. ఆ తరువాతకూడా అతడి ప్రవర్తననే చూశారుగానీ, అతడి ఉద్దేశాన్ని ఎవరూ అర్థంచేసుకోలేదు. చిట్టచివరి వరకూ అతడి ప్రవర్తనను పరిశీలిస్తేగాని, అతడిని అర్థంచేసుకోలేము. అతడి చివరిరోజు ప్రవర్తనవల్ల సాహసంలో అతడు ఎవరికీ తీసిపోడని, ఇతర మిత్రులకంటే సాహసికుడేనని స్పష్టం అవుతూన్నది! శత్రువునుండి ఎలాంటి సౌజన్యాన్ని ఆశించడంగానీ, శత్రువుపట్ల సౌజన్యాన్ని ప్రదర్శించడంగానీ-అతడికి ఇష్టం వుండదు! కోర్టులో వడచినకేసుపట్లకూడా అతడి దృష్టికోణం ఇదే! ఇతరమిత్రులు 'కోర్టులో తప్పించుకోగలిగితే తప్పించుకుందాం!' అంటారు. కానీ సుఖదేవ్‌కు అసలు కోర్టుకువెళ్ళడమే ఇష్టంలేదు. అతడిలా అంటాడు "నువ్వు నా శత్రువ్వు! నీతో నేను పోరాడుతూన్నాను! నువ్వు చేసేదేమిటో చేసుకో!" ఈ భావనతోనే అతడు ముందుగా తన తప్పుల్ని ఒప్పుకున్నాడు. అతడి దృష్టికోణంలో లోపం వుండవచ్చు, కానీ, పిరికితనం, ప్రాణరక్షణార్థం ప్రాకులాడే తత్వం అతడిలో లేదు!

# తిరిగి ఉద్యమ నిర్మాణానికి ప్రయత్నం

నేను ఢిల్లీకి రాకపోకలు సాగించాను. కృష్ణగారిని మళ్ళీ డబ్బుల కోసం బాధించసాగాను. పార్టీకోసం తీసుకున్న డబ్బును వ్యక్తిగత అవసరాలకు వాడరాదని ఉద్దేశ్యం। కానీ, ఈ నిశ్చయం విలిచేది కాదు। అసలు వ్యక్తిగత అవసరాలకోసం తెచ్చుకున్న డబ్బుల్నే పార్టీకోసం ఖర్చుపెట్టవల్సి వచ్చేది. ఒకరోజున కృష్ణగారు చేతులు పైకి ఎత్తేశారు. "బాబూ। ఇంక నా ప్రాణాలు కొరకక్కండి। ఇద్దరు కొత్త భక్తుల్ని పరిచయం చేస్తాను. నన్ను వదిలిపెట్టండి।" అన్నారు.

కృష్ణ బావమరిది ధృవదేవ్. మా కారణంగా ఆయన ఒకమాటు పోలీసుల చేతుల్లో పడ్డాడు కూడాను. ఐనా, సహాయం చేయడానికి వెనకాడడు. ప్రభుదత్తు అనే కొత్త మిత్రుణ్ణి పరిచయం చేశాడు ధృవదేవ్। అజ్మీరిగేట్ దగ్గర రోషన్ థియేటర్ ప్రక్కనున్నపందులో వీరి బంగళా। బాగా ధనికుడు. అప్పట్లో ప్రభుదత్తు సరదాకు విమానం నడపడం నేర్చుకుంటున్నాడు. తరువాత ఈయన పైలెట్ అయ్యాడు. మొట్టమొదటి భారతీయ సివిల్ పైలెట్ ఈయనే। ప్రభుదత్తు చేసే సహాయానికి ఒక హద్దూ - పద్దూ అంటూ వుండేది కాదు. ఈయనకు చిన్నకారొకటి వుంది. నేను ఎక్కడికి పోవలసివున్నా కార్లో దింపి వచ్చేవాడు. తను వెంటరావడం ప్రమాదం అనుకున్నప్పుడు "కారువేసుకువెళ్ళు। పోలీసులు అంతగా పట్టుకుంటే, నాకార్ను దొంగిలించాడంటాను. నీమీద ఇన్ని కేసులు ఎటూ వున్నాయిగదా? కార్ను దొంగిలించిన కేసు ఇంకొకటనుకో। అంతేగా?" అనేవాడు. లాహోరు, ఢిల్లీ కుట్రకేసుల్లోని అభియుక్తులు కొందరు అప్రూవరులై తమకు సహాయం చేసిన సహృదయుల పేర్లు

చెప్పి, వార్ని ఇరకాటంలో పడేశారు. ఆ విషయం ప్రభుదత్తుకు తెల్పి. అందుకని నా పార్టీలోని ఇతర సభ్యులకు తనను పరిచయం చేయవద్దని చెప్పేవాడు. నేనూ ఈ నిర్ణయాన్ని అక్షరాలా పాటించాను.

ప్రభుదత్తు పైలెట్ అయ్యాడు. అతడి తమ్ముడు బ్రహ్మదత్తు కూడా పైలెట్ అయ్యాడు. అప్పట్లో ఉన్నతమైన యోగ్యతలు గల ప్రథమ భారతీయ పైలెట్ ప్రభుదత్తే। ఇంగ్లీషు పైలెట్‌లు వీళ్ళనుచూసి ఈర్ష్య పడుతూండేవారు. ఒకరోజున ఇద్దరు అన్నదమ్ములూ, చెరో విమానంలో, కరాచీనుండి ప్రయాణం అయ్యారు ఒకరు ఢిల్లీకి, మరొకరు లాహోరుకూ వెళ్తున్నారు. దారిలో రెండు విమానాలకూ నిప్పంటుకుంది. ఆ విమానాల్తోపాటు ఇద్దరు అన్నదమ్ములూ భస్మమయ్యారు। ఇదేదో కుతంత్రంవల్ల జరిగిందని అందరూ అనుకున్నారు. ప్రభుదత్తు ఏ విమానంలో వెడతాడో, మొదట తెలియలేదు. అందువల్ల కుతంత్రం చేసినవాళ్ళు, బయలుదేరిన కొంతసేపటికి నిప్పు అంటుకునేట్లు చేశారు రెండు విమానాలకు। ప్రభుదత్తులాంటి సహృదయులు, సాహసంగల వ్యక్తులు అరుదుగా వుంటారు।

కృష్ణగారు పరిచయం చేసిన రెండవ వ్యక్తి సుమిత్రాదీదీ। ఆమె ఢిల్లీలోని ప్రసిద్ధ కాంట్రాక్టరు నారాయణదత్తుకూతురు. నారాయణదత్తు కాంగ్రేసువాది. పెద్దపెద్ద కాంగ్రేసు నాయకులు వారింట్లోనే ఆతిథ్యాన్ని పొందుతూంటారు. సుమిత్రాదీదీ ఖద్దరు ధరించేది. ఎం. ఏ. చదువుతూంది. ఆమెతో అప్పుడప్పుడూ సిద్ధాంతచర్చలూ జరుగుతూండేవి. ఆమె ఇలా అనేది. "మనిషికి దేశభక్తి వుండడం మంచిదే। స్వాతంత్ర్యము, సామ్యవాదమూ - అన్నీ అవసరమే। ఐతే, ఇలా తుపాకులూ, పిస్తోళ్ళు వేసుకుని హింసకు పాల్పడడం సరికాదు।" ఎంతో ఉదారంగా ఆర్థిక సహాయం చేసేది. ఆమె డబ్బు ఇచ్చినప్పుడల్లా "సోదరా। ఈ డబ్బుల్ని ఎవరి ప్రాణాలూ తీయడానికి వాడకండి।" అనేది.

ఒకరోజున ఆమె కార్లో వెళ్తూ, నేను ఎక్కడో నడిచి వెళ్తూండగా చూసిందిట. ఆ తరువాత కల్సుకున్నప్పుడు ఇలా అంది.

"సోదరా ఫలానారోజున నువ్వు జనసమ్మర్దంగా వున్న రోడ్డున కాలినడకన వెళ్తున్నావుకదా? ఎవరైనా గుర్తుపట్టి వెంటపడితే?" అనడిగింది.

"సైకిల్ ఎటూ లేదు. టాంగాచేసుకువెడదామంటే అన్నప్పుడల్లా జేబులో డబ్బులుండవు. పైగా, టాంగాకంటే నడిచివెళ్ళడమేనయం, ఎప్పుడైనా ఏసందులోకయినా వెళ్ళిపోవచ్చును!" అన్నాను.

"నాతో ఇంటికి రాండి! డబ్బులు ఇస్తాను. ఇప్పుడే సైకిలు కొనితెచ్చుకుందురుగాని!" అన్నది.

ఆమె అనుమానం సరైనదే! ఢిల్లీ కుట్రకేసు కోర్టులో వుంది. కైలాస తి సాక్ష్యాలు పత్రికల్లో అచ్చవుతూన్నాయి. ఆజాద్, భగవతీ చరణ్, యశ్‌పాల్ గురించి ప్రజలు ఒకేతీరాన చెప్పుకుంటున్నారు. ఆజాద్, భగవతీచరణ్ - ఇద్దరూ బలైపోయారు యశ్‌పాల్ గురించి పోలీసుల ఉద్దేశం ఏమిటో తెల్సుకోడానికి హాలిన్సరాసిన ఈ క్రింది వాక్యాల్ని చదివితేచాలు. 'ఆజాద్ చనిపోయాక అతడి అనుచరుడు ఆజాద్ స్థానాన్ని స్వీకరించాడు. ఇతడు అతడికంటె దుస్సాహసి, నిర్దయుడు....'

పంజాబు ఢిల్లీ పోలీసులు విప్లవకారుల్ని పట్టిఇచ్చినవాళ్ళకు పెద్ద పెద్ద బహుమతులు ప్రకటించారు. విప్లవకారుల బొమ్మలతోగుడి పోస్టర్లను పోస్టాఫీసుల్లోనూ, రైల్వేస్టేషనుల్లోనూ, పట్నాలల్లోని చౌరాస్తాల్లోనూ అతికించారు. ఆ పోస్టర్లలో, మధ్యలో నాఫొటో వుండేది. చౌరాస్తాల్లో అతికించిన పోస్టర్లను ప్రజలు చింపేసేవారు. లేకపోతే, వూడతీసుకుపోయే వారు. అలాంటి పోస్టర్ని ఒకదాన్ని ఢిల్లీలోని శ్రీకృష్ణసూరి ఎక్కణ్ణుందో

తీసుకువచ్చి నాకిచ్చారు. అది ఇప్పటికీ నాదగ్గర వుంది! ఈ పోస్టర్లను చూసి నన్నెవరూ గుర్తుపట్టలేరని నావిశ్వాసం. నేనే రైల్వేస్టేషన్‌లోనైనా కొంత సమయాన్ని గడపవల్సివస్తే, సరీగా పోస్టరుకిందవున్న బెంచీమీద కూచుని సిగిరెట్టు ముట్టించేవాణ్ణి! సరీగా ఆ పోస్టర్ కిందనే యశ్‌పాల్ కూచుంటాడని ఎవరనుకుంటారు? నకిలీ మీసాలూ, గడ్డాలూ నేను ఎన్నడూ పెట్టుకోలేదు. దుస్తుల్ని కొద్దిగా మార్చేవాణ్ణి! అంతే!

మిత్రులందరం పునరాలోచించుకుని తిరిగి ఉద్యమాన్ని నిర్మించే బాధ్యత ఒకరికి ఒప్పగించాలని అనుకుంటున్నాము. రహస్యోద్యమాలు ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలద్వారానే నడుపుదామంటే కుదరదు! సురేంద్రపాండే కాన్పూర్‌లో ఉద్యమాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నాడు. అతడు నన్ను కాన్పూర్ రమ్మన్నాడు. నేను అతనినే ఢిల్లీ రమ్మన్నాను. కారణం ఇలా చెప్పాను. "నేను పరారీలో వున్నాను. ప్రయాణం చెయ్యాలంటే డబ్బు కావాలి! ఎవరైనా గుర్తిస్తారేమోనన్న భయమూ వుంటుంది!"

అతడి సమాధానం "బాబూ! నీవైపు ఎవరూ చూడరు. నా విషయం అలా కాదు. నా ముఖమే ఫిలాసఫర్ ముఖంలా వుంటుంది. నలుగురి దృష్టులూ నామీద వుంటాయి. నేను ఒకసారి అరెస్టు అయివుండడంవల్ల కాన్పూర్ పోలీసులు నన్ను బాగా ఎరుగుదురు!"

పాండే చెప్పిన మొదటి కారణం ఎలావున్నా, రెండవ కారణం సరైనదే! నేనే కాన్పూర్ వెళ్ళిరావడానికి అంగీకరించాను. అతడిమీద మళ్ళీ వారంటు లేకపోయినప్పటికీ, ఒక రకంగా పరారీలోనే వున్నాడు.

ఒక తేదీని తెలియజేస్తూ పగలు, పదకొండు గంటలాప్రాయల సరసైయా ఘాట్ దగ్గర కల్సుకోవలసిందని కబురు పెట్టాడు, పాండే! ఇతర మిత్రులూ వస్తూన్నారు. ఉద్యమ నిర్మాణాన్ని గురించి చర్చించడం జరుగుతుంది.

కాన్పూర్ వెళ్ళి నేను గుల్జారీలాల్ గదిలోనే బసచేసినట్టు జ్ఞాపకం! అతనిదే సైకిల్ వేసుకుని సరసైయ్యాఘాట్‌కు వెళ్ళాను. మేనెల! ఎండ దహించేస్తోంది. ఆ సమయంలో సరసైయ్యాఘాట్ నిర్మానుష్యంగా వుంటుంది అనుకున్నాము. నేనూ ఘాట్‌కు వెళ్ళాను. ఒడ్డున చిన్న శివాలయం వుంది. రావిచెట్టుకింద అరుగుమీద కాశీరామ్, భవానీసహాయ్, రాజేంద్రనిగమ్ - ముగ్గురూ కూచుని పేక ఆడుకుంటున్నారు. సురేంద్ర పాండే మరి ఒకరిద్దరు ఇతర మిత్రులూ రావాలి! ఐదారు నిమిషాలసేపు ఆ మాటలూ - ఈ మాటలూ మాట్లాడుకున్నాము. ఇంతలో నాదృష్టి మాకు కొద్ది దూరంలో నిలబడివున్న నలుగురు మనుషులమీద పడ్డది. వాళ్ళప్రక్కన ఒక గుర్రబండి వుంది. రెండు సైకిళ్ళు వున్నాయి. "వీళ్ళు ఎవరు? ఎందుకు నిలబడి వున్నారు?" అని మా మిత్రుల్ని అడిగాను.

"ఎవరో తెలియదు. నే వస్తూవుంటే నావెనకే వచ్చారు! అప్పటి నుంచి అలాగే నిలబడ్డారు!" అన్నాడు కాశీరామ్.

నేను ఆశ్చర్యపడ్డాను. "వాళ్ళు నిన్ను వెంబడిస్తూవుంటే, వెంట బెట్టుకునే ఇక్కడికి వచ్చావా? విచిత్రమైనవాడివే? మనల్ని వెంబడించే వారు సి.ఐ.డి లే ఐవుంటారుగదా?" అన్నాను.

"నేను గొందులు సందులు తిరిగి వీళ్ళను వదిలించుకోవానికి చాలా ప్రయత్నించాను. కానీ, వీళ్ళు వదిలేకదా?" అన్నాడు కాశీరామ్.

అతడి ఈ అమాయకత్వానికి కోపం వచ్చింది. ఇంకా మిత్రులు రావలసిన వాళ్ళు వున్నారు. "నువ్వు చాలా పెద్దపని చేశావు! అందర్నీ ప్రమాదంలో ఇరికించడం అవుతుంది ఇప్పుడు!" అన్నాను కానీ, ఇప్పుడు ఏంచేసేట్టు? ఇతర మిత్రులు రాకముందే వీళ్ళ విషయం తేల్చేసుకోవాలి! లేదా, ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టిసెయ్యాలి! 'ఏం చేస్తారో చూద్దా' అనుం

కుంటూ ఒక ఆట ఆడాము. తరువాత వాళ్ళను కేకవేసి దగ్గరకుపిల్చాను. "నిలబడి ఏం చూస్తారు? రండి రెండాటలు ఆడుకుందాం!" అన్నాను.

"మేం ఊరకా నిలబడ్డాం! మిమ్మల్ని ఏమీ అనడం లేదుకదా? మీరు ఆడుకోండి!" అన్నారు వాళ్ళు!

"మరి అలా చూస్తూ ఎందుకు నిలబడ్డారు? మాతోటి ఏమైనా పనుందా?"

"ఏంపనిలేదు. మీరు ఆడుకోండి!" అన్నారు వాళ్ళు.

"మేము ఇక్కడ ఏకాంతంలో సరదాగా ఆడుకోడానికి వచ్చాము. మీరలా నిలబడిచూడ్డం మాకేం బాగాలేదు."

"మేము మిమ్మల్ని ఏమీ అనడం లేదుకదా? మీఆట మీరు ఆడుకోండి!" అన్నారు మళ్ళీ.

ఇంక అనుమానం ఏముంది? వాళ్ళకు వినపడేట్టు మిత్రుల్తో ఇలా అన్నాను. "వాళ్ళు ఇక్కడ కూచుంటాటులాగుంది. మనమే ఇంకోచోటికి వెళదాం పదండి!"

మేము నలుగురం లేచి నిలబడ్డాం! సైకిళ్ళు తీసుకుని లాల్ ఇమలీమిల్లు వైపు బయల్దేరాము. వాళ్ళు మా వెనుకనే బయల్దేరారు. ఇద్దరు సైకిళ్ళమీదా, ఇద్దరు గుర్రబడిలోనూ! అప్పటికి నిగమ్‌పేద వారంటులేదు. కొంచెం ముందుకువెడితే రోడ్డు చీలుతుంది నేను నిగమ్‌తో ఇలా అన్నాను "నువ్వు హాలన్సీరోడ్డున వెళ్ళిపో! వీళ్ళల్లో ఎవరైనా నీ వెంటపడితే, వీళ్ళను చీల్చినట్టవుతుంది. నిన్నేం చేయలేరుగదా? మిగిలిన వాళ్ళపని మేము చూసుకుంటాము!" (అప్పట్లో నిగమ్ కాంగ్రేసు ఆఫీలో వుండేవాడు).

'లాల్‌ఇమలీ' చౌకుకువచ్చాక నిగమ్‌హాలన్సీ రోడ్డువైపు తిరిగాడు. కానీ వాళ్ళు నిగమ్‌ను వెంబడించలేదు. నేను, కాశీరామ్ భవానీసహాయ్‌తో ఇలా అన్నాను. "సైకిళ్ళను బాగా వేగంగా తొక్కండి! నేను ఆపమన్న

వ్పుకు ఒక్కసారిగా ఆపేసెయ్యండి!" మేము బాగా వేగంగా తొక్కుతూన్నాం! మమ్మల్ని వెంటాడేవాళ్ళు వేగాన్ని పెంచారు. బండికి కట్టిన గుర్రం గొప్పది. మంచి వేగంగా పరుగిడుతూన్నది. ఇంకొంచెం ముందుకుపెకితే కచేరీ వస్తుంది. ఆ జనంలో వీళ్ళను వదిలించుకోడం కష్టం అవుతుంది. ఒక్కమాటుగా 'స్టాప్' అనేశాను.

మేము ముగ్గురం షడన్‌బ్రేక్ వేసి సైకిళ్ళను ఆపాం! మేము అక్కడ అలా ఆపుతామనుకోకపోవడంవల్ల వాళ్ళు నాలుగడుగులు ముందుకువెళ్ళిఆగి, మావైపు తిరిగారు. ఆ తిరగడంలో, వాళ్ళల్లో ఒకడి దగ్గర రివాల్వరు కనుపించింది. నేను వాళ్ళనుద్దేశించి "ఇంతకూ మీరెందుకిలా మావెంట వస్తూన్నారు?" అనడిగాను.

వాళ్ళల్లో ఒకడు కాశీరామ్ వైపుచూపుతూ "మేము ఈయనను స్టేషనుకు తీసుకువెళతాం!" అన్నాడు.

"ఎందుకు?" నేనడిగాను.

"ఈయనమీద వారంటువుంది!"

"ఈయనమీద వారెంటు ఎలా వుంటుంది? సరే, ఈయన పేరేమిటి?" అవడిగాను.

"కాశీరామ్!" అన్నాడు.

"నాపేరు జగదీష్!" అన్నాడు కాశీరామ్. నేనూ దాన్ని సమర్థించాను.

"అలా ఐతే, ఈయన మాతోపాటు స్టేషనుకువస్తే అక్కడ తెలుస్తుందిగదా, కాశీరామ్ ఔనో, కాదో?"

"సరే, మీరు పదండి! ఈయన స్టేషనుకువచ్చి స్వయంగామాట్లాడతాడు. మేము ఈయనను స్టేషనుకు తీసుకువస్తాం పదండి!" అన్నాను. వాళ్ళెందుకు ఒప్పుకుంటారు? నేను అవకాశంకోసం సమయాన్ని దొర్లిస్తున్నాను. "సరే, సోదరా! వీళ్ళు చెప్పినట్టు చెయ్యి! నువ్వు వీళ్ళతోపాటు

వెళ్ళు, మేము మీ అన్నయ్యను తీసుకుని స్టేషనుకు వస్తాం!" అని కాశీరామ్‌తో అన్నాను.

కాశీరామ్ కంగారు పడ్డాడు. "నే వెళ్ళను! నేనెందుకు వెళ్ళాలి? నా పేరు జగదీష్!" అన్నాడు.

నేనతడిని కోప్పడ్డాను. "ఎందుకు వెళ్ళవు? వాళ్ళు రమ్మంటున్నారు గదా? పోలీసులమాట మనం వినాలి! వెళ్ళనందువల్ల నీకు వచ్చిన నష్టం ఏమిటి?" అన్నాను.

కాశీరామ్ భయపడడం సహజం! నేనతడిని ఒంటరిగా ప్రమాదానికి గురిచేస్తున్నాననుకున్నాడో, ఏమో! "నన్ను వెళ్ళమంటావా?" అనడిగాడు దిగులుగా.

"చెప్తున్నానుగదా వెళ్ళమని? వెళ్ళు! పోలీసుల్తో మనకు పేచీ ఎందుకు? మీ అన్నయ్యను తీసుకుని మేము ఇప్పుడే వస్తాముగదా? భయపడవల్సిన పనేముంది?" అని కోప్పడ్డాను.

గట్టిగా నిట్టూర్చి "సరే!" అంటూ సైకిల్‌ని తిప్పాడు. సైకిల్ మీద ఎలాగయినా తప్పించుకోవచ్చుననుకుంటున్నాడులాగుంది.

పోలీసులు అతడి సైకిల్‌ను పట్టుకున్నారు. "మీరు బండిలో కూచోండి! సైకిల్‌ని మేము బండి వెనుక కడతాము!" అన్నారు.

కాశీరామ్ సైకిల్ వదలనని మొండికి వేశాడు. నేను మళ్ళీ కోప్పడ్డాను. "వాళ్ళు చెప్పినట్టు చెయ్యవెందుకని?"

కాశీరామ్ విరాశగా సైకిల్‌ని వదలి బండిలో కూచున్నాడు. బండివాడిదగ్గర తాడు తీసుకుని ఇద్దరు పోలీసులు సైకిల్‌ని బండివెనుక కడుతూన్నారు. మిగిలిన ఇద్దరుకూడా అటే చూస్తూన్నారు. నేను నా సైకిల్‌ను కొంచెం వెనక్కు జరిపాను. కొంటినుండి పిస్తోల్ తీసి ఇద్దరు పోలీసుల్ని కాల్చాను! మిలటరీ పిస్తోలు. గుండ్లు పెద్దవి. ఒక్కొక్క గుండు తగిలేసరికే కిందపడిపోయారు ఇద్దరూ! అరవసాగారు! మిగిలిన ఇద్దర్లో ఒకరు

సైకిల్‌మీద పారిపోయాడు. రెండవ వాడు ప్రహరీనిదాటి ప్రక్కనేవున్న బంగళా ఆవరణలోకి వెళ్ళాడు.

కాశీరామ్ బండిలోనుంచి కిందికిదూకాడు. కిందపడివున్న పోలీసులో ఒకడికి గురిచూసి అతడూ ఒక గుండు కాల్చాడు, అతణ్ణి, భవానీ సహాయ్‌నూ వెంటనే వెళ్ళిపొమ్మన్నాను. నేనూ, పారిపోయిన పోలీసువైపు పిస్తోలుతో కాలుస్తూ సైకిల్‌మీద వెళ్ళాను. నేను తిరిగి గుల్లాకీలాల్ గదికి వచ్చేశాను. ఇంతఅయ్యాక ఇంక కాన్పూర్‌లో సమావేశంఎ.జరుగుతుంది? మర్నాడే ఢిల్లీ వెళ్ళిపోయాను.

మర్నాడు వార్తాపత్రికల్లో ఈవార్త వచ్చింది. ఇద్దరు పోలీసుల పరిస్థితి ప్రమాదకరంగావుందని రాశారు. ఒకడికి ఊపిరితిత్తుల దగ్గర దెబ్బతగిలిందిట. మరొకడికి కడుపులో.

ఢిల్లీనుంచి కాన్పూర్ వెళ్ళడానికి డబ్బు సుమిత్రాదీదీ ఇచ్చింది. నేనేదో కార్యక్రమంమీదనే వెళ్తున్నానని ఆమెకు తెలుసు. నేను తిరిగి ఢిల్లీ వెళ్ళకముందే సుమిత్రాదీదీ, పత్రికల్లో వచ్చిన వార్తల్ని చదివింది. నే వెళ్ళగానే "భయ్యా! ఏమిటి ఇలా చేశావ్?" అని అడిగింది.

"వాళ్ళు అనవసరంగా మా ప్రాణాలమీదికి తెస్తున్నారు. మమ్మల్ని మేము రక్షించుకోవాలిగదా?" అని చెప్పాను.

కాన్పూర్ పోలీసులు కాశీరామ్‌ను వెతుకుతున్నారు. కానీ, ప్రభుత్వం ఆ కాల్పులకు నేనే బాధ్యుణ్ణని ఎలా అనుకుందో తెలియదు. అరెస్టయ్యాక ప్రభుత్వం నామీద కాన్పూర్ కాల్పుల్ని గురించి కూడా కేసు పెట్టింది. ఐతే, ఆ తరువాత కొన్నాళ్ళకి కాన్పూర్‌లో 'ఫిగమ్' అరెస్టయ్యాడు. అతడికి ఇదేకేసు సంబంధంగా ఏడేళ్ళ శిక్ష విధించారు. ఆంగ్ల ప్రభుత్వ న్యాయానికి ఇది ఒక మచ్చుతునక. ఆ కేసు గురించి ఒకణ్ణి అరెస్టుచెయ్యాలి. చేతికి అందినవాడే వెళ్ళకాడుకు. లేకపోతే పోలీసుల అసమర్థత బయటపడుతుందికదా?

తరువాత పరికొన్నాళ్ళకు ఉద్యమ విధానాన్నిగురించి చర్చించు కోడానికి రమ్మని కబురువచ్చింది. ఈమాటు హాపుడ్‌లో కలుసుకోవాలని నిశ్చయించుకున్నాము. భావి కార్యక్రమాన్నిగురించి నేనొక అభిప్రాయాన్ని ఇచ్చాను. 'పార్టీకి మన భావాలప్రచారం ముఖ్య కార్యక్రమంగా వుండాలి। మన భావాల్ని ప్రచారం చేసుకుంటూ సాధారణ ప్రజల్లో పార్టీ సానుభూతిపరుల్ని ఏర్పరచుకోవాలి। అలా ప్రచారం చేసుకోడానికి రహస్యంగా ప్రస్సును నడుపుకోడం అవసరం। మనం ప్రస్సుపనిలో అనుభవం గడించడానికి కాంపోజిటర్లగానో, షరోటిగానో ప్రస్సులో చేరడమూ అవసరమేను। అలాచేయడంవల్ల తాత్కాలికంగా మనజరుగుబాటు సమస్యా పరిష్కారమవుతుంది. ఈ దోపిడీలు చేయవల్సిన అవసరమూవుండదు।' అన్నాను.

నా యీ అభిప్రాయం పాండేకు నచ్చలేదు. ఇతర మిత్రులకూ నచ్చలేదు. సాయుధపోరాట బాధ్యతల్ని నేను తీసుకోవాలనీ, తను పార్టీ సిద్ధాంతాల్ని నిర్ణయించే బాధ్యతల్ని తీసుకోవచ్చుననీ అతడి ఉద్దేశం। ఇది నాకు నచ్చలేదు. ఆరాత్రి పొద్దుపోయేవరకూ ఏవిషయము తేలక పోవడంతో చర్చల్ని మర్నాటికి వాయిదా వేసుకున్నాము. అవశంగా, ఆ చాపలమీదనే పడి నిద్రపోయాం। ఉదయాన్నే మెళుకువ వచ్చేసరికి మిత్రుల మాటలు వినబడుతూన్నాయి ఇద్దరు మిత్రుల మాటలు వినబడుతూన్నాయి. ఇద్దరు మిత్రులు నా వీపువైపు కూచుని చిన్నస్వరంలో చెప్పుకుంటున్నారు ఆమాటలు నాగురించేకావడంవల్ల మౌనంగా వింటూ పడుకున్నాను. '....భలే! మన్ని కాంపోజీటర్లను కమ్మంటున్నాడు..... పైప్రాయి ట్రయిన్‌కింద బాంబు పేల్చడానికి బటన్ నొక్కడంతో తను మహా ఇదయిపోయినట్టు భావిస్తున్నాడు....' అంటున్నారు కాసేపు ఆగి లేచి కూచున్నాను. నేను ఆ మాటల్ని విన్నట్టు తెలియలేదు. వీళ్ళకు నామీద విశ్వాసంలేదని నిశ్చయించుకున్నాను. అక్కణ్ణుంచి బయిల్దేరేప్పుడు ఇలా

చెప్పాను వాళ్ళతో మీరాక విర్ణయానికి రండి! "మీ విర్ణయం నాకు అంగీకారం అయితే, సహకరిస్తాను!''

ఆ రోజుల్లోనే జరిగిన మరో సంఘటననుకూడా చెప్పడం అవుసరం అనుకుంటున్నాను ఒకనాటి సూర్యాస్తమయ సమయంలో చావడీ బజారుగుండా జామా మసీదువైపు వెడుతూన్నాను. జనసమ్మర్దం ఎక్కువగావుంది. కాన్పూర్ సంఘటనకు సంబందించిన నలుగురు పోలీసుల్లో ఒకడు నా ఎదురుగుండా వచ్చేస్తున్నాడు. నేను విభ్రాంతుణ్ణయ్యాను. బాగా దగ్గరకు వచ్చాక ఒకరి కళ్ళల్లోకి ఒకరం చూసుకున్నాము. ఇతడు అప్పుడు గుర్రబండిలో కూచున్నాడు. నల్లని నలుపు, స్థూలకాయం, పైళ్ళాన్లు వేసుకునే దుస్తులూ - ఇట్టే పోల్చుకోవచ్చు! ఇతడు అప్పుడూ ఇలాంటి దుస్తులే వేసుకున్నాడు నేనూ ఆనాడు కాన్పూర్‌లో కట్టుకున్నట్టు ధోవతి కట్టుకుని చొక్కా వేసుకున్నాను. ఇద్దరు పోలీసులు గుండు దెబ్బతగిలి పడిపోయాక, ఇతడు ఎదరనవున్న బంగళా ఆవరణలోకి పరుగెత్తి అక్కణ్ణుండి నామీద కాల్పులు జరిపాడు.

నేనతడి కళ్ళల్లోకి చూడగానే అతడు ఆ పాదమస్తకం కంపించిపోయాడు. నేను నాలొంటిన చెయ్యి పట్టుకుని ప్రక్కకు తప్పుకుని, కళ్ళతోనే సంజ్ఞ చేశాను— 'మెదలకండావెళ్ళిపో!'

ఆ పోలీసు చప్పున - పరుగెత్తుతున్నంత వేగంతో - నడిచి వెళ్ళిపోయాడు. ఒక్కక్షణం అతడి వంకచూస్తూ అలాగే విలబడి వున్నాను. పది గజాలువెళ్ళి అతడు వెనక్కు తిరిగి చూశాడు. నేనలాగే చూస్తూండడంతో, ఇంక పరుగు లంకించుకున్నాడు. నేను గొందులు సందులు తిరుగుతూ ఎవరూ నన్ను వెంటాడడంలేదని విశ్చయించుకున్న తరువాత వివాసాన్ని చేరుకున్నాను. 'బహుశ, అతడు పిరాయుధుడై వుండవచ్చును!' అనుకున్నాను.

ఇది జరిగాక రష్యా వెళ్ళిపోవాలన్న ఆలోచన తలెత్తింది నా బుర్రలో। వీళ్ళకు నామీద విశ్వాసంలేనప్పుడు, వీళ్ళ బాధ్యత నాకేమిటి? ప్రకాశవతి కూడా రష్యా వెళ్ళమనే సలహా ఇచ్చింది।

లాహోరు నేషనల్ హైస్కూలు హెడ్మాస్టరుగా పనిచేసిన గురుదత్తుగారు ఢిల్లీలో కనుపించారు. నేను రష్యావెడితే ప్రకాశవతికి, తమ ఇంట్లో వుండడానికి అవకాశం ఇస్తామని మాట ఇచ్చారు అప్పుడు వారు ఉ. ప్రదేశ్‌లోని అమెఠీతాలూకాలో,రాజా సాహెబ్‌కు ప్రైవేటుశక్రటరీగా పనిచేస్తున్నారు. నేను రష్యావెళ్ళడం కొంతవరకూ నిశ్చయం అయినట్లే। ప్రభుదత్తు తను కొంత ఆర్థికసాయం చేస్తానన్నాడు. మిగిలింది సుమిత్రా దీదీని అడగమన్నాడు। నన్ను విదేశం వెళ్ళమని సుమిత్రాదీదీ ఎప్పటి నించో చెబుతోంది।

ప్రకాశవతి గురుదత్తుగారితో అమెఠీ వెళ్ళిపోయింది. ఢిల్లీలో మేము వున్న ఇంటిని ఖాళీ చేశాము. సరిహద్దు ప్రాంతాలగుండా రష్యా వెళ్ళడం ప్రమాదకరమని నా ఉద్దేశ్యం। సరిహద్దు ప్రాంతాల్లోవుండే పఠాన్ దోపిడీదార్ల చేతుల్లోపడి చచ్చిపోవడం జరిగితే? లేక రష్యాలో ప్రవేశించాక గూఢచారిగా అనుమానించి వాళ్ళు జైల్లోవేసేస్తే? ప్రయోజనం ఏంటి? కనుక రష్యాతో సంబంధంకల వ్యక్తులద్వారా వెళ్ళడం మంచిది కదా? అలా వెళ్ళినప్పుడే రష్యా ప్రభుత్వం నన్ను విశ్వసించగలదు। ఎమ్.ఎన్.రాయ్ రష్యానుండి తిరిగి వచ్చిన కొత్త రోజులు. ఇంకా అరెస్టు కాలేదు. అప్పుడతడు డాక్టర్ అహమ్మద్ అన్న పేరుతో బొంబాయిలో వుంటుండేవాడు. ఒక మిత్రుడి దగ్గర నన్ను కలుసుకోవాలనీ అన్నాడుట। భారత కమ్యూనిష్టు పార్టీ కార్యక్రమానికీ, ఎమ్.ఎన్.రాయ్ కార్యక్రమానికి ఉన్నవ్యత్యాసం నాకు అప్పటికి తెలియదు. మీరట్ కుట్ర కేసు జరుగుతోంది అప్పుడు. ఆ కేసులోని అభియుక్తుడు హచిన్‌సన్ బైలుమీద విడుదల అయ్యాడు. నేనతణ్ణి కలుసుకుని నాకో ప్రమాణ

పత్రాన్ని ఇప్పించమని కోరాను. 'బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడుతూన్న విప్లవకారుడు. విశ్వాస యోగ్యుడు!' అన్న ప్రమాణ పత్రాన్ని ఇప్పించ మన్నాను.

హచిన్‌సన్ ప్రమాణపత్రాన్ని ఇప్పిస్తానన్నాడు. ఐతే, దానికోసం నేను బొంబాయి వెళ్ళాలన్నాడు! అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం మరోరకంగా వుండేది. పార్టీ ప్రెసిడెంట్ సుహాసిని! ఆమె జబ్బులో వుంది. బొంబాయివెళ్ళి రణదివేను కల్సుకుని మాట్లాడాను. ప్రమాణ పత్రాన్ని ఇవ్వడానికి సందేహాన్ని వెలిబుచ్చాడు. నేను మధ్యలో ఎక్కడైనా అరెస్టయితే, నా దగ్గర తమ ప్రమాణ పత్రం వుండడంవల్ల, 'టెర్రరిష్టులకూ, కమ్యూనిస్టు పార్టీకి సంబంధం వున్నట్లు నిర్ణయం అవుతుంది!' అని భయపడ్డాడు. ఐతే, సముద్రమార్గాన విదేశాలకు తీసుకు వెళ్ళే వ్యక్తుల్ని పరిచయం చేస్తానన్నాడు. బొంబాయిలో వాళ్ళదగ్గర వున్నప్పుడు, నేను సాయుధుడుగా వుండడం వాళ్ళను బాధించింది!

ఎమ్ ఎన్. రాయ్‌ని కల్సుకోవాలన్న అభిప్రాయాన్ని రణదివేకు చెప్పాను. అతడిలా అన్నాడు. "మీ యిష్టం కల్సుకోవచ్చును. కానీ, మీరు ఎమ్.ఎన్.రాయ్‌తో పరిచయం పెట్టుకుంటే మా పార్టీనుండి ఎలాంటి సహాయాన్నీ ఆశించకండి!" ఎమ్. ఎన్. రాయ్ భారతదేశానికి వచ్చేముందు కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్‌తో పోట్లాడి వచ్చాడనీ, చైనాలో విశ్వాస ఘాతకం చేసినట్టు అతడిమీద ఆరోపణలు వున్నాయనీ నాకు అప్పటికి తెలియదు.

బొంబాయినించి తిరిగి వచ్చాను. ఈమాటు అన్ని విషయాల్ని పరిష్కరించుకుని బొంబాయివచ్చి, అక్కడనుండి విదేశాలకు వెళ్ళిపోవాలనుకున్నాను. ఆమెరీవెళ్ళి ప్రకాశవతిని కల్సుకున్నాను. ఆమె వేను కటి వలహానే ఇచ్చింది. అక్కడ నుండి తిరిగి వచ్చేటప్పుడు ప్రతాపగఢ్ స్టేషన్ వైటింగ్‌రూమ్‌లో కొంతసేపు నిరీక్షించవల్సి వచ్చింది. గుజ

రాతీ సేటుల్లా పొడుగాటికోటు సన్నని ధోవతి. టోపి-ధరించాను. నేను అక్కడ కూచుని వుండగానే స్టేషనంతా పోలీసులతో ముట్టడింపబడడాన్ని చూసి అదిరిపడ్డాను. గుమ్మడికాయల దొంగ ఎవడంటే భుజాలు తడువుకున్నట్టు అయింది. 'నేనీ వైటింగ్‌రూమ్‌లో వున్నట్టు పోలీసులకు తెల్సి వుంటుంది. ముట్టడించారు. పోలీసులతో పోరాడుతూ చనిపోవడమే గత్యంతరం!' అనుకున్నాను పరిసరం బొత్తిగా అపరిచితం అయింది. ఆ గదిమధ్యలో ఒక టేబుల్ వుంది. దానిమీద సూట్‌కేసును తెరచి పెట్టాను. 'దాని చాటున వుండి ఎక్కువసేపు పోరాడవచ్చును' అనుకున్నాను. తలుపులకు సన్నని ఇనుపతెరలుండడంవల్ల బైటి దృశ్యం నాకు స్పష్టంగా కనపడుతూన్నా, లోపలిదృశ్యం బైటివాళ్ళకు కనబడదు. 'పోలీసులు వైటింగ్ రూమ్‌వైపు వస్తూనేవుంటారు!' అనుకుంటూ మాటిమాటికీ సూట్‌కేసుపైనుండి తొంగిచూస్తూన్నాను. కొంతసేపటి తరువాత ఇద్దరు ఇనస్పెక్టర్లు తలపాగలను సరిచేసుకుంటూ వస్తూ కనుపించారు. ఇద్దరి భుజాలనా రివాల్వర్లు వ్రేలాడుతూన్నాయి. వాళ్ళ వెనుక సాయుధులైన పోలీసులు కొందరున్నారు. వెంటనే సూట్‌కేసు చాటుకువెళ్ళి రివాల్వర్ చేతిలోకి తీసుకు సిద్ధంగా వున్నాను. వాళ్ళు లోపలకు అడుగు పెట్టగానే, మొదటిదెబ్బ నేనే కొట్టాలనుకున్నాను!

ఒక కానిస్టేబులు తలుపుతెరచాడు. ఇనస్పెక్టరు లోపలకు తొంగి చూశాడు. ఐతే, చిరునవ్వు నవ్వుతూన్నాడు. చాలా సభ్యతగా "నమస్తే, మీకు కొంచెం ఇబ్బంది కలిగిస్తున్నాము!" అన్నాడు నేను రివాల్వర్ని లోపలపెట్టి, సూట్‌కేసు మూసేశాను. నేనూ చాలా వినయంగా "చెప్పండి!" అన్నాను.

ఇనస్పెక్టరు ఇలా అన్నాడు. "గవర్నర్‌గారి స్పెషల్ ట్రైన్ ఇంజను ఇక్కడ నీళ్ళు పోసుకుంటుంది! నియమం ప్రకారం అలాంట

ప్పుడు స్టేషన్‌లో ఎవరూ వుండడానికి వీల్లేదు. బాధలేదనుకుంటే, మీ సామాన్లకు తాళంవేసి పది నిమిషాలు బైట తిరిగిరండి!"

మనస్సు కుదుటపడ్డది. బొంబాయి యాసతో హిందిలో "మీ నియమం ఎట్లాగో అట్లాగే కానిద్దాం! కానీ, నేను బండిసూరడానికి కూచు న్నాను. ఈ పరిసరం నాకు తెలియదు!" అన్నాను.

"ఐతే, మీరు స్పెషల్ ట్రైన్ ఇక్కడున్నవరకూ బైటకు రాకండి! ఒక్క పది నిమిషాలు. మీకు ఇబ్బందే అనుకోండి! ఐనా, నియమాన్ని పాటించక తప్పదుగదా?" అన్నాడు. పీడ విరగడయింది. చెప్పవచ్చేది ఏమిటంటే, అహర్నిశలూ మనస్సు ఇంత తీవ్రంగానూ ఆలోచిస్తూ వుండేది!

సుమిత్రాదీదీ మసూరీలో వుందనితెల్సి నేనక్కడికి వెళ్ళాను. ఆర్థిక సహాయాన్ని గురించి మాట్లాడాలిగదా? సంపన్నుల వేషంలోనే వెళ్ళాను. హోటల్లో గది తీసుకుందామంటే అద్దె అధికంగా వుంటుంది. కాగా, ఎవరూ? ఏమిటి? అన్న సమస్యకూడా వస్తుంది. ఒక పెద్ద బంగళాలో గదులు అద్దెకు ఇస్తారనితెల్సి వెళ్ళి అడిగాను. కుటుంబంతో వుంటారా? ఒంటరిగా వుంటారా? అనడిగారు. ఒంటరి వాళ్ళకు గదులు ఇవ్వరేమో అనుకున్నాను. "గదిదొరికితే ఉత్తరంరాసి భార్యను పిలిపించు కుంటాను!" అన్నాను. ఒక గదిని అద్దెకు తీసుకున్నాను.

సుమిత్రాదీదీ ఉన్నచోటుకు వెళ్ళాను. ఆమె అక్కగారు కనుపించారు మొదట! ఢిల్లీలో వారింటికి వెళ్ళేప్పుడు ఖద్దరు దుస్తులు వేసుకుని, టోపీ పెట్టుకుని వెళ్ళేవాడిని. ఈమెగారు నాగురించి చెల్లెల్ని అడిగింది అప్పుడు. "డాక్టరు కాంగ్రెసులో పనిచేస్తుంటారు!" అని చెప్పింది సుమిత్రాదీదీ. "డాక్టరా? పాపం, ఏం ప్రాక్టీసు వుంటుందినకు?" అని సహానుభూతిని ప్రకటించింది అక్కగారు. "అదే ప్రాక్టీసు! హోమియోపతి డాక్టరు!" అన్నది సుమిత్ర.

ఇప్పుడు, మసూరీలో కోటూ, ప్యాంటూ, వైకట్టుకుని వారింటికి వెళ్ళాను. దీదీ అక్కగారు మొదట గుర్తుపట్టలా, గుర్తుపట్టాక ఎత్తి పొడుపుగా "ఏమండీ డాక్టరుగారూ! ఖద్దర్ని ఏం చేశారు?" అనడిగింది.

"ఇప్పుడు ఇంక ఖద్దరు పనేముంది? స్వరాజ్యంకోసమే కదా, ఖద్దరు తొడగడం? గాంధీగారు స్వరాజ్యం తీసుకు రావడానికి ఎటూ వెళ్ళారుగదా? (గాంధీగారు రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సుకు వెళ్ళారు) ఇంక ఖద్దరుతో పనిలేదు!" అని చెప్పాను.

సుమిత్రాదీదీని కలుసుకున్నాను. ఢిల్లీ వెళ్ళాకగానీ, తనేమీ చేయలేనంది. కుటుంబం మొత్తం బయల్దేరినప్పుడే తను ఢిల్లీకి బయలు దేరుతుంది.

* * * * * *

రష్యా ప్రయాణం వాయిదా పడుతూనేవుంది. ఇన్నాళ్ళిలో మిత్రుల అవిశ్వాసం తాలూకు మానసిక బాధ కొంత శమించింది. 'నన్ను విశ్వ సించని వాళ్ళ విషయం వదిలిపెడదాం, విశ్వసించేవాళ్ళూ చాలామంది వున్నారు. నామీద విశ్వాసంగల మిత్రుల్తో తిరిగి ఉద్యమాన్ని నిర్మించ వచ్చునుగదా?' అనిపిస్తోన్నది. 'సూరి' వారి కుటుంబం ఇటు కాంగ్రేసు వాదులకూ, అటు విప్లవకారులకు కూడా పరిచయమైన కుటుంబం! కొద్ది ప్రయత్నంతో రామసింగ్, హరిబంధు, రాజేంద్రసింగ్, రణధీర్‌సింగ్ లాంటి మిత్రుల్ని కలుసుకోగలిగాను. వీళ్ళు నాకోసం వెతుకుతూన్నారు. రాజేంద్ర, రణధీర్‌సింగ్‌లు రెండు మూడు పిస్తోళ్ళను కూడా సంపాయిం చారు. కాన్పూర్‌నుంచి 'మహిమా' ఢిల్లీ వచ్చింది. ఆమె నన్ను వెతుకు తోంది. పార్టీ ఇలా రద్దు అయిపోయినందుకు వీళ్ళందరూ బాధ పడుతూ న్నారు. నేను ఏదో కొంత చేయగలనన్న విశ్వాసం వీళ్ళందరికీవుంది. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతానికి చెందిన కృష్ణశంకర్ శ్రీవాస్తవ్ తన

మిత్రుల పూర్తి సహాయ సహకారాల్ని అందివ్వగలనని మాట ఇచ్చాడు. అతడు ఢిల్లీలోవున్న ఒక ఐరిష్‌స్త్రీని పరిచయం చేశాడు. ఆమె పేరు సావిత్రీదేవి: (మిసెస్ జాఫర్ అలీ) ఆమె జాఫర్ అలీకి విడాకులిచ్చి, మాంటుస్సోరీ పద్ధతిలో పిల్లల విద్యాలయాన్ని నడుపుకుంటోంది. ఐరిష్ వనిత కావడంవల్ల ఇంగ్లీషువాళ్ళను ద్వేషిస్తుంది. భారతదేశాన్ని తన మాతృదేశంగా భావిస్తోన్నది. ఇంగ్లీషువాళ్ళను ఈదేశం నుండి వెళ్ళగొట్టే ప్రయత్నాలకు సహకరించడం ఆమెకు చాలా ఇష్టం! వీరందరి రాజకీయ భావన హి.స.ప్ర.స. భావనలకు దగ్గరగా వుంది. వీరందరినీ కూడగట్టుకుని ఏదో ఒకటి చేయవచ్చునన్న ఆశ మొలకెత్తింది నాలో! ఇదే సందర్భంలో సుశీలాదీదీని, దుర్గాభాభిని కూడా కల్సుకున్నాము. సుశీలాదీదీ సహాయాన్ని చేయడానికి స్పష్టంగా నిరాకరించింది దుర్గాభాభీ చాలా సౌమ్యంగా మాట్లాడింది. మేము ఏమైనాచేస్తే తన శక్తివిజట్టి సహకరిస్తానన్నది.

కృష్ణశంకర్, రాజేంద్రసింగ్ - ఇద్దరూ కాన్పూర్‌నుండి కబురు పంపించారు. మరోమాటు మిత్రులందరం కూచుని ఉద్యమ నిర్మాణాన్ని గురించి చర్చించుకుందామన్నారు. ఈ మాటు సమావేశం గఢముక్తేశ్వరంలో, తిరుణాల సమయంలో జరపడానికి నిశ్చయం అయింది. జనవరి మొదటివారం....చలి ఎముకల్నికొరికేస్తోంది. నేనూ, ప్రకాశవతి ఇద్దరం వెళ్ళాం! సమావేశానికి ఇందరు రావడంచూసి ఆశ్చర్యపడ్డాం! అంతకు ముందు ఇలాంటిసమావేశాలకు ఏడెనిమిది మందికంటె ఎక్కువ మంది హాజరు అయ్యేవాళ్ళుంకాదు. సురేంద్రపాండే, మాషీమా, పంజాబు నుండి పాండే చెల్లెలూ, ఇంకా నేనెరుగనివాళ్ళు చాలామంది వచ్చారు. పాండే మంచీ-మార్బలంతో వచ్చాడు అనిపించింది. మనస్సు బాధపడ్డది. తన వాదనను మెజారిటీ నిర్ణయంపేరుతో ఒప్పించుకోవడానికి ఇదొకఎత్తు అనుకున్నాను.

పాండే పరిస్థితిని వివరించడం ప్రారంభించాడు సిద్ధాంతరూపంగా అతడికీ నాకూ అభిప్రాయభేదాలు ఏమీలేవు. అతడు సిద్ధాంతపరమైన కార్యక్రమాన్ని స్వీకరించి, ప్రమాదభరితమైన సాయుధ కార్యక్రమాన్ని నాకు వప్పగించడమే నచ్చలేదు నాకు। పాండే సాయుధ కార్యక్రమాలు తనవల్లకావనీ, ఐతే, సిద్ధాంతరీత్యా ఉద్యమాన్ని నిర్మించడంలో సహకరించగలననీఅన్నాడు.అంతకుముందు కార్యాచరణనూ,సిద్ధాంతాన్నీవేరుచేసి ఆలోచించడం అలవాటు లేకపోవడంవల్ల, నాకది విచిత్రమనిపించింది।

పాండే తనవాదాన్ని వ్యతిరేకించడానికి వీల్లేనంత సౌమ్యతగా చెప్పాడు. ఐనప్పటికీ నేను వ్యతిరేకించాను "రెండు నాయకత్వాల అవసరం ఏమీలేదు. మన లక్ష్యం ఏమిటో. సిద్ధాంతం ఏమిటో తెల్సు మనకు। ఇక పోతే, మెజారిటీ నిర్ణయాన్ని తీసుకునే విషయం అంటారా? ఇక్కడున్న వాళ్ళల్లో చాలామందిని నేను ఎరగనే ఎరగను। ఓటుచేసే హక్కు కేవలం పార్టీ సభ్యులకే ఉండాలని నా ఉద్దేశ్యం।" అన్నాను. నేను, పాండే చెల్లెల్ని పంజాబునించి వచ్చిన అపరిచితులైన ఇతర మిత్రుల్ని ఉద్దేశించి అన్నాను.

రాజేంద్రసింగ్ నా అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు. "సభ్యులంటే అర్థం ఏమిటి? ప్రాణాలకుతెగించి పోరాడే వాళ్ళందరూ సభ్యులే। అలాంటి వాళ్ళందరికీ ఓటింగ్‌హక్కు వుండాలి।" అన్నాడు. అతడి మాటను అందరూ సమర్థించారు. ఇంక నేనేం అనను....? అప్పుడే పాండే చెల్లెలు ఇలా అంది "నాయకుడు ఒక్కడే వుండాలని నా అభిప్రాయం. కమాండర్-ఇన్-చీఫ్ అన్ని కార్యక్రమాలనూ నిర్ణయిస్తాడు. అతడే నాయకుడు...." అని క్షణం ఆగి "కమాండర్-ఇన్-చీఫ్‌గా యశ్‌పాల్ వుండాలని నా అభిప్రాయం।" అన్నది ఆమె. ఆమె ప్రస్తావనను అందరూ సమర్థించారు. పాండేకూడా సమర్థించాడు. నేనలా మాట్లాడినందుకు చాలా సిగ్గుపడ్డాను. అప్పటికీ పాండే సిద్ధాంత పక్షాన్ని నిర్లక్ష్యం చేయ

కూడదని నొక్కిచెప్పాడు. అతడికి సిద్ధాంత అధ్యయనానికీ, ప్రజా సహకారాన్ని కూడగట్టుకోవడానికి ప్రత్యేకం పనిచేయవల్సిన బాధ్యతను వప్పగించాము. ఇదే సమావేశంలో మా పోరాటం దౌర్జన్యవాదంగా వుండరాదనీ, గెరిల్లా పోరాటపద్ధతుల ద్వారా విస్తృత సాయుధ పోరాటానికి ప్రయత్నించవలసి వుంటుందనీ-నిర్ణయించుకున్నాము. ఇదే సందర్భంలో కమాండర్-ఇన్-చీఫ్ యశ్‌పాల్ పేరున ఒక కరపత్రాన్ని కూడా ప్రకటించాము. ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు భాగంలో ఉద్యమ నిర్మాణానికి సమావేశం వేసుకోవడం అవసరం అన్నాడు కృష్ణశంకర్। అందుకోసం జనవరి 22వ తారీకు సాయంత్రం అలహాబాదువస్తానని అతడికి మాట ఇచ్చాను.

బండి రాత్రి తొమ్మిదిన్నర గంటలకు అలహాబాదు చేరింది. కృష్ణశంకర్ తనను కల్సుకోవడానికి హివేట్ రోడ్డు అడ్రసు ఇచ్చాడు. హివేట్ రోడ్డులో 'హోటల్ కృష్ణా' పై అంతస్తులో, ఐరిష్ మహిళ సావిత్రిదేవి గదిని అద్దెకు తీసుకుని వుంటోంది. ఈ రాత్రి సమయంలో అక్కడికివెళ్ళి ఆమెను బాధపెట్టడం ఇష్టంలేదు. పరిచయస్తులు చాలా మంది ఉన్నారు. ఎక్కడికో ఒకచోటికి వెళదామనుకున్నాను తెల్లవారి కృష్ణశంకర్‌ని కల్సుకోవచ్చుననుకున్నాను. కానీ నన్ను రిసీవ్ చేసుకోడానికి కృష్ణశంకర్ స్టేషన్‌కేవచ్చాడు. ఇంక అతనితో వెళ్ళక తప్పలేదు. అతడు నన్ను ఐరిష్ మహిళ నివాసానికి తీసుకువెళ్ళి దింపాడు. నాకు అప్పుడే కొంత బాధకలిగింది. కారణం ఏమిటంటే, భారతీయ కట్టూ బొట్టూతో, ఈ దేశపు సాధారణ ప్రజలమధ్య నివసించే యూరోపియను వనితపట్ల ప్రజలు ఉత్సుకతను ప్రదర్శించడం సాధారణ విషయం। అలాంటి ఆమె అతిధినైన నాపట్ల కూడా ఆసక్తిని కనబరుస్తారు గదా ప్రజలు? ప్రజలదృష్టికి ఎక్కకుండా వుండటానికే సదా ప్రయత్నిస్తూ వుంటాను. సావిత్రీదేవి ఎంతో ఆత్మీయతగా ఆతిధ్యాన్నిచ్చారు.

భోజనం అయింది. పడుకోబోతున్నాను. నా గరమ్‌కోటును చిలకకొయ్యకు తగిలించాను. ఆజాద్ నాకు ప్రత్యేకం ఇచ్చిన ఎనిమిది గుళ్ళతుపాకీ, విడి మేగజీనూ కోటు జేబులోవున్నాయి. నిద్రపోయేప్పుడు వాటిని తలకింద పెట్టుకు పడుకోవడం అలవాటు!

కృష్ణశంకర్ శ్రీవాస్తవ్ వెళుతూ "సమావేశానికివచ్చే మిత్రులకు సమయాన్ని, ప్రదేశాన్ని చెప్పివస్తాను. నేను ఇంక తెల్లవారుఝామున ఐదు, ఐదున్నర గంటలకు వస్తాను!" అన్నాడు.

బయటకు వెళుతూ "భై య్యా! చలి ఎముకల్ని కొరికేస్తోంది. నీకోటు వేసుకువెళ్ళనా?" అని అడిగాడు.

కోటు జేబులోవున్న పిస్తోల్‌ను నాకు ఇచ్చి, కోటు వేసుకువెళ్ళమన్నాను. కృష్ణశంకర్ గోడదగ్గర పడివున్న రివాల్వర్ని చూస్తూ "ఇదిగో రివాల్వర్! మదర్‌దగ్గర ఇంకా వున్నాయికూడాను!" అన్నాడు. శ్రీవాస్తవ్ సావిత్రిగారిని మదర్ అనిగానీ, 'మా' అనిగానీ పిలుస్తాడు. ఆమెను తల్లిలాగానే భావిస్తాడు.

అతడు వెళ్ళగానే దగ్గర్లో పడివున్న రివాల్వర్ని తీసుకుని, గుండ్లు విడిగాతీసి ఒకసారి నొక్కిచూశాను. సరీగా నడవలేదు. మీటను ఎడం చేత్తో సరిచేసుకుంటూ, కుడిచేత్తో కాల్చవల్సి వుంటుంది దాన్ని! తలకింద పెట్టుకు పడుకున్నాను. ఇంకోటి ఉందో, లేదో కూడా కనుక్కోలేదు.

చిన్నతనం నుంచి తెల్లవారుజామునే నిద్రలేవడం నా అలవాటు! నిద్రలేచి టైం చూసుకున్నాను. ఐదు గంటలు అయింది. సావిత్రిదేవి కూడా లేచింది. "టీపెట్టిఇవ్వనా?" అని అడిగింది. నిద్రలేవగానే ఒక కప్పు వేడివేడి టీతాగితే హాయిగావుంటుంది. ఇవ్వమన్నాను. ఆమె స్టౌ వెలిగించి, టీతయారుచేసే ప్రయత్నంలోవుంది "కృష్ణశంకర్ శ్రీవాస్తవ్ వస్తూవుండవచ్చును!" అనుకున్నాను మనస్సులో!

సావిత్రీదేవి రెండో అంతస్థులో వుంటోంది. మెట్లమీద అడుగుల శబ్దం వినిపించింది. శ్రీవాస్తవ్ వస్తూన్నాడనుకున్నాను. ఐతే, చాలా మంది వస్తూన్న శబ్దం అది!

"ఎవరో వస్తూన్నా"రన్నది సావిత్రీదేవి.

"చాలామంది వస్తూన్న శబ్దం ఇది!" అన్నాను నేను.

తలుపు కొట్టారు. తలుపు కొట్టడంలో దాష్టీకం కనుపిస్తోంది.

"ఎవరు?" సావిత్రిగారు ఇంగ్లీషులో అడిగింది.

"తలుపుతెరు!" బయట నుంచి ఇంగ్లీషులో ఆర్డర్ వచ్చింది!

"ఎవరు నువ్వు?" మళ్ళీ అడిగింది ఈమె.

"పోలీసులం త్వరగా తలుపుతెరు!"

రోమాలు నిక్కబొడుచుకున్నాయి. అంతిమ సమయం వచ్చేసింది అన్న భావన కరెంటు షాక్‌లా తగిలింది. సావిత్రీదేవి నావైపు అను మానంగా చూసింది. బయట ఉన్న పోలీసుల్ని ఉద్దేశించి "పోలీసులకు ఇక్కడేం పనుంది?" అనడిగింది.

"నీ యింటిని సోదా చెయ్యాలి. త్వరగా తెరు. లేకపోతే తలు పుల్ని బద్దలుకొట్టవల్సి వుంటుంది!" సంభాషణ ఇంగ్లీషులో జరుగుతోంది.

సావిత్రీదేవి మళ్ళీ ఒకమాటు నావంక చూసింది.

"మీరు తలుపు తెరచి ఒకపక్కకు తప్పుకోండి! నేను పోరాడు తాను. మీరు మధ్యలోకిరాకండి! తలుపు తెరవండి!" అన్నాను. దిండు కిందనుంచి రివాల్వర్ తీసుకున్నాను.

సావిత్రీదేవి తలుపుతీయడానికి ముందుకు అడుగు వేసింది. నేను వాకిలివైపు గురిపెట్టాను. తలుపు తీయగానే మొదట నేనే కాల్చాలను కున్నాను. కానీ, అలా కాలిస్తే మొదటి గుండు సావిత్రీదేవికే తగు ల్తుంది. మరోచోటు ఏదైనా వెతుక్కోవాలి! 'పారిపోవడానికి వీలుంచే

సరే, సరి! లేకపోతే దేన్నయినా చాటుచేసుకు బాగా పోరాడదా'మను కున్నాను.

ఆ ఇల్లూ, పరిసరం నాకు కొత్త! వెనుక గదిని ఆనుకుని వాకిలి వుంది. చిన్న మెల్లావుంది. ఎదురుగా నిలువెత్తున సీనారేకుల్తో అడ్డంకట్టిన దడివుంది. ఆ రేకులు నాకంటే ఎత్తుగావున్నాయి. చేతులు మోపి అవతలికి దూకబోయాను. నా వెనుకనుంచి కాల్పుల శబ్దం వినిపించింది. నాతలమీదుగా గుండు దూసుకుపోయింది. అవతలవైపుకు దూకాను. మరో గుండు వచ్చి నా పక్కనే పడ్డది. వెనక్కు తిరిగి గొంతుక్కూచుని ముందుకు చూశాను. రేకుల దడి కొసనుండి ఒక యూరోపియన్ పిస్తోలుతో నామీదకు కాలుస్తున్నాడు. నేనూ అతడికి గురిచూసి కాల్చాను. యూరోపియన్ తలచాటు చేసుకున్నాడు. క్రింద బజార్లో నుండి కూడా తుపాకులు కాల్తూన్న శబ్దం వినిపించింది.

నన్ను కాల్చడానికి అతడు తలపైకి పెట్టినప్పుడు, నేనూ కాలుస్తున్నాను. రివాల్వర్ మొండికి వేస్తూన్నది. ప్రతిమాటూ దాన్ని ఎడం చేత్తో సరిచేసుకుని కాల్చవల్సి వస్తోంది. శతృవు రెండుమార్లు కాలిస్తే, నేను ఒక్కమారు కాలుస్తున్నాను. రివాల్వర్‌లో ఆరేగుండ్లు వున్నాయి. తొందరలో ఇంకా గుండ్లను తీసుకోవడం మర్చేపోయాను. నా రివాల్వర్‌లో గుండ్లు అయిపోయాయి. అతడు కాల్చిన ఒక్క గుండూ నాకు తగల్లేదు అందుకు, అతడిలోని ఆత్మరక్షణ తాలూకు ఆదుర్దా కొంత కారణం, చీకటి కూడా కొంత కారణం! నేను కాల్చినవీ అతడికి తగల్లేదు. గుండ్లు అయిపోయాయి. యూరోపియన్ తలపైకి పెట్టాడు. ఖాళీ రివాల్వర్ని అతడిమీదకు విసిరికొట్టాను.

ఈమాటు యూరోపియన్ తలపైకిపెట్టి పిస్తోలును నావైపు గురిపెట్టాడు. ఐతే, కాల్చలేదు. "Now You are unarmed" (ఇప్పుడు నీవు నిరాయుధుడివి) అన్నాడు.

అతడు ఒక్క క్షణం ఆగాడు. అతడి స్వరం మారింది. "సరే, ఇటురండి!.... నేను సాయంచేయనా?" యూరోపియన్ ఎత్తైన వస్తువును దేన్నో ఎక్కి నాకు సాయం చేయడానికి తన చేతిని రేకుల ఇవతలకు పెట్టాడు.

"ధన్యవాదం"

నేనతడి సహాయాన్ని అపేక్షించకుండానే చేతులవూతంతో ఎగిరి అవతలవైపుకు దూకాను. అవతలవైపున రేకులకు పూతంగా వుండడానికి కొయ్యదుంగ నొకదాన్ని పాతారు. అతడు ఆ దుంగమీదకు ఎక్కి నన్ను కాల్చగలిగాడు. చేయి అందించడానికి ఆ దుంగమీదనే ఎక్కాడు. "దెబ్బలేమీ తగల్లేదు గదా?" అతడు నన్ను అడిగాడు.

"లేదు! మీకూ తగల్లేదనే అనుకుంటున్నాను!" అని అన్నాను.

అతడు మోకాలిదగ్గర నాపైజామాకు ఉన్న రక్తపు మరకను చూపుతూ "ఈమరక ఏమిటి?" అనడిగాడు.

నేనూ చూసుకున్నాను. "ఏమీలేదు, రేకు గీచుకుంది!" అన్నాను.

ఆ యూరోపియన్ తన పరిచయాన్ని ఇచ్చాడు "నాపేరు డి. పిడ్లిచ్! స్పెషల్ పోలీసు సూపరింటెండెంట్ ను! మీరు మిస్టర్ యశ్ పాలని నాకుతెలుసు!" అన్నాడు.

"ధన్యవాదం!"

అప్పుడే ఒక హెడ్‌కానిస్టేబుల్ తుండు నొకదాన్ని మెలిపి నాచేతులకు కట్టడానికి ముందుకు వచ్చాడు. పిడ్లిచ్ అతడిని అవతలకు పొమ్మన్నాడు. "నా ఉద్దేశంలో చేతులు కట్టవల్సిన అవుసరం లేదనుకుంటున్నాను. మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు నన్ను.

"అవుసరం వుండదని నేనూ అనుకుంటున్నాను. ఆ తరువాత మీ ఇష్టం!" అన్నాను.

"మీరు ఇప్పుడే లేచినట్టున్నారు బట్టలు మార్చుకోండి అంత వరకూ వేచివుంటాం!" అన్నాడు పిడ్లిచ్.

"నేనొక్క కంబళీ మాత్రం తీసుకుంటాను చాలు!"

"మీ ఇష్టం!"

అక్కడ నుండి వెళ్ళబోయేముందు సావిత్రిదేవిగారికి నమస్కరించి "నానుంచి మీకూ బాధ కలిగినందుకు విచారిస్తూన్నాను!" అన్నాను.

సావిత్రీదేవి గర్వంగా తలపైకెత్తి "నేను విచారించవలం లేదు. గర్వపడుతూన్నాను!" పిడ్లిచ్‌వైపు తిరిగి "నేనీ ఇంగ్లీషు దుర్మార్గుల్ని ద్వేషిస్తున్నాను!" అన్నది.

దీన్నిబట్టి ఈమె తనకు తెలియనట్టు నటించి శిక్ష నుండి తప్పించుకునే ప్రయత్నం చేయదని స్పష్టమయింది.

పిడ్లిచ్ ఇనస్పెక్టరుకు ఆజ్ఞ ఇచ్చాడు. "ఈ ఇంటిని సోదాచేసి అవసరం అయిన చర్య తీసుకోండి!" అన్నాడు. తరువాత నన్ను వెంట పెట్టుకుని, మరో ఆఫీసరుతోనూ, నలుగురు కానిస్టేబుళ్ళతోనూ-కల్సి కిందికి దిగాడు. కింద, వీధిలో ఒక చిన్నకారు, మూడు పోలీసులారీలు వున్నాయి. కొందరు కాంగ్రేసు జండాపుచ్చుకుని, ఆశ్చర్యంగా చూస్తూ ఒకపక్కగా నిలబడి వున్నారు. జాతీయవారం జరుగుతోంది. ప్రభాత భేరిని జరుపుతున్న దళమది! వాళ్ళు దేశ స్వాతంత్ర్యంకోసం నినాదాలిస్తూన్నారు నేనూ నాపద్ధతిలో దేశస్వాతంత్ర్యం కోసమే ప్రయత్నించాను. కానీ, ఆ క్షణాన వాళ్ళూ నేనూ ఒకరికొకరం అపరిచితులం! తుపాకి కాల్పుల శబ్దాల్నివిని రోడ్డుమీద చాలామంది జనం ప్రోగుపడ్డారు.

చిన్నకార్లో పిడ్లిచ్ కూచున్నాడు. ప్రక్కన నన్ను కూచోమన్నాడు. నావక్కన రెండవ ఆఫీసరు కూచున్నాడు. ముందుసీటులో, డ్రైవరు, పక్కన సాయుధుడైన పోలీసు కూచునివున్నాడు. కారు బయల్దేరింది.

మా కారుకు ముందూ, వెనుకా సాయుధులైన పోలీసుల్తోనిండిన లారీలు ఉన్నాయి. కొంచెందూరం వెళ్ళాక పిడ్లిచ్ నాపక్కనకూర్చున్న ఆఫీసర్ని పరిచయం చేశాడు నాకు "వీరు డిప్యూటీ సూపరింటెండెంట్ మిస్టర్ మిశ్రా!" అన్నాడు.

మిశ్రా ఇలా అన్నాడు ''మీరు పంజాబీలుకదా? నేను పంజాబులో చాలా రోజులువున్నాను. పంజాబీలు సహజంగానే సాహసవంతులు!" ఆయన పంజాబీలోనే మాట్లాడుతూన్నాడు. ''చాలా చలిగావుంది. వెళ్ళి టీ తాగుదామంటారా? లేకపోతే, లస్సీ తాగుదామా? (లస్సీ వజ్జిగతో తయారుచేసే ఒకరకం పానీయం. పంజాబీలు ఇష్టంగా తాగుతారు!) పంజాబీలు చలికాలంలోనూ లస్సీ తాగటానికే ఇష్టపడతారు!'' అన్నాడు.

నేనొకమాటు తీక్షణంగా మిశ్రావంక చూశాను. ''ఇలాంటి పరిహాసాలు నాకు నచ్చవ్!'' అన్నాను ఇంగ్లీషులో.

మిశ్రా ఒక్కక్షణం మౌనంగా వుండిపోయాడు. తరువాత ,'I am sorry'' అన్నాడు,

నేను కోపగించుకోవల్సిన పనిలేదు. మిశ్రా నాతో పరిహాసమూ ఆడలేదు ఓటమిని కప్పిపుచ్చుకోవాలన్న వ్యర్థప్రయత్నంలో అలా కోపగించుకున్నాను.

మాకారు క్రైవింగ్‌రోడ్డు పోలీసుస్టేషన్ లోపలకు వెళ్ళిపోయింది. డ్యూటీలోవున్న పోలీసులు పరుగెత్తుకువచ్చారు. పిడ్లిచ్ లాకప్ గదిలో ఒక కుర్చీనీ, ఒక మేజాబల్లనూ వేయమని అజ్ఞ ఇచ్చాడు. తరువాత నన్నిలా అడిగాడు ''టీ తెప్పించమంటారా?''

"అలాగే, ధన్యవాదం!"

"మీకేమైనా అవసరమైతే, కబురుపెట్టండి. నూరువిధాలకు నేనే వచ్చి కల్సుకుంటాను!" అన్నాడు.

పిడ్లిచ్, మిశ్రా - ఇద్దరూ వెళ్ళిపోయారు. లాకప్‌కొట్టు ఇనుప సువ్వల తలుపులు మూసుకున్నాయి. ఒకపోలీసు బాయనెట్ పుచ్చుకుని పహరా ఇస్తూన్నాడు.

నేను నమ్మకద్రోహంవల్ల పట్టుపడ్డానని అందరూ విశ్వసిస్తూన్నారు. నేను జైల్లోవుండగా, నా కేసునుచూస్తున్న ప్లీడరుద్వారా, మిత్రులు నన్నీ విషయమై ఎన్నో ప్రశ్నలు వేశారుకూడాను. ఎలా జరిగిందో, ఏం జరిగిందో ఉన్నదున్నట్టుగా ఇక్కడ వర్ణించాను. దీన్నిబట్టి నేను కృష్ణశంకర్ శ్రీవాస్తవ్‌ను అనుమానించడం సహజం! అతన్నే అనుమానించాను. అతడు నన్ను తీసుకువెళ్ళి సావిత్రీదేవి దగ్గరవుంచడం, నా పిస్తోలును తీసుకువెళ్ళడం, పిడ్లిచ్ స్వయంగా 'మీరు మిస్టర్ యశ్‌పాల్!' అనడం ఇవన్నీ అతడిని అనుమానించడానికే దోహదంచేస్తున్నాయి. నేను అలహాబాదు వచ్చిన విషయం ఒక్క కృష్ణశంకర్‌కే తెల్సు!

సావిత్రీదేవిని నేను కల్లోకూడా అనుమానించలేదు. నాకు ఆశ్రయం ఇయ్యడంవల్ల ఆమె నాలుగుసంవత్సరాలు జైలుశిక్షఅనుభవించింది. నేను జైల్లోవుండగా కృష్ణశంకర్‌ని ఎవరో కాల్చారనికూడా విన్నాను. అయితే, అతడు బ్రతికిపోయాడు. తరువాత సత్యాగ్రహంచేసి జైలుకు వెళ్ళాడు.

నేను జైలునుంచి విడుదల అయ్యాకకూడా చాలామంది నన్నీ విషయమై అడిగారు. వాళ్ళకు నేను ఒకటే సమాధానం ఇచ్చాను "ఇప్పుడంతా అయిపోయింది. ఇంక ఈప్రశ్నను తేవలసిన పనిలేదు!"

నేనూ ఈ ప్రశ్నగురించి చాలారోజులు ఆలోచించాను. కేవలం కృష్ణశంకర్‌నే అనుమానించవల్సిన పనిలేదు. అతడు సమావేశానికి పిల్చిన మిత్రుల్లో ఎవడైనా నాగురించి పోలీసులకు కబురుపెట్టవచ్చును గదా? సావిత్రీదేవిగారి ఇంట్లో నేను అరెస్టు అయితే, ఆమెకూ ప్రమాదమన్న విషయం కృష్ణశంకర్‌కు తెలియదా? సావిత్రీదవి అంటే అతడికి

ఎంతో అభిమానం, గౌరవంకూడాను! ఆమెకుకూడా అతడంటే ఎంతో మమకారం! ఒకరకంగా పుత్రవాత్సల్యం! అతణ్ణి గుడ్డిగానూ నమ్ముతుంది. 1938లో నేను జైలునుంచి విడుదల అయ్యాక ఢిల్లీలో వుంటూన్నాను. అప్పుడు సావిత్రీదేవి కృష్ణశంకర్‌ని తీసుకుని నాదగ్గరకు వచ్చింది. నాకు కృష్ణశంకర్‌మీద సందేహంలేదని రాసి ఇవ్వమంది!

నేను అప్పుడూ ఆమెపట్ల ఎంతో కృతజ్ఞతను ప్రదర్శించాను. నావల్ల ఆమెకు కలిగిన బాధకు విచారాన్ని ప్రకటించాను. ఇలా అన్నాను "కృష్ణశంకర్ నాపట్ల విశ్వాసఘాతుకాన్ని చేశాడని నేను అనను! ఐతే, ఎవరుచేశారో నాకు తెలియదు. కనుక, కృష్ణశంకర్ చేయలేదనీ నేను రాసి ఇవ్వలేను!"

నేను అరెస్టు అయినప్పుడు నానుంచి తనకుకలుగబోయే బాధకు విచారాన్ని వ్యక్తపరిచాను అప్పుడు సావిత్రీదేవి ఇలా అన్నది. "ఇందుకు నేను విచారించడంలేదు. గర్విస్తున్నాను!"

నేను జైల్లోవుండగా నా సోదరు శ్యామ్‌కుమారి నెహ్రూ పరిహాసంగా ఇలా అనేది. "ఆ ముసలిదానిమీద ఏం మత్తుమందు చల్లావోగాని, జైల్లోనూ నీమీద కవిత్వం రాస్తోందిట!"

కానీ, 38 లో ఆమె అడిగినట్టు నేను రాసి ఇవ్వలేదు అప్పటి నుండి ఆమె నన్ను నీచుణ్ణనీ, కృతఘ్నుణ్ణనీ అంటోందిట! నాలాంటి వాడికోసం ఇన్ని బాధలు పడ్డందుకు విచారపడుతూన్నదిట!

భారతదేశంలో 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సేన' స్వాతంత్ర్యంకోసం చేసిన పోరాటంలోని నా అనుభవాలు నా అరెస్టుతో ముగిశాయి. ఇక పాఠకుల తృప్తికోసం జైలు అనుభవాల్ని వ్రాయవల్సి వుంది వాటినీ వ్రాస్తాను!

* * * * * *

# 19. జైలు అనుభవాలు

అలహాబాదు హివేట్ రోడ్డులోని సావిత్రిగారి ఇంట్లో అరెస్టు చేశాక నన్ను క్రైవింగ్ రోడ్డులోని పోలీస్ స్టేషన్‌లో కస్టడీలో పెట్టారు. భయమూ, ఉద్రేకమూ అప్పటి నాప్రవర్తనమీద తప్పకుండా ప్రభావాన్ని వేసి ఉంటాయి. అప్పటి నాస్థితి, నా మనస్సులోని భావాలు, శంకలూ కూడా నాప్రవర్తనపై ప్రభావాన్ని వేశాయి. ముఖ్యంగా లాహోరు కుట్ర కేసులో సుఖదేవుకు యురిశిక్ష వేశారు. మరి నేను లాహోరు, ఢిల్లీ, కాన్పూరు ఈ మూడు ప్రాంతాలకు చెందిన అభియోగాల్లో నిందితుడ్ని. నాకు ఉరిశిక్ష విధించకుండా ఉంటారనుకోవడానికి వీలులేదు. ఇతర మిత్రులూ, నాకు ఉరిశిక్ష విధిస్తారన్న ఉద్దేశ్యంలోనే ఉన్నారు. పైగా, పోలీసులు నన్ను బాగా హింసించి ఇతర మిత్రులను గురించీ, ఇతర సంఘటనలను గురించీ నా దగ్గర నుండి విషయాన్ని రాబట్టుకుంటారనీ అనుకుంటున్నారు. మనస్సులోని యిలాంటి భావాల కారణముగా మృత్యువుకూ, అన్నిరకాల హింసలకూ సిద్ధంగా ఉండాలని అనుకున్నాను. నేను చేయగల్గిందంతా చేశాను. అలాగే శత్రువుకూడా నన్ను హింసించ గలిగినంతా హింసిస్తాడు. శత్రువునుండి ఎంతకష్టం ఎదురైనా దృఢంగా చెక్కుచెదరకుండా ఉండి నా వ్యక్తిగత గౌరవాన్ని, విప్లవసంఘ గౌరవాన్ని, కాపాడుకోవాలి. నేను ఏమాత్రం లొంగినా యింక పతనమేగతి. నా గౌరవాన్ని, విప్లవసంఘ గౌరవాన్ని కాపాడుకోవలెనన్న తీవ్రమైన ఆలోచనల్లో అనవసరమైన కోపాన్ని ప్రదర్శించిన సందర్భాలూఉన్నాయి.

నన్ను ఖైదుకొట్టులోపెట్టి యింకా పది నిమిషాలు అయినా గడవ లేదు. ఒక పోలీసు కేక వేశాడు. "ఇదుగో టీతీసుకో".

నేను జైలు దర్వాజావైపు వీపుపెట్టి కూర్చున్నాను. వెనక్కు తిరిగి చూశాను. పోలీసు నల్లని మురికి ఓడుతూన్న అల్యూమినియం

గ్లాసుమ ఇనప చువ్వల్లోంచి లోపలకుపెట్టి వెళ్ళిపోయాడు. అలా టీ యివ్వడం చాలా అవమానకరం అనిపించింది. పోలీసు నాలుగడుగులే వెళ్ళాడు. గ్లాసును తీసుకొని టీతోసహా ఇనుపచువ్వల అవతలకు విసిరి కొట్టాను.

ఐదు నిమిషాలు గడిచాక పోలీస్ ఇనస్పెక్టర్ వచ్చాడు. సాను భూతితో "టీని అంతా పారబోశారా?" అని అడిగాడు.

"నేను అలాంటి టీ తాగను" అన్నాను,

"ఐతే, ట్రేలో పంపించమంటారా?"

"అవును".

కొద్దిసేపు గడిచింది. దగ్గరలో ఉన్న హోటల్నుంచి గావుఘ టీ తెప్పించారు ట్రేలో డికాషన్, పాలు, పంచదార–విడివిడిగా వచ్చాయి. ఇనస్పెక్టర్‌గారు క్షమాపణ వేడుకున్నారు. "వీళ్ళు ఒట్టి అడవి మను షులు టీఎట్లా తాగుతారో వీళ్ళకేంతెలుసు"అని అన్నారు, నాకు మొదట టీ తెచ్చిఇచ్చిన పోలీసుగురించి! ఇనస్పెక్టరుగారు నాపట్ల ఇలా ఎందుకు సౌజన్యతను ప్రదర్శిస్తున్నారో నాకు అర్థంకాలేదు. ఏమైనాకానీ నేను అడవి జంతువులా కటకటాల వెనుక బంధింపబడ్డాను.

మరో అర్ధగంట గడిచింది. బయట చాలా సంరంభంగా ఉంది. ఇద్దరు పోలీసులు భుజాలన తుపాకులు పెట్టుకొని ఖైదుకొట్టు ముందు కొచ్చి నిలబడ్డారు. తలుపు తెరిచారు. ఇద్దరు ఇంగ్లీషువాళ్ళు ఖైదుకొట్టు లోకి వచ్చారు. ఒక అతడు పొడ్డుగా కొంచెం పొట్టిగా ఉన్నాడు. మరో అతడు పొడుగ్గా, పొడుక్కుతగ్గ లావుగాఉన్నాడు. ఇద్దరూ ప్రౌఢులే.

"గుడ్‌మార్నింగ్, చివరకు నిన్ను పట్టేశాం!" వాళ్ళల్లో ఒకతడు లోపలకు వస్తూనే చురక అంటించాడు.

"గుడ్ మార్నింగ్!" అంటూ లేచి నిలబడి "కుర్చీ ఒకటే ఉంది మిమ్మలను ఎలా కూర్చోమనను? తమరు ఎవరో తెలుసుకోవచ్చునా?" అన్నాను.

ఇద్దర్లో పొట్టిగా ఉన్న అతడే మాట్లాడుతున్నాడు. "మీరు యశ్ పాల్! మాకు తెలుసును. మరి మేము ఎవరమో మీకు తెలియదా? మీ తుపాకీతో మా బుర్రల్ని ఎగరగొట్టటానికి ఎన్నోమార్లు మా బంగళాల చుట్టూ తిరిగారు కదా?" అన్నాడు.

దొరగారి అజ్ఞానానికి నవ్వుకున్నాను. "ఆ భయంతో మీరుచాలా రాత్రుళ్ళు నిద్రపోకుండా గడిపారనుకుంటాను! నా దురదుష్టమో ఏమో, మీరు ఎవరో నిజంగా నాకు తెలియదు" అన్నాను.

దొరగారు మామూలుస్థితికి వచ్చారు. ఇలా అన్నారు. "నాపేరు హాలిన్స్. యు.పి పోలీస్ యినస్పెక్టర్ జనరల్‌ని. వీరు మిస్టర్ షా. సి. ఐ. డి. పోలీస్ డిప్యూటీ యినస్పెక్టర్ జనరల్" అంటూ తన సహ చరుడివైపు సంజ్ఞ చేశారు.

హాలిన్స్‌కు, నాకు ఈ సందర్భంలో జరిగిన వివరాన్ని సింహావలోకనం మొదటి భాగంలోనే యిచ్చాను. ఈమధ్య 1954 అక్టోబరులో ఇంగ్లాండునుంచి ప్రకటింపబడే 'మెన్‌జాన్‌లీ' అనే ఇంగ్లీషు పత్రికలో యస్ టి హాలిన్స్ సి ఐ యి భారతదేశంలోని తనఅనుభవాలను వ్రాశాడు అతడి అనుభవాల్లో నా అరెస్టును గురించి, ఆజాద్ మృత్యువును గురించి కూడా వ్రాశాడు. ఇప్పటికి 22 సంవత్సరాలు కావడంవల్ల బహుశా అతడు నాపేరును మరిచిపోయి ఉంటాడు. మరి కూడా కొన్ని విషయాలను యిష్టం వచ్చినట్లు వ్రాసుకొచ్చాడు. వైస్రాయి ట్రైన్‌కింద బాంబు ప్రేల్చడం డిశంబరు 31న అనీ సావిత్రిగారు తాను అరెస్టు అయిన సంవత్సరానికి జైలులోనే చనిపోయిందనీ వ్రాశాడు. అది సరికాదు.

ఆమె పూర్తిగా జైలుశిక్షను అనుభవించి విడుదలయింది. 1938 జూలైలో భువాలీలో నన్ను కలుసుకున్నది కూడాను.

హాలిన్స్‌తో ఇలా అన్నాను. "మీరు ఇలా వచ్చినందుకు కృతజ్ఞుణ్ణి. ఏమిటి సెలవు?"

హాలిన్స్ వెంటనే ఇలా అడిగాడు. "మీరు బాగాచదువుకున్నవారు. సంస్కారం కలవారు ఈ మార్గాన్ని ఎందుకు అనుసరించారు?"

"మరే మార్గములేదుగనక! మరేవిధంగా చెప్పినా మీరు వినరు గనక" అని సమాధానంఇచ్చాను. హాలిన్స్ అడిగింది విప్లవం సంబంధంగానేనని స్పష్టమవుతున్నది.

హాలిన్స్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ "మీ అభిప్రాయం?" అన్నాడు.

"నా అభిప్రాయం స్పష్టమే! ఈ దేశంలోని నూటికి 99 మంది మానవులు కూడూ, గుడ్డ, ఇల్లూ లేకండా, పశువుల్లాంటి జీవితాన్ని గడుపుతున్నారు విదేశీ దాస్యమనే ఇనుప పిడికిట్లో నలిగిపోతున్నారు. దాస్య విముక్తికి ప్రయత్నించడం స్వాభావికం కాదా?" అని అడిగాను.

ఈదేశంలోని సాధారణ ప్రజలు దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారని హాలిన్స్ అంగీకరించాడు. స్వాతంత్ర్యంకోసం ప్రయత్నించే హక్కు ఈదేశ ప్రజలకు ఉన్నదనీ అంగీకరించాడు. ఐతే, ఓ ఘనమైన ఉపదేశాన్నీ చేశాడు. స్వాతంత్ర్యం పొందటానికి గాంధీగారి మార్గమే సరి అయిందన్నాడు.

నేను ఇలా అన్నాను. "బ్రిటీష్ ప్రభుత్వం గాంధీగారి మార్గమే సరిఅయిందని అనుకుంటే, మరి కాంగ్రేస్ కార్యకర్తలపైన లాఠీచార్జి చేయడానికి కారణం? తుపాకీ కాల్పులు ఎందుకు సాగుతున్నాయి. అదీ కాక గాంధీగారి మార్గమే సరిఅయిందనుకుంటే కాంగ్రేసునెందుకు నిషేధించారు?"

హారిన్స్ కు పై విధంగా సమాధానం యిచ్చాను ఒక బ్రిటీష్ అధికారికి అంతకంటే సమాధానం ఏమివ్వగలను? కానీ, ఒక విప్లవ కారుడి దృష్టికోణం నుండి ఆలోచిస్తే సమాధానం ఎలా వుంటుంది? సరి అయిందని గాంధీ మార్గాన్ని, గాంధీ ఉద్యమాల్ని శత్రువు అంటున్నాడు: దీనికి అర్థం ఏమిటి? స్వాతంత్ర్య ప్రాప్తికి గాంధీ నడిపే ఉద్యమాలు, లేక ఆయన సిద్ధాంతాలు భారత స్వాతంత్ర్యానికి ఉపయోగ పడటం కంటే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకే ఎక్కువగా ఉపయోగపడతాయి గఫ్ వాల్ పోలీసులు పూర్తి అహింసాత్మకంగా సత్యాగ్రహం చేశారు. దాన్ని గాంధీగారు విమర్శిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం తరుఫున వకాల్తాపుచ్చుకున్నారు. మరి గాంధీగారి ఉద్యమాలు బ్రిటీష్ ప్రభుత్వానికే ప్రయోజనాన్ని చేకూరు స్తాయనడానికి ఇంతకంటె ప్రమాణం ఇంకేంకావాలి?

ఇక్కడ మరొక విషయమూ స్పష్టపరచవలసిఉంది. నేను గాంధీ గారిని, వారి ఉద్యమాల్ని బ్రిటీష్ ప్రభుత్వానికి సహాయకారులు అంటు న్నాను. అందుకు కారణం ఉంది. 1954 అక్టోబర్ మొదటి వారం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో జి.డి. తేందుల్కర్ ఒకలేఖ వ్రాశాడు. అందులో సోవియట్ ప్రచురించిన విశ్వకోశంలో గాంధీని గురించిన వివ రణను అధిక్షేపించాడు. ఇంతకూ గాంధీగారిని గురించి సోవియట్ విశ్వ కోశంలో ఉన్న వివరణ ఏమిటో? అందులో గాంధీగారినిగురించి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సహాయకుడని, భారత స్వాతంత్ర్య పోరాటానికి శత్రువు అని వివరణ ఇవ్వడం జరిగింది.

అదే విషయాన్ని, లేక అదే అభిప్రాయాన్ని ప్రకారాంతరంగా హారిన్స్ ప్రకటించాడు. హారిన్స్ ఈ దేశంలో భారత స్వాతంత్ర పోరా టాలను అణచటానికి ఉన్నాడు. అలాంటి బ్రిటీష్ అధికారికి, భారత స్వాతంత్ర్యంకోసం జరుగుతున్న ఇతర పోరాటరూపాల కంటే గాంధీగారి

అహింసాపోరాటం తక్కువ ప్రమాదకరమైనదిగా, బ్రిటీష్ సామ్రాజ్యానికి సహకరించేదిగా అగుపించడం సహజమే।

ఈనాడు భారతదేశం స్వాతంత్ర్యం పొందింది అంటున్నాం. మరి ఇప్పుడూ గాంధీగారిని బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సహాయకుడని అనవచ్చునా? భేషుగ్గా అనవచ్చును। ఐతే, అనేముందు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని, బ్రిటీష్ సామ్రాజ్యంద్వారా స్థాపించబడిన వ్యవస్థను, బ్రిటీష్ ప్రభుత్వాన్ని వేరుపరచి చూడవలసి ఉంటుంది. గాంధీగారు బ్రిటీష్ సామ్రాజ్యవాదుల్ని భారతదేశంనుంచి వెళ్ళమంటూనే వారు స్థాపించిన సామ్రాజ్యవాద వ్యవస్థను అక్షుణ్ణంగా భారతదేశంలోనిలబెట్టారు బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి అతిముఖ్యమైన మూలస్థంభాలు, రాచరిక వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ। ఈరెండు వ్యవస్థలకూ భారతదేశంలో ఏ మాత్రము నష్టమూ జరగనివ్వలేదు గాంధీగారు. ప్రజలు విప్లవంద్వారా ఈదేశంలోని రాచరిక వ్యవస్థనూ, పెట్టుబడిదారీ వ్యవస్థనూ కూల్చడానికి సన్నద్ధులైన ప్రతిసారీ గాంధీగారు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సహకరించారు. బ్రిటీష్ సామ్రాజ్యంతోపాటు వారు స్థాపించిన రాచరిక, పెట్టుబడిదారీ వ్యవస్థలు కూడా ఈదేశంనుండి శాశ్వతంగా పోతాయనుకున్న ప్రతిసారీ గాంధీగారు బ్రిటీష్ సామ్రాజ్యమే ఈదేశంలో ఉండాలని కోరుకున్నారు. గాంధీగారు 1941 ఏప్రిల్ నెల హరిజన్‌లో స్పష్టంగా వ్రాశారు "I hope I am not expected knowingly to undertake a fight that must end in anarchy and red ruin" పై కొటేషన్‌నుబట్టి మనం ఏమను కోవాలి? గాంధీగారు రాచరికంపోయి ఎర్ర విధ్వంసంవచ్చేకంటె బ్రిటీష్ ప్రభుత్వం ఈదేశంలో ఉండటమే కల్యాణకారి అనుకున్నారు

'గాంధీగారు బ్రిటీష్ ప్రభుత్వానికి ఎంతో కొంత సహాయకులు' అని అంటే, కాంగ్రేస్‌వారి మనస్సుకు బాధ కలుగుతుంది. ఎందుకంటే, కాంగ్రేసువారు చారిత్రక సత్యాలను తమకు అనుకూలంగా వక్రీభవింప

జేసుకుని కాంగ్రేసుయొక్క అహింసాత్మక విప్లవం ద్వారానే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటున్నారు. అలా చెప్పుకుని గర్వపడుతున్నారు. బర్మా, శ్రీలంక, భారతదేశాలలోని బ్రిటీష్ శాసనం అంతరించిపోవడమూ, పాకిస్తాను ఏర్పడటమూ ఒకేసారి జరిగింది. ఒకే పరిస్థితుల పరిణామం కూడాను!

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అంతర్రాష్ట్రీయ పరిస్థితులు అనుకోనివిధంగా మారాయి. ఆంగ్ల పెట్టుబడిదారులు తప్పనిసరి పరిస్థితుల కారణంగా ఈదేశ శాసనాధికారాన్ని భారత పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టారు. దీన్ని అహింసాత్మక విప్లవ పరిణామమే అనుకుంటే, మరి పాకిస్తాన్ కూడా అహింసాత్మక విప్లవం ద్వారానే ఏర్పడ్డదనుకోవలసి వస్తుంది! కానీ, పాకిస్తాన్ ఏర్పడటంకోసరం అహింసాత్మక ఉద్యమాలేవీ నడుపబడలేదుకదా? సత్యాగ్రహాల్నూ జరపలేదుకదా? జిన్నాసాహెబ్ ఎన్నడూ పాకిస్తాన్‌కొరకు ఉపవాసం చేయలేదు, హృదయ పరివర్తన కోసరం ఉద్యమాలను నడపలేదు. కనుక, బ్రిటీష్ పాలకులు కాంగ్రేస్ వారికి అధికారాన్ని దఖలు పరచడం గాంధీగారి అహింసాత్మక ఉద్యమ పరిణామం కాదు అని స్పష్టమవుతున్నది. ఇలా అధికారాన్ని దఖలు పరచడానికి ముఖ్యమైన కారణం, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడ్డ అంతర్రాష్ట్రీయ పరిస్థితులే! ఆ పరిస్థితుల్లో ఇలా చేయడం బ్రిటీష్ పాలకులకు తప్పనిసరి ఐంది. బ్రిటీష్ పాలకులు తమ పెట్టుబడులను కాపాడుకోవటానికీ, భారతదేశం కమ్యూనిజంవైపు కొట్టుకుపోకుండా అరికట్టడానికీ – ఇలాచేయడం అవసరం అనుకున్నారు. అనాటి బ్రిటీష్ ప్రధానమంత్రి స్పష్టంగా ప్రకటించాడు. అతడు 1950 సెప్టెంబర్ 5వ తారీకున ఇచ్చిన ఒక ఉపన్యాసంలో ఇలా అన్నాడు. "కమ్యూనిజం తన ప్రభావాన్ని అనేక రకాలుగా వేస్తోంది. ఈ ప్రభావాన్ని ఆపటం కోసరం మేము భారతదేశానికీ, పాకిస్తానుకు, శ్రీలంకుకూ

స్వాతంత్ర్యం ఇచ్చాం. ఈ మూడు దేశాల్నూ కమ్యూనిజానికి వ్యతిరేకంగా కామన్‌వెల్తులో చేర్చుకున్నాం. ఈ రకంగా ఈ దేశాలు మాకు సహాయకమయ్యాయి. (1950 సెప్టెంబర్ 6 నేషనల్ హెరాల్డు) ఒక వేళ బ్రిటీష్ అధికారులు భారతదేశాన్ని ఇంక తమ ఆధీనంలో ఉంచుకోవడం అసంభవం అని భావించారనుకున్నా, అది కాంగ్రేసువారు ఉప్పు తయారుచేసినందువల్ల మాత్రం కాదు రెండవ ప్రపంచ యుద్ధసమయంలో జపాను సహకారంతో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఏర్పడడమూ, 1942లో నావికుల తిరుగుబాటూ, మొదలైన వాటి కారణంగా భారతదేశములో బ్రహ్మాండమైన విప్లవం రాబోతున్నదని తెలుసుకొని, దాన్ని ఆపడం కోసం ఈ పాచికను అడ్డువేశారు

మా సంభాషణ అయ్యాక హాలిన్స్ ఇలా అడిగాడు "మీకు ఇక్కడ ఏమీ బాధగా లేదుగదా?"

"నన్ను బాధించడానికే ఇక్కడికి తీసుకొచ్చారు కదా? అందుకు నేను సిద్ధంగానే ఉన్నాను" అన్నాను.

"మీరు అన్నదానికి అర్థం?"

"ఇంతవరకూ నేను మీతో పోరాడాను. ఇప్పుడు మీ ఆధీనములో ఉన్నాను. మీ ఇష్టం ఏంచేసినాసరే! ఎక్కడవుంచినా సరే! కాకపోతే ఇది మనుషులుండే ప్రదేశమా?" అంటూ ఆ జైలుకొట్టును చూపించాను.

"అంతా నవ్యం ఔతుంది. మిమ్మల్ని ఇలాంటి కొట్లో వుంచము. బ్రిటీష్ వాళ్ళమైన మేము ఎవరిమీదా పగబూని వ్యవహరించము. ఇదే ఏ జర్మన్‌లో, రష్యన్‌లో ఐతే మీపట్ల ఎలా వ్యవహరించేవారో తెలిసేది. మేము మానవత్వానికి ఎక్కువ విలువ ఇస్తాము. మీరే చూస్తారుగా, నియమానుసారం మీకు కల్పించదగిన ప్రతి సౌకర్యాన్నీ కల్పిస్తాము".

హాలిన్స్ వెళ్ళాడు. మరి కొద్దిసేపటికి మళ్ళీ జైలుతలుపు తెరుచుకుంది. వరండాలో ఓ అరడజను మందిదాకా సాయుధులైన పోలీసులు

నిలబడి ఉన్నారు. ఇనస్పెక్టరు ఇలా అన్నాడు "మిమ్మల్ని మరోచోటికి మారుస్తున్నాము".

పోలీసులు వెంటరాగా వ్యాన్‌లో కూర్చున్నాను. అలహాబాదు రోడ్లన్నీ పరిచయమైనవే! ఆరోడ్లన ఎన్నోమార్లు స్వతంత్రంగా తిరిగాను. ఇప్పుడు బందీనై ఆ రోడ్లగుండానే వెళుతున్నాను. నన్ను 'కటరా' దగ్గర కచేరీ వెనకనున్న ఆంగ్ల అపరాధుల్ని ఉంచే జైలుకు తీసుకువెళ్ళారు. ఈజైలు కైనింగ్ రోడ్డు జైలుకంటే చాలా విశాలంగా ఉంది బాగా వెలుగు, గాలి వస్తున్నది. ఇక్కడి జైలుకొట్టుకు ప్రత్యేక స్నానాలగది కూడావుంది. దర్వాజాలు, కిటికీలు దట్టమైన ఇనుపచువ్వలతో బిగించబడి ఉన్నాయి. చుట్టూ ఎత్తైన ఇటుకరాయితో కట్టిన ప్రహరీగోడవుంది. జైలుచుట్టూ సాయుధులైన పోలీసులు కాపలాఉన్నారు దీనికి ఇన్‌చార్జి ఒక ఇంగ్లీషువాడు, అతడు ఇంగ్లీషువాడో, ఆంగ్లోఇండియనో ఖచ్చితంగా చెప్పటం కష్టం. కొట్లోపెట్టేముందు అతడు నన్ను పూర్తిగా సోదాచేశాడు. సావిత్రిగారి ఇంటినుండి వచ్చేప్పుడు రెండు వస్తువులను మాత్రమే వెంట తెచ్చుకున్నాను. ఒకటి కప్పుకునే కంబళి, రెండవది కలము. ఆకలాన్ని సుమిత్రాదీదీ కానుకగా ఇచ్చిందినాకు ఆరోజుల్లో దొరికే కలాలన్నిటి కంటే విలువైనది. ఆ కలమంటే నాకు చాలా యిష్టము. అదీకాక సుమిత్రాదీదీ కానుకగా ఇచ్చింది అన్న భావనావుంది. ఈరెండు కారణాల వలా దాన్ని వదలలేక వెంటతెచ్చుకున్నాను. జైలు ఆఫీసరు ఆకలాన్ని తీసేసుకున్నాడు. ఇలా అన్నాడు "ఇక్కడనించి వెళ్ళేప్పుడు నీ కలం నీకు ఇవ్వబడుతుంది. ఇక్కడ ఖైదీలు కలమూ, కాగితాలు దగ్గర ఉంచుకోవటం నియమవిరుద్ధం."

ఈ యూరోపియన్ జైల్లోకి వచ్చాక నాకో సబ్బు, తుండుగుడ్డా, పళ్ళుతోముకోవటానికి బ్రష్, టూత్‌పేస్టు ఇచ్చారు! జైలుకొట్టులో ఒక ఇనుప మంచమూ, పరుపూ, దుప్పటి, కంబళీకూడా వున్నాయి. తొమ్మిది

న్నరకు ఉదయపు అల్పాహారం వచ్చింది.-రొట్టె, వెన్న, గ్రుడ్డు, టీ ఈజైలుకూడా నేరస్తులను బంధించడానికే ఏర్పాటైంది. ఐతే, పాలక జాతికి చెందిన నేరస్తులు ఇందులో వుంటారు గనుక వారికోసం ప్రత్యేక మైన సౌకర్యాలు కల్పింపబడ్డాయి

నన్నిలా పాలకజాతి నేరస్తులతోపాటు అధికమైన సౌకర్యాలు లభించేచోట ఉంచడానికి కారణం; ప్రత్యేకం సురక్షితమైన ప్రదేశములో ఉంచుదామన్న ఉద్దేశ్యమైనా అయిఉంటుంది. కాకపోతే, ప్రభుత్వ సాక్షులుగా మారిన వాళ్ళద్వారా ఆధునికమైన నా అభిరుచుల్నీ, అలవాట్లనూ తెలుసుకొని ఉండటమైనా అయివుంటుంది. జైలు ఆఫీసరు రెండు మూడు చౌకబారు ఇంగ్లీషు నవలల్ని కూడా ఇచ్చాడు, కాలక్షేపానికి. ఐతే అప్పుడే పుస్తకాల్లో ఏంతల దూర్చగలను?

ఆజైల్లో కొంతకాలంపాటు ఉంచుతారనుకున్నాను. అంటే, కొంత కాలం ప్రశాంతంగా ఒకేచోటవుండే అవకాశము లభించిందనుకున్నాను. అరెస్టు కావడానికి ముందు కాల్పులుజరిగాయి కాల్పులుజరిగి అప్పటికి దాదాపు నాలుగుగంటల సమయం గడిచింది. ఆహారం తీసుకున్నాను. జైలుకొట్టుకూడా ఏమంత అధ్వాన్నంగా లేదు. ఆ స్థితిలో అంతకంటె మంచి ప్రదేశాన్ని కోరుకోవటమూ అత్యాశేఅవుతుంది. భవిష్యత్తుగురించి ఆలోచించే అవకాశం దొరికింది. ఐతే, ఆలోచించడానికి ఏమీ విషయం కొరకలేదు. ఎదురుగా సమస్య అనేదిలేనప్పుడు ఆలోచనలు మాత్రం ఏముంటాయి? 'లాహోరు, ఢిల్లీ కేసుల్లో యిరికిస్తారు. ఏదో ఒకకేసులో ఉరిశిక్షపడుతుంది. కొద్దిరోజుల్లోనో లేక ఒకటి రెండునెలల్లోనో ఉరికంబానికి వ్రేలాడడం ఖాయం' అనుకున్నాను.

ఆకొట్టులో వెనక ఉండివెళ్ళిన ఖైదీలు గోడలమీద తమపేర్లు వ్రాసుకున్నారు. తమపేరు శాశ్వతంగా ఉండాలన్నకోర్కె చాలా విచిత్రమైంది. చిన్నపిల్లలు ఎక్కడికివెళ్ళినా, దేనిమీదనైనా తమపేరు వ్రాసు

కుంటూ ఉంటారు. కొందరిలో బాగా వయసువచ్చినా ఈ బాల్యచేష్టపోదు. స్థితిగలవారు బాల్యచేష్టతాలూకు ఈకోర్కెని తీర్చుకోవడానికి కిల్లాలు, కోటలూ కట్టిస్తూవుంటారు అలాకీర్తి కండూతిని తీర్చుకుంటారు. జైలు కొట్టు గోడలమీద కొన్ని ఇంగ్లీషు కవిత్వచరణాల్నికూడా వ్రాశారు. అవి చాలా విషాదకరమైన గీతాలు. వాటి ప్రభావం నా మనస్సుమీద పడి వుంటుంది. అప్పటి నా మానసికస్థితి చాలా విషాదకరంగావుంది. నేనూ ఓ కవిత్వచరణాన్ని కూనిరాగంతీయటం ప్రారంభించాను. "మిత్రులారా కొద్దిక్షణాల అతిధిని! ఆరిపోయే దీపాన్ని! నేను లేకపోయిన మాత్రాన ఏపనులాగుతాయి? నాకోసం ఎవరు విలపిస్తారు?" మనసులో ఉద్వేగం కలిగినప్పుడూ, భావావేశం కలిగినప్పుడూ ఇలాంటివే చరణాల్ని కూని రాగంలో ఆలాపించటం ప్రారంభించాను.

నాలో నేనే ఇలా అనుకున్నాను "నాకోసరం ఎవరు ఏడుస్తారు? ఎవరు విచారిస్తారు? నామీద నేనే జాలిపడి, ప్రయోజనం ఏమిటి? మా అమ్మ, తమ్ముడు, ప్రకాశవతి జ్ఞాపకంవచ్చారు. వాళ్ళని మర్చిపోవటానికి ప్రయత్నించాను. నా అరెస్టునుగురించి విని వాళ్ళు చాలా దుఃఖపడేమాట నిజం. వాళ్ళ దుఃఖాన్ని నేను ఏవిధంగానూ నివారించలేను కదా! అలాం టప్పుడు వాళ్ళగురించి ఆలోచించి మాత్రం ప్రయోజనం ఏమిటి? వాళ్ళు నాగురించి దుఃఖపడకుండా వుండేట్టు చేయడానికి ఒకే ఒక మార్గంఉంది. అది, నేను నా ప్రవర్తనలో ఎలాంటి బలహీనతారాకుండా చూసుకోవాలి! నాగురించి వాళ్ళు గర్వపడేట్టు ప్రవర్తించాలి!

మధ్యాహ్నమైంది. ఒకలావాటి వ్యక్తి లోపలకు వచ్చాడు. వున్ని కోటు, ప్యాంటువేసుకొని ఉన్నాడు. అతడి వెనుక ఒకపోలీసు ఉన్నాడు. పోలీసు రెండుచేతుల్లోనూ రెండుపళ్ళేలు ఉన్నాయి. ఒకచేతిలోని పళ్ళెం మీద శుభ్రమైన తువ్వాలు కప్పివుంది. లావాటి వ్యక్తి, కుర్చీలోకూర్చొని

తనగురించి ఇలా చెప్పేడు. "నేను జె దెనర్జీని! డిప్యూటీ సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీస్!" అన్నాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. సి.ఐ.డి. పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ బెనర్జీ గొప్ప రాజభక్తుడు. అతడి రాజభక్తికి తగిన ప్రతిఫలాన్ని ఇవ్వడానికి ఒకమాటు బెనారస్‌లో విప్లవకారులు ప్రయత్నించారు. కాల్చడమూ జరిగింది. ఐతే బతికిపోయాడు. ఈ మహానుభావుడు అతదేనని తెలుసుకున్నాను. బెనర్జీ చెప్పుకుపోవడం ప్రారంభించాడు "నువ్వు అరెస్టు అయ్యావని విని చాలా బాధపడ్డాను! ఒకమాటు నిన్ను చూడాలని పించి వచ్చాను! నీవు మంచికుటుంబంలో పుట్టిన వాడివనీ, జైలుతిండి తినలేవనీ తెలుసుకొని నాతోపాటే భోజనాన్నికూడా పట్టుకొచ్చాను! ముందు భోంచెయ్యి ఆ తరువాత మాట్లాడుకుందాం!" అంటూ చాలా బలవంతం చేశాడు

నేను ఇలా అన్నాను "ఈజైల్లో ఏర్పాట్లన్నీ బాగున్నాయి. భోజనంకూడా బాగానేఉంటుంది. మీరు శ్రమపడటం అనవసరం."

ఐనా ఆయన వినలేదు. పళ్ళేన్ని నాముందుపెట్టి చాలా ఆత్మీయతగా తినమని బలవంతం చేయసాగాడు. పరదేశంనుండి వచ్చిన కుర్రవాడ్ని లాలనచేసి తినిపిస్తున్నట్టుగావుంది. బెంగాలీ సాంప్రదాయం ప్రకారం వండిన కమ్మని భోజనం పట్టుకువచ్చాడు. సంపన్నులైన బెంగాలీలు తీపిలేకుండా భోజనంచేయరు. ఖర్జూరబెల్లాన్ని మొదటసారిగా అప్పుడే తిన్నాను.

భోజనం చేయటం అయింది మా సంభాషణ ప్రారంభమైంది. "ఆపదలోవున్న నిన్ను నాచేతనైనవరకూ రక్షించటానికి ఇలా నీదగ్గరకు వచ్చాను! నీ అరెస్టుగురించి విని మీ అమ్మా, తమ్ముడూ దుఃఖపడుతూ ఉండవచ్చును! ముఖ్యంగా 'యంగ్ లేడీ' (ప్రకాశవతి) ఎంత దుఃఖపడుతూ వుంటుందో ఆలోచించు! కనుక చట్టమనే జంజాటంనుంచి

తప్పించుకొని మిగిలిన జీవితాన్ని సుఖంగా గడపటానికి మార్గంచూచుకో! నీలాంటి చదువుకున్న, సంస్కారంగల యువకుడిజీవితం వ్యర్థం కావడం నేను సహించలేను! నీవు విప్లవకారుడవనీ, దొంగవూ, తోడుమోతువూ కావనీ నాకు తెలుసును. అన్నిటికంటె ముఖ్యమైంది, నీలాగానే దేశభక్తి అనే పిచ్చిలోపడి జీవితాలను నాశనం చేసుకొనేవాళ్ళు ఇంకా చాలామంది ఉండవచ్చును. వాళ్ళజీవితాలను రక్షించటమూ నా కర్తవ్యంగా భావిస్తున్నాను. నేనూ పంజాబీవాడినే! నీ పౌరుషాన్నీ, స్పష్టంగా మాట్లాడే ప్రవృత్తినీ మెచ్చుకుంటున్నాను! ప్రభుత్వంతో పోరాడేటప్పుడు వీరుడిలా పోట్లాడేవు. ఇప్పుడు పోట్లాట తేలిపోయింది. ఇంక మనం స్పష్టంగా మాట్లాడేసుకుంటే ఏపేచీ ఉండదు. పిడ్లిచ్‌కూడా నీ సాహసాన్నీ, సంస్కారాన్నీ చాలా మెచ్చుకున్నాడు. పిడ్లిచ్‌కి నీమీద వ్యక్తిగతమైన వైరమేమీ లేదు" అన్నాడు.

తరువాత బెనర్జీ చెప్పిన మొత్తం విషయంలోవి సారాంశం ఇది – బెనర్జీరోజూ గీతాపారాయణ చేస్తూఉంటాడు. ప్రతిచిన్న విషయంలోనూ గీతోపదేశానికి అనుగుణంగానే ప్రవర్తిస్తూ ఉంటాడు. అంటే, కర్మచేయటం తన కర్తవ్యం. ఫలితాన్ని భగవంతుడికి వదిలేస్తాడు. నన్నూ అలాగే చేయమన్నాడు. గీతాశ్లోకాలను కొన్నింటిని వల్లించాడు. దేశంలోని యువకుల జీవితాలు సర్వనాశనం కావటం తను సహించలేకపోతున్నాడు. అలాంటి యువకుల్ని రక్షించడం తన వ్యక్తిగతమైన, జాతీయమైన కర్తవ్యంగా భావిస్తున్నాడు. బెనారస్‌లో తనసొంత మేనల్లుడే (మణీంద్ర) కాల్చాడు అతణ్ణి! అప్పుడు అక్కడున్న ప్రజలు మణీంద్రుడ్ని పట్టుకొని కొడుతూంటే, ఇతడే అడ్డుపడి విడిపించాడు. "పసివాడు ఏమీ తెలియదు. వదలిపెట్టండి" అన్నాడు.

మణీంద్రుడు కాల్చినగుండు బెనర్జీ డొక్కను రాచుకుంటూవెళ్ళింది. బతికిపోయాడు. ఆ తరువాత కూడా చాలా సందర్భాల్లో గీతోపదేశాన్ని

ఆచరణలో పెట్టాడు. ఇతడి ఈ సత్కార్యానికి మెచ్చి ఇంగ్లీషు ప్రభుత్వం ఇతడికి రాయబహాదూర్ అన్న బిరుదునిచ్చి సత్కరించింది.

నేను బెనర్జీ మహాశయుడికి కృతజ్ఞతలు తెలియపరిచాను. "నేను కూడా నాకు తెలిసినంతవరకూ గీతోపదేశాన్ని ఆచరణలో పెట్టడానికే ప్రయత్నించాను. ఏదైతే కర్తవ్యం అనుకున్నానో, దానికోసం ప్రాణా లొడ్డి పోరాడాను. ఇప్పుడు ఫలితం ఏమైనాసరే! కృష్ణభగవానుడు చుట్ట పక్కాల మోహాన్నివిడిచి కర్తవ్యాన్ని పాటించమన్నాడు. తల్లి. తమ్ముడు, పెళ్ళాం. ఈ సంబంధాలన్నీ నశ్వరమైన ఈ శరీరానికి సంబంధించినవి కదా? ఈ శరీరంతోపాటు ఈ బంధుత్వాలూ పోతాయి. ఒకర్ని ఒకరు దుఃఖపెట్టటం అంటూ వుండదు! ఎవరికర్మ ఫలితాన్ని వారు అనుభ విస్తారు" అన్నాను.

బెనర్జీ మహాశయుడు అలా మూడురోజులు మధ్యాహ్నాల్లో నా దగ్గరకు వచ్చాడు. మాంచి రుచికరమైన భోజనాన్ని పట్టుకొచ్చేవాడు. రోజూ మధ్యాహ్నాల్లో గీతోపదేశాన్ని గురించి చర్చ ప్రారంభించేవాడు. నాజీవితాన్ని, నాలాంటి మరికొందరు యువకులజీవితాల్ని కాపాడడానికి బద్ధ కంకణమ్యానని చెప్పేవాడు. మాజీవితాలు నాశనం అవుతూన్నం దుకు విచారాన్ని ప్రకటించేవాడు. కొంత కాలక్షేపంగా వుండేది.

నాలుగోరోజున అనుకుంటాను; మధ్యాహ్నసమయం జైలుకొట్టు తలుపు తెరుచుకుంది. మరోజైలుకు మారుస్తున్నారని తెలిసింది. 'ఈ నాలుగురోజులు మంచిగాచెప్పిచూశారు. ఇప్పుడింక మరోమార్గాన్ని అనుస రిస్తారుగావును!' అనుకున్నాను. పోలీసులుపెట్టగల హింసల్నిగురించివెనకే విన్నాను. తల్లక్రిందులుగా వ్రేలాడదీయడం, విపరీతంగాకొట్టడం. గోళ్ళ ల్లోగుండుసూదులు గుచ్చడం-ఇత్యాది ప్రక్రియల్నిగురించి విన్నాను. మనస్సులోనే అనుకున్నాను 'ఇంక తయారుగా వుండు!'

పోలీసువ్యానులో పది పన్నెండుమంది సాయుధులైన పోలీసులు వున్నారు. నన్ను క్షేమంగా మలాకా(అలహాబాద్‌జిల్లాజైలు)జైలుకు తీసుకు వెళ్ళారు. జైలులోపలకు వెళ్ళాను. గడచిన నాలుగురోజుల్లోనూ నాకు ఎక్కడా బేడీలు వేయలేదు. నేను లోపలకువెళ్ళగానే ఒక కమ్మరి, నా కాళ్ళకూ, చేతులకూ వేయడానికి బేడీలు పట్టుకువచ్చాడు. నేను జైలర్‌కు నా అభ్యంతరాన్ని తెలిపాను. "నేను రాజకీయఖైదీని, బేడీలు వేయించు కోను!" అన్నాను. "అదంతానాకు తెలియదు" నీ శిక్షనుబట్టి నీకు బేడీలువేయక తప్పదు!" అన్నాడు జైలర్.

"మీరు బేడీలువేస్తే, అసమ్మతి సూచకంగా నేను ఆహారం తీసు కోవడం మానేస్తాను!"

''ఆ తరువాత నీయిష్టం!''

బేడీలు వేశారు ఐదు ద్వారాల్నిదాటి లోపలికివెళ్ళాక విశాలమైన ప్రాంగణంలో ఓ పొడవైన బారక్కు! అందులోని ఒక కొట్టులో నన్ను పెట్టారు. తలుపుకు తాళాలు వేశారు. బారక్కుయొక్క ముఖ్యద్వారానికీ తాళం పడింది. గది తలుపులు ఇనుపరేకులతో కప్పబడి వున్నాయి. గోడన ఒక రంధ్రము. రంధ్రానికి బయటినుండి ఓమూత! బయటివారు లోపలికి తొంగి చూడవచ్చును. లోపలినుండి బయటకు చూడలేము. ఈ బారక్కు మధ్యలో చిన్న గొందిలాంటి ఖాళీ ప్రదేశంవుంది ఆ గొందికి రెండువైపులా ఖైదుకొట్లు, ఒక కొట్టులో పిచ్చివాణ్ణి పెట్టారు. వాడు కాసేపు నవ్వడం, కాసేపు పాడడం చేస్తూంటాడు. మిగిలిన కొట్లల్లో ఏకాంతవాస శిక్షను అనుభవిస్తూన్న ఖైదీలు వున్నారు. నన్ను పెట్టిన కొట్టులో పడుకోడానికి ఓగోనెపట్టా నీళ్ళు తాగడానికి ఇనుపముంతా. మలమూత్రాల్ని విసర్జించుకోడానికి తారుపూసిన మట్టిమూకుడూ వున్నాయి. కొట్టు పగటిపూట కూడా చీకటిగానే వుంటూంది. రాత్రిపూట్ల దీపం

వుండదు. మనస్సులో ఇలా అనుకున్నాను. "అప్పుడే ఏమైంది! ముందు ముందు ఇంకేం జరుగుతుందో చూద్దాం!"

ఉదయాన్నే వేగివేగని పురుగులు పట్టిన శనగపప్పు కాసిని పెట్టే వారు. ఉదయమూ, సాయంకాలము పెద్దపెద్ద రొట్టెలూ, నీళ్ళలాంటిపప్పూ పోసేవారు. నేను ఏమీ తినకుండా ముందేం జరుగుతుందో ఊహిస్తూవదు కొని ఉండేవాడిని. విపరీతంగా నిద్రపోయేవాడిని! అలా నాలుగు రోజులు గడిచాయి. ఓరోజు ఉదయం జైలు సూపరింటెడెంట్ వచ్చారు. ఇంగ్లీషువాడు. అతడు వచ్చినా నేను లేవలేదు.

సూపరింటెండెంట్ ఇలా అన్నాడు. "నువ్వు అగౌరవంగా ఎందుకు ప్రవర్తిస్తున్నావు?"

ఇలా సమాధానం ఇచ్చాను. "నాపట్ల కూడా అగౌరవంగానే ప్రవర్తిస్తున్నారు కదా!"

"నిన్ను ఎవరు అగౌరపరిచారు?"

'వేరే అవమానించాల్నా? ఇది గౌరవనీయులు వుండే ప్రదేశమా?' అంటూ ఖైదుకొట్టును చూపించాను. నామాట వినుపించుకోకుండానే దబా యింపు శషన్ ప్రారంభించాడు. "నువ్వు నిరాహారదీక్ష పట్టావు. ఇది జైలు నిబంధనల దృష్ట్యా నేరం!" అన్నాడు.

"నేనేమీ నిరాహారదీక్ష చేయడంలేదు. నాపట్ల గౌరవంగా వ్యవహ రించమని అడుగుతూన్నాను. తినడానికి యోగ్యమైన ఆహారం పెట్టమం టున్నాను. మీరు పెట్టే ఆహారం నేను తినలేకండా వున్నాను. కనుక, తినడంలేదు!"

"అంటే, పాలూ - పెరుగూ, సన్నబియ్యపు అన్నం కావాల్నా?"

"సమస్య, పాలూ - పెరుగును గురించికాదు. నాపట్లగౌరవనీయంగా ప్రవర్తించాలి!" అన్నాను.

"గౌరవనీయం అంటే ? అదెలా వుంటుందో?"

"నన్ను రాజకీయఖైదీలా చూడాలి! ఒక సభ్యదేశం యుద్ధఖైదీల నెలా చూస్తుందో, అలా చూడాలి!"

"నువ్వు హింసాత్మకమార్గాన్ని అనుసరించే విప్లవకారుడివికదా!" ఆంగ్లదొర గాంధీభాషను వల్లించాడు.

"అయినప్పటికీ మా ఉద్దేశం రాజకీయమైందేకదా?"

"అదంతా మాకు తెలియదు. నీకు అదనపు సౌకర్యాలు కావాలంటే దరఖాస్తు పెట్టుకో! నీ ఆర్థికస్థితిని పరిశీలించి, మెజిస్ట్రేట్ ఆదేశాన్ననుసరించి, వీలునుబట్టి సౌకర్యాలు కల్పించబడతాయి. తాత్కాలికంగా వరన్నం - పాలూ కావాలంటే నేను సొంత బాధ్యతతో, వ్యక్తిగత సానుభూతితో - ఇప్పించగలను!"

"ధన్యవాదం. సానుభూతి నాకు అవుసరంలేదు. నాపట్ల రాజకీయ ఖైదీలా వ్యవహరించాలని కోరుతూన్నాను!"

ఆంగ్లదొర వెళ్ళిపోయాడు. జైలుకొట్టు తలుపులు మూసుకున్నాయి.

మరుసటిరోజు మధ్యాహ్నం నన్ను ఆఫీసుకు పిలిపించాడు. అక్కడ మెజిస్ట్రేట్ వున్నాడు. పరిస్థితి అర్థమైంది. నన్ను మరికొన్నాళ్ళపాటు కష్టడీలోనే వుంచడంకోసం, జైలు ఆఫీసులోనే మెజిస్ట్రేట్ముందు హాజరు పరిచేతతంగాన్ని నడుపుతూన్నారని తెల్సుకున్నాను. బహుశ ప్రజలు నన్ను న్యాయస్థానంలో హాజరు పరచవల్సిందని ఆందోళన జరుపుతూ వుండవచ్చును. ప్రజల వత్తిడి కారణంగా ఈ తతంగం జరుపవల్సివచ్చి వుంటుంది. మెజిస్ట్రేట్ ఇలా అడిగాడు. "నీ సమస్య ఏంటి? నువ్వేం కోరుతూన్నావు?"

"నన్నొక మానవుడిలా చూడడంలేదు. కాళ్ళకు సంకెళ్ళువేశారు. సంకెళ్ళు తీసేవరకూ నేను భోంచేయను. మరేమీ చేయను. నన్ను రాజకీయఖైదీలా చూడాలని కోరుతున్నాను!" అన్నాను.

"నీకు అధిక సౌకర్యాలు కావాలంటేనూ, నీపట్ల ఉన్నత వర్గానికి చెందినట్లు ప్రవర్తించాలంటేనూ - దరఖాస్తు పెట్టుకో!"
"మీతో చెప్తూన్నానుగదా, ఇదే దరఖాస్తు అనుకోండి!"

అరెస్టయి వారం గడిచింది. ఇన్నాళ్ళలోనూ బయటివాళ్ళతో ఎవరితోనూ మాట్లాడే అవకాశం లభించలేదు. అసలు నేను అరస్టు అయినట్టు బయటి ప్రజలకు తెల్సునో, తెలియదో కూడా నాకు తెలియదు. బయటి ప్రజలు నా గురించి ఏమైనా ఆలోచిస్తూన్నారా, లేదా? అదీ తెలియదు. "ఎవరో నాకోసం ఏదో చేస్తారని ఎదురు చూడడంకంటే, నాకు చాతనయింది నేను చేయడం మంచిది. కేసు నడుస్తుంది. భగత్సింగ్ చెప్పినట్టు నేనూ మా ఆదర్శాన్ని, నేను చేసిందాన్ని స్పష్టంగా చెప్పేస్తాను" అనుకున్నాను.

ఆ తరువాత రోజుల్లో మిత్రులద్వారా తెల్సుకున్న కొన్ని అభిప్రాయాల్ని ఇక్కడ ఉదహరించడం అవసరం అనుకుంటున్నాను. 'తన గురించి బయటి ప్రపంచానికి ఏమీ తెలియదు. తాను జైలుకొట్టులో చచ్చిపోయినా బయటి ప్రపంచానికి వార్త అందదు!' అన్న భావన ఖైదీని యమయాతన పెడుతుంది. ఖైదీ తన గురించి బయటి ప్రపంచానికి తెలియాలని ఎప్పుడైతే ఆదుర్దాపడతాడో, అదే అతడిలోని బలహీనతగా పోలీసులు గుర్తిస్తారు. ఇంక పోలీసులు ఖైదీతో "నువ్వేదో పెద్ద దేశభక్తుడివనుకుంటున్నావు. నీ గురించి ప్రజలు ఉద్యమాలు లేవదీస్తారనుకుంటున్నావు! నీ గురించి ఎవడికీ పట్టదు. ఎవడికీ తెలియదు. నువ్వు ఇక్కడ చచ్చినా బయటకు పొక్కదు!" అన్నట్టు వ్యవహరిస్తారు. బాధపడే ఖైదీని మరికొంచెం బాధపెట్టడానికి తన్నడం కొట్టడంలాంటివి చేస్తారు. నేనే మాత్రం అనుభూతిగానీ, చలనంగానీ లేకండా విరామయంగా వుండిపోయాను.

ఆ మర్నాడే కాళ్ళకువేసిన సంకెళ్ళను తీసివేశారు ఆ చీకటి కొట్టులోకి ఒక ఇనుప మంచమూ, పరుపూ వచ్చాయి. బి. క్లాసు కాంగ్రెసు ఖైదీలకు పెట్టే మంచి భోజనాన్ని పంపించసాగారు.

ఆ మర్నాడు బెనర్జీ మళ్ళీ వచ్చాడు. నన్నిలా చీకటి కొట్టులోవేసినందుకు నొచ్చుకున్నాడు. "నిన్ను ఈ చీకటి కొట్టులో పెట్టడం ఏంటి? వీళ్ళు చాలా మూర్ఖులు. ఏమాత్రం బుద్ధిలేదు వీళ్ళకు నిన్ను కొట్టులో పెట్టారని నాకు తెలియదు. ఇది నువ్వు ఉండదగ్గ ప్రదేశంకాదు!" అన్నాడు. తనతోపాటు పళ్ళు, ఫలాలు, భోజనం పట్టుకు వచ్చాడు. ఇంక గీతోపదేశం తాలూకు ఊకదంపుడు ప్రారంభించాడు. 'ఫలితాన్ని గురించి ఆలోచించకు, కర్తవ్యాన్ని నిర్ణయించుకో! 'యంగ్‌లేడీ' గురించి ఆలోచించు. నువ్వు 'సరే' అంటే, కోర్టువ్యవహారాలన్నీ నామమాత్రంగా జరుగుతాయి. నీకేమీ హానిజరుగదు. ఆ తరువాత, కావాలంటే నువ్వు ఇంగ్లాండు వెళ్ళిపోయి అక్కడ స్థిరపడే ఏర్పాట్లూజరుగుతాయి!' అన్నాడు. చివరకు తేల్చింది, నేను ప్రభుత్వసాక్షిగా మారడం! అలా ప్రభుత్వ సాక్షినై, నాలాగానే జీవితాలను పాడుచేసుకుంటున్న ఇతర యువకుల్ని కాపాడడం!

బెనర్జీ మహాశయుడు అలా రావటం నా మనస్సును బాధించసాగింది. ఇంక అతడితో నిర్మొగమాటంగా మాట్లాడవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఐతే, అతడి ప్రవర్తనా, మాటా ఎంతో నమ్రతగా, ఉండేవి. అలాంటప్పుడు నిర్మొగమాటంగా ఎలా మాటాడగలను? అయినా ఒకరోజున ఇలా అన్నాను. "బెనర్జీగారూ! భగవద్గీత విషయం వదిలి పెట్టండి. అది ఎవరికీ అర్థంకాదు. గీతోపదేశంవిన్నాక అర్జునుడు రాజ్యకాంక్షతో తన బంధుమిత్రుల్నే చంపుకోవడానికి సిద్ధపడ్డాడు. చాలామంది భగవద్గీతను చదివి వైరాగుకై పోతున్నారు. మరి గాంధీగారికే భగవద్గీతలో అహింస కనిపించింది. మీరేమో ఆ భగవద్గీత ఆధారంగానే నా

స్వలాభంకోసరం మిత్రులకు ద్రోహంచేయటం ఉచితం అని చెప్తున్నారు! నా సాధారణ బుద్ధికితోచిన వరకు గీతోపదేశం ప్రకారమే చేస్తున్నాను. నేను చేసిందేదో చేశాను. అందుకు ఫలితాన్ని అనుభవించవలసి ఉంటుం దని నాకు తెలుసును నేను అందుకు సిద్ధంగా ఉన్నాను. నాకు మీరు రోజూ భోజనం పట్టుకురావటం బాగుండదు. నాకు జైల్లో భోజనం పెడ తారుగదా? ఇంక మీకెందుకు శ్రమ?" అన్నాను.

బెనర్జీ చెయ్యి అడ్డంగాతిప్పుతూ, "ఈ చిన్న విషయాన్ని గురించి పట్టించుకోకు నా సంతృప్తి కోసం పట్టుకొస్తున్నాను" అన్నాడు.

ఇంక బెనర్జీ మహాశయుడితో స్పష్టంగా మాట్లాడక తప్పలేదు. ఇలా అన్నాను "చూడండి నేను ఖైదీని, అన్నమేయో మీరుతెచ్చి పెడుతున్నారు. నాకేమైనా అయితే విషం పెట్టారన్న అపవాదు మీకు వస్తుంది. మీకు అలాంటి అపవాదు రావటం నాకిష్టంలేదు."

బెనర్జీ మహాశయుడు రెండు చెవులూ మూసుకున్నాడు. "ఒద్దు బాబూ, నువ్వు అలా అనుకునేట్లయితే ఇక నేను అన్నం పంపించను." అన్నాడు.

ఇది జరిగిన నాల్గవరోజున బెనర్జీ మళ్ళీ వచ్చారు. కొంతవిసుగు, కొంత అసహనమూ నలిపిన స్వరంలో "నీ వ్యవహారం కోర్టుకు పంప కుండా ఎన్నాళ్ళని ఆపమంటావు? ఒకమాటు కోర్టుకెళ్ళాక, ఇంక వ్యవ హారం మా చేతుల్లోంచి దాటిపోతుంది. అప్పుడిక మేంచేయగిందేమీ ఉండదు" అన్నాడు.

నేను ఇలా అన్నాను. "నా వ్యవహారం త్వరగా కోర్టులో దాఖలు చెయ్యాలని నేనూ కోరుతున్నాను. నన్ను ఈ మురికి రూపంలో పడేసి అట్టే పెట్టారు. మీరు నామీద చూపుతున్న వాత్సల్యానికి కృతజ్ఞు డిని. మీరు నన్ను కలుసుకోవటానికి రాకుండావుంచేనే మంచిది''.

పెన్డర్జీ మహాశయుడు నిట్టూర్చుతూ వెళ్ళిపోయాడు. అంత మాత్రా నికి అతడు నిరాశపడ్డాడనీ, తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడనీ అనుకోవటానికి వీల్లేదు. గీతోపదేశం ద్వారా నాకు హృదయ పరివర్తన గావించడానికి మరొకమాటు ప్రయత్నించాడు. ఐతే, కొన్నాళ్ళు ఆగి ప్రయత్నించాడు!

రెండురోజులు గడిచాయి. నన్ను జైలు ఆఫీసుకు పిలిచారు. శ్యాంకుమారీ నెహ్రూ వచ్చింది. ఆమెను గుర్తుపట్టాను. పరారీలో వుండగా ఈమె తల్లిగారు ఉమా నెహ్రూనూ, తండ్రిగారు మోహన్‌లాల్ నెహ్రూనూ కలుసుకున్నాను. ఈమెనూ ఒకటి రెండుసార్లు కలుసుకున్నాను. శ్యాం కుమారీ నెహ్రూతోపాటు మరో ఇద్దరు వ్యక్తులుకూడా వచ్చారు. ఒకరు శ్యాంకుమారీ నెహ్రూ పినతండ్రి బిహారీలాల్ నెహ్రూ. రెండవ అతడు బిహారీలాల్‌నెహ్రూ మిత్రుడైన బారిస్టర్! వీళ్ళు నాతరఫున వాదించటానికి అంగీకరించారు. నాకేసు విషయంలో మాట్లాడటానికి వచ్చారు. మేము జైలు అధికారుల ఎదుటే మాట్లాడుకున్నాము. అధికారులు మా మాటలు వినబడనంత దూరంలో నిలబడి మమ్మల్ని గమనిస్తున్నారు మేమేదైనా ఇచ్చి పుచ్చుకోవడం చేస్తామేమోనని జాగ్రత్తగాచూస్తున్నారు. ఐతే, మా మాటలువాళ్ళకు వినడంలేదు. బ్రిటీష్‌ప్రభుత్వపు జైళ్ళల్లో నేను ప్లీడర్లతో నా కేసు విషయమై రహస్యంగా మాట్లాడే అధికారాన్ని ఉపయోగించు కున్నాను. ప్రతిఖైదీ, వాడెంతటి ప్రమాదకరమైన ఖైదీ అయినాసరే ఈ అధికారాన్ని ఆనాడు ఉపయోగించుకోగలిగేవాడు. కానీ 1949లో రైల్వే సమ్మె సందర్భంగా, అకారణంగా నన్ను జైల్లో పెట్టడం జరిగింది. అప్పుడు కాంగ్రేసు ప్రభుత్వం కమ్యూనిస్టు ఖైదీలకు తమ ప్లీడర్లతో మాట్లాడుకునే అధికారాన్ని ఇవ్వడానికి నిరాకరించింది. చాలా విచార పడ్డాను. నన్ను అరెస్టుచేయడాన్ని ప్రజలు గట్టిగా వ్యతిరేకించడంతో వెంటనే నన్ను విడుదలచేసింది, కాంగ్రేసు ప్రభుత్వం. అప్పుడు ఉత్తర

ప్రదేశ్ పోలీస్ శాఖమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి! వారికి ఈ అన్యాయాన్ని గురించి చెప్పటానికి వెళ్ళేను. అప్పుడాయన రాట్నం వడుకుతున్నాడు. నేను చెప్పిందాన్ని ఖండిస్తూ "కమ్యూనిస్టులు ఇలాంటి అధికారాలను దుర్వినియోగపరుస్తారు" అన్నాడు. అంటే కమ్యూనిస్టులు ఇలాంటి అధికారాలద్వారా అనుచితమైన లాభాలను పొందుతారని వారి ఉద్దేశ్యం. మిత్రులకూ, ఇతర పార్టీ సభ్యులకూ వార్తలు పంపుకుంటారని అభిప్రాయం.

శాస్త్రిగారు చెప్పింది నిజంకావచ్చును. ఐతే, వ్యక్తిగత పరిచయం ద్వారా నేనుటి ఒక చెప్పగలను. బ్రిటీష్ ప్రభుత్వకాలంలో పై అధికారాన్ని కాంగ్రేసు నాయకులూ అనుచితంగానే వాడుకున్నారు. పండిట్ నెహ్రూ దగ్గర్నుండి, ఈ శాస్త్రిగారివరకూ - అందరూ పై అధికారాన్ని అనుచితంగా వాడుకున్నవారే! కాగా, ఆరోజుల్లో ఈ అధికారాన్ని బ్రిటీష్ ప్రభుత్వం లాగేసుకోచూసినప్పుడు, అది అన్యాయం అని ఈ కాంగ్రేసు నాయకులందరూ గోలపెట్టినవారే! రాజకీయ ఖైదీలు పై అధికారాన్ని అనుచితంగా వాడుకుంటారని బ్రిటీష్ ప్రభుత్వానికీతెలుసు. ఐతే, బ్రిటీష్ వారు, ఒక నియమాన్నిచేశాక దాన్నిపాటించడం తమ కర్తవ్యంగా భావిస్తారు దురదృష్టకరమైనవిషయం ఏమిటంటే, కాంగ్రేసువారిలో అలాంటి నీతి-నిజాయితీలు దివిటీవేసివెతికినా కనుపించవు! రోజూ చరభాతిప్పితే చాలు, అదే నీతి, నిజాయితీ, సత్యం, అహింస-అనుకుంటున్నారు!

శ్యాంకుమారి నెహ్రూద్వారా బయటప్రపంచపు విషయాలుకొన్ని తెలిశాయి. ప్రజలు ఓ కమిటీనివేసి, ఆ కమిటీద్వారా నాసహాయంకొరకు చందాలు ప్రోగుచేస్తూన్నారని తెల్సింది. ఆమెతో నేనిలా అన్నాను "ఢిల్లీ, లాహోరు కుట్రకేసుల విషయంవేరు. ఆకేసుల్లో చాలామంది అభియుక్తులు వున్నారు. వాళ్ళల్లో నేనొకణ్ణి అవుతాను. మరి ఇక్కడ కేసులో మీరు ఎటూ వాదిస్తూన్నారుగదా? ఇంక నాకు డబ్బుతో

ఇకపోతే, మా అమ్మగారికి సహాయంచేయాలనే ఉద్దేశంతో చందావసూలు చేయడమూ నాకు ఇష్టంలేదు!"

నేనూ, ధర్మపాల్-మేమిద్దరం అరెస్టుఅయ్యాక మా అమ్మ మళ్ళీ ఉద్యోగం వెతుక్కుంది. లాహోరు మహిళా మహావిద్యాలయం బోర్డింగ్‌లో ఉద్యోగం చూసుకుంది.

నాకు ఆశ్రయం యిచ్చిన కారణంగా సావిత్రీదేవిగారి మీదకూడా బ్రిటీష్ ప్రభుత్వం కేసుపెట్టింది. శ్యాంకుమారిగారు నా అరెస్టును గురించి అన్ని వివరాలూ అడిగారు, 'నాకు ఎవరు విశ్వాసఘాతుకం చేశారు' అనే విషయాన్ని తెల్సుకోవడం కోసం ఆమె ప్రయత్నించింది. ప్రకాశవతి ఇతర మిత్రులూ సురక్షితంగానే ఉన్నారని తెల్సింది. రెండవ లాహోరు కుట్రకేసు వీగిపోయింది. ఇంద్రపాల్ విడుదల అయ్యాడు. ప్రభుత్వం నామీద, లైసెన్సు లేకండా ఆయుధాల్ని కలిగివున్నందుకు ఒకటి, హత్యా ప్రయత్నం చేసినందుకు రెండు-మొత్తం మూడుకేసులు పెట్టబోతోంది.

నేనొక్కణ్ణే అభియుక్తుణ్ణి కావడంవల్ల కుట్రకేసు పెట్టడానికి వీలులేదు. నామీద పెట్టబోయే కేసుల్లో ఏడేళ్ళకుమించి శిక్షవేయడానికి వీల్లేదు. లాహోరు, ఢిల్లీ కుట్రకేసుల్లో, వైస్రాయి ట్రయిన్‌కింద బాంబు పేల్చిన కేసులో నన్ను చేర్చేట్టయితే-నన్నూ లాహోరుగానీ లేక ఢిల్లీ గానీ తీసుకువెళతారు!

బిహారీలాల్ నెహ్రూ ఇలా అన్నాడు "307వ సెక్షన్ క్రింద కాన్పూర్‌కు సంబంధించిన కేసు ఒకటి పెడతాడు. ఈ కేసుకు సంబంధించిన కాన్పూర్ పోలీసుల్ని నిన్ను గుర్తించే నిమిత్తం తీసుకువస్తారు. ఈ గుర్తింపు తతంగం ఓ మెజిస్ట్రేట్ సమ్ముఖంలో జరుగుతుంది. వాళ్ళు నిన్ను గుర్తించకపోతే, ఆ కేసూ పోయినట్టే!"

పడ్డాను. నేను నవ్వేశాను "వాళ్ళు నన్ను గుర్తించకపోవడం ఎలా?
వెంటనే న చాలాసేపు మాట్లాడాను, ఘర్షణ పడ్డాను. ఎదురు బొదురుగా

కొల్చుకున్నాం. ఇంక వాళ్ళు నన్ను ఎలా గుర్తించకుండా వుంటారు? ప్రత్యేకంగా గుర్తించడానికే పిలిపిస్తున్నప్పుడు? వాళ్ళల్లో ఒకడు ఈమధ్య ఢిల్లీ చాందినీ బజార్లో తారసపడ్డాడు. వెంటనే గుర్తించాడు. వాళ్ళు నన్ను గుర్తించకపోవడం మాత్రం అసంభవం!" అన్నాను.

"అసంభవం అని అనకు! తొంభైతొమ్మిదిపాళ్ళు గుర్తించడానికే అవకాశంవుంది. ఒకపాలు గుర్తించక పోవచ్చుకూడాను! మరొక్క విషయం, ఈ కేసును రాజకీయ కుట్రకేసుగా పెట్టడంలేదు. కనుక, నీ అంతట నువ్వు 'నే నదిచేశాను. నేనిది చేశానని' అనకు! అవన్నీ చేయ లేదని అబద్ధం ఆడడం నీకు ఇష్టంలేకపోతే, నువ్వు మౌనంగావుండు! ఏమీ చెప్పకు! ఆ తరువాత నాకు చాతనయింది ఏదో ఒకటి మేము చేస్తాము. మా ప్రయత్నాలకుఅడ్డంకుల్ని మాత్రం కలిగించకు!" అన్నాడు బిహారీలాల్ మెహ్రా! ఇంతగా చెప్తూంటే, ఆయనమాట వినక తప్పలేదు. మౌనంగా వుండడంవల్ల నా అభిమానం దెబ్బతింటుందన్న ప్రశ్నకూడా ఉదయించదు.

అప్పట్లో కట్టుకోవడానికి బట్టల్ని శ్యాంకుమారి నెహ్రూ పట్టుకు వచ్చి ఇచ్చింది. అప్పటికి వారంరోజులుగా గడ్డం చేయించుకోలేదు. ఖైదీలకుచేసే జైలు మంగలిచేత గడ్డం గీయించుకోవడం ఇష్టంలేదు. రేజరు వాడడానికి అనుమతి నివ్వలేదు. గడ్డం బాగా పెరిగింది. మర్నాడు మధ్యాహ్నం నన్ను ఆఫీసుగదికి పిలిపించారు. అక్కడ మెజస్ట్రేట్ వున్నాడు. మెజస్ట్రేట్ యువకుడు, సౌజన్యతకలవాడులా కనుపించాడు. పేరు మిస్టర్ భగవాన్ సహాయ్! ఈయన స్వాతంత్ర్యంవచ్చాక ఉత్తర ప్రదేశ్ చీఫ్ సెక్రటరీగా నియమింపబడ్డాడు. భోపాల్ సంస్థానంలోనూ చీఫ్‌సెక్రటరీగా కొన్నాళ్ళు పనిచేశాడు. ప్రస్తుతం జమ్మూ-కాశ్మీరు గవర్నరుగా వున్నాడు.

మిస్టర్ భగవాన్‌సహాయ్ ఇలా అన్నాడు "మిమ్మల్ని గుర్తించడానికి, మరికొందరు ఖైదీలతోపాటు నిలబెడతాం. కాన్పూరుకు చెందిన పోలీసులు గుర్తించడానికి వస్తారు."

నేను గుర్తింపుకు హాజరుకావడానికి నిరాకరించాను.

మిస్టర్ సహాయ్ చాలా స్పష్టంగా, తప్పుపట్టేలా—ఇలా అన్నాడు "ఇటుచూడండి: మీరుగనక గుర్తింపుకు హాజరుకాకపోతే, ఖైదీగుర్తింపుకు హాజరు కావడానికి నిరాకరించావని రాస్తాను! కానీ, ఒక్కటి మీరు తెలుసుకోవడం అవసరం అనుకుంటున్నాను. మీరుగనక నిరాకరిస్తే, మీరు 'దోషి' అని నిర్ధారణ అవుతుంది! అలాకాక, గుర్తింపు న్యాయంగా జరగడంలేదని మీరు భావించినా లేదా గుర్తింపు జరిపే పద్ధతిలో మీకేమైనా అభ్యంతరం వున్నా-చెప్పండి! తప్పకుండా మీ అభ్యంతరాన్ని పరిగణనకు తీసుకుంటాను. అభ్యంతరాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తాను!"

నేను స్పష్టంగానే సమాధానం ఇచ్చాను "అలాగైతే, తప్పకుండా నా అభ్యంతరాన్ని చెప్తాను. నన్ను మీరు ఖైదీల్లో నిలబెడతారు. నాతో పాటు నిలబెట్టే ఖైదీలంతా ఖైదు దుస్తుల్లో వుంటారు. నేను ఒకడిని మాత్రమే మామూలు దుస్తుల్లో వుంటాను ఇది ఒక అభ్యంతరం. పైగా నేను పది పదిహేను రోజులుగా గడ్డం చేయించుకోలేదు. నా గడ్డం, నా మామూలు దుస్తులు నన్ను ఇట్టే పట్టిస్తాయి. నాలాంటి రాజకీయ ఖైదీల్లో నన్ను నిలబెట్టండి. గడ్డం చేసుకునే అవకాశం ఇవ్వండి. అలా న్యాయంగా గుర్తింపు వ్యవహారం జరుపుతానంటే నాకేమీ అభ్యంతరం వుండదు!" అన్నాను.

"మీ అభ్యంతరం న్యాయమైందే!" మిస్టర్ సహాయ్ ఒప్పుకున్నాడు.

గుర్తింపు సమయంలో నన్ను బి. క్లాసు రాజకీయ ఖైదీల్లో నిలబెట్టడానికి అంగీకరించాడు. బట్టలు మార్చుకోవడానికి, గడ్డం చేసుకోవడానికి వీలు కల్పించాడు.

ఇప్పుడు అండమాన్ జైల్లో మోహన్‌లాల్ గౌతమ్. గోపాల్ సింగ్ - అనే ఇద్దరు పూర్వసహచరులు, రాజకీయ ఖైదీలుగావున్నారు. నాకు సహాయం చేయడానికి పూర్తి సంసిద్ధతను వ్యక్తపరిచారు వీళ్ళిద్దరూ తెల్లని ఖద్దరు దుస్తుల్ని వేసుకునేవారు ఖద్దరు టోపీ పెట్టుకునేవారు. ఖద్దరు దుస్తులతో నాకోసం తెప్పించారు. గడ్డం చేయడానికి మంగలి వచ్చాడు. కాన్పూర్ సంఘటన జరిగినరోజుల్లో నన్నెవరో కొనదేలిన మీసా లుండేవి నాకు. గౌతమ్ కూడా నా మీసాల్ని పెంచుకున్నాడు వత్తుగా ప్రచురితమైన ఫోటోల్లోనున్నాయి నా మీసాలు! మీసాల్ని సన్నగా, కొనదేలినట్లు గొరిగించుకొని వారికిచ్చేశాను నేనేమో అసలు మీసాలకంటా మూతిని నున్నగా గొరిగించేశాను. మొత్తం పేపర్లో కనబడటానికి మరోవిధంగా ఖైదీని కూడా చేసుకున్నాడు. ఉరిశిక్ష పడ్డాను ఖైదీ మంచివాడు. రంగనాథాలు మిత్రభావంతో బట్టల్ని జైలుకు పంపాడు. నేను పంజాబీని. భగత్‌సింగ్ సహాయకుల్ని ప్రియమైనవారిగా భావించడంవల్ల అతడు ఎంతో ప్రభావితుడయ్యాడు. వస్తూనే ఆలింగనం చేసుకుని "మిమ్మల్ని రక్షించడానికి అవసరం అనుకుంటే ప్రాణాన్నయినా ఇచ్చేస్తాను!" అన్నాడు.

పైచెప్పిన పంజాబీయుడు చాలా శ్రద్ధగా మీసాల్ని పెంచుకున్నాడు. అతడికి తన మీసాలంటే ఎంతో గర్వం! వాటిని పైకి మెలిత్రిప్పి, కొన తేర్చి, తేలుకొండిల్లా వుంచేవాడు. నేనిలా అన్నాను. "మీరు మీసాల్ని తీసేయాలి! సన్నగావుండేట్లు కత్తిరించుకోండి!" అని చెప్పాను. పంజాబీ మిత్రుడు అంగీకరించాడు. నాకోసం తన మీసాల్ని త్యాగం చేశాడు.

మెజిస్ట్రేట్ మిస్టర్ సహాయ్ చాలా నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించాడు. సౌంజ్ఞలుచేసి. ఇతరత్రా అనుచితంగా ప్రవర్తిస్తారనుకున్న జైలు అధికారుల్ని, సిబ్బందిని - దూరంగా పంపించివేశాడు. "ఇప్పుడు మీకేమీ అభ్యంతరం లేదుకదా?" అని అడిగాడు. నిజంగానే ఇంక అభ్యంతరానికి తావులేదు. ఐతే, అంతమాత్రంచేత నా మనస్సులో

భయం తీరలేదు గుండె దిటవుచేసుకున్నాను. అందరం నుంచున్నాం. గుర్తించడానికి వచ్చిన ఒక పోలీసును పిల్చారు అతడు రాగానే నేను గుర్తుపట్టాను. నేనేమాత్రం తత్తరపడకుండా హుందాగా, శాంతంగా నిలబడ్డాను. మొదటఅనుకున్నట్టు గౌతమ్ గారు. పంజాబీమిత్రుడూ కొంచెంగా తత్తరపాటును నటించారు. కాన్పూరుపోలీసు మమ్మల్ని ముగ్గుర్ని నాలుగయిదుసార్లు పరిశీలనగా చూశాడు ఒకనిర్ణయానికి రాలేకపోవడం వల్ల ఏర్పడ్డకోపమూ, విసుకుదలా అతడిముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి చూసి, చూసి అతడు గౌతమ్‌గారి చేతినిపట్టుకున్నాడు.

రెండవ పోలీసునుపిల్చారు అతడు మమ్మల్ని కొంతసేపు పరిశీలనగా చూశాడు. అనంతరం పంజాబీ మిత్రుడి చేయిపుచ్చుకుని 'ఇతడే!' అన్నాడు.

మూడవ పోలీసు వచ్చారు. ఇతడు ఢిల్లీ చావడీ బజార్లో కనుపించినవాడే! అతడిలో వెనుకటిభయంతాలూకు వణుకు స్పష్టంగా కనుపించసాగింది. మూడవ పోలీసు మా ముగ్గుర్ని చాలాసేపు చూశాడు చివరకు ఇలా అన్నాడు" ఆ మనిషి వీళ్ళల్లో లేడు!"

అంతటితో కాన్పూర్ సంఘటనకు సంబంధించిన కేసు విరగడయింది.

మూడవరోజున మళ్ళీ ఆఫీసు గదికి పిలిచాడు. ఈమాటు నన్ను పోలీసు ఎస్కార్టుకు వప్పగించారు జైలు నిబంధనల ప్రకారం, ఖైదీని ఒక జైలునించీ మరో జైలుకు మార్చడాన్ని ముందుగా తెలియనీయరు. అలా తెలిస్తే ఖైదీ పారిపోవడానికి రహస్యంగా ఏర్పాట్లు చేసుకుంటాడేమోనని భయం. ఐతే, పాతఖైదీలకు ఎలాగో ముందుగానే తెల్సిపోతుంది, తమను మారుస్తూన్నారని! అప్పటికి నేనింకా కొత్తవాడిని. ఎక్కడికి తీసుకువెళ్ళబోతూన్నారో తెలియదు. లాహోరుగానీ, ఢిల్లీగానీ తీసుకువెళ్తూన్నారనుకున్నాను.

శ్యాంకుమారి నెహ్రూ నాలుగు రోజులకు ఒకమాటు వచ్చిచూసి పోతూన్నది. క్రితంసారి వచ్చినప్పుడు 'లాహోరు, ఢిల్లీ కేసులసందర్భంగా నన్ను లాహోరు ఢిల్లీ కోర్టుల్లో హాజరు పరచవల్సిందని ప్లీడర్లు డిమాండ్ చేస్తున్నారు!' అని చెప్పింది. నన్ను లాహోరుగానీ, ఢిల్లీగానీ తీసుకువెళ్ళడం అంటే ఢిల్లీ కుట్రకేసునూ, లాహోరు కుట్రకేసునూ మళ్ళీ మొదలెత్తుకుని విచారిస్తారన్నమాట! అప్పటికే ప్రభుత్వం పై రెండు కేసులకుగాను పదహేను పదహారు లక్షల రూపాయీలు ఖర్చుపెట్టింది. ఢిల్లీగానీ, లాహోరుగానీ తీసుకువెడితే మిత్రుల్ని కల్సుకోవచ్చునన్న సంతోషం కలిగింది. ఐతే, ఆ కేసుల్లో నన్ను ఇరికిస్తే ద్వీపాంతరవాస శిక్షగానీ, మరణశిక్షగానీ - పడే అవకాశమూవుంది!

పోలీసులు నన్ను రైల్వే స్టేషనుకు తీసుకువెళ్ళలేదు. అలహాబాద్‌లోనేవున్న మరోజైలుకు [నైనీ సెంట్రల్ జైలుకు] తీసుకువెళ్ళారు. అక్కడ నన్ను ఇంగ్లీషు వాళ్ళుండే బారక్కులోని ఓ గదిలోవుంచారు. గదినిదాటి నేను బయటకు వెళ్ళడానికి వీల్లేదు. నాగదివెనుక ఒక పోలీసు వుండేవాడు. నేను గదిలోనుండి ఎక్కడైనా వెళ్తానేమో కనిపెడుతూండేవాడు. నన్ను కల్సుకోడానికి ఎవరూ రావడానికి వీలులేదు. నిజం చెప్పాలంటే, ఆ బారక్కు గదుల్లోని ఇంగ్లీషు ఖైదీలందరూ నా కాపలాదార్లే! అందరూ నన్ను గమనిస్తూండేవారు. ఆ ఖైదీల్లో ఎక్కువమంది ఆంగ్ల సైనికులు. ఒకరిద్దరు ఇంగ్లీషు వాళ్ళమని చెప్పుకునే ఆంగ్లో-ఇండియన్లూ వున్నారు! ఒకడు తాను ఆంగ్లో ఇండియన్‌నని చెప్పుకునేవాడు. ఐతే, అతడు దేశీయ క్రిష్టియను. వాళ్ళందరు నన్ను పరమశత్రువుగా చూసేవారు. ఈ ఇంగ్లీషు బారక్కులోని ఖైదీలకువున్న సౌకర్యాలు బి క్లాసు రాజకీయఖైదీల సౌకర్యాలకంటేకూడా మిన్నగా వున్నాయి. మంచి భోజనం, వస్త్రం లభించేవి. వెన్న, రొట్టె, పాలు, టీ, సన్నబియ్యపు అన్నం, పప్పు, మాంసం - ఇవన్నీ ఇచ్చేవారు. ఆజైలు సూపరింటెండెంట్ ఒబేరాయ్ మంచివాడు.

నన్ను ఉన్నత కుటుంబానికి చెందినవానిగా భావించాడు. నేను అనారోగ్యముగావున్నాను గనుక తేలికగా నాకుపయుక్తమయ్యే పని ఏర్పాటు చేశాడు.

శ్యామకుమారి ప్రతి నెలా, నన్ను కలుసుకోవడానికి జైలుకు వచ్చేవారు. శ్యామకుమారి చాలా సహాయం చేసేది. ఆమెకు ఏ మాత్రం సంకోచించకుండా నా వ్యక్తిగత అవసరాల్ని గురించి కూడా చెప్తూండేవాణ్ణి. బయటి ఉద్యమాలు, రాజకీయమైన నా అభిప్రాయాల్ని చేరవేయటంలోనూ సహాయపడేది. నేను అడిగిన పుస్తకాల్ని ఆమె సంపాదించి పెడుతూండేది. నా క్షేమం కనుక్కుంటూండేది. ఒకసారి ఆమెతో నన్ను అభినందిస్తూ ఇలా అన్నాను "ఇలాంటి జైల్లో మంచి పరిచయాలు ఏర్పడ్డాయి. ఇక్కడ నాకు తెలియదు. కానీ చాలా పెద్ద జైలు. నిర్బంధమూ పెద్దగానే వుంటుంది!"

ఇదే జైల్లో జవహర్‌లాల్ నెహ్రూగారూను. వారి ఇతర కుటుంబీకుల్ని చెప్పటం జరిగింది. నెహ్రూ కుటుంబంలోని సభ్యులు చాలారోజులు నైనీ జైల్లో వున్నారు. అందువల్ల శ్యామకుమారి ఆ జైలుకు తరచువస్తూండేది. ధైర్యాన్నిస్తూండేది "దయచేసి. జైలు పెద్దదైనకొద్దీ మనకు అవకాశాలూ పెద్దగానే లభిస్తాయి!" అంటూ ఒక విశ్వాసపాత్రుడైన వార్డర్ పేరు చెప్పి "జవహర్లాల్ నెహ్రూగారూ, రంజీత్ భాయి ఈ వార్డర్ ద్వారా మాకు ఉత్తరాలు పంపించేవారు. నువ్వు ఇతనిద్వారా కబురుపెట్టు. సంకోచించకు. మేమతనికి బహుమానం ఇస్తూంటాము. అవసరం అనుకుంటే ఏదో ఏదో దగ్గరుంచుకో, పనికొస్తుంది!" అన్నది శ్యామకుమారి.

జైలు నిబంధనల ననుసరించి ఖైదీలు దగ్గర డబ్బు అట్టే పెట్టుకోవడం చాలా పెద్దనేరం. అయితే, ఖైదీలందరూ కొద్దో గొప్పో డబ్బుదగ్గర వుంచుకుంటారు. అలా వుంచుకుంటారని జైలు ఆఫీసర్లకూ తెలుసు. అయినా, పట్టించుకునేవారు కాదు. మరి ఖైదీలదగ్గర డబ్బుల్లేకపోతే, జైలు అధికార్లకు లంచాలు ఎలా వస్తాయి?

నా కేసు మార్చి మొదటివారంలో విచారణకు వచ్చింది అనుకుంటు న్నాం. అప్పుడే [illegible] బాహాటంగా ఒక నిర్ణయానికి వచ్చింది. నేనూ, ఫిక్సూహక్ అన్సారీ మరికొందరు [illegible] ఏమో తెలి[illegible] మాత్రం [illegible] కింది [illegible] ఇలా అన్నది. "...... [illegible] అనుమానం [illegible]"

[illegible] ప్రకాశవతి [illegible] మొదట్లో [illegible] వుండే [illegible] ఆ [illegible] కింది ప్రకాశవతి. [illegible] అనుభవాలు [illegible]

[illegible] కానీ, అలా [illegible] రానిస్తే ఏదో [illegible] అందువల్ల [illegible] కేసును విచారించే [illegible] నారాయణ్ ముల్లా కాకోరి కుట్రకేసులో ప్రముఖ న్యాయవాది. ఇంతకు పూర్వం ఒకటి రెండు సందర్భాల్లో బ్రిటిష్ న్యాయాన్ని అభినందించాను. కానీ, నా కేసు బ్రిటిష్ న్యాయానికి మరో ఉదాహరణ: నామీద రెండు అభియో గాల్ని మోపారు. ఒకటి సైన్యం [illegible] కలిగిస్తున్నందుకు. రెండవది 307 సెక్షన్ కింద హత్యాప్రయత్నానికి పాల్పడ్డందుకు.

నిజానికి రెండు అభియోగాలూ ఒకే కేసుకు అంతర్భాగాలు. ఐతే, శిక్ష అధికంచేయడానికి విడదీసి రెండు అభియోగాల్ని చేశారు. ఇది బ్రిటీష్ న్యాయంయొక్క రెండవ రూపం.

నా కేసును అధ్యయనం చేయడంకోసం జైలులైబ్రరీనుండి 'ఇండియన్ పీనల్‌కోడ్' తీసుకుని చదువుతూండేవాణ్ణి. జైల్లోని ఏకాంతం, తీరిక-కొంత కుతూహలం-కారణంగా మొత్తంపీనల్‌కోడ్‌ను చదివేశాను. బ్రిటీష్ న్యాయం చైతన్య రహితమైన యంత్రంలాంటిది. ఒకానొక సెక్షన్ ప్రకారం వైస్రాయిపై హత్యా ప్రయత్నం చేసినందుకు ఉరిశిక్ష వేయవచ్చును. 'నామీద ఆ సెక్షన్‌కిందే కేసుపెట్టవచ్చునుగదా? మొత్తం పీడ విరగడైపోతుంది!' అనుకున్నాను. సరే, లైసెన్సులేకండా ఆయుధాన్ని కలిగివున్న కేసును విచారించడానికి జడ్జీనీ, జ్యూరీని నియమించారు. హత్యాప్రయత్నం కేసుకు ఆసేసర్లను నియమించారు.

ముందుగా లైసెన్సు లేకండా ఆయుధాన్ని కలిగివున్న కేసుపై విచారణ జరిగింది. ఈ కేసులో నామీద అపరాధం రుజువు లేదని జ్యూరీ నిర్ణయించింది. జడ్జి ముల్లా. అతడు జ్యూరీ అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు. జ్యూరీని కాదని శిక్షవిధించలేడు గనుక ఈకేసును హైకోర్టుకు అవాల్లాచేశాడు. ఇక, పిస్తోలుతోకాల్చి మానవ హత్యకు పాల్పడ్డానన్న కేసు ఒకటుంది. ఇది అసెసర్ల ద్వారా విచారించబడింది. ఈ అభియోగం కేవలం పోలీసు అధికారుల సాక్ష్యాధారాలమీద ఆధారపడింది. అదీ ముఖ్యంగా పిడ్లిచ్ సాక్ష్యంమీద ఆధారపడ్డదీకేసు ఇతరసాక్షులు ఎవరూ లేరు. సాక్ష్యానికి ఉపయోగపడే పరికరమూ ఏమీలేదు. నేను ఏ విధమైన వాఙ్మూలాన్ని ఇవ్వడానికి తిరస్కరించాను. ఇక్కడ ఒకవిషయం చెప్పకుండా వుండలేను. మిస్టర్ పిడ్లిచ్ తన వాఙ్మూలంలో అక్షరాక్షరం సత్యాన్నే చెప్పాడు. బిహారీలాల్ చాలా నిదానంగా మాట్లాడేవాడు. ఐతే, వాదనలో దిట్ట. నేర్పుగా వాదనని మలుపుతిప్పాడు. సాక్షిని ప్రశ్నవేయ

దంలో గొప్ప నేర్పరితనాన్ని ప్రదర్శించాడు. బిహారీలాల్ ప్రశ్నకు సమాధానం ఇస్తూ పిడ్లిచ్ ఇలా అన్నాడు "నా విశ్వాసాన్ని అనుసరించి, ఈకోర్టులో నిలబడివున్న మిస్టర్ యశ్‌పాల్ నాపై కాల్పులు జరిపాడని అనుకుంటున్నాను ఐతే, రేకుల దడివెనుక మరొక్క వ్యక్తి ఎవరైనా వుండ దమూ, అతడు నామీద కాల్పులుజరిపి పారిపోవడమూ- పూర్తిగా సంభవం! అభియుక్తుని తరఫున వాదిస్తూన్న ప్లీడరుగారి అభిప్రాయానికి, వారి అనుమానానికి-అవకాశం వుంది! కాల్చింది మరొకరు కావచ్చును!"

నేర్పరి ఐన ప్లీడరు అనుమానానికి అవకాశం కల్పించాడు.

అసేసర్లుకూడా అంగీకరించారు. 'సందేహానికి అవకాశంవుంది' అన్నారు.

నా అపరాధం రుజావు కాలేదు. ఐతే, జడ్జీముల్లా అసేసర్ల అభిప్రాయానికి ప్రధాన్యత నివ్వకుండా ఏడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షను విధించాడు. ఎంతటి సాధారణబుద్ధికయినా స్పష్టంగాతోచే విషయం, పిస్తోలు ఉన్నదన్న విషయమే రుజావు కానప్పుడు ఇంక పిస్తోలుకాల్చి హత్యకు ప్రయత్నించాడన్న వాదాన్ని ఎలా అంగీకరించడం? ఐతే, కోర్టు వ్యవహారాలూ, వాళ్ళ నియమాలూ - న్యాయాలూ సాధారణ బుద్ధికి అర్థం కావు!

జైలు కొట్టులోనే ఏర్పాటైన ఈ న్యాయస్థానంలో ఓ చిత్రమైన సంఘటన జరిగింది. దెహరాడూన్‌లో వున్నప్పుడు నేను డాక్టర్నని చెప్పుకుని కాలం గడిపిన విషయం వెనకే రాశాను. ఆ రోజుల్లో ఓ బెంగాలీ యువఉపాధ్యాయినితో పరిచయం అయింది ఆమె తండ్రిగారితోనూ బాగా పరిచయం ఏర్పడ్డది. ఈ న్యాయస్థానానికి ఆయనగారు రావడమూ జరిగింది. చూడగానే ఆయన్ను గుర్తించాను. ఐతే, గుర్తించినట్టు పైకి కనబడనీయలేదు అసలీ న్యాయస్థానానికి సాధారణ ప్రజలు వచ్చే అవకాశంలేదు. కానీ, పత్రికా సంపాదకులూ, విలేఖరులూ రావచ్చును. అలా

వచ్చిన విలేఖరుల్లో పై చెప్పిన బెంగాలీ యువఉపాధ్యాయురాలి తండ్రిగారు కూడా వున్నారు. ఆయన నన్నుచూసి చాలా ఆశ్చర్యపడ్డారు. పోల్చుకోవడానికి సతమతమయ్యారు. మూడవరోజున ఏకాంతంలో, అవకాశాన్ని చూసుకుని పలకరించారు. తాను చేయగలిగినంత సహాయం చేస్తానని గద్గదమైనస్వరంలో చెప్పారు. నాకేమైనా అవసరం అయితే చెప్పమన్నారు.

"ధన్యవాదం! అంతా సవ్యంగా వుంది!" అన్నాను క్లుప్తంగా.

నాతో ఆయన ఆత్మీయతగా మాట్లాడడం పోలీసులు చూస్తే, ఆయన వెంటపడతారు. ఆయనని ఇబ్బంది పెడతారు. అది నాకు ఇష్టం లేదు. అందుకే క్లుప్తంగా సమాధానం చెప్పాను.

ఒక నెలరోజుల తరువాతగానీ హైకోర్టు తీర్పుచెప్పదు. ఈలోపు ప్లీడర్లువచ్చి పోతూన్నారు. తీర్పు చెప్పాక శ్యాంకుమారి నేరుగా జైలుకు వచ్చింది. నన్ను అభినందించింది. లైసెన్సులేకుండా ఆయుధాన్ని కలిగివున్నందుకు హైకోర్టు నన్ను అపరాధిగా భావించింది. ఐతే, నష్టమేమీ లేదు. ఈ కేసులోనూ ఏడేళ్ళు శిక్ష పడవచ్చును. హత్యాప్రయత్నానికి ఏడేళ్ళు ఎటూ విధించారు. రెండు శిక్షలూ ఏకకాలంలోనే అనుభవించవల్సి వుంటుంది. ఏడేళ్ళు జైలు చేయవల్సి వుంటుంది ఇంతచేశాక ఏడేళ్ళ శిక్ష నాకోశిక్ష అనిపించలేదు. శిక్ష పడకుండా వదిలిపెట్టినంత సంతోషపడ్డాను. సాహిత్యాధ్యయనానికి ప్రభుత్వం ఏడేళ్ళ సదవకాశాన్ని ఇచ్చిందనిపించింది.

మర్నాడు మళ్ళీ శ్యాంకుమారి వచ్చింది. ఆమె ముఖం వెలవెలపోతోంది. "నిన్న ఇంగ్లీషు జడ్జి తీర్పు చెప్పేప్పుడు 'రెండు శిక్షలుకలసి అనుభవించవల్సి వుంటుంది' అని చెప్పాడు తీర్పు అప్పటికి టైపుకాకపోవడంవల్ల జడ్జి సంతకం పడలేదు. రాత్రి క్లబ్బులో ఇతర ఇంగ్లీషు ఆఫీసర్లతో మాట్లాడాక జడ్జి తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. 'కలసి' అన్న శబ్దాన్ని కొట్టివేసి 'క్రమంగా' అని రాశాడు. ఒక్క శబ్దాన్ని మార్చి

డంవల్ల ఏడేళ్ళశిక్ష పద్నాలుగేళ్ళయింది! పద్నాలుగేళ్ళశిక్ష అంటే, అది పద్నాలుగేళ్ళతోనే ఆగిపోదు. పద్నాలుగేళ్ళశిక్ష పడడమంటే జన్మఖైదు కిందికి వస్తుంది. శిక్షపూర్తి అయ్యాక కూడా ఖైదీని వదిలిపెట్టడానికి ప్రభుత్వం ప్రత్యేకం అనుమతించవల్సి వుంటుంది" అన్నది.

శ్యాంకుమారి నాకీవిషయాన్ని చెప్పేప్పుడు అనుకోకుండా మీరట్ కేసులోని అభియుక్తుల్ని కల్సుకోవడం జరిగింది. వాళ్ళ విచారణ అలహాబాద్‌లోనే జరగాలి. నైనీజైలు ఆఫీసుగదిలో నేనూ వాళ్ళూ కల్సుకోవడం జరిగింది. వాళ్ళల్లో లాహోరు నివాసి లాలా కేదారనాధ్ సహగల్ కూడా వున్నాడు. ఆయన ఇలా అన్నాడు. "పద్నాలుగేళ్ళ జైలుశిక్షే గదా? ఫరవాలేదు! ఉరిశిక్ష పడనందుకు సంతోషించు?" నాకూ అలాగే అనిపించింది. 'ఏడేళ్ళూ, పద్నాలుగేళ్ళూ - రెండు ఒకటే- పెద్ద వ్యత్యాసం ఏమీలేదు!' అని మనస్సులోనే ఊరటచెందడానికి ప్రయత్నించాను.

అసలైన కేసులు ఇంకా అట్లాగే వున్నాయి. అలహాబాద్ కేసు అయిపోయిందిగదా! ఇక లాహోరు, ఢిల్లీ కేసుల్ని మొదలుపెడతారు!

లాహోరుకుగానీ, ఢిల్లీకిగానీ త్వరలో ప్రయాణం వుంటుందనుకుంటున్నాను. ఏదో ఒక పుస్తకాన్ని చదువుతూ కాలం వెళ్ళబుచ్చుతూన్నాను. ఒకరోజున జైలు ఆఫీసునుండి పిలుపు వచ్చింది. ఆఫీసునుండి పిలుపు రావడం ఓ ప్రత్యేకతను సూచిస్తూంటుంది. జైల్లో ఏదో అపరాధం చేయడంవల్ల శిక్ష అనుభవించడానికి సూపరింటెండెంట్ పిలిపించవచ్చును. ఒక జైలునుండి మరోజైలుకు మార్చడం కారణంగా పిలుపు రావచ్చును. కాక ఎవరైనా ఖైదీని కల్సుకోడానికి రావడంవల్లా ఆఫీసునుండి పిలుపు రావచ్చును. మొత్తానికి ఆఫీసునుండి పిలుపు వచ్చిందంటే తప్పకుండా ఏదో ఒక కొత్త విషయం జరగబోతోందన్నమాట!

ఆఫీసు గదికి వెళ్ళాను.

కల్సుకోడానికి ఎవరూ రాలేదు. జైలర్, వార్డర్ నొకణ్ణి తోడు

ఇచ్చి పై అంతస్తులోని ఓగదికి పంపించారు. ఆగదిలో బెనర్జీ మహాశయుడు కూర్చొనివున్నాడు. 'ఇతడు మళ్ళీ వచ్చిపడ్డాడే!' అనుకున్నాను.

బెనర్జీ మహాశయుడు ఒట్టిచేతుల్తో రాలేదు. మామిడిపండ్లను పట్టుకు వచ్చాడు. మనస్సులో ఇలా అనుకున్నాను 'శిక్షకూడా పడ్డదికదా? ఇంక ఇతడు ఎందుకు వచ్చాడు? ఇంకా ఢిల్లీ కుట్రకేసు, లాహోరు కుట్రకేసు అలాగే వున్నాయిగదా? అందుకే వచ్చివుంటాడు!'

అతడు వస్తూనే "నిన్ను గురించి చాలా విచారిస్తున్నాను. ఎంతో బాధపడుతూన్నాను. అలహాబాద్ కేసు అయిపోయిందనుకో! లాహోరు, ఢిల్లీ కుట్రకేసులు వున్నాయికదా? కాకపోయినా పద్నాలుగు ఏళ్ళజైలు శిక్ష అనుభవించడం సామాన్యమైన విషయమా? ముఖ్యంగా ఎంగ్‌లేడీ ప్రకాశవతి జీవితాన్ని గురించి కూడా ఆలోచించు! ఇప్పటికైనామించి పోయిందేమీలేదు. నువ్వాక నిర్ణయానికివస్తే, ఈ జైలు శిక్షలూ-అన్నీ పోతాయి. మిగిలిన జీవితాన్ని సుఖంగా గడపవచ్చును!" అంటూ ఒక చిన్న ఎర్రని కరపత్రాన్నొకదాన్ని నాచేతికి ఇచ్చాడు బెనర్జీ మహాశయుడు

ఆ కరపత్రంలో విదేశీ పాలకులపై తిరుగుబాటు చేయవల్సిందని బాహాటంగా పిలుపు ఇవ్వడం జరిగింది. క్రింద 'కమేండర్ ఇన్‌చీఫ్ ప్రకాశవతి' అని వుంది.

ప్రకాశవతి పేరున వున్న కరపత్రాన్ని నాకు చూపడంలోని అంతర్యం స్పష్టమే! ఆమె ప్రమాదంలో వున్నట్టు చిత్రించి నన్ను ప్రభుత్వ సాక్షి కావల్సిందని చెప్తూన్నాడన్నమాట! అదిచూసి నేను బాధపడిపోతానని అనుకున్నాడు బెనర్జీ! కానీ, నేను ఏమాత్రమూ ఉద్రేకపడలేదు. ఉద్వేకపడలేదు స్థిమితంగా "దాదాపుగా మూడునెల్లనుంచి జైల్లోవున్నాను. ఈ కరపత్రాన్ని గురించి నాకేమీ తెలియదుగదా? ఇంక నాకుచూపి ప్రయోజనం? ఈకరపత్రాన్ని గురించి నేనేమీ అభిప్రాయాన్ని ఇవ్వలేను. అసలు ఆలోచించనుకూడా ఆలోచించలేను!" అన్నాను.

మా ప్రయత్నాలు ఆగిపోనందుకు, విప్లవచర్యలు ఇంకా కొన సాగుతూన్నందుకు మనస్సులోనే సంతోషపడ్డాను. ఒక అనుమానమూ వచ్చింది. నన్ను భయపెట్టడంకోసం బెనర్జీ దొంగ కరపత్రాన్ని అచ్చు వేయించుకు రాలేదు కదా?

జైలు నుండి విడుదల అయ్యాక, ఈ కరపత్రం గురించి ప్రకాశ వతిని అడిగాను. రాజేంద్రసింగ్ మొదలైన మిత్రులు కమాండర్ ఇన్ చీఫ్‌గా ఆమె పేరును వాడుకుంటామని అడిగారుట! అందుకు ప్రకాశవతి అంగీకరించింది.

బెనర్జీతో ఇలా అన్నాను "చూడండి! నేను జైల్లోవున్నాను బైట ఏం జరుగుతోందో నాకు తెలియదు. నా ప్రమేయమూలేదు. 14 సంవత్సరాలశిక్ష పడది. అనుభవించడానికి సిద్దంగా వున్నాను. లాహోరు, ఢిల్లీకేసుల్లో పడే శిక్షనూ అనుభవించడానికి నేను సిద్ధం! కనుక, నేను మీరుచెప్పే మాటల్ని వినను, మీ సలహాను అంగీకరించను. మీ సహాయాన్ని స్వీకరించను. నాపట్ల మీరు ప్రదర్శించిన అనురాగానికి ధన్యవాదం!" అన్నాను.

బెనర్జీ అప్పటికీ వదల్లేదు. "చూడుబాబు! నేను ఉద్యోగ విరమణ చేసే వయస్సులో వున్నాను. నేను రిటైర్ అయ్యేలోపు నీకేమైనా మేలు చేద్దామని నా ఉద్దేశం! నా మాటలలో నీకు నమ్మకంలేదా? నేను మాట నిలబెట్టుకోలేనేమోననిగానీ, చివరకు మాట తప్పుతాననిగానీ, కాక నాపట్ల ఏరకమైన అనుమానమైనావుంటే, నీకు నమ్మకంగల పెద్ద ఆఫీసరు సమ క్షంలో మాట్లాడుకుందాము. పిడ్డిచ్‌ని చూశావుగదా? చాలా విశ్వాసపాత్రుడు! ఆయన్ని కల్సుకుని మాట్లాడుతానంటే, ఆయన్ని పిలిపించే ఏర్పాటు చేస్తాను! చెప్పు, మాట్లాడతావా?" అనడిగాడు.

గమ్మత్తు చేద్దామనిపించింది. "వారు మాట్లాడాలనుకుంటే నేను సిద్ధం!" అన్నాను.

బెనర్జీ తలనిమురుకుంటూ తన నెరిసిన తలవెంట్రుకల్ని చూపుతూ "నా వయస్సునుబట్టి అయినా నామాటనిలబెట్టు! తీరాఆయనగారు వచ్చాక తలాతోకాలేని మాటలు మాట్లాడకు పిడ్డిచ్‌గారు ఇప్పుడు నైనీటాల్లో వున్నారు అక్కణ్ణుండి పిలిపించాలి!" అన్నాడు.

"అదంతా మీరు ఆలోచించుకోండి! 'వారిని పిలిపించండి! నేను మాట్లాడతాను!' అని నేనేమీ మీకు మాట ఇవ్వలేదు వారు వస్తే, నాతో మాట్లాడాలనుకుంటే నేను తప్పకుండా మాట్లాడతాను! ఐతే, ఒక విష యం మారు తప్పక గమనించాలి! ఇకమీదట ఎన్నడూ నాకోసం మీరు ఇలా శ్రమ తీసుకోకండి! నాకు శిక్షకూడా పడది. జైలు నియమాల ననుసరించి ఖైదీ బయటనుండి వచ్చిన వస్తువుల్ని తినకూడదు. మీరు తెచ్చిన మామిడి పళ్ళను కూడా నేను తీసుకోలేను!" అన్నాను. ఒక రకంగా నామీద బాధ్యతలేకండా చేసుకున్నాను.

మూడవరోజు మళ్ళీ ఆఫీసునుంచి పిలుపు వచ్చింది, వెళ్ళాను. సూపరింటెండెంట్ గదిలోకి పిలిపించాడు. మిస్టర్ పిడ్లిచ్, మిస్టర్ మార్ష, మరి ఇద్దరు సూపరింటెండెంట్‌లూ ఉన్నారక్కడ! మిస్టర్ పిడ్లిచ్ నవ్వుతూ కరచాలనంచేసి "కూర్చోండి! నేను నైనెటాల్‌లో వున్నాను. మొన్న బెనర్జీగారి ఫోన్ వచ్చింది. మీరు నాతో మాట్లాడాలనుకుంటున్నట్లు తెల్సింది నేరుగా వచ్చేశాను!" అన్నాడు.

"నా కారణంగా మీకు శ్రమ కలిగింది. చాలా విచారిస్తూన్నాను!" అన్నాను.

"నాకేమీ శ్రమ కలగలేదు. పైగా, మీరు నాతో మాట్లాడాలను కుంటున్నందుకు సంతోషపడుతూన్నాను. మనం మొదటగా విచిత్రమైన స్థితిలో కల్సుకున్నాము. మిమ్మల్ని కల్సుకున్నందుకు - ఆనాడూ సంతోషపడ్డాను, ఇప్పుడూ సంతోషపడుతూన్నాను! ఇంతకూ నాతో ఏం

మాట్లాడాలనుకుంటున్నారు? ఒంటరిగా మాట్లాడాలనుకుంటే మిస్టర్ మార్ష అవతలికి వెడతారు!" అన్నాడు పిడ్లిచ్.

"అలావద్దు. ఖైదీ ఒంటరిగా ఇతరుల్తో మాట్లాడడం జైలు నియమాలకు విరుద్ధంకదా? పైగా, మనం మాట్లాడుకున్నప్పుడు జైలు అధికారులు ఎవరో ఒకరు మధ్యవర్తిగావుండడం అవసరం అనుకుంటున్నాను" అన్నాను.

పోలీస్ సూపరింటెండెంట్ వచ్చాడనితెల్సి ఒబేరాయ్ తన బంగ్లా నుండి ఆదరాబదరా వచ్చేశాడు 'మేము మాట్లాడుతూండడంచూసి ఆగిపోయాడు. "మీరు మాట్లాడుకొండి!" అంటూ వెళ్ళిపోవడానికి వెనక్కు తిరిగాడు.

నేనిలా అన్నాను "జైలు నియమాలననుసరించి ఖైదీ ఎవరితో మాట్లాడినా, జైలు అధికారుల సమ్ముఖంలోనే మాట్లాడాలి!" అన్నాను.

"ఏం ఫరవాలేదు అంతా సవ్యంగానేవుంది!" అంటూ వెళ్ళిపోయాడు.

''ఐనా, జైలు నిబంధనల్ని త్రోసిరాజనడం నాకిష్టంలేదు!'' అన్నాను మొండిగా.

ఒబేరాయ్, పిడ్లిచ్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పిడ్లిచ్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు "మనం మాట్లాడుకునేప్పుడూ, మనం ఒక ఒప్పందానికి వచ్చేప్పుడూ మనమధ్య నమ్మకస్థుడైన మధ్యవర్తి ఒకరుండడం అవసరమని బహుశ మిస్టర్ గాళ్పాల్ అనుకుని వుంటారు. మధ్యవర్తి ఉండడంపట్ల నాకేమీ అభ్యంతరంలేదు మేజర్ ఒబేరాయ్, మీరు ఉండండి! మనం ఇక్కడ ఏం మాట్లాడుకున్నా, మన ముగ్గుర్లోనే వుంటుంది. బయటికిపోదు!"

ఒబేరాయ్ అయిష్టంగానే కూర్చున్నాడు.

పిడ్లిచ్ నన్ను ఇలా అడిగాడు 'మీరు ఏం మాట్లాడాలనుకున్నారు?'

"మీరు చాలాదూరం నుండి, శ్రమపడి వచ్చారు. అందుకు విచారిస్తున్నాను. నేను ప్రత్యేకం చెప్పవల్సింది ఏమీలేదు. మిష్టర్ బెనర్జీ నన్ను కల్సుకోడానికి రాకుండావుంటే బాగుంటుంది. ఒక సి ఐ.డి ఆఫీసరు నన్ను కల్సుకోడానికి వస్తూండడంవల్ల ప్రజలు నన్నుగురించి చెడుగా అనుకుంటారు!" అన్నాను.

"ఇంతేనా, ఇంకేమీలేదా మాట్లాడవల్సింది?" పిడ్లిచ్ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

"నేను చెప్పదలచింది ఇదే! ఇంక మీరు ఏమైనా అడిగితే సమాధానం ఇస్తాను! మీరేమైనా చెప్తే చేస్తాను!" అన్నాను.

పిడ్లిచ్ రెండు క్షణాలు ఆలోచించాడు

"మీరు మీ గతజీవితాన్ని గురించి ఓ గ్రంధం రాయండి. నిజమైన, ప్రామాణికమైన జీవితాన్ని రాయండి. అందుకు అవసరం అయిన పరికరాల్ని ఇచ్చే ఏర్పాటు చేయిస్తాను!" అన్నాడు పిడ్లిచ్.

" ఆత్మకధలు మహాపురుషులు రాసుకుంటారు! నేనంత గొప్పవాణ్ణికాను. అదీకాక, నా జీవితకధవల్ల ఎవరికీ ప్రయోజనం వుండదు!" అన్నాను.

"అలా అనుకోవద్దు. మీరీఉద్యమంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. మీ జీవిత చరిత్ర, మీ విప్లవసంఘ చరిత్ర - మీరు రాస్తే భవిష్యత్తులో అనేక మంది జీవితాల్ని నాశనంకాకుండా కాపాడినవారవుతారు!" అన్నాడు పిడ్లిచ్.

ప్రస్తుత సందర్భాన్ని అధిగమించి, ఇక్కడ ఒక విషయం చెప్పడం ముఖ్యం అనుకుంటున్నాను. నేను 1938 లో జైలునుండి విడుదల అయ్యాను. అయినా, నా అనుభవాల్ని గ్రంధస్థం చేయడానికి తొందరపడలేదు. చాలామంది మిత్రులు 'ఆత్మకధలు' 'సంస్మరణలు' రాశారు. నేను 1948 తరువాత మాత్రమే నాఅనుభవాల్ని వ్రాయడం ప్రారంభించాను

అలా కాకుండా. బ్రిటీష్ ప్రభుత్వకాలంలో నేరాస్తే, మిగిలివున్న మిత్రుల్ని ఇరకాటంలో పడేసినవాణ్ణవుతాను అలా రాయడం ఆంగ్ల ప్రభుత్వానికి లాభం చేకూర్చడమే అవుతుంది.

నేను పిడ్లిచ్‌తో ఇలా అన్నాను

"అంటే, నేను ఇన్నాళ్ళూ ఏ మిత్రులతో కలిసి పనిచేశానో, వాళ్ళ ప్రాణాల్ని మీ చేతుల్లో పెట్టమంటారు?"

పిడ్లిచ్ మాటఇచ్చాడు. "నేను మీకుమాటఇస్తున్నాను. హత్యలూ-దోపిడీల్లో పాల్గొననివారిపట్ల ఎలాంటిచర్యా తీసుకోవడం జరుగదు భవిష్యత్తులో వారలాచేయకుండా నిరోధించడంమాత్రం జరుగుతుంది. ఇకదోపిడీలూ హత్యలూ మొదలైనవాటిలో పాల్గొన్నవారిపట్ల కూడా సాధ్యమైనంత ఔదర్యాన్ని ప్రదర్శించడం జరుగుతుంది ఇలాంటి హింసాత్మకప్రవృత్తిని నిరోధించడమే వుద్దేశ్యంగా పెట్టుకుంటాము. ప్రతిహింస, శతృభావన-వుండవు!" అన్నాడు.

పిడ్లిచ్ స్పష్టంగా, అరమరికలు లేకుండా మాట్లాడుతున్నాడు. కనుక, నేనూస్పష్టంగా అడిగాను "నా జీవితకధనూ, నా మిత్రులయదార్ధస్థితినీ-వ్రాసిమీకు ఇవ్వమంటున్నారు. మరి నాస్థానంలో ఏ బ్రిటీష్ నాగరికుడో ఉన్నాడనుకోండి, ఉదాహరణకు మీరే వున్నారనుకుందాం, అలా రాసి ఇవ్వగలుగుతారా?" అనిప్రశ్నించాను.

పిడ్లిచ్ ముఖంఎర్రబడింది. "ఎన్నటికీ అలారాసిఇవ్వను" అన్నాడు.

"మరి నేను మాత్రం ఎలారాసి ఇవ్వగలను?"

పిడ్లిచ్ ఒక్క-క్షణం మౌనంగావున్నాడు. తరువాత ఇలాఅన్నాడు.

"ఇప్పుడు నేనుమిమ్మల్ని మరికూడా గౌరవిస్తున్నాను. సరే. ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదలిపెడదాం. ఇచ్చిపుచ్చుకునే వుద్దేశంతో కాదు, ఓ మిత్రుడిగా అడుగుతున్నాను. నావల్లమీకేమైనా సహాయం కావల్సివుంటే చెప్పండి, చేసిపెడతాను!" అన్నాడు.

"ధన్యవాదం. నాకేంకావల్సివుంటుంది? అంతాబాగానేవుంది।"

"అలాకాదు. పద్నాలుగేళ్ళు జైలుజీవితం గడపడం సాధారణమైన విషయంకాదు. ఉన్నతశ్రేణి సౌకర్యాల్ని పొందేఅవకాశంవుంటుంది। ఔనుకదా, ఒబేరాయ్?" అన్నాడు పిడ్లిచ్.

'ధన్యవాదం నేను బి. క్లాసు ఖైదీని. హింసాత్మక కార్యక్రమాల కారణంగా అభియుక్తులైనవారికి జైలు నియమాలననుసరించి ఎ. క్లాసు లభించదు' అన్నాను.

"అదేమీలేదు. ప్రభుత్వం అనుమతిఇస్తే అన్నీ జరుగుతాయి।" అన్నాడు పిడ్లిచ్.

"మీరు అడిగారని కోరడం బాగుండదు బి. క్లాసు సుఖంగానే వుంది. సంతృప్తిగావుంది. నాకు ఇంకేమీ అవుసరంలేదు।" అన్నాను.

"చాలా సంతోషం. మిత్రుడిగా ఒక సలహాఇస్తున్నాను. జైల్లో, ఒంటరిజీవితంలో, సమయం గడపడం కష్టం। క్రితం యుద్ధంలో నేను యుద్ధబందీగా వున్నాను. నాకు జైలు అనుభవంవుంది. జైలుజీవితంలో విదేశీబాషను నేర్చుకోవడంవల్ల మనకు తెలియకుండానే కాలం దొర్లిపోతుంది జైలుజీవితం గడపడానికి విదేశీభాషాధ్యయనం మంచి సాధనం. 'హ్యూగో' పబ్లికేషన్సువారు అనేకబాషలకు స్వబోధినీలను ప్రచురించారు. వాటిని తెప్పించుకుని కొత్తభాషలు నేర్చుకోడానికి ప్రయత్నించండి।"

"అలాగయితే, నాకుఒక సౌకర్యాన్ని కలిగించండి।"

"ఏమిటి?"

"కలమూ-కాగితాలూ దగ్గర వుంచుకోడానికి నాకు అనుమతి ఇప్పించండి. కాగితాలు లెక్కపెట్టి ఇవ్వండి. నేనుకొన్ని కథలూ-వ్యాసాలు రాయాలనుకుంటున్నాను. వాటిని, పోలీసులు చదివి అభ్యంతరం లేకపోతేనే నామిత్రులకో, లేక నాబంధువులకో ఇచ్చేఏర్పాటు చేయమనండి।" అన్నాను.

"మిస్టర్ ఒబేరాయ్! ఇదిఅభ్యంతరమైన కోర్కెకాదుగదా?" అని అడిగారు పిడ్లిచ్. ఒబేరాయ్ కాదనిచెప్పారు. సౌజన్యపూరిత వాతావరణం లో కరచాలనంచేసి, వీడ్కోలు చెప్పుకున్నాం.

పిడ్లిచ్ ఇచ్చినసలహాకు చాలా కృతజ్ఞుణ్ణి. సుదీర్ఘమైన జైలు జీవితంలో ఫ్రెంచి, ఇటాలియన్ భాషల్ని అభ్యసించాను.

మే నెల, ఒకరోజున ఆఫీసునుండి పిలుపు వచ్చింది. సామాను కూడా వెంటతెచ్చుకోమన్నారు. అంటే నన్ను మరోజైలుకు మారుస్తున్నారన్నమాట! ఢిల్లీగానీ, లాహోరుగానీ-పంపుతారని ఎటూ అనుకుంటూనే వున్నాను! ఖైదీకి జైలుమారడం చాలా ఇబ్బందికరంగా వుంటుంది. నియమానుసారం, మూడు సంవత్సరాలపైబడి శిక్షపడ్డఖైదీని బయటకు తీసుకువెళ్ళేటప్పుడు బేడీలువేస్తారు. ఒకచోటవున్నఖైదీ అక్కడిపరిస్థితులకు అలవాటుపడతాడు. కొత్తజైలుకు వెడితే మళ్ళీ పరిస్థితి మొదటికి వస్తుంది. కొత్తఖైదీలపట్ల జైలు అధికారులు కఠినంగానూ ప్రవర్తిస్తూ వుంటారు, అలా తమ ప్రభావాన్ని ఖైదీలమీద వేయచూస్తారు. ఇలాంటి ఇబ్బందులు వున్నప్పటికీ కొత్తజైలుకు మారడం కొంతఆనందాన్ని ఇస్తుంది. మరోజైలుకు మారేప్పుడు బయటిప్రపంచాన్ని చూసేఅవకాశం లభిస్తుంది. సాధారణదుస్తుల్లోవున్న స్త్రీ పురుష-బాలవృద్ధుల్ని చూడడం జరుగుతుంది. పశువుల్ని, వివిధరకాలైన చెట్లుచేమల్ని, బజార్లనూ చూడడంవల్ల ఖైదీకి చాలా ఆనందం కలుగుతుంది. జైలుభాషలో దీన్ని 'లోకం చూడ్డం' అంటారు. ఇలా జైళ్ళు మారేప్పుడు అనుకోకుండా, పరిచయం అయిన ప్రదేశమో, వ్యక్తులో తారసపడవచ్చును. కాళ్ళకూ చేతులకూ సంకెళ్ళు వేయబడి, పోలీసుల కాపలాలోవున్న ఖైదీని సాధారణ ప్రజలు, ద్వేషపూరిత నయనాల్తో చూస్తారు. భయంకరమైనవ్యక్తిగా పరిగణిస్తారు. కొందరు అకారణంగానే గుద్దుతామని, తన్నుతామని - అలాంటి ఖైదీకి సంజ్ఞలద్వారా తెలియపరుస్తారు. ఇవన్నీ ఓ నూతనమైన

అనుభూతిని కలిగిస్తూవుంటాయి ఖైదీకి అలహాబాద్ రైల్వేస్టేషన్‌లో నావట్ల అలాగేజరిగింది. పోలీసులమధ్య. కాళ్ళకూ చేతులకూ బేడీలతో వున్న నన్నుచూసి-ఓ నల్లదొరసాని పిడికిలిబిగించి, "ముర్దాబాద్"ని సంజ్ఞ చేసింది. నేను నవ్వి వూరుకున్నాను

నన్ను ఢిల్లీ తీసుకుపెళ్తూన్నారని తెలిసింది!

ఢిల్లీజైల్లో అడుగుపెట్టగానే మొదటగా నేనుచూసిన అధికారి చావలా, నన్నుచూస్తూనే జైలుఅధికారి మిస్టర్ చావలాకొంచంగా తొట్రుపడ్డాడు. అతడలా తొట్రుపడానికి కారణంవుంది. నేను ఢిల్లీలో ప్రభుదత్తుదగ్గరవున్న రోజుల్లో, విమానం నడపడం నేర్చుకోడానికి ఒక యువకుడు ప్రభుదత్తుదగ్గరకు వచ్చేవాడు. ఆ యువకుడు ఈ అధికారికి బంధువు ఆయువకుడితోపాటు నేనూతరచు ఈఅధికారిదగ్గరకు వస్తూండేవాణ్ణి పరిచయం ఏర్పడితే, అప్పుడు ఢిల్లీ జైల్లోవున్న మిత్రులగురించి తెల్సుకోవచ్చునని ఉద్దేశం.

ఇప్పుడు నన్ను ఖైదీరూపంలో చూసేసరికి జైలు అధికారి మిస్టర్ చావలా ఆశ్చర్యపడడం లేక తొట్రుపడడం సహజం. నేనూ చావలాను గుర్తించాను గుర్తించినట్టు కనబడనీయలేదు. నన్నొక చీకటికొట్టులోకి పంపించారు పడుకోవడానికి ఒక చాప, కంబళీ వున్నాయి. భోజనం రొట్టె నీళ్ళ పప్పు!

నేను నా అసమ్మతిని తెలియపరచాను. "నేను బి. క్లాసు ఖైదీని" అన్నాను.

"అలాగని మాకేమీ ఉత్తర్వులురాలేదు" అన్నాడు జైలుఅధికారి.

నాలుగురోజులు భోజనం ముట్టలేదు అప్పటికిగానీ వాళ్ళకు ఉత్తర్వులు రాలేదు. బి. క్లాసు ఖైదీకి ఉచితమైన సౌకర్యాలు లభించసాగాయి మరో రెండురోజులతరువాత సాయంసమయాన నన్ను న్యాయస్థానానికి పంపించారు. ఢిల్లీ కుట్రకేసును విచారించడానికి స్పెషల్ ట్రిబ్యునల్ ఏర్పాటు

యట్‌లో ఒక ప్రత్యేకమైన న్యాయస్థానాన్ని ఏర్పాటుచేశారు అక్కడికి వెళ్ళాక నన్నొకగదిలో కూర్చోబెట్టారు. ప్రక్కగదిలోనుంచి విచారణ తాలూకు శబ్దాలూ, మాటలూ అస్పష్టంగా వినిపిస్తూన్నాయి. మిత్రుల్ని చూసే అవకాశం లభిస్తుందని ఉత్సాహంగా పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను కిటికీలోనుంచిచూస్తూంటే పొద్దుకుంకవచ్చినట్టు నీడలు దీర్ఘమైనట్టు తెలుస్తూన్నది. 'ఐతే, రాత్రి ఏడెనిమిది గంటలవరకూ విచారణ సాగుతుందేమో!" అనుకున్నాను.

నన్ను విచారణకు పిల్చారు. న్యాయస్థానంలో నా సహచరులు ఎవరూలేరు. జడ్జి, ప్రభుత్వవకీలు, నా తరపున వాదించడానికి ఢిల్లి వాస్తవ్యుడు మిస్టర్ బెనర్జీ-మాత్రం ఉన్నారు. ప్రభుత్వ వకీలు "ముద్దాయి యశ్‌పాల్ న్యాయస్థానంలో వున్నాడు. ఐతే, ఈకేసు తాలూకు విచారణ చాలావరకు జరిగిపోయింది ఇప్పుడు మొదలెత్తుకుని మొదటినుండి విచారణను ప్రారంభించడం సంభవంకాదు. అనవసరమైన ఖర్చు కూడాను. కాలయాపన. ముద్దాయి యశ్‌పాల్‌కు మరోకేసులో 14 ఏళ్ళకఠిన కారాగారవాస శిక్షపడడంవల్ల ప్రభుత్వం ఢిల్లికేసును ఎత్తేసుకుంటోంది!" అని ప్రకటించాడు.

నా వకీలు మిస్టర్ బెనర్జి ఏ అభ్యంతరమూ చెప్పలేదు. కేసుఎత్తివేసుకోవడం జరిగింది. నన్ను మళ్ళీ అలహాబాద్ పంపించారు. ఢిల్లి రైల్వేస్టేషన్‌లో అలహాబాద్ బండికోసంఆగవల్సివచ్చింది. నన్ను రైల్వే పోలీస్ స్టేషన్‌లో రైలువచ్చేవరకు వుంచారు. అదే స్టేషన్‌లోని ఒక కొట్లో ఢిల్లి నివాసి కాకా 'శ్రీకృష్ణ' వున్నారు కొట్లో బంధింపబడిన అతడు ఒక దానిమ్మ చెక్కనుండి గింజల్ని వలుచుకు తింటున్నాడు. అతడిని చూశాను. పలకరించలేదు విస్మయాన్ని ప్రకటించలేదు. అతడూ నన్ను చూశాడు స్టేషన్ ఇన్‌ఛార్జీని, ఒక్కక్షణం బయటకు రావడానికి అనుమతిని అడిగాడు. ఇన్‌ఛార్జి అనుమతించాడు. కాకాశ్రీకృష్ణ బయటకు

వచ్చి కొన్నిక్షణాలు నన్నుచూస్తూ నిల్చుండిపోయాడు. తరువాత తన కొట్టులోకి వెళ్ళిపోయాడు పదారిలోవుండగా కాకా శ్రీకృష్ణ గారింటిలో నేను ఎన్నోసార్లు ఆశ్రయాన్ని పొందాను. ఆయన చాలా బాగా పాడగలడు. బహదూర్ షాహ గజల్ [కవిత్వం] ఒకటి నాకుచాలా ఇష్టమైంది. ఆగజల్‌ని కాకాచేత ఎప్పుడూ పాడించుకు వింటుండేవాడిని. ఆయనకు ఆవిషయం జ్ఞాపకంవచ్చి వుంటుంది. అత్యంత ఆర్ద్రస్వరంలో బహదూర్‌షాహ గజల్‌ని ఆలాపించసాగాడు. "లగతా నహీహై దిల్ మేరా ఉజడే దయార్ మే...." [ఈ ధ్వంస ప్రకృతిలో నా మనస్సుకు రమ్యతలేదు]

ఢిల్లీ కేసు కొట్టివేసుకుంది ప్రభుత్వం. పోతే, లాహోరు కేసు లాహోరులోనే నడుస్తుంది. ఐతే ప్రభుత్వం ఆకేసును అసలు కోర్టులో దాఖలుచేయకుండానే ఎత్తివేసుకుంది.

నైనీజైలుకు తిరిగివచ్చాను. తెల్లవాళ్ళుండే బారక్కులోని వేను కటి గదిలోనేవుంచారు జైలు నియమాలు చాలావిచిత్రంగా వుంటాయి. విచారణలో వున్నంతవరకూ ఖైదీపట్ల కఠినంగా ప్రవర్తించడం జరుగుతుంది. నేరం రుజువయి, శిక్షపడ్డాక ఖైదీకి కొంతలోకొంత స్వాతంత్రం సౌకర్యం-లభిస్తాయి। నా విషయంలోనూ అలాగేజరిగింది. నా గుర్తింపు కార్డుమీద "Specially dangerous but not amounting to Personal assault" అని రాసివుంది. అంటే 'కొట్లాడే ప్రమాదం లేక పోయినా, ఇతడిని జాగ్రత్తగా కనిపెట్టి వుంచాలి' అనిరాయడంజరిగింది. కనుక నన్ను ప్రత్యేకం జాగ్రత్తగా కనిపెట్టుతూండేవారు సాధారణంగా విప్లవకారులైన ఖైదీల కార్డులమీద 'ప్రమాదకరమైన ఖైదీ' అని రాసి వుంటుంది. నేను 14 సంవత్సరాలు జైలుచేయలేదు 1937లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి 38 మార్చి 2వ తారీకున విడుదల అయ్యాను.

జైలు జీవితంలో పెద్దగా చెప్పవల్సింది ఏమీ కనుపించదు.

కాంగ్రెసు ఉద్యమంలోనూ లక్షలాది ప్రజలు జైలు జీవితాన్ని అనుభవించారు. ఐతే, వారి జైలు జీవితానుభవాలకూ, నా అనుభవాలకూ కొంత వ్యత్యాసం, భిన్నత్వం వుండవచ్చును. అందుకనే నా జైలు జీవితానుభవాల్ని గురించి వ్రాస్తూన్నాను.

యూరోపియన్లు వుండే బారక్కులో నేను చాలాకాలం వున్నాను. యూరోపియన్ ఖైదీలకు బి క్లాసు ఖైదీల సౌకర్యాలన్నీ లభిస్తూంటాయి. వీళ్ళుపొందే కొన్ని సౌకర్యాలు బి. క్లాసు కైదీలకుకూడా లభించవు. ఈ బారక్కులోవుండే యూరోపియన్ కైదీలు చాలా విచిత్రమైన వాళ్ళు.

జైలు నియమాల్లో 'ఖైదీలు దగ్గర డబ్బు వుంచుకోకూడ'దన్న నియమం ఒకటుంది. అయినా, ఈ నియమాన్ని ఎవరూ ఖాతరుచేయరు. ఏ సెంటల్ జైల్లోనేగానీ, వెయ్యీ, రెండువేల రూపాయలు సునాయసంగా దొరుకుతాయి ఖైదీలదగ్గర! సెంట్రల్ జైళ్ళల్లో ఖైదీలూ పెద్ద సంఖ్యలో వుంటారనుకొండి. జైళ్ళల్లో ప్రత్యేకమైన పద్ధతిలో బేరసారాలూ జరుగుతూంటాయి.

ఆ రోజుల్లో జైల్లోకి పుగాకు, బీడి సిగిరెట్లు రాకూడదన్న నియమం వుండేది. ఈ నియమాన్ని గట్టిగా పాటించాలన్న తాకీదులూ వస్తుండేవి. ఐతే, ఖైదీలు, జైలు అధికార్ల కంటపడకుండా చట్టూ - బీడీ సిగిరెట్లను విరివిగా వాడుతూండేవారు.

చిట్టిపొట్టి అదికారుల్ని కైదీలు లెక్క పెట్టేవారుకాదు. సి. క్లా కైదీలు, భారతీయ కైదీలు వార్డర్లద్వారానే ఇళ్ళదగ్గరనుంచి డబ్బులు తెప్పించుకునేవారు. ఇలా డబ్బులు తెప్పించుకోడానికి ప్రత్యేకమైన కమీషన్‌రేటు కూడావుంది. రూపాయికి నాలుగణాల చొప్పున తెచ్చిపెట్టిన వార్డర్‌కి ఇవ్వాలి. సాధారణంగా ఇలాంటి డబ్బు తెచ్చిఇచ్చే వ్యవహారాల్లో మోసమంటూ జరగదు. ఐతే, ఆంగ్ల ఖైదీలు డబ్బులు ఎక్కణ్ణుంచి తెప్పించుకోగలరు? వాళ్ళకు ఈ దేశంలో ఇళ్ళులేవుకదా? కనుక తమకు ఇచ్చే

రేషన్‌న్ని - అంటే డబుల్ రొట్టె, వెన్న, పంచదార - అమ్ముకుంటూ వుండేవారు. అలా అమ్ముకోగా వచ్చిన డబ్బుతో బీడీలు కొనుక్కునే వారు. సాధారణంగా జైళ్ళల్లో వస్తుమార్పిడి పద్ధతి అమల్లో వుంటుంది. ఒక డబల్ రొట్టె, లేక చటాకు వెన్న, పంచదార, ఇదీకాకపోతే మూడు చటాకుల మాంసమిస్తే ఒక బీడీకట్ట ఇస్తారు. జైలు పరిస్థితుల్ని తెలియని వారు ఈ రేటునుచూసి ఆశ్చర్యపడవచ్చును. కానీ. నిజానికి ఆశ్చర్య పడవల్సింది ఏమీలేదు. మాంసం, రొట్టె, చక్కెర, వెన్న ప్రభుత్వం ఇస్తుంది. అవి సహజంగా లభిస్తాయి. కానీ, బీడీకట్టను జైల్లోకి తీసుకు రావడానికి చాలా ఇబ్బంది పడవల్సివుంటుంది. సాహసాన్ని ప్రదర్శించ వల్సి వుంటుంది. బీడీకట్టలు తక్కువగా వస్తాయి తాగేవాళ్ళు ఎక్కువ మంది వుంటారు. బంగారం, వెండి, వజ్రవైడూర్యాలు - మానవుడి నిత్యావసరాలైన ఆహారపదార్థాలకంటే చాలా ఎక్కువ ధర పెడితేగాని లభించవు! ఎందువల్ల? ఒకటి నిత్యావసర వస్తువులకంటే వెండి బంగా రం సమాజంలో చాలా తక్కువ పరిమాణంలో దొరుగుతాయి. రెండు బంగారాన్ని వెండిని సంపాయించడానికి చాలా శ్రమ, ప్రమాదాల్ని ఎదు ర్కోవల్సిన అవసరమూ వుంటుంది. జైళ్ళల్లో జరిగే ఈ వస్తుమార్పిడి వ్యాపారంలో బీడీకట్టే ప్రామాణిక నాణెం! ఆ రోజుల్లోనే ఒక బీడికట్ట ఖరీదు అర్ధణా వుండేది. ఆంగ్ల ఖైదీలు తమ ఆహార పదార్థాల్ని అమ్ము కుని బీడీకట్టల్ని కొనుక్కునేవారు. సాధారణంగా ఒకొక్కఖైదీ రోజుకు కట్టబీడీలను కాల్చేవారు. కొందరు ఖైదీలు కట్టకుపైబడి కాల్చేవారు.

కొందరు బీడీలతో సంతృప్తిపడక గంజాయి, నల్లమందులాంటి- మాదకద్రవ్యాలకు అలవాటుపడేవారు. అలాంటివారు కొంచెం ఇబ్బంది పడవాల్సివచ్చేది. జైళ్ళలోకి గంజాయి, నల్లమందు-రావడం మరికొంచెం శ్రమతోకూడినపని! ఇంగ్లీషుఖైదీలు గంజాయి, నల్లమందులాంటి మాదక ద్రవ్యాలను తెప్పించుకోడానికి తమకు లభించే రేషన్‌నుండి కనీసం మూడు

పదార్థాలను అమ్మవల్సివచ్చేది. డబల్‌రొట్టె, వెన్న, చక్కెర - ఒకటేమిటి, అన్నీ అమ్మేసేవారు. పాలూ చక్కెరలేని ఒట్టి టీ డికాషన్ తాగేవారు. సాధారణమైన రొట్టే పప్పుతో కాలంగడిపి, మంచి ఆహార పదార్థాలను గంజాయికోసం, నల్లమందుకోసం అమ్ముకునేవారు. ఆరోజుల్లో నేనుఆత్మాభిమానాన్నిచంపుకోవల్సివస్తుందన్నఉద్దేశ్యంతో బీడీ-సిగరెట్ అన్నీమానేశాను. అధికార్లకు మనం బీడీసిగిరెట్ కాలుస్తున్నట్టుతెలిస్తే, అపరాధాన్ని అంగీకరించి, తలవంచవలసివస్తుంది. అది ఆత్మాభిమానానికి గొడ్డలిపెట్టు ఐతే, 37లో కాంగ్రేసు మంత్రివర్గాలు ఏర్పాడ్డాక ఖైదీలు బీడీ సిగిరెట్లు వాడుకోడానికి అనుమతించడం జరిగింది. అప్పుడు నేనూ కాల్చడం ప్రారంభించాను.

ఇంగ్లీషువారు సాధారణంగా, చిట్టిపొట్టి దొంగతనాలుచేసి జైలుపాలు అవుతుంటారు. శిక్షపూర్తి అయ్యాక వారినింక బ్రిటన్‌పంపిస్తుంటారు. ఎన్నోమార్లు దొంగతనాలుచేసి, జైలుశిక్షలు అనుభవించిన ఆంగ్లోఇండియన్ ఖైదీలూ కొందరువున్నారు. గ్రాంట్ చాలామార్లు జైలుశిక్ష అనుభవించిన ఆంగ్లోఇండియన్‌ఖైదీ. అతడికి గంజాయి తాగే అలవాటుంది. ఆబారక్కులోవున్న ఆంగ్లఖైదీలకు నేను చాలాధనికుడనన్న అభిప్రాయం ఒకటుండేది. ధనికుడినికావడంవల్లనే బి. క్లాసు ఇచ్చారనీ, జైలు సూపరింటెండెంట్ ప్రత్యేకమైన శ్రద్ధచూపడానికికూడా అదేకారణం అని వారి ఉద్దేశం. నేను ఆంగ్లప్రభుత్వానికి శత్రువుననీ వారికితెల్సు. ఒకరోజున గ్రాంట్ నాదగ్గరకు వచ్చాడు. డబ్బులేకపోవడంవల్ల గంజాయి తెప్పించుకోలేకపోతున్నాడు. అందువల్ల చాలా బాధపడుతున్నాడు. ఆ విషయాన్నిచెప్తూ ఇలాఅన్నాడు. "నువ్వు నాకోరెండేళ్ళపాటు జైల్లో గంజాయి దొరికేఏర్పాటు చేయగలిగితే, బ్రిటీష్‌ప్రభుత్వాన్ని సమూలంగా నాశనం చేస్తాను. రెండేళ్ళ గంజాయికి కేవలం ఐదువందలరూపాయలు మాత్రమే ఖర్చుఅవుతుంది."

గ్రాంట్ అన్న పైమాటవిని చాలా ఆశ్చర్యపడ్డాను. "కేవలం ఒకేవ్యక్తి, ఒక మహాసామ్రాజ్యాన్ని సమూలంగా నాశనం చేయగలడా? ఆ ఉపాయం ఏంటి?" అనడిగాను.

గ్రాంట్ ఇలాఅన్నాడు "చాలా తేలిక। డబ్బుండాలి, అంతే। అదీ కేవలం ఐదువందలుంటేచాలు। నేనీజైల్లోకి వచ్చాక చాలామంది ఆంగ్లేయులకు గంజాయి తాగడం అలవాటుచేశాను. గంజాయితాగేవ్యక్తి ఎందుకూ పనికిరాడు. ఉదాహరణకు నన్నేతీసుకోండి।" అని ఆపాడుగ్రాంట్ నిజంగానే గ్రాంట్ ఎముకలగూడులా వున్నాడు. తిరిగిఇలా చెప్పసాగాడు "నాదగ్గర డబ్బువుంటే ఇంగ్లీషుసైనికులందరికీ గంజాయితాగడం అలవాటు చేస్తాను. మొదట్లో నాలుగయిదుమార్లు పూరకానేతాగిస్తాను ఇంక అలవాటయిపోతుంది। గంజాయి అలవాటుకావడానికి రెండుదమ్ములు కొడితేచాలు. సైన్యమంతా అలవాటుపడితే, ఇంక నిరుపయోగంబౌతుంది. సైన్యమే నిరుపయోగం అయినప్పుడు, ఇంక సామ్రాజ్యం ఎక్కడుంటుంది।"

ప్రతి మంగళవారం ఖైదీలకు ధర్మోపదేశం చేయడానికి ఒక ఫాదరీ వచ్చేవాడు. ఇతడు మేజరు హోదాకలవాడు. బ్రిటీష్ సైనికులకు ధర్మోపదేశంచేయడం ఇతడిపని, ఆంగ్లఖైదీలకూ ధర్మోపదేశంచేస్తూండేవాడు. తమ సైనికుల మత విశ్వాసాన్ని అక్షుణ్ణంగా వుంచడం బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు ఎంతైనాఅవసరంమరి। ఈ ఫాదరిగారు తానుఃస్తూ, కొన్ని పాత సచిత్ర పత్రికల్ని తెస్తూండేవాడు. అవి ఇంగ్లాండునుండి వచ్చిన పాతపత్రికలు. వాటిద్వారా ఆంగ్ల ఖైదీలకు కొంత మనోరంజనం కలిగించాలని ఇతడి వుద్దేశం. ఆంగ్ల ఖైదీలు తమతమ స్టూళ్ళను తెచ్చుకుని బయటకు వచ్చి కూచునేవారు. ఫాదరీగారు బైబిల్లోని కొన్ని పాటల్ని పాడించేవాడు. కన్యాత్వం చెడకుండానే, పవిత్రాత్మద్వారా మేరీ కనిన, భగవంతుని కొడుకుమీద విశ్వాసం వుంచండనిచెప్పి వెళ్ళిపోయే

వాడు. ఉపదేశాల ప్రభావం - రెండు మూడు గంటలసేపు ఖైదీలమీద పనిచేసేది!

పాదరిగారికి నా ఆత్మమీద కూడా దయకలిగింది. నన్నూ బైబిల్ చదవమన్నారు. ధర్మోపదేశం వినమన్నారు. నేనూ అందరితోపాటు ధర్మోపదేశానికి హాజరవసాగాను.

ఒక మంగళవారంనాటి విషయం. అందరూ పాదరీతెచ్చిన కొత్త పవిత్ర పత్రికల్ని చూడడంలో మునిగివున్నారు. డన్ అనే సిపాయి భగవంతుడి దయను గురించి, అతడి అంతులేని శక్తిని గురించి మాట్లాడుతూ వ్నాడు. ఎక్కడో చదివిన ఒక హాస్యసందర్భం జ్ఞాపకంవచ్చింది. డన్ని ఇలా అడిగాను.

"భగవంతుడు అంతులేని శక్తికలవాడా?"

"ఔను" డన్ అన్నాడు.

"ఐతే, ఒకటి చెప్పు! భగవంతుడు తాను మోయలేనంత పెద్ద రాతిని తయారుచేయగలడా?" అనడిగాను.

డన్ కళ్ళు పెద్దవిచేసి నావైపు చూశాడు. "ఎందుకు చేయలేడు? చేయగలడు!"

నా ప్రశ్నను మరోమాటుచెప్పి, ఇలా వివరించాను. "భగవంతుడు అలాంటి రాయిని గనుక తయారుచేస్తే, ఆ రాయినిమోసే శక్తి అతడికి వుండదు. అలాంటి రాయిని తయారుచేయడనుకో! అప్పుడు తను మోయలేని రాతిని తయారుచేసే శక్తి అతడికి లేదన్నమాట! మరి నువ్వు భగవంతుడు 'సర్వశక్తివంతుడు' అంటున్నావుకదా?"

పై తర్కంవిని డన్ కొంచెంగా చలించాడు. నేను ఇంకో ప్రశ్న వేశాను.

"ప్రకృతి నియమాల్ని ఎవరు నిర్ణయించారు?"

"భగవంతుడు!"

ఐతే, భగవంతుడు తాను నిర్ణయించిన నియమాల్ని తానే అతిక్రమించాడెందుకనీ? అతిక్రమించలేదంటావా? కుమారి గర్భాన్న క్రీస్తు జన్మించడం ప్రకృతి నియమాన్ని అతిక్రమించడంకాదా?" అన్నాను.

డన్ చాలాసేపు ఆలోచించాడు. ఇలా అన్నాడు "స్త్రీపురుష సంబంధం అపవిత్రమైంది. కనుకనే భగవంతుని కుమారుడు స్త్రీపురుష సంబంధంద్వారా పుట్టలేదు!''

నేను మళ్ళీ ప్రశ్నించాను. ''ప్రకృతిలో స్త్రీపురుష సంబంధాల్ని ఏర్పరచింది ఎవరు?"

"భగవంతుడు!"

"మరి అపవిత్రమైన సంబంధాల్ని ఏర్పాటు చేసిన భగవంతుడు అపవిత్రుడూ, పాపీకాడా?" అనడిగాను.

డన్ ఆవారం అంతా ఈ సమస్య గురించే ఆలోచిస్తూ గడిపాడు. మంగళవారంనాడు ఫాదరీరాగానే ఈ సమస్యను అతని ముందు పెట్టాడు. ఫాదరీ, డన్‌ను ఇలా అడిగాడు. "భగవంతుడు ఉన్నాడని నీవు నమ్ముతున్నావుకదా? అతడీ ప్రపంచాన్ని సృష్టించాడనీ, సర్వశక్తిసంపన్నుడనీ ఒప్పుకుంటున్నావుకదా?"

డన్ ఔనని తలవూపాడు.

తరువాత ఫాదరి ఇలా అన్నాడు "సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మహిమాన్వితుడు. అతడు తన మహిమద్వారా ఎన్నోచమత్కారాల్ని చేయగలడు. నిష్కళంక ఐన కుమారి గర్భంనుండి క్రీస్తును పుట్టించాడు. అనవసరమైన తర్కాలకు పోకూడదు పాపం తగుల్తుంది!"

డన్‌కు తృప్తికలిగింది. అతడి సమస్య తీరింది. అనంతరం ఫాదరీ ఇలా అడిగాడు "అసలీసమస్య నీ బుర్రలోకి ఎలా వచ్చింది?"

డన్ నాపేరు చెప్పాడు.

ఫాదరీ ఏకాంతంలో నాతో ఇలాఅన్నాడు "వీళ్ళు చదువుసంధ్యలులేని

వాళ్ళు ఇలాంటివి వీళ్ళకు చెప్పకూడదు. విశ్వాసం అనేది వీళ్ళకు ఎంతో అవసరం. ఆ విశ్వాసం కారణంగానే శాంతిగావుంటారు. వీళ్ళ శాంతిని మనం భంగపరచకూడదు!"

ఆంగ్ల ఖైదీల బారక్కుకు ప్రక్కనే ఓచిన్న గదిని ఏర్పాటుచేసి, ప్రస్తుతం పాకిస్తాన్ రవాణా మంత్రిగావున్న (1953) ఖాన్ సాహబ్‌ను వుంచారు. అతడు అనుమానితుడుగా బంధింపబడ్డారు. ఆ రోజుల్లో అతడి దినబత్తెం పదిపన్నెండు రూపాయీలు వుండేది. ఇప్పుడైతే (1953) యాభై అరవై రూపాయీలు అవుతుంది. ఖాన్‌సాహబ్‌తో అప్పుడప్పుడూ రహస్యంగా మాట్లాడుతూండేవాణ్ణి. ఆయనకు పండ్లూ - ఇతర తినుబండారాలూ అశేషంగా వస్తూండేవి. వాటిని ఆంగ్ల ఖైదీలకు కుడా పెట్టేవాడు. అందుకే ఆంగ్ల ఖైదీలూ మేము మాట్లాడుకోడాన్ని ఎవరికీ చెప్పేవారుకాదు. ఖాన్‌సాహబ్ తనకోసం తెచ్చిన తినుబండారాలను నాకూ పెట్టబోయేవాడు. ఐతే, చాలా వినయంగా తిరస్కరించేవాడిని. కాగా, పుస్తకాలనూ ఇస్తూండేవాడు. వాటిని తిరస్కరించేవాణ్ణి కాదనుకోండి! బుఖారిన్ రాసిన "హిస్టారికల్ మెటీరియలిజం" అనే పుస్తకాన్ని వీరిదగ్గర తీసుకున్నాను. ఆ పుస్తకాన్ని ఖాన్‌సాహబ్‌కు జవహర్‌లాల్ నెహ్రూ తెచ్చి ఇచ్చారుట!

ఇక్కడి హెడ్‌జైలర్ పేరు మి. హైని. చాలా అనుభవము, తెలివీకల వ్యక్తి. ఎవరైనా చాడీలుచెప్పినా అంతగా పట్టించుకునేవాడు కాదు. ఖాన్‌సాహబ్, నేనూ మాట్లాడుకుంటూన్న విషయం ఎవరో హైనీ చెవిన పడేశారు. "మాట్లాడుకుంటే మాట్లాడుకోనివ్వు! వచ్చిన నష్టం ఏముంది? అంతమాత్రాన జైలుగోడలు పడదోసుకు పోలేరుకదా?" అనేశాడు హైనీ.

హైనీ ప్రౌఢవయస్సులో వున్నాడు. మంచిగృహస్తు. కుటుంబం, పెద్దది. ప్రథమ యవ్వనపుపొంగులో భార్యనేకాకుండా మరో వుంపుడు

గత్తెనూ చేరదీశాడు. ఇప్పుడు రెండుకుటుంబాల్ని పోషించలేక సతమతం అవుతూన్నాడు గేదెల్ని పెట్టాడు. ఆ గేదెల్ని, ఖైదీల రేషన్‌తో, జైలు తాలూకు పశువుల మేతతో - పోషిస్తూ, వాటి పాలను అమ్ముకుంటూ వుంటాడు. కనుకనే ఖైదీలను అనవసరంగా బాధించడు. అప్పుడప్పుడూ జమాదార్‌గానీ, చిన్న అధికార్లుగానీ, ఖైదీలను సోదాచేసి వారిదగ్గర డబ్బువుంటే, జైలర్‌కుచూపి, 'శిక్షించండి' అని చెప్తూంటారు.

అలాంటి సందర్భం వచ్చినప్పుడు హైనీ ఇలా అంటూంటాడు "ఖైదీలో మనకు తగాదా ఎందుకు? డబ్బువుంటేకోనీ నాయాళ్ళవి: కాదు కూడదంటే ఆ డబ్బులన్నీ ప్రభుత్వానికి పోతాయి. అలాకాక ఖైదీల దగ్గరవుంటే-మనకూ ఇస్తూంటారు!"

హైనీ అంటే ఖైదీలకు చాలా ఇష్టం. ఖైదీలు చాలా ఆదరంగా 'హైనీబాబా' అనిపిలుస్తూంటారు అతడిని. కొద్దిగొప్పా లంచంపుచ్చుకున్నా ఖైదీల అవసరాల్ని తీరుస్తూవుంటాడు హైనీ. లంచం తెమ్మని ఖైదీల్ని వేధించడమూ చేయడు. ఎవరుఎంతఇస్తే అంతే పుచ్చుకుంటాడు. కొందరు అతడి చెప్పుల్లో పావలా కాసుపడేసి నమస్కారం పెట్టేసేవారు.

ఆంగ్లేయుల బారక్కులో ఆరునెల్లుగడిపాను. పరస్పర ద్వేషంతో ఆ ఆంగ్లసిపాయిల మధ్య ఎక్కువరోజులు వుండలేకపోయాను. అధికారుల్ని ఏమీ కోరకూడదనీ, ఎలాంటి అభ్యర్థననూ చేయకూడదనీ - అనుకున్నాను. కానీ, అధికారుల్ని అభ్యర్థించక తప్పలేదు. ఎక్కువ రోజులు అక్కడి వాతావరణాన్ని భరించలేకపోయాను. ఒకరోజున పై అధికారుల్తో ఇలా అన్నాను "అసభ్యులైన ఈ ఆంగ్లసిపాయిల్తో కలసి వుండడం నాకు ఇష్టంలేదు!"

నన్ను ఇతర బి క్లాసు రాజకీయ ఖైదీల్తోపాటు వుంచుతారనుకున్నాను. కానీ, అలా చేయలేదు. నైనీజైల్లో ప్రత్యేకం ఏకాంతంలో వుంచారు.

నైనీజైల్లో రెండుగదులు, వరండా, స్నానాలగదిగల ప్రత్యేకమైన బ్లాకులో నన్నువుంచారు. చుట్టూ బాగా ఎత్తయిన గోడవుంది. ఆ బ్లాకుకు 'కుక్కలదొడ్డి' అన్నపేరుంది. పేరు అలావున్నా, ప్రదేశం బాగానేవుంది. ఒకప్పుడు జవహర్‌లాల్ నెహ్రూనూ-మౌలానా ఆజాద్‌నూ ఇదే బ్లాకులో వుంచారు. ఐతే వాళ్ళు ఇప్పుడు నైనీజైల్లో లేరు బహుశ డేరాడూన్ జైలుకు పంపించబడి వుంటారు. జవహర్‌లాల్ నెహ్రూ ఉదయం సాయంత్రం వ్యాయామంచేసేవారు. వ్యాయామంలో భాగంగా చుట్టూవున్న ఎత్తయిన ప్రహరీగోడ ననుసరించి పచారుచేయడమో, పరుగెత్తడమో చేసేవారు. నేనలా చేయడానికి అనుమతివివ్వలేదు. ఒంటరిగా వుండడంవల్ల పగలంతా చదువుతూండేవాణ్ణి. ఇక్కడే 'స్వయం శిక్షక్' సాయంతో ఫ్రంచ్‌భాషను అభ్యసించాను. కథలూ రాస్తూండేవాణ్ణి. అలా ఒక సంవత్సరం గడిచింది.

నాకార్డుమీద మేజోళ్ళుఅల్లేపనిని రాశారు. ఐతే, జైనీబాబా ఎన్నడు నాకాపనిని ఇవ్వలేదు. నూలు, దారం, సూదులూ-ఇవసలు నాకు పంపనేలేదు. ఇంక నావంతుపనిని పూర్తిచేయలేదన్న ప్రశ్నే ఉత్పన్నంకాలేదు. సమయం గడవడంకోసం పొట్దాకులూ చదువుతూనో, రాస్తూనోవుండేవాణ్ణి. మొదట ఇంగ్లీషులోరాయడం ప్రారంభించాను. కానీ, తరువాత హిందీలోనే రాయాలన్న నిర్ణయంచేసుకున్నాను మాతృభాషలో రాసి, మాతృభాషను సంపన్నంచేయడం కర్తవ్యం అనిపించింది. అందువల్లనే హిందీలోతప్ప మరేభాషలోనూ రాయకూడదన్న ప్రతిన బూనాను. పగలంతా తీరిక, నేనురాసిన రచనలను మళ్ళీ మళ్ళీ చదివేవాడిని; కఠినంగా విమర్శించుకునేవాడిని. తిరిగి రాస్తూండేవాడిని;

నైనీజైలు సూపరింటెండెంట్ మారిపోయాడు. మేజర్ ఒబేరాయ్ స్థానంలో మేజర్ సలామత్‌వుల్లా వచ్చాడు. ఒబేరాయ్ చూసీచూడనట్టు పోయే మనస్తత్వం కలవాడు. ఆఫీసరుగా తన కర్తవ్యాన్ని అంతగా

పాటించేవాడుకాదు. ఖైదీల్ని బాధించేవాడుకాదు. ఐతే, సలామత్ఉల్లా ఖైదీలపట్ల చాలా కఠినంగా ప్రవర్తిస్తాడని చెప్పుకునేవారు. కానీ, నాకు తెల్సినవరకూ ఇతడూ ఖైదీలపట్ల ఏమంత కఠినంగా ప్రవర్తించేవాడు కాదనే చెప్పవచ్చు। కాకపోతే, ఎప్పుడూ ఏదోఒకటిచేస్తూవుండాలంటాడు. ఒకరోజున అతడే ఇలా అడిగాడు "ఇక్కడ ఒంటరిగా మీరేమీ ఇబ్బంది పడడంలేదుకదా?"

నేనిలా అన్నాను "ఏం చేయమంటారు? తప్పదుకదా? ఒంటరిగా వుంచారు గనుక వుంటున్నాను. ప్రభుత్వమే ఇలా ఒంటరిగావుంచమని ఆజ్ఞ ఇచ్చిందేమో తెలియదు। ఇలా నన్ను ఏకాంతవాసంలో వుంచడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటోకూడా నాకు తెలియదు।"

ముల్లాగారు నన్ను ప్రక్కనేవున్న మరో బ్లాకుకు మార్చారు. అక్కడ బి. క్లాసు ఖైదీల్తో కల్సివుండసాగాను

బి క్లాస్ బ్లాకులోవున్న నలుగురు ఖైదీల్లోనూ ఇద్దరు రాజకీయ ఖైదీలు. ఒకరు కాకోరీ కుట్రకేసు తాలూకు గోవిందచరణసింహ్‌కార్, మరొకరు బరేలీ కాల్పులకుసంబంధించిన ఠాకూర్ టీకమ్‌సింహ్ మేము ముగ్గురం చాలా కలసి-మెలసి వుండసాగాము. కార్‌దాదా బెంగాలీ భాష పట్ల నాకుగల అనురాగాన్నిచూసి ముగ్ధుడయ్యాడు. బెంగాలీ చదివించ సాగాడు. రెండు మూడునెలల్లో నాఅంతట నేనే పుస్తకాలు చదవగల స్థితికి వచ్చాను. కార్‌దాదా చాలాఇష్టంగా బెంగాలీ భాష చదివించేవాడు. నన్ను ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలుకు మార్చారు. నేనక్కడికివెళ్ళేప్పుడు కార్‌దాదా తనదగ్గరవున్న ఎన్నోబెంగాలీగ్రంథాల్ని నాకుఇచ్చిపంపించాడు.

ఠాకుర్ టీకమ్‌సింహ్ మంచి బలవంతుడు. ఒడ్డూ-పొడుగూ కలిగి మంచి దారుఢ్యంకలవ్యక్తి। శరీరం ఎంతగొప్పదో, దానికి తగినట్టుగానే అతడి ప్రవర్తనా స్వభావంకూడా గొప్పగావుండేవి. 1932 నాటికి ఠాకుర్ సాహబ్ దాదాపు 12 సంవత్సరాల జైలు జీవితాన్ని గడిపాడు.

అతడి కథ బ్రిటిష్ న్యాయానికి ఓ మచ్చుతునక! జిల్లా మెజిస్ట్రేట్ మీద రాజకీయ కారణంగా తుపాకి కాల్పులు జరిపాడన్న ఆరోపణపై బరేలీ న్యాయస్థానం టీకమ్‌సింహ్‌కు 12 సం॥లు కఠిన కారాగారశిక్ష విధించింది. రాజకీయ ఖైదీలకూ, ఇతర ఖైదీలకూ ప్రత్యేకమైన వ్యత్యాసం ఒకటుంది. ఇతర ఖైదీల్ని, వాళ్ళ అపరాధాల్ని గురించి అడిగితే ఇలా చెప్తారు "మా శత్రువులూ, పోలీసులూ-కల్సి లేనిపోని అపరాధాల్ని మా నెత్తికిచుట్టి జైల్లో పెట్టించారు!" అంటారు. ఇతర ఖైదీలు ఇలా చెప్పడానికి ఒక కారణం వుండవచ్చును. ఇలా చెప్తూంటే తమ కేసుమీద ఏ మాత్రమైనా ప్రభావం పడవచ్చును. లేదా, శిక్షకొంత తగ్గవచ్చును. అని వాళ్ళవుద్దేశ్యమేమో! ఇలాంటి మిథ్యాప్రలోభం వాళ్ళల్లోవుండి వుంటుంది. బాగా పరిచయం అయితే అపరాధాన్ని అంగీకరిస్తూ విశాల్ని చెప్పేవాళ్ళూ కొందరుంటారు. రాజకీయ ఖైదీలు ఇందుకు పూర్తి విరుద్ధంగా చెప్తారు. తమ కార్యక్రమాల గురించి, తాము చేసిన పనుల గురించి-నిర్భయంగా చెప్పేస్తారు. అత్యుక్తులు కూడా చెబుతారు. అత్యుక్తులూ, అతిశయోక్తులూ చెప్పడంవల్ల ఇతర్లలో సాహసవీక్షాల్ని నాటవచ్చునన్న భావనవుండవచ్చును వారిలో. ఇలా అత్యుక్తులు చెప్పడంవల్ల కొంత సంతృప్తి కూడా లభించవచ్చును వారికి!

టీకమ్‌సింహ్ తాను మెజిస్ట్రేట్ మీద తుపాకి కాల్పులు జరపలేదనీ, ఆకేసుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టంగా చెప్పాడు. టీకమ్‌సింహ్ స్వతంత్రమైన రాజకీయ భావాలు కలవాడు. మెజిస్ట్రేట్ మీద కాల్పులు జరిపిన అపరాధిని పోలీసులు పట్టుకోలేకపోయారు. కానీ, తమ అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి ఆ అపరాధాన్ని టీకమ్‌సింహ్ నెత్తికి చుట్టారు. ఇతడు బరేలీ హైస్కూల్లో చదువుతూన్నాడు. మంచి బలవంతుడు. ధైర్యశాలి. ఇంకేవుంది, పోలీసులు ఈ కేసులో ఇరికించారు. టీకమ్‌సింహ్ స్పష్టవాది. అబద్ధం ఆడడు. ఇలా అన్నాడు

"శిక్ష ఎటూ అనుభవించాను. అబద్ధం చెప్పవల్సిన పనిలేదు. నేనసలు ఈపని చేయలేదు!"

(బ్రిటీష్ ప్రభుత్వం రాజకీయ ఖైదీలకు బి క్లాసు సౌకర్యాల్ని ఏర్పాటుచేసింది. ఐతే, టీకమ్‌సింహ్‌కు బి. క్లాసు సౌకర్యాల్ని కల్పించ డానికి ప్రభుత్వం అంగీకరించలేదు. బి క్లాసు రాజకీయఖైదీ హోదా కోసరం అరవైరోజులు నిరశన వ్రతం చేశాడు బలమైనమనిషే అయినా, ఆరోగ్యం దెబ్బతిన్నది.

ఇతరులచేత గౌరవింపబడాలన్నది మానవుకి స్వభావంలోని ఒక భాగం. తమ చదువు, సంస్కారాన్నిబట్టి, తమ భావాల్నిబట్టి - దానికి అనుగుణంగా వ్యవహరిస్తూ మనుష్యులు ఇతర్లనుండి గౌరవాన్ని పొంద డానికి ప్రయత్నిస్తూంటారు. ఈ ప్రవృత్తి జైళ్ళల్లోనూ కనుపిస్తూం టుంది. జైళ్ళల్లో తాను బీదకుటుంబంలోంచి వచ్చానని చెప్పుకునే ఖైదీ చాలా అరుదుగాగానీ కనుపించడు! అందుకనే జైళ్ళల్లో ఓసామెతను చాలా ప్రసిద్ధిగా చెప్పుకుంటారు.

'తమ వూర్లో ప్రతి ఒక్కడి ఇంటిమీదా యాభైరెండు కుంటల పొదీ నాకు కూర కాస్తూంటుంది'.

(పై సామెతకు తుల్యమైంది తెలుగులోనూ ఒక సామెత వుంది. మా తాత గుమ్మడికాయంత బంగారం తుక్కు ముట్టుకుంటే అవతల పారేశాడు.)

దొంగతనం అపరాధం కారణంగా జైలుకువచ్చినవాళ్ళను "ఇంటి దగ్గర అంత స్థితివున్నప్పుడు మరి దొంగతనాలు ఎందుకు చేశారు?" అని అడిగితే, ఇలా అంటారు "డబ్బుకోసం కాదండి మేందొంగతనంచేసింది! అలాంటి స్నేహాలు పట్టాము. అలవాటయింది! అదో సరదా! అంతే!"

మరి జైళ్ళల్లో ఏదైనా గొప్పపనిచేసి గౌరవాన్ని పొందడం సంభ వం కాదుగదా? కనుకనే, ధనిక కుటుంబానికి చెందిన వాణ్ణని చెప్పుకుని

తేలిగ్గా గౌరవాన్ని పొందాలని చూస్తూంటారు. ఇలాంటి గౌరవం పొంద డానికి తాను ధనికుడు కావల్సిన అవసరంలేదు. కేవలం చెప్పుకోవడమే గదా? ఇలాంటి మిధ్యాగౌరవాన్ని పొందాలనేదురద ఒక్కో రాజకీయ ఖైదీకి పుట్టడం ముద్దు! నాతోపాటు వుండే ఒక రాజకీయఖైదీకి తీపి అధికంగా తినడం అలవాటు. అతడు రహస్యంగా బెల్లం తెప్పించుకోడానికి ప్రయ త్నించాడు. బయటకు వెడుతూన్న కోటఖైదీకి డబ్బులు ఇచ్చి బెల్లం తెప్పించుకున్నాడు. రహస్యం వెల్లడయింది. జైలు అధికారులకు తెలి సింది. బెల్లం తెప్పించుకున్న రాజకీయఖైదీ ఓ తిరుగుడు చేశాడు. బెల్లం అంటే గౌరవానికి భంగకరం అనుకుని, మరింత డబ్బులు ఖర్చుచేసి బెల్లం స్థానంలో పంచదార తెప్పించి పెట్టుకున్నాడు. బెల్లం తెప్పించు కున్నాడంటే పల్చన. పంచదార తెప్పించుకున్నాడంటే 'గొప్ప'! అదీ భావన!

గౌరవాన్ని పొందడం, లేక పేరు తెచ్చుకోవడం ముఖ్యం అను కున్నప్పుడు కొంచెపనులూ, చెడ్డపనులూ చేసికూడా పేరు తెచ్చుకోవడం కద్దు! జైల్లో కొందరు ఖైదీలు రౌడీలుగా పేరు తెచ్చుకోవడానికి తాప త్రయ పడుతూంటారు. అందుకు తేలికైన వుపాయం, సూపరింటెండెం టన్నుగానీ, జైలర్నిగానీ పట్టుకుతన్నడం! సూపరింటెండెంట్ మీదగానీ, జైలర్ మీదగానీ - చెయ్యి చేసుకుంటే చాలా కఠినమైన శిక్ష అనుభవించ వల్సి వుంటుంది. శిక్ష అనుభవించడం కష్టమే అయినా, పేరు మాత్రం బ్రహ్మాండంగా పాకిపోతుంది. ఐదూ పది ఖర్చుపెట్టగల ఖైదీలు కొంద రుంటారు. అలాంటి ఖైదీలు పైచెప్పినలాంటి బద్మాష్లకు పెట్టుబడిపెట్టి తద్వారా జైల్లో తమ దర్పాన్ని నిలుపుకోచూస్తారు. ఒకమాటు ఇలాంటి బద్మాష్తో టీకమ్సింహ్ తలబడవల్సి వచ్చింది.

ఒకమాటు టీకమ్సింహ్కూ మరో ఠాకూర్ ఖైదీకీ మాటామాటా వచ్చింది. టీకమ్సింహ్ అతడిని చీవాట్లు పెట్టాడు. మరుసటిరోజున ఒక

యువఖైదీ దూరంగా నిలబడి ఇతడినిచూసి తొడకొట్టడం ప్రారంభించాడు. ఒకటి రెండుసార్లు టీకమ్‌సింహ్ చూసేట్టు దండేలూ - బస్కీలూ - గుంజీళ్ళూ తీశాడు. టీకమ్‌సింహ్ చాలా గంభీరమైన స్వభావం కలవాడు. అంతమాత్రానికి కోపంతెచ్చుకునే వ్యక్తికాదు. ఒకమాటు ఆ యువఖైదీని దగ్గరకుపిల్చి "ఏమిటి విషయం? మనిషివి నిలవలేకండావున్నావు?" అని అడిగాడు.

టీకమ్‌సింహ్ భారీ విగ్రహాన్ని దగ్గరగాచూసి యువఖైదీ భయపడి పోయాడు. దణ్ణంపెట్టి "అయ్యా, నా తప్పేమీలేదు! ఠాకూర్ ఖైదీ ఎలాగైనా మిమ్మల్ని అవమానపర్చమన్నాడు. అవమానపరిస్తే, రెండు రూపాయాలూ, రోజూ అర్ధసేరు పాలచొప్పున ఒక నెలరోజులు తన వంతుపాలూ నాకు ఇస్తానన్నాడు. బాగా కసరత్తు చేయమన్నాడు. మీదాసుణ్ణి! క్షమించండి! మీమీదకు నేను రాగలనా? ఊరకా ఠాకూర్‌కి చూపించడంకోసం దూరంనుండి తొడకొడుతూన్నాను అంతే!" అన్నాడు.

టీకమ్‌సింహ్ పెద్దగా నవ్వాడు. "అరే, పొట్టిగా! నెలరోజులు హాయిగా పాలుతాగు! బాగా తొడకొట్టు! నాకేమీ నష్టంలేదు!" అన్నాడు.

ఒక్కొమాటు ఇలాంటి చిలిపి తగాదాల్లో రాజకీయఖైదీలు చిక్కుకునే ప్రమాదమూ ఎంతైనావుంది. సాధారణంగా రాజకీయఖైదీని ఇతర ఖైదీలు గౌరవంగానే చూస్తారు. ఐతే కొందరు ఖైదీలకు రాజకీయ ఖైదీలు ఇలా గౌరవాన్ని పొందటం కంటకప్రాయంగా వుంటుంది. అలాంటి వాళ్ళు రాజకీయ ఖైదీల్తో అకారణంగానే పోట్లాటకు దిగుతారు. పోతే, రాజకీయ ఖైదీల్ని అవమాన - పరచడంకోసం జైలు అధికార్లే ఒక్కొమాటు ఇతర ఖైదీల్ని వాళ్ళమీదకు ఎక్కేస్తూవుంటారు.

అవధ నివాసి ఓంఠాకుర్ సాబ్ జైల్లో పరిచయం అయ్యాడు. అతడో జమీందారుకు బంధువుకావడంవల్ల బి-క్లాసు రాజకీయ ఖైదీల్తో పాటు వుంచారు. అతడికి చదువు బొత్తిగారాదు. కూడబలుక్కుని

నాలుగుపంక్తులు చదవగలడేమో! ఐతే. 'రాజాసాహబ్' అని పిలిపించు కోవడం అతడికి చాలా ఇష్టం! అతడి ఇష్టప్రకారమే అందరూ అతణ్ణి రాజాసాహబ్ అని పిలిచేవారు. మేమూ అలాగేపిల్చేవారం. అతడి అసలు పేరు జీత్‌సింగ్! ఐతే, మేము అతడిపేరుకు 'బహద్దూర్' అనే కొసనొక దాన్ని తగిలించాము. జీత్ బహద్దూర్ సింగ్ అని మొదట కొన్నాళ్ళు పిల్చాము. ఆ తరువాత అతడిపేరు విజయ జీత్ బహద్దూర్ సింగ్‌గా మారింది. మరికొన్నాళ్ళకు విజయప్రతాప్‌జీత్ బహద్దూర్‌సింగ్ అయింది. రాజా అన్నపదంకూడా వుండడం అవసరం గనుక రాజా విజయప్రతాప్ జీత్ బహద్దూర్ సింగ్‌గా అతడిపేరు స్థిరమైంది. ఇలా పేరు దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతూన్నకొద్దీ ఠాకుర్‌సాబ్ గర్వమూ సమపాళ్ళల్లో పెరిగింది. ఈ రెండింటినీ అనుసరించి కోరమీసాలూ పెరిగాయి. ఈ ఠాకుర్‌సాహబ్‌గారు ఉర్దూలోనే సంతకం పెడుతూండేవారు.

విప్లవకారులైన ఖైదీలు హిందీ-ఇంగ్లీషు పుస్తకాల్ని, వివిధ పత్రికల్నీ తెప్పించుకుంటూ వుండేవారు. ఇలా పుస్తకాల్ని తెప్పించు కుంటూండడంవల్ల విప్లవకారులు బాగా చదువుకున్నవారనీ, పండితులనీ జైలు అధికారులు భావించేవారు, గౌరవించేవారు. ఒకరోజున ఠాకుర్ సాహబ్ నన్నుపిల్చి "నేను కొన్ని పుస్తకాలను తెప్పించుకుంటాను. జైలు సూపరింటెండెంట్‌కు అప్లికేషన్ ఒకటి రాసి ఇవ్వండి!" అని అడిగాడు.

"పుస్తకాల పేర్లు చెప్పండి!" అడిగాను.

ఇలా అన్నాడు "పుస్తకాలపేర్లు నాకేంతెల్సు? మీకుతెల్సిన పుస్తకాల పేర్లు నాలుగురాయండి. ఇంగ్లీషు పుస్తకాల పేర్లేరాయండి. బాగా లావుపాటివి. బైండు, మిలమిల్లాడుతూండాలి. అరమరలో పెట్టుకోడానికి వీలుగా వుండాలి!"

నాకు తెల్సిన మంచిమంచి పుస్తకాల పేర్లురాసి, సూపరింటెండెంట్ కు అప్లికేషన్ ఒకటి పెట్టాను, ఠాకుర్ సాహబ్ పేరుమీద। ఠాకుర్ సాహబ్ కూడా పెద్దపెద్ద పుస్తకాలు తెప్పిస్తున్నారన్న విషయం నలుగురికీ తెల్సిపోయింది. ఐతే, ఎన్నాళ్ళకీ పుస్తకాలు రాకపోవడంతో సూపరింటెండెంట్ ను కారణం అడిగాను. అతడు 'రాజాసాహబ్ ఖాతాలో డబ్బులు ఏమీ లేవని' చెప్పాడు।

రాజాసాహబ్ గప్పాలుకొట్టడంలో మొనగాడు. తాను రాజకీయ ఖైదీననే చెప్పుకునేవాడు. నిజానికి అతడు రాజకీయ ఖైదీకాదు. తాను మనసుపడ్డ ఒకానొక రజకవనిత భర్తను కడతేర్చడానికి ప్రయత్నించిన సందర్భంగా జైలుపాలు అయ్యాడు. వికృతమైన లైంగిక అలవాట్లు కలవాడు కావడంవల్ల, అతడి అసభ్యకరమైన లైంగికచేష్టలవల్ల బి. క్లాసు ప్రతిష్ట దెబ్బతింటున్నదని బాధపడేవాళ్ళం. అతడుకూడా రాజకీయఖైదీల మైన మాఎదుట వెర్రిమొర్రి వేషాలు వేయడానికి జంకేవాడు.

బయటి సమాజంలోని అన్నిరకాల హీనప్రవృత్తులూ, కుత్సిత ప్రవర్తనలూ-జైళ్ళల్లోనూ కనబడుతూనే వుంటాయి। ఈర్ష్యా, ద్వేషం, అహంకారం జైళ్ళల్లోనూ ప్రత్యక్షం అవుతూవుంటాయి। కొందరు తమ దుర్వ్యసనాల్ని బాహాటంగా ప్రదర్శిస్తూ, తద్వారా గౌరవాన్ని సంపాయించాలని తాపత్రయపడుతూ వుంటారు. కొజ్జాల్ని మచ్చికచేసుకోవడం, వంటికి అతుక్కున్నట్టున్న గుడ్డల్ని వేసుకు ఒయ్యారాన్ని ఒలకబోస్తూ తిరగడం-అలా లైంగిక వాంఛల్ని ప్రదర్శించడం చేస్తూవుంటారు కొందరు. తాను తప్పుచేశానని బాధపడే ఖైదీనిగానీ, అలాంటి తప్పు ల్నుండి తనను తాను రక్షించుకోడానికి ప్రయత్నించే ఖైదీనిగాని నేను చూడలేదు. ఈ సమాజంలో న్యాయాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో పాలకజాతి కొందర్ని కైదులోపెట్టి వారిపట్ల పగసాధిస్తూ వుంటుంది.

కైదులో పెట్టబడ్డ పాలితుల్లోని అట్టడుగు ప్రజలు తమకు చాతనయిన పద్ధతిలో పాలకజాతి నియమాల్ని బద్దలుకొడుతూంటారు.

అనేక జైళ్ళల్లో, అనేకమంది కైదీలను కల్సుకున్నాను. వారితో మాట్లాడాను. అందరికైదీలకు ఏదోరకంగా దేవుడిపట్ల విశ్వాసంవుంది. నమ్మకంవుంది ఒక్క విప్లవకారులైన కైదీలుమాత్రం దేవుణ్ణి, మతాన్ని అంగీకరించరు. ఒక్క విప్లవకారులు మినహా మిగిలిన కైదీలందరూ భగవంతుణ్ణి కొలిచేవారే అయినా, అసమాజికమైన, సమాజానికి అహితకరమైన పనులుచేయడంలో వారు ఎవరికీ తీసిపోరు. భగవద్భక్తికీ, సామాజిక సంబంధాలకూ లేక ప్రగతికీ-ఎలాంటి సంబంధమూలేదని వారి ఉద్దేశం। కనుకనే, ఒకవైపు దేవుణ్ణికొలుస్తూనే వుంటారు, మరోవైపు సామాజిక అపరాధాల్ని చేస్తూనేవుంటారు. జైళ్ళల్లో శిక్ష అనుభవించేప్పుడుకూడా ఈ భగవంతునిమీద విశ్వాసంగల కైదీలు భవిష్యత్తులో నేరాలు చేయకూడదనుకోరు. నేరాల్ని చేయాలిసిందే। ఐతే, జాగ్రత్తగా పట్టుపడకుండా చేయాలనుకుంటారు. తోటి కైదీలు ఒక్కోనేరం నుండి ఎలా తప్పించుకున్నారో తెల్సుకుని తద్వారా తమనేర్పుకు పదును పెట్టుకుంటారు.

విప్లవకారులైన కైదీలను రెండున్నర సంవత్సరాలకంటే ఎక్కువ కాలం ఏ జైల్లోనూ వుంచరు. పలుకుబడిని పెంచుకునీ, శిష్యబృందాన్ని ఏర్పరచుకునీ - జైళ్ళల్లోంచి పారిపోతారేమోనన్న భయం ప్రభుత్వానికి ఎప్పుడూ వుంటుంది. అలాంటి భయం ప్రభుత్వానికి వుండడం అనవసరమనీ అనలేము. ప్రభుత్వంముందు తలవంచని విప్లవకారులు, తమకు విధించిన జన్మకైదును తిరస్కరించి పారిపోవడానికి ప్రయత్నించడమూ సహజమేకదా? మా మిత్రుడు కీ శే. శచీంద్రనాథ్ సన్యాల్ జైల్లోంచి తప్పించుకు పోవడానికి ఎప్పుడూ ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచిస్తూండేవాడు. ఒకమాటు ఇనుపచువ్వల్నికోసి పారిపోవడానికి రంపంలాంటి

సాధనాల్ని తెప్పించాడు. తరువాత అతడి ప్లాను బయటపడ్డది. ఆ సామాన్లను పట్టేశారు. ఆయనమీద మరి కూడా గట్టి నిఘా వుంచారు. శచీంద్రనాథ్‌సన్యాల్ ఒకవైపున పారిపోవడానికి ప్రయత్నిస్తూండేవాడు. మరోవైపున తనను దయతో విడచిపెట్టవల్సిందని 'మెర్సీపిటీషన్'లూ పెడుతూండేవాడు. నాస్థితి వేరు. జైల్లోనుండి పారిపోవడం తప్పు అని నేను ఎన్నడూ అనను. నాకు పారిపోవడానికి అభ్యంతరమూలేదు. ఐనా, నేను ఎన్నడూ పారిపోవడానికి ప్రయత్నించలేదు. అందుకు కారణం, పూర్తి సఫలతను పొందగలమన్న విశ్వాసం కలిగినప్పుడే నేనలాంటి పనిచేస్తాను!

కొద్దిరోజుల తరువాత నన్ను నైనీ జైలునుండి ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలుకు మార్చారు!

ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ మిష్టర్ ఒబేరాయ్! వెనకే పరిచయం వుంది! సరళమైన వ్యక్తికూడాను! ఐతే, బ్రిటీష్ సామ్రాజ్యానికి నమ్మినబంటుగా చాలా పెద్దపేరు తెచ్చుకున్న సర్దార్ గండాసింగ్ హెడ్ సూపరింటెండెంట్! ఇతడు విప్లవకారులపట్ల అత్యంత క్రూరంగా ప్రవర్తించేవాడు. అందుకుగాను బ్రిటీష్ ప్రభుత్వం ఇతడికి 'సర్దార్ బహద్దూర్' అనీ, 'ఆఫీసర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్' అనీ బిరుదుల్ని ఇచ్చింది.

కొన్నాళ్ల తరువాత ఒబేరాయ్ బదిలీ అయ్యాడు. ఇతడి స్థానంలో మేజర్ రామ్‌నారాయణ్‌భండారి సూపరింటెండెంట్‌గా వచ్చాడు ఇతడు సర్దార్ గండాసింగ్‌కంటె రెండాకులు ఎక్కువ చదివాడు. ప్రభు భక్తి పరాయణతలో గండాసింగ్‌ను మించాడు. సాధారణంగా జైలు సూపరింటెండెంటుల క్రూరత్వాన్ని గురించి, నిరంకుశత్వాన్ని గురించి ఖైదీలు అనేకరకాలగా చెప్పుకుంటూ వుంటారు. ఈ రామ్‌నారాయణ భండారీని గురించి ఎన్నోకధలు ప్రచారంలోవున్నాయి. 'ఇతడిని చూస్తే పశువులూ

భయపడుతూంటాయి. ఇతడు చూస్తూండగా పశువులు కొమ్ము విసరడం గానీ రంకెవేయడంగానీ - చేయడానికి వీలులేదు. అలా చేసిన పశువు లకు కొరడాదెబ్బల శిక్షగానీ! ఒంటరిఖైదు శిక్షగానీ - విధిస్తూంటాడు. ఒకమాటు ఇతడు చూస్తూండగా రావిచెట్టు గాలికి కదలడమూ, రావి ఆకులు గలగలాడడమూ జరిగిందిట! ఇంకేవుంది? రావిచెట్టుకు పన్నెండు కొరడాదెబ్బల శిక్ష విధించాడుట!' అని చెప్పుకునేవారు.

బ్రిటీష్ సామ్రాజ్యంలో వైస్రాయికిగల అధికారాలకంటే దర్పం కంటే, జైళ్ళల్లో సూపరింటెండెంట్లకు ఏ కొద్దిగానో ఎక్కువే అధికార దర్పాలుంటాయి. జైలుకు మహారాజు సూపరింటెండెంటే! ఆంగ్ల ప్రభు త్వం జైలు సూపరింటెండెంట్లకు విస్తృతమైన అధికారాల్ని ఇచ్చింది. వాళ్ళల్లో, ఖైదీలమీద ఇతర జైలు సిబ్బందిమీదా అధికారాల్ని చలాయిం చాలన్న కాంక్ష పెరిగిపోతూ వుంటుంది. మహారాజుల్లా దర్పం వెలగ బెడుతూవుంటారు. కాంగ్రెసు పాలనలో కూడా సూపరింటెండెంట్ హోదాలూ - అధికారాలూ - అహంకారాలు యథాతథంగానే వున్నాయని చెప్పకతప్పదు. అప్పుడప్పుడూ సూపరింటెండెంట్‌గారు జైలును సంద ర్శించడానికి వస్తూంటారు. అలాంటప్పుడు, సూపరింటెండెంట్‌గారికి నాలుగడుగులు ముందు ఇద్దరు పోలీసులు శరీరరక్షకులుగా నడుస్తూంటారు. అతగాడు ప్రాంగణంలోకిరాగానే 'దొరగారు వస్తున్నారు!' అన్న కేక వేస్తారు. దాన్ని, రిపోర్టు చదవడం' అంటారు. అదయ్యాక ఖైదీలందర్ని ప్రత్యేకమైన పద్ధతిలో మోకాళ్ళను ఒకచోటికిచేర్చి కూర్చోపెడతారు. ఖైదీల చేతులు తెరచి ముందుకు చూచివుండాలి. వాళ్ళ చేతుల్లో ఆయు ధాలులేవని తెలియడానికి అలా కూర్చోబెడతారు. ఏ ఖైదీనయినా సూప రింటెండెంట్ దగ్గరకు తీసుకువెళ్ళడం జరిగితే, అతడిని ఇద్దరు పోలీసుల మధ్య పిళ్ళలంగా నిలబెడతారు. ఐతే రాజకీయ ఖైదీల విషయం వేరు. వీళ్ళు సూపరింటెండెంట్ వస్తున్నాడంటే రెండు మోకాళ్ళనూ దగ్గరకు

పెట్టుకుని చేతులుచాచి గొంతుకు కూచోవడానికి అంగీకరించేవారు కాదు. రాజకీయ ఖైదీలకూ జైలు అధికారులకూ ఎప్పుడూ ఘర్షణలు జరుగుతూనే వుండేవి. 'విప్లవకారులు అలా కూర్చోనవసరం లేదు. ఐతే, తన కార్డును పట్టుకుని కదలకుండా బొమ్మలా నిలబడాల'న్నారు. రాజకీయ ఖైదీలు అలా నిల్చోవడానికీ అంగీకరించలేదు. అదీ తమకు అవమానం అన్నారు. చివరకు జైలు అధికారులు నోరు నొక్కుకోక తప్పలేదు.

సూపరింటెండెంట్ తనఖీచేయడానికి వచ్చినప్పుడు ప్రక్కన హెడ్‌జైలర్ వుండేవాడు. ఇటూ అటూ ఇద్దరు ఇనస్పెక్టర్లూ, పోలీసులూ వగైరా మందీ మార్బలం వుండేవారు. ఒక ఖైదీ జమాదార్ సూపరింటెండెంట్‌కు గొడుగుపట్టి అతణ్ణి అనుసరించి నడిచేవాడు. జైలు అధికారులు ఇలా తమ దర్పాన్ని అధికారాన్ని - ఖైదీల దగ్గర ప్రదర్శిస్తూండేవారు.

ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలుకు నేను వెళ్ళేప్పటికే అక్కడ ఇద్దరు విప్లవకారులైన ఖైదీలున్నారు. ఒకరు మన్మథనాథ్‌గుప్త, మరొకరు మణీంద్రనాథ్ బెనర్జీ! మన్మథనాథ్ కాకోరీ కుట్రకేసులో అభియుక్తుడు. మణీంద్రుడు, సి ఐ.డి. డిప్యూటీ సూపరింటెండెంట్ బెనర్జీని కాల్చిన కేసులో నిందితుడు. ఈ సి. ఐ. డి. ఆఫీసర్ని గురించి లోగడ వివరంగానే రాశాను. మణీంద్ర, ఈ సి ఐ.డి. సూపరింటెండెంట్ బెనర్జీకి మేనల్లుడవుతాడు. ఈజైల్లో బి. క్లాసు విప్లవకారులకు ఇచ్చిన బ్లాకు చాలా పెద్దది. అందులో మన్మథ, మణీంద్ర ఇద్దరే వుంటూన్నారు. సర్దార్ గండాసింగ్ ఆవరణ మొత్తానికీ ఇనుపఫెన్సింగ్ వేయించాడు. వార్తలు బయటనుండి లోపలకువచ్చే వీలుగానీ, లోపలినుండి బయటకువెళ్ళే వీలుగానీ - బొత్తిగాలేదు!

నేను ఫతేహ్‌గఢ్ జైలుకు వెళ్ళడానికి ముందే మన్మథనాథ్‌గుప్త, మణీంద్ర బెనర్జీ-జైలు అధికారుల్తో దీర్ఘకాలం పోరాడారు. చాలారోజులు

పాటు నిరశన వ్రతం చేశారు. అప్పటికి జైలు అధికారులు రాజీకి వచ్చారు జైల్లో వీరికి తాడుపేనే పనిని ఇచ్చారు. వీళ్ళు చేయం అన్నారు. బి. క్లాసు ఖైదీల సౌకర్యాలు వీళ్ళకు కల్పించడంలేదు. ఆ సౌకర్యాల్ని తమకు ఇవ్వాలని పట్టుపట్టారు. నేనీజైలుకు మేనెలలో వచ్చాను బ్లాకులో పంఖాలు లేవు. నైనీజైల్లో పంఖాలుండేవి. పోతే, పడుకోవడానికి మంచాలూలేవు. నైనీజైల్లోని సౌకర్యాల్ని ఉదహరిస్తూ, ఇక్కడా అసౌకర్యాల్ని ఏర్పాటు చేయవల్సిందని అధికార్లను అడిగాను. "జైలు నియమాల్లో (మాన్యుయల్) అలాంటి సౌకర్యాల్ని కల్పించవని లేదు!" అన్నారు. ఐతే, జైలు మాన్యుయల్‌ను ఖైదీలకు చూపించరు. చూడనివ్వరు. వేదాల్ని శూద్రులు చదవకూడదన్నట్టు జైలు మాన్యుయల్‌ను ఖైదీలు చదువరాదు! మేము మాన్యుయల్ చూస్తామని పట్టుపట్టాము. తప్పనిసరై మాన్యుయల్‌ను చూడనిచ్చారు.

ఫతేహ్‌గఢ్ సెంట్రల్‌జైలు అధికారులూ పట్టుపట్టారు. 'జైలు మాన్యుయల్‌లో లేనిదాన్ని ఇవ్వం, ఉన్నదాన్ని తీయం' అన్నారు. జైలు మాన్యుయల్‌ను అక్షరాక్షరం పాటిస్తామంటున్నారు. ఐతే, చిక్కు ఎక్కడ వస్తుందంటే, జైలు మాన్యుయల్ రచన ఓ ప్రత్యేకమైన పద్ధతిలో జరిగింది. దాన్ని ఉన్నది ఉన్నట్టు పాటించడం ఎవడివశమూ కాదు. అలా అమలుజరిపితే అధికార్లే అగచాట్లు పాలవుతారు. ఆనాటి జైలు మాన్యుయల్ ప్రకారం ఖైదీలు దగ్గర డబ్బు వుంచుకోరాదు. పదిమంది ఖైదీలు ఒకచోటచేరి సరదాగా గడపరాదు. గానాబజానాలాంటివి చేయకూడదు.

పై చెప్పినవన్నీ జైలునియమాలు. ఐతే, వాటిని అక్షరాక్షరం పాటింపచేసే శక్తి ఏ అధికారికీ వుండదనేచెప్పాలి. పై చెప్పినలాంటి విషయాల్లో, ముఖ్యం, పండగరోజుల్లో, ఖైదీలను అదుపుచేయాలన్న పిచ్చిసాహసాన్ని ఏజైలరుగానీ, సూపరింటెండెంట్‌గానీ-ప్రదర్శించరు! దీపావళి పండుగరాత్రి ప్రతి సెంట్రల్ జైల్లోనూ జూదం ముమ్మరంగా

సాగుతుంది. కొన్నివేలరూపాయిలు వినిమయం జరుగుతుంది. ఇంక హోలీ పండుగరోజున సాగే గానాబజానా సాధారణస్థాయివిదాటి వికృత రూపాన్ని ధరిస్తుంది. బైరీబాబాలాంటి జైలరువుంటే, హార్మోనియం-తబలాలాంటి వాయిద్యాలుకూడా జైల్లోకి వచ్చేస్తాయి. రెండుమూడొందల గజాల దూరానికికూడా కాలిగజ్జెల సవ్వడి వినిపిస్తూంటుంది సంగీతం హోరెత్తిపోతుంది, పూరీలు, పిండివంటలు వండుతారు జైల్లో అందరికీ పెడతారు. చిన్నఅధికార్లు తామూ ఈ ఆనందోత్సవంలో పాల్గొంటారు. సూపరింటెండెంట్, జైలర్‌లాంటి పెద్ద అధికార్లు చూసీ చూడనట్టు వెళ్ళిపోతారు!

విశాలమైన నైనీజైలుబ్లాకులో నేనుఒక్కణ్ణేవుండేవాణ్ణని చెప్పాను. అక్కడ ఫతేహాగఢ్ సెంట్రల్‌జైలుకంటే సౌకర్యాలు అధికంగానే వున్నాయి. అయినా, ఇక్కడ కాలాన్ని వృధాపుచ్చాననే చెప్పాలి. ఫతేహాగఢ్‌జైల్లో కాలం సద్వినియోగమయింది. కారణం, మన్మధ్‌నాధ్, మణీంద్ర-ఇద్దరూ మంచి అనుశాసనంతో జీవితాన్ని గడుపుతున్నారు. చాలా చిన్నవయస్సులోనే వారు జైలుపాలు అయ్యారు. అప్పటికి ఇంకా విద్యార్థిదశలోనే వున్నారు మణీంద్రబెనర్జీకి ఏడేళ్ళశిక్షపడ్డది. మన్మధ్‌నాధ్‌కు ఆజన్మకారాగారవాసం పడ్డది. ఇద్దరూ ఎక్కువ సమయాన్ని అధ్యయనంలో గడిపేవారు. మన్మధ్‌నాధ్ అప్పటికే ఫ్రంచ్‌భాషను అభ్యసించాడు. రష్యన్‌బాషను చదువుతున్నాడు. హిందీ-ఉర్దూభాషల్లో దొరికిన పుస్తకాలన్నింటినీ చదివేస్తున్నాడు ప్రతిఒక్కపనినీ సమయానికి చేస్తుండేవాడు. తాను విడుదల ఔతానన్న ఆలోచన మన్మధ్‌నాధ్‌కులేదు. ఒకవేళ అయినా, ఇరవై ఏళ్ళతరువాత! ఆలాంటిస్థితిలో నియమబద్ధతను అలవరచుకోవడం చాలా అవసరం!

నేను ఫతేహాగఢ్ సెంట్రల్‌జైల్లో అడుగుపెట్టగానే, మన్మధ్‌నాధ్, మణీంద్ర-ఇద్దరూ విప్లవకారుడిహోదాలో నన్నుసాదరంగా ఆహ్వానించారు.

ఇంగ్లీషులో మాట్లాడారు. కానీ, యూరోపియన్ బారక్కులోంచి
వచ్చిననేను యూరోపియన్ దుస్తుల్లోనే వున్నాను. నెత్తిన దొరటోపీపెట్టు
కున్నాను. అదిచూసి ఇద్దరూ బెంగాలీబాషలో నన్ను హేళనచేస్తూ ఇలా అను
కున్నారు. "ఈనాయాల అచ్చం దొరలా తయారై వచ్చాడు!"

నాకు బెంగాలీబాష వచ్చునని వాళ్ళుఅనుకోలేదు. నేనూరానట్టుగానే
వున్నాను. అవమానాన్ని దిగమింగాను. ఐతే, ఈ ప్రథమ పరిచయప్రభా
వం నాలో పనిచేస్తూనేవుంది. వాళ్ళతో నాప్రవర్తన, లేక నాతోవాళ్ళ
ప్రవర్తన-మర్యాదతోకూడిందిగా వున్నదేగానీ, ఆత్మీయతతో కూడిందిగా
ఎన్నడూలేదు! వాళ్ళిద్దరూ తమలోతాము బెంగాలీలో కబుర్లుచెప్పకునేవారు.
నాతోమాట్లాడవల్సివస్తే ఇంగ్లీషులో మాట్లాడేవారు. మన్మథ్‌నాథ్‌కు హిందీ
బాగావచ్చు. మరినేను పంజాబీని కావడంవల్ల హిందీ రాదనుకున్నాడో లేక
దొరల దుస్తుల్లోవుండడంవల్ల హిందీలో మాట్లాడకూడదనుకున్నాడో-ఏ
మైనాకానీ, నాతో హిందీలో మాట్లాడేవారుకాదు. ఇంగ్లీషులోనే మాట్లాడే
వారు. ఈ కారణంగా, నా సమయాన్ని ఎక్కువగా చదువుకోడానికి ఖర్చు
పెట్టేవాణ్ణి! మన్మథ్‌నాథ్ ఫ్రెంచి పుస్తకాల్ని ఇచ్చాడు. ఫ్రెంచిబాషను బాగా
అభ్యసించాను. అతడూనేనూ-ఇద్దరం ఇటాలియన్ బాషను చదవాలను
కున్నాం!

ఫతేహగఢ్ సెంట్రల్‌జైల్లో సాధారణఖైదీగా వుంటున్న రమేశ్
చంద్రగుప్త అనే ఓ రాజకీయఖైదీ నిరశనవ్రతంపట్టాడు. రమేశ్‌చంద్ర
ఇంకా విద్యార్థిదశలోనేవున్నాడు. కాన్పూర్‌లో చదువుకుంటూ విప్లవ రాజ
కీయాలవైపు ఆకర్షింపబడ్డాడు. వీరభద్రతివారీ, ఆజాద్‌పట్ల విశ్వాసఘాతు
కంచేశాడన్న వార్త కాన్పూర్‌లో దావానలంగా వ్యాపించింది. వీరభద్ర
తివారీ పోలీసులకు ఉప్పందించాడని అందరూ అనుకుంటున్నారు. అతడిక
కాన్పూరులో వుండలేకపోయాడు. 'ఉరయీ' అనేపల్లెటూర్లోవుంటున్నాడు.
రమేశ్‌చంద్ర రామలీల ఉత్సవసందర్భంగా 'ఉరయీ' వెళ్ళాడు. ఉత్సవ

సందట్లో వీరభద్రను కాల్చేశాడు. దెబ్బ తప్పించుకుని వీరభద్ర బతికి పోయాడు. రమేశ్‌చంద్రను అరెస్టుచేశారు.

రమేశ్‌చంద్రకు ఏడుసంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధించారు. ఎన్నిమార్లు అర్జీలుపెట్టుకున్నా అతణ్ణి బి. క్లాసుకు మార్చలేదు. విసిగి పోయిన రమేశ్‌చంద్ర నిరశనవ్రతం ప్రారంభించాడు. ఇదితెలిశాక, అతనికి మద్దతుగా మేమూ నిరశనవ్రతం పట్టడం తప్పనిసరయింది. రమేశ్‌చంద్రకు మేము సందేశం పంపించాము. "నువ్వుధైర్యంగావుండు! నీకు సానుభూతిగా మేమూ నిరశనవ్రతం ప్రారంభిస్తున్నాం!"

మేము జైలుఅధికారులకు నోటీసుఇచ్చాము. మాపట్లప్రవర్తిస్తున్న అనుచిత ప్రవర్తనను గురించి, రమేశ్‌చంద్ర న్యాయమైన కోర్కెల గురించి-మేమూ నిరశనవ్రతం చేస్తున్నట్టు తెలియపరచాం. నిరశనవ్రతం ప్రారంభించాం.

విప్లవకారులు, నిరశనవ్రతంద్వారా ఆత్మోద్ధరణ పొందాలనిగానీ, లేక భగవదానుగ్రహం పొందాలనిగానీ, ఎన్నడూ అనుకోరు. ప్రజల్లోతమ కోర్కెలప్రచారానికీ, ప్రభుత్వంపట్ల తమగాఢ అసమ్మతిని ప్రకటిస్తూ ప్రజాభిమతాన్ని కూడగట్టుకోడానికి-ఇదొసాధనంగా భావిస్తారు. ఐతే, ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైల్లోంచి వార్త బయటికి పోవడమే అసంభవం! ఇంక మేము నిరశన వ్రతం చేస్తూన్నట్టు ప్రజలకేలా తెలియడం? ఎన్ని కట్టుదిట్టాలుచేసినా, ఎంతటి కఠిన నిర్బంధాన్ని అమలు పరచినా - మేము నిరశన వ్రతం చేస్తూన్నామన్న విషయం ప్రజలకు తెలియనే తెలిసింది! జైలు అధికారులు విస్మయం చెందిన విషయం. "అసలు రమేష్‌చంద్ర నిరశన వ్రతం చేస్తూన్నట్టు మాకెలా తెల్సింది?" అనేది! ఆ క్షణంనుండి నిర్బంధాన్ని మరిన్ని అధికం చేశారు.

నిరశన వ్రతం పద్దెనిమిది లేక పందొమ్మిది రోజులపాటు చేసినట్టు జ్ఞాపకం! గాంధేయవాదులు నిరశన వ్రతం ఆచరించేప్పుడు విమ్మరసాన్ని

నీళ్ళుకలిపి తీసుకుంటూంటారు. శరీరానికి బాదంనూనె పట్టిస్తూంటారు. విప్లవకారులు అలాంటివేమీ చేసేవారుకాదు. పది పద్దెనిమిది రోజులు ఉపవాసం చేయడం విప్లవకారులకు ఒక లెక్కలోదికాదు. అంతకుక్రితం మన్మథనాథ్, మహీంద్ర చెరోనెలా ఉపవాసం చేశారు. అంతకంటెముందు మన్మథనాథ్ దాదాపు అరవైరోజులు ఉపవాసం చేశాడు. కనుక పద్దెనిమిది రోజులు ఒక లెక్కకాదు. జోగేష్ చటర్జీ ఆగ్రా జైల్లో దాదాపు నూటయాభైరోజులు నిరశన వ్రతం చేశాడు. నిరశన వ్రతం ఇరవై రోజులు దాటాక బలవంతానా పాలు తాగించే ఏర్పాటు చేస్తారు. ఉపవాసంచేసేఖైదీ చనిపోతే ప్రజల్లో అశాంతి, అలజడి వ్యాపిస్తాయి. అందుకని ఉపవాసం చేసే ఖైదీలకు, బలవంతానా పాలు తాగిస్తారు. రబ్బరు గొట్టాంగుండా ముక్కుద్వారా పాలుపట్టే ఈ పద్ధతి ఉపవాస దీక్షలోవున్న ఖైదీల్ని చాలా బాధ పెడుతుంది.

పద్దెనిమిది రోజుల ఈ ఉపవాస దీక్షాసమయంలో, మా ఆత్మలు శుద్ధీకరింపబడ్డాయని మాలో ఎవరికీ అనిపించలేదు. నిరశన వ్రతం చేసేప్పుడు మొదటి మూడురోజులూ ఆకలితో చాలా బాధపడవల్సివుంటుంది. ఆ తరువాత శరీరం ఆకలికి అలవాటు పడుతుంది. మరి కొన్నాళ్ళు గడిచాక లేవడం, కూర్చోవడం, నడవడం, చివరకు కదలడం కూడా బాధగానేవుంటుంది. మనస్సు ఎప్పుడూ భోజనాన్ని గురించే ఆలోచిస్తూంటుంది. రకరకాలైన భోజన పదార్థాల రుచులూ, సువాసనలూ స్ఫురణకు వస్తూంటాయి. ఉపవాస దీక్షాసమయంలోని మా అనుభవాల గురించి ఒకరికొకరం చెప్పుకుంటూ వుంటాము. మేము ముగ్గురం - నేనూ, మన్మథ్ నాథ్, మహీంద్ర - నాస్తికులం! ఐతే, టీకమ్‌సింహ్ పరమ ఆస్తికుడు. అతడికి ఉపవాస సమయంలో భగవద్దర్శనంగానీ, ఆత్మోద్ధరణగానీ - కలగలేదు! మనస్సు ఎప్పుడూ ఉడకపెట్టిన కోడిగుడ్డు కోసం కొట్టుకులాడేదిట! విచిత్రం ఏమిటంటే, టీకమ్‌సింహ్ శాకాహారి!

పద్దెనిమిదవ రోజున రమేష్ బంధువులు కాన్పూర్‌నుండి బాల కృష్ణశర్మ 'నవీన్'ను తీసుకుని వచ్చారు. అధికార్లు రమేష్‌కు బి క్లాసు ఇవ్వడానికి అంగీకరించారు. అతడు ఉపవాసాన్ని విరమించాడు. రమేష్ సమస్య ముఖ్యం కావడంవల్ల, అతడు విరమించగానే మేమూ విరమించాము. ఐతే, మేముకోరిన సౌకర్యాలను కల్పించకపోతే తిరిగి ఉపవాస దీక్ష కొనసాగించగలమని ప్రకటించాము.

మణీంద్ర ఆరోగ్యం అసలే అంతంత మాత్రం; ఈ ఉపవాసంతో అతడి ఆరోగ్యం మరీ చెడిపోయింది. గుండెజబ్బు పట్టుకుంది. వైద్యం చేయించేనెపంతో మేజర్ భండారీ మణీంద్రను మరో బ్లాకుకు పంపించాడు. అది హాస్పటలుకు దగ్గరగావుంది. నాలుగు రోజులు గడిచాయో లేదో, మణీంద్ర స్థితి ప్రమాదకరంగా పరిణమించింది అన్న వార్త వచ్చింది. మేము వెళ్ళి మణీంద్రను చూడడానికి అనుమతిని ఇచ్చాడు మేజర్ భండారి। ఇలాంటి అనుమతిని ఇవ్వడం అతడి స్వభావానికే విరుద్ధం।

మేము హాస్పటల్‌కు వెళ్ళాము. మణీంద్రనాథ్ బెనర్జీ మృత్యు ముఖంలో వున్నాడు. శ్వాస అందక తన్నుకుంటున్నాడు. అతడి స్థితిని చూసి మేము కంపించిపోయాము. అతడి కాళ్ళూ చేతులూ వాచాయి. చూపు మారిపోయింది. కూచోలేకపోతూన్నాడు. పడుకోలేకపోతూన్నాడు. శ్వాస ఆడటం లేదు. ఆక్సిజన్ గ్యాస్ ఇస్తూన్నారు. ఆ హాస్పటల్ డాక్టరుకు రోగికిగ్యాసు ఇవ్వడంకూడా తెలియదు. ఎలాగో గ్యాసు రోగికి అందింది. స్థితి కొంచెం మెరుగయింది.

మణీంద్రనాథ్ మృత్యుసన్నివేశాన్ని గురించి రెండవ భాగంలోనూ రాశాను. ఇక్కడ మళ్ళీ రాయడం పునరుక్తి అవుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే మణీంద్రనాథ్ బెనర్జీ హాస్పటల్లో అలా యమయాతన అనుభవించి చనిపోయాడు. ఐతే, అతడు తన ఆదర్శంకోసం వీరమరణాన్ని పొందాడనే అనాలి, చివరిక్షణంలోనూ చలించని అచంచల వీరుడు

మణీంద్ర. ఆనాటి హి.స.ప్ర.స. మిత్రుల భావాలు ఎలావుండేవో తెల్పు కోవడానికి మణీంద్ర అన్న చివరి మాటలు చక్కని ఉదాహరణ (రెండవ భాగం 173 పేజి చూడండి)

మణీంద్ర చనిపోవడంతో నేనూ మన్మధనాధ్-ఇద్దరం భారంగా రోజుల్ని దొర్లించసాగాము. ఒకవారంగడిచింది. రమేశ్‌చంద్రకు బి క్లాసు సౌకర్యాలను ఇచ్చారు. అతడిని మేముఉన్న బ్లాకుకు పంపించారు. రమేశ్ చాలా చిన్నవయసులో జైలుకు వచ్చాడు. మెట్రిక్కుకూడా కాలేదు! అంత చిన్నవయసులో వీరభద్రను కాల్చడానికి సంసిద్ధుడయ్యాడంటే, అతడిలోని దేశభక్తే అలాచేయించింది. మాబ్లాకుకువచ్చాక అతడి దృష్టిని చదువుమీదకు మరల్చాము.

మరికొద్దిరోజులకు మరో బి క్లాసు రాజకీయఖైదీనికూడా మాబ్లాకుకుపంపించారు. వీరిపేరు శివరాంపాండే, వీరిదికాన్పూరు కాంగ్రేసు స్వయం సేవకులు. సత్యాగ్రహంచేసి జైలుకువచ్చారు. శివరాంపాండే విద్యాధికులు ప్రస్తుతం (1952) ఉత్తరప్రదేశ్ విధానసభసభ్యులు.

శివరాంపాండేగారు ఇతరసత్యాగ్రహులైన ఖైదీల్లాగానే ఎప్పుడూ నువ్వులనూనెను వంటికి మాలీసు చేసుకోవడం, వ్యాయామంచేయడం, గీతాపఠనంకావించడం-చేస్తూండేవారు. కలుపుగోలుతనంగల మనిషికావడంవల్ల-సరదాగా రోజులు గడువసాగాయి

శివరాంపాండేగారు కాంగ్రేసువాది అయినప్పటికీ విప్లవకారులపట్ల గొప్పసానుభూతిని కలిగివుండేవారు. నేను భగత్సింగ్ సహచరుణ్ణని తెలిశాక పాండేగారికి మరికూడ కుతూహలమూ ఉత్సాహమూ, కలిగాయి. ఎన్నోప్రశ్నలువేస్తూండేవారు సందేహాల్ని తీర్చుకుంటూండేవారు.ఒకమాటు ఇలా అడిగారు. "ఒకమాటు భగత్సింగ్‌గారూ, ఆజాద్‌గారూ, (పాండే గారు గౌరవసూచకం అయిన-జీ-గారు-శబ్దాన్ని అధికంగావాడుతుంటారు) ఇంగ్లాడునుండి ఓడలో వస్తూన్నారుట! తెల్లవాడొకడు భారతమాతపట్ల

నిందాపూర్వకంగా మాట్లాడడంతో కోపగించుకున్న భగత్సింగ్‌గారు, ఆ తెల్లవాణ్ణి చెవులుపుచ్చుకుని కుక్కపిల్లలా ఎత్తి సముద్రంలో పారేశాడుట! ఇది నిజమేనా?"

నాకు నవ్వువచ్చింది. భగత్సింగ్, అజాద్-వీరు ఎన్నడూ ఇంగ్లాండు వెళ్ళలేదని, పాండేగారు విన్నకథ కట్టుకథఅనీ చెప్పాను! పాండేగారు నిరుత్సాహపడ్డారు నావైపు అనుమానంగా చూశారు. 'తాను విన్నకథ నిజమైందే!కానీ, భగత్సింగ్‌కు లభిస్తున్నకీర్తి కారణంగా ఈర్ష్యవున్నైన నేను ఈకథను 'అబద్ధం' అంటున్నాము!' ఆ చూపులు పైవిధంగా నామీద నెపంవేస్తున్నాయి. నేను ఆకథను నిజమైనదని అంగీకరిస్తే, దాన్ని యువకుల్లో ప్రచారంచేసి, దేశభక్తిని పెంపొందించాలని పాండేగారి అభిప్రాయం!

నేను జైలునుండి విడుదల అయ్యాకకూడా పాండేగారిలాంటి ఉత్సాహవంతులైన దేశభక్తుల్ని చాలామందిని నిరాశపరిచాను. భగత్సింగ్, చంద్రశేఖర్ ఆజాద్-వీరు సాధారణ మానవులుకారనీ అతిమానవులనీ-అత్యుక్తులు చెప్పడం ఒకరకం దేశభక్తి! ఐతే, అత్యుక్తులకూ, కల్పనలకూ కథల్లో నవలల్లో స్థానం వుంటుందిగానీ, నిజజీవితంలోనూ, వ్యక్తిగత అనుభవాల్లోనూ స్థానం వుండదుకదా?

నేను అరెస్టుఅయ్యాక ముందు దుర్గాభాభీ, తరువాత సుశీలాదీదీ అరెస్టుఅయినట్టు తెల్సింది. మేము నిరశనవ్రతం చేయడానికి కొద్దిరోజుల ముందు 1934లో ప్రకాశవతి అరస్టు అయినట్టు వార్త వచ్చింది. ప్రకాశవతి జీవితం ఏమవుతుందో? నన్నుఅలోచన నన్ను బాధపెట్టసాగింది. మా తమ్ముడూ, ఇతర మిత్రులూ రాసేవుత్తరాల్తోపాటు ప్రకాశవతి తనను గురించీ సంకేతాత్మకంగా జాబులురాస్తుండేది! నేనుకూడా ఆమెకు ఉపమానాల్తో ధ్వన్యాత్మకంగా, సంకేతాల్తో-జాబులు రాస్తుండేవాణ్ణి! ఆమెకు రాసినజాబుల్ని ఇతరమిత్రులఅడ్రసుకు పంపేవాణ్ణి! నెలకుఒక్కజాబురాసు

కోడానికి అనుమతి ఇచ్చారు. కమక, ఒక్కోజాబు రెండుమూడు తావులు అయ్యేది. నాకువచ్చేజాబులూ, నేనురాసేజాబులూ-సి.ఐ డి. డిపార్టుమెంటు పరిశీలించేది తమకు తెలియని ఏదోసాంకేతికపద్ధతిలో మేము విషిద్ధమైన వార్తల్ని అందింమకుంటామని వారికి అనుమానమే। మేము బయటప్రపంచానికితెలిపే వార్తలవల్ల అలజడులూ, ఆందోళనలూ-జరగకుండా, అసలు అలాంటివార్తలు మేము రాయకుండా, సి ఐ.డి డిపార్టుమెంటు జాగ్రత్త పడేది అలాగే, బయటనుండి మాకువచ్చే వార్తల ఆధారంగా, మేము జైళ్ళలోనుండి పారిపోడానికి ప్రయత్నాల్నిచేస్తామేమోనని భయపడుతుండే వారు-అందువల్ల, మాజాబుల్లో తమకుఅర్థంకాని, అనుమానించదగిన శబ్దాల్ని, వాక్యాల్ని నల్లనిసిరాతో కొట్టివేసి, చదవడానికి వీలులేకుండా చేసేవారు.

అప్పటికి రెండు సంవత్సరాలయింది. నేను జైలుకువచ్చి। పరిస్థితులకు అలవాటుపడ్డాను కొంత స్థిమితం ఏర్పడ్డది. మాకు 'స్టేట్సుమెన్' ఇంగ్లీషుపత్రికను, 'భారత్' అనే హిందీపత్రికను చదువుకోడానికి ఇచ్చేవారు ఈ రెండూ ప్రభుత్వాన్ని సమర్థించే పత్రికలే। ఈ పత్రికల్లోనూ విప్లవోద్యమానికి సంబంధించిన వార్తలువుంటే, వాటిని కట్ చేయడమో, లేక వాటిపై నల్లనిసిరాపూసి చదవడానికివీలు లేకుండా చేయడమో చేసేవారు. అయినప్పటికీ మీరట్, కాన్పూర్, దేరాడూనుల్లో విప్లవ కార్యక్రమాలు కొనసాగుతూనేవున్నాయన్న వార్తలు అందుతూనేవున్నాయి. పోలీసులు దేరాడూన్-కాన్పూర్ కుట్రకేసంకొకదాన్ని పెట్టాలని ఆలోచిస్తున్నారు. మాకు అందుతున్న వార్తలకంటే తీవ్రరూపంలోనే విప్లవోద్యమం కొనసాగుతుందని అనుకున్నాను. ఏకాంతంలో, మౌనంగా గడచిన క్షణాల్లో అనేకమైన ఆలోచనలు వచ్చేవి. నాభవిష్యత్ జీవితాన్ని గురించి, ప్రస్తుత జైలుజీవితం గురించి ఆలోచిస్తుందేవాణ్ణి ఇంకా పన్నెండు సంవత్సరాలు జైలుజీవితాన్ని గడపాలి। ఆ తరువాత విడుదల

ఐతే, నేనేస్థితిలో వుంటాను? వయస్సు నలభై ఏళ్ళు దాటుతుంది. ఆవయస్సులో మళ్ళీ కొత్తగా జీవితాన్ని ప్రారంభించాలి. పైగా, ఇన్నిసంవత్సరాలు ఏపనీచేయకుండా కూర్చుని వుండడంవల్ల ఆరోగ్యముసరిగా వుండదు. కనుక, ఒకరకంగా జైలునుండి బయటపడేనాటికి దాదాపు వృద్ధాప్యపుచాయలు నాలో గోచరిస్తుంటాయి. ఆవయస్సులో, ఆనిస్సహాయస్థితిలో, నేనేంచేయగలను? ఒకటేఆశ మినుకు మినుకుమంటుండేది. విడుదలఅయ్యాక నా ఆదర్శాన్ని ప్రచారంచేస్తూ ఇతర్లను, ముఖ్యంగా. యువకుల్ని విప్లవానికి సన్నద్ధుల్ని చేయగలుగుతాను। సాహిత్యంద్వారా ప్రచారకార్యాన్ని నిర్వహించి జాతీయవిముక్తికి దోహదం చేయగలనేమో। ఇలాగే ఏవేవో ఆలోచనలు బుర్రలో మెదిలేవి।

పెళ్ళీకుటుంబమూ అనేవి లేకుండా ఒంటరిగా జీవితాన్ని గడుపుతానన్న వూహల్లో వుండేవాణ్ణి।

నిరశనవ్రతం విరమించి కొద్దిరోజులే అయింది. ఇంకా శరీరం బలహీనంగానేవుంది ఒకరోజున ఆఫీసునుండి పిలుపు వచ్చింది మేజర్ భండారి తన ఆఫీసుగదిలోకి పిల్చి, నన్ను కల్సుకోడానికి లాహోరు నుండి ఎవరోవచ్చారని చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు. "నిరశనవ్రతాన్నిగురించి ఎమీమాట్లాడనని మాటఇస్తే-కల్సుకోడానికి అనుమతిస్తాను. లేకపోతే ఇవ్వను"

పై నిబంధన చాలా అవమానకరమైనదనిపించింది. వచ్చిన వ్యక్తిని కల్సుకోకుండానే వుందామనుకున్నాను. కానీ, మరోరకమైన ఆలోచనలు వచ్చాయి. మా అమ్మ నా నిరశనవ్రతాన్ని గురించివిని చూడడానికి వచ్చి వుంటుంది. కటిక బీదరికంలో ఆరువందలమైళ్ళు ప్రయాణంచేసి వచ్చింది నన్నుచూడడానికి। నన్ను కల్సుకునే అవకాశమే లభించకపోతే ఎంత నిరాశపడుతుందోకదా? ఉపవాసవ్రతం పూర్తయింది. ఫలితాన్నిపొందాము. ఇంకదాన్ని గురించి మాట్లాడినా, మాట్లాడకపోయినా ఒకటే।

విరళనవ్రతాన్ని గురించి మాట్లాడనని మాటఇచ్చాను।

నన్ను కలవడానికి వచ్చిన వ్యక్తిని లోపలకు తీసుకువచ్చారు. మా అమ్మగారుకాదు వచ్చింది ప్రకాశవతి। మేము దాదాపు ఏమీమాట్లాడుకోలేకపోయామనే చెప్పాలి। అందుకు కారణం, మేజర్ భండారి అతి తెలివిగా మా మధ్యదరిమధ్యా ఒకపోలీసు అధికారిని కూర్చోబెట్టాడు. అతడి చెవినిపడకుండా మేము ఏమీమాట్లాడుకోలేనిస్థితిని కల్పించాడు. దీర్ఘమైన అనశనవ్రతం కారణంగా బాగా బలహీనంగా వున్నాను. అనశనవ్రతం చేశానని చేప్పకపోవడంవల్లా. నేను నీరసించి వుండడంవల్లా-జైల్లో నాపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారనీ, బాధలు పెడుతున్నారనీ-ప్రకాశవతి అనుకున్నది। ఆమె ఇంటికి వెళ్ళిన వెంటనే యు.పి. ప్రభుత్వ హోమ్ మెంబర్ మహరాజసింహ్‌ను కల్సుకుని నాపరిస్థితిని చెప్పింది. కేంద్ర అసెంబ్లీ మెంబర్లకూ నాపరిస్థితిని తెలియపరిచింది. పత్రికల్లోనూ నా ఆరోగ్యాన్ని గురించి వార్తలు వచ్చాయి. నిజంగానే నాఆరోగ్యము శిధిలమవసాగింది. జ్వరం కాస్తోంది।

ఆమధ్యకాలంలో ప్రకాశవతిని గురించి, ఆమె భవిష్యత్ జీవితాన్ని గురించి చాలారోజులు ఆలోచించాను. నామీది మమకారం, లేక ప్రేమ- ఆమెజీవితాన్ని మోడుబార్చేవిగా వుండకూడదు అనుకున్నాను. నాస్నేహాన్ని, మిత్రుత్వాన్ని మర్చిపోయి మరొకర్ని వివాహమాడి జీవితాన్ని సార్ధకంచేసుకోమని చెప్పాలనుకున్నాను. పోలీసుఅధికారి ఎదుట చెప్పలేకపోయాను ఇదే అభిప్రాయాన్ని ఒకజాబుద్వారా తెలియపరచాను. నేను ఇంకా పన్నెండు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించాలి. నాకోసంప్రకాశవతి తన జీవితాన్ని అడవికాచిన వెన్నెల చేసుకోవడం అన్యాయం అనిపించింది। సామాజిక దృష్టికల, ఉత్తముడైనవ్యక్తిని వివాహమాడి సామాన్య గృహిణిగా జీవితాన్ని ప్రారంభించమనీ, శక్తికొలది ప్రజల్లో

సామాజిక చైతన్యాన్ని ప్రచారంచేయడానికి ప్రయత్నించమనీ - జాబు ద్వారా సలహా ఇచ్చాను.

శివరాంపాండే శిక్షపూర్తిఅయింది. విడుదల అయివెళ్ళిపోయాడు. మన్మధనాధ్‌గుప్తనీ, రమేశ్‌చంద్రనీ ఆగ్రా సెంట్రల్‌జైలుకు మార్చారు. బి. క్లాసుకు చెందిన అక్బర్‌మహమ్మద్‌ఖాన్ అనే అతణ్ణి నేనువుండే బ్లాకుకుమార్చారు. ఇతడు యు పి.కి చెందినవాడు. ఒకమోస్తరు భూస్వామి. హత్యలూ, దోపిడీల్లాంటి నైతిక అపరాధాలకారణంగా జీవితఖైదు అనుభవిస్తున్నాడు. ఇతడిమీద పెద్దగా అజమాయిషీ వుండేదికాదు. జైలు ఆవరణ అంతా తిరుగుతుండేవాడు. బి. క్లాసు రాజకీయఖైదీలగౌరవాన్ని, అభిమానాన్నీ - మంటకలపగల నీచమైనపనులను చేస్తుండేవాడు. అలాంటివి చేయవద్దని చెబితే మీసాలుమెలితిప్పుతూ "మీ బాంబులూపిస్తోళ్ళూచూసి భయపడతాననుకున్నావా?" అంటూ పోట్లాటకుదిగేవాడు. ఇలా నైతిక అపరాధులతోపాటు కల్సివుండవల్సిరావడం రాజకీయఖైదీలకు ఎప్పుడూ సమస్యగానే వుంటుంది నైతిక అపరాధాల కారణంగా శిక్షను అనుభవిస్తున్న బి. క్లాసుఖైదీలు రాజకీయఖైదీలకు తలనొప్పిగా తయారవుతారు.

మానసికంగా ఖిన్నుడనయ్యాను. రోజూ జ్వరంవస్తోంది. ఫతేహ్‌గఢ్ సెంట్రల్‌జైలునుండి సుల్తాన్‌పూర్ శానిటోరియం జైలుకునన్ను మార్చారు. 'బహుశా జ్వరం టి బి. లోకి దించివుంటుంది. జైలు అధికారులు నాకు చెప్పడం మంచిదికాదనుకున్నారేమో! చెప్పలేదు. మౌనంగా సుల్తాన్‌పూర్ శానిటోరియం జైలుకు పంపిస్తున్నారని, అనుకున్నాను. చాలా నీరసపడిపోయాను. 'జైలుశిక్ష పూర్తికావడం అన్నసమస్యే వుండదు. అసలు అంతవరకూ బ్రతికితేకదా?' అనుకున్నాను.

ప్రకాశవతికి మరో జాబు రాశాను. "నేను విడుదల అయి వస్తానన్న ఆశను వదలి, నీకు అనుకూలమైన నూతన జీవితాన్ని ప్రారంభించడం మంచిది!" అని స్పష్టంగా రాశాను.

సుల్తాన్‌పుర్ శానిటోరియం జైలు డాక్టరు శంకర్‌లాల్ గుప్త, చాలా మంచివాడు. టి. బి. స్పెషలిస్టు, వెళ్ళగానే నన్ను పరీక్షించాడు. 'నీకు టి బి. లేదు' అని చెప్పాడు. విశ్రాంతిగా వుండమన్నాడు. హాయిగా తిని, సంతోషంగా వుండమన్నాడు. గుప్త మంచి డాక్టరేకాదు; సాహిత్యాభిరుచికలవాడు. శానిటోరియంని ఓ మంచి పూలతోటగా తీర్చిదిద్దాడు. ఎటుచూసినా పూవులే కనుపిస్తాయి అక్కడవున్న రోగులయిన ఖైదీలు ఆ జైలును నిజంగా శానిటోరియంగా భావించాలని డాక్టర్ ఆశయం। అక్కడ త్వరలోనే నా ఆరోగ్యం కోలుకుంది।

నేను సుల్తాన్‌పుర్ శానిటోరియం జైలుకు మార్చబడ్డానని తెల్సుకుని ప్రకాశవతి చాలా బాధపడ్డది. తరచుగా నన్ను చూడడానికి రాసాగింది. తరచుగా రావడానికి అవకాశమూ లభించింది. ప్రభుత్వం ఆమె ఢిల్లీ, లాహోరు పట్నాల్లో వుండడాన్ని ఒక సంవత్సరంపాటు నిషేధించింది. ఈ సంవత్సర కాలాన్ని సద్వినియోగ పరచడంకోసం, కాశీవిశ్వవిద్యాలయంలో చేరి చదువుకోసాగింది ప్రకాశవతి। సుల్తాన్‌పుర్, కాశీకి చాలా దగ్గర। అలా ఐదు ఆరునెల్లు గడిచాయి నా ఆరోగ్యం కుదుటపడ్డది. నన్ను బరేలీ సెంట్రల్ జైలుకు మార్చారు।

బరేలీ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ మేజర్ రోజేయర్. ఇతడు ఆంగ్లో ఇండియన్. ఐతే, నలుగురూ తనను యూరోపియన్ అనుకోవాలని తాపత్రయ పడతాడు. అహంకారానికీ, గర్వానికీ కొదువలేదు. ఇతర సూపరింటెండెంట్‌లు, సాధ్యమైనంతవరకూ విప్లవకారుల్తో తగాదాపడరు చీటికీమాటికీ విప్లవకారుల బారక్కుల్లోకి వెళ్ళడం - అలాంటివి చేయరు. కానీ, ఈ రోజేయరు అలా కాదు. విప్లవకారులమీద కూడా తన దాష్టికాన్ని చెలాయించాలంటాడు. తను బారక్కులోకి వచ్చినప్పుడు విప్లవకారులూలేచి నిలబడాలంటాడు. మాకు ఇచ్చిన పనినిగురించి "అది ఎందుకు చేయలేదు? ఇది ఎందుకు చేయలేదు?" అని

గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తుంటాడు. అలాగని రోజేయర్ని చెడ్డవాడంటానికి వీలులేదు. విప్లవకారులుకూడా తననుగౌరవించాలనీ, తనపట్ల వినయాన్ని ప్రదర్శించాలనీ అంటాడు అంతే! అదే మాకు గిట్టదు. జైల్లో మాకుఇచ్చే పనులు ఎంతతేలిక అయినవయినా మేము చేసేవాళ్ళంకాదు.

ఒకరోజున రోజేయర్‌తో పోట్లాడాలనుకున్నాను. పరేడ్ రోజు అది. రోజేయర్ వార్డర్లతోకల్సి బ్లాకులోకి వచ్చాడు. అందరికీ వినపడే ట్టుగా ఉపదేశించసాగాడు. "పనిచేయడం అవమానకరం అనుకోకూడదు. మేమూ రోజంతా పనిచేస్తూనేవుంటాము. ఎం. ఎన్. రాయ్‌కూడా ఈ జైల్లోనే వున్నాడు అతడు ఎన్నడూ తనకు ఇచ్చిన పనిని ఎగగొట్టేవాడు కాదు . . . . ."

మాట్లాడుతూ రోజేయర్ తన బూటుకాలిని నామంచం తలవేపున మడిచిపెట్టుకున్న కంబళీమీద పెట్టాడు. యూరోపియన్ ఆచారాల ననుసరించి బూటుకాల్ని అలాపెట్టడం పెద్దతప్పయిన విషయంకాదని నాకూ తెల్సును. ఐతే, నేను అవకాశంకోసం చూస్తున్నాను. అవకాశం దొరికింది.

నేను వెంటనేలేచి నిలబడి, ఆకంబళిని తీసి అవతల విసిరిపారేశాను "నేనీకంబళిని కప్పుకుంటాను. నువ్వేమో కంబళీమీద బూటుకాలు పెడుతున్నావు. ఇదినన్ను అవమానపరచడమే అవుతుంది!" అని గట్టిగా కోపగించుకున్నాను.

జైలువార్డర్లూ, ఇతర అధికారులూ నిర్విణ్ణులయ్యారు. రోజేయర్ ముఖం పాలిపోయింది. ఘోరమైన ఈ అవమానానికి మనిషి ఉగ్రుడయ్యాడు. "సరే, సరే, ఇందుకు తగినశిక్ష అనుభవిస్తావు!" అంటూ విసురుగా బ్లాకులోంచి వెళ్ళిపోయాడు.

ఒక గంటతరువాత వార్డర్‌వచ్చాడు. రిపోర్టుచదివాడు. "సూపరింటెండెంట్ మేజర్ రోజేయర్ వస్తున్నారు!"

కక్ష తీర్చుకునేఉద్దేశంతో వస్తూన్నాడనేది స్పష్టం! 'ఐతే, ఎలాంటి శిక్ష విధించబోతూన్నాడు?' అన్న ఆలోచన వేధిస్తోంది. కొద్దిసేపటి తరువాత రోజేయర్ వచ్చాడు. అతడి ముఖంలో చిరునవ్వు కనుపిస్తోంది! "మీ ఆరోగ్యాన్ని పరీక్షించాలి!" అన్నాడు.

వెంట ఒక డాక్టరూ, ఒక వార్డరూ ఉన్నారు. రక్తపోటును పరీక్షించే యంత్రాన్ని పట్టుకువచ్చారు. చాలాసేపు పరీక్షించారు. చివరకు రోజేయర్ ఇలా ప్రకటించాడు. "మిష్టర్ యశ్‌పాల్‌కు రక్తపోటు చాలా తక్కువగా వుంది. ఈ స్థితిలో యశ్‌పాల్ కోపగించుకోవడం సహజం!" ఆ తరువాత కూడా చాలాసేపు పరీక్షించడం జరిగింది. నా ఆహారాన్ని గురించి, ఇతర విషయాల గురించి ప్రశ్నలు అడిగాడు. తరువాత అనుభవంగల ఓడాక్టర్‌లా ఇలా అన్నాడు రోజేయర! "రక్తపోటు తక్కువగా వుండడం భయపడవల్సిన జబ్బేమీకాదు ఐతే, పంచమజార్జి ఈ రోగంతోనే చనిపోయాడనుకోండి! ఐనా, ఫరవాలేదు!" ఇది జరిగాక, నన్ను వేధించడం, గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేయడం - అన్నీ బంద్ అయ్యాయి.

బరేలీజైల్లో చంద్రసింహ్ గఢవాలీ పరిచయం అయ్యాడు. 1930లో, పెషావర్‌లో ఆంగ్ల ప్రభుత్వం ప్రజలను కాల్చడానికి ఆర్డర్ ఇచ్చింది. అప్పుడు గఢవాలీ సైన్యం ప్రభుత్వ ఆర్డర్‌ని తిరస్కరించింది. ప్రజల్ని కాల్చడానికి నిరాకరించింది. ఆ సైనిక విభాగానికి హవల్దార్ చంద్రసింహ్ గఢ్‌వాలీ. ప్రజల్ని కాల్చడానికి హుకుంజారీ అయినప్పుడు, మొట్టమొదటగా ఎదురుతిరిగి, ప్రభుత్వ ఆజ్ఞను తిరస్కరించింది ఇతడే! చంద్రసింహ్‌తోపాటు ఇతడి సహఉద్యోగి మరొక సైనికుడు కూడా శిక్ష అనుభవిస్తూన్నాడు. అప్పటికే ఇద్దరూ ఆరు ఏడు సంవత్సరాల శిక్ష అనుభవించారు. కైదీజమాదార్లయ్యారు ఇతర ఖైదీల్లో ఆర్యసమాజ ఆదర్శాల్ని ప్రచారంచేస్తూండేవారు! జైల్లో స్వతంత్రంగా అటూఇటూ తిరుగుతూండేవారు. నాకు పరిచయం అయ్యాక మార్క్సిజాన్ని గురించి చెప్ప

సాగాను. మార్క్సిజంపై కొంత మొగ్గు చూపారుకూడాను! చంద్రసింహ్ గఢవాలి నన్ను 'గురు' అని పిల్చేవాడు. నేనతడిని 'సోదరా' అని పిల్చేవాణ్ణి.

బరేలీజైల్లో చౌరాచౌరీ సంఘటనలో అరెస్టయిన కాంగ్రెసు ఖైదీలు కూడా వున్నారు. వాళ్ళు నా పరిచయాన్ని, స్నేహాన్ని కోరుతూండేవారు. చౌరాచౌరీ ఖైదీలు, రాజకీయ ఖైదీలని నిరభ్యంతరంగా చెప్పవచ్చును. ఐతే, వాళ్ళను బి. క్లాసులో చేర్పించడానికి కాంగ్రెసువారు ఎన్నడూ ప్రయత్నించలేదు.

మేజర్ రోజేయర్ మారిపోయాడు. అతడి స్థానంలోకి మేజర్ మలహోత్రా వచ్చాడు. మలహోత్రా చాలా మంచివాడు. దయగలవాడు. ఐతే, తన దయను, మంచితనాన్ని కనబడనీయకుండా, కావాలని కొంత కాఠిన్యాన్ని ప్రదర్శిస్తూవుంటాడు. ఎవరైనా లేని మంచితనాన్ని ప్రదర్శించి మన్ననలు పొందచూస్తారు. ఇతడు ఉన్న మంచితనాన్ని దాచి, లేనికఠినత్వాన్ని ప్రదర్శిస్తూవుంటాడు. అప్పట్లో విలియమ్స్ అనే అతడు హెడ్‌జైలర్‌గా వుండేవాడు. అతడు ఆంగ్లో ఇండియన్. చాలానీచుడు. చాడీకోరు. ఆంగ్లగవర్నర్లూ, వైస్రాయిలూ తనకు సొంతమామలు అయినట్టు విర్రవీగుతూ వుంటాడు. మా దగ్గరకు వచ్చి "నీకెన్నేళ్ళు? నువ్వు పుట్టిన తారీకేమిటి?" అని అడుగుతూండేవాడు. ఆ తరువాత హి హి హి అని ఇకిలిస్తూ "సామ్రాట్ ఎనిమిదవ ఎడ్వర్డ పుట్టినతేదీ, నేను పుట్టిన తేదీ ఒకటే! "అనేవాడు తానూ ఎడ్వర్డ వంశస్థుడైనట్టు పోజు పెట్టేవాడు. ఈ విలియమ్స్ తనను గురించిన రహస్య రిపోర్టులు పైకి పంపించవచ్చునన్న సంశయం మేజర్ మల్హోత్రాకువుండి వుంటుంది. విప్లవకారులపట్ల సానుభూతి కనబరుస్తూన్నాడన్న రిపోర్టు పంపినా ఆశ్చర్యపడవల్సిన పని లేదు. అందువల్లనే గావును మల్హోత్రా విలియమ్స్ వెంట ఉన్నప్పుడు ఒక రకంగా ప్రవర్తించేవాడు మాతో! విలియమ్స్ ప్రక్కనలేనప్పుడు మరో రకంగా ప్రవర్తించేవాడు.

# 20. జైల్లో పెళ్ళి

ఒకనాటి సాయంత్రం. బారక్కు గేట్లు వేసేశారు. కొద్దిసేపటి తరువాత మేజర్ మల్హోత్రా పర్యవేక్షణకు మా బారక్కుకు వచ్చారు. విలియమ్స్ వెంటలేడు. ఇద్దరు వార్డర్లు మాత్రం శరీర రక్షకులుగా వెంట వచ్చారు ఇంగ్లీషులో కుశల ప్రశ్నల్ని అడిగాడు. తరువాత పంజాబీభాషలో ఇలా అడిగాడు "ఇంతకూ మిస్ ప్రకాశవతి కపూర్ ఎవరు? నువ్వు ఎరుగుదువా! ఆమెను?"

"విషయం ఏమిటో చెప్పండి!" అడిగాను.

"అప్పుడే ఎవరితోటీ అనకు! మిస్ ప్రకాశవతికపూర్, డిప్యూటీ కమీషనర్ద్వారా దరఖాస్తు పెట్టుకుంది నిన్ను జైల్లోనే పెళ్ళి చేసుకుందిట!" అని చెబుతూ మల్హోత్రా భావోద్రిక్తుడయ్యాడు. ఇలా అన్నాడు. "భగవంతుడి దయవల్ల నువ్వు విడుదల అయితే మంచిదే! కానీ, ఈమె త్యాగాన్ని చూడు! ఇలాంటి త్యాగపూరితమైన, ధార్మికభావన ఒక్క హిందూవారిలోనే చూడగలం. ప్రపంచంలో మరెక్కడా చూడలేము! నువ్వు కూడా గొప్ప దేశభక్తుడవనీ వీరుడివనీ నాకుతెల్సు! నువ్వు నీ జీవితాన్ని దేశంకోసం త్యాగంచేశావు. నువ్వు అరెస్టు అయినప్పుడు రోజూ వార్తాపత్రికల్నిచూస్తూ నీ గురించి చాలా ఆసక్తిగా తెల్సుకుంటూ వుండేవాడిని. నీ త్యాగంకంటే కూడా ఈమె త్యాగం చాలా గొప్పది. నాకు నెహ్రూ కుటుంబానికి చెందినవారూ చాలామందితెల్సు. విజయలక్ష్మి పండిట్, శ్యామ్కుమారినెహ్రూ - వీరంతరూ నాకు పరిచయులే! కానీ, ప్రకాశవతి త్యాగం అపూర్వమయింది. నిన్ను పెళ్ళిచేసుకుని ఈమె ఏమి సుఖాన్ని పొందగలదు? హిందూదేశం ఈనాటికీ బ్రతికివున్నదంటే, ఇలాంటి త్యాగమూర్తులయిన స్త్రీ రత్నాలవల్లనే బ్రతికివుంది. ఇలాంటి

త్యాగమూర్తిని దర్శనం చేసుకోబోతూన్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది!" అన్నాడు మల్హోత్రా. ఇంక నేనేం మాట్లాడను?

మరుసటిరోజు ప్రభుత్వంనుండి డిప్యూటీ కమీషనర్ ద్వారా జాబు ఒకటి వచ్చింది. దాన్ని నాకు చూపించారు. "లాహోరు నివాసి మిస్ ప్రకాశవతికపూర్, బరేలీ సెంట్రల్‌జైల్లో ఖైదీగావున్న, టెరరిస్టు యశ్‌పాల్‌ను వివాహమాడాలనుకుంటున్నది. ఖైదీయశ్‌పాల్ ఈ వివాహానికి అంగీకరిస్తాడా? అంగీకరించడా?"

నేను నా అంగీకారాన్ని తెలియపరచాను. ఆగష్టు ఏడవ తారీకున వివాహం జరగాలని నిశ్చయం అయింది.

కొద్దిరోజుల క్రితమే రమేష్ గుప్తను బరేలీ సెంట్రల్‌జైలుకు మార్చారు. అతడు నన్ను 'అన్నయ్యా' అని పిల్చేవాడు అన్నయ్య పెళ్ళికి అతడూ ఉత్సాహంగానే వున్నాడు. నా పెళ్ళి గురించి విన్న ప్రతి ఒక్కరూ మహాశ్చర్యపడిపోతున్నారు జైల్లో ఖైదీకి పెళ్ళికావడం అనేది ఇంతవరకూ ఎవరూ వినలేదు! పెళ్ళయ్యాక కొన్నాళ్ళపాటు నన్ను ఇంటికి పంపుతారనీ కొందరు అనుకున్నారు!

పెళ్ళిరోజున ఉదయం ఎనిమిది గంటలకు ఆఫీసు నుండి పిలుపు వచ్చింది. విషయం తెల్సిందేకదా! జైలు దుస్తులు, నూలుకోటుప్యాంటూ ఉతికి ఇస్త్రీ పెట్టించుకున్నాను, వాటిని వేసుకున్నాను. పెళ్ళి డిప్యూటీ కమీషనర్‌గారి ఆఫీసులో, అక్కడికి వెళ్ళాలి! జైలు ఆఫీసు గదిలోకి వెళ్ళగానే బేడీలు వేసుకోడానికి ఆర్డర్ అయింది.

"బేడీలు ఎందుకు?" నేను విస్మయాన్ని ప్రకటించాను.

"జైలు నుండి బయటకు (డిప్యూటీ కమీషనర్‌గారి ఆఫీసుకు) వెళ్తున్నావుకదా? బేడీలు వేయక తప్పదు!" సమాధానం వచ్చింది.

"కానీ, నేను పెళ్ళి చేసుకోవడానికి కదా వెళ్తున్నాను? బేడీలతో

ఎక్కడైనా పెళ్ళిచేసుకుంటారా? మీరు బేడీలు వేస్తుయితే, నేను పెళ్ళికి వెళ్ళను! పెళ్ళి అయితే అవుతుంది! కాకపోతే కాకపోతుంది!"

నన్ను కమీషనర్ ఆఫీసుకు తీసుకువెళ్ళడానికి వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్, బేడీలులేకుండా నన్ను తీసుకువెళ్ళడం అన్న బాధ్యతను నెత్తిన వేసుకోడానికి సుముఖంగా లేడు.

జైలు సూపరింటెండెంట్ మేజర్ మల్హోత్రా ఇరకాటంలోపడ్డాడు. అతడు పోలీసు సూపరింటెండెంట్‌కు ఫోన్ చేశాడు. "ఖైదీ యశ్‌పాల్ బేడీలు వేసుకుని పెళ్ళికి వెళ్ళడానికి అంగీకరించడంలేదు!" అని చెప్పాడు. ఐతే, నన్ను బేడీలు లేకుండా బయటకు పంపించడం అన్న బాధ్యతను నెత్తిన పెట్టుకోడానికి పోలీసు సూపరింటెండెంట్ కూడా సిద్ధంగాలేడు.

నేను ఎలాంటి పరిస్థితిలోనూ బేడీలతో పెళ్ళిచేసుకోడానికి సిద్ధంగా లేను. మేజర్ మల్హోత్రా ఈ పరిస్థితిని గురించి డిప్యూటీ కమీషనర్‌కు ఫోన్‌లో చెప్పాడు.

డిప్యూటీ కమీషనర్ మిస్టర్ పైడలే ఇరుకున పడ్డాడు. ఆయన జాబు ఆధారంగా ప్రకాశవతి, మా అమ్మగారు, మరి ఇద్దరు సాక్షులూ చాలా దూరాన్నుండి వచ్చారు. తన ఆఫీసులో కూర్చునివున్నారు. కమీషనర్, మల్హోత్రాతో ఇలా అన్నాడు "సూపరింటెండెంట్ వాదన, ఖైదీ వాదన - రెండు సబబైనవే! నేనే పెళ్ళికూతుర్ని తీసుకుని జైలుకు వస్తున్నాను. అక్కడే పెళ్ళి అవుతుంది!"

అనుకోకుండా సంభవించిన మరో ఇబ్బంది ఎదురైంది. ఆరోజు బరేలీలో, రిక్షావాళ్ళూ, బళ్ళవాళ్ళూ, టాక్సీవాళ్ళూ సమ్మె చేశారు! పట్టణ కాంగ్రెస్ సెక్రటరీ సంతసింగ్, మా అమ్మగార్నీ, ప్రకాశవతినీ, హిందూస్తాన్ టైమ్సు మేనేజర్ దేవీప్రసాద్‌శర్మగారినీ, శ్రీకృష్ణసూరిగారినీ - ఎలాగో కమీషనర్‌గారి ఆఫీసువరకూ తీసుకు వచ్చారు. ఇక అక్కడి నుండి జైలువరకూ వారిని తీసుకురావడం సంతసింగ్ శక్తికి మించిన

విషయం! పైడలే ఒకరకంగా ఈ సమస్యనూ పరిష్కరించారు. తన కారులో మా అమ్మగారినీ, ప్రకాశవతినీ తీసుకువచ్చారు. మిగిలిన ఇద్దరికి కూడా ఎవరిదో కారు దొరికింది! మా అమ్మగారు, ప్రకాశవతి - డిప్యూటీ కమీషనర్ కార్లో, వారితోపాటే రావడంవల్ల నలుగురూ పొరపాటుగా అభిప్రాయపడ్డారు దాన్ని గురించి తరువాత చెబుతాను.

మిస్టర్ పైడలే జైలు ఆఫీసుగదినే వివాహపుకోర్టు చేయమన్నాడు. ఆధునిక వివాహం తాలూకు తంతు ప్రారంభమయింది. ఇద్దరమూ కొన్ని ప్రతిజ్ఞలు చేశాము. డిప్యూటీ కమీషనర్ పురోహితుడయ్యాడు. మతాన్ని గురించిన ప్రశ్న వచ్చినప్పుడు ప్రకాశవతి తాను సనాతన హిందూ మతానికి చెందిన వ్యక్తినని చెప్పుకుంది. నేను మాత్రం నా మతం "రేషనలిజమ్" అన్నాను. హిందీలో దీన్ని "బుద్ధివాద్" అనవచ్చును. (తెలుగులోనూ 'బుద్ధివాదం, అంటే సరిపోతుందేమో! ॥అను॥)

మిస్టర్ పైడిలే ఇలా అన్నాడు. "ఈ కొత్త 'ఇజాన్ని' ఎన్నడూ వినలేదు నాస్తికుడని రాయమంటావా? లేక బౌద్ధుడని రాయమంటావా!"

"అలా రాయకద్దు! నేను చెప్పినట్టే రాయండి!" అన్నాను.

మిస్టర్ పైడలే విసుక్కుంటూ 'రేషనలిజమ్' అనే రాశాడు. కోర్టు ఫీజు రూపాయిపావులా అడిగి పుచ్చుకున్నాడు ప్రకాశవతి తరపున దేవీ ప్రసాద్‌శర్మ, శ్రీకృష్ణసూరి సాక్షి సంతకాలు చేశారు. నా తరపున రమేష్ చంద్రగుప్త, మేజర్ మల్హోత్రా సంతకాలు చేశారు సూరి వస్తూ ఐదారుసేర్ల మిఠాయి పట్టుకువచ్చాడు. దాన్ని అందరికీ పంచారు. జైల్లో ఎన్నడూజరగని వింత జరిగింది! వివాహసందర్భంగా మాఅమ్మగారితోటీ, ప్రకాశవతితోటి - ఇతరుల్తోటీ సరదాగా మాట్లాడుకోడానికి ఒక గంట అవకాశాన్ని ఇచ్చాడు మల్హోత్రా! గంట తరువాత వాళ్ళు జైలుగోడలకు అటు, నేను ఇటు!

వివాహం అయ్యాక, రెండవ రోజునో, మూడవరోజునో - సి. క్లాసు రాజకీయ ఖైదీలు నాకో పెద్ద పుత్తరాన్ని రహస్యంగా పంపించారు. ఒక తావునిండా పెన్సిల్‌తో రాసి వుందా జాబు! ఆ జాబులోని విషయం ఇలా వుంది. "విప్లవకారులైన మీరు ఇలా ప్రవర్తించినందుకు మేము చాలా బాధపడుతూన్నాము. విప్లవకారుల పేరును కళంకితం చేయకండి! జైలునుండి విడుదల కావడంకోసం మీరు ఆంగ్లేయుడైన డిప్యూటీ కమీషనర్ కూతుర్ని వివాహమాడారు. చాలామంది రాజకీయ ఖైదీలు సి. క్లాసులో, జన్మఖైదును అనుభవిస్తున్నారు. మీరు సుఖమైన బి. క్లాసులో వుంటూ కూడా ఇలాంటి పనిచేసినందుకు చాలా బాధపడుతూన్నాము. ఈ మాత్రం కష్టాన్ని కూడా భరించలేరా మీరు?... ..."

జైలువార్డర్లు కొంత సమాచారాన్ని ఇచ్చారు. జైలు వివిధబ్లాకుల్లో వుండే ఖైదీలు మా వివాహాన్నిగురించి రకరకాలుగా చెప్పుకుంటున్నారట ఆంగ్లేయుడైన కమీషనర్ తన కూతుర్ని. చీరకట్టించి తీసుకువచ్చి, నాకు ఇచ్చి పెళ్ళిచేశాడని చెప్పుకోసాగారు. ప్రభుత్వమూ, నేనూ ఒకఒప్పందానికివచ్చామనీ, ఇంకనన్ను వదలిపెడతారని చెప్పుకుంటున్నారు. ఇలాంటి అపోహలకూ, అపవాదులకూ కారణం స్పష్టమే! టాంగాలూ, ఇతర వాహనాలూ సమ్మెలో వుండడంవల్ల ప్రకాశవతి కమీషనర్ కార్లో జైలు వరకూవచ్చింది. అదే ఈ అపవాదులకు కారణం! పంజాబీ స్త్రీలు మామూలుగానే పసిమిగావుంటారు పెళ్ళికోసం ప్రత్యేకం పౌడరుకొట్టివుంటుంది. దాంతో ఖైదీలు ప్రకాశవతిని ఆంగ్లవనిత అనుకున్నారు!

జైల్లో పెళ్ళిజరగడం గురించి ప్రభుత్వదృష్టికి ఎక్కింది. ఏసరదాలూ, సంస్కారాలులేని ఆపెళ్ళి, నీరసమైన కాగితాలమీద పెళ్ళిగానే జరిగింది. అయినా, ప్రభుత్వపు కన్నెర్రకు కారణం అయింది. ఈపెళ్ళి వల్ల జైలుయొక్క భయంకరత్వం కొంత తగ్గుతుందని ప్రభుత్వానికి భయం!

సచివాలయంనుంచి ఎక్వయిరీ ప్రారంభమైంది జైల్లో పెళ్ళెలా జరిగింది? ఎందుకుజరిగింది? మల్హోత్రాని ప్రశ్నించారు అతడునిర్భయంగా "వివాహం డిప్యూటీకమీషనర్ ఆజ్ఞతో, అనుమతితో జరిగింది। వివాహం జరిగినగది డిప్యూటీకమీషనర్‌గారి కచేరీగా మార్చబడింది మరి అప్పుడు ఆ ప్రదేశం జైలు సూపరింటెండెంట్‌నయిన, నా ఆధీనంలోలేదు. నేను అప్పుడు అక్కడ కేవలం ప్రేక్షకమాత్రుడిగానే వున్నాను. జైలుమాన్యుయల్‌లో, జైలులో పెళ్ళి జరగరాదన్న నిషేధంగానీ, జరగవచ్చునన్న అనుమతిగానీ-రెండూలేవు. కనుక ఈ విషయంలో నిర్ణయంతీసుకునే బాధ్యత కమీషనర్‌గారికే వదిలివేశాను। నాబాధ్యత ఏమీలేదు" అని చెప్పేశాడు.

జైల్లో వివాహం జరగడం అన్న సమస్య అంతటితో ఆగిపోలేదు. డిప్యూటీకమీషనర్ మిస్టర పైడలేనీ సంజాయిషీ అడిగారు. 'జైల్లో ఖైదీ వివాహానికి ఎలా అనుమతించారని?', ప్రశ్నించారు. బ్రిటీష్ ఆఫీసర్లు భారతీయ ఆఫీర్లలా పిరికివాళ్ళుకాదు పైడలే ఇలా సమాధానం ఇచ్చాడు. "జైలు నియమాల్లోగానీ, ఆనూచానంగావస్తున్న అనుభవాల్నిబట్టి గానీ-ఖైదీకి పెళ్ళిజరగరాదనిగానీ, లేక జైల్లో ఖైదీకి పెళ్ళి జరగరాదనిగాని-స్పష్టమైనఆదేశాలు ఎక్కడాలేవు. మిస్‌ప్రకాశవతి, ఖైదీ యశ్‌పాల్‌ని వివాహము చేసుకుంటానని దరఖాస్తు పంపుకుంది ఆమెదరఖాస్తు కాదనడానికి నాకేమీ కారణం కనుపించలేదు. కనుక, అనుమతిని ఇచ్చాను"

ఇదిజరిగిన కొద్దినెల్లకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ హోంమెంబరు సర్ మహారాజసింహ్ బరేలిజైల్ను చూడడానికివచ్చాడు. ఆయనగారి దర్శన భాగ్యం నాకూకలిగింది. వారు నాపరిచయాన్ని ఇచ్చారు.

సర్ మహారాజసింహ్ ఇలా అన్నాడు "నిన్ను జైల్లోవుంచడంవల్ల మాకు ఎదోఒక తలనొప్పివ్యవహారాన్ని తెచ్చిపెడుతూనేవున్నావు। జైల్లో పెళ్ళి చేసుకోవడంవల్ల నీకు ఏమిప్రయోజనం జరిగింది? మాకు కొత్త సమస్యను తెచ్చిపెట్టావు"

"మీరు చూస్తునేవున్నారుగదా? నాకేమీ ప్రత్యేకమైన ప్రయోజనం జరగలేదు. నేను మీ ప్రభుత్వబోనులో బంధింపబడివున్నాను. ప్రభుత్వ అనుమతీ, ప్రభుత్వ ఆఫీసర్ల అనుమతితోనేకదా, జరిగిందీపెళ్ళి!" అన్నాను.

మహారాజసింహ "నీకు ప్రయోజనం జరిగినా జరక్కపోయినా, మాకు మాత్రం తలనొప్పి అయికూచుంది. జైలు మాన్యుయల్‌లో 'ఖైదీకి జైల్లో వివాహంజరగరాదన్న' కొత్తనియమాన్ని ఒకదాన్ని చేర్చవలసి వచ్చింది!" అన్నాడు.

నేను నవ్వేశాను "పోనీయండి! ఒక అద్భుతంజరిగింది. ఇలాంటిది గతంలో జరగనూలేదు. భవిష్యత్తులో జరగనూబోదు!" అన్నాను.

ఈ వివాహంవల్ల నాకు తక్షణప్రయోజనం ఏమీలేకపోయినా, బ్రిటీష్ ప్రభుత్వపు నియమనిబంధనల గురించి ఉదాహరణ లభిస్తుంది!

# 21. జైల్లో అధ్యయనం

1933-34 సంవత్సరాల్లో గాంధీగారు సత్యాగ్రహానికి బాగా పదును పెట్టారు. కొందరు ముఖ్యులైన సత్యాగ్రహులతో సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించారు. ఐనా, వారి సత్యాగ్రహకార్యక్రమం అపజయాన్నే చవిచూసింది. 1934లో గాంధీగారు తన సత్యాగ్రహం అపజయాన్ని పొందడానికి ఓ ఆధ్యాత్మిక కారణాన్ని కనిపెట్టారు ఆ కారణాన్ని ప్రకటిస్తూ గాంధీజీ ఇలాఅన్నారు. "సత్యాగ్రహ తాలూకు పవిత్రమైన ఆధ్యాత్మిక సందేశం, అపవిత్రమైన ఆధునిక యంత్రాలద్వారా ప్రజలకందించడంవల్ల, ఆసందేశంలోని బలం చచ్చిపోతుంది।"

కాంగ్రేసు నాయకులు ఎన్నికలనే నియమబద్ధ పోరాటాన్నే ఎంచుకున్నారు. ఎన్నికల్ని తిరస్కరించి, బ్రిటీష్‌ప్రభుత్వంతో బాహాబాహీగా సాయుధపోరాటాన్ని సాగించటమంటే, బ్రిటీష్‌ప్రభుత్వపు నియమబద్ధతను తిరస్కరించడమౌతుంది. అంటే, గాంధీగారి దృష్టిలో హింసాత్మకత అవుతుంది। గాంధీగారూ, పటేల్‌గారూ మొదలుగాగల ఇతర నాయకులు ఒకనిర్ణయానికి, లేక బడంబడికకువచ్చారు. గాంధీగారు కాంగ్రేసు సభ్యత్వానికి రాజీనామాఇచ్చారు. కాంగ్రేసునాయకులు, భవిష్యత్తులో పరిస్థితులు అనుకూలిస్తే, గాంధీజీ అనుశాసనంలో ఉద్యమాన్ని పునరుజ్జీవంపచేయాలని నిర్ణయించుకున్నారు. అప్పటివరకూ ఎన్నికల్లో పాల్గొనడమే తమ కార్యక్రమమని నాయకులు ప్రకటించారు. 1935 శాసనాన్ని అనుసరించి విధానసభ అధికారాల్ని, ఎన్నికైన మంత్రుల అధికారాల్ని బాగావిస్తృతం చేయడంజరిగింది. ఐతే, గవర్నర్లకూ, వైస్రాయికీమంత్రులకార్యకలాపాల్లో జోక్యంకలిగించుకోడానికి పూర్తి అవకాశాన్ని ఇచ్చారు. తమ కార్యకలాపాలపై గవర్నర్లకూ, వైస్రాయికీ పూర్తి పట్టువుంటుదని తెలిసే, కాంగ్రేసు నాయకులు ఎన్నికల్లో పాల్గొన్నారు. ప్రజాభిప్రాయం కాంగ్రే

సుకు అనుకూలంగా వుంది. విధానసభలకు కాంగ్రెసువారు పెద్దసంఖ్యలో ఎన్నిక అయ్యారు.

ఎన్నిక అయిన కాంగ్రెసువారు మంత్రివర్గాల నిర్మాణం చేయవలసిన తరుణం ఆసన్నమైంది. 'గవర్నర్లూ, వైస్రాయీ మంత్రివర్గకార్యక్రమాల్లో అతితక్కువగా జోక్యంచేసుకుంటామని మాట ఇవ్వవల్సిందని' కాంగ్రెసునాయకులు అడుగుతున్నారు 'అలా మాట ఇచ్చేవరకూ మంత్రివర్గనిర్మాణాన్ని చేయం' అంటున్నారు కాంగ్రెసువారు. కాంగ్రెసువార్ని బ్రిటీష్ ప్రభుత్వం పూర్తిగా తృణీకరించేస్థితిలోలేదు. ఎందుకంటే అలా చేస్తే అడుగడుగునా అవిశ్వాసతీర్మానాల్ని ఎదుర్కోవలసివస్తుంది. ఈ పరిస్థితుల ప్రభావం జైళ్ళమీదాపడ్డది. విప్లవకారులైన ఖైదీలు చాలా రోజులుగా 'విప్లవకారులైన ఖైదీలందర్నీ ఒకేజైల్లో వుంచవల్సిందని' అడుగుతున్నారు

1937 మార్చినెల అనుకుంటాను. ఒకరోజుఉదయం సమాచారం అందింది. రమేశ్‌చంద్రగుప్తనీ, నన్నూ నైనీ సెంట్రల్‌జైలుకు మారుస్తున్నారనితెల్సింది. అక్కడే విప్లవకారులైన ఖైదీలందర్నీ వుంచుతారనీ తెల్సింది.

నేనూ రమేశ్‌చంద్రగుప్త - పులకితహృదయంతో స్టేషన్‌నుండి నైనీజైలుకు వెళ్ళాము. జైల్లో విప్లవపార్టీయొక్క అతిరథులూ, మహారథులూ ఐన నాయకుల్ని కల్సుకోబోతున్నామన్న భావన మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది! శచీంద్రనాధ్‌సన్యాల్, యోగేశ్‌చంద్రచటర్జీ-వీరిని గురించి విన్నాం! కల్సుకునేఅవకాశం దొరకలేదు. వీరిని ఎన్నడూచూడకపోయినా వీరిపట్ల మాహృదయాల్లో గొప్పశ్రద్ధవుంది. వీరినిగురించి కథలూ, గాథలూ మామీద ఎంతగానో ప్రభావాన్నివేశాయి. సన్యాల్‌దాదా రాసిన 'బందీ-జీవన్' అనే పుస్తకం సాయుధపోరాటంలో మాకు పాఠ్యగ్రంథంగా పనిచేసింది.

ఓ పెద్దయార్డులో రెండు బారక్కులున్నాయి. నేనూ, రమేశ్‌చంద్ర గుప్త ఆ యార్డులోకి వెళ్ళినప్పుడు యార్డ్ అంతా నిర్మానుష్యంగాఉంది. మేమేముందుగా వచ్చాం. ఆతరువాతరోజుకు ఇద్దరూ, ముగ్గురూచొప్పున విప్లవకారులైన ఖైదీలురాసాగారు. బారక్కు నిండిపోయింది శచీంద్రసన్యాల్, యోగేష్‌చటర్జీ, శచీంద్రబక్షీ, మన్మథనాథ్‌గుప్త, ముకుందీలాల్ వీళ్ళందరూ కాకోరీకుట్రకేసు ఖైదీలు వీరుకాక సువిమల్‌కుమార్‌రాయ్, శంభూనాథ్, బల్‌రాజ్, రాజేంద్రనిగమ్ మొదలైన వివిధకేసులకూ సంబంధించినఖైదీలూవచ్చారు. కాశీరామ్, నేనూ హి.స.ప్ర.స సభ్యులం. కమ్యూనిస్టుపార్టీ సభ్యులు శివసింహ్‌కూడా వచ్చాడు. కాన్పూరుకు చెందిన మజ్దూర్ సభ కార్యకర్త కూడా ఒకతనువచ్చాడు. బారక్కుఅంతాఒకచే సందడి.

వీరంతా బాగా అనుభవంగలవారు! ఇలా అనుభవజ్ఞులైనటువంటి విప్లవకారులందర్నీ ఒకచోట చేర్చడంవల్ల విప్లవకారుల సంఘటితశక్తి పెరుగుతుంది. కలిసికట్టుగా అధికారులదౌర్జన్యాన్ని ఎదిరించడమూ జరుగుతుంది. ఈసుగుణంతోపాటు ఒకదుర్గుణమూ అంటిపెట్టుకొనిఉంటుంది. పరస్పరం కీచులాడుకోవడం చిన్నచిన్న విషయాల క్కూడా వంతాలక్కూ పట్టింపులకూ పోవడం జరుగుతుంది. కనుకనే, మేమందరం ఏమాత్రమూ, కాలాన్ని వృధాపోనివ్వకుండా చూసుకున్నాం. సామూహిక అధ్యయనాన్ని ప్రారంభించాము. కొన్ని నియమాలను ఏర్పరచుకున్నాము. మాలో ఎవరేగాని జైలు అధికారుల్తో వ్యక్తిగత సంబంధాలను పెట్టుకోగూడదు. వ్యక్తిగతంగా జైలు అధికారుల్ని ఏమీ అడగరాదు. ప్రతిఒక్క విషయమూబారక్కులోని అందరి తరఫునా సమిష్టిగా జరగవలసిందే! మా అందరి తరఫునా నన్ను నాయకుడిగా ఎన్నుకోవటం జరిగింది. నాయకుడన్నవాడు కొంతవరకు న్యాయమూర్తిగా కూడా వ్యవహరించవలసి ఉంటుంది. అక్కడికొచ్చిన విప్లవకారులందరూ అతిరథ

మహారధులు వాళ్ళకు సలహాదారుగాగాని, నాయకుడిగాగాని ఉండగలగటం తేలికైన పనికాదు. అలాంటి బాధ్యతను మిత్రులందరి సలహా, సంప్ర దింపుల్తోనే నిర్విహించగలుగుతాను.

నాకంటే ఎంతో అనుభవంగల మిత్రుల మధ్య ఉంటూ 'నేను గొప్పవాణ్ణి మేధావిని. కనుకే నన్ను నాయకుడిగా ఎన్నుకున్నారు' అను కోవడం గొప్ప మూర్ఖత్వం ఔతుంది. సన్యాల్‌దాదా బెంగాల్‌కు చెందిన 'అనుశీలన్' అనే విప్లవ సంఘానికి నాయకుడు. యోగేష్‌దాదా 'యుగాం తర్' పార్టీ నాయకుడు ఈరెండు సంఘాలకూ ఎప్పుడూ పోటాపోటీగా ఉండేది ఆపోటీ భావన వీరి వ్యక్తిగత ప్రవర్తనలోనూ, వీరి రాజకీయ సిద్ధాంతాల్లోనూ తాత్విక భావనల్లో కూడా కొంత వ్యక్తం అవుతూండేది।

సన్యాల్‌దాదా ఆధ్యాత్మవాది. భక్తితత్వంకంటే గాంధీగారి ఆధ్యా త్మవాదానికి వీరి భావాలు దగ్గరగావుంటావు. ఇంకా వివరంగా చెప్పా లంటే ఆధ్యాత్మికంగా అరవిందుడి అనుయాయి, సన్యాల్‌దాదా। వీరు 'భారతదేశానికి ఆధ్యాత్మనిర్దేశితమైన ప్రజాతంత్రం సరిపడుతుందం'టారు. యోగేశ్‌దాదా అలా కాదు మార్క్సిజంవైపు మొగ్గుచూపుతారు. వెనకా యోగేశ్‌దాదా మార్క్సిజాన్నిచదివాడు జైల్లోకూడాబాగా అధ్యయనంచేశాడు. మిగిలిన వాళ్ళల్లో ఎవరూ కూడా ఆధ్యాత్మవాదాన్నీ, ఆదర్శవాదాన్నీ- అంగీకరించరు మేమందరం కల్సివుండడంవల్ల ఒకరి భావాల్ని మరొ కరు తెల్సుకోవడానికి, మంచి మంచి గ్రంధాలను అధ్యయనం చేయడానికి అవకాశం దొరికింది. సాహిత్య గోష్ఠుల్నా జరుపుతూండేవారం భావాల పరిణతకూ, ప్రగతికీ - ఇవి ఎంతగానో తోడ్పడేవి. నేను, ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైల్లో రాసిన కొన్ని కధల్ని మిత్రులు అడగగా చదివి విని పించాను. సన్యాల్‌దాదా, యోగేశ్‌దాదా, బక్షి, మన్మధనాథ్‌గుప్త-వాటిని విన్నారు. చాలా బాగున్నాయని మెచ్చుకున్నారు. నాకు ధైర్యం వచ్చింది. ఫతేహ్‌గఢ్ జైల్లో ఉన్నప్పుడూసాహిత్యకమైన వాదోపవాదాలు జరుగు

తూండేవి. అప్పటికే మన్మధనాథ్ ఇంగ్లీషులోనూ కవిత్వాల్ని కథల్ని రాస్తూండేవాడు నేను హిందీలో మాత్రమే రాసేవాణ్ణి: ఒకమాటు అన టోల్ ఫ్రాన్సు రాసిన ఒక గ్రంథంలోని ఒక పేరాను మన్మథ్‌కు చూపించాను. ఆ పుస్తకం ప్రపంచి పుస్తకం. నేను చూపించిన పేరా చాలా గొప్పగా వుంది. మన్మథనాథ్ ఆ పేరాను చదివాడు. విషయం దృష్ట్యానూ, భాష దృష్ట్యానూ చాలా గొప్పగా వుందని పొగడాడు నేను ఇలా అన్నాను. "బెంగాలీ భాషలోగానీ, హిందీలోగానీ - ఇదే పేరాను ఇంతకంటే గొప్పగా అనువాదం చేయాలి:"

మన్మథ్ ఇలా అన్నాడు "అసంభవం: అనువాదం ఇంతకంటే బాగా ఎన్నటికీ రాదు. ఎంత గొప్పగా చేసినా, అనువాదం అనువాదమే:"

నేను మౌనంగా ఆ పేరాను హిందీలోకి అనువాదం చేశాను. మన్మథనాథ్‌తో ఇలా అన్నాను. "ప్రపంచి మూలాన్ని మరొకమాటు చదువు, నేను చేసిన ఈ అనువాదాన్ని కూడా చదువు. తప్పు ఏమిటో చెప్పు. బాగుండకపోతే మరోమాటు ప్రయత్నిస్తాను:"

విమర్శనాత్మకదృష్టితో మన్మథ్‌నాథ్ మూలాన్ని, నా అనువాదాన్ని కూడా ఒకటిరెండుమార్లు చదివాడు తరువాత ఇలా అన్నాడు "మూలం కంటే కూడా అనువాదం సరసంగావుంది''.

ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి మెజారిటీని సంపాదించింది. కాంగ్రెస్ మంత్రులు పదవుల్ని స్వీకరించాక త్వరలో మేము విడుదల కావచ్చునన్న ఆలోచన బలమైంది. అప్పుడు అక్కడున్న మేమందరమూ విడుదల అయ్యాక తిరిగి మా ఆదర్శంకోసం పోరాటాన్ని చేపట్టాలన్న నిర్ణయాన్ని చేసుకున్నాం. మా లక్ష్యాన్ని గురించి కూడా స్పష్టమైన అవగాహనకు వచ్చాము కాకోరీ మిత్రులు అరెస్టయ్యాక, తిరిగి విప్లవసంఘాన్ని పునరుజ్జీవింపజేసిన భగత్‌సింగ్ మొదలైనవారు విప్లవసంఘం పేరులో సామ్యవాదం అన్న శబ్దాన్ని జోడించారు. ఈ శబ్దాన్ని జోడించడం యాదృచికం

కాదు. కావాలనే సామ్యవాదం అన్న శబ్దాన్ని చేర్చేరు. అప్పుడు నైనీ సెంట్రల్ జైలులోని మిత్రుల్లో కేవలమూ సన్యాల్‌దాదా ఒక్కరికి సామ్యవాదమన్న శబ్దాన్ని చేర్చటం అంతగా ఉపయోగకరం కాదనిపించింది. సన్యాల్‌దాదాకు సామ్యవాద సమాజంపట్లగాని, వ్యవస్థపట్లగాని, విరసన లేదు. సామ్యవాద సిద్ధాంతం కేవలం భౌతికవాదంమీద ఆధారపడడమే వారికి నచ్చదు. సన్యాల్‌దాదాకు ఆధ్యాత్మిక సమాజంమీద మక్కువ ఎక్కువ. ఐతే, ఆధ్యాత్మిక సమాజవాదం అనేది ఎక్కడా ఇంతవరకూ ప్రామాణికతను పొందలేదు. అది ఒట్టి కల్పన మాత్రమే. మిగిలిన మిత్రులందరూ మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాన్ని నిర్ద్వంద్వంగా అంగీకరించారు. మేము క్రమంగా మార్క్స్ చెప్పిన గతితార్కిక భౌతికవాదం ఆదర్శంగా పరిఢవిల్లుతున్న సామాజిక ఆర్థిక తత్వాలను అవగతం చేసుకోసాగాము. హిందుస్థాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘ సభ్యులందరూ దాదాపుగా మార్క్స్ ప్రవచించిన గతితార్కిక భౌతికవాదాన్ని అంగీకరించారు. అండమాన్ దీవిలోని జైల్లో మా సంఘ సభ్యులందరూ మొత్తంగా మార్క్సిజాన్ని స్వీకరించారు.

నైనీజైల్లో మేమందరమూ స్పష్టమైన కార్యక్రమాన్ని నిర్ణయించుకున్నాము. ఉదయం ఫలాహారమయ్యాక క్లాసులు జరుపుకునే వారము. ఏదో ఒక విషయాన్ని గురించిన అధ్యయనాన్ని సాగించేవారము. ఈ అధ్యయన తరగతుల్లో యోగేశ్‌దాదా చాలా ఉత్సాహంగా పాల్గొనేవారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజనం, విశ్రాంతి. తిరిగి మూడు గంటలకు టీతాగి అధ్యయనానికి కూర్చొనేవారం. సాయంకాలం వాలీబాల్‌గానీ, బాడ్‌మెంటన్‌గాని ఆడేవారం. అది కొంత వ్యాయామంగా ఉండేది. రాత్రిపూట ఎవరికివారు చదువుకునేవారు. పగలు అర్థశాస్త్రం, వేదాంతం

రాజకీయం, మొదలైన విషయాల గురించి సామూహిక అధ్యయనం సాగేది. రాత్రిపూట సాహిత్య గ్రంథాల్ని చదువుకునేవారం.

మిత్రుడు శివసింహ్ అధ్యయన తరగతులు క్రమంగా సాగటానికి సహాకరించేవాడు. అతడు ఏ విప్లవ సంఘానికీ చెందినవాడుకాదు. ఐన ప్పటికీ అతని జీవితం అద్భుతమైన, విచిత్రమైన ఘటనలతో నిండి ఉంది. యువకత్వంలో సిక్కు మతాన్ని ప్రచారం చేయడానికి బర్మా వెళ్ళి పోయాడు. బర్మా నుండి సింగపూరు, మలయామీదుగా ఆస్ట్రేలియా వెళ్ళాడు. అక్కడ నుంచి అమెరికా వెళ్ళాడు. అమెరికాలోనే అతడు కమ్యూనిజాన్ని అధ్యయనంచేశాడు. అమెరికానుండి స్పెయిన్, ఫ్రాన్స్ జర్మనీ మొదలైన దేశాలు వెళ్ళాడు. తరువాత రష్యావెళ్ళాడు. రష్యాలో రెండు సంవత్సరాలు ఉండి కమ్యూనిజాన్ని గురించి బాగా చదివాడు. కొన్నాళ్ళు కార్మికుడిగా జీవితాన్ని గడిపాడు అక్కడ. అక్కడ నుండి టర్కీ, ఇరాన్ మీదుగా భారతదేశం వచ్చాడు. కనుకనే మా అధ్యయన తరగతులకు శివసింహ్ అధ్యాపకుడయ్యాడు.

ఈ అధ్యయన క్లాసులకు విధిగా అందరూ హాజరు అవాలన్న నియమమూలేదు. అందరూ హాజరు అయ్యేవారూకాదు. సన్యాల్‌దాదా ఈ అధ్యయనమే అనవసరం అనుకునేవారు. కొందరు మిత్రులు పెద్దగా చదువుకోకేపోవడంవల్ల ఈతరగతుల్లో పాల్గొనలేకపోయేవారు. మరి కొంద రికి ఈ తరగతులపట్ల ఆసక్తిలేదు. అలాంటి వారిలో సువిశాల్‌కుమార్ రాయ్ ఒకడు। ఇతడు బారక్కుకు సంబంధించిన వంటా-వార్పు బాధ్య తల్ని స్వీకరించాడు. కొద్ది మాంసాన్ని సన్నని ముక్కలుగా తొరిగి వాటిని నాలుగయిదు పిల్లులకు వేస్తూ, వాటిలోవాటికి పోరాటంపెడుతూ కాలం వెళ్ళబుచ్చుతూండేవాడు. అలా చేయడం అతడికోసరదా। 'స్టేట్స మెన్, పత్రిక నొక్కదాన్ని మాత్రం చదివేవాడు. 'స్టేట్సమెన్' రాగానే మొదట అతడికి ఇవ్వకపోతే, బిక్కముఖం వేసేవాడు. అందులోనూ,

ఒకే ఒక విషయాన్ని చూసేవాడు రైల్వేటైంటేబుల్‌లో ఏమైనా, మార్పు జరిగిందేమో చూసుకునేవాడు. సువిమలకుమార్‌రాయ్ కొన్ని సంవత్సరాలుగా అలా చూస్తున్నాడు. అతడు ఇలా అంటాడు. "మనకు తెలియని ఏకారణంవల్లనైనా, ఏక్షణాన్నయినా విడుదలకావచ్చుకదా? రైల్వేటైంటేబుల్ తెలియకపోతే, తక్షణంబనారస్‌వెళ్ళే బండిని అందుకోలేంకదా?"

సువిమల్‌కుమార్‌రాయ్, తనకు విప్లవకార్యక్రమాలతోగానీ, రాజకీయాల్తోగానీ ఎలాంటి సంబంధమూలేదని స్పష్టంగా చెప్పేవాడు. ఇతడి చెల్లెలు విప్లవకారులపట్ల సానుభూతికలిగి వుండేది. విప్లవకారులకు సహాయ, సహకారాల్ని అందిస్తూవుండేది. ఆ విషయం ఇతడికి బొత్తిగా తెలియదు ఒకరోజున ఇతడికి తెలియకుండానే చెల్లెలు ఒకబాంబునుతెచ్చి ఇంట్లోపెట్టింది. అనుకోకుండా ఆబాంబుపేలింది. చెల్లెల్ని అరెస్టుచేసే పరిస్థితి ఏర్పడింది. చెల్లెలు అరెస్టయితే, కుటుంబగౌరవం ఏమయ్యేట్టు? 'తానే పరారైపోతే పోలీసులు తననే వెదుకుతారుకదా? అపరాధం తన మీదకేవస్తుంది. పోలీసులు తననే అరెస్టుచేస్తారు' ఇలా ఆలోచించి సువిమల్‌కుమార్‌రాయ్ పరారయ్యాడు. మర్నాడే పోలీసులకులొంగిపోయాడు. రహస్యజీవితంలో సువిమల్‌రాయ్‌ని అన్నింటికంటే ఎక్కువగా బాధించిన విషయం, 'రెంటికిఎక్కడవెళ్ళడం?' అనేది। తమపల్లెలో, పట్నంలోని బంధువులఇళ్ళుకాక, మరోచోటికి ఎన్నడూ వెళ్ళిఎరగడు। పల్లెల్లో ఎన్నడూ వుండలేదు. ఆరుబయట ప్రదేశానికి చెంబుపట్టుకువెళ్ళడం అసలు తెలియదు ఆరుబయటప్రదేశంలోనో, చేలల్లోనో కూచుంటే గడ్డి, గాదం, మోళ్ళు పిర్రలకు గుచ్చుకుంటూవుంటాయి. మొదటిరోజు ఓచెట్టు కొమ్మమీద కూర్చుని బాధను నివృత్తి చేసుకున్నాడు. రోజూ అలాకూచోడానికి ధైర్యంచాల్లేదు. క్రిందపడతానన్నభయం వేధించసాగింది। ఇక లాభంలేదనుకుని పోలీసులకు తననుతాను వప్పచెప్పుకున్నాడు. ఎన్నిబాధలుపడ్డా మధ్యతరగతి గౌరవపీయకుటుంబ ప్రీ గౌరవాన్ని బజారుపాలు

కానీయలేదు. ఏడుసంవత్సరాల జైలుజీవితాన్ని అనుభవించాడు. దీన్ని పిరికితనం అందామా? కాక, సాహసం అందామా? దేశంకోసం, స్వాతంత్ర్యంకోసం మేముపడ్డంత శ్రమా, సువిమల్‌కుమార్‌రాయ్ మధ్యతరగతి గౌరవనీయకుటుంబ స్త్రీ గౌరవాన్ని అక్షుణ్ణంగా వుంచడానికి తనుపడుతున్నాడు. మరోవైపున పండిట్ జవహర్‌లాల్‌భార్యా, సోదరిలాంటి స్త్రీలు ఢంకాబజాయించి జైళ్ళకు వెళుతున్నారు!

# 22. విడుదలకు ఆటంకాలు

1937 జులై నెల. వైస్రాయి, గవర్నర్లు, కాంగ్రెసువారికి హామీ ఇచ్చారు. పరిపాలనా సంబంధమైన వ్యవహారాల్లో దాదాపుగా కలుగచేసుకోమనే అన్నారు. పదకొండు ప్రాంతాల్లో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పడ్డాయి. ఎన్నికల్లో కాంగ్రెసువారు ప్రజలముందుంచిన ప్రణాళికలో రాజకీయఖైదీలందర్నీ,–విప్లవకారుల్తోసహా, విడుదలచేస్తామన్నారు. సత్యాగ్రహోద్యమంలో అరెస్టయిన ఖైదీలందరూ విడుదలై వెళ్ళిపోయారు. మమ్మల్నీ విడుదలచేస్తారనుకుంటున్నాము. ఇంతలో ఇద్దరుమిత్రులు అంమాంతంగా అమరవీరులయిపోవాలనుకున్నారు! అందర్నీ విడుదల చేయకపోతే, ఆమరణ నిరాహారదీక్ష పూనుతున్నాం, అని ప్రకటించారా ఇద్దరు మిత్రులు. దాదాపు అప్పుడు జైల్లోవున్న మిత్రులందరికీ వీరి ఈ 'నిరాహారదీక్ష' అనవసరమైనదనిపించింది.

బారక్కు నాయకుడిగా నేను బాగా ఇరకాటంలోపడ్డాను. 'నిరాహార దీక్ష సాగిస్తున్న మిత్రులకూ, మాకూ ఎలాంటి సంబంధమూ లేదు'. అని చెప్పడమూ కష్టమే! కాక, నిరశనవ్రతాన్ని సమర్థిస్తున్నామనడమూ బాధాకరమే! మరో ఇబ్బందికూడా ఎదురయింది. అప్పుడునైనీజైలు సూపరింటెండెంట్ మేజర్ భండారి. విప్లవకారులు ఏదైనా పొరపాటుగానీచేస్తే, దాన్ని ఆసరగాతీసుకుని కొత్తప్రభుత్వంనుండి మెప్పుకోలుపొందాలని చూస్తున్నాడతడు! ఐతే, అతడిపప్పులుడికేట్టులేవు. విధానసభసభ్యుల్లో అత్యధికులకు విప్లవకారుల్తో వ్యక్తిగతపరిచయాలు వున్నాయి. భండారి ఆటలుసాగటంలేదు.

కాకోరీకేసుఖైదీ రామకృష్ణఖత్రి తన శిక్షనుపూర్తిచేసుకుని విడుదలయ్యాడు. అతడు ఇతరవిప్లవకారుల్ని విడిపించడంకోసం మంత్రుల చుట్టూప్రదక్షిణలు చేస్తున్నాడు. జైల్లోకివచ్చి మాకుధైర్యం ఇస్తుండేవాడు.

కాంగ్రెసుప్రభుత్వంవల్ల వచ్చిన కొత్త మార్పుల్నిగురించి చెప్తుండేవాడు. విధానసభ, సచివాలయంలో ఖద్దరుగుడ్డలకూ, టోపీలకూ మంచిపలుకుబడి ఏర్పడ్డదనిచెప్పేవాడు! డ్యూటీలోవుండే ఇంగ్లీషు సార్జంట్లు మంత్రుల ముఖాల్ని, నాయకులముఖాల్ని పోల్చుకోలేకపోయేవారు ఖద్దరుదుస్తు వేసుకుని, ఖద్దరుటోపీ పెట్టుకునివెళ్ళేవాడు. డ్యూటీలోవున్న ఆంగ్లసార్జెంట్ సిగ్గరసిలిగి, మడమకు మడమ ఫట్‌న టాకించుకుని శాల్యూట్ చేసేవాడుట!

రామకృష్ణశాస్త్రిచెప్పే పై మాటల్ని వింటుండే యువఖైదీలు పొంగిపోయేవారు ఇంకేంకావాలి?

అగస్టునెల సూపరింటెండెంట్ దగ్గర్నుండి వార్డర్ వరకూ అందరూ హుషారుగా ఉన్నారు. కొత్తడ్రస్సు వేసుకున్నారు. హడావిడిగా ఉన్నారు. కారణం ముఖ్యమంత్రి రాబోతున్నారు. మేమందరం ఎంతో శాంతంగా నిబ్బరంగావున్నాము. మాబాబో, బాబాయోవస్తున్నట్టుగా వుంది మాఅందరికీ! జైలువార్డర్లూ, సచివాలయబంట్రోతులూ వెంటరాగా ముఖ్యమంత్రి పండిత గోవిందవల్లభపంత్, శ్రీవెంకటేశనారాయణ్ తివారి వచ్చారు.

వెనకఎవరైనా అధికారివస్తున్నాడంటే ఎంతో ఆడంబరంచేసేవారు వార్డర్లు అధికారులకు పదిఅడుగులదూరంలో నిలబడేవారు. ఖైదీలందర్నీ బొమ్మల్లా కదలకుండా నిలబడి వుండమనేవారు. కానీ, ఇప్పుడు అలాంటి నిబంధనఏదీలేదు. గోవిందవల్లభపంత్ కలివిడిగా వచ్చిమామధ్యలో నిలబడ్డాడు. జైలుసిబ్బందినీ, అధికారుల్ని అవతలకిపొమ్మన్నాడు. శరీరరక్షకుల్ని పక్కకుపంపి, మావీపుల్ని నిమురుతూ అందర్నీ పలకరించాడు. జైలుచరిత్రలోనే ఇది అపూర్వమైనవిషయం

పంత్‌జీ మమ్మల్ని అందర్నీచుట్టూ కూర్చోబెట్టుకున్నాడు. తాను మధ్యలో కూచున్నాడు. ఇలా చెప్పాడు. "కాంగ్రెసు పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో రాజకీయ ఖైదీలందర్నీ విడిచిపెడతానని ప్రకటించింది.

మిమ్మల్ని విడిచిపెడతాము. సందేహం లేదు. ఐతే, వెనుకటినుండి, సత్యాగ్రహులైన అహింసాత్మక ఖైదీలకూ, ఆయుధ ధారణచేసి హింసాత్మక కార్యక్రమాల్లో పాల్గొన్న విప్లవ కారులకూ మధ్య కొంత అంతరాన్ని పాటించడం రివాజుగా వస్తూన్నది. పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి ఈ పరిస్థితుల్లో మీరు ఇంక హింసను వదిలివేస్తారనీ, హింసాత్మక కార్యక్రమాల్లో పాల్గొనరనీ - నేను అనుకుంటున్నాను. మిమ్మల్ని వదిలిపెట్టడానికి నిబంధన అంటూ ఏమీ పెట్టడం జరగదు. అలాగే మీనుండి రాతకోతలూ కోరము. మీరు మాసొంత మనుషులకింద లెక్క. మాతోటి ఏదైనా ఒక మాట చెప్పుకున్నా, మీ ఆత్మాభిమానికి దెబ్బ వుండదు. మీ అభిప్రాయాలు మారాయని, మీరు ఇప్పుడు హింసను విశ్వసించడంలేదని, హింసపట్ల మీకు విశ్వాసంలేదని-మాట మాత్రంగా నాతో చెప్పండి! చాలు! నేను గార్నర్‌తో మీ విడుదల గురించి మాట్లాడేప్పుడు 'మీరు హింసాపద్ధతుల్ని విసర్జించారని' అధికారికంగా చెప్పడానికి వీలుంటుంది. మిమ్మల్నందర్ని ఒదిలి పెట్టడం మాత్రం ఖాయం!"

పంత్‌గారి మాటలు పూర్తయ్యాయి. మేమందరమూ మౌనంగా వున్నాము. ఇంతలో సన్యాల్‌దాదా తన సహజ ధోరణిలో, కూచునే ఇలా అన్నారు "మాకు ఎప్పుడూ హింసలో విశ్వాసంలేదు. మీముందు ఆ మాట ఒప్పుకుంటే మీకు కొంత ఆధారంగా వుంటుంది అనుకుంటే, అలాగే కానిద్దాము! మాకు మాత్రం అభ్యంతరం ఏముంటుంది?"

సన్యాల్‌దాదా మాటలువిని పంత్‌గారు సంతృప్తి చెందారు. ఇతర మిత్రుల ముఖాలూ సంతృప్తిగానే వున్నాయి. నాకు మాత్రం ఇది నచ్చలేదు నేను లేచి నిలబడి "రెండు మాటలు మాట్లాడతాను. అనుమతి వివ్వండి!" అని అనుమతిని అడిగి, తరువాత ఇలా చెప్పాను "మీరు కాంగ్రేసు ప్రభుత్వం మమ్మల్ని విడుదల చెయ్యాలన్న తలుపుతోనే

వుందని చెప్తూన్నారు మేమూ అలాగే అనుకుంటున్నాము. మీ ముందు
మా మనస్సులోని విషయాల్ని స్పష్టంగా చెప్పడానికీ మాకేమీ సంకోచం
లేదు కానీ, ప్రతిపనీ లేకమాటస్థితినీ, కాలాన్నిబట్టియొక్క అభిప్రాయం
మారిపోతూంటుంది. మా విడుదల గురించి మీరేమీనిబంధనఅంటూ పెట్టడం
లేదు. నిజమే! ఐతే, మా విడుదల సందర్భంగా మేము ఏంచెప్పినా, దానికీ
మా విడుదలకూ కార్యకారణ సంబంధం తప్పనిసరిగా ఏర్పడుతుంది.
ఈనాడు మేము 'పరిస్థితులు మారినయ్యి. కనుక మాకు హింసాత్మక
కార్యక్రమాల్లో విశ్వాసం పోయింది' అన్నామనుకోండి, దానికి అర్థం
ఏమిటి? ఇంతకు ముందు మాకు హింసలో నమ్మకం ఉన్నదన్న అర్థం
రావడంలేదా? నిజానికి హింసలో మాకు ఎన్నడూ నమ్మకంలేదు మేమ
వలు మమ్మల్ని విడుదల చెయ్యండని కూడా అడగడం లేదు. అలా
అడిగి మిమ్మల్ని ఇబ్బందుల పాలు చెయ్యడం, ఇరకాటంలో పడవేయ
డం మాకు ఇష్టంలేదు. మమ్మల్ని విడుదల చేయాలని మీరు మనస్ఫూ
ర్తిగా అనుకుంటేనూ, ప్రజలు కూడా మమ్మల్ని విడుదల చేయాలని
కోరితేనూ విడుదల చేయండి! లేకపోతే వద్దు! మీరు దేశానికి ఏమైనా
మేలుచేస్తే, అంతటితోనే తృప్తిపడతాము. అదే మా విడుదల అనుకుం
టాము. ఇవ్వాళ మేము విడుదల గురించి ఏం చెప్పినా అది ఒక షర్తో
లేక నిబంధనో - తప్పకుండా అవుతుంది. ఇంతవరకూ మేము మా
ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ వచ్చాము. మేము ఇలాగే ఆత్మగౌర
వాన్ని కాపాడుకోవాలని మీరూ కాంక్షిస్తారు. ఈ స్థితిలో 'ఇప్పుడు మాకు
హింసలో నమ్మకం పోయింది' అని మాచేత అనిపించాలని మీరు కోర
డమూ ఏమంత శోభస్కరంగా వుండదు! ప్రజల నిర్ణయమే మా నిర్ణ
యం అని మేము అనేక మార్లు చెప్పాము. కనుక ప్రజలు మా విడు
దలను కోరితే చేయండి. చివరకు మరొక్క విషయం కూడా చెప్తూ
న్నాను. నన్నీ బారక్కుకు నాయకుడుగా ఎన్నుకున్నారు. ఆ హోదాలో

ఇంతవరకూ మాట్లాడాను. ఐతే ఈ విషయంపై మేమందరం కూర్చుని చర్చించుకునే అవకాశం లభించలేదు. కనుక, నా అభిప్రాయం మిత్రుల్లో ఎవరికైనా నచ్చకపోతే, వారు తమ అభిప్రాయాన్ని ప్రకటించవచ్చును!" అని కూచున్నాను.

కొంతసేపటివరకూ ఎవరూ మాట్లాడలేదు. తరువాత యోగేశ్‌దాదా లేచినిలబడి "మిత్రుడు యశ్‌పాల్ చెప్పిందాన్ని నేను సమర్థిస్తూన్నాను!" అన్నాడు.

సన్యాల్‌దాదా కూడా "ఔను! అంతే!" అన్నాడు. మిగిలిన మిత్రులందరూ మౌనంగానే తమ సమర్థనను తెలియపరచారు.

ఇది జరిగాక ఒక నెల రోజులకు అనుకుంటాను రామకృష్ణఖత్రీ మమ్మల్ని కల్సుకోడానికి వచ్చాడు. మమ్మల్నందర్నీ వదిలిపెట్టడానికి ఆర్డర్ అయిందనీ, ఆర్డర్ కాపీరావడానికి రెండుమూడురోజులు పట్టవచ్చునని అన్నాడు. మరోవిషయంకూడా చెప్పాడు. "విడుదల అయ్యాక ఎటువాళ్ళు అటు పోకండి! అలహాబాద్ కాంగ్రెసు ఆఫీసు దగ్గరకు అందరూ వస్తే, విప్లవకారుల గౌరవార్థం ఊరేగింపు తీద్దాం!" అన్నాడు. అతడి ఈ ప్రస్తావన అందరికీ నచ్చింది. నేను "నున్ను మాత్రం బలవంతం చేయవద్దు. నాకు ఈ ఊరేగింపులూ-అవీ గిట్టవు. నా స్వభావానికి సరిపడవు!" అన్నాను.

రామకృష్ణఖత్రీ కోపగించుకున్నాడు. "అలా వీల్లేదు అందరూ రావల్సిందే. ఇది వ్యక్తిగతమైన విషయంకాదు. విప్లవకారులందరికీ సంబంధించింది ప్రజలకు మనం ఎవరమో, ఎందుకోసరం ప్రాణాలర్పిస్తూన్నామో తెలియదు. ఊరేగింపుతీసి, సన్యాల్‌దాదా, యోగేశ్‌దాదాలాంటి వారు ఉపన్యసిస్తే - మనం ఎవరమో ప్రజలకు తెలుస్తుంది!" అన్నాడు.

నేను ఖత్రీ వాదాన్ని అంగీకరించలేకపోయాను. "చూడు సోదరా! మనం పరిస్థితుల కారణంగా విడుదల అవుతూన్నాం. మనమేమీ పోరా

టంలో విజయాన్ని పొందలేదు; పూలమాలలు వేసుకు ఊరేగడానికి! ఇది కాంగ్రేసుకు విజయం. వాళ్ళ ఆశయం సిద్ధించింది. మన ఆశయాలు అసలు పూర్తికాలేదు కదా? మనం మన లక్ష్యసాధనకు మళ్ళీ పోరాడవల్సి వచ్చినా రావచ్చును!" అన్నాను.

యోగేష్‌దాదా నా వాదాన్ని అంగీకరించాడు. ఊరేగింపులో పాల్గొనన్నాడు. చివరకు ఖత్రీ ఇలా అన్నాడు. "విడుదల అయ్యాక అందరూ కాంగ్రేసు ఆఫీసుకురండి! మంచిచెడ్డల్ని అక్కడ ఆలోచిద్దాం!"

ఇక్కడ ఒక విషయం చెప్పడమూ అసందర్భం కాదనుకుంటు న్నాను. 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం' ఏమైంది? ఆ సంఘం యొక్క ఆశయం నెరవేరిందా? నెరవేరితే ఏ రూపంలో నెర వేరింది? నెరవేరలేదా? నెరవేరకపోతే ఆ సంఘం ప్రజల్లో పనిచేయాలి గదా? ఏరూపంలో పనిచేస్తోంది! అన్న ప్రశ్నలు పాఠకుల మనస్సుల్లో మెదలవచ్చును. దీనికి సమాధానంగా ఒక్క ఉదాహరణను ఇస్తాను.

భావాల వికాసం లేక ప్రగతి క్రాంతికి మార్గదర్శకం అవుతుంది. 'హిందూస్తాన్ ప్రజాతంత్ర సంఘం' "హిందూస్తాన్ సామ్యవాద ప్రజా తంత్ర సంఘంగా'గా పరిణతి చెందడం భావాల ప్రగతి కారణంగానే జరి గింది. అలాగే హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం" యొక్క కార్యరంగంగానీ, భావాల ప్రగతిగానీ అంతటితో ఆగిపోలేదు. ఆ సంఘం తనకంటే విస్తృతమైన, వైజ్ఞానికమైన పద్ధతిలో విప్లవాన్ని ఆవాహనం చేస్తూన్న కమ్యూనిస్టు పార్టీలో అంతర్లీనం అయింది. అండమాన్‌లో శిక్ష అనుభవిస్తూన్న 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం' యొక్క కార్యకర్తలు సామూహికంగా కమ్యూనిష్టు పార్టీలో చేరి పోయారు. ఆ మిత్రులు ఎవరూ తమ వ్యక్తిగత అహంకారానికిగానీ, ఆధిపత్యానికిగానీ ప్రాధాన్యత నివ్వలేదు. లక్ష్యసాధనకు, ఆదర్శనిర్వహ

ఐకు వ్యక్తిగతమైన మిథ్యా అభిమానికి ప్రాధాన్యత నియ్యకుండా - మిత్రులందరూ కమ్యూనిస్టుపార్టీలో చేరారు.

ఈ విషయమై నేను విడుదలఅయ్యాక జరిగిన ఒక సంఘటనను ఉదహరిస్తాను. నేను చాలారోజులు జబ్బుపడ్డాను. కొంత కోలుకున్న తరువాత 1938లో విడుదలచేశారు. విడుదలచేస్తూ, 48 గంటల్లో భువాలీ శానిటోరియంకు చేరవల్సివుంటుందనీ అన్నారు శానిటోరియం నుండి ఆగష్టులో తిరిగివచ్చాను. విడుదల అయిన మా మిత్రుల్లో చాలా మంది, పరిస్థితులకారణంగా ఏదోఒకవృత్తిలోచేరి జీవనయాపనం కానివ్వసాగారు. ఐతే యోగేశ్‌దాదా మాత్రం తన ఆదర్శాన్ని ప్రచారం చేసుకుంటూ, తనకు తోచినవిధంగా దేశంకోసం పాటుపడుతూన్నాడు. జైల్లో మాకు ఏర్పడిన పరిచయం కారణంగా నేనుకూడా తనలాగానే ప్రజావిముక్తికోసం పాటుపడతానన్న నమ్మకం యోగేశ్‌దాదాకు వుంది జైల్లో నన్ను 'ఫ్రండ్' 'ఫిలాసఫర్' 'గైడ్' అన్న పేర్లతో పిలుస్తుండేవాడు. సెప్టెంబరులో లక్నో గణేశ్‌గంజ్‌లో నున్ననన్ను కల్సుకోవానికివచ్చాడు. ఇలా అన్నాడు "మళ్ళీ ఉద్యమం ప్రారంభిద్దామనివుంది. ముందు నిన్ను కల్సుకుని మాట్లాడితే బాగుంటుందని ఉద్దేశం! ఇప్పుడు మనం ఏ చేయాలి? అంటే హిందుస్తాన్ సామ్యవాదప్రజాతంత్ర సంఘం కార్యక్రమంఏంటి?" అని అడిగాడు.

మేము 'హి. స. ప్ర. స' లక్ష్యాలగురించి మాట్లాడుకున్నాం. తరువాత ఇలాఅడిగాను. "హి. స. ప్ర స" లక్ష్యాలకూ భారతకమ్యూనిష్టుపార్టీలక్ష్యాలకూ తేడాఏమిటి?"

యోగేశ్‌దాదాకు ఏమీ తేడాకనుపించలేదు. ప్రశ్నించాడు. "ఐతే, మనం మనవ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతల్ని చంపుకుని కమ్యూనిస్టుపార్టీలో కల్సిపోదామా?"

నేనిలా అన్నాను. "కేవలమూ మనవ్యక్తిత్వంకోసమని పోటీసంస్థను ఏర్పరచడం నాకు నచ్చదు!"

ఆనాటినుండి జోగేశ్‌దాదాకు నామీద నమ్మకంపోయింది. రివల్యూషనరీ సోషలిస్టుపార్టీని స్థాపించారు. కమ్యూనిస్టుపార్టీ లక్ష్యాలకూ రివల్యూషనరీసోషలిష్టపార్టీ లక్ష్యాలకూ తేడాఏమీలేదు. జండాకూఅదే సుత్తీకొడవలి!

నా అభిమానులూ, పాఠకులూ, ఇతరులు చాలామంది నేను భారతీయకమ్యూనిస్టుపార్టీ మెంబర్నని అనుకుంటారు. నేనాపార్టీమెంబర్ని కానని చెబితే, కొందరికి ఆశ్చర్యమూ కలగవచ్చును. 1949లో కమ్యూనిస్టుల్ని ముమ్మరంగా అరెస్టుచేస్తున్నారు. నన్నూ అరెస్టుచేశారు. జైల్లో పెట్టారు. ప్రకాశవతి, అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పంత్‌ను కల్సుకుని నన్నువిడుదల చేయవల్సిందని అడిగింది. ఇలా అన్నది. "యశ్‌పాల్ కమ్యూనిస్టుపార్టీ మెంబరుకాదు. ఏ ట్రేడ్ యూనియన్‌లోనూ లేదు. ఆయనను ఎందుకు అరెస్టుచేశారు?" అని అడిగింది. పంత్‌గారు నా అరెస్టుగురించి తనకుతెలియదన్నారు. తరువాత కోపంగా "యశ్‌పాల్ మెంబరు కాకపోతేఏం? అడ్డమైనరాతలురాసిరాసి ఇతర్లనుకమ్యూనిస్టుల్ని చేస్తున్నాడుకదా?" అన్నారు. తమ పోలీసుల చర్య సమర్థించుకోడానికి, ఆ మాత్రం గట్టిగా మాట్లాడడం అవసరమే!

పంత్‌గారు నామీదవేసిన ఈవాదుకు నేను ప్రత్యేకం సమాధానం చెప్పను. ఎందుకంటే ఆయనగారే స్వయంగా చెప్పుకున్న గొప్పల్లో 'కాంగ్రేసు ప్రభుత్వంలో భావప్రకటనా, భావప్రచారస్వాతంత్ర్యం పుష్కలంగావుంది!' అనేది ఒకటి.

సరే, రామకృష్ణ ఖత్రీవచ్చి అలాచెప్పివెళ్ళి నాలుగైదు రోజులు గడిచాయి. నాకు కొంచంగా జ్వరంకాయడం ప్రారంభించింది. మూడవ రోజున దగ్గు ప్రారంభంఅయింది. కళ్ళెవెంట రక్తంపడసాగింది. నేవలా

జ్వరంలోవుండగానే మిగిలిన మిత్రుల విడుదలకు అనుమతి వచ్చేసింది. కాకోరీ కుట్రకేసులోని మిత్రులందరూ విడుదలై వెళ్ళిపోయారు. నేను మరో నలుగురైదుగురు మిత్రులం మాత్రం మిగిలిపోయాం! ఆ మిగిలిన మిత్రుల్లో - శివసింహ్, బెనర్జి, బలరాజ్, శివరాజ్-వీరిశిక్ష దాదాపుగా పూర్తికావచ్చింది. మమ్మల్నీ త్వరలోనే విడుదలచేస్తారని అనుకుంటు న్నాము. నా ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. మేజర్ భండారీ నా ఆరోగ్యాన్ని కాపాడడానికి అనేకవిధాల ప్రయత్నిస్తున్నాడు. అయినా, నోటివెంట రక్తంపడడం కట్టలేదు! రక్తం ఊపిరితిత్తుల్నుండి వస్తోందా? లేక గొంతులోని నరాలనుండి వస్తోందా? అనేది తెలియలేదు. ఒకరోజున చాలా ఎక్కువరక్తం పడింది. డాక్టర్ ఆపరేషన్ చేయాలన్న అభిప్రా యానికి వచ్చారు. జైలు అధికారులకూ, ప్రభుత్వానికీ మధ్య నాగురించి ఉత్తరప్రత్యుత్తరాలు జోరుగాసాగాయి. అప్పటి ఉత్తరప్రదేశ్ గవర్నర్ హాలెట్ అందర్నీ వదిలిపెట్టడానికి అంగీకరించాడు. కానీ, నన్ను విడుదల చేయడానికి మాత్రం అంగీకరించలేదు. హాలెట్ మరో విషయంగానూ మండిపడుతూన్నాడు. అప్పుడు నైనీ జైలునుండి విడుదలైన విప్లవకారు లందరూ పెద్దఊరేగింపుతీశారు. బహిరంగసభ జరిపారు. 'బ్రిటీష్ ఛత్ర ఛాయలో అధికారాలన్నీ బ్రిటీష్ ప్రభువులచేతుల్లోవుండగా ఏర్పడిన ఈ కాంగ్రేసుపాలన నిజమైన స్వాతంత్ర్యంకాదనీ, నిజమైన స్వాతంత్ర్యం కోసం తిరిగి పోరాడవల్సివుంటుందనీ' చెప్పారు. ఇది అతడికి మరీ మంటగావుంది.

ముఖ్యమంత్రి పంత్, జైళ్ళమంత్రి రఫీకిద్వాయి - గవర్నర్ని కల్సుకుని నా ఆరోగ్య పరిస్థితినిగురించి చెప్పి, విడుదల చేయవల్సిందని సలహా ఇచ్చారు. ఐతే, గవర్నరు నా అనారోగ్యం ఒట్టి నాటకమనీ, విడుదలకావడం కోసం వేషంవేస్తూన్నాననీ తలంచాడు. నన్ను పరీక్షించ డానికి, అలహాబాద్ సివిల్ సర్జన్ లాయూనీ, టి బి. స్పెషలిస్టు డాక్టర్

టండన్‌నీ, మిలటరీ డాక్టరు కర్నల్ బాసూనీ-పంపించాడు! ఐతే, ఈ ముగ్గురి అభిప్రాయాలూ కలవలేదు.

కొద్ది రోజుల తరువాత నోటివెంట రక్తం పడడం ఆగింది. ఆరోగ్యం కుదుటపడసాగింది. నేను హాస్పటల్లో వుండగానే మిగిలిన మిత్రులు విడుదల అయ్యారు. కాకోరీ కేసు మిత్రులు విడుదలై ఐదారునెల్లు గడిచింది. నన్ను లక్నో జిల్లా జైలుకు మార్చారు. జైలు జీవితంలో మొదటిసారి చేడీలు లేకండా ప్రయాణం చేశాను. 'బహుశ విడిచిపెట్టడానికే లక్నో జైలుకు తీసుకువెడుతూన్నారు' అనుకున్నాను.

లక్నో జైలుకు వెళ్ళిన నాలుగవరోజున రఫీకిద్వాయీ నన్ను కల్సుకోడానికి వచ్చాడు. కాంగ్రేసు ప్రభుత్వానికీ, గవర్నర్‌కూ-నా విడుదల గురించి హోరాహోరీ సంగ్రామం జరుగుతోందని చెప్పాడు. గవర్నర్ చివరి అభ్యంతరంగా ఇలా అన్నాడుట "యశ్‌పాల్ పంజాబీ, అతడు విడుదలకాగానే పంజాబు వెడతాడు. అతడు పంజాబు రావడం అక్కడి ప్రభుత్వానికి ఇష్టం వుండకపోవచ్చును!" అప్పుడు పంజాబులో కాంగ్రేసు ప్రభుత్వంలేదు. బ్రిటీష్ భక్తుడైన సర్ సికిందర్ హయాత్ ప్రభుత్వంవుంది. నాలాంటి వ్యక్తిని విడుదల చేయవల్సిందని ఆ ప్రభుత్వం ఎందుకు కోరుతుంది? కనుకనే గవర్నర్ ఈ మొండికాలు అడ్డం పెట్టాడు. నేను విడుదల అవుతానన్న ఆశ అడుగంట సాగింది.

కిద్వాయీ "విడుదల అయ్యాక పంజాబు వెళ్ళనని నువ్వు మాట ఇస్తే, గవర్నర్ అభ్యంతరాన్ని కాదనవచ్చును!" అన్నాడు.

"విడుదల కావడంకోసం ఓ షరతురూపంలో ఆ మాత్రం మాట ఇవ్వడమూ నాకు ఇష్టంలేదు!" అన్నాను.

రఫీకిద్వాయీ చాలా గంభీరమైన వ్యక్తి, చాలా సానుభూతిగా వుండేవాడు. నేను పై విధంగా అనేసరికి కిద్వాయీ విసుకుదలగా ఇలా అన్నాడు. "నిన్ను రాసి ఇవ్వమనడంలేదు. నోటిమాట మాత్రంగానైనా

UNIVERSITY OF HYDERABAD
INDIRA GANDHI MEMORIAL LIBRARY
T HYDERABAD (A. P.)
Cl. No 954.03 Acc. No 7479
Y26S DATE DUE
DURATION OF LOAN - Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

# UNIVERSITY OF HYDERABAD

## INDIRA GANDHI MEMORIAL LIBRARY

### HYDERABAD ( A. P. )

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**